# 1 బాల్యదశ

## 1.0 పరిచయం: (Introduction)

వ్యక్తి జీవితంలో బాల్యదశ చాలా కీలకమైన దశ. ఈ దశలో వారు పొందే అనుభవాలు వారి మూర్తిమత్వ వికాసంపై ప్రభావం చూపుతాయి. సిగ్మండ్‌ఫ్రాయిడ్, ఎరిక్‌సన్ వంటి మనోవైజ్ఞానికవేత్తలు వ్యక్తి జీవితంలో బాల్యదశ అనుభవాలు వ్యక్తిని ఏ రకంగా తీర్చిదిద్దుతాయో చక్కగా విశదీకరించారు. అందుకే బాల్యం వ్యక్తి జీవితానికి ఒక పునాదిగా చెప్పవచ్చు. కనుక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు పిల్లల బాల్యదశ నిర్మితి, వారి పూర్వ అభ్యసన అనుభవాలపై సరైన అవగాహన ఉండాలి. బాల్యదశ అంటే ఏమిటి? అందరి పిల్లల బాల్యం ఒకేలా వుంటుందా? వేర్వేరుగా వుంటే దానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? బాల్యదశను ప్రభావితం చేసే అంశాలేమిటి? పిల్లల పెంపక విధానాలు పిల్లల బాల్యదశ నిర్మితిపై ఏ రకమైన ప్రభావం చూపుతాయి మొదలగు విషయాలు ఉపాధ్యాయులకు కచ్చితంగా తెలిసి వుండాలి. వాటితోపాటు బాలలను ఏ రకంగా అధ్యయనం చేయాలో తెలుసుకోగలిగి వుండాలి.

ఉపాధ్యాయులు తాము పై అంశాలకు చెందిన జ్ఞానాన్ని సముపార్జించుకుని తరగతి గదికి అన్వయించినపుడు, తల్లిదండ్రుల సమావేశాల్లో ప్రతి స్పందించినప్పుడు వారికి మంచి గుర్తింపు రావటమే కాకుండా మంచి ఉపాధ్యాయులుగా రాణించగల్గుతారు.

## 1.1 లక్ష్యాలు: (Objectives)

ఈ యూనిట్ అధ్యయనం చేసిన తరువాత, ఛాత్రోపాధ్యాయులు

- బాల్యదశ భావనను అవగాహన చేసుకుంటారు.
- బాల్యదశలో సామ్యాలు, వైవిధ్యాలు అవగాహన చేసుకుంటారు.
- భారతీయ నేపధ్యంలో బహుల బాల్య దశల నిర్మితిపై అవగాహన పొందుతారు.
- బాల్యదశ నిర్మితిని ప్రభావితం చేసే అంశాల గూర్చి తెలుసుకుంటారు..
- సాంఘికీకరణలో కుటుంబం, పాఠశాలల యొక్క పాత్రను అవగాహన చేసుకుంటారు.
- పిల్లల పెంపక విధానాల గూర్చి అవగాహన పొందుతారు.
- పిల్లలను అధ్యయనం చేసే వివిధ పద్ధతులకు, ఉపగమాలకు చెందిన అంశాలను అవగాహన చేసుకుంటారు.

## 1.2 బాల్యదశ నిర్మాణం: (Constructs of childhood)

బాల్యదశ అనేది వ్యక్తి జీవితంలో చాలా ప్రధానమైన దశ. ఈ మధ్య మనం తరచుగా 'పిల్లలు బాల్యాన్ని కోల్పోతున్నారు' అనే మాటలు వింటున్నాం. అసలు బాల్యాన్ని కోల్పోవటం అంటే ఏమిటి? ఆ వయస్సులో పొందాల్సిన పోషణ, సంరక్షణ, ఆటలు, పాటలు మొదలైనవి కోల్పోవటం అని అంటాం. అలా ఎందుకు జరుగుతుంది? అలా కాకుండా ఏం చెయ్యాలి? అనేవి చాలా తీవ్రంగా ఆలోచించాల్సిన అంశాలు.

అయితే బాలలంటే, బాల్యం అంటే,బాల్యదశ అంటే ఏమిటి? అని ప్రశ్నించినపుడు మనకు అనేక రకాల నిర్వచనాలు కనపడుతుంటాయి. మనో వైజ్ఞానిక వేత్తలు, విద్యావేత్తలు, సాంఘికవేత్తలు, మానవ శాస్త్రజ్ఞులు మొదలైన వారి అభిప్రాయాలను గురించి తెలుసుకుందాం.

17వ,18వ శతాబ్దాలలోని బాల్యం అనే భావన ఏర్పడిందని తెలుస్తుంది. ముఖ్యంగా జాన్‌లాక్ (John Locke) – విద్యా తాత్విక రచనలతో బాల్యం గురించిన ప్రస్తావన ప్రారంభమైనదని చెప్పవచ్చు. ఈ రకం ఆలోచనలు – రచనలకు బాలలను పరిపూర్ణత సాధించని వయోజనులుగా గుర్తించేవారు.

వికాసాత్మపరంగాను,జైవికపరంగాను బాల్యంను శైశవం నుండి వయోజనదశకు మధ్య ఉన్న కాలాన్ని గుర్తించారు.

మన భారతదేశంలో న్యాయబద్ధంగా 14సం॥ల వయస్సు వరకు ఉన్న పిల్లలను బాలలని, 15 – 18 సం॥ల వయసున్న వారిని మైనర్లుగాను గుర్తించడం జరుగుతుంది.

ఫిలిప్ ఏరీస్ అనే చరిత్రకారుని రచన "Centuries of Childhood" లో బాల్యం అనేది ఒక సహజసిద్ధం కాదని సమాజం ఏర్పరచిన భావంగా గుర్తించారు.

16 శతాబ్దం అంతంలో బాల్యం గురించిన భావనలు యూరప్‌లో పెయింటింగ్, పాఠశాల రికార్డులలో, శిలాశాసనాలలో, కొందరి రచయితల రచనలలో కనిపించినది. ఫిలిప్ ఏరీస్ పేర్కొనాడు.

ప్రజలు బాలలను ఒక ప్రత్యేకమైనవారని, అమాయకులని వారికి భద్రత అవసరమని శిక్షణఅవసరమని గుర్తించారు.

జాన్‌లాక్ (John Locke) తత్త్వవేత్త తన రచనలలో బాల్యంలోని పిల్లల మనసు ఏమిరాయని నల్లబల్ల ట్యాబ్యులా రసా(Tabula Rasa) లాంటిది. – అని పేర్కొన్నాడు. అలా ఏమిరాయబడని బాలల మనస్సులోకి సరియైన భావనలను, అభిప్రాయాలను నాటుకొనేటట్లు లేక ఏర్పడేటట్లు చేయడం తల్లిదండ్రుల,పెద్దల బాధ్యత అని సూచించాడు.

ఇంగ్లాండులో ప్రారంభమైన పారిశ్రామికీకరణతో ఆదర్శవంతమైన, పవిత్రమైన బాల్యదశకు లేక బాల్యానికి – పిల్లలపెంపకంలో జరగవలసిన వాస్తవానికి మధ్య అగాతం ఏర్పడి, విపరీతదోరణలు కన్పించడం ప్రాంభమైంది. పిల్లలు లేక బాలలు ఫ్యాక్టరీలలో, గనులలో కార్మికులుగా చేర్చుకొని అపాయకరమైన పనులలో ఎక్కువ గంటలు పనిచేయించుకొని తక్కువ కూలీలు ఇవ్వడంతో బాల్యము తనపవిత్రతను కోల్పోవడం ప్రారంభమైంది. కాని, 19వ శతాబ్దం అంతానికి బాలలు – బాల్యం పట్ల నూతనవైఖరి కల్పించింది. బాలకార్మిక వ్యవస్థలపై, బాలల దోపిడి లేక పీఢనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభమైనాయి.

బాల్యం యొక్క పవిత్రతను, అమాయకత్వాన్ని కాపాడడం, పిల్లల్ని పెంచడం కుటుంబంలో కుటుంబంలోని తల్లిదండ్రుల బాధ్యతగా పేర్కొంటూ ఉద్యమాలు ప్రారంభమైనయి.ఆ సమయంలోనే బాలల కొరకు చిత్రాలతో కూడిన పుస్తకాలు,ఆటవస్తువులు,బొమ్మల తయారీకి కావలసిన ఫ్యాక్టరీలు వచ్చాయి. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించబడి బాలల సంక్షేమం కొరకు ప్రభుత్వం నిర్భంద విద్యను ప్రారంభించింది. బాల్యం ఒక వినోదభరితమైన సంతోషకరమైన జీవితకాలంగా గుర్తించబండింది. 20వ శతాబ్దం ప్రారంభానికి బాల్యంపట్ల నవీన ధృక్పథాలు ఏర్పడడం మొదలైనది.

బాల్యం అంటే బాధలు లేని, కష్టమైన పనులు లేని, ఎలాంటి భయాలు లేని ఆనందదాయక కాలంగా బాల్యం ఆటలతో పాటలతో కూడిన పౌరభాధ్యతల అభ్యసనానికి, సాంఘికీకరణానికి అనువైన వయస్సుగా గుర్తించారు.

బాలుడు/బాలిక అని ఎవరిని అంటారు?

బాల్యదశ అంటే ఎలిజిబెత్ హర్లాక్ ప్రకారం 3 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల వరకు ఉండే దశ.

* 1989లో U.N.O బాలల హక్కులను ప్రసాదించినపుడు 18 సం॥ల వయస్సు లోపు ఉన్న వారిని బాలలుగా గుర్తించింది. భారతదేశంలో 14సం॥లు వయస్సులో ఉన్నవారిని బాలలుగా 15 నుండి 18 సం॥ల వయస్సు ఉన్నవారిని మైనర్లుగా గుర్తించింది.

'Childhood' అంటే. బాల్యం అని, పసితనం అని, చిన్నతనం అని నిఘంటువులు పేర్కొంటున్నాయి. బాల్యదశ కాలాన్ని (14సం॥ వరకు) బాల్యంగా మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు గుర్తించారు. అంటే బాల్యంలో పిల్లలు కొంటెగా,తుంటరిగా, అనాలోచితంగా,సాధుస్వభావంతో అమాయకంగా ఉండే మానసిక స్థితినే బాల్యంగా పేర్కొన్నారు.

కుప్పుస్వామి (1974) బాల్యదశను "శైశవదశ నుండి యవ్వనారంభదశ వరకు గల కాలంగా" పేర్కొన్నారు. అనేక మంది మనో విజ్ఞానవేత్తలు "3 నుండి 12 సంవత్సరాల వయస్సు వరకు గల కాలాన్ని" బాల్యదశగా పేర్కొన్నారు. దీనిలో 3-6 సంవత్సరాల వయస్సును పూర్వ బాల్యదశగా, 7-12 సంవత్సరాల వయస్సును ఉత్తర బాల్యదశగా పేర్కొన్నారు.

మెక్‌మిలన్ విద్యార్థి నిఘంటువు (1981) ప్రకారం "బాల్యదశ అనగా పుట్టినప్పటి నుండి కౌమార దశ వరకు గల కాలము."

ఫిలిప్ ఏరిస్ (1962) బాల్యదశ గూర్చి చెప్తూ, ప్రస్తుతం మనం శైశవదశ, కౌమార దశల మధ్య గల కాలాన్ని బాల్యదశగా పేర్కొంటున్నారు. కానీ బాల్య దశ భావనలో ఎన్నో చారిత్రక అంశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. భారతీయ జనాభా గణనలో 14 సం.ల లోపు వయస్సు గలవారిని బాలలుగా పేర్కొంటున్నారు. అయితే ది జువనైల్ జస్టీస్ (కేర్ అండ్ ప్రొటక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2000 ప్రకారం 18 సం॥ల లోపు వయస్సు గల వారిని బాలలుగా పేర్కొన్నారు.

ఇలా 'బాల్యదశ'ను గూర్చి అనేకమంది రకరకాలుగా పేర్కొన్నారు.

### 1.2.1 బాల్యదశకు సంబంధించి సామ్యాలు, వైవిధ్యాలు:(Commonalities and Diversity)

అందరు పిల్లలూ ఒకేలా ఉంటారా?

అందరి పిల్లల బాల్యం ఒకేలా ఉంటుందా?

ఇలా ప్రశ్నించినప్పుడు అందరు పిల్లలు ఒకేలా ఉండకపోయినా కొన్ని అంశాలలో పోలికలుంటాయి, మరికొన్ని అంశాలలో బేధాలుంటాయి అనే సమాధానమే ఎక్కువగా వినపడుతుంది.

కనీస అవసరాలు, పుట్టుకతో వచ్చే సహజాతాలు, చిన్నతనంలో అవసరాలు తీర్చుకోవడానికి ఇతరులపై ఆధారపడటం, పరిపక్వత చెందడం, శరీర నిర్మాణం మొ॥న అంశాలలో దాదాపు అందరు పిల్లలు సారూప్యాన్ని కలిగి వుంటారు. అయితే ఇది పొందటంలో కొన్ని వైవిద్యాలు కనపడతాయి. ఇప్పుడు కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం.

రాము అందరితో సరదాగా మాట్లాడుతుంటాడు, రవి అస్సలు ఎవరితో మాట్లాడడు, రాకేష్ ప్రతి విషయానికి అరుస్తుంటాడు, రంజిత్ ఎప్పుడూ ఏడుస్తుంటాడు .... ఇలా మనం పిల్లల్ని గమనిస్తే వారు రకరకాల ప్రవర్తనలు ప్రదర్శించడం గమనిస్తాము.

ఎందుకు ఈ తేడాలుంటాయి? అని ప్రశ్నించుకుంటే పిల్లల బాల్యంలో పొందిన వివిధ అనుభవాల ప్రభావం అనేది వారి ప్రవర్తన (మూర్తిమత్వం)పై ప్రభావం చూపుతుందనే అంశం అవగాహన అవుతుంది. అంతేకాక వారి అనువంశిక కారకాలు కూడా కొంతవరకు కారణమవుతాయి.

కొందరు పిల్లల్ని అతి గారాభంగా పెంచితే, మరికొందరు నియమాలు, కట్టుబాట్ల పేరుతో కఠినంగా పెంచుతారు. మరికొందరు తమ పిల్లల్ని అస్సలు పట్టించుకోరు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పెరిగిన పిల్లలకూ, వ్యష్ఠి కుటుంబ వ్యవస్థలో పెరిగిన పిల్లలకు గూడా తేడాలు కనపడుతుంటాయి. శ్రీధర్, వాళ్ళ అమ్మ నాన్నలకు ఒకే సంతానం. అమ్మనాన్నలు ఇద్దరూ ఉద్యోగానికి వెళ్తుండటంతో శ్రీధర్‌కు ఏదో ఆప్యాయతను, కోల్పోయానన్న బాధతో ఉంటున్నాడు. శ్రీధర్ ఎదురింటిలో వారికి ఇద్దరు పిల్లలు. వాళ్ళిద్దరూ ఆడుకుంటుంటే శ్రీధర్‌కు, నాకు ఓ సోదరుడో, సోదరో ఉంటే బాగుండుననిపిస్తుంది.

రమేష్‌ది మరో కథ. అతనిని చిన్నప్పుడే తల్లిదండ్రులు వదిలివేయటంతో అనాధగా పెరుగుతూ, వీధి బాలలతో స్నేహం చేస్తూ బాల్యాన్ని గడిపాడు.

ఇలా బ్యాలంలో పిల్లలు పొందే ప్రతి అనుభవం పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా పిల్లల బాల్యదశ నిర్మితి అనేది వారు పొందిన అనుభవాలు, పెంపక విధానలు మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటాయి.

'బాల్యదశ' సారూప్యాలు అనేవి వేర్వేరు బాల్యానుభవాలు ఉన్నా బాలలలోగల పోలికలను తెల్పుతుంది.

అదేవిధముగా వైవిద్యాలు అనేవి బాలలు పొందిన అనుభవాలు, ఇతర అంశాలు ప్రభావం వివిధ బాలల మధ్య గల బేధాలను తెల్పుతుంది.

బాల్యదశ అనుభవాలు సమాజానికి సమాజానికి మధ్య, సంస్కృతికి సంస్కృతికి మధ్య, ఒక ప్రదేశానికి మరో ప్రదేశానికి మధ్య వేర్వేరుగా ఉంటాయి.

బాలలు అభివృద్ధి చెందిన దేశాలలో పొందే అనుభవాలకు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పొందే అనుభవాలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. మనకు పేదరికంలో ఉన్న కుటుంబాలు ఉన్నట్లే అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఉంటారు. అదేవిధముగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సంపన్న కుటుంబాలు ఉంటాయి.

కనుక అభివృద్ధి చెందిన దేశాల్లోనూ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోను బాల్యదశ అనుభవాలు విభిన్నంగా ఉంటాయి.

బాల్యదశలో పిల్లలు పొందే ఆహారం, ఆటలు, పాటలలో అనుసరించే నియమాలు, కుటుంబ వ్యవహారాల్లో పిల్లలు పాల్గొనే విధానం మొదలైనవి బాల్యదశలో వైవిధ్యాలకు కారణమవుతాయి.

సాయి వాళ్ళ నాన్నగారు ఇంజనీర్. వాళ్ళింట్లో ఎప్పుడూ పనివాళ్ళు ఉండి ఇంటి పనుల నుండి బజారులో సామాన్లు, కూరగాయలు కొనటం వరకు పనివారే చేస్తారు. సాయికి వాటి గురించి నేర్చుకోవలసిన అవసరం లేకపోయింది. దాంతో ఈ పనులకు ఇతరులపై ఆధారపడటం అలవాటైంది.

అదే కిషోర్ తల్లిదండ్రులు ప్రతి పనిలో కిషోర్‌ని భాగస్వామ్యం చేయటం వలన కిషోర్ సామాజిక వ్యవహారాల్లో ప్రవర్తించే తీరు, సర్దుబాటు సాయి కన్నా భిన్నంగా ఉంది.

అలాగే ఆహారపు అలవాట్లు కూడా పిల్లల్లో భిన్నంగా ఉంటాయి. ఉద్వేగాలు ప్రదర్శించడంలో, అభిరుచులు, వైఖరులు, సాంఘిక అంశాలలో పాల్గొనే తీరు, నైతిక విలువలు మొదలైన అంశాలలో కూడా పిల్లలు వైవిధ్యాన్ని కలిగి ఉంటారు. అభ్యసన శైలులలో, లక్షణాంశాలలో, జీవన నైపుణ్యాలలో కూడా పిల్లలు విభిన్నంగా ఉంటారు.


ఇలా బాలలలో సారూప్యాలతో పాటు అనేక వైవిధ్యాలు కనిపిస్తాయి.

## 1.2.2 భారతీయ నేపథ్యంలో బహుళ బాల్యదశల నిర్మితి (Constructs of Multiple Childhoods in Indian Context)

బాల్యం ఒక అద్భుతమైన పాఠశాల. బాల్యదశలో పిల్లలు పొందే అనుభవాలు వారి మూర్తిమత్వ నిర్మాణానికి ప్రాథమిక పునాదులు వేస్తాయి.

బాల్యదశ అనేది పిల్లలు ఆటలతో, పాటలతో గడుపుతూ కుటుంబ సభ్యుల నుండి, ప్రేమ, ప్రోత్సాహం పొందుతూ, పెద్దల సంరక్షణలో బలంగా, నమ్మకంగా ఆత్మస్థైర్యంతో పెరిగే సమయం. పిల్లలకు ఇది చాలా విలువైన సమయం. పిల్లలు భయానికి దూరంగా హింస నుండి రక్షణ పొందుతూ, వేధింపులకు, దోపిడీకి గురికాకుండా జీవించాల్సిన సమయము. బాల్యదశలో పిల్లలు పొందే ఆదరణలోని గుణాత్మకత వారిలో భవిష్యత్తు జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది.

అయితే అందరు పిల్లలూ అలా పెరుగుతున్నారా? అందరి బాల్యం అలాగే ఉంటుందా? అంటే మనం కాదనే చెప్పాలి.



పైన చూపిన చిత్రంలో పేర్కొన్న అనేక అంశాలు మన భారతీయ నేపథ్యంలో బాలలలో బహుళ బాల్యదశలు (Multiple childhoods) ఏర్పడటానికి కారణమవుతాయి.

### 1.2.3 ప్రపంచీకరణ నేపథ్యంలో బాల్యదశ నిర్మితులు(Constructs of Childhood in Context Globalisation)

శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి ప్రపంచ దేశాల మధ్య దూరాన్ని తగ్గించింది.  సామాజిక మాద్యమాలు ప్రపంచంలో వ్యక్తుల మధ్య సంబంధాలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి.

చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరిలో పై అంశాలు తమ కట్టుబాట్లు, అచార వ్యవహారాలు, వైఖరులు, అభిరుచులు మొదలైన అంశాలను ప్రభావితం చేస్తాయి.

ఆర్థిక, ఆర్థికేతర కార్యకలాపాల పరిధిని విదేశాలకు గూడా విస్తరించే విధానమే ప్రపంచీకరణ.

ప్రపంచం నేడు విశ్వ గ్రామంలా మారిపోయింది.  శాస్త్ర సాంకేతిక అభివృద్ధి అవధులు లేని విజ్ఞానం, శ్రమ శక్తి అంతర్జాతీయ సరిహద్దులు దాటి  విస్తరించటానికి అవకాశం కల్గించి ప్రపంచీకరణకు దారితీసింది.


ప్రపంచీకరణ వలన జరిగిన మార్పులు పిల్లల పెంపక విధానాల్లో మార్పులు తీసుకు వచ్చింది.  ప్రసార సమాచార సాంకేతిక విజ్ఞానం వలన బాలలు చలన చిత్రాలు, టి.విలో ప్రసారాలు, ఇంటర్‌నెట్ అంశాల ద్వారా అనేక విషయలు నేర్చుకుంటున్నారు.  ఇది వారి బాల్య దశ నిర్మాణంకు ఎంతో దోహదపడుతుంది.  దీని వలన బాలలలో సానుకూల ఆలోచలను, విజ్ఞత, విషయ జ్ఞానం పెంపొందుతూ సరైన ప్రవర్తనా నిర్మాణానికి దోహదం చేస్తున్నాయి. పిల్లల తమ వయస్సుకు మించిన అంశాల జ్ఞానం, నైపుణ్యం పొందుతున్నారు.

అదే సమయములో ఈ మాధ్యమాలను సరైన దృక్పథంలో వినియోగించకపోవటం, బాలలను ఈ అంశాలలో పట్టించుకోకపోవటం మొదలైనది బాలలను చెడు ప్రవర్తన వైపు ప్రోత్సహిస్తున్నాయి.

కనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీరు ఈ మాధ్యమాల ద్వారా లబ్ది పొందే విధముగా కృత్యాలను ఇచ్చి సరైన మార్గదర్శకత్వం కల్పించాలి.

### 1.2.4 బాల కార్మికులు: (Child Labour)

బాల కార్మిక వ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా మనకు కనపడుతుంది.  అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇదిఎక్కువకగా వుంది.  మన రాజ్యాంగం ప్రకారము 6-14 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలి.  కానీ తల్లిదండ్రుల అవిద్య,  పేదరికం మొదలైన అంశాల వలన కొందరు తల్లిదండ్రులు వారి పిల్లలను



ఆర్థిక కోణంలో చూడటం జరుగుతుంది. ఫలితంగా ఆటపాటలతో, ఆనందంగా విద్యార్జన చేయాల్సిన పిల్లలు కార్మికులుగా మారుతున్నారు.

బడి బయట ఉన్న పిల్లలందరూ బాల కార్మికులే. ఎందుకంటే బడికి రాని పిల్లలు ఏదో ఒక పనిలో (కనీసం ఇంట్లో తమకన్నా చిన్న పిల్లలను జాగ్రత్తగా చూడటం) ఉంటారు.

సాధారణంగా బాలలు పాక్షికంగా గానీ, పూర్తిగా కానీ ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటే వారిని బాల కార్మికులుగా పేర్కొంటాం.

"పిల్లలను వారి బాల్యాన్ని, వారి సామర్థ్యాన్ని మరియు గౌరవాన్ని పోగొట్టి వారి భౌతిక మరియు మానసిక వికాసానికి హాని కల్గించే పనులలో నియమించినట్లయితే వారే బాల కార్మికులు" అని International Labour Organization(ILO) నిర్వహించించినది.

భారతదేశ జనాభా గణన (2001), 17 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు పరిహారం/ వేతనం / లాభం పొంది లేక పొందకుండా ఆర్థిక ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొన్న వారిని బాల కార్మికులుగా నిర్వచించినది.

'ది మైనింగ్ ఏక్ట్ ఆఫ్ 1952'లో 18 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు గల పిల్లలు గనుల్లో పనిచేయటాన్ని నిషేదించింది.

యునిసెఫ్ గణాంకాల ప్రకారం భారతదేశంలో సుమారు 28 మిలియన్ పిల్లలు (5–14 సంవత్సరాల వయస్సుగలవారు) పనులలో నిమగ్నమైయున్నారు.

బాలలు కార్మిక పనులలో నిమగ్నమై ఉండటం వలన వారు తమ విలువైన బాల్యాన్ని కోల్పోవటమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక వికాసాలలో క్లిష్టతలను ఎదుర్కొంటూ హింస, అణిచివేతకు గురౌతున్నారు.

విద్య అనేది పిల్లల వికాసంతోపాటు, వారి హక్కుల్ని వారు పొందటానికి దోహదం చేస్తుంది. ''బాల్య దశ నిర్మాణం" సరిగ్గా ఉండాలంటే పిల్లలందరూ పాఠశాలలో ఉండాలి. కనుక ఉపాధ్యాయుల ఈ అంశాలను సమాజంలో వివరించి బాల కార్మి వ్యవస్థ నిర్మూలనకు తోడ్పాడాలి.

### 1.2.5 బాలల పీడనం లేక దుర్వినియోగం (Child Abuse):

ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాలలో, విద్యా రంగంలో ఎంతో పురోగాభివృద్ధి సాధిస్తున్నా బాలల పీడనం లేక దుర్వినియోగం (చైల్డ్ అబ్యూజ్) అనేది మనకు అనేక చోట్ల కనపడుతుది.

తల్లిదండ్రులుగానీ, సంరక్షకులుగానీ, వారి చర్యల ద్వారా లేదా కావలసినవి చేయటంలో లోపం ద్వారా, బాలలకు గాయం, మరణం, ఉద్వేగహాని లేదా తీవ్రమైన హాని కలిగే ప్రమాదం ఉంటే దాన్ని బాలల పీడనంగా చెప్పవచ్చు.

పిల్లలను నిర్లక్ష్యం చేయటం, భౌతికంగా, మానసికంగా హింసించటం, లైంగికంగా హింసించటం, ఉద్వేగపరంగా హింసించటం, దోపిడికి గురిచేయటం మొదలైనవి బాలల పీడన క్రింద పరిగణించబడతాయి. పిల్లలను నిర్లక్ష్యం చేయడం అనేది

- వారిని భౌతికంగా నిర్లక్ష్యం చేయడం, సరైన పర్యవేక్షణ చేయకపోవడం
- ఉద్వేగపరంగా నిర్లక్ష్యం చూపడం
- వైద్యపరంగా నిర్లక్ష్యం చేయడం
- విద్యాపరంగా నిర్లక్ష్యం చూపడం అనే అంశాలకు సంబంధించినది.

ఈ అంశాలన్ని బాలల శారీరక, మానసిక విధానంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఉద్వేగపరమైన పీడనం అనేది పిల్లల మానసిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

పిల్లలను లైంగికంగా ఉపయోగించుకోవటం, ఈ అంశంపై ఒత్తిడి చేయటం, నీలి చిత్రాలలో చూపటం మొదలైనవి లైంగిక హింసలుగా చెప్పవచ్చు.

పిల్లలను భౌతికంగా, మానసికంగా నిర్లక్ష్యం చేయటం, వారిని భౌతికంగా శిక్షించటం మనం చాలా చోట్ల గమనిస్తాం.

కొన్ని సందర్భాలలో ఇంటి వద్ద పిల్లల విషయంలో ఘర్షణలు జరుగుతుంటాయి. (మగ పిల్లవాడు, ఆడపిల్ల, ఇష్టంలేని సంతానం మొ॥న అంశాలపైన)

చాలా చోట్ల చెడు అలవాట్లకు బానిసలైన తల్లిదండ్రులు వారి పిల్లల్ని హింసించటం గమనిస్తాం.

మరో విషయం ఏమిటంటే కొన్ని కుటుంబాలలో ఒక పిల్లవాడు తీవ్రమైన పీడనాన్ని ఎదుర్కొంటుంటే, మరో పిల్లవాడిని అదే కుటుంబ సభ్యులు ప్రేమగా చూడటం కూడా గమనించవచ్చు.

భారత ప్రభుత్వం 2012లో ది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ (POCSO) ప్రవేశ పెట్టింది. అలాగే చైల్డ్ లైన్ పేరుతో 1098 అనే టోల్ ఫ్రీ నెంబరు ద్వారా వారి రక్షణ చర్యలు చేపట్టింది. ఇలా బాలలను ఒత్తిడి నుంచి రక్షించటానికి ప్రపంచ దేశాలు అనేక చట్టాలు చేసాయి. అయితే చట్టంకన్నా తల్లిదండ్రులు, ఇతరుల వైఖిరిలో మార్పుకు చర్యలు చేపట్టినట్లయితే మంచి ఫలితాలు వస్తాయి.

తల్లిదండ్రులకు బాలల హక్కులు, పిల్లల పెంపకంపై శిక్షణ నివ్వటం, పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఏదైన మార్గదర్శకత్వం, మంత్రణం కల్పించటం, ప్రసారమాధ్యమాలలో ప్రచారం, లఘుచిత్రాల ప్రదర్శన మొదలైనవి బాలలను ఒత్తిడి నుంచి రక్షించటానికి తోడ్పడతాయి.

### 1.2.6 పేదరికం నేపథ్యం – బాల్య దశ నిర్మాణం (Childhood in the context of poverty):

పేదరికం అనేది బాల్యదశపై ప్రభావం చూపుతుంది. పేదరికం వలన పిల్లలు తమ శారీరక అవసరాలైన నీరు, నిద్ర, ఆహారం, తగినంత విశ్రాంతి మొదలైనవి పొందడంలో వెనుకబడతారు. అదేవిధంగా సాంఘిక, మానసిక అవసరాలైన దుస్తులు, నివాసం, గుర్తింపు మొదలైన అంశాలు పొందటంలో వెనుకబడి ఉంటారు.

ఫలితంగా ఎరిక్‌సన్ పేర్కొన్న “ సాంఘిక క్లిష్ట పరిస్థితులు” ఎదుర్కొనటంలో ఇబ్బంది పడటం వలన వారిలో అపనమ్మకం, సందేహం, చొరవలేకపోవుటం, పాత్ర సందిగ్ధం వంటి ప్రవర్తనలను కనబరిచే అవకాశం ఎక్కువ.

పిల్లలకు సంక్రమించిన జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, సమాచారాన్ని పొందే హక్కు మొదలైనవి పొందడంలో వెనుకబడతారు.

పేదరికంలో ఉన్న వారి పిల్లలకు సరైన పౌష్టికాహారం లభించదు. అంతేకాక విద్యా,వైద్యపరంగా సరైన అవకాశాలు పొందక వెనుకబడటానికి అవకాశం ఉంటుంది. ఇవి పిల్లల సామర్థ్యాల వ్యక్తీకరణకు ఆటంకం కలిగిస్తాయి. వారి తల్లిదండ్రులలో ఎక్కువ మందికి ఆత్మవిశ్వాసం లోపించటం, అర్థరహిత భయాలు, మూఢ నమ్మకాలు, అవిద్య ఉండటం అనేవి పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపుతాయి.

పేదరికంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లల సమగ్ర అభివృదిపై ఆశలు ఉన్నా, వారి పేదరికం ఒక అడ్డంకిగా ఉంది.

పేదరికం పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ, నైతిక, సృజనాత్మక వికాసాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. కనుక ఉపాధ్యాయులు ఇటువంటి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి వికాసానికి తోడ్పడాలి.

## 1.3 కుటుంబం – సామాజికీకరణ (Home - Socilalisation):

సామాజికీకరణ అనేది పిల్లల సమాజంలో సభ్యులుగా పాల్గొనటానికి కావలసిన సామర్థ్యాలను కలుగజేసే ప్రక్రియగా చెప్పవచ్చు.

సమాజంలోని సామూహిక ప్రమాణాలకు,సాంప్రదాయాలకు, ఆచారాలకు, విలువలకులోనై సఖ్యత, పరస్పర సహకార స్వభావాలు పెంచుకోవడమే సామాజికీకరణ అని ఫ్రీమన్ – షావెల్ అభిప్రాయపడ్డారు.

పిల్లలకు తమ జీవితంలో తటస్థపడే మొదటి వ్యక్తులు తల్లిదండ్రులు. వారు ఎదుర్కొనే లేదా పాల్గొనే మొదటి సాంఘిక సంస్థ కుటుంబం.

పిల్లల వివిధ వికాసాలకు కుటుంబం ప్రాముఖ్యత వహిస్తుందని మనో విజ్ఞాన వేత్తలు, సాంఘిక వేత్తలు అభిప్రాయం.

కుటుంబం మూడు ప్రముఖ కార్యాలను నిర్వహిస్తుందని విట్‌మర్ హెచ్ మరియు కోటిన్‌స్కీ ఆర్ (1972) పేర్కొన్నారు. అవి:

1. పిల్లలకు తగిన వాత్సల్యాన్ని ఇవ్వటం.
2. శైశవం నుండి వయోజన దశ వరకు వారిలో సాంఘిక విలువలు పెంపొందించడం.
3. సమాజంతో తాదాత్మ్యాన్ని (Empathy) కల్పించటం.

సహజమైన, ప్రేమ పూరితమైన వాత్సల్యం శిశువుకు కుటుంబలోనే మొట్టమొదట లభిస్తుంది. కుటుంబం పిల్లలకు వివిధ అభ్యసనాలు కల్పిస్తుంది. శిశువు ప్రవర్తనలను పరిశీలించి వాటిని ప్రోత్సహించటం, నిరోధించటం వంటి చర్యల ద్వారా శిశువును కుటుంబం భవిష్యత్ సమాజంలో జీవించడానికి అనువుగా తీర్చిదిద్దుతుంది.

అంతేకాకుండా శిశువు తాను ఫలానా కుటుంబానికి చెందిన వ్యక్తిగా గుర్తుంచుకుని ఆ కుటుంబంలో తదాత్మ్యం పొందుతాడు.

### 1.3.1 సామాజికీకరణలో సాంఘిక, ఆర్థిక మరియు సాంస్కృతిక బేధాలు (Scocial, Econamic and cultural differences):

సామాజికీకరణపై తల్లిదండ్రుల సాంఘిక ఆర్థిక అంశాలు, సాంస్కృతిక అంశాలు మొదలైనవి ప్రభావితం చేస్తాయి.

బాలల సాంఘిక పరిధి మొదట వారి తల్లిదండ్రుల కుటుంబ నేపద్యంతో ప్రారంభమై వారు అభివృద్ధి చెందే కొలది సాంఘిక పరిది కూడా పెరుగుతుంది.

ఇతర సమవయస్కబృందాలతో పిల్లలు ఆడుకోవటం, పాడటం, చర్చించటం, కలిసి మెలసి తిరగటం, ఒకే రకమైన సామూహిక ఇష్టాన్ని ప్రకటించటం మొదలైనవి సాంఘిక ప్రవర్తనలకు నిదర్శనాలు. అయితే అందరికీ ఒకే రకమైన సాంఘిక పరిధి ఉండదు. వైయుక్తిక బేధాలను బట్టి దానిలో వ్యత్యాసాలు వుంటాయి.

కలుపుగోలుతనం, చొరవ వున్న వ్యక్తులకు ఎక్కువ మంది స్నేహితులుంటారు. దీనికి తోడు సాంఘిక హోదాను అనుసరించి కుటుంబ జీవిత నమూనా కూడా భిన్నంగా ఉంటాయి. అటువంటి భిన్నత్వం గృహ నిర్వహణ, భార్యభర్తల అనుబంధాలు, కుటుంబ విలువలు, క్రమశిక్షణ మొదలైన అంశాల ద్వారా వ్యక్తమవుతుంది.

విభిన్న మనస్తత్వాలు గల తల్లిదండ్రుల వలన శిశువు ప్రవర్తన ఏవిధంగా ఉంటుంది అనే అంశంపై రాడ్కే (1946) ఒక పరిశీలన జరిపాడు.

'ఆర్థిక అంశం' అన్ని అంశాలనూ ప్రభావితం చేస్తుంది. తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి నివసించే ఇల్లు, ఆహారపు అలవాట్లు, సదుపాయాలు, పరిసర ప్రాంతాలు, అలవాట్లు మొదలైనవి ప్రభావితం అవుతాయి.

కుటుంబ సాంఘిక హోదా కూడా చాలా వరకు ఆర్థిక హోదా (Social Status)పై ఆధారపడి వుంటుంది. ఆర్థిక లేమి వలన తల్లిదండ్రులలో కలిగే ఆత్రుత, పోషణ లేకపోవటం మొదలైన కారకాలు వ్యక్తులలో మానసిక గాయాలను రేపుతాయని టాగార్టెన్ (1946) అభిప్రాయ పడ్డారు.

ఒకొక్కసారి కొన్ని ధనిక కుటుంబాలలో తల్లిదండ్రులు పిల్లల బాధ్యతలను పనివారికి అప్పగిస్తారు. ఆ పని వారికి పిల్ల పోషణ పెంపకం పట్ల సరైన అవగాహన శ్రద్ధ లేకపోతే ఈ పిల్లలకు కలిగే హాని, పేద కుటుంబంలోని పిల్లలకు కలిగే హానికన్నా ఎక్కువగా ఉండవచ్చు. కుటుంబ ఆర్థిక వ్యవస్థ కుటుంబలోని వ్యక్తులలో ఒక రకమైన తృప్తిని, సామరస్య బాంధవ్యాలను పెంపొందించేటట్లు చేయటమే కాకుండా, సామాజిక ప్రవర్తనను కూడా ప్రభావితం చేస్తాయి.

సంస్కృతి అనేది ఒక జీవన విధానం. కుటుంబం సంస్కృతిని ఒక తరం నుండి మరో తరానికి అందించేందుకు దోహదం చేసే ఒక సామాజిక సంస్థ. కుటుంబ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, భాష మొదలైనవి సాంఘికీకరణను ప్రభావితం చేస్తాయి. వేర్వేరు సంస్కృతులు బాల్యదశను వేర్వేరుగా ప్రభావితం చేస్తాయి.

### 1.3.2 పిల్లల పెంపకం (Parenting):

పిల్లల పెంపకం అనేది బాల్యదశలో చాలా కీలకమైన అంశం. ఈ దశలో పిల్లలు పొందిన ప్రతి అనుభవం వారి బాల్యదశ నిర్మితపైన మరియు వారి భవిష్యత్ మూర్తిమత్వంపైన ప్రభావం చూపే అవకాశముంది.

సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856–1939) పిల్లల పెంపక విధానాలు, తల్లిదండ్రులు ప్రవర్తించే శైలులు పిల్లల మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపుతాయని తన మనోలైంగిక సిద్ధాంతంలో పేర్కొన్నారు.

అదేవిధంగా ఎరిక్ ఎరిక్సన్ (1959) గూడా తన మనో సాంఘిక సిద్ధాంతంలో పిల్లలు తమ చిన్నతనంలో పిల్లలలో నమ్మకం – అపనమ్మకం, స్వయంప్రతిపత్తి – సందేహం మొదలగు సాంఘిక క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటారని వాటిని పరిష్కరించే విధానంలో పొందిన అనుభవాలు వారి మూర్తిమత్వాన్ని తీర్చి దిద్దుతాయని తెల్పారు.

పిల్లలను పెంచే పద్ధతులు, తల్లిదండ్రులు అనుసరించే వివిధ రకాల శైలులు, పిల్లలు– పెద్దల మధ్య సంబంధాలు మొదలైనవి పిల్లల వికాసంపై ఎంతో ప్రభావం చూపుతాయి.

స్పెరా (2005) ప్రకారం, 'పెంపక విధానం అనేది వారి పిల్లల సామాజికీకరణకు ఉపయోగించే నిర్ధిష్ట ప్రవర్తనలను సూచిస్తే, పెంపక శైలి అనేది వారు పిల్లలకు కల్పించే ఉద్వేగ వాతావరణాన్ని సూచిస్తుంది.'

### 1.3.3 కుటుంబంలో పెద్దలు – పిల్లల మధ్య సంబంధాలు (Family and Adult - Children relationship):

కుటుంబంలో పెద్దలు పిల్లల మధ్య సంబంధాలు అనేవి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి.

పిల్ల పెంపక విధానం, కుటుంబ పరిమాణం, సోదరుల మధ్య సంబంధాలు, ఇంటి వాతావరణం, సామాజిక అంతస్థు, కుటుంబస్థాయి మొదలైన అంశాలు పెద్దలు–పిల్లల మధ్య సంబంధాలపై ప్రభావం చూపుతాయి.

పిల్లలతో తల్లిదండ్రులు గడిపే సమయం, ఆటలు, మాట్లాడుకునే విధానం, సానుకూల దృక్పధం, పిల్లలు అవసరాల పట్ల శ్రద్ధ, ఆప్యాయత చూపే విధానం, క్రమశిక్షణా పద్ధతులు, తల్లిదండ్రులు పిల్లనుంచి ఆశించే అంశాలు మొదలైనవి పిల్లలకు, పెద్దలకు మధ్య గల సంబంధాల నిర్మాణంలో ముఖ్య పాత్ర వహిస్తాయి. తల్లిదండ్రులకు తాగుడు వంటి అలవాట్లు ఉంటే వాటి ప్రభావం కూడా ఈ సంబంధాలను ప్రభావితం చేస్తుంది.

తల్లిదండ్రుల వయస్సు కూడా పెద్దలకు, పిల్లలకు గల సంబంధాలపై ప్రభావం చూపుతుంది.

మాతృత్వం పట్ల తల్లికి గల ఉద్దేశ్యం తల్లికి, బిడ్డకు గల బాంధవ్యంలో అధిక ప్రాధాన్యత వహిస్తుంది. తల్లి వయస్సుకు, గర్భధారణకు అనుగుణ్యత పొందటానికి చాలా దగ్గర సంబంధం ఉందని, మొదటి బిడ్డకు, రెండవ బిడ్డకు మధ్య ఎక్కువ తేడా లేకుంటే తల్లికి మాతృత్వం పట్ల విసుగు పుడుతుందని వాలిన్, రిలే (1950) ల అభిప్రాయం.

రాడ్కే (1946) ప్రకారం తల్లిదండ్రులు పిల్లలకు మధ్య గల బాంధవ్యాలలో అతి ముఖ్యమైనవి. తల్లిదండ్రులు పిల్లలపై అధికసంరక్షణ,అనుమతి చూపడం,సమ్మతి, తిరస్కృతి, ప్రాబల్యం, విధేయత మొదలగునవి పిల్లల సమగ్రాభివృద్ధిపై ప్రభావాన్ని చుపిస్తాయి.

పిల్లలు, పెద్దల మధ్య సామరస్య వాతావరణం, స్నేహపూర్వక వాతావరణం పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది.

ముఖ్యంగా బాల్య దశ నుండి కౌమార దశకు మారే సమయంలో తల్లిదండ్రుల సహనం, సానుకూల దృక్పధం, సమస్యలకు ప్రతిస్పందించే తీరు వారి యొక్క గుర్తింపుకు, సర్ధుబాటుకు దోహం చేయటమేకాక, పెద్దలు, పిల్లల మధ్య సంబంధం మరింత బలపడే అవకాశం ఉంటుంది.

### 1.3.4 పిల్లల పెంపక విధానాలు(Child Rearing pracitices):

బాలలకు తల్లే మొదటి గురువు. శిశువు జన్మించినప్పటి నుండి ఆ శిశువు పెంపకంలో తల్లి తన బాధ్యతలను నిర్వరించటం మొదలగుతుంది. రోజులు గడిచే కొద్ది తండ్రి పాత్ర, ఇతర సభ్యుల పాత్ర పిల్లల పెంపకంలో చోటు చేసుకుంటాయి.

ఈ పిల్లల పెంపకంలో ఉమ్మడి కుటుంబానికి, వ్యష్టి కుటుంబాలకు తేడాలుండే అవకాశం వుంది.

అయితే పెరిగిన విద్యా అవకాశాలు, పిల్లల పెంపకంపై సమాచార ప్రసార మాధ్యమాల్లో వచ్చే అంశాలు గూడా పిల్లల పెంపక విధానంలో తల్లిదండ్రులు అనుసరించే పద్ధతుల్లో మార్పులు తీసుకువస్తున్నాయి.

అదే సమయంలో తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్థులై తమ పిల్లలను శిశు సంరక్షణ (ఛైల్డ్ కేర్) కేంద్రాలలోను,

లేదా ఇంటి వద్ద ఒక వ్యక్తికి శిశువు బాధ్యతను అప్పగించి వెళ్ళడం పిల్ల పెంపకంపై ప్రభావం చూపుతాయి.

పిల్లలకు ప్రాధమిక నమూనాలుగా మనం వారి తల్లిదండ్రుని పేర్కొనవచ్చు. కనుక తల్లిదండ్రుల ప్రవర్తన శిశువు సమగ్ర అభివృద్ధికి అనుసరణీయంగా ఉండాలి.

ఉదాహరణకు ఇంటికి ఎవరైనా అతిధులు వచ్చినప్పుడు వారితో తల్లిదండ్రులు ప్రవర్తించిన తీరును పిల్లలు గమనించినప్పుడు అటువంటి సందర్భాలు ఎదురైనప్పుడు వారు అలాగే ప్రవర్తించే అవకాశం ఉంటుంది. పిల్లలకు తగిన ప్రవర్తనలను చూపి వాటిలో దేన్నైనా ఎన్నుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. ఏ పద్ధతిని అవలంబించినా అన్ని సమయాల్లో ఆ పద్దతులు పూర్తిగా విజయవంతం అవుతాయాని చెప్పలేం. కనుక పిల్లలు తమ అనుభవాల ద్వారా ప్రవర్తనా నిర్మాణం చేసుకునేలా అవకాశం ఇవ్వాలి.

పిల్లలు ఏదైనా చేసేటప్పుడు వారిని నిరుత్సాహపడకుండా ప్రోత్సహించాలి. అప్పుడు వారికి తల్లిదండ్రులపై నమ్మకంతోపాటు,, తమపై ఆత్మవిశ్వాసం పెంపొందే అవకాశం ఉంటుంది.

పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు విరుద్ధ ప్రవర్తనలు చూపినప్పుడు పిల్లల్లో సంఘర్షణలు తలెత్తే అవకాశం ఉంటుంది. శిశువు ఏదైనా తప్పు చేసినపుడు ఒకరు బాగా మందలిస్తే, మరొకరు బాగా గారాబం చేస్తే శిశువు తాను చేసింది తప్పో, ఒప్పో అనే సందిగ్ధంలో పడతాడు.

పిల్లల పెంపకంలో ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, వేషధారణ, క్రమ శిక్షణ, టాయిలెట్ ట్రైనింగ్, మాట్లాడే పద్ధతి, సామాజిక నియమాలు, సాంస్కృతిక అంశాలు మొదలుగునవి ప్రతిబింబించాలి.

పిల్లల పెంపక విధానాల్లో పిల్లల ఆత్మగౌరవం పెంచడం, స్వావలంబన పెంపొందించడం, స్వీయ నియంత్రణ, సాంఘిక ప్రవర్తన పెంపొందించేలా చూడటం, పిల్లలు స్వత:సిద్దంగా చేసిన మంచి పనులను, అలవాట్లను ప్రోత్సహించటం, పిల్లలతో వీలైనంత సమయాన్ని గడపటం, తల్లిదండ్రులు పిల్లలు అనుసరించదగ్గ మంచి ప్రపర్తనను కలిగి ఉండటం, పిల్లలు తప్పుచేసినప్పుడు వారిని శిక్షించకుండా, ఎలా ప్రవర్తిస్తే బాగుంటుందో వారికి వివరించి వారి ప్రవర్తనలో సరైన మార్పులను తీసుకొచ్చే ప్రయత్నం చెయ్యటం, పెంపక శైలి అంశంలో సందర్భానుసారంగా నమ్యత కలిగిఉండటం మొదలైన అంశాలను పిల్లలు సరైన వికాసానికి తోడ్పడతాయి.

తల్లిదండ్రుల అనుమతి తమకు అనుకూలంగా ఉందని పిల్లలు గ్రహించినపుడు వాళ్ళలో నేర్చుకోవాలనే జిజ్ఞాశ పెరగుతుంది. పిల్లల ముఖ్య అవసరాలను తల్లిదండ్రులు గమనించి వాళ్ళ అవసరాలను సంతృప్తిపరచాలి. పిల్లలను ఎప్పుడూ ఉత్సాహపరచటం, వాళ్ళ విలువ గుర్తించి తల్లిదండ్రులు పట్ల విశ్వాసం కలిగేలా కృషి చేయటం చాలా ముఖ్యమైన పద్దతి.

తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య వాగ్వివాదాలు ఏర్పడితే క్రమంగా పిల్లలు తల్లిదండ్రులు చేప్పే మాటను పెడచెవిన పెడతారు. తల్లిదండ్రులు కొంచెం గట్టిగా అరచినప్పుడు వాళ్ళకు కోపం వచ్చిందని గ్రహించి పిల్లలు భయంతో చెప్పిన పనిని చేస్తారు. మరీ ఎక్కువ ఒత్తిడి కలిగిస్తే వాళ్ళు తిరగబడతారు. కొన్ని సందర్భాలలో పారిపోవటం, ఆత్మహత్యకు ప్రయత్నించటం జరుగవచ్చు. కనుక తల్లిదండ్రులు సానుకూల దృక్పధాన్ని కలిగి ఉండాలి.

పిల్లలకు తెలిసిన విషయాలను తల్లిదండ్రులు పదే పదే చెప్పకుండా ఉండటం మంచిది.

ఒక్కొక్కసారి పిల్లలు పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకోనందువలన, పరిస్థితులకు తగ్గట్టుగా ప్రవర్తించరు, అలాంటప్పుడు వారికి పరిస్థితిని వివరించి సరైన ప్రతిస్పందనలు నేర్పాలి.

**పిల్లల పెంపక శైలులు(Child Rearing Styles):**

బామ్‌రిండ్ మరియు బ్లాక్ (1967)లు పిల్లల పెంపకాలను పరిశీలించి తద్వారా అత్యంత ప్రభావవంతమైన శైలిని, తక్కువ ప్రభావం గల శైలి వేరు చేసే ఈ క్రింది మూడు అంశాలను ప్రతిపాదించారు. అవి,

1. తల్లిదండ్రులు పిల్లల భావాలను, ఆలోచనలను అంగీకరించటం వలన తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య ఉద్వేగ సంధానం ఏర్పరుస్తుంది.
2. తల్లిదండ్రుల పర్యవేక్షణ ద్వారా పిల్లల ప్రవర్తనను నియంత్రించటం వలన పిల్లల్లో మరింత పరిపక్వమైన ప్రవర్తన కలిగేటట్లు చేస్తుంది.
3. పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వటం వలన వారిలో స్వావలంబన (Self Reliance)ను ప్రోత్సహిస్తుంది.

పిల్లల పెంపక శైలులలో కొన్ని రకాలను పరిశీలిద్దాం.

వాటిలో ముఖ్యమైనవి.

1. సాధికారతత్వ పిల్లలపెంపకశైలి.
2. నిరంకుశతత్వ పిల్లల పెంపక శైలి
3. అంగీకారతత్వ పిల్లల పెంపకశైలి
4. జోక్యరహిత పిల్లల పెంపకశైలి

**1. సాధికారతత్వ పిల్లలపెంపకశైలి (Authoritative Parenting style)**

ఇది బాగా విజయవంతమైన శైలి. దీనిలో పిల్లలకు తగిన స్వయం ప్రతిపత్తిని ఇవ్వటం, పిల్లల భావాలను, ఆలోచనలను స్వీకరించటం వారితో, భాగస్వాములు కావటం, అనుసరణీయమైన నియంత్రణా నైపుణ్యాలను ప్రదర్శించడం, పిల్లల పట్ల ప్రేమను కల్గియుండటం, పిల్లల అవసరాలను తీర్చటం లాంటి ప్రవర్తనలను తల్లిదండ్రులు కనబరుస్తారు.

ఈ రకం తల్లిదండ్రులలో ఆనందకరమైన, ఉద్వేగాలను భర్తీ చేసే విధంగా 'పిల్లలు-తల్లిదండ్రుల' మధ్య సంబంధాలను ఏర్పరుచుకొంటారు. ఫలితంగా పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయి.

అదే సమయములో ఈ రకం తల్లిదండ్రులు నిర్ధిష్టమైన, ఖచ్చితమైన, సహేతుకమైన ప్రవర్తన ను ప్రదర్శిస్తారు. వీరు పిల్లలు వయస్సుకు తగ్గట్లుగా ప్రవర్తించేలా నిర్దేశిస్తూ, వారి అంచనాలకు తగిన సహేతుకమైన వివరణనిస్తారు. వారు ఉపయోగించే నియంత్రణ విధానాలు పిల్లల స్వీయ క్రమీకరణకు దారితీసేలా ఉంటాయి. అంతేకాక వీరు పిల్లలు ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? అనే అంశాలు పర్యవేక్షిస్తూ ఉంటారు.

సాధికారతత్వ తల్లిదండ్రులు పిల్లలకు ఒక క్రమ పద్ధతిలో అవసరమైన మేరకు స్వతంత్రతను ఇస్తూ, వారి స్థాయిలో తీసుకోవలసిన నిర్ణయాలను వారు తీసుకునేలా చేస్తారు.

తల్లిదండ్రులు పిల్లల భావాలను, ఆలోచనలను మరియు కోర్కెలను వ్యక్తపరిచేందుకు అవకాశం కల్పిస్తారు. ఎప్పుడైనా నిర్ణయాలు తీసుకోవడంలో పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య బేధాభిప్రాయాలు వచ్చినప్పుడు పరస్పరం చర్చించుకొని

పరిష్కరించుకుంటారు. ఫలితంగా పిల్లలో చొరవ, ఆత్మస్థైర్యం, స్వీయ నియంత్రణ, సమస్యలను ఎదుర్కొగలగడం, పాఠశాల సాధన మరియు సహకార ధోరణి పెంపొందుతాయి.

**2. నిరంకుశతత్వ పిల్లల పెంపక శైలి (Authoritatrian Parenting style)**

ఈ రకం తల్లిదండ్రులు పిల్లలను స్వీకరించటం, పిల్లల విషయాలలో నిమగ్నమవ్వటం తక్కువగా ఉంటుంది. వీరు పిల్లలను నియంత్రించడంలో బలవంతపు విధానాలు ఎక్కువగా ఉపయోగిస్తారు. అంతేకాకుండా తక్కువ స్వేచ్ఛను ఇస్తారు. ఈ రకం తల్లిదండ్రుల పట్ల పిల్లలు తక్కువ ప్రేమను తిరస్కార ధోరణిని కలిగి ఉంటారు.

పిల్లల ప్రవర్తనను నియంత్రించేందుకు గట్టిగా అరవటం, ఆధిపత్యం చూపటం, విమర్శించటం, భయ పెట్టడం మొదలైనవి చేస్తారు. " నేను చెప్పాను కదా నువ్వు చెయాల్సిందే" అనే ధోరణిని ప్రదర్శిస్తారరు. పిల్లలకు సంబంధించిన అన్ని నిర్ణయాలు తల్లిదండ్రులే తీసుకుంటారు. వీరి మాటలను, ఆజ్ఞలను పిల్లలు ఎదురు చెప్పకుండా అంగీకరించాలి.

అలా చెయ్యకపోతే ఈ రకం తల్లిదండ్రులు బలవంతంగా, శిక్షించడం ద్వారా వారిని నియంత్రిస్తారు. వీరు పిల్లల నుంచి వారి సామర్థ్యానికి మించి ఆశిస్తారు. ఫలితంగా వీరి పిల్లలు ఎక్కువగా ఆందోళనకు, ఆతృతకు లోనవుతారు. ఈ పిల్లలు విచారంగా, ఒంటరిగా ఉండటమే కాకుండా తక్కువ స్వావలంబనను కలిగి వుంటారు. ఈ పిల్లలలో కుంఠనాలకు లోనైనపుడు వారు విరోధాన్ని, పగను ప్రదర్శిస్తారు. వీరికి కావలసినది దొరకనప్పుడు లేదా అనుకొన్నది కానప్పుడు వారి తల్లిదండ్రులలాగే బల ప్రదర్శన చేస్తారు. ముఖ్యంగా బాలురు, బాలికలన్నా అధిక కోపాన్ని, బహిరంగ అవిధేయతను చూపిస్తారు.

**3. అంగీకారతత్వ పిల్లల పెంపక శైలి (Permissive Parenting style)**

ఈ రకం తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రేమను కలిగి వుండారు. పిల్లల భావాలను, ఆలోచనలను ఆమోదిస్తారు. వీరు పిల్లల పట్ల అవసరానికి మించిన శ్రద్ధ చూపవచ్చు లేదా అసలు పట్టించుకోకపోవచ్చు. ప్రవర్తనను నియంత్రించటం ఉండదు. పిల్లలలో తమ వయస్సుకు తగిన పరిపక్వ ప్రవర్తన వ్యక్తం చేయాలని వారు ఎక్కువగా పిల్లలను ఆజ్ఞాపించరు. నిర్ణయాలు తీసుకునే స్థాయి (పరిపక్వత) రాకముందే వారు పిల్లలు తమ నిర్ణయాలు తామే తీసుకోవడానికి ఎక్కువ అనుమతినిస్తారు. ఈ విధంగా పిల్లల ప్రవర్తనపై తక్కువ నియంత్రణ చూపుతారు. ఒక పద్ధతి ప్రకారం స్వేచ్ఛ నివ్వకుండా, నిర్ణయాలు తీసుకోవటంలో పిల్లలకు అధిక స్వేచ్ఛను ఇస్తారు. మంచి నడవడిక నేర్పటంపై పెద్ద పట్టింపు ఉండదు. ఈ రకం తల్లిదండ్రులలో చాలా మందికి తాము తమ పిల్లలపై చూపగల ప్రభావం పట్ల తక్కువ నమ్మకం కలిగి వుంటారు.

వీరి పిల్లలు ఎదురు సమాధానలు చెప్పటం, అవిధేయత, తిరుగుబాటు ధోరణిని కలిగి వుంటారు. ఈ పిల్లలు ఇతర పిల్లలకన్నా ఎక్కువగా తల్లిదండ్రులపై ఆధార పడి వుండరు, సమస్యలను పరిష్కరించటంలో తక్కువ పట్టుదల కలిగి ఉంటారు. పాఠశాల సాధన తక్కువగా ఉండవచ్చు. అధిక సమాజవ్యతిరేక ప్రవర్తన కలిగి ఉంటారు.

**4. జోక్య రహిత పిల్లల పెంపక శైలి (Uninvolved Parenting style)**

ఈ రకం తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎటువంటి ఉద్దేశాన్ని కల్గి ఉండరు, ఈ రకం పెంపక శైలిలో తల్లిదండ్రులు ఉప సంహార (Withdrawn)స్వభావం కలిగి వుంటారు.

ఈ రకమైన శైలిలలో తల్లిదండ్రులు పిల్లలను తక్కువగా స్వీకరించటం, పిల్లల ప్రవర్తనను నియంత్రణనను పూర్తిగా వదిలి వేయటం మరియు పిల్లలకు స్వేచ్ఛనివ్వటంలో విభిన్న దృక్పధాలను కలిగి ఉండటం మొదలైనవి ఉంటాయి. వీరిలో అధిక శాతం పిల్లల ప్రవర్తనను నియంత్రించరు. పిల్లల పెంపకం పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరుస్తారు. ఈ రకమైన తల్లిదండ్రులు తరచుగా ఉద్వేగఅస్థిరతలకు (depression) లోనవడం వలన, అధిక ఒత్తిడి కలిగి వుండడం వలన నిరాశ నిస్పృహలకు లోనవడం వలన తమ పిల్లలపై శ్రద్ధ చూపరు.

ఈ పిల్లలలో ఎక్కువ మంది పాఠశాల సాధనలో వెనుకబాటుతనం, కోపం, అవపాతం మరియు సంఘ వ్యతిరేక ధోరణి కలిగి ఉంటారు.

## 1.4 పాఠశాల – సామాజికీకరణ(School - Socialisation):

ఇంటి తరువాత బాలలు ఎక్కువ సమయాన్ని గడిపే స్థలము పాఠశాల. పాఠశాలలో సమ వయస్కులతో సంబంధాలు, పాఠశాల సంస్కృతి, వాతావరణం, ఉపాధ్యాయుల ప్రభావం, ఉపాధ్యాయులకు పిల్లలకు గల సంబంధాలు, పాఠశాల సాధన, ఆటలు మొదలైన బాలల సాంఘికీకరణపై ప్రభావం చూపుతాయి.

సాంఘిక వికాసానికి అవసరమైన సర్దుబాట్లు ఎక్కువగా పాఠశాలలోనే పిల్లలు నేర్చుకుంటారు. శైశవంలో సాంఘిక ప్రవర్తనకు పునాదులు పడుతున్నప్పటికి అవి పాఠశాలలో పొందే అనుభవాల ద్వారా ఒక రూపాన్ని సంతరించుకుంటాయి. వారి ప్రవర్తనకు పాఠశాలలో లభించే పునర్బలనాలు వారిలో ప్రవర్తనామార్పుకు, సామాజిక ప్రవర్తనకు కారణాలవుతాయి.

### 1.4.1 సమవయస్కుల ప్రభావం(Peer Group Influence):

రూబిన్, బకౌస్కి, పార్కర్ (2006) ల ప్రకారం బాలలు మొదట తమకు సామీప్యంలో ఉన్న వారితో (తరగతి గదిలో) కలిసి సమవయస్క బృందాలుగా ఏర్పడతారు. ఒకే లింగం, జాతి, పాఠశాల సాధన, సారూప్య ప్రవర్తన మొదలైనవి బాలలు బృందాలుగా ఏర్పడటానికి సహకరిస్తాయి.

ఆటలు ఆడటం, ఆటలలో నియమాలు పాటించటం, స్పర్ధలను పరిష్కరించుకోవటం, దౌర్జన్య ప్రవర్తనలతో వ్యవహరించే తీరు పిల్లల మధ్య సంబంధాలను వారి సాంఘికీరణను ప్రభావితం చేస్తాయి. పిల్లలు తమ సమవయస్క బృందాలతో గడిపే సమయం పెరిగే కొలదీ వారిలో వారు ఒకరినొకరు ప్రవర్తనలను ప్రోత్సహించటం, నిరుత్సాహపరచటం ద్వారా, నమూనా ప్రవర్తనల అనుకరణ ద్వారా, సమవయస్క బృందాలు ఏర్పరచుకొనే నియమాల ద్వారా సాంఘీకరణ పెంపొందించటానికి అవకాశాలు పెరుగుతాయి. (రూబిన్, బకౌస్కి, పార్కర్ 2006)

జండర్ అనేది పిల్లల స్వంత గుర్తింపుకు మరియు ఇతరుల ప్రత్యక్షాలను గుర్తించటానికి మరియు ఒకరు మరొకరి జండర్ సంబంధిత ప్రవర్తనను సాంఘికీకరించటానికి దోహద పడుతుంది. పాఠశాలలో మనకు అనేక రకాల బాల్య నిర్మాణాలను కల్గిన బాలలు కనపడతారు. బాలలు ఒకరికొకరు పరస్పర సంబంధాలు నేర్చుకోవటంలోనూ, సాంఘిక నైపుణ్యాలు పెంపొందించుకోవటంలో సమవయస్కుల ప్రభావం ఉంటుంది.

ఇతరులతో స్నేహం, స్పర్ధలు పెంపొందించటానికి, నైతిక విలువల పెంపుకు, సామాజిక సాంస్కృతిక పాత్రను నిర్వహించటానికి, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని పొందుటకు సమవయస్క బృందాలు తోడ్పడతాయి.

### 1.4.2 పాఠశాల – సంస్కృతి(School - Culture):

పాఠశాల సంస్కృతి అనేది పాఠశాలలో ఏర్పాటు చేసిన నిబంధనలను, నమ్మకాలను, విలువలను, నిర్వహించే ఉత్సవాలు, ఆచారాలను ప్రతిబింభిస్తుంది.

పాఠశాల సంస్కృతి అనే భావనను విల్లార్డ్ వాలర్ (Willard Waller) అనే సామాజికవేత్త 1932 లో "ది సోషియాలజి ఆఫ్ టీచింగ్" అనే పుస్తకంలో ప్రస్తావించాడు అతని ప్రకారం ప్రతి పాఠశాలకు తనదైన సంస్కృతి ఉంటుంది. దీనిలో బాలల ప్రవర్తనను మరియు సంబంధాలను నిర్మించేందుకు గల పాఠశాలలో పాటించాల్సిన ఆచారాలు, నైతిక నియమావళి మొదలైనవి ఇమిడి ఉంటాయని వాలర్ పేర్కొన్నారు.

పాఠశాలలో వైయుక్తిక మరియు సహకార సంబంధమైన సంస్కృతులు ఉంటాయని ఫుల్లన్ మరియు హార్గ్రీవెస్ (1976) తెలిపారు. పాఠశాల సంస్కృతిపై ఉపాధ్యాయుల మూర్తిమత్వం, ప్రధానోపాధ్యాయుడి నాయకత్వ లక్షణం ప్రభావితం చూపుతాయి. పిల్లలు ఎక్కువ సమయాన్ని పాఠశాలలోనే గడుపుతారు. కనుక పాఠశాల సంస్కృతి వారి యొక్క భౌతిక, సాంఘీక, మానసిక, ఆధ్యాత్మిక మరియు నైతిక వికాసములపై ప్రభావం చూపుతుంది.

స్కిన్నర్ (1964) పాఠశాలలో పిల్లలలో అభివృద్ధి చెందిన సంబంధాలు వారి యొక్క ధనాత్మక వికాసంలో కీలక పాత్ర వహిస్తాయని తెల్పారు. పాఠశాల సంస్కృతి బాలల ప్రవర్తనలో ఏది ముఖ్యం? మరియు ఏది విలువైనది? అనే అంశాలపై దృష్టి సారించేట్లు చేస్తుందని పీటర్సన్ మరియు డీల్ (2003) పేర్కొన్నారు. అంతేకాకుండా, పాఠశాల సంస్కృతి పాఠశాల ఉత్పాదకతను మరియు సమర్థతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

కనుక పాఠశాల సంస్కృతిని పెంపొందించే విధంగా మంచి కథలను, సమాజంలోని విలువలను, మంచి పాఠశాల అనుసరించాల్సిన నియమాలను, సామాజిక కార్యక్రమాలలోను పాల్గొనడం మొదలైన అంశాలను పాఠశాలలో చేపట్టాలి. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి.

### 1.4.3 ఉపాధ్యాయులతో సంబంధాలు(Relationship with Teachers)

ఉపాధ్యాయుల ప్రవర్తన పిల్లలపై అధిక ప్రభావం చూపుతుంది. చాలా మంది పిల్లలు ఉపాధ్యాయులను నమూనాగా తీసుకొని తమ ప్రవర్తనా అంశాలని మెరుగు పరచుకుంటారు. తల్లిదండ్రులకన్నా ఉపాధ్యాయుల మీదే ఎక్కువ నమ్మకాన్ని కలిగి వుంటారు.

ఉపాధ్యాయులు పిల్లల మధ్య సంబంధాలు విద్యార్థుల విద్యా మరియు సాంఘిక వికాసాలపై ప్రభావం చూపుతాయి. ఉపాధ్యాయులు పిల్లల మధ్య సురక్షితమైన వాతావరణంలో అభ్యసించేట్లు చేయడమే కాకుండా వారి యొక్క సాంఘిక విద్యా సంబంధమైన నైపుణ్యాలు పెంపొందించటానికి కావలసిన సహకారం అందించాలి.

ఎప్పుడైతే ఉపాధ్యాయులు పిల్లలలో సానుకూల బంధాలు ఏర్పరచుకుంటారో అప్పుడు తరగతి గదులు విద్యార్థులు విద్యా మరియు సామాజిక ఉత్పాదకతను పెంపొందించేవిగా ఉంటాయి. వీరు విద్యార్థుల మధ్య గల సంబంధాలను

సాన్నిహిత్యం, ఆప్యాయత, మరియు సానుకూలతగా ఉంటాయని వర్గీకరించారు. ఎప్పుడైతే విద్యార్థికి ఉపాధ్యాయుడికి మధ్య సానుకూల సంబంధాలు ఉంటాయో అప్పుడు విద్యార్థులు సామాజిక మరియు విద్యా సంబంధిత అంశాలను సవాళ్ళుగా పరిగణించి కృషి చేయటం వల్ల వారి యొక్క సాంఘీక మరియు ఉద్వేగ వికాసం పెంపొందుతుందని వీరు పేర్కొన్నారు.

విద్యార్థులకి ఉపాధ్యాయులకి మధ్య సత్సంబంధాలు లేనప్పుడు, విద్యార్థులలో పాఠశాల అంటే భయం పెరగటం, పాఠశాల మానివేయటం, పాఠశాల పట్ల విముఖత మొదలైనవి అభివృద్ధి చెందే ఆస్కారం ఉంది. కనుక ఉపాధ్యాయుల పిల్లలలో సన్నిహిత సంబంధం పెరిగేలా ప్రవర్తిస్తూ వారికి అన్ని రకాల ప్రోత్సాహాలనిస్తూ వారు భవిష్యత్ సమాజంలో ఎదురయ్యే సవాళ్ళను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా కృషి చేయాలి.

### 1.4.4 ఉపాధ్యాయుని అంచనాలు మరియు పాఠశాల సాధన

### (Theacher Expectations and Achievement):

ప్రతి ఉపాధ్యాయుడు తన వద్ద విద్యను అభ్యసించే విద్యార్థుల సాధన ఎక్కువగా ఉండాలని కోరుకుంటాడు. విద్యార్థుల్లో వైయక్తిక బేధాలు గమనించి దానికి అనుగుణంగా విద్యార్థికి లక్ష్యాలను ఏర్పరిస్తే విద్యా సాధన సంతృప్తికరంగా ఉంటుంది. అలా కాకుండా విద్యార్థుల కాంక్షా స్థాయిని మించి లక్ష్యాలను ఏర్పరచినపుడు విద్యార్థులు సాధనలో వెనుక పడడటమే కాకుండా వారిలో న్యూనతా భావాలు పెంపొందే అవకాశం ఉంది.

ఉపాధ్యాయుల అంచనాలు విద్యార్థుల సాధనను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. రోసెంథాల్ మరియు జాకబ్సన్‌లు ఈ అంశంపై అనేక పరిశోధనలు చేశారు. వీటిని 'పిగ్మేలియన్ ఇన్ క్లాస్‌రూమ్" అనే పుస్తకంలో ప్రచురించారు. వీరి ఫలితాలలో ఉన్నత అంచనాలు విద్యార్థుల పని తీరు పెంచడానికి దారి తీసింది. ఇలా ఉన్నత అంచనాలు మెరుగైన ప్రదర్శనకు దారి తీయటాన్ని 'పిగ్మేలియన్ ఫలితం' (Pygmallion effect) అంటారు. కనుక ఉపాధ్యాయులు తార్కికంగా ఆలోచించి పిల్లల నుంచి ఫలితాలను ఆశించినట్లయితే ఫలితాల సాధన సంతృప్తికరంగా ఉండి పిల్లల సాధన పెంపొందుతుంది.

### 1.4.5 బడి బయట పిల్లలు(Out of School children):

ఆర్.టి.ఇ 2009 ప్రకారం అనుసరించి 6-14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించాలి. ఈ దిశగా భారత ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది.

బడి బయట పిల్లలు అంటే:

* పాఠశాలలో నమోదు కాని పిల్లలు (6-14)
* పాఠశాలలో నమోదైనా హాజరు కాని పిల్లలు
* మధ్యలో బడిమాని వేసిన పిల్లలు
* ఆవాస ప్రాంతంలో పాఠశాల లేకపోవడం వలన నమోదు కాని పిల్లలు

వీరందరిని బడి బయట పిల్లలుగా గుర్తిస్తారు. పిల్లలు బడి బయట ఉండటం వలన వారు వారి హక్కులను కోల్పోవటమేకాక, వారి సర్వతోముఖాభివృద్ధి కుంటుపడటానికి దారి తీస్తుంది. వారిలో జీవన నైపుణ్యాలు కుంటుపడతాయి.

పిల్లలు బడి బయట ఉండటానికి పాఠశాల దూరంగా ఉండటం, సామాజిక కట్టుబాట్లు, జండర్ వివక్షత, పేదరికం, వలసలు, త్వరగా వివాహం కావటం, ఉపాధ్యాయుల కొరత వంటి అనేక కారణాలు చెప్పబడినప్పటికీ, వీటిని అధిగమించటానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. అయినప్పటికీ చాలమంది పిల్లలు రకరకాల కారణాలు వలన బడికి రావటం లేదు.

ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా అమలు పరచడానికి, శిశుమరణాలు వంటివి తగ్గటానికి జాతీయ ఉత్పాదకత పెంచటానికి విద్య తప్పనిసరి. విద్య బాలల శారీరక, మానసిక, సంజ్ఞానాత్మక, సాంఘిక, నైతిక విలువలను పెంపొందిస్తుంది.

కనుక ఛాత్రోపాధ్యాయులు భవిష్యత్తులో ఇటువంటి పిల్లలందరు బడిలో చేరేలా ఇంటింటికి ప్రచారం చేసి తల్లిదండ్రుల వైఖిరిలో మార్పుకు ప్రయత్నించాలి. పిల్లలను తగు మార్గదర్శకత్వం, మంత్రణమును కల్గించి వారి అభివృద్ధికి తోడ్పడాలి.

## 1.4.6 అధిక వయస్సు అభ్యాసకులు (Learners with Over Age):

అధిక వయస్సుగల అభ్యాసకులు అనగా తరగతిలో ఉండాల్సిన వయస్సుకన్నా ఎక్కువ వయస్సు ఉన్నవారు, వయోజన విద్యను అభ్యసించేవారుగా చెప్పవచ్చు.

పిల్లలు వయస్సుకు తగ్గ తరగతిలో లేనప్పుడు వారు మిగిలిన పిల్లలో సర్ధుబాటు చేసుకోవటంలో సమస్యలు ఏర్పడవచ్చు. పెద్ద పిల్లలు చిన్న తరగతులలో ఉన్నప్పుడు వారి ఆలోచనావైఖి, అలవాట్లు, ఆటలలో పాల్గొనడం మిగిలిన వారి కన్నా భిన్నంగా ఉండటం వలన వ్యాకులతకు గురికావచ్చు.

సాధారణంగా ఆలస్యంగా బడిలో చేరటం, నిలుపుదల, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కావటం మొదలైన కారణాల వలన అధిక వయస్సు గల పిల్లలను మనం పాఠశాలలో గమనిస్తాం.

ఇలాంటి సందర్భాలలో ఉపాధ్యాయులు వారితో స్నేహపూర్వకంగా ఉంటూ, వారికి అనుగుణంగా విద్యా ప్రణాళిక వేసి, సమయానుకూలంగా పునర్బలనాలు కల్గిస్తూ వారి వికాసానికి తోడ్పడాలి.

అంతేకాకుండా వారికి వారి తల్లిదండ్రులకు సరైన మార్గదర్శకత్వం కల్పించాలి.

## 1.5 దత్తాంశ సేకరణ పద్ధతులు, మెళుకువలు, ఉపగమాలు:

ఉపాధ్యాయులు బాలల ప్రవర్తనను అవగాహన చేసుకొనుటకు, వివిధ సందర్భాలలో బాలలకు సంబంధించిన దత్తాంశాలను సేకరించాల్సి ఉంటుంది. శిశు అధ్యయనం కొరకు అనేక పరిశోధనలను చెప్పట్టవలసి ఉంటుంది. అందుగాను వివిధ రకాల దత్తాంశాలను సేకరించడానికి వివిధ పద్ధతులు, మెళకువలు, ఉపగమాలు అందుబాటులో వున్న వాటిని ఉపయోగించాలి.

బాలల ప్రవర్తనను సమర్ధవంతముగా అంచనా వేయటానికి సరైన పరిశోధన పద్ధతులను (Research method)ఎన్నుకొని, వాటికి కావలసిన దత్తాంశాన్ని సేకరించడానికి సరియైన సాధనలను (Tools) మొదలైన అంశాలపై ఆధారపడి వుంటుంది. స్టాన్లీహాల్, ఎలిజిబెత్ హర్లాక్, గెస్సెల్ మొదలగువారు బాలల అధ్యయనంలో ప్రసిద్ధి చెందారు.

ఇప్పుడు మనం వివిధ దత్తాంశ సేకరణ పద్ధతులను గురించి తెలుసుకుందా.

పరిశోధన అంటే – ఒక శాస్త్రీయ పద్ధతిలో

- సమస్యను గుర్తించడం
- పరికల్పనలను ఏర్పరుచుకోవడం
- దత్తాంశాలను సేకరించడం
- వాటిని విశ్లేషించడం
- విశ్లేషణకు వ్యాఖ్యానించడం
- నివేదనలను తయారుచేసి ప్రచురించడం జరుగుతుంది

పరిశోధన పద్ధతులను విభిన్న రీతులలో వర్గీకరించవచ్చు.అందులో ఒక రీతి ముఖ్యంగా బాలల మనోవిజ్ఞానాన్ని పరిశోధించడానికి నాలుగు రకాలుగా విభజించారు.

1. చారిత్రక పరిశోధన(Historical Research)
2. సహసంబందక పరిశోధన(Correlation Research)
3. వర్ణనాత్మక పరిశోధన(Descriptive Research)
4. ప్రయోగాత్మక పరిశోధన(Expermental Research)

వీటి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం:

**1. చారిత్రక పరిశోధన:**

ఈ రకం గత వాస్తవాలను శోధించడానికి గతంలో ఉదా।। 15వశతాబ్దంలో బాలలపై జరిగిన అధ్యయనాలు లేక బాలల గరించిన అభిప్రాయాలు, వారి పెంపక విధానాలు, బాలలకు సంబంధించిన వికాసకార్యక్రమాలు మొదలగునవి.

గత వాస్తవాలను ప్రాథమిక మూలాల ద్వారానో లేక గౌణ మూలాల ద్వారానో విషయాలను సేకరించి వాటిని విశ్లేషించి నివేదించడం జురుగుతుంది.

ప్రాచీన, మధ్యమ, ఆధునిక, నవీన కాలాలలో బాలలు పట్ల జరిగిన మార్పులను గుర్తించాలంటే చారిత్రక పరిశోధనా పద్ధతులు అవసరం.

**2. సహసబంధ పరిశోధనా పద్ధతి:**

- బాలల మనోవిజ్ఞానంలో – బాలల గుణగణాలకు వారి తల్లిదండ్రల గుణగణాలకు మధ్య సంబంధం ఉందా?
- బాలల భాషణ/భాషా వికాసానికి వారు నివశించే పరిసరాల ప్రభావం ఉంటుందా?
- తల్లిదండ్రుల పెంపకం విధానానికి బాలల విద్యాసాధనకు సహసబంధం వుందా?

ఇలా అనేక సందేహాలను తీర్చుకోవడానికి ఉపయోగపడే పరిశోధనయే. “సహసంబంధ అధ్యయన పద్ధతి”.

ఈ పరిశోధనా పద్ధతిలో ఒక చరరాశిలోని (Variable) ప్రవర్తనా పరిమాణం ఇంకొక చరరాశిలోని ప్రవర్తనతో ఎలాంటి సహసంబంధం ఉంటుందో గుర్తించి, ఆపరస్పర సంబంధాన్ని అవగాహనతో విశ్లేషించి వాఖ్యానించడం జరుగుతుంది.

అంటే సహసంబంద పరిశోధన వలన ఒక చరరాశి పరివర్తన తెలినట్లయితే రెండవ చరరాశి ప్రవర్తనను అంచనా వేయుడానికి లేక ‘పాగుక్తీకరించడానికి ఉపయోగపడుతుంది.

**3. వర్ణనాత్మక పరిశోధన:**

“ఇప్పటి స్థితి” ఏమిటో వర్ణించి, వాఖ్యానించే పరిశోధనే వర్ణనాత్మక పరిశోధన

ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులు(ప్రపంచీకరణ,న్యూక్లియర్ కుటుంబవ్యవస్థ,ఉద్యోగినితల్లులు, నర్సరీ,Play

School,Mass Media,Computers,Mobile games/Video games (ప్రభావాలు, జంక్‌ఫుడ్స్ మొదలగునవి) ఈ పరిస్థితుల వల్ల సంభవించే పరిణామాలు అంటే బాలల భౌతిక,మానసిక,ఉద్వేగ,సాంఘిక,నైతిక,ఆద్యాత్మిక వికాసాల తీరుతెన్నులను, నమ్మకాలు, దృక్పథాలు, వైఖరులు మొదలైన విషయాలను పరిశీలించి, వర్ణించి,వ్యాఖ్యానించే పరిశోధనవర్ణణాత్మకపరిశోధన.

ఈ పరిశోధన కొరకు – బాలల వ్యక్తిగత చరిత్ర,పరిపృచ్ఛ, సర్వే, పరిశీలనా, సంఘట రచనా,పర్యాలోచన లాంటి పరిశోధక సాధనాల(ResearchTools)ను ఉపయోగించి దత్తాంశ సేకరణ చేస్తారు. వాటిని విశ్లేషించి వాఖ్యానిస్తారు. పైన పేర్కొన్న పరిశోధక సాధానాలను గూర్చి ఈ అధ్యయనంలోనే తెలుసుకుంటాం.

4. ప్రయోగాత్మక పరిశోధన:

ఒక విషయాన్ని జాగ్రత్తగా నియంత్రించిన పరిస్థితిలో ఏమౌతుంది లేక ఏమి జరుగుతుంది. అని విశ్లేషణ పూర్వకంగా వర్ణించడాన్నే " ప్రయోగం" అంటాము.

ఈ రకం పరిశోధన, పరిశోధకుడు పరిశీలనాంశాన్ని పరిశోధన జరిగేటప్పుడు నియంత్రణ చేసి దాని వలన జరిగే మార్పులను గమనిస్తాడు.

ఈ పద్దతిలో వ్యక్తి నిష్టత (Subjectivity) కి ప్రాధాన్యతఉండదు. వస్తునిష్టత (Objectivity)కి చాలా ప్రాదాన్యతయిస్తాడు.

ప్రయోగాత్మక పరిశోధనలో నియంత్రణ (Control) అనేది ముఖ్యము కావుననే ఈ పద్దతికి మనోవిజ్ఞానశాస్త్రంలో ఎక్కువ అమల్లో ఉంది.

జాన్ స్టూవర్ట్ మిల్(John Stuwart Mill) ప్రతిపాదించిన ప్రాధమిక అభ్యుపగమం ఏకచర నియమం (The Law of Single Variable) మీద ఆధారపడి ఉంటుంది.

" ఏ రెండు స్థితులు, అన్ని విధాల సమానంగా వుంటే అందులో ఒక స్థితి నుండి ఒక మూలంను తీసివేసిన (లేక) కలిపిన, స్థితుల మధ్య భేదం కనిపిస్తే, ఆ బేధం తీసివేసిన మూలకం వలనో లేక కలిపిన మూలకం వల్లనో జరిగినదని ఖచ్చితంగా చెప్పవచ్చు – నిర్థారించవచ్చు.

ఇప్పుడు మనం క్రిందివ్వబడిన కొని పరిశోధనా సాధాలను గురించి తెలుసుకుందాం

1. పరిశీలన (Obeservation)
2. పరిపృచ్ఛ(Interview)
3. సంఘటన రచనా పద్దతి
4. పర్యావలోచన పత్రికలు
5. కథనాలు(Narrations)
6. బాలల వ్యక్తిగత చరిత్ర
7. ప్రయోగ పద్ధతి – చార్యత్మక పరిశోధన

### 1.5.1 పరిశీలన(Obsevation):

బాలల ప్రవర్తనను అంచనా వేసే సాధనాలలో పరిశీలన ఒకటి.

యంగ్ (1977) ప్రకారం "పరిశీలన అంటే ఒక సమయంలో జరిగేటువంటి సంఘటనలను ఒక క్రమ పద్దతిలో అధ్యయనం చేయటం".

అట్కిన్‌సన్ (1994) ప్రకారం "పరిశీలన అంటే దత్తాంశ సేకరణ కొరకు ఉద్దేశ్య పూర్వకంగా కొన్ని విషయాలను పరీక్షించటం."

పరిశీలన అనేది కొంత క్లిష్టతతో కూడుకున్నది. ఎందుకంటే పరిశీలకుడు దత్తాంశ పేకరణకు తన జ్ఞానేంద్రియాలనన్నింటిని ఉపయోగించటమే కాక, రకరకాల పాత్రలను పోషించాల్సి ఉంటుంది. (అట్కిన్‌సన్ మరియు హామ్మెర్సిలే, 1994).

వ్యక్తి/ ఉపాధ్యాయుడు తాను ఎన్నుకొన్న అంశాలను ప్రత్యేకమైన సన్నద్ధతతో, ఆసక్తితో, స్పష్టతతో చూచి, దత్తాంశంను సేకరించి, వాటిని విశ్లేషించి అవగాహనతో వాఖ్యానించడాన్ని పరిశీలను అనవచ్చు. సాధారణంగా పరిశీలనలను సహజ పరిస్థితులలో లేక నియంత్రిత స్థితులలో చేయడం జరుగుతుంది. వాటిని గురించి తెలుసుకుందాం.

పరిశీలనలు ముఖ్యంగా రెండు రకాలు ఉన్నాయి. అవి.

**ఎ)సహజ పరిశీలన:**

పరిశీలనాంశాలను సహజ పరిస్థితులలో పరిశీలించటంను సహజ పరిశీలన అంటారు. ఈ రకమైన పరిశీలనలో పరిశీలింపబడే వ్యక్తులకు వారు పరిశీలిపంబడుతున్నామని తెలియదు.

ఉదాహరణకు పిల్లలు అడుతున్నప్పుడు వారికి తెలియకుండా వారి ప్రవర్తనను పరిశీలించటం.

గెస్సెల్ అనే మనోవిజ్ఞానవేత్త పిల్లల ప్రవర్తనను పరిశీలించుటకు అబ్జర్వేషన్‌డోమ్‌ను రూపొందించారు. ఈడోమ్ చుట్టు ఒక వైపు నుంచి మాత్రమే చూడగల తెర అమర్చడం వలన లోపల వారికి బయటనున్నవారు కనపడరు. కానీ బయట ఉన్న వారికి లోపల ఉన్నవారు కనపడతారు.

పరిశీలన సమర్ధవంతముగా ఉండాలంటే ముందుగానే ఏ అంశాలు పరిశీలించాలి, ఎలా పరిశీలించాలి, ఎవరిని పరిశీలించాలి మొదలగు అంశాలు ముందుగానే నిర్ధారించుకోవాలి.

టేప్ రికార్డర్‌లు, కెమెరాలు, వీడియోలు మొదలైన సాధనాలు కూడా పరిశీలనా పద్దతిలో ఉపయోగించవచ్చు.
ఉపయోగాలు: ప్రవర్తనకు కారణమైన అంశాలు నేరుగా పరిశీలించవచ్చు.
పరిమితులు: తగిన శిక్షణ లేప్పుడు పరిశీలను అసమగ్రంగా ఉంటుంది.

**బి) నియంత్రిత పరిశీలన / ప్రయోగ పరిశీలన:**

సహజ సిద్ధమైన విషయాన్ని, వాటి స్వభావాలను, నియంత్రించిన పరిస్థితులలో, కల్పిత పరిస్థితులలో ఏర్పడేటట్లు చేసి వాటిని పరిశీలించే పద్ధతియే – నియంత్రిత పరిశీలన లేక కల్పిత పరిశీలన. అంటే సహజమైన పరిస్థితులను కృత్రిమంగా కల్పించి నియంత్రిత పద్ధతులలో క్రమబద్ధంగా జరిగే అధ్యనాన్ని – ప్రయోగాత్మక అధ్యయనాలని కూడా అంటారు.

### 1.5.2 పరిపృచ్ఛలు (ఇంటర్వ్యూ):

బాలలను అధ్యయనానికి దత్తాంశాన్ని సేకరించేసాధనాలలో పరిపృచ్ఛ ఒకటి.

మెకాబే (Maccoby, 1954) పరిపృచ్ఛను "ఒక వ్యక్తి మరో వ్యక్తితో లేదా వ్యక్తులతో ముఖాముఖి సంభాషించి, వారి నుండి కావలసిన సమాచారాన్ని రాబట్టి నమోదు చేసి, విశ్లేషించి, వ్యాఖ్యనించే పద్ధతి"గా నిర్వచించారు.

పరిపృచ్ఛలో సాధారణంగా ఇద్దరు వ్యక్తులు పాల్గొంటారు. వారిలో ప్రశ్నలు అడిగే వ్యక్తిని పరిపృచ్ఛకుడు అని, సమాధానాలు చెప్పే వ్యక్తిని పరిపృచ్ఛితుడు అని అంటారు.

ఇంటర్వ్యూను ముఖ్యంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ఎ) సంరచిత పరిపృచ్ఛ (Structured interview)

బి) అసంరచిత పరిపృచ్ఛ (Unstructured interview)

**సంరచిత పరిపృచ్ఛ:**

ఇది ముందుగా నిర్ధారించిన ప్రశ్నల ఆధారంగా నిర్వహించే పద్ధతి. ఈ పద్ధతిలో పరిపృచ్ఛకుడు ముందస్తు ప్రణాళికతో ప్రశ్నలను తయారుచేసుకొని, నిర్ణయించుకున్న క్రమంలో ముఖాముఖి చర్చించి సమాచారాన్ని సేకరించి, విశ్లేషించడం జరుగుతుంది.

**అసంరచిత పరిపృచ్ఛ:**

ఈ పద్ధతిలో పరిపృచ్ఛితునికి ప్రశ్నలు అడగటంలో నమ్యత ఉంటుంది. ఇది పూర్వ ప్రణాళిక లేకుండా ఇంటర్వ్యూ చేసే పద్ధతి. ఇందులో సమయానుకూలంగా అప్పటికప్పుడు ప్రశ్నలు వేసి పృచ్ఛితుని నుండి విషయ సేకరణ చేయటం జరుగుతుంది. ఇంటర్వ్యూ పద్ధతిలో చాలా అవసరమైనది పరిపృచ్ఛకునికి, పరిపృచ్ఛితునికి మధ్య సామరస్యం. అందుకే ఏ రకమైన పరిపృచ్ఛలోనైన ముందుగా పరిపృచ్ఛకునికి, పరిపృచ్ఛితుడికి మధ్య సామరస్యం ఏర్పడేలా చేసుకోవాలి. పరిపృచ్ఛితుడు చెప్పిన విషయలు పరిపృచ్ఛకుడు ఎవరికీ చెప్పడు అనే నమ్మకం కల్పించి, స్నేహపూర్వక వాతావరణంలో, సమయానుకూలంగా, సమయస్ఫూర్తితో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టాలి.

**ఉపయోగాలు:**

- పరిపృచ్ఛితుడు నిజాయితీగా లాగా సమాధానాలు చెప్తే విషయ సేకరణకు ఇది చాలా మంచి పద్ధతి.
- వ్యక్తి యొక్క గత అనుభవాలను తెల్సుకోవటానికి అనువైన పద్ధతి.
- పరిశీలన ద్వారా మనం గమనించలేని అంతర్గత అంశాలు / ప్రవర్తనను గూర్చి తెలుసుకోవచ్చు.

**పరిమితులు:**

- విషయ నిష్టత ఎక్కువగా ఉంటుంది.
- సామరస్య వాతావరణంను ఏర్పడనప్పుడు భయం వల్ల కొన్ని విషయాలు చెప్పకపోవచ్చు.

### 1.5.3 పర్యావలోచక పత్రికలు: (Reflective Journals)

పర్యావలోచక పత్రికలు అనేవి బాలలు తమ స్వంత ఆలోచనలను లేదా ఉపాధ్యాయులు పరిశీలించిన అంశాలను నమోదు చేసేందుకు ఉపయోగించే పుస్తకంగా చెప్పవచ్చు.

ఇలా వారి ఆలోచనలను, భావాలను మరియు అభ్యాసనాన్ని ప్రతి స్పందింపజేసి, నమోదు చేయటం వలన అది వారి స్వీయ మూల్యాంకానికి, వారికి తెలిసిన, తెలియని విషయాలను వర్గీకరించుకోవటానికి, తద్వారా వారి సంజ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తుంది.

ఇలా పిల్లల స్వీయ ఆలోచనలను మరియు అనుభూతులను పరీక్షించేందుకు ఈ పర్యాలోచక పత్రికలు ఉపకరిస్తాయి. ఇవి పిల్లలు నూతన విషయాలు / భావలను నేర్చుకోవడానికి, క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి, భావ వ్యక్తీకరణకు ఉపయోగపడతాయి.

పిల్లలు తమ ఆలోచనలను తామే పర్యవేక్షించుకోవటం వల్ల వారు శక్తివంతంగా నేర్చుకోవడానికి దోహదం చేస్తుంది.

పిల్లల ప్రతిస్పందనలను ఉపాధ్యాయులు పరిశీలించి తగు సూచనలు చేసినప్పుడు అది వారిలో జ్ఞాన నిర్మాణానికి దారి తీస్తుంది.

### 1.5.4 సంఘటన రచనాత్మక పద్ధతి:

ఈ పద్ధతిలో బాలల ప్రత్యేక ప్రవర్తనలను సంఘటనలను పరిశీలించటానికి ఒక ప్రణాళిక రూపొందిస్తారు. ఉదాహరణకు పిల్లలు దెబ్బలాడుకోవటం, ఉద్వేగ వైపరీత్యం మొదలైనవి. పరిశీలకుడు ఒక అనువైన స్థలంలో ఉండి పిల్లలను గమనిస్తూ వారిలో ఏమైనా ప్రత్యేక ప్రవర్తనలు కనిపించినపుడు వాటిని నమోదు చేస్తాడు. సంఘటన పూర్తిగా గమనించి ఈ క్రింది అంశాలు నమోదు చేస్తాడు.అవి పేరు, లింగం, వయస్సు, సంఘటన జరిగిన సమయం, సంఘటనకు పూర్వం పిల్లలు ఏం చేసేవారు, సంఘటనకు కారణం, సంఘటనలో పిల్లవాడు పాల్గొన్న విధానం, భాష, ఉద్వేగాలు మొదలైనవి.

నమోదు చేసేటప్పుడు వ్యక్తిగత అభిప్రాయాలు వ్రాయకూడదు. సంఘటనకు సంబంధించి యధాతధమైన స్పష్టమైన వివరణ ఉండాలి. ఈ పద్ధతిలో అవసరమైన, ప్రత్యేకమైన ప్రవర్తనలు మాత్రమే గమనిస్తారు.

### 1.5.5 వర్ణనలు / కథనాలు: (Narratives)

ఇది పిల్ల ప్రవర్తనను / చర్యలను అవి జరిగిన క్రమంలో నమోదు చేసే పద్ధతి.

ఈ పద్ధతి సంఘటన రచనాత్మక పద్ధతిలాగా ఏదో ఒక ప్రత్యేక సంఘటనకు పరిమితం కాదు. దీనిలో పిల్లలు ఏం చేస్తున్నారు, తరగతి గదిలో బయట వివిధ అంశాలలో ఏ విధంగా పాల్గొంటున్నారు. మిగతా పిల్లలో ఏ విధంగా ప్రతిస్పందనలు జరుపుతున్నారు మొదలైన అంశాలు నమోదు చేస్తారు. ఈ అంశాలను అవి జరిగిన క్రమంలో నమోదు చేస్తారు. వీటిని విశ్లేషించి ప్రవర్తనను అంచనా వేస్తారు.

**ఉపయోగాలు:**

- పిల్లల ప్రవర్తనాంశాలకు చెందిన సమగ్ర సమాచారం సేకరణ
- ఒకే ప్రత్యేక ప్రవర్తనకు పరిమితం కాకుండా అన్ని రకాల ప్రవర్తనలు నమోదు చేయటం.
- ప్రవర్తనాంశంతో పాటు దానికి దారి తీసిన పరిస్థితులను కూడా అవగాహన చేసుకోవచ్చు.

**పరిమితులు:**

- ఈ పద్ధతిలో పిల్లందరినీ గమనించటం కష్టం
- ఎక్కువ కాలం పడుతుంది.

## 1.5.6 ప్రయోగ పద్ధతి:

ప్రవర్తనను అధ్యయనం చేయుటకు ప్రయోగ పద్ధతి అత్యంత శాస్త్రీయమైన మరియు వస్తునిష్టత గల పద్ధతి.

మనో వైజ్ఞానిక శాస్త్రంలో మొట్టమొదటి ప్రయోగశాలను 1879వ సంవత్సరంలో విల్ హెల్మ్ ఉంట్ అనే జర్మనీ దేశపు శాస్త్రవేత్త 'లిప్ జిగ్' అనే నగరంలో ఏర్పాటు చేసారు.

ప్రయోగ పద్ధతి మనో విజ్ఞాన శాస్త్రం ఒక ప్రత్యేక శాస్త్రంగా అభివృద్ధి చెందటానికి దోహదం చేసింది.

మనో విజ్ఞాన శాస్త్రంలో ప్రయోగం అంటే జాగ్రత్తగా నియంత్రించిన పరిస్థితులలో ఉద్దీపనలో మార్పులు కలుగజేసినప్పుడు ప్రయోజ్యుని ప్రవర్తనలో ఏర్పడే మార్పులను కొలవటం.

"ప్రయోగం అంటే ఒక దృగ్విషయాన్ని లేదా ప్రవర్తనను నియంత్రిత పరిస్థితులలో అధ్యయనం చేయటం'.

**ప్రయోగ పద్ధతిలో ఉపయోగించే కొన్ని సాంకేతిక పదాలు:**

- ♦ **ఉద్దీపన :** వ్యక్తిలో ప్రవర్తనా మార్పునకు కారణమైనది
- ♦ **ప్రతిస్పందన:** ఉద్దీపనకు వ్యక్తి చూపే ప్రవర్తన
- ♦ **ప్రయోక్త :** ప్రయోగం చేసే వ్యక్తిని ప్రయోక్త అంటారు. ప్రయోక్త చరాలను నియంత్రిస్తాడు.
- ♦ **ప్రయోజ్యుడు :** ప్రయోగ ప్రభావానికి గురి కాబడే వారిని ప్రయోజ్యుడు అంటారు. ప్రయోగంలో ప్రయోక్త ఎవరి ప్రవర్తనపై 'స్వతంత్రచరం' ప్రభావాన్ని అధ్యయనం చేస్తారో వారిని ప్రయోజ్యులు అంటారు.
- ♦ **చరం :** ప్రయోగంలో మార్పును పొందే లేదా మార్పునకు కారణమయ్యే లేదా మార్పుకు గురి అయ్యే అంశాన్ని చరము అంటారు.

చరాలు మూడు రకాలు:

(ఎ) స్వతంత్ర చరం (బి) పరతంత్ర చరం (సి) జ్యోక్య చరాలు

**ఎ) స్వతంత్రచరం(Independent Variable):**

ప్రయోగం చేసే సమయంలో ప్రయోక్త తన ప్రయోగానికి అనుగుణంగా మార్చే చరాన్ని 'స్వతంత్ర చరం' అంటారు. ఇది ప్రయోక్త ఆధీనంలో ఉంటుంది. ప్రయోగంలో స్వతంత్రచరం 'కారణం' పాత్ర వహిస్తుంది.

**బి) పరతంత్రచరం(Dependent Variable):**

ప్రయోగంలో స్వతంత్రచరం ప్రభావానికి గురయ్యే చరాన్ని పరతంత్రచరం అంటారు. ప్రయోగంలో ప్రయోక్త దీనిలో వచ్చే మార్పులను పరిశీలిస్తారు. ప్రయోగంలో పరతంత్రచరం 'ఫలితం' పాత్ర వహిస్తుంది.

సూక్ష్మంగా చెప్పాలంటే ప్రయోక్త ఆధీనంలో ఉన్న చరం స్వతంత్రచరం, దాని ప్రభావానికి లోనయ్యే చరం పరతంత్ర చరం.

ఉదా(1): ఒక ఉపాధ్యాయుడు విద్యార్థి సాధనపై 'స్వీయ అభ్యసనా సామాగ్రి' ప్రభావంను అంచనా వేసేందుకు ఒక ప్రయోగం చేస్తున్నాడు.

ఇందులో విద్యార్థి సాధన – పరతంత్ర చరం

స్వీయ అభ్యసనా సామాగ్రి – స్వతంత్ర చరం

ఉదా(2): విద్యార్థి చురుకుదనంపై గ్లూకోస్ ప్రభావమును అంచనా వేసే ప్రయోగం లో విద్యార్థి చురుకుదనం – పరతంత్ర చరం, గ్లూకోజ్ – స్వతంత్ర చరం.

**సి) జోక్య చరాలు**(InterveningVariable)**:**

ఎవరి ఆధీనంలో లేకుండా ప్రయోగంలో పరతంత్ర చరంపై ప్రభావం చూపే చరాలను జోక్య చరాలు అంటారు.

లేదా

ప్రయోగంలో స్వతంత్ర చరం కాకుండా పరతంత్ర చరాన్ని ప్రభావితం చేసే కారకాలను జ్యోక్య చరాలు అంటారు. ప్రయోగం యొక్క సఫలత, నాణ్యత జోక్యచరాలను అదుపు చేయడంపై ఆధారపడి ఉంటుంది.

ప్రయోజ్యుల మానసికస్థితి, అనారోగ్యం, అలసట, పరికరాల వైఫల్యం మొదలైనవి జోక్యచరాలకు ఉదాహరణగా చెప్పవచ్చు.

ఉదా: ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల సాధనపై కంప్యూటర్ ఆధారిత అభ్యసన ప్రభావంను పరీక్షించదలచాడు. కంప్యూటర్‌లు వైరస్ కారణంగా పాడవటంలో ప్రయోగం వైఫల్యం చెందినది. ఇందులో 'వైరస్' అనేది జోక్యచరం.

ప్రయోగపద్ధతిలో పరిశోధకుడు/ఉపాధ్యాయుడు ఒక క్రమాన్ని అనుసరించవలసి ఉంటుంది. స్థూలంగా ఆక్రమం క్రింది విధంగా ఉంటుంది.

* సమస్యను గుర్తించడం.
* సమస్యను నిర్వచించడం
* పరికల్పనలను ఏర్పరుచుకోవడం
* వాటికి అనుగుణంగా దత్తాంశాలను సేకరించడం
* దత్తాంశాన్ని సాంఖ్యక (Statistics) పరంగా విశ్లేషించడం
* నిర్ధారణలకు రావడం
* పరికల్పనలను ఆమోదించడం లేదా పై క్రమాన్ని శాస్త్రీయ పద్ధతి అంటారు. దీన్నే పరిశోధన అని కూడా అంటారు.

**సమూహాలు:**

ప్రయోగంలో సాధారణంగా రెండు రకాల సమూహాలు ఉంటాయి.

**1) నియంత్రిత సమూహము (Control Group):**

ఎటువంటి ప్రయోగ పరిస్థితులకు గురికాని సమూహాన్ని నియంత్రిత సమూహం అంటారు. నియంత్రిత సమూహం ఉండే స్థితిని నియంత్రిత స్థితి అని అంటారు. ఇది సహజ స్థితి.

**2) ప్రయోగ సమూహము (Expermental Group):**

ప్రయోక్త ప్రవేశ పెట్టే ప్రయోగ స్థితికి లోనయ్యే సమూహాన్ని ప్రయోగ సమూహం అంటారు. ప్రయోగ సమూహంపై 'స్వతంత్రచరం' యొక్క ప్రభావాన్ని ప్రయోగంలో అంచనా వేస్తారు. ప్రయోగ సమూహం యొక్క స్థితిని ప్రయోగ స్థితి అని అంటారు.

ప్రయోగం చేసేటప్పుడు ప్రయోక్త తాను చేసే ప్రయోగాన్ని బట్టి, అందుబాటులోని వనరులు, ఇతర అంశాల ఆధారంగా ప్రయోగ నమూనాను ఎన్నుకుంటాడు. కొన్ని ప్రయోగ నమూనాలను మనం పరిశీలిద్దాం.

1. ఏక సమూహ నమూనా
2. సమ సమూహాల నమూనా
3. భ్రమణ సమూహాల నమూనా
4. బహుళసమూహాల నమూనా

1) ఏక సమూహ నమూనా: ఈ పద్ధతిలో ఒకే సమూహం ఉంటుంది. మొదట ఈ సమూహం 'నియంత్రిత సమూహంగా వ్యవహరిస్తుంది. తరువాత ఈ సమూహం ప్రయోగ సమూహంగా వ్యవహరిస్తుంది.

అంటే ఒకే సమూహన్ని ఒకసారి నియంత్రిత స్థితిలో, మరొకసారి ప్రయోగ స్థితిలో ఉంచి ఫలితాలను విశ్లేషించి వ్యాఖ్యానిస్తారు.

ఉదా: విద్యార్థుల సాధనపై కృత్యాధార పద్దతి ప్రభావం

| | | | | |
|---|---|---|---|---|
| స్టెప్ – 1 | నియంత్రిత స్థితి | పూర్వ పరీక్ష నిర్వహణ | సాధారణ పద్దతిలో బోధన | అంత్య పరీక్ష 1 నిర్వహణ |
| స్టెప్ – 2 | ప్రయోగ స్థితి | | కృత్యాధార పద్దతిలో బోధన | అంత్య పరీక్ష 2 నిర్వహణ |

**2. రెండు సమమూహాల లేక సమాంతర సమూహాల నమూనా:**

ఈ పద్ధతిలో ప్రయోక్త రెండు సమూహాలను ఉపయోగిస్తారు. ఈ రెండు సమూహాలలోని ప్రయోజ్యాలు అన్ని విషయాల్లో (అనగా వయస్సు, లింగం, వర్గం, ప్రజ్ఞ, సామాజిక స్థాయి మొదలుగునవి) ఒకే రకంగా ఉండేట్లు ప్రయోక్త

ముందుగానే చూసుకుంటారు. ఈ రెండు సమూహాలలో ఒక దానిని ప్రయోగ సమూహంగాను, మరొక దానిని నియంత్రిత సమూహంగాను తీసుకొని ప్రయోగం చేస్తారు. రెండు సమహాలకు పూర్వ పరీక్ష నిర్వహిస్తారు. నియంత్రత సమూహంపై ఎటువంటి ప్రయోగ ప్రభావం లేకుండా చూస్తారు. ప్రయోగ సమూహంను ప్రయోగ స్థితికి గురి చేస్తారు. రెండు సమూహాలకు అంత్య పరీక్ష నిర్వహించి ఫలితాలను పోల్చి విశ్లేషిస్తారు. ఉదా: విద్యార్థి సాధనపై ఇంటర్‌నెట్ ప్రభావం

| నియంత్రణ సమూహం | ప్రయోగ సమూహం |
|---|---|
| గ్రూప్ - ఎ | గ్రూప్ - బి |
| పూర్వ పరీక్ష | పూర్వ పరీక్ష |
| సాధారణ పద్దతుల ద్వారా అభ్యసనం | ఇంటర్‌నెట్ వీడియోల ద్వారా అభ్యసనం |
| అంత్య పరీక్ష | అంత్య పరీక్ష |

**భ్రమణ సమూహాల నమూనా:**

ఈ నమూనాలో అన్ని విధాలుగా ఒకే రకంగా ఉన్న రెండు సమూహాలు పాల్గొంటాయి.

**స్టెప్-2**

ప్రయోగం రెండు అంచెలలో జరుగుతుంది. మొదటి అంచెలో ఒక సమూహం నియంత్రణ సమూహంగాను, రెండవ సమూహం ప్రయోగాత్మక సమూహంగాను పాల్గొంటాయి. ప్రయోక్త ఈ రెండు సమూహాల నుండి దత్తాంశ సేకరణ చేస్తారు. రెండవ అంచెలో ఇంతకు ముందు నియంత్ర స్థితికి లోనైన సమూహం ప్రయోగ సమూహంగా, ప్రయోగ స్థితికి లోనైన సమూహం నియంత్రత సమూహంగా వ్యవహరిస్తాయి.

అంటే ఈ నమూనాలో ప్రయోగంలో పాల్గొన్న రెండు సముహాలు నియంత్రణ స్థితికి తరువాత ప్రయోగ స్థితికి లోనవుతాయి. సేకరించిన దత్తాంశ ఫలితాలను విశ్లేషించి వాఖ్యానిస్తారు.

ప్రయోగము: విద్యార్థి చురుకుదనంపై గ్లూకోజ్ ప్రభావం:

| నియంత్రిత సమూహాము<br>గ్రూప్ - ఎ | ప్రయోగ సమూహాము<br>గ్రూప్ - బి |
|---|---|
| పూర్వ పరీక్ష | పూర్వ పరీక్ష |
| గ్లూకోజ్ తీసుకోకుండా అభ్యసన | గ్లూకోజ్ తీసుకొని అభ్యసన |
| అంత్య పరీక్ష - 1 | అంత్య పరీక్ష - 1 |

| నియంత్రిత సమూహాము | ప్రయోగ సమూహాము |
|---|---|
| గ్రూప్ – బి | గ్రూప్ – ఎ |
| పూర్వ పరీక్ష | పూర్వ పరీక్ష |
| గ్లూకోజ్ తీసుకోకుండా అభ్యసన | గ్లూకోజ్ తీసుకొని అభ్యసన |
| అంత్య పరీక్ష – 2 | అంత్య పరీక్ష – 2 |

**బహుళ సమూహాల నమూనా:**

ఈ నమూనాలో సాధారణంగా రెండుకన్నా ఎక్కువ సమూహాలు ఉంటాయి. వాటిలో ఒక సమూహం. నియంత్రిత సమూహంగాను, మిగిలినవి ప్రయోగ సమూహాలుగా వ్యవహరిసారు.

ఉదా: ఉద్యోగాలలో రిజర్వేషన్ పట్ల విద్యార్థుల వైఖరిపై వార్తా పత్రికల ప్రభావం

| నియంత్రి సమూహం | ప్రయోగ సమూహం 1 | ప్రయోగ సమూహం 2 |
|---|---|---|
| పూర్వ పరీక్ష | పూర్వ పరీక్ష | పూర్వ పరీక్ష |
| రిజర్వేషన్ల గురించి ప్రస్తావించని వార్తా పత్రికల పఠనం | రిజర్వేషన్లకు అనుకూలంగా వ్రాసిన వార్తా పత్రికల పఠనం | రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్రాసిన వార్తా పత్రికల పఠనం |
| అంత్య పరీక్ష | అంత్య పరీక్ష | అంత్య పరీక్ష |

ప్రయోక్త పై దత్తాంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి వ్యాఖ్యానం చేస్తారు.

**ప్రయోగ పద్ధతి ప్రయోజనాలు:**

- ఇది శాస్త్రీయ పద్ధతి
- విశ్వసనీయత ఎక్కువగా ఉంటుంది
- కార్యకారణ సంబంధాలు నెలకొల్పవచ్చు
- వస్తు నిష్టత ఎక్కువగా ఉంటుంది
- ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను పరీక్షించుకొని మెరుగుపరచుకోవచ్చు

**పరిమితులు:**

- జోక్యచరాలను అదుపు చేయటం చాలా కష్టతరమైన అంశం
- అన్ని రకాల ప్రవర్తనలను మనం ప్రయోగశాలలో ప్రవేశ పెట్టి పరిశీలింపలేము.
- కొన్ని ప్రయోగాలను జంతువులపై, పక్షులపై నిర్వహించి వాటని మానవ ప్రవర్తనకు అన్వయిస్తారు. ఇది ఎంతవరకు సమంజసమైనదో తెలుసుకోవాలి.
- ఈ పద్ధతిలో చాలా డబ్బు, సమయం అవసరం.

## 1.5.6 ప్రశ్నావళి:

మూర్తిమత్వ అంచనా పరీక్షలలో మిక్కిలి తరచుగా ఉపయోగించే పద్ధతి 'ప్రశ్నావళి'

గుడ్ మరియు హాట్ (1952) ప్రకారం "ప్రశ్నలలో రూపొందించిన పత్రాన్ని ప్రయోజ్యునిచే స్వయంగా పూర్తి చేయించటం ద్వారా సమాధానలు రాబట్టే సాధనమే ప్రశ్నావళి."

ప్రశ్నావళి ద్వారా అనేక అంశాలకు చెందిన ప్రశ్నలకు సమాధానాలను సేకరించి, విశ్లేషించడం ద్వారా మూర్తిమత్వాన్ని అంచనా వేస్తారు. సాధారణంగా ప్రతి ప్రశ్నకు ఎదురుగా అవును, చెప్పను, కాదు వంటి ప్రత్యామ్నాయాలు ఉంటాయి.

ప్రశ్నావళులు రెండు రకములు:

ఎ) నిర్ధారిత ప్రశ్నావళి

బి) స్వేచ్ఛాపూరిత ప్రశ్నావళి

నిర్ధారిత ప్రశ్నావళిలో ప్రశ్నకు ఎదురుగా ఇవ్వబడిన ప్రత్యామ్నాయాలలో ఒకటి తప్పని సరిగా ఎన్నుకోవాలి.

ఉదా: నీకు ఒంటరిగా పాఠశాలకు వెళ్ళడమంటే భయం వేస్తుందా? అవును / చెప్పలేను / కాదు

స్వేచ్ఛాపూరిత ప్రశ్నావళిలోల ప్రశ్నలకు సమాధానలు స్వంతంగా రాసేందుకు అవకాశం ఉంటుంది.

ఉదా: నాకు పాఠశాలంటే భయం. ఎందుకంటే .........

ప్రశ్నావళి ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మంది నుండి సమాధానాలు సేకరించవచ్చు. దీని నిర్వహణ సులువుగా ఉంటుంది. దూరంగా ఉన్నవారి నుండి పోస్టు ద్వారా, ఈ-మెయిల్ ద్వారా కూడా ప్రశ్నావళికి సమాధానాలు సేకరించవచ్చు. అయితే ప్రయోజ్యులు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయకుండా వదిలి వేస్తుంటారు. సమాధానాలలో వ్యక్తి నిష్ఠత ఉండే అవకాశం ఉంది. స్వేచ్ఛాపూరిత ప్రశ్నావళిలోని సమాధానాలను విశ్లేషించటం కొంచెం కష్టమైనపని.

ప్రశ్నావళులకు ఉదా: 16 పి.యఫ్ ప్రశ్నావళి (ఆర్.బి. కాటిల్)

## 1.5.7 వ్యక్తి చరిత్ర పద్ధతి:

ఒక వ్యక్తిలోని వివిధ ముఖ్యాంశాలను నిశితంగా లోతుగా పరిశీలించి నమోదు చేసి విశ్లేషించి వ్యాఖ్యానించడాన్ని 'వ్యక్తి చరిత్ర అధ్యయన పద్ధతి' అంటారు.

వ్యక్తి అధ్యయన పద్ధతిని చికిత్సా పద్ధతి అని కూడా అంటారు.

"సమస్యాపూరిత విద్యార్థికి సంబంధించి సమగ్ర విచారణ జరిపి, ఆ వ్యక్తి సమస్యను నివారించేందుకు ఉపయోగపడే పద్ధతే వ్యక్తి చరిత్ర పద్ధతి" అని 'బోని అండ్ హాలపిల్‌మాన్'లు పేర్కొన్నారు.

వ్యక్తి అధ్యయనంలో రెండు దశలుంటాయి.

1. సమస్య నిర్ధారణ దశ
2. సమస్య నివారణ దశ

1. సమస్య నిర్ధారణ దశ:

- వ్యక్తి సమస్యను గుర్తించడం
- సమస్యకు కారణాలు ఏమై ఉంటాయో పరికల్పనలు చేయటం

- సమస్యకు సంబంధించి విషయాన్ని అ వ్యక్తి డైరీలు, ఉత్తరాలు, ఇంటర్వ్యూలు, పాఠశాల రికార్డులు, ప్రగతి పత్రాలు, క్రమాభివృద్ధి పత్రాలు, సంఘటన రచనలు, మాపనలు, శోధికల ద్వారా సేకరించటం.
- సేకరించిన విషయాన్ని విశ్లేషణ పూర్వకంగా వ్యాఖ్యానించి పరికల్పనలను సరిచూసుకోవటం.

2. సమస్య నివారణ దశ:

- సమస్య స్వభావాన్ని బట్టి చికిత్స వల్ల కానీ, సూచనల వల్ల కాని, పరిస్థితుల మార్పుల వల్ల కానీ పరిష్కార మార్గాలు ఎన్నుకోవటం.
- సమస్య పరిష్కారానికి చేసిన నివారణోపాయాలు ఎంత వరకు సఫలమైనవో గమనించటం.
- వ్యక్తి ప్రవర్తనలో వచ్చిన సక్రమమైన మార్పులను గురించి అంతిమ అభిప్రాయాలు వ్యక్తపరచటం.
- పై అంశాలన్నింటితో సమగ్రమైన రిపోర్టును తయారు చేయటం వ్యక్తి సమగ్ర పరిశీలన క్రింద వస్తుంది. 3
- పాఠశాలకు సక్రమంగా హాజరు కాకపోవడం, దొంగతనం, దౌర్జన్యం, పాఠ్యాంశ అధ్యయనంలో వెనుకపడడం, వ్యాకులత, అమితంగా సిగ్గుపడటం, హఠం చేయడం మొదలైన ప్రవర్తనా సమస్యలున్న విద్యార్థులను వ్యక్తి చరిత్ర పద్ధతి ద్వారా అధ్యయనం చేయవలసి ఉంటుంది.

వ్యక్తి అధ్యయనంలో విద్యార్థికి సంబంధించి ఈ క్రింది విషయాలు సేకరించవలసి ఉంటుంది.

- విద్యార్థి వ్యక్తిగత సమాచారం
- తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల గురించి
- ఇరుగు, పొరుగు వారి గురించి
- సమ వయస్కులైన అతని స్నేహితుల గురించి
- ఇంటి భౌతిక సాంస్కృతిక పరిస్థితుల గురించి
- విద్యార్థి పాఠ్యాంశాలలో సాధన గురించి
- విద్యార్థి గురించి ఉపాధ్యాయుల నుంచి, సమ వయస్కుల నుంచి సేకరించి నమోదు చేసిన సమాచారం, మనోవైజ్ఞానిక పరీక్షల ద్వారా సేకరించిన దత్తాంశం
- సమస్య నిర్ధారణ
- నివారణ చర్యలు
- తుది ఫలితాలు

## 1.5.8 నిర్ధారణ మాపని: (Rating Scale)

నిర్ధారణ మాపనులు బాలల లక్షణాంశాలు తెలుసుకోవటానికి ఉపయోగపడతాయి. వ్యక్తులలో నాయకత్వం, భావోద్రేక సమతుల్యత, సహకార భావం, నమ్మకం మొదలైన లక్షణాంశాలను మాపనం చేయటానికి నిర్ధారణ మపనులు ఉపయోగిస్తారు.

నిర్ధారణ మా పనులలో లక్షణాంశాన్ని 5 లేదా 7 బిందువుల స్కేలు ఆధారంగా వ్యక్తి మూర్తిమత్వాన్ని అంచనా వేయటం జరుగుతుంది. ఈ బిందు మాపని మధ్యలో తటస్థ వర్ణన ఉంటుంది. దీనికి ఒక వైపు ధనాత్మక వర్ణనతో ఆరోహణ క్రమంలో, మరొకవైపు ఋణాత్మక వర్ణనతో అవరోహణ క్రమంలో బిందువులు వుంటాయి.

మూర్తిమత్వాన్ని అంచనా వేసేవారు లక్షణాంశాన్ని చదివి దానికి ఎదురుగా వున్న బిందువులలో వారికి వర్తించే దానిపై టిక్ (✓) పెట్టాలి.

ఉదాహరణ: నిశాంత్ 'నిజాయితీ'రుడు

| పూర్తిగా అంగీకరిస్తాను | అంగీకరిస్తాను | తటస్థం | అంగీకరించను | పూర్తిగా అంగీకరించను |
|---|---|---|---|---|

నిర్ధారణ మాపనిలో రెండు రకాలు ఉన్నాయి. అవి

1. స్వీయ నిర్ధారణ మాపని
2. ఇతరులు నిర్ధారణ చేయటం

స్వీయ నిర్ధారణ మాపనులు:

స్వీయ నిర్ధారణ మాపనులలో ప్రయోజ్యుడు స్వయంగా మాపనిలో లక్షణాంశానికి ఎదురుగా ఇచ్చిన ప్రత్యామ్నాయాలలో తనకు వర్తించే దానిని టిక్ (✓) చేయాల్సివుంటుంది.

ప్రయోజ్యులు నిజాయితీగా వ్యవహరిస్తే, స్వీయ నిర్ధారణ మాపనుల ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. స్వీయ నిర్ధారరణ మాపనులను నిరక్షరాస్యులకు, మానసిక రోగులకు, చిన్న పిల్లలను ఉపయోగించలేము.

ఇతరులు నిర్ధారణ చేయటం:

ఈ రకమైన నిర్ధారణ మాపనిలో ప్రయోజ్యుని మూర్తిమత్వాన్ని అంచనా వేసేందుకు, ఇతరులను (అనగా ప్రయోజ్యునిలో పరిచయం ఉన్నవారు లేదా ప్రయోజ్యుడు తెలిసినవారు) నిర్ధారణ చేయమని కోరుతారు. ఈ పద్ధతిలో లక్షణాంశాల స్థాయిని ప్రయోజ్యుడు కాకుండా ఇతరులు గుర్తిస్తారు కనుక వస్తు నిష్టత ఎక్కువగా వుంటుంది. అయితే ఈ రకమైన మాపనిని ఉపయోగించినప్పుడు పరివేశ ప్రభావం (హాలో ఎఫెక్ట్), ఔదార్య లోపం (జెనరాసిటీ ఎర్రర్), కేంద్ర స్థానపు లోనం ( ఎర్రర్ డ్యూ టూ సెంట్రల్ టెండెన్సీ) వంటి లోపాలు ఉండే అవకాశం ఉంటుంది.

దీనిని అధిగమించటానికి మూర్తిమత్వ నిర్ధారణ చేసేటప్పుడు ఒకరి కంటే ఎక్కువ మంది నుండి సమాచారాన్ని సేకరిస్తారు. అయితే, ఇతరులు ఎంత బాగా పరిశీలించిలనప్పటికీ ఒక వ్యక్తి అంతర్గత లక్షణాలను సంపూర్ణంగా తెలుసుకోవటం కష్టం.

మూర్తిమత్వాన్ని నిర్ధిష్టంగా మాపనం చెయ్యాలంటే స్వీయ నిర్ధారణ మాపని వలన వచ్చిన ఫలితాలను, ఇతరులు నిర్ధారించిన మాపని ఫలితాలకు సహ సంబంధం కనుక్కోవటం ద్వారా అంగీకరించటం లేదా తిరస్కరించడం చేయవచ్చు.

ది వైన్‌లాండ్ సోషల్ మెచ్యూరిటీ స్కేల్, దిఫెల్స్ పేరెంట్ బిహేవియర్ స్కేల్, విటెన్ బర్క్ సైకియాట్రిక్ రేటింగ్ స్కేల్ మొదలైన ప్రాచుర్యం గల నిర్ధారణ మాపనిలో కొన్ని.

**చర్యాత్మక పరిశోధన:**

నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను అన్వేషించే ప్రక్రియనే చర్యాత్మక పరిశోధన అని స్టీఫెన్.ఎమ్.కోరె(Stephen.M.Corey) పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు బాలలతో అభ్యసన ప్రక్రియలలో పాల్గొంటున్నప్పుడు వారు బోధనాభ్యసనాలలో ఎదురయ్యే సమస్యలకు ఉపాధ్యాయులే పరిష్కారా మార్గాలను వెతుక్కోవడానికి ఉపయోగపడే పద్ధతే చర్యాత్మక పద్ధతి. ఏ పరిష్కారాలు లేక ఆచరణలు మార్చితే మంచిది అనుకుంటారో వాటిని గురించి అన్వేషించి ప్రశ్నలను రూపొందించుకొని వారుఅనుకున్న మార్పులను ప్రయోగించి ఫలితాలను విశ్లేషించి సమస్యను పరిష్కరించుకొని క్రియాశీలమైన పరిశోధననే చర్యాత్మక పరిశోధన అంటారు.

స్టిఫెన్ కెమ్మిస్ (Stiffen Kemmis) అను శాస్త్రవేత్త చర్యాత్మక పరిశోధన గురించి ముఖ్యాంశాలను క్రింది విధంగా పేర్కొన్నాడు.

- ఉపాధ్యాయుడు తరగతిగదిలో పిల్లలకు బోధన – అభ్యసన సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎందుకు? ఎలా? ఎట్లా? ఏమి? ఎక్కడ? అని చర్చించుకొని వాటిపై పరిశోధన జరపాలని పేర్కొన్నాడు.

1. ప్రణాళిక (Plan): సమస్య పరిష్కారానికి ఒక ప్రణాళికను ఏర్పరుచుకోవాలి.
2. ఆచరణ(Act): ఏర్పరుచుకున్న ప్రణాళికను అమలు పరచాలి.
3. పరిశీలన (Observe): ప్రణాళికను అమలు చేస్తున్నప్పుడు జరిగే విషయాలను పరిశీలించాలి.
4. నమోదు (Record): పరిశీలించిన విషయాలను నమోదుచేసుకోవాలి.
5. విశ్లేషణతో వ్యాఖ్యానించడం(Reflect): నమోదుచేసుకున్న విషయాలను విశ్లేషించి వ్యాఖ్యానించాలి. సమస్య పరిష్కారం కాకపోతే
6. పున:ప్రణాళిక (Re-plan): సమస్య పరిష్కారానికి ఇంకొక ప్రణాళికను ఏర్పరుచుకోవాలి.
7. పున: ఆచరణ(Re-act): పున: ప్రణాళికను అమలు పరచాలి.
8. పున: పరిశీలన (Re-observe): పున: ప్రణాళిక అమలు చేస్తున్నప్పుడు జరిగే విషయాలను మరలా పరిశీలించాలి.
9. పున: నమోదు(Re-record): పరిశీలించిన విషయాలను మరలా నమోదుచేసుకోవాలి.
10. పున: విశ్లేషణ (Re-reflect): నమోదుచేసుకున్న విషయాలను విశ్లేషించి వ్యాఖ్యానించాలి.

సమస్య పూర్తిగా పరిష్కరించబడే వరకు పై క్రమాన్ని పునరావృతం చేసుకోవాలి.

(బొమ్మ)

## 1.5.9 దీర్ఘకాల (అను దైర్ఘ్య) మరియు పరిచ్ఛేద ఉపగమాలు:

పిల్లలు వికాసాన్ని పరిశీలించటానికి రెండు ముఖ్యమైన ఉపగమాలు ఉన్నాయి.

అవి 1) దీర్ఘకాల ఉపగమం/అధ్యాయనాలు (Longitudinal approach/Studies)

2) పరిచ్ఛేదన ఉపగమం/అధ్యయనాలు(Cross Sectional approach/Studies)

### ఎ) దీర్ఘకాల ఉపగమం/అధ్యాయనాలు (Longitudinal approach/Studies):

దీర్ఘకాల ఉపగమంలో ప్రయోక్త తాను ప్రతిచయనంగా ఎన్నుకున్న ప్రయోజ్యులను కొంతకాలంపాటు అనేకసార్లు, వేర్వేరు వయస్సులలో, సన్నివేశాలలో గమనించి వారి ప్రవర్తనలో మార్పులను నమోదు చేస్తారు. దీని కాల వ్యవధి కొన్ని నెలల నుండి అనేక సంవత్సరాలు లేదా జీవిత పర్యంతం ఉండవచ్చు. ఈ పద్ధతిలో దత్తాంశ సేకరణకు ఎక్కువ కాలం పడుతుంది.

షిర్లే 1931లో పిల్లల చలన, ప్రజ్ఞా, మూర్తిమత్వ వికాసంలను అంచనా వేయుటకు దీర్ఘకాల ఉపగమంను అనుసరించారు. షిర్లే తన అధ్యయనంలో 25 మంది పిల్లలను వారు పుట్టినప్పటి నుండి 2 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు అధ్యనం చేసి ఛాలక (చలన) వికాసంలోని క్రమాన్ని గుర్తించారు.

యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ వారు 1928లో చేసిన 'బర్కిలీ పెరుగుదల అధ్యయనం' అనేది చాలా ప్రాచుర్యం పొందిన దీర్ఘకాల అధ్యయనాలలో ఒకటి. ఈ అధ్యయనంలో 61 మంది పిల్లలను కొన్ని దశాబ్దాల పాటు పరిశీలించి తమ నివేదికను సమర్పించారు.

**ఉపయోగాలు:**

- ఒకే ప్రతిచయనాన్ని దీర్ఘకాలం పరిశీలించటం వలన వారి ప్రస్తుత ప్రవర్తనకు, గత ప్రవర్తనకు గల సంబంధం తెలుసుకోవచ్చు.
- దీర్ఘకాల పరిశీలన వలన వారిలో గల సారూప్యాలు, వైవిధ్యాలు, అందుకు దారి తీసిన పరిస్థితులు తెలుసుకోవచ్చు.
- వివిధ సందర్భాలలో వారిని పరిశీలించటం ద్వారా వారి లక్షణాంశాలను దాదాపు ఖచ్చితంగా అంచనా వేసే అవకాశం ఉంది.
- ప్రతి పిల్లవాని వికాసాన్ని విశ్లేషించవచ్చు.
- పిల్లల ప్రవర్తనపై సంస్కృతి మరియు పరిసరాలలో మార్పుల యొక్క ప్రభావాన్ని అంచనా వేసే అవకాశం ఉంటుంది.

**పరిమితులు:**

- ఈ పద్ధతి దీర్ఘకాలం జరుగుతుంది కనుక ప్రయోజ్యులు వేరే ప్రదేశాలకు వెళ్లడం, చనిపోవటం వలన దత్తాంశ సేకరణకు ఆటంకం కలుగుతుంది.
- ఒకే పరిశోధకుడు చివరి వరకు కొనసాగించటం ఖర్చుతో కూడుకున్న పని. సాధ్యపడకపోవచ్చు కూడా.

**2) పరిచ్ఛేదన ఉపగమం/అధ్యయనాలు(Cross Sectional approach/Studies)**

ఈ ఉపగమంలో వేర్వేరు వయస్సులు గల సమూహాలకు చెందిన పిల్లలను ఒకే సమయంలో పరిశీలించి దత్తాంశాలను పోల్చటం జరుగుతుంది. కనుక ఈ ఉపగమంను అనుసరిండం వల్ల పరిశోధనకు తక్కువ కాలం పడుతుంది. దీని వలన ప్రతిచయనంగా ఎన్నుకున్న సభ్యులను కోల్పోవడం ఉండదు. శిశు వికాసానికి చెందిన చాలా అద్యయనాలు ఈ ఉపగమనం ననుసరించే జరిగాయి.

ఉదాహరణకు ఈ ఉపగమంలో 3 నుంచి 6 సం.ల వయస్సు గల పిల్ల నైతిక వికాసం వివిధ దశలలో ఎలా ఉంటుందో తెల్సుకొనుటకు 3,4,5,6 సంవత్సరాల వయస్సులు గల పిల్లలను వయో పరిమితి ఆధారంగా సమూహాలుగా చేసి వారిని పరిశీలించి, విశ్లేషించి వాటి ఆధారంగా నివేదిక సమర్పించాలి.

**ఉపయోగాలు:**

- తక్కువ కాలంలో పూర్తవుతుంది.
- ఎన్నుకున్న ప్రయోజ్యులను కోల్పోవడం ఉండదు.
- తక్కువ సమయంలో ఎక్కువ విషయాలు సేకరించవచ్చు
- దీర్ఘకాల ఉపగమంతో పోలిస్తే ఖర్చు తక్కువ
- ఒక పరిశోధకుడే దత్తాంశ సేకరణ చేయవచ్చు.

**పరిమితులు:**

- వివిధ వయస్సులు గల వేర్వేరు సమూహాలను పరిశీలించటం వలన పరిశీలనలు అందరికి వర్తిస్తాయని నిశ్చయంగా చెప్పలేము.
- కాలంతోపాటు వచ్చే పరిసర లేదా సాంస్కృతిక కారకాలను పరిగణించడం ఉండదు.

***ముఖ్యాంశాలు:***

- వ్యక్తి జీవితంలో బాల్యదశ చాలా ప్రధానమైనది. పుట్టినప్పటి నుంకి కౌమారదశ కాలాన్ని సాధారణంగా బాల్యదశగా వ్యవహరిస్తారు.
- అనువంశికత, పరిసరాలు, పెంపక విధానాలు మెలదలైనవి బాల్యదశలో వివిధ రకాల సామ్యాలకు, వైవిధ్యాలకు దారితీస్తాయి.
- పిల్లలు బాల్యదశలో పొందే అనుభవాలను బట్టి వారి మూర్తిమత్వం రూపొందుతుంది. ఫలితంగా బహుళ బాల్యదశలు మనకు కనిపిస్తాయి.
- ప్రపంచీకరణ, బాలకార్మిక వ్యవస్థ, బాలల పీడనం మొదలైనవి బాల్యదశను ప్రభావితం చేస్తున్నాయి.
- సామాజికీకరణ అనేది పిల్లలు సమాజంలోని సభ్యులుగా పాల్గొనడానికి కావలసిన సామర్థ్యాలను కలుగజేసే ప్రక్రియ
- కుటుంబ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు బాలల సామాజికీకరణను ప్రభావితం చేస్తాయి.

- కుటుంబంలోని పిల్లలు, పెద్దల సంబంధాలు, పిల్లల పెంపక శైలలు బాల్యదశ నిర్మితిలో, సామాజికీకరణలో కీలక పాత్రను పోషిస్తాయి.
- ఉపాధ్యాయులు బాలల ప్రవర్తనను అవగాహన చేసుకొనేందుకు, దత్తాంశ సేకరణకు వివిధ పద్ధతులు, మెళకువలు అనుసరిస్తారు. పరిశీలన, పరిపృచ్ఛ, సంఘటన రచనాత్మక పద్ధతి, పర్యావలోచన పత్రికలు, వర్ణనాలు, ప్రయోగపద్ధతి మొదలైనవి వీటిలో కొన్ని
- పిల్లల వికాసాన్ని పరిశీలించుటకు దీర్ఘకాల ఉపగమం పరిచ్ఛేద ఉపగమాలనే రెండు ముఖ్యమైన ఉపగమాలు.

## స్వీయ మూల్యాంకనం

1) భారతీయ నేపథ్యంలో బహుళ బాల్య దశల నిర్మితి గురించి వివరింపుము.

2) సాంఘికీకరణలో సాంఘిక, ఆర్థిక మరియు సాంస్కృతిక బేధాలు గురించి చర్చించుము.

3) బాలల సాంఘికీకరణపై పాఠశాల ప్రభావాన్ని వివరించుము.

4) పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు అనుసరించే వివిధ శైలులును గూర్చి వివరింపుము.

5) బాలల అధ్యయనంలో దీర్ఘకాల మరియు పరిచ్ఛేధ ఉపగమాలను గూర్చి వ్రాసి వాటి ప్రయోజనాలను, పరిమితులను తెల్పుము.

6) ప్రయోగ పద్ధతిని గూర్చి ఉదాహరణ సహితముగా వివరించుము.

7) ఈ క్రింది వానిని క్లుప్తంగా వివరించుము.

ఎ) సహజ పరిశీలన బి) పరిపృచ్ఛ సి) పర్యాలోచక పత్రికలు

8) వ్యక్తి చరిత్ర పద్ధతి అనగానేమి? బాలల అధ్యయనంలో దీని ప్రాధాన్యత వివరించుము.

9) నిర్ధారణ మాపనులకు ఉదాహరణలిమ్ము.

10) బాల్యదశ అనగానేమి?

11) ప్రపంచీకరణ నేపథ్యంలో బాల్యదశ నిర్మితిని గూర్చి క్లుప్తంగా వ్రాయుము.

12) బాల కార్మికులు అని ఎవరిని అంటారు?

13) "ఉపాధ్యాయులకు, పిల్లలకు మధ్య గల సంబంధాలు సాంఘికీకరణపై ప్రభావం చూపుతాయి" చర్చించుము.

14) పేదరికం నేపథ్యంలో బాల్యదశ నిర్మాణము గూర్చి వ్రాయుము.

15) పిగ్మేలియన్ ఫలితం అనగానేమి?

16) ప్రయోగ పద్ధతిలోని చరాలకు ఉదాహరణలిమ్ము.

17) బాలల అధ్యయన పితామహుడు ..........................

18) పాఠశాల సంస్కృతి భావనను 'ది సోషియాలజీ ఆఫ్ టీచింగ్'లో ప్రస్తావించిన వారు .....

19) ఈ క్రింది వాటిలో బాగా విజయవంతమైన పెంపకశైలిగా గుర్తించబడింది ( )

(1) అధీకృత రకం (2) నిరంకుశ రకం (3) అనుమతించే రకం (4) జోక్యరహిత రకం

20) 'పిగ్మాలియన్ ఇన్ క్లాస్ రూమ్' రచయితలు ( )

(1) రోసెన్‌థాల్, జాకబ్ సన్ (2) విలియం సన్, డార్లీ

(3) మెకాబై మరియు మెకాబై (4) ఫ్రాయిడ్, ఎరిక్ ఎరిక్ సన్

**ప్రాజెక్టు పని**

1) మీరు SEP సందర్భంగా సందర్శించే పాఠశాలలోని విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రుల నుండి సమాచారం సేకరించి పిల్లల పెంపక శైలులపై నివేదిక తయారుచేయండి.

2) ఏవేని 5 ఉమ్మడి కుటుంబాలను, 5 వ్యష్టి కుటుంబాలను పరిశీలించి వారి పిల్లల్లో గల సామ్యాలను, వైవిధ్యాలను అందుకు కారణమైన పరిస్థితులను విశ్లేషించి నివేదిక తయారు చేయండి.

3) మీరు SEP సందర్భంగా సందర్శించి పాఠశాలలోని 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు గల పిల్లల భౌతిక వికాసాలను పరిశీలించి, నివేదిక తయారు చేయుము.

4) తరగతి గదిలో, బాగా వెనుకబడిన విద్యార్థి యొక్క సమగ్ర సమాచారం సేకరించి, వెనుకబాటు తనానికి గల కారణాలు, పరిష్కారాలను సూచించండి.

## Bibliography/References

Baker J Grant, Mor Lock, 2008, The Teacher Student relationship as a developmental context for children with internationalizing or externalizing behaviour problems, School Psychology, Quarterly

Bodhana, AhyasanaManovignana Sastram,2014, B. Ed, Telugu Academy, Hyderabad

Dr Naidu R.V., 1993, BaalaAdhyapanasastram, Telugu Academy, Hyderabad
Kent D Peterson & Deal T, 1998, How the leaders influence culture of schools, Educational leadership. September 1998 | Volume 56 | Number 1
Kent D Peterson & Deal T, 2003, The Shaping school culture, Field Book, Jossey-Bass Publications

Kuppuswamy B, 1984, A text book of Child Behaviour and Development, 4th Edition, Vani Educational Books, New Delhi.

Laura E. Berk, 2013, PHI Learning Private Limited, Delhi

Maccoby, E. E., &Maccoby, N. (1954). The interview: A tool of
social science.

Mangal S K, 2012, Advanced Educational Psychology,
PHI Learning Pvt. Ltd., New Delhi.

In G. Lindzey (Ed.), Handbook of social psychology: Vol. 1.
Theory and method (pp. 449-487). Readings, MA: Addison-Wesley.

Prof.Padmanabhaiah et al, 2005, VidyaAdhaaralu (B.Ed), Telugu Academy, Hyderabad

RadkeM, 1946,The relation of parental authority to children's Behaviour and attitude, University of Minnesota Child welfare monograph, No. 22.

Rosenthal R, Jacob Soul (1968), Pygmalion in the class room, Holt, Rine Hart and Winston, New York

Satyanandam BD, 1979, VidyaManovygnanikaAadharalu, Telugu Academy, Hyderabad

Skinner, 1964, Education is what survives when what has been learned and forgotten, New Scientist.

Steven Zemelman, Daniels HS and Arthur Hyde, 1991, Best Practices-
Bringing standards to life in American Class rooms Heinemann, Portsmouth, NH

Waller W W, 1932, The Sociology of Teaching, Wiley

Wallin, P. and Riley, R. P. (1950). Reactions of mothers to pregnancy and adjustment of offspring in infancy. Amer. J, Orthopsychiatry

witmer h and Kotinsky1972, personality in making, harper & row, New York

Young P.V., 2003, Scientific Social Surveys and Research, 4th edition, PHI learning, New Delhi

www.ascd.org/ASCD/pdf/journals/ed_lead/el199809_peterson.pdf

www.childhelp.org/child-abuse

https://www.teachervision.com/writing/letters-and-journals/48544.html

data.unicef.org/child-protection/child_labour.html

# 2 వికాస దృక్పథాలు

## 2.0 పరిచయం (Introduction):

ఈ సృష్టిలో ఏ జీవి అయినా పుట్టినప్పటి నుంచి ఎన్నో మార్పులు చెందుతూ అభివృద్ధి చెందడం అనేది ప్రకృతి సహజం. ఉదాహరణకు మనిషిని తీసుకుంటే పుట్టినప్పుడు మనుగడకు పూర్తిగా ఇతరులపై ఆధారపడే పసికందు ప్రతిరోజూ కొత్త మార్పులు చెందుతూ కొంత కాలానికి స్వయంగా, స్వతంత్రంగా జీవించగల వయోజనుడిగా ఎదుగుతాడు. ఈ మార్పులనే మనం పెరుగుదల లేదా వికాసం అని అంటాం. తల్లి గర్భంలో ఫలదీకరించిన నాటి నుంచి పూర్తిస్థాయి వయోజనులుగా ఎదిగే ప్రక్రియనే మనం పెరుగుదల, వికాసం అని పేర్కొనవచ్చును. పెరుగుదల, వికాసాలతోపాటు ఇదే ప్రక్రియలో ముఖ్యపాత్ర వహించే ఇంకొ అంశం పరిపక్వత.

## 2.1 లక్ష్యాలు (Objectives):

- వికాసము – పరిచయము, పెరుగుదల, వికాసము మరియు పరిణతి యొక్క భావనలను తెలుసుకొంటారు. వికాసానికి సంబంధించిన అంశాలను మరియు వికాసముపై అనువంశికత, పరిసరాల యొక్క ప్రభావాన్ని తదితర అంశాలను అవగాహన చేసుకొంటారు.
- శారీరక – చలన వికాసమం, పెరుగుదల – పరిపక్వత అంశాలను గురించి తెలుసుకొంటారు.
- సాంఘిక వికాసం – సాంఘిక వికాసంలో కుటుంబం, సమవయస్కులు, పాఠశాల, ప్రసార సాధనాలు మరియు సంస్కృతుల యొక్క పాత్రలను తెలుసుకొంటారు. అంతేకాకుండా పోటీ – సహకారం, క్రమశిక్షణ, బహుమతి – శిక్ష, సంఘర్షణ, దౌర్జన్యం మరియు ఏడ్పించడం మొదలగు అంశాల ప్రభావాన్ని తెలుసుకుంటారు.
- సాంఘీకీకరణ భావన మరియు ప్రక్రియలను తెలుసుకొంటారు. సాంఘీకీకరణంలో సాంఘిక, ఆర్థిక మరియు సాంస్కృతిక అంశాల ప్రాముఖ్యతను, సమవయస్కులు మరియు స్నేహితులతో సంబంధాలు, జెండర్, పోటీ – సహకారం, సంఘర్షణ దౌర్జన్యం, ఏడ్పించడం మొ॥గు అంశాల గురించి అవగాహన చేసుకొంటారు.
- ఉద్వేగ వికాసము – ఉద్వేగాని అర్థం, లక్షణాలు, ఉద్వేగ పరిపక్వత – ఉద్వేగ వికాసంలో కుటుంబ, పాఠశాల యొక్క పాత్రలను గురించి తెలుసుకుంటారు.
- భాషా వికాసము – భాషణము మరియు భాషా వికాస దృక్పథాలను స్కిన్నర్, బాండురా మరియు చామ్స్కి మొ॥గు శాస్త్రవేత్తల ప్రకారం తెలుసుకొంటారు.
- నైతిక వికాసమ – కోల్‌బర్గ్ నైతిక వికాస సిద్ధాంతమును – నైతిక వివేచనంలో సాంస్కృతిక వైవిధ్యాలను అవగాహన చేసుకొంటారు.

- ఆటలు మరియు వికాసము క్రీడల అర్థం మరియు విధులు వివిధ రకాల వికాంశాలతో వాటి సంబంధాన్ని – క్రీడలు – అందలిరకాలు, క్రీడలు – సమూహ గతిశీలత, క్రీడలలో నియమాలు మరియు పిల్లలు తమ విభేదాల పరిష్కారానికి ఏ విధంగా దోహదపడతాయో తెలుసుకొంటారు.
- స్వీయ చేనం, స్వీయ వర్ణన, ఆత్మభావన, ఆత్మగౌరవం, సామాజిక పోలిక, అంతర్గతీ కరణం, స్వీయ నియంత్రణ మొ॥ అంశాలను అర్థం చేసుకొంటారు.
- సంస్కృతి మరియు లైంగికాభివృద్ధి గురించి అవగాహన చేసుకొంటారు.

## 2.2 వికాసము – పరిచయం (Development - Introduction):

......................................

### 2.2.1 పెరుగుదల వికాసం, పరిపక్వత – భావన (Concept of Growth & Development):

పెరుగుదల, వికాసం అనే ఈ రెండు పదాలు ఒకదానికి బదులు ఒకటి వాడటం అనేది సర్వసాధారణం, అయితే సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ రెండింటి మధ్య బేధం వుంది. పెరుగుదల పరిమాణాత్మకమైనది. వికాసం గుణాత్మకమైనది. ఉదాహరణకు మనకు బాహ్యంగా కనిపించే బరువు, ఎత్తు వంటి పరిమాణాత్మకమైన మార్పులను పెరుగుదల అని; నడవడం, రాయడం లాంటి గుణాత్మకమైన మార్పులను వికాసం అని అంటాం. అయితే పరిమాణాత్మకమైన మార్పులు జరుగకుండా గుణాత్మకమైన మార్పులు సంభవించవు. కాబట్టి పెరుగుదలను వికాసంలో ఒక భాగంగా పరిగణించవచ్చు.

'వికాసం అంటే శరీర ఆకారాలను(Structures), శరీర అవయువాల యొక్క ప్రకార్యాలను(Functions)సమైక్యం చేసి విశదపరిచే క్లిష్టప్రక్రియే'. అని అండర్సన్ (Anderson) పేర్కొన్నాడు.

'జీవ సంబంధిత పరిసరాల ప్రభావం వల్ల జీవి యొక్క సంరచనలలో, ఆలోచనలలో, ప్రవర్తనలలోను మార్పు రావడమే వికాసము' అని క్రైగ్(Craig) అభిప్రాయపడ్డాడు.

పెరుగుదల, వికాసం మధ్య భేదాలను ఈ కింది పట్టికలో చూడవచ్చు.

| పెరుగుదల | వికాసం |
|---|---|
| 1. పెరుగుదల పరిమాణాత్మకమైనది. ఎత్తు, బరువు, పొడవు వంటి వాటిలో మార్పును సూచిస్తుంది. | 1. వికాసం గుణాత్మకమైనది. ఇది పరిమాణాత్మక మార్పులతోపాటు వాటివల్ల సంభవించే కార్యాత్మక మార్పులను సూచిస్తుంది.<br>ఉదా: ఆరునెలల వయస్సులో నడవడం చేతకాని శిశువు ఏడాది వచ్చేసరికి కాళ్ళ కండరాలు పెరిగి పరిమాణాత్మకంగా మార్పు చెందినడవడం ప్రారంభిస్తుంది. |
| 2. పెరుగుదల వల్ల వచ్చే మార్పులను ప్రత్యక్షంగా కొలవ వచ్చు. | 2. వికాసం ఒక సంకీర్ణప్రక్రియ, దానిని కొలవడం కష్టం, వికాసం వల్ల కలిగే మార్పు కొలవడానికి వివిధ రకాల పరీక్షలను, పరికరాలను పద్ధతులను ఉపయోగించాలి. |
| 3. పెరుగుదల వికాసంలో ఒక భాగం | 3. వికాసం విస్తృతమైనది. పెరుగుదల దానిలో ఒక భాగం. |

| | |
|---|---|
| 4. పెరుగుదల ఒక వయస్సు దగ్గర ఆగిపోతుంది. | 4. వికాసం కార్యాత్మకం అయినందు వల్ల అది నిరంతరం కొనసాగే ప్రక్రియ. |
| 5. పెరుగుదల అనే పదాన్ని కొన్ని అంశాలలో అంటే శారీరక మార్పులకు మాత్రమే వాడతాం. | 5. వికాసం వివిధ అంశాలు అంటే శారీరక, సాంఘిక, నైతిక మొదలైన మార్పులను సూచించడానికి వాడతాం. |

**పరిణతి/పరిపక్వత (Maturity) :**

జన్మతః వ్యక్తిలో వున్న సహజ సామర్థ్యాలు వయసుతోపాటు క్రమంగా వికసించడాన్నే పరిణతి అంటారు. ఇది ఒక క్రమ పద్ధతిలో జరుగుతుంది. అభ్యసనం వల్ల వచ్చే మార్పులు పరిణతి కాకపోయినా ఏ చర్యను అభ్యసించాలన్న దానికి అవసరమయ్యే పరిణతి ముఖ్యకారకం. ఉదా: శైశవదశలో తల నికడగా నిలబెట్టడానికి, పాకడానికి అవసరమయ్యే పరిణితి లేనిదే ఆ చర్యలు సాధ్యం కావు. ప్రత్యేక శిక్షణ ఏ మాత్రం అవసరం లేకుండనే అంతర్గతంగా జరిగే గుణాత్మక స్వభావం కలిగిన చర్యగా పరిణతిని చెప్పవచ్చును. కాబట్టి వికాసం లాగానే పరిణతి కూడా ఒక గుణాత్మక ప్రక్రయ.

'పరిపక్వత అనేది జీవి యొక్క జీవితవలయంలో జన్యువుల యొక్క ప్రభావంతో కార్యక్రమయుతంగా పనిచేసే ప్రక్రియనే పరిపక్వత అని గెస్సల్(Gessel) పేర్కొన్నాడు.

'పరిపక్వత జీవి జన్యు పరిష్కాన్ని (GenePotential)తెలుపుతుందని, ముందుగా నిర్ణయించబడిన ప్రణాళిక బద్ధమైన మార్పులు జరుగుతాయని క్రైగ్(Craig) పేర్కొన్నాడు.

వికాసం = f (పరిపక్వత x అభ్యసనం)

## 2.2.2 బహుళ రూపాలలో వికాసము (Development as multidevelopment)

వికాసం కింది రూపాల్లో జరుగుతుంది.

1. భౌతిక వికాసం 2. మానసిక వికాసం 3. ఉద్వేగ వికాసం

4. సాంఘిక వికాసం 5. నైతిక వికాసం 6. భాషా వికాసం

**1. భౌతిక వికాసం (Physical Development) :**

భౌతిక వికాసంలో జ్ఞానేంద్రియ వికాసం, నాడీవ్యవస్థ, శరీర అవయవాల్లో జరిగే మార్పులు, చలన వికాసం మొదలైనవి కలిసి ఉంటాయి. శిశువు పుట్టినపుడు తన పరిమాణం చాలా పెద్దదిగా ఉంటుంది. క్రమేణా శరీరానుపాతంలో (Body Proportion) మార్పులు వస్తాయి. ఛాలక కౌశలాలు (Motor Skills) అనేవి క్రమేణా అభివృద్ధి చెందుతాయి. దీని వల్ల శిశువు వెల్లకిలా పడుకోవడం నుండి చివరకు నడవడం పరిగెత్తడం వరకు కొనసాగి, ఆ తర్వాత 3సం.లకు తనకు తాను మెట్లెక్కడం. దిగడం చేసే స్థాయికి భౌతిక వికాసం కొనసాగుతుంది.

**2. మానసిక వికాసం (Mental Development) :**

మానసిక వికాసంలో భాషా వికాసం, ప్రజ్ఞ (Intelligance), చింతనం(Thinking), అవధానం(Attution), సమస్యా పరిష్కారం (Problem Solving), వివేచనం (Reasoning), తార్కిక ఆలోచన (Logical thinking) మొదలైనవి అంతర్లీనంగా ఉంటాయి.

ప్రజ్ఞా వికాసం శారీరక వికాసంపై ఆధారపడి ఉండును. ప్రజ్ఞ అనేది పుట్టినపుడే నిర్ణయమై ఉంటుంది. వయస్సుతో పాటు ప్రజ్ఞా వికాసం కూడా పెరుగుతూ ఉంటుంది. ప్రజ్ఞాలబ్ధి(IQ) ద్వారా దీనిని మాపనం చేస్తారు.

**3. ఉద్వేగ వికాసం (Emotional Development) :**

శారీరక వికాసంతో పాటు క్రమేణా ఉద్వేగ వికాసం కూడా అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఉద్వేగం అంటే కూడా జీవి శరీరం మనస్సు చలించే స్థితి. (Emotion is the sturred up state of the organism) ఉద్వేగ వికాసం పై బ్రిడ్జెస్ (Briages) అనే శాస్త్రవేత్త అనేక పరిశోధనలు చేశారు. శిశువులో మొట్టమొదటి భావోద్రేకం ఉత్తేజం (Excitement), 3 నెలల వయస్సులో ఉత్తేజంతో పాటు విచారం (Distress), ఆహ్లాదం (Delight) ఏర్పడతాయి. 6 నెలల వయస్సులో నుండి విచారం, కోపం, విసుగు, భయం ఏర్పడతాయి. 1సంవత్సరం వయస్సు వచ్చేటప్పటికి అసూయ ఏర్పడుతుంది. ఆహ్లాదం ఇంకా విస్తృతి చెంది ఉప్పొంగడం వాత్సల్యం అనేది ఉద్వేగాలు ఏర్పడతాయి.

**4. సాంఘిక వికాసం (Social Development) :**

మానవుడు సంఘజీవి. పుట్టినప్పటి నుండి శిశువు తన చుట్టూ వున్న వ్యక్తులతో పరిసరాలతో సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ప్రయత్నిస్తుంటాడి. మొదట శిశువులో ఉన్న అసాంఘికమైన పరిస్థితుల నుండి క్రమంగా సాంఘికీకరణకు చేరుకుంటాడి. ఈ సాంఘికీకరణలో తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల, ఇరుగుపొరుగు, సమవయస్కుల ప్రభావం శిశువుపై అధికంగా ఉంటుంది. పాఠశాల పూర్వపు శిశువు (Pre School Child)లో ఒంటరి ఆటలపై (ఏకాంతర క్రీడ) ఆసక్తి ఉంటుంది. 2సం॥ తర్వాత సమాంతర క్రీడలలో (Parallel Play) ఇతర వ్యక్తులతో కలిసి ఆడుకోవడం జరుగును. 3, 4సం॥ వయస్సు వచ్చే నాటికి సాంఘిక క్రీడలలో జట్టుగా ఏర్పడి సాంఘిక క్రీడలలో (Social Play) పాల్గొని, సహకార క్రీడ ద్వారా కలిగే ప్రయోజనాలు తెలుసుకొని సాంఘికీకరణం చెందుతాడు.

**5. నైతిక వికాసం (Moral Development) :**

చిన్న పిల్లల్లో అంతరాత్మ (Conscvence) ఉండదు. వారికి నైతిక విలువలపై సరైన అవగాహన ఉండదు. అందువల్ల నైతిక విలువలపై సరైన అవగాహన ఉండదు. అందువల్ల నైతిక ప్రమాణాలను అనుసరించరు. కాలక్రమేణా ఈ నైతిక విలువలు కుటుంబంలోని నాన్నమ్మ, అమ్మమ్మ, తాతయ్యల నుండి నీతికథల ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అనుయాయులు నుండి గ్రహిస్తారు.

పిల్లల నైతిక ప్రవర్తనను తల్లిదండ్రులు మరియు పెద్దలు సమర్థించినపుడు, వనైతిక ప్రవర్తన విషయంల మందలించినపుడు శిశువు నైతిక ప్రవర్తన ప్రాధాన్యత తెలుసుకొని అనుసరిస్తాడు.

**6. భాషా వికాసం (Language Development) :**

శిశువులో శారీరక, మానసిక వికాసాలతో పాటు భాషా వికాసం క్రమంగా అబివృద్ధి చెందుతుంది. భాషా వికాసంలో నాలుగు దశలు కలవు.

**ఎ) ప్రాగ్భాష దశ / పూర్వ భాష దశ (**Pre. Language Stage**):** శిశువు తనలోని ఉత్తేజం (Excitement) వలన తనకు ఇష్టమైన రీతిలో శబ్దాలు చేస్తాడు. ఈ సమయంలో శిశువుకు భాష తెలియదు.

**బి) ముద్దు పలుకుల దశ (**Babling Stage**):** శిశువులో 4 – 12 నెలల మధ్య ముద్దు పులుకల దశ కనిపిస్తుంది. ఈ దశలో తన తల్లిదండ్రులు, ఇతర వ్యక్తులను గమనించి కొన్ని శబ్ధాలను చేస్తాడు. వీటికి ఎలాంటి అర్థం ఉండదు.

**సి) శబ్ధానుకరణ దశ (**Sound Imitation Stage**):** ఏడాది నుంచి ఏడాదిన్నర వరకు శిశువులో భాషాభివృద్ధి జరగడం వలన అనుకరణ, నిబంధనంల ద్వారా పెద్దలు, ఇతరులు చేసిన శబ్ధాలను అనుకరిస్తారు.

**డి) శబ్ధ గ్రాహ్యక దశ ():** 1 1/2 సం॥ నుండి 10/12 సం॥ వరకు శిశువు సమాజంలోని వివిధ వ్యక్తుల నుండి శబ్ధాలను గ్రహించి. వాటికి ప్రతిస్పందించడం చేస్తాడు. దీని వల్ల శిశువులో భాషా వికాసం జరిగి సందర్భానుసారంగా పదజాలాన్ని వినియోగిస్తాడు. బాలుర కంటే బాలికలలో భాషావికాసం త్వరగా జరుగును.

**౨.౨.౩ జీవనపర్యంత వికాసం (Stage of Verbal Comprehension)**

పుట్టిన ప్రతీ జీవి కాలంతోపాటు పెరుగుతూ వికాసం చెందడం అనేది ప్రకృతి సహజం. అయితే ఒకే జాతికి చెందిన అన్ని జీవుల పెరుగుదల, వికాసాల వేగంలో స్పష్టమైన తేడాలను గమనించవచ్చు. ఉదాహరణకు కొంతమంది పిల్లలు పదినెలల వయసులో నడవడం ప్రారంభిస్తే మరి కొందరు ఒక సంవత్సర కాలం వరకు నడవకపోవచ్చు. అయితే ఇక్కడ ఒక విశిష్ఠత ఏమంటే ఒకే జాతికి చెందిన అన్ని జీవుల పెరుగుదల, వికాసంలో కొన్ని నిర్దిష్టమైన సూత్రాలను మనం గమనించవచ్చు.

**1. వికాసం అవిచ్ఛిన్నంగా సాగుతుంది:** వికాసం నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఒక సూక్ష్మ కణంగా మొదలయ్యే మనిషి జీవితం కాలంతోపాటు అనేక మార్పులు చెందుతూ అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది.

**2. వికాసం ఒక కచ్చితమైన నమూనాను అవలంబిస్తుంది:** తిన్నగా క్రమబద్ధంగా సాగుతుంది. ఒక జాతికి చెందిన వివిధ జీవుల వికాసం వేగంలో తేడాలున్నప్పటికీ వాటన్నింటిలో అది ఒకే కచ్చితమైన నమూనాగా సాగుతుంది. ఉదాహరణకు మనిషిలో భాషా వికాసం మొదట ముద్దు పలుకులతో ప్రారంభమై క్రమంగా సంభాషణలకు తరువాత ఇంకా సంక్లిష్టమైన భాషా నైపుణ్య అభివృద్ధి వైపు సాగుతుంది.

**3. పెరుగుదల వికాసం అన్ని దశలలో ఒకే విధంగా సాగదు:** వికాసం నిరంతరంగా కొనసాగినప్పటికీ బాల్యంలో జరిగే మార్పులతో పోలిస్తే నవజాత శిశువులో వికాసం ఎక్కువ వేగవంతంగా సాగుతుంది.

**4. వికాసంలో వైయక్తిక భేదాలు ఉంటాయి:** వికాసం ఒక నమూనాలో సాగినప్పటికీ వికాసం అందరిలో ఒకే వేగంతో, గుణాత్మకతతో సాగదు. ఉదాహరణకు ఒక శిశువు అయిదు నెలల వయస్సులో పాకడం ప్రారంభిస్తే వేరొక శిశు వు ఆరు నెలలకు పాకవచ్చు. ఇదేవిధమైన భేదాలు మనం మానసిక, సాంఘిక, ఇతర వికాసాలలో కూడా గమనించవచ్చు.

**5. వికాసం ఒక కచ్చితమైన దిశగా సాగుతుంది:** దీనిలో రెండు ఉప సూత్రాలున్నాయి. మొదటిది శిరఃపదాభిముఖ సూత్రం. అంటే వికాసం అను దైర్ఘ్య పద్ధతిలో శిరస్సు నుంచి పాదాభిముఖంగా సాగుతుంది. శిశువు మొదట తన తలను నిలిపిన తరువాత నడుము నిలిపి కూర్చోవడం, ఆ తరువాత కాళ్ళను నిలిపి నడవడం ప్రారంభిస్తాడు. రెండవది సమీప దూరస్థ దిశ. అంటే మొదట శిశువు పెద్ద కండరాలపై అదుపు వస్తుంది. ఆ తరువాత చిన్న కండరాలపై అదుపు వస్తుంది. ఉదాహరణకు ముందుగా శిశువు భుజం, కండరాలు తరువాత చేతి కండరాలు ఆ తరువాత వేళ్ళపై అదుపు వస్తుంది.

**6. వివిధ వికాసాలు పరస్పర సంబంధంగా కొనసాగుతాయి:** వ్యక్తిలోని వివిధ భాగాలు / అంశాల వికాసం పరస్పర సంబంధంగా కొనసాగుతుంది. అంటే శారీరక, మానసిక, సాంఘిక, నైతిక, ఉద్వేగ వంటి వివిధ వికాసాలు ఒకటిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు సాధారణంగా మానసిక వికాసం సరిగ్గా లేని పిల్లవాడు సాంఘిక, నైతిక వికాసాలలో కూడా వెనుకబడి ఉండడం గమనించవచ్చు.

**7. వికాసం ఒక పరస్పర చర్య:** వ్యక్తిలో సహజంగా ఉన్న సామర్థ్యాలు, పరిసరాలలో ఉన్న కారకాల మధ్య పరస్పర చర్య వల్ల వికాసం జరుగుతుంది. ఏ దశలోనైనా వ్యక్తి అనువంశికత వల్ల ఉన్న సామర్థ్యాలు, వాటి ఆధారంగా అతడు పరిసరంలో జరుపుతున్న ప్రతిచర్యలవల్లనే ఆ వ్యక్తి మూర్తిమత్వ నిర్మాణం జరుగుతుంది.

**8. వికాసాన్ని ప్రాగుక్తీకరించవచ్చు:** శిశువు యొక్క ప్రస్తుత వికాస వేగం ఆధారంగా ఆ శిశువు ఆ వికాసంలో ఎంత అభివృద్ధి చెందుతాడో ఊహించవచ్చు. ఉదాహరణకు 2 సంవత్సరాల వయస్సులో పిల్లవాడి ఎత్తు ఆధారంగా 20 సంవత్సరాల వయస్సు నాటికి ఆ పిల్లవాడు దాదాపు ఎంత ఎత్తు ఎదగవచ్చు అనేది అంచనా వేసి చెప్పవచ్చు. ఇదే విధంగా మానసిక వికాసాన్ని కూడా అంచనావేయవచ్చు.

**9. వికాసం సంచితమైంది:** శిశువు ఎదుగుదలలో కొన్ని మార్పులు హఠాత్తుగా సంభవించినట్లుగా మనకు కనిపిస్తాయి. ఉదాహరణకు శిశువు పలికిన మొదటి పదం హఠాత్తుగా పలికినట్లు కనిపించనప్పటికీ దానికి కారణమైన ఎన్నో అంశాలు అంతర్గతంగా మార్పు చెందుతూ, హఠాత్తుగా ఆ మార్పుల ఫలితాన్ని మనం గమనిస్తాం. ఇలా మనలో జరిగే ప్రతి మార్పు పెరుగుదల, అనుభవాల పరిణామమే.

**10. వికాసం సాధారణ దిశ నుంచి నిర్దిష్ట దిశగా సాగుతుంది:** వ్యక్తి ఏరకమైన వికాసాన్ని అయినా మనం పరిశీలించినట్లయితే అది సాధారణ దిశ నుంచి నిర్దిష్ట దిశగా సాగుతుందని అవగాహన అవుతుంది. ఉదాహరణకు శిశువు ఏదైనా వస్తువు పట్టుకోవాలనుకొంటే మొదట మొత్తం చేయి ఉపయోగిస్తాడు. ఆతరువాత చేతి వేళ్ళతో పట్టుకొంటాడు. ఇంకా సూక్ష్మమైన చర్యలు అంటే పెన్సిల్ పట్టుకొని రాయడం అనేది ఇంకా తరవాత దిశలో జరుగుతుంది.

### 2.2.4 వికాసంపై అనువంశికత మరియు పరిసరాల ప్రభావం (సామాజిక సాంస్కృతిక నేపథ్యం) (Influence of Heredity and Environment (Socio-Cultural) on Development):

వృత్తి వికాసం సమగ్రంగా వుండి నిరంతరం జరిగే ప్రక్రియ వ్యక్తులందరిలో వికాసం ఒకే రీతిలో జరిగిన వ్యక్తిగత విభేదాల వల్ల వైవిద్యాలు సంభవిస్తాయి. వ్యక్తి వికాసంలో వైవిద్యాలకు కారణాలు అన్వేషిస్తే ప్రధానంగా వ్యక్తి వికాసాన్ని ప్రభావితం చేసే కొన్ని కారకాలు కనిపిస్తాయి. జన్మతః ప్రతి వ్యక్తులు తన తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా కొన్ని ప్రత్యేక లక్షణాలు సంతరించుకొంటాడు. ఈ విధంగా స్వతస్సిద్ధమైన (innate) లక్షణాలు ఉండే గుణాన్ని అనువంశికత అంటారు. అనువంశికత లక్షణాలలో జన్మించిన శిశువు తన చుట్టూ ఉండే పరిసరాల వల్ల కూడా ప్రభావితం అవుతుంది. ఈవిధంగా వ్యక్తి వికాసాన్ని శాసించే అతిముఖ్యమైన కారకాలైన అనువంశికత, పరిసరాల ప్రభావం గురించి విశదంగా తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యక్తి వికాసానికి దోహదం చేసే అనువంశికత, పరిసరాల ప్రభావంలో ఏది ప్రధానమైంది అనే జఠిలమైన ప్రశ్నకు అనుకూలంగా, ప్రతికూలంగా నిర్వర్తించిన పరిశోధన ఫలితాలను గూర్చి తెలుసుకుందాం.

**అనువంశికత (Heredity) ప్రభావం– కొన్నిపరిశోధనలు**:

ముందు తరాల నుంచి సంక్రమించే జీవ సంబంధమైన మానసిక లక్షణాలను అనువంశికత లక్షణాలు అంటారు.

వ్యక్తి వికాసానికి పరిసరాల ప్రభావం కంటే అనువంశికత ప్రభావం ఎక్కువని తెలియచేసే ప్రముఖ శాస్త్రజ్ఞులలో ప్రముఖులు గాల్టన్, గొడ్డార్డ్, ఫ్రీమన్, డగ్‌డేల్, పియర్‌సన్, ఆల్‌పోర్ట్ మొదలగువారు.

గాల్టన్ తాను రాసిన 'హెరిడిటరి జీనియస్' అనే గ్రంథంలో ఎక్కువ తెలివితేటలు వున్న తల్లిదండ్రులకు ప్రతిభాశీలురైన పిల్లలు కలిగే అవకాశం ఎక్కువని తెలియచేశాడు. ఇంగ్లాండులోని ప్రముఖమైన 997 వ్యక్తుల కుటుంబ చరిత్రలను ఆధారంగా పేద కుటుంబాలకు చెందిన 997 కుటుంబాలకు చెందిన వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేసి, ప్రముఖులైన వ్యక్తులలో 535 మంది వ్యక్తులకు అమిత తెలివి తేటలు గల శిశువులు జన్మించినట్లుగా, పేద కుటుంబాలలో జన్మించిన వారిలో కేవలం ఐదుగురు మాత్రమే ప్రతిభావంతులైన శిశువులు జన్మించినట్లుగా పేర్కొన్నాడు.

తాతముత్తాతల, తల్లిదండ్రుల ఆకారం, శరీర లక్షణాలే గాక ప్రజ్ఞా లక్షణాలు కూడా అనువంశికంగా సంక్రమిస్తాయని తెలుపుతూ డార్విన్ వంశంలో ఐదుగురికి రాయల్ సొసైటీలో సభ్యత్వం ఉన్న శాస్త్రజ్ఞులని పియర్సన్ ఉదహరించాడు.

హోమిని కుటుంబాన్ని అధ్యయనం చేసి బలహీన మనస్కురాలైన తల్లి, అంగవైకల్యం, తక్కువ తెలివితేటలు గల తండ్రి గల కుటుంబంలో ఏడుగురు సంతానంలో ఐదుగురు బలహీన మనస్కులని, మిగతావారు చెడు ప్రవర్తన గల వారని తెలియచేసాడు.

డగ్‌డేల్ పరిశీలించిన జ్యూక్స్ కుటుంబంలో అవినీతి గల 709లో ఎక్కువ మంది నేరస్థులు, చట్ట వ్యతిరేకులు, దొంగలు, వేశ్యలు, సుఖవ్యాధులతో బాధపడిన వారు ఉన్నారని తెలియచేసాడు.

గోడ్డార్డ్ నైతికంగా పతనం చెందిన మార్టిన్ కల్లికాక్ మూలపురుషుడుగా గల కల్లికాక్ కుటుంబాన్ని పరిశీలించాడు. కల్లికాక్ మందమతి గల స్త్రీతో సంబంధం ఏర్పరుచుకొన్నాడు. వారి వంశంలో జన్మించిన 480 మందిలో ఎక్కువ మంది మందబుద్ధులు, లైంగిక విచలనం (Sexual deviants) గల వారు, చట్ట విరుద్ధమై సంతానం, తాగుబోతులు, నేరస్థులు, వేశ్య గృహాలను నడిపినవారుగా పేర్కొన్నాడు. అదే కల్లకాక్ మంచి లక్షణాలను కల్గిన మరొక స్త్రీని వివాహం చేసుకొన్నాడు. వారి సంతతికి చెందిన 496 మంది వారసులలో ఎక్కువ మంది సాంఘికంగా ఉన్నతమైన హోదా గల, ప్రజ్ఞావికాసం గల న్యాయవాదులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, మతప్రవక్తలు కూడా కాగలిగారని తెలియచేసాడు.

ఫ్రీమన్ కవలలు, అన్నదమ్ములు, దాయాదులలో ప్రజ్ఞాపాటవాలను పరిశీలించి అనువంశికతకు, ప్రజ్ఞకు సహసంబంధ గుణకం (Co-efficiont of corrolotion)గా ఉంటుందని, వారిలో సమరూప కవలల్లో ఈ గుణకం అత్యధికంగా ఉందని తెలియచేశాడు.

ఆల్‌పోర్ట్ వ్యక్తుల సుఖఃదుఖాలకు, వ్యక్తుల మధ్య వైవిధ్యానికి పరిసరాలు కారకం కాదని జన్యువుల ప్రభావం అధికం అని తెలియచేశాడు. ప్రఖ్యాత క్రికెట్ క్రీడాకారులైన లాలా అమరనాథ్ కుమారులైన సురేందర్ అమర్‌నాథ్

మొహింధర్ అమర్‌నాథ్‌లు, ప్రఖ్యాత టెన్నిస్ క్రీడాకారుడు రామనాథన్ కృష్ణన్, కుమారుడైన రమేష్‌కృష్ణన్, విఖ్యాత సంగీత దర్శకుడైన ఎస్.డి.బర్మన్ కుమారుడైన ఆర్.డి.బర్మన్. శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతుడైన హృదయనాథ్ మంగేష్కర్ కుమార్తెలు అయిన భారతరత్న లతామంగేష్కర్, ప్రముఖగాయని ఆశాభోంస్లే అయా రంగాలలో నిష్ణాతులవడం, విశేష ఖ్యాతిని పొందడం అనువంశికత ప్రభావమని తెలుస్తుంది.

**పరిసరాల(Environment) ప్రభావం – పరిశోధనలు :**

వ్యక్తి వికాసానికి అనువంశికత కంటే, పరిసరాల ప్రభావం ఎక్కువని వాదించే పరిసర వాదుల (Environmental its) పరిశోధనలను పరిశీలిద్దాం. వీరిలో ప్రముఖులు డబ్ల్యు.సి. బాగ్లే, గోర్డన్, ఫ్రీమన్, వాట్సన్ ప్రముఖులు, తీవ్ర స్థాయిలో పరిసరల ప్రభావ ప్రాముఖ్యాన్ని తెలియచేసిన మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు జె.బి.వాట్సన్ "Give me a dogen healthy individuals irrespetive of their hereditory traits. I will make them Doctors, Engineers, Teachers, clergymen, and still if you need i will make them decoits and thieves" అన్న మాటలు పరిశీలిస్తే పరిసరాల ప్రభావం వ్యక్తి వికాసం పై ఎంతగా వుంటుందో అర్థమవుతుంది.

W.C. బాగ్లే వ్యక్తి వికాసానికి విద్యావకాశాలు ఎంతగానో పనిచేస్తాయని, పాఠశాల వసతులకు, వ్యక్తుల వికాసానికి ఎంత గానో పనిచేస్తాయని, పాఠశాల వసతులకు, వ్యక్తుల వికాసానికి సహసంబంధ గుణకం ఎక్కువని తాను రచించిన Educational Determinism అనే గ్రంథంలో తెలియచేశాడు. ఫ్రీమన్ పరిశీలనలో వివిధ పరిసరాలలో పెంచిన మిల్డ్రెడ్, రూత్ అనే కవలలో కూడా ప్రజ్ఞాపాటవాలలో తేడాలు ఉన్నట్లు కనబడింది. గోర్డన్ పడవ నడిపే పిల్లలను, జిప్సీ నడిపేవారి పిల్లలను గమనించి వారిలో చిన్న వయస్సులో ఉన్నప్పుడు ప్రజ్ఞాలబ్ధి ఎక్కువగాను పెరిగేకొద్దీ ప్రజ్ఞాలబ్ధి తక్కువగాను ఉన్నాదని తెలియచేసాడు. దీనిని బట్టీ పాఠశాల వాతావరణానికి దూరమైన కొద్ది వికాసస్థాయి తగ్గుతున్నట్లుగా తెలుస్తుంది.

రోమ్ సామ్రాజ్య నిర్మాతలైన రోమ్యులస్, రీమస్‌లు తోడేళ్ళ మధ్య పెరగడం వల్ల నడక తీరు, ఆహార సేకరణలో తోడేలునే అనుకరించే వారని, భాషా జ్ఞానం లేకపోవడం వల్ల తోడేలులాఅరిచే వారని చరిత్ర చెబుతుంది. ఈ ప్రవర్తనకు ఈ ప్రవర్తనకు కారణం ఆపరిసరాలని గ్రహించవచ్చు. 1920లో బెంగాల్ అడవులలో తోడేళ్ళ మధ్య పెరుగుతున్న అమల, కమల అనే కవలలు దృష్టిలోకి వచ్చినపుడు వారిప్రవర్తన పరిశీలిస్తే తోడేళ్ళ ప్రవర్తన లాగే ఉండేదని దానికి కారణం పరిసరాలని తెలుస్తుంది.

ఈ విధంగా అనువంశికత, పరిసరవాదులు ఎవరి అంశం ప్రాముఖ్యాన్ని వారు బలపరిచే ప్రయత్నం చేసినప్పటికి ఒక వ్యక్తి వికాసంలో మూర్తిమత్వ నిర్మాణంలో రెండు సమాన పాత్ర పోషిస్తాయనేది వాస్తవం. పుట్టుకతో ఎన్నో సామర్థ్యాలను అంతర్గంతంగా పొంది ఉన్నప్పటికీ ఆ వ్యక్తికి సరైన అవకాశాలు కల్పించనిదే ఆ సామర్థ్యాలను పెంపొందించడానికి అవకాశం తక్కువ. అదేవిధంగా సహజంగా సామర్థ్యంలేని వ్యక్తికి ఎంత శిక్షణ ఇచ్చినప్పటికీ ఆ నిర్దిష్టరంగంలో రాణించడం కష్టం. కాబట్టి, ఉపాధ్యాయులు వ్యక్తి వికాసంలో ఈ రెండింటి ప్రాముఖ్యతను బాగా అవగాహన చేసుకొని ప్రతి విద్యార్థికి వారి సామర్థ్యాలకనుగుణంగా బోధనాను భవాలు కల్పించి వారి పరిపూర్ణ వికాసంకు తోడ్పడాలి.

3CW2YW

### 2.2.5 బాలల వికాసంలో మైలు రాళ్ళు (Milestones)- విపత్తులు (Hazards):

హావింగ్ హార్ట్స్ (Havighurst's) అనే మనోవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రతి మానవవికాస దశలోను నిర్వహించదగిన కృత్యాలను నిర్దేశించాడు. ప్రతి శిశువు సగటున ఆ కృత్యాలను ఆ దశ అంతానికి అదిగమించవలసి వుంటుంది. దీనినే వికాసపు మైలు రాళ్ళుగా (Dekelopmontal Milestone) కూడా పరిగణించవచ్చును.

**పూర్వ బాల్య దశకు సంబంధించి మైలు రాళ్ళు** (Milestones) :

- ఘన ఆహారమును తీసుకోవడం నేర్చుకొంటారు.
- శిశువులు నడవడం, మాట్లాడటం నేర్చుకొంటారు.
- శరీరంలోని విసర్జక వ్యవస్థపై నియంత్రణను సాధించుట.
- లైంగిక బేధాలను మరియు సంబంధిత పాత్రలను అనుసరించుట.
- పఠన సంసిద్ధాంతాలను కల్గివుండుట.
- తప్పు లేదా ఒప్పులను మధ్య బేధాలను అవగాహన చేసుకొంటారు మరియు ఈ దశ అంతానికి ఆత్మభావన (Selfconcept) ప్రారంభమవుతుంది.

**ఉత్తర బాల్యదశకు సంబంధించిన మైలురాళ్ళు** (Milestones):

- సాధారణమైన క్రీడలను ఆడుటకు అవసరమగు కనీస శారీరక నైపుణ్యాలను, సామర్థ్యాలను కలిగిఉండడం.
- తమపట్ల తమకు ఒక సంయుక్తమైన వైఖరిని నిర్మించుకోవడం.
- తమ సహచరులతో సఖ్యతగా మెలుగుట నేర్చుకోవడం.
- బాలబాలికలు వారికి తగినటువంటి సాంఘిక పాత్రలను నిర్వహించుటకు సంసిద్ధులుగా ఉండడం.
- పఠనం, లేఖనము మరియు గణితానికి సంబంధించిన మౌలిక సామర్థ్యాలు మరియు నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవడం.
- దైనందిన జీవితానికి సంబంధించిన అవసరమైన భావనలను రూపొందించుకొవడం.
- ఆత్మభావన, నైతికత మరియు విలువలకు సంబంధించిన అవగాహనను పొందివుండడం.
- సాంఘిక సమూహాలు మరియు సంస్థల పట్ల సంబంధించిన వైఖరి భావనలను అవగాహనను కల్గి వుండడం.
- సాంఘిక సమూహాల పట్ల మరియు సంస్థల పట్ల సానుకూల వైఖరిని కల్గివుండడం.
- వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యము సాధించడం.

**విపత్తులు (Hazards) :**

ఉత్తర బాల్యదశలో పిల్లలు కొంత జాగ్రత్త వహించి క్రింది విపత్తుల నుండి తప్పించుకోగలగాలి. ఉదాహరణకు కొన్ని విపత్తులు.

- వికాసాభివృద్ధిలో వెనుకబడి వుండటం.
- ఆయా వికాస స్థాయిలో నిర్వహించవలసిన పనులను చేయుటకు సరియైన మార్గదర్శకత్వంమరియు అవకాశాలు లేకపోవుట.
- సరియైన ప్రేరణ లేకపోవుట.
- శారీరక లోపాలుండుట, న్యూనతా భావానికి గురియగుట.
- ప్రజ్ఞాస్థాయి తక్కువగా వుండుట.

## 2.3. మనోవిజ్ఞానశాస్త్ర విభాగాలు

మానవుల ప్రవర్తనను శాస్త్రీయంగా అధ్యయనం చేసే శాస్త్రమే మనోవిజ్ఞానశాస్త్రం. ప్రవర్తన అంతర్గతమైనది కాబట్టి ఉదాహరణకు ఆలోచించడం,జ్ఞప్తికి తెచ్చుకోవడం, మర్చిపోవడం, ఊహించడం, విశ్లేషించడం మొదలైనవి. ప్రవర్తన బహిర్గతమైనది కూడా కావచ్చు. అంటే శారీరక – చలనాలకు, గీయడం, రాయడం, పాడడం, మాట్లాడడం మొదలైనవి. మనోవిజ్ఞానశాస్త్రంలో స్థూలంగా వ్యక్తుల ప్రేరణను,ఉద్వేగం, అభ్యసనం, ధారణ,అవధానం, ప్రజ్ఞ, మూర్తిమత్వము, సాంఘీక ప్రవర్తనలు మొదలైన ఆంశాలను ఎంచుకొన్న రంగానికి అనుప్రయుక్తం చేసి అధ్యయనం చేస్తే దానికి ఆ రంగం లేక విభాగానికి సంబంధించిన మనోవిజ్ఞానశాస్త్రంగా పేర్కొంటారు. కొన్ని మనోవిజ్ఞాన విభాగాల గురించి తెలుసుకుందాం.

| విభాగాలు | | అధ్యయన అంశాలు |
|---|---|---|
| 1. | సామాన్యమనోవిజ్ఞానము | జీవుల ప్రవర్తనకు సంబంధించిన సాధారణ నియమాలను సూత్రాలను, సిద్ధాంతాలను అధ్యయనం చేస్తుంది. |
| 2. | అపసామాన్య మనోవిజ్ఞానము | మానవుల అపసామాన్య ప్రవర్తనలను, మానసిక బుగ్మతలను వాటిని కారణాలు నివారణోపాయాలను అధ్యయనం చేస్తుంది. |
| 3. | జంతుమనోవిజ్ఞానము | ఈ విభాగము జంతువుల ప్రవర్తనను అద్యయనం చేస్తుంది. జంతువులపై జరిగే ప్రయోగ ఫలితాలను వాటి వల్ల తెలిసిన నియమాలను, సూత్రాలను మానవ ప్రవర్తనలకు అన్వయించే అధ్యయనాలను చేపడుతుంది. |
| 4. | సాంఘీక మనోవిజ్ఞానము | వ్యక్తి సంఘజీవి కావడంతో సంఘములో వ్యక్తి ఇతరులలో ప్రవర్తించే తీరు అందుకు కారణాలను, వ్యక్తుల సాంఘీక అభిరుచులు, వైఖరులు, అభిప్రాయాలను ఈ విభాగం అధ్యయనం చేస్తుంది. |
| 5. | ప్రయోగ మనోవిజ్ఞానము | మనోవిజ్ఞానశాస్త్ర ప్రయోగశాలలో పలు ప్రయోగ ఫలితాలు మానవ ప్రవృత్తులను, ప్రవర్తనాంశాలను అనుభవాలను శాస్త్రీయపద్ధతిలో ప్రయోగాత్మకంగా నిరూపించే విభాగమే ప్రయోగాత్మక మనోవిజ్ఞానశాస్త్రం. |
| 6. | వికాసాత్మక మనోవిజ్ఞానము | వ్యక్తి పుట్టినప్పటి (Zygote)నుంచి చనిపోయే వరకు గల జీవిత కాలాన్ని వివిధ దశలుగా విభజించి ఒక్కొక్క దశలో జరిగే పెరుగుదల వికాసాలను, ప్రవర్తనా అంశాలను, అధ్యయనం చేసే మనోవిజ్ఞాన భాగమే వికాసాత్మక మనోవిజ్ఞానము. ఇందులో బాలల మనోవిజ్ఞానానం, కౌమారమనోవిజ్ఞానము, వృద్ధాప్యమనోవిజ్ఞానమనే ఉపవిభాగాలు ఉన్నాయి. |

పై పేర్కొన్నవే కాక పరామనోవిజ్ఞానశాస్త్రం, విద్యామనోవిజ్ఞానశాస్త్రంమని,పారిశ్రామిక మనోవిజ్ఞానమనే అనేక విభాగాలు ఉన్నాయి. మనం బాలల మనోవిజ్ఞానం గురించి తెలుసుకుందాం.

### 2.3.1 మానవ వికాసదశలు – బాలల మనోవిజ్ఞానం

మానవ వికాసం నిరంతరము కొనసాగుతుంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్త అయిన ఎలిజబెత్ హర్లాక్ (Elizabeth. Hurlock) క్రింది మానవ వికాస దశలను పేర్కొన్నారు. మరియు ఒక్కొక్కదశలో జరిగే పెరుగుదల, ప్రవర్తనా అంశాలలో జరిగే వికాసాలు ఉదాహరణకు శారీరకచలన వికాసం, మానసిక వికాసం, సాంఘీక, ఉద్వేగ వికాసాలు, నైతిక, భాషా వికాసాలను గురించి వివరించారు.

మానవజీవన కాల విస్తృతిని 10 దశలుగా విభజించి అధ్యయనాలు చేశారు.

| | కాలం | దశలు |
|---|---|---|
| 1. | జైగోట్ దశ – పుట్టుక వరకు | జననపూర్వదశ |
| 2. | పుట్టుక నుండి మొదటి రెండు వారాలు | నవజాత శిశువు దశ |
| 3. | 2వ వారం నుండి 2 సం॥ అంతం వరుకు | శైశవ దశ |
| 4. | 3వ సం॥ నుండి 5 సం॥ అంతం వరకు | పూర్వబాల్య దశ |
| 5. | 6 సం॥ల నుండి 10/12 సం॥ల వరకు | ఉత్తర బాల్యదశ |
| 6. | 10/12 నుండి 13/14 సం॥ల వరకు | పూర్వ కౌమారదశ |
| 7. | 15సం॥ల నుండి 18 సం॥ల వరకు | ఉత్తర కౌమారదశ |
| 8. | 18సం॥ల నుండి 40 సం॥ల వరకు | వయోజన దశ |
| 9. | 40 సం॥ల నుండి 60 సం॥ వరకు | మధ్యవయస్సు దశ |
| 10. | 60 సం॥లకు పైబడి | వద్ధాప్యం |

### 2.3.2 బాల్యదశ (పూర్వ బాల్యదశ, ఉత్తర బాల్యదశ)

ప్రస్తుతం మనము బాల్యదశలలో జరిగే పెరుగుదల వికాసాలను మరియు ప్రవర్తనాంశాలను గూర్చి తెలుసుకుందాం. పూర్వబాల్యదశలో బాలలను గురించి అభిప్రాయాలు.

**తల్లిదండ్రుల అభిప్రాయాలు**

1. సమస్యాత్మక వయస్సు(Troublesome Age)ః ఈ దశలోని పిల్లలు సంరక్షణకు తల్లిదండ్రులపై ఆధారపడి ఉన్నవారు ఇప్పుడు తమకంటూ ఒక వ్యక్తికత్వాన్ని ఏర్పరుచుకొంటూ తల్లిదండ్రుల ఆధీనతనుండి స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోరుకుంటారు. కావున తల్లిదండ్రులకు అనేక ప్రవర్తనా సమస్యలు సృష్టిస్తారు. వీరు మొండిగా, మూర్ఖంగా, పట్టువదల కుండా ఎదిరించి మొండికేస్తారు.
2. బొమ్మలతో ఆడుకొనే వయస్సు(Toy Age)ః ఈ దశలో పిల్లలు ఎక్కువ కాలాన్ని బొమ్మలతో ఆడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తారు.

**మనోవిజ్ఞానశాస్త్రవేత్తల అభిప్రాయాలు**

1. పూర్వ ముఠాదశ (Pre Gang Age)ః పూర్వ బాల్యదశలోని పిల్లల సాంఘీక ప్రవర్తనకు ఈ దశ పునాది వంటిది. ఈ దశలో పిల్లలు ఇతరులతో కలిసి ఆడుకోవడం, తమ ఆట వస్తువులను, బొమ్మలను ఇతరులతో పంచుకోవడం ప్రారంభిస్తారు.
2. అన్వేషణ వయస్సు(Exploratory Age)ః పిల్లలు తాముఉన్న పరిసరాలలోని అనేక విషయాల గురించి శోధించడం ప్రారంబిస్తారు. తల్లిదండ్రులను, ఇంటిలోని పెద్దలను అనేక విషయాలను గురించి ఎందుకు?ఎలా? ఏమి? ఏమిటి? మొదలగు ప్రశ్నలతో శోధించడంప్రారంభిస్తారు. అందుకే ఈ వయస్సును ప్రశ్నించే దశగా (Questioning Age) కూడా సూచించారు.

3. అనుకరణ వయస్సు(Imitative Age): ఈ దశలోని పిల్లలు పెద్దల ప్రవర్తనలను అనుకరిస్తారు. పెద్దల వేష, భాషలను, ఆహారపు అలవాట్లను, ఇంటిలోని ఆచారవ్యవహారలను అనుకరిస్తారు.
4. సృజనాత్మక వయస్సు(Creative Age): ఈ దశలో పిల్లలు తాము ఆడుకొనే ఆటవస్తువులలో సృజనాత్మకతను జోడించి ఆడుకుంటారు.

**విద్యావేత్తల అభిప్రాయాలు**

1. పూర్వ ప్రాథమిక పాఠశాల వయస్సు(Pre Primary School Age): ఈ దశలోని పిల్లలకు శారీరక అవయవాల మధ్య సమన్వయం, బౌద్ధిక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలకు కావలసిన తర్ఫీదుకు అనుకూలమైన వయస్సుగా లేక దశగా గుర్తించారు. అందుకే ఈదశను అభ్యాసనానికి సంసిద్ధమయ్యే వయస్సుగా గుర్తించారు. ఈదశలోని పిల్లలు ప్లేస్కూల్స్‌లో, అంగన్‌వాడీ, బాల్వాడిలలో ఉండవలసిన వయస్సుగా పేర్కొన్నారు.

**ఉత్తర బాల్యదశలో బాలల గురించి అభిప్రాయాలు**

ఉత్తరబాల్యదశలోని పిల్లలు ప్రాథమికపాఠశాలల్లో 1 నుంచి 7 తరగతుల మధ్య వరకు ఉంటారు. ఈ దశలోని పిల్లల జీవితంలో భౌతిక, మానసిక అంశాలలో పెనుమార్పులు జరుగుతాయి. పాఠశాలలో లభించే కొత్త అవకాశాలు సాధించవలసిన లక్ష్యాలు పిల్లల ప్రవర్తనలలో కొత్త వైఖరులను, విలువలను ఏర్పరుస్తాయి. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఈ దశలో జీవితంలో మొదటి మొట్టుగా అభిప్రాపడ్డారు.

**తల్లిదండ్రుల అభిప్రాయాలు**

1. సమస్యాత్మక వయస్సు(Troublesome Age): ఈ దశలోని పిల్లలు తల్లిదండ్రులు చెప్పే మాటలను వినరు, వారు చెప్పిన విషయాలను చేయారు, తమ స్నేహితుల మాటలకే ప్రాధాన్యతను ఇస్తారు. అందుకే ఈ దశలో వీరు తల్లిదండ్రులను చికాకు పరుస్తారు. వ్యాకులతలను,ఆందోళనలను ఏర్పరుస్తారు.
2. సోమరి వయస్సు(Sloppy Age): ఈ దశలోని పిల్లలు శుభ్రతలేని, ఒక క్రమబద్ధం లేని, సోమరులుగా ఉంటారని తల్లిదండ్రుల అభిప్రాయము.
3. జగడగొండ్లు(Quarrelsome Age): ఇంట్లో పిల్లలు అన్నదమ్ములతో, అక్కచెల్లిళ్ళతో ఎప్పుడూ పోట్లాడుతూ ఉంటారు.పాఠశాలలో కూడా తమ తోటి విద్యార్థులతో కొట్లాడుతూ,పోట్లాడుతూ ఉంటారు.

**మనోవిజ్ఞానశాస్త్రవేత్తల అభిప్రాయాలు**

1. ముఠా వయస్సు(Gang Age): ఈదశలోని పిల్లలు తమ సమవయస్కులతో ఆమోదింపబడేవారుగా, స్వీకరించబడేవారుగా ఉండాలను కుంటారు. అంటే ఒక సమూహంలో సభ్యులుగా ఉండాలనుకుంటారు.
2. అనుసరణ వయస్సు(Age of Conformity): ఈ దశలోని పిల్లలు వారున్న సమూహంలోని నియమనిబంధనలను మాటల తీరును తోటి పిల్లల ప్రవర్తనలను సంఫీభావంతో అనుసరిస్తారు.
3. సృజానాత్మక వయస్సు(Creative Age): ఈ దశలో పిల్లలసృజనాత్మక వికాసానికి కావలసిన పరిస్థితులు లభించినపుడు వీరి సృజనాత్మకత కూడా వికసిస్తుంది. పాఠశాలలో డ్రాయింగ్, డ్రామాలు, పాటలు పాడడం, కవితలు చదవడం, డ్యాన్సులు వేయడంలో ముందుంటారు.
4. క్రీడా వయస్సు(Play Age): ఈ దశలోని పిల్లలు వారు అభ్యసించే విషయాలు మరియు విద్యా సాధనకొరకు అనేక కృత్యాలు చేయడంలో క్రీడలు, ఆటలు ఆడడంలో ఆసక్తి చూపుతారు. వీరికి కృత్యాలు చేయాలన్న ఆటలు ఆడాలన్న అమితమైన ఇష్టాన్ని కనబరుస్తారు.

**విద్యావేత్తల అభిప్రాయాలు**

1. ప్రాథమిక పాఠశాల వయస్సు(Primary School Age): ఉత్తరబాల్య దశలోని పిల్లలు ప్రాథమిక పాఠశాలల్లో చేరి విద్యా సాధనకు కావలసిన కనీస సామర్థ్యాలను సాధించడానికి ప్రయత్నిస్తారు. వీరు పాఠ్యాంశాలకు తగిన కృత్యాలు నిర్వహణలోను, హెూమ్‌వర్క్ చేయడంలోను ఇష్టతను కనబరుస్తారు.
2. క్లిష్టతర వయస్సు(Critical Age): ఈ దశలోని పిల్లలు తమ సామర్థ్యాలకు అనుగుణంగా విద్యా విషయాలను సాధించడంలో ఆసక్తి కనబరుస్తారు. పిల్లలకు సాధనలో ఉపాధ్యాయులు ప్రేరణ కల్పించినపుడు కొందరు ఎక్కువ సాధనను (High Achievement) కనబరుస్తారు. నిరుత్సాహపరిస్తే పిల్లలు తక్కువ సాధనను(Low Achievement) కనబరుస్తారు. కాబట్టి ఈ వయస్సు క్లిష్టతర వయస్సు ఉపాధ్యాయులు ఎల్లప్పుడు విద్యార్థులను ప్రోత్సహిస్తూనే ఉండాలి.

ఈ సబ్‌యూనిట్‌లో బాలల యొక్క (శైశవ,పూర్వ,ఉత్తర బాల్యదశలోని పిల్లల)వివిధ వికాసాలను ఉదాహరణకు శారీరకచలన వికాసం,సాంఘీక వికాసము,ఉద్వేగవికాసము, మానసిక వికాసాలు భాష– భాషణ వికాసము, నైతిక వికాసముల గురించి తెలుసుకుందాం.

## 2.4 బాలలు – శారీరక, చలన వికాసం (Physical and motor Development) :-

జీవన ప్రక్రియల వలన పెరుగుదల వల్ల శరీరంలో సంభవించే పరిమాణాత్మక మార్పులనే శారీరక పెరుగుదల అంటారు. వివిధ శారీరక భాగాలతో పెరుగుదలకు అనుగుణంగా సంభవించే వికాసాక్మత మార్పులవల్ల చలన వికాసమేర్పడుతుంది.

శారీరక వికాసం అంటే శారీరంలో జరిగే పెరుగుదల మాత్రమే కాదు. శరీరానికి సంబందించిన 1. నాడీవ్యవస్థ 2. కండరాల వ్యవస్థ 3. అస్థికల వ్యవస్థ 4. అంతఃస్రావ్య గ్రంథుల వ్యవస్థలతో పాటు శరీరాభివృద్ధి అంశాలను కూడా అధ్యయనం చేస్తుంది.

సక్రమమైన నాడీ వ్యవస్థ పెరగడం నాడీ మండలం, జ్ఞానేంద్రియాలు వికసించడం వలన శరీర అంతరాలలో వివిధ భాగాలు అభివృద్ధి చెంది గుణాత్మక మార్పులకు కారణం అవుతుంది. నాడీ వ్యవస్థ పెరిగివికసించడం వల్ల బాలలల్లో ప్రజ్ఞాతో పాటు మానసిక శక్తులైన వివేచన, సృజనాత్మకత, భాష, ఆలోచన, స్మృతులలో మార్పులుసంభవిస్తాయి. దీనితో పాటు కండర, అస్థికల వ్యవస్థలు పెరిగి బాలల చలనాత్మక కృత్యాలలో హావభావ ప్రదర్శనలలో మార్పు సంభవిస్తుంది. అంతఃస్రావ్య గ్రంథుల వికాసాల వలన ఉద్వేగాల ప్రదర్శనలో వాటిని నియంత్రించడంలో, సామాజిక విషయాలలో, నైతిక వికాసాలలో మార్పులు ఏర్పడతాయి. శారీరక వికాసము వ్యక్తి యొక్క చలనాత్మకరంగం వికాసముతో ముడిపడి ఉంటుంది.

శారీరక వికాసం అంటే వ్యక్తి యొక్క వివిధ వ్యవస్థలు, వివిధ అంగాల మధ్య సమనవ్వయముతో శక్తి సామర్థ్యాలతో వేగంగా, ఖచ్చితంగా కాళ్ళు, చేతులను ఉపయోగించడాన్ని సూచిస్తుంది.

బాలల యొక్క మానసిక, సామాజిక అనుగుణ్యతకు (Adjustment) చలనాత్మక శక్తులు చాలా ముఖ్యం. బాలలో చాలినంత చలనాత్మక వికాసం లేనట్లయితే ఆటల్లో, పాటల్లో పాల్గొనలేక సమవయస్కులచే తిరస్కరింపబడి వారి సాంఘీక వికాసానికి,సామాజీకరణానికి మానసిక ఆరోగ్యానికి ఆటంకం ఏర్పడవచ్చు.

శారీరక పెరుగుదల వేగంగా జరుగుతుంది. నవజాత శిశువు తల పెద్దదిగా ఉండి మొత్తం శరీరం పొడవులో నాలుగవ వంతు ఉంటుంది. కాళ్ళు చేతులు సన్నగా వుండి క్రమేపి అభివృద్ధి చెందుతాయి. కండరాలు అభివృద్ధి చెంది, బాహ్య ప్రేరణ గ్రహించడానికి వీలుగా జ్ఞానేంద్రియ వికాసం జరుగుతుంది. క్రమంగా బోర్లపడటం, మెడ భాగంలో కండరాలు నియంత్రణ వల్ల పాకడం వంటి చలన కౌశలాలు ఏర్పడుతాయి. తనకు తానుగా కూర్చోగల్గడం, ఆధారాన్ని పట్టుకొని నిలబడడం, తనంతట తాను నిలబడడం, ఆధారంతో నడవడం, తడబడుతూ తప్పటడుగులు వేయడం, నడవడం శైశవదశకు చెందిన అంశాలు. శారీరక పెరుగుదలలో మొదటి సంవత్సరం బరువు ఎత్తుకంటే వేగంగాను, రెండవ సంవత్సరంలోని పెరుగుదల బరువులోని పెరుగుదల కంటే హెచ్చుగా ఉంటుంది.

6 – 8 నెలల మధ్య కాలంలో సాధారణంగా మొదటి పన్ను ఏర్పడుతుంది. సంవత్సరాంతానికి 4 – 6 దంతాలు వస్తాయి. రెండవ సంవత్సరం చివరికి పై దవడలో 8, కింది దవడలకి 8 పళ్ళు వస్తాయి.

పుట్టినప్పుడు శిశువు మెదడు వయోజనుని మెదడు బరువులో నాల్గవ వంతు వుండి సంవత్సరానికి సగం బరువు వరుకు పెరుగుతుంది. శైశవదశలో సంభవించినంత మెదడులోని పెరుగుదల ఏదశలోను సంభవించదు. జ్ఞానేంద్రియ వికాసం కూడా ఈ దశలోనే అధికంగా ఉంటుంది. ముందుగా చూపు, వినికిడికి సంబంధించిన జ్ఞానేంద్రియాలు, క్రమంగా స్పర్శ, గ్రహణ జ్ఞానేంద్రియాలు అభివృద్ధి చెందుతాయి.

శైశవ దశలో వలె బాల్యదశలోని ప్రథమ భాగంలో శారీరక చలనాత్మక వికాసం స్థిరంగా, నిరంతరంగా కొనసాగుతుంది. శరీర అవయవాలన్ని సరైన అనుపాతం (Proprotion)లో పెరుగుతూ ఎముకలు గట్టిపడి, కండరాల నియంత్రణ అధికమవుతుంది. దాని ఫలితంగా చలన కౌశలాలైన పరిగెత్తడం, ఎత్తు నుంచి దుమకడం, దూరంగా దుమకడం, వస్తువులను విసరడం మొదలైనవి జరుగుతాయి. చతురస్రాకారంలో ఉండే మొండెం దీర్ఘ చతురస్రాకారంగా, సన్నగా పొడవుగా తయారవుతుంది.

ఈ దశలోని పాల దంతాలలో చివరి నాలుగు వస్తాయి. స్వయంగా తినడం, బట్టలు వేసుకోవడం, తల దువ్వుకోవడం వంటి హస్త నైపుణ్యాలు, మూడు చక్రాల సైకిలు తొక్కడం వంటి కాలి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. నైపుణ్యాలు పూర్తిగా వికసించక పోవడం వల్ల తరచుగా ప్రమాదాలకు గురవుతారు. వివిధ శారీరక అవయవాలు గట్టిపడటం, కండర నియంత్రణ చలన సమన్వయ వికాసం ఈ దశలో జరుగుతాయి.

బాలదశ్యలోని రెండవ భాగంలో పెరుగుదల పూర్వ దశలతో పోల్చిచూస్తే తక్కువగా వుంటుంది. ఈ దశలో శాశ్వత దంతాలు వస్తాయి. శరీరంలో వివిధ మార్పులు వస్తాయి. బొమ్మలు వేయడం, బొమ్మలకు రంగులు వేయడం, తోటపని చేయడం, మట్టితో వస్తువులను తయారు చేయడం, ఆటలు ఆడటం వంటి కౌశలాలు బాగా అభివృద్ధి చెందుతాయి. శారీరక పటుత్వం, దారుఢ్యం కలుగుతాయి.

- ♦ శారీరక ఆరోగ్యం, మంచి పౌష్ఠికాహారం బాల్యంలోని పిల్లల పెరుగుదల వికాసాలకు ముఖ్యము.
- ♦ వ్యాధినిరోధక మందులు తీసుకోనిన బాలల శారీరక పెరుగుదల బలంగా ఉంటుంది.
- ♦ శాంతంగా, సున్నితముగా ఉన్న పిల్లలు ఉద్వేగ అస్థిరత్వాని(Emotional Distrubences)కి లోనైన బాలల కన్నా శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా వుంటారు.

- ప్రజ్ఞావంతులైన బాలలు – సగటు లేక సగటు కన్నా తక్కువ ప్రజ్ఞ ఉన్న బాలల కంటే పొందవుగా, బలంగా ఉంటారు.
- లైంగిక వికాసంలో అమ్మాయిలు అబ్బాయిల కన్నా ఒకటి లేక రెండు సం॥రాలు ముందుగానే ఉంటారు.
- అబ్బాయిలు అమ్మాయిల కన్నా ఎత్తులో, బరువులో కొద్దిగా తక్కువగా ఉంటారు.

**విద్యా విషయక ప్రాధాన్యత:**

- బాలల శారీరక చలనాత్మక వికాసాలకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించాలి
- సక్రమమైన ఆహారాన్ని ఇచ్చి వ్యాధుల నుండి కాపాడాలి.
- పాఠశాలలో బాలలకు సరియైన వ్యాయామం, ఆటలు ఏర్పాటుచేయాలి.
- క్రమ బద్ధంగా వైద్య తనిఖీలు చేయించి వైద్యుల సలహాలను పిల్లలచే పాటింపచేయాలి.
- డ్రామాలు,డ్యాన్సులు,పాటల పోటీలు, కరాటే, యోగాసనాలు, ధ్యానం లాంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టి విద్యార్థులలో చలన కౌశలాలను పెంపొందించాలి.

## 2..5 సాంఘిక వికాసం (Social Development) :- :

మానవుడు సంఘజీవి. అందువల్ల ఇతరులతో కలిసిమెలసి జీవించవలసిన అవసరం వుంది. సాధారణంగా ప్రతివ్యక్తి ఏదో ఒక కుటుంబంలో సభ్యునిగా జన్మించడం జరుగుతుంది. జన్మించక పూర్వం తల్లి గర్భంలో తన చుట్టూ ఉన్న పరిసరాలతో సర్దుబాటు చేసుకోవడం జరుగుతుంది. అలాగే జననాంతర పరిసరాలతో కూడా సర్దుబాటు చేసుకోవలసి ఉంటుంది. శిశువు మొదట తల్లి వద్ద నుంచి సాంఘికీ కరణాన్ని పొందుతాడు.

సాంఘిక వికాసం అనేది శిశువులో శారీరక, చలన, ఉద్వేగ, మానసిక వికాసాలతోపాటు అభివృద్ధి చెందుతూ వుంటుంది. అయితే సాంఘిక వికాసంలో తల్లి దండ్రులు, స్నేహితుల పాత్ర చాలా ఎక్కువగా వుంటుంది.

సాంఘిక వికాసమంటే వ్యక్తి వ్యక్తులతో సంబంధాలను ఏర్పరుచుకొని సహజీవనంలో పరస్పర అవగాహన, సహాయ సహకారాలు అందుకొంటూ స్వార్థ పూరితమయిన ప్రవర్తనను అదిగమించి తన అభివృద్ధికే గాక సమాజ అభివృద్ధికి కూడా ఉపయోగపడే విధంగా కాలసిన సాంఘిక నైపుణ్యాలను (Social Skills) అలవరుకోవడం.

**నిర్వచనాలు (Definitions):**

**సాంఘిక వికాసం:**

సోరెన్‌సన్ అభిప్రాయంలో ‘స్వయంగా, ఇతరులతోను, సమర్థవంతంగా మెలగగల సాంఘిక పెరుగుదల, వికాసమే సాంఘిక వికాసం.’

హర్లాక్ అభిప్రాయం ప్రకారం ‘సాంఘిక సంబంధాలలో పరిపక్వతను సాధించడమే సాంఘిక వికాసం’

‘జైవీకవ్యక్తి (Biological Man) మానవత్వం గల వ్యక్తిగా (Social Man) మారే ప్రక్రియనే సాంఘిక వికాసం’ అని గ్యారట్ నిర్వచించెను.

‘ఒక వ్యక్తి తనలోతాను సర్దుబాటు చేసుకొంటూ ఇతరులతో సఖ్యతతో ఉండగలగడాన్ని లేక అనువైన ప్రవర్తనను పెంపొందించుకోవడాన్ని సాంఘిక వికాసం అనవచ్చు.

**సామాజీకీకరణముః**

సమాజంలో వున్న జీవన శైలులను (Life Styles) లేదా జీవన విధానాలను, నియమ నిబంధనలను (Rules & Regulations) ఆచార వ్యవహారాలను అర్థం చేసుకొని, వాటికనుగుణంగా సర్దుబాటు చేసుకొని జీవించడాన్ని సామాజిక వికాసం అంటారు.

సాంఘిక వికాసం పొందిన వ్యక్తులలో ఉండే లక్షణాలుః

- ఇతరులతో సహకరించడం
- ఇతరుల ఉద్దేశాలను ఆహ్వానించడం,వాటిని సహించడం
- ఇతరుల యందు ఆసక్తి కనబరచడం
- స్నేహ భావాన్ని కలిగి ఉండడం
- సక్రమమైన పోటీతత్వం కలిగి ఉండడం
- సంఘం, సమాజం యొక్క ప్రమాణాతలను పాటించడం
- సంఘం కొరకు, సమాజం కొరకు, దేశం కొరకు స్వార్థాన్ని విడనాడడం
- సామాజిక పురోభివృద్ధికి పాటుపడడం
- పరిస్థితులకు అనుగుణంగా ఇతరులతో సర్దుబాటు కావడం
- విధినిర్వహణలో వెనుకఅడుగు వేయకుండా ఉండడం. లాంటి లక్షణాలను కలిగి ఉంటాడు.

**బాలల్లో సాంఘిక వికాసం :**

శిశువు సాంఘిక వికాసాన్ని శైశవ దశలోని సాంఘికీకరణం ఎంతో ప్రభావితం చేస్తోంది. పుట్టిన శిశువు కు ఇల్లే ప్రపంచం కాబట్టి, ఇంటి వద్దనే భవిష్యత్తు సాంఘిక ప్రవర్తనకు, వైఖరులకు పునాది ఏర్పడుతుంది. ఈ ప్రాథమిక పునాది ప్రాముఖ్యతకు రెండు కారణాలున్నాయి. ఒకటి సాంఘిక పరిస్థితులలో శిశువు చూపించే ప్రవర్తన వారి భావి జీవితంలో వ్యక్తిగత, సాంఘిక సర్దుబాటుపై ప్రభావాన్ని చూపుతుంది. రెండు, ఒకసారి ఒక ప్రవర్తనకు అలవటు పడ్డాక అది మార్చడం అసంభవం కాదు కాని ప్రయత్నంతో మార్చవచ్చు.

మిగతా వికాసాల లాగే సాంఘిక వికాసం ఖచ్చితమైనది కానప్పటికీ ఒక నమూనాను పాటిస్తుంది. పుట్టినప్పుడు శిశువు తన అవసరాలు ఎవరు తీరుస్తున్నారనే దాంతో సంబంధం లేకుండా ఉన్న, ఆరు వారాల తర్వాత ఎవరైతే తన అవసరాలను తీరుస్తారో వారిని చూసి నవ్వడం మొదటి సాంఘీకరణ ప్రారంభాన్ని సూచిస్తుంది. శిశువు మొదటి సాంఘిక ప్రతిస్పందన పెద్దవారితో, ఆ తరువాత చిన్న పిల్లలతో ఉంటుంది. మొదటి సంవత్సరం పిల్లలు మంచి సమతౌల్యంతో ఉంటారు. కాబట్టి వారితో వ్యవహరించడం సులభంగా ఆహ్లాదంగా ఉంటుంది. కాని రెండవ సంవత్సరం ప్రారంభంలో వారు చెప్పింది వినకుండా, సహకరించకుండా ఉండి వారితో వ్యవహరించడానికి కష్టంగా ఉంటుంది. అయితే, శైశవ దశ పూర్తయ్యే నాటికి తిరిగి సమతౌల్యంను సంతరించుకొని మళ్ళీ ఆహ్లాదకరమైన ప్రవర్తనను కనబరుస్తారు.

ఉత్తర బాల్యదశలో ముఠాలో సభ్యులవడానికి కావలసిన ప్రాథమిక శిక్షణ, అనుభవాలు ఈ దశలోనే పొందుతారు. అందువలన ఈ దశను 'పూర్వ ముఠా దశ' అని అంటారు. తమకు పరిచమయ్యే వ్యక్తుల సంఖ్య పెరిగే కొద్ది సాంఘికీకరణకు పునాది పడుతుంది.

పిల్లలు ఇతర పిల్లలతో కలిసి వారి ప్రక్కనే స్వతంత్రంగా ఆడుతూ వుంటారు. దీనినే 'సమాంతర క్రీడ' అని

అంటారు. సమాంతర క్రీడ పిల్లలు వారి స్నేహితులతో జరిపే మొదటి సాంఘిక కృత్యమని చెప్పవచ్చు. దీని తర్వాత వచ్చేదే సంసర్గ క్రీడ. ఇక్కడ ఇతర పిల్లలు ఆడే ఆట కాకపోయిన దానిని పోలిన ఆటను ఇతరులతో కలిసి ఆడతారు. వయస్సుతోపాటు సాంఘిక సంబంధాలు పెరగడం వల్ల 'సహకార క్రీడ'లో పాల్గొంటారు.

సహచర క్రీడలలో పిల్లలు ఆటలలో పాటించవలసిన నియమాలు, ఇతరులు అభిప్రాయాలను విలువనివ్వడం, ఇతరుల దృష్టి చూరగొనడం, చేస్తారు. ఈ దశ పూర్తయ్యేనాటికి స్నేహితులు తమను అంగీకరించే ప్రవర్తనను పిల్లను నేర్చుకొంటారు. ఈ దశలో అలవర్చుకొనే సాంఘిక ప్రవర్తనల ఆధారంగానే భవిష్యత్తులోని సాంఘిక సర్దుబాటు ఆధారపడి వుంటుంది. ఈ దశలో పిల్లలు అనుకరణ. సహకారం, జాలి, సహానుభూతి (Empathy), సాంఘిక ఆమోదం, పంచుకోవడం, బంధం వంటి సాంఘిక ఆమోదం వంటి సాంఘిక ప్రవర్తనా నమూనాలను, వ్యతిరేక వాదం, దౌర్జన్యం, అధికారతత్వం, స్వార్థం, అహం కేంద్ర వాదం (ego contrism) విధ్వంసకం, బాలబాలికల్లో ఒకరిపట్ల ఒకరికి విరుద్ధ, ప్రతికూల అభిప్రాయం వంటి సాంఘిక ప్రవర్తనా నమూనాలను వ్యక్తపరుస్తారు. దీనితో పాటు తిరస్కరించే తీరును గురించి నేర్చుకొంటారు. ఈ దశ అంతానికి బాలలు నాయకత్వ లక్షణాలను కూడా అలవరుచుకుంటారు.

ఉత్తర బాల్యదశను 'ముఠా దశ' గా పిలుస్తారు. దీనికి కారణం వారు సమవయస్కుల కృత్యాలలో ఎక్కువగా ఆసక్తి కనబరచడం, ఒక ముఠా సభ్యునిగా అంగీకరించబడాలనే బలమైన కోరిక వీరికి వుంటుంది. ఈ దశలో పిల్లలు ఆటల్లో ఎక్కువ సంతోషాన్ని, ఉత్తేజాన్ని పొందడానికి ముఠాసభ్యులతో ఉండటానికి ఇష్టపడతారు. ముఠాలోని సభ్యులు ఒకే లింగానికి చెందిన వారై ఉంటారు. ముఠాలోని పిల్లల వయస్సు, వికాస స్థాయి, అభిరుచులు, సామర్థ్యాలు దాదాపు ఒకే మాదిరిగా వుంటాయి. ముఠాలో పిల్లవాన్ని ఇతరులు అంగీకరించడం అనేది ప్రజాస్వామిక పద్ధతి పాటించే తల్లిదండ్రుల పిల్లలనే ఎక్కువగా ఇష్టపడతారు. ఈ దశలో పిల్లలు ఆటల ద్వారా నియమాలను పాటించడం లాంటి క్రమ శిక్షణను, సహకార భావం వంటి విలువలను పెంపొందించుకోవడం జరుగుతుంది.

### 2.5.1 సాంఘిక వికాసంలో కుటుంబం, సమవస్కులు, పాఠశాల,ప్రసారమాధ్యమాల పాత్ర / ప్రభావము :

#### ఎ) కుటుంబం (Family) :

తల్లిదండ్రులు అతిచిన్న వయస్సు నుంచి తమ పిల్లల ప్రవర్తనను బాగా పరిశీలిస్తారు కావున వారికి కావలసిన ప్రత్యేక అవధానం, అవసరాలు, సౌకర్యాలను కల్పించడానికి అవకాశం ఉంది.

తల్లిదండ్రుల ముఖ్యవిధి తమ పిల్లల్లో గల బలాలను, బలహీనతలను ఒప్పుకోవడం, వారికి తగిన చేయూతనివ్వడం చేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చడం. లోపాలను విమర్శించడం. ప్రతిభావంతులకు అతిగా పొగడటం చేయకూడదు.

తల్లిదండ్రులు తమ పిల్లల సామర్థ్యాలు, ఏరంగంలో రాణించగలరో తెలుసుకొని, వాటికి అనుగుణంగా కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలి. ఉపాధ్యాయులని వీలైనన్ని ఎక్కువసార్లు కలిసి వారి ప్రవర్తనను, నిష్పాదన, అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించి, వారి అనుభవాలను పంచుకొని విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి కృషి చేయాలి.

పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ, ఆదరణ సహాయాన్ని మించిన బలం వేరొకటి లేదు. అందువలన వారు పిల్లల సామర్థ్యాలకు అతీతంగా ప్రోత్సహించడం, వారి సామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రేరణ కల్గించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడం, చదివించడం, ఒకరోజువారి కార్యక్రమం లా కాకుండా వారిలో ఉన్నటువంటి ప్రత్యేక సామర్థ్యాలను గుర్తించే ప్రయత్నం చేయాలి. అలాచేయడం ద్వారా వారిలో అత్యధిక సఫలతను సాధించగల సామర్థ్యం పెంపొందే టట్లూ తగు శిక్షణను ఇప్పించి విజయాన్ని సాధించేటట్లు చేయవచ్చు.

**బి) సమవయస్కుల సమూహాలు (Peer Groups):**

పిల్లల పెరుగుదల వికాసంలో పూర్వ బాల్య దశ నుండి కౌమార దశ వరకు సాంఘిక వికాసంపై సమ వయస్కుల ప్రభావం వుంటుంది. పిల్లలు పూర్వ బాల్యదశలో ఇతరులు సాంఘిక సంబంధాలు ఎలా ఏర్పరుచుకొంటారో పరిశీలకులలా గమనిస్తారు. ఈ విధమైన అనుభవాలతో ఆటలో పాటించవలసిన నియమాలు, సహకారం, క్రమశిక్షణ ఇతరుల అభిప్రాయాలకు విలువ నివ్వడం, ఇతరుల దృష్టిని చూరగొనడం చేస్తారు. పిల్లలు పెరుగుతున్న కొద్ది వారు సమవయస్కుల కృత్యాలలో ఎక్కువ ఆసక్తి కనబరచడం జరుగుతుంది.

పిల్లలు కౌమార దశ చేరుకొనే సమయానికి ఎక్కువ సమయం సమవయస్కులతో గడుపుతారు. కాబట్టి వారి వైఖరులు, భాషణ, అభిరుచులు, వేషభాషలు ప్రవర్తనపై సమవయస్కుల ప్రభావం ఉంటుంది. వారు ఎన్నుకొన్న సమవయస్కులతో అసాంఘిక ప్రవర్తన ఉంటే అవే అలవాట్లు వారు కూడా అలవరుచుకొంటారు.

కౌమార దశ చివరకు వారు ప్రత్యేక గుర్తింపును కోరుకోవడం, స్నేహితులను ఎన్నుకోవడంలో ఏర్పరుచుకొన్న విలువల కారణంగా సమవయస్కుల ప్రభావం తగ్గుతుంది. సాంఘిక కార్యక్రమాలలో భాగస్వామ్యం ఎక్కువ అవడం వల్ల సాంఘిక పరిజ్ఞానం పెరిగి సాంఘిక సమర్థత పెరుగుతుంది. సాధారణంగా మగ పిల్లల సమూహాలు ఎక్కువ పెద్దగా వుంటాయి. కాని వారి మధ్య బంధం అంత బలంగా వుండదు, అదే ఆడ పిల్లల సమూహాలు తక్కువ సభ్యులతో ఉన్నప్పటికీ బలమైన, కచ్చితమైన బంధాన్ని కల్గి వుంటారు. ఉపాధ్యాయులు పిల్లల పరిపక్వత దృష్ట్యా వారిని సరిగా అవగాహన చేసుకొని తగిన విధంగా స్పందిస్తే ఒత్తిడి, అసంతృప్తులకు గురికాకుండా మంచి మూర్తిమత్వాన్ని పెంపొందించుకొనే అవకాశం వుంది.

**సి) పాఠశాల (School):**

పాఠశాల వాతావరణం విద్యార్థికి ఆహ్లాదకరంగాను, ప్రేరేపించే విధంగాను ఉండాలి. ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులను తిట్టడం, కొట్టడం, కసురుకోవడం, విసుక్కోవడం కాకుండా విద్యార్థులు అడిగే ప్రశ్నలకు ఓపికతో, సహనంతో సమాధానమివ్వాలి, స్నేహక పూర్వకంగా వ్యవహరించాలి.

పాఠశాలలో సాధారణమైన, ప్రత్యేకమైన పిల్లలందరూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి కావలసిన అన్ని భౌతిక సదుపాయాలను కల్పించాలి.

విద్యార్థులందరికీ ఒకే విధమైన విద్యా లక్ష్యాలను నిశ్చయించకుండా ప్రతి విద్యార్థికి వ్యక్తిగతంగా వారి సామర్థ్యాలకనుగుణంగా ప్రత్యేక విద్యా లక్ష్యాలను ఏర్పరచాలి. పాఠ్య ప్రణాళిక విద్యార్థుల వైవిద్యాలకు అనుగుణంగా మలచుకునేటట్లు సారళ్యతను పొంది వుండాలి. అదేవిధంగా మూల్యాంకనంలో కూడా సారళ్యత ఉండాలి. వివిధ కృత్యాల

ద్వారా మూల్యాంకనం చేయాలి. ర్యాంకులు కాకుండా గ్రేడింగ్ పద్ధతిని అవలంభించడం వల్ల విద్యార్థులలో ఎక్కువ, తక్కువ భావనలు కలుగకుండా వారి మధ్య అవసరమైన ఆరోగ్యకరమైన పోటీని కల్గించాలి.

**డి) ప్రసార మాధ్యమాలు :**

శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పుల వల్ల ప్రసార మాధ్యమాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకొన్నాయి. వీటి వల్ల ప్రపంచములో ఏమూల, ఏమి జరిగిన వెనువెంటనే అది ప్రపంచంలోని ప్రతి ఒక్కరు తెలుకొనే వీలు కల్గింది. నేడు చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రసారమాధ్యమాలు జీవితంలో అంతర్భాగంగా మారిపోయాయి. ప్రసార మాధ్యమాలు రేడియో, టి.వి. సినిమాలు, వార్తా పత్రికలు, దినపత్రికలు, సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ మొదలైనవి. ప్రతి ఒక్కరి జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రసార మాధ్యమాల ప్రపంచ గమనాన్ని నిర్దేశించే వాటిలో ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చు.

ప్రసార మాధ్యమాల ప్రభావం పిల్లల ప్రవర్తనపై అనుకూలంగా లేదా ప్రతికూలంగా ఉండవచ్చు. ప్రసార మాధ్యమం కత్తిలాంటిది. కత్తిని ఏ విధంగానైతే కూరగాయాలను కోసుకోవడానికి ఉపయోగించుకోవచ్చును లేదా ప్రాణం తీసుకోవడానికి ఉపయోగించుకోవచ్చు. ప్రసార మాధ్యమాలను కూడా అలాగే వ్యక్తుల అభివృద్ధికి లేదా చెడిపోవడానికి ఉపయోగించుకోవచ్చు.

ప్రపంచంలో ఏ మారుమూల ఏమి జరిగింది తెలుసుకొనే అవకాశం నేడు వుంది. విద్యార్థులు ప్రపంచంలో జరిగే సంఘటనలలోని మంచి వాటితో ప్రేరణను, స్ఫూర్తిని పొంది అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. విద్యార్జనలో విద్యార్థులు కేవలం ఉపాధ్యాయుని పైన, పాఠ్య పుస్తకాల పైన ఆధారపడకుండా టీ.వి. రేడియో పాఠ్యాంశాలతో అలాగే ఇంటర్ నెట్ ద్వారా లాభపడవచ్చు. మంచి సినిమాలను చూడటం ద్వారా కూడా మూర్తిమత్వాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. పిల్లలు ప్రసార మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవడానికి తల్లిదండ్రులు అదేవిధంగా పాఠశాలలు తగిన సూచనలు, సలహాలు, మార్గదర్శకత్వాన్ని ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**ఇ) సంస్కృతి పాత్ర:**

ప్రతి సమాజానికి నిర్దిష్టమైన సంస్కృతి ఉంటుంది. సంస్కృతిని ఆ సమాజంలోని వ్యక్తులందరూ అప్రయత్నంగానే పాటిస్తూ వుంటారు. మనం వాడే బట్టలు, ఆభరణాలు, కళలు, భాష, సంగీతం, సాహిత్యం, మతం ఇవన్నీ సంస్కృతిలో భాగాలే.

విశ్వవిద్యాలయ కమీషన్ (1948–49) ప్రకారం "సంస్కృతి అనేది మనిషి మేథస్సులోని దృక్పథము, ఔన్నత్యము, అత్యున్నతమైన మానవ విలువలను తెలియ చేసేది"

జాతీయ విద్యావిధానము (1986) ననుసరించి "విద్యా ప్రణాళిక ద్వారా విషయ బోధన ద్వారా సంస్కృతి బోధింపబడాలి. విద్య ద్వారా ఆధునిక సాంకేతిక విజ్ఞానంతోపాటు సాంస్కృతిక సంప్రదాయాలను పెంపొందించాలంటుంది."

భారతదేశం విభిన్న సంస్కృతుల సమాజం అందుకే విద్యను ఒక సాధనంగా ఎంచుకొని సాంస్కృతిక బహుళత్వాన్ని పరిరక్షించాలి అప్పుడే భిన్నత్వంలో ఏకత్వం వర్ధిల్లుతుంది.

కుటుంబం, సమాజం పిల్లలకు పాఠ్యాంశాల కంటే ఎక్కువే నేర్పిస్తాయి. కాబట్టి పిల్లలను వీలయినంత ఎక్కువగా సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనేటట్లు చూడాలి. దీనివల్ల సాంఘిక, ఉద్వేగపరమైన వికాసం జరుగుతుంది. మన సంస్కృతి,

సంప్రదాయాలు, కట్టుబాట్లు ఇవన్నీ సాంప్రదాయాల క్రిందికి వస్తాయి. అవి కొనసాగడం అనేది పిల్లల సాంఘికాభివృద్ధి ద్వారానే సాధ్యం.

సంస్కృతి అభివృద్ధి మరియు పరిరక్షణకు సాంఘిక వికాసపరంగా క్రింద కార్యక్రమాలు రూపొందించాలి....

- విద్యార్థులకు గత సంస్కృతి విలువలతో పరిచయం చేయడం.
- వివిధ ప్రాంతాలలోని సంస్కృతులను అధ్యయనం చేయడం.
- విద్యార్థులలో నూతన అభిరుచులను ప్రోత్సహించడం
- నూతన సంస్కృతులను పోకడలను అమలు చేయడం.
- సంస్కృతి పరిరక్షణకు ప్రోత్సహించడం
- విద్య ద్వారా వారసత్వ సంస్కృతిని ఒకతరం నుండి మరో తరానికి అందించడం.
- విద్యార్థులలో గతిశీలమైన సంస్కృతిని ఆమోదించగల శక్తి సామర్థ్యాలను పెంపొందించడం.
- పాఠ్య ప్రణాళికలు సంస్కృతి విలువలను ప్రతిబింబించాలి.
- పాఠశాలల్లో సంగీతం, నృత్యం, నాటకాలను ప్రోత్సహించాలి.
- మ్యూజియం, కళాప్రదర్శన శాలలు, విహార వినోద యాత్రలు చేపట్టాలి.
- పాఠశాలల్లో తరచు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.

### 2.5.2 సాంఘిక వికాసంపై ప్రభావాన్ని చూపే ఇతర అంశాలు:

ఎ) పోటీ – సహకారం

బి) క్రమశిక్షణ

సి) బహుమతి – దండన

డి) సంఘర్షణలు

ఇ) దౌర్జన్యం

ఎఫ్) వేదించడం

పై కనబరిచిన వాటి ప్రభావాలు సాంఘిక వికాసం పై ఏవిధంగా ఉంటుందో తెలుసుకుందాం.

**ఎ) పోటీ – సహకారం (Competition and Co-oporation) :**

ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలో పోటీతత్వం అనేది చాలా ఎక్కువగా కన్పిస్తుంది. వ్యాపార రంగాలలో, ఉద్యోగ రంగంలో, విద్యా రంగంలో పోటీతత్వం ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలము. అయితే విద్యా రంగంలో విద్యార్థులలో పోటీతత్వం అనేది ఒక శక్తివంతమైన ప్రేరణ కారకంగా పనిచేస్తుంది. విద్యార్థుల మధ్య పోటీ ఆరోగ్యకరమైనదిగా వుండాలి. ఈ పోటీ లేకపోతే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించలేరు. కొన్ని సందర్భాలలో పోటీతోపాటు సహకారం కూడా అవసరం. పోటీతత్వం ఎంత ఉన్నా తోటి విద్యార్థుల ఉపాధ్యాయుల సహకారం గాని లభించక పోయినట్లయితే విద్యార్థులు ఆశించిన ఫలితాలను సాధించలేరు. అందువలన సహకారం ఎక్కువ అవసరం. సహకారంతో కూడిన స్నేహపూర్వకమైన పోటీతత్వంతో విద్యార్థులలో టీమ్ స్పిరిట్, కమ్యూనిటీ భావం, ఐకమత్యం మొదలైన మంచి అలవాట్లు విద్యార్థులు అలవరుచుకొనేటట్లు ఉపాధ్యాయులు ప్రేరేపించాలి.

**బి) క్రమ శిక్షణ (Discipline) :**

తరగతిలో విద్యార్థులు కొన్ని సందర్భాలలో క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతూ వుంటారు. ఇటువంటి విద్యార్థులను శారీరకంగా దండించకుండా వారు ఆ పని చేయడానికి గల కారణాలను నిశితంగా తెలుసుకొని, విద్యార్థికి దానివల్ల కల్గే నష్టాలను విపులంగా వివరించి, వారి ప్రవర్తనలో మార్పు తీసుకరావచ్చు, మంచి క్రమశిక్షణను అలవరుచుకునే విధంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించాలి. పిల్లలు కౌమారదశ చేరుకొనేటప్పటికి ఎవరి ప్రవర్తనను వారే నియంత్రించుకొనే విధంగా వయోజనుల నైతిక వ్యవస్థను ఇనుమడించుకోవడానికి బాల్యంలో పరిస్థితులకనుగుణంగా ఉండే విలువలకు బదులు సాధారణ నైతిక భావనలను ఏర్పరుచుకోవడం, ఈ భావనలను ఒక కచ్చితమైన నైతిక నిబంధనల ద్వారా ఏర్పరుచుకోవడం, కౌమార దశ అంతానికి ఎవరి ప్రవర్తనను వారే నియంత్రించుకోవడం సాధించగలగాలి. చర్చలు, సెమినార్‌లు, సంభాషణలు, నిర్వహించి కథల ద్వారా మంచి చెడులకు సంబంధించిన అవగాహన కల్పించి విద్యార్థులు చక్కని క్రమశిక్షణను రూపొందించుకొనే విధంగా పాఠశాల, ఉపాధ్యాయులు తోడ్పడాలి.

**సి) బహుమతి – దండన (Reward and Punishment) :**

పాఠశాల వాతావరణంలో బహుమతులు, శిక్ష (దండనాలు) అనేవి విద్యార్థుల్లో ప్రేరణ కల్గించే అంశాలు. అయితే ఉపాధ్యాయులు ఎక్కువగా దండన ఉపయోగించకపోవడం మంచిది. ఎందువల్లనంటే దండనలు లేదా శిక్షలు అంతమంచి ఫలితాలినివ్వలేవు. అంతేకాకుండా ఒక్కొసారి దండనవల్ల వ్యతిరేక ఫలితాలు కూడా సంభవించవచ్చు. కొన్ని సందర్భాలలో మాత్రమే దండనలను, దురలవాట్లను, ప్రవర్తనా సమస్యలను మాన్పించడానికి పనికి వస్తాయి. బహుమతులు అనేవి విద్యార్థులను బాగా ప్రేరిపించి భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించడానికి ఉపయోగపడుతాయి. అలాగే కొన్ని సందర్భాలలో బహుమతుల వల్ల విద్యార్థులలో నిర్లక్ష్య భావం కూడా ఏర్పడవచ్చు. మెరిట్ సర్టిఫికెట్లు, క్యాష్ అవార్డులు మొదలైనవి విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తాయి.

విద్యార్థులు బహుమానం, దండనపై ఆధారపడకుండా వారే సొంత ప్రమాణాలను ఏర్పరుచుకొని వాటిని సాధించేందుకు ప్రయత్నించేటట్లు, తద్వారా సంతృప్తిని పొందేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులను సంసిద్ధులను చేయాలి.

**డి) సంఘర్షణలు (Conflicts) :**

సంఘర్షణ ఏర్పడినప్పుడు వ్యక్తి సరియైన నిర్ణయం తీసుకోవడం చాలా ముఖ్యమైంది. ఎందుకంటే తీసుకొనే నిర్ణయాలపైనే భవిష్యత్తు / జీవితం ఆధారపడి వుంటుంది. కాబట్టి నిర్ణయం తీసుకోవడంలో తొందరపాటు గాని, విపరీతమైన జాప్యం గానీ, వాయిదా వేయడం గాని సరికాదు. సంఘర్షణనలు ఏర్పడినపుడు వాటిలో ఉన్న లోటుపాట్లను అలాగే మనలో ఉన్న సామర్థ్యాలను పరిమితులను, ఆసక్తులను బేరీజువేసుకొని సరైన నిర్ణయం తీసుకోవాలి. ఉపాధ్యాయులు నిత్య జీవిత అనుభవాల ఆధారంగా వివిధ ప్రాజెక్టులు, కృత్యాల ఆధారంగా సంఘర్షణలు ఏర్పడినప్పుడు సరైన నిర్ణయం తీసుకొనే నైపుణ్యాన్ని పెంపొందించాలి.

**ఇ) దౌర్జన్యం (Agqression):**

దౌర్జన్యం అనేది ఇతరులపై చూపే చర్య. ఇది వేరే వ్యక్తిని బాధకు గురి చేస్తుంది. ఈ బాధ శారీరకంగా గాని, మాటల ద్వారా గాని జరగవచ్చు. కొన్ని సమయాలలో ఇతరుల ఆస్థికి నష్టం కూడా జరుగవచ్చు.

దౌర్జన్యం అనేది కుంఠనం(Frustration) వల్ల సంభవిస్తుందనే ప్రాకల్పనను (Hyhesis) డోలార్డ్ తదితరులు

1939 వ సం॥లో పేర్కొన్నారు. సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రకారం ప్రతి వ్యక్తిలో రెండు సహజాతాలు ఉంటాయి. ఎ) ఇరోస్ (Eros) బి) థెనటాస్ (Thenatos). ఇరాస్ అంటే సహజాతం వల్ల ప్రేమ, అనురాగం మొదలైనవి బయల్పడుతాయి. థెనటాస్ అనేది వినాశకరమైన విషయాలకు దారితీస్తుంది. బందురా & వాల్టర్స్ అనే మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుల ప్రకారం దౌర్జన్య పూరిత ప్రవర్తనను పరిశీలించిన పిల్లలు దౌర్జన్యపూరితంగా దౌర్జన్యరహిత ప్రవర్తనను పరిశీలించిన పిల్లలు సాధారణ ప్రవర్తనను ప్రదర్శించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఇతరులు ప్రవర్తనను పరిశీలించి అనేక విషయాలు నేర్చుకొంటారు. కాబట్టి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు స్ఫూర్తిని కల్గించే ప్రవర్తనను పొందివుండాలి.

**ఎఫ్) వేధించుట (Bullying):**

శిశువు తనకిష్టమైన పనిని చేయనీయక పోవడం, తన ఇష్టానికి విరుద్ధంగా పెద్దలు ప్రవర్తించడం మొదలగు కారణాల వల్ల తన కోపాన్ని తన చిన్న పిల్లల మీద తమ యొక్క బాధను రకరకాల పనులద్వారా వ్యక్తపరచడం జరుగుతుంది. ఇటువంటి సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పెద్దలు వాటికి గల కారణాలను అన్వేషించి తగిన మార్గదర్శకత్వ మంత్రణం అందిచనలసిన అవసరం ఎంతైన ఉంది.

## 2.6 సామాజీకీకరణ భావన మరియు ప్రక్రియలు (Concept and proces of Socialization)

### 2.6.1 సామాజీకీకరణ భావన :

అప్పుడే పుట్టిన పసిబిడ్డకు సంస్కృతి నాగరికత, ప్రవర్తనకు సంబంధించిన విషయాలేమి తెలియవు. పెరిగే కొద్ది క్రమంగా సామాజిక విషయాలను నేర్చుకోవడం జరుగుతుంది. ఈవిధంగా సామాజిక విషయాలను నేర్చుకొనే ప్రక్రియనే సామాజీకరణం/సాంఘికీకరణం(Socialization) అంటారు. ఇది పుట్టినప్పటి నుంచి మరణించేంత వరకు నిరంతరం జరిగే ప్రక్రియ. ఇప్పుడు దీనికి సంబంధించిన కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం.

సాంఘిక సంబంధాలలలో పరిపక్వత సాధించడమే సాంఘిక వికాసం – హర్లాక్.

'సమాజ వికాసానికి అవసరమైన సూత్రాలను అభ్యసింపచేసిన ప్రక్రియే సాంఘికీకరణ' – మాక్లైవర్. (Maclver)

'వ్యక్తి సమూహ ప్రమాణాలను అనుసరించటం నేర్చుకొను ప్రక్రియనే సామాజీకీకరణ' అంటారు. – అగ్‌బర్న్.

"సాంఘిక వికాస ప్రక్రియ ద్వారా జైవిక వ్యక్తి మనిషిగా మార్పు చెందుతారు" – గ్యారెట్

"సామాజీకరణ అనేది ఒక సాంస్కృతిక మార్పిడి ప్రక్రియ. ఈ ప్రక్రియ ద్వారా వ్యక్తులు సామాజిక సమూహాల నియమాలను ఆచరణలను నేర్చుకొంటారు" – పీటర్ వర్స్‌లే.

### 2.6.2 సామాజీకీకరణ ప్రక్రియ :

ఇది బాలల సామాజీకరణకు దోహదం చేస్తుంది. బాలలు పెరిగేకొద్ది వారు తామున్న సమాజంలో బాధ్యతగల సభ్యులుగా, పౌరులుగా ఎదగాలి. సమాజిక విలువలను,ప్రజలు పాటించే నీతి నియమాలను, నియమ నిబంధనలను నేర్చుకోవాలి. వారున్న కుటుంబ, సమాజిక విలువలను పరిరక్షించాలి. అవసరమైనప్పుడు మార్చగలగాలి. అవి ముఖ్యంగా సామాజికికరణం ద్వారాజరిగే వికాసం.

వక్తి యొక్క సమాజీకీకరణకు దోహదపడే వివిధ వ్యవస్థలలో, 1.కుటుంబం, 2. పాఠశాల 3. సమాజం అతి ముఖ్యమైనవి.

వీటిని గురించి తెలుసుకుందాం.

**కుటుంబం:**

- వ్యక్తి సామాజీకరణ ప్రక్రియలో చెప్పుకోదగిన ప్రముఖమైన ప్రాథమిక వ్యవస్థ “కుటుంబం”
- కుటుంబపరమైన మరియు సమాజిక పరమైన మంచి లక్షణాలను పెంపొందించడంలో కుటుంబం ఊయల లాంటిది.
- బాలలు ఇంటి పరిస్థితులకునుగుణంగా కుటుంబసభ్యులతో పరస్పర సంబంధాలతో, సహజీవనంతో సక్రమమైన కుటుంబ సాంప్రదాయనీతి, నియమాలను, ఆచార వ్యవహారాలను ఆహారపు అలవాట్లను, మత పరమైన అంశాలను, పండుగలను, వినోదాలను తెలుసుకుంటారు.
- సాంఘికపరమైన అనేక విషయాలలో నమ్మకాలు, దృక్పథాలు, అలవాట్లు కుటుంబంలోనే ఏర్పడతాయి. తీర్చిదిద్దబడతాయి.
- కుటుంబానికి సమాజంలో ఉన్న అంతస్తు,హెూదా ఆ కుటుంబములోని వారు చేసే స్నేహాలు – పరిచయాలు, బాలల సామాజిక వికాసాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది.

**సామాజికీరణంలో కుటుంబం పాత్ర:–**

- సాంఘిక మానసిక/శారీరక అవసరాలను తీరుస్తుంది.
- సక్రమమైన శీల నిర్మాణానికి పునాది వేస్తుంది.
- కుటుంబ సభ్యుడుగా పౌరసత్వభావనను పెంచుతుంది.
- భాషా జ్ఞానాన్ని, ఆహారపు అలవాట్లను, పండుగలు వాటి ప్రాముఖ్యతని తెలుపుతుంది.
- సంప్రాదాయాలను గౌరవవింపచేస్తుంది. పెరుగుతున్న బాలల ప్రవర్తనను నియంత్రిస్తుంది.
- జీవనోపాధికి మార్గం సూచిస్తుంది.

**2. పాఠశాల:–** వ్యక్తికి కుటుంబం తరువాత ఎంతో కీలక పాత్రను వహిస్తుంది పాఠశాల .

**సామాజికీరణంలో పాఠశాలపాత్ర:–**

- తరతరాలుగా వచ్చే సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ బాలలకు అందిస్తుంది
- సమాజంలో ఏర్పడే మార్పులకు అనుగుణంగా బాలలను తయారు చేస్తుంది.
- బాలలలో సామాజిక సమర్థతను పెంపొందిస్తుంది. సమాజాన్ని ముందుకు నడిపించగల సామర్థ్యాలకు నైపుణ్యాలను ఏర్పరుస్తుంది.
- సమాజం ఏర్పరుచుకున్న నైతిక విలువలను,సామాజిక విలువలను,జైవిక విలువలను పెంపొందిస్తుంది.

- పాఠశాల తరువాత బాలలు ఎదుర్కొనే సమాజ అనుగుణ్యతను కల్పిస్తుంది.
- బాలల్లో సమాజానికి కావలసిన నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది.
- బాలలను మంచి పౌరులుగా తయారు చేస్తుంది.

**3.సమాజం :-**

"కొందరు వ్యక్తులు సమూహంగా ఏర్పడి ఒక ప్రత్యేకమైన సంస్కృతిని కలిగి ఒక నిర్ణీత ప్రదేశంలో నివశించే వారందరిని కలిపి సమాజం" అంటారు.

కావున వ్యక్తులు లేనిదే సమాజం లేదు. వ్యక్తులు సమాజంలో ఒకరితో ఒకరు పరస్పర సంబందాలు కలిగి, సఖ్యతతో వారి సాంఘిక అవసరాలను తీర్చుకొంటూ, సహజీవనం సాగిస్తూ ... సంస్కృతిని కాపాడుకుంటూ, కావలసినప్పుడు తమకు అనుకూలంగా మార్చుకొంటూ జీవిస్తుంటారు.

**సామాజికీరణంలో సమాజం పాత్ర:-**

- మంచి పాఠశాలలను స్థాపించి నిర్వహిస్తుంది.
- గ్రంథలయాలను స్థాపిస్తుంది.
- అక్షరాస్యతను తమ పౌరులలో పెంపొందిస్తుంది.
- రాజ్యాంగబద్ధమైన నీతి, నియమాలను విధి విధానాలను రూపొందించి పౌరులకు అందిస్తుంది.
- సమాజ అవసరాలకు అనుగుణంగా వృత్తి ప్రాతిపదిక విద్యను అందిస్తుంది.
- నైతిక విలువలు, మానవ విలువలు, సామాజిక విలువలను ప్రోత్సహిస్తుంది.
- పౌరుల హక్కులను, బాలల హక్కులను కాపాడుతుంది.
- మంచి పౌరసత్వానికి అనువైన తర్ఫీదును కల్పించడానికి దోహదపడుతుంది.
- పౌరుల ఆర్థిక స్తోమత తను పెంచడానికి శిక్షణను అందిస్తుంది.
- ప్రజలలో సక్రమమైన శారీరక, మానసిక, నైతిక వికాసాల కొరకు శిక్షణ కల్పిస్తుంది
- ప్రజలలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది.

**సామాజికీరణ ప్రక్రియలో ఉపాధ్యాయుని పాత్ర:-**

- సమాజపరంగా ఉండే సాంస్కృతిక అంశాలను విద్యార్థుల ద్వారా విస్తృతం చేయాలి.
- సాంస్కృతిక కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించే విద్యార్థులందరూ పాల్గొనేటట్లు చూడాలి.
- పాఠశాల సాంప్రదాయాలను సక్రమంగా పాటించేటట్లు చేయాలి.
- సామూహిక కార్యక్రమాలను ఆటల రూపంలోను, విహారయాత్రలు గాను, పోటీలు నిర్వహించి విద్యార్థులు పాల్గొనేటట్లు ప్రోత్సహించాలి.

- జానపద/గ్రామీణ పాటలు, నృత్యాలను వివిధ రాష్ట్రాల పాటలు, నృత్యాలను వివిధ మతాల పండుగలను పాఠశాలలో నిర్వహించాలి.
- పాఠశాల దినోత్సవాలు, సాంస్కృతిక ఉత్సవాలు జాతీయ, రాష్ట్ర దినోత్సవాలు, వారోత్సవాలు, పార్లమెంటు, మాక్ అసెంబ్లీలలో పాల్గొనేటట్లు చేయాలి.

### 2.6.3 సామాజీకీకరణ – సాంఘిక ఆర్థిక పరిస్థితులు మరియు సాంస్కృతిక వైవిధ్యాలు:

సామాజీకీకరణ పై వ్యక్తుల సాంఘిక, ఆర్థిక పరిస్థితులు మరియు సంస్కృతి ప్రభావాన్ని చూపుతాయి.

**ఎ) సాంఘిక మరియు ఆర్థిక పరిస్థితులు** (Social & Economic Conditions) :

కుటుంబం సాంఘిక, ఆర్థిక స్థాయిలు కూడ పిల్లల సామాజీకీకరణ పై ప్రభావం చూపిస్తాయి. సాంఘికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబంలోని పిల్లలకు సులభంగా సమాజంలో గుర్తింపు, విస్తృతమైన అనుభవాలు పొందే అవకాశం వుంటుంది. ఈ పిల్లలకు ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో సాంఘిక, ఆర్థిక స్థాయి ఉన్నతంగా ఉండే కుటుంబంలోని పిల్లలు డబ్బు విలువ తెలియక, డబ్బును దుర్వినియోగం చేస్తూ విలాసవంతమైన జీవనానికి అలవాటుపడి, వ్యసనానికి బానిసలవుతారు. విద్యావంతులైన తల్లిదండ్రులు తమ పిల్లల్లో స్వయం నియంత్రణ వికాసానికి ప్రాధాన్యత ఇస్తారు.

పేద కుటుంబానికి చెందిన శిశువులు పేదరికం కారణంగా శిశువుల వికాసం సక్రమంగా ఉండదు. పెద్దలు రకరకాల ఒత్తిడులకు, వ్యవసనాలకు లోనై కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు బలహీనంగా వుంటాయి. పిల్లల పట్ల సరియైన శ్రద్ధ చూపకపోవడం, నిర్లక్ష్యం కారణంగా పిల్లల సామాజీకీకరణ కూడా తక్కువ స్థాయిలో వుంటుంది. చాలావరకు వారి విద్యా సామర్థ్యం కూడా ఆశించిన స్థాయిలో వుండదు.

**బి) సామాజీకీకరణ – సంస్కృతి** (Cultural Conditions) :

మానవ సమాజానికి సంస్కృతి చాలా ముఖ్యమైనది. మామూలు అర్థంలో అంటే సభ్యత – సంస్కారం అని అంటాం. ఇతరుల పట్ల మంచిగా, మర్యాదగా, గౌరవంగా వుండటమే సభ్యత, సంస్కారం, సంస్కృతి అనే పదాన్ని చాలామంది చాలా రకాలుగా నిర్వచించారు. కొందరి నిర్వచనాలు కొన్ని క్రింద ఇవ్వబడ్డాయి.

“ సమాజంలో ఒక సభ్యుడిగా మనిషి సంపాందించుకున్న విజ్ఞానం, విశ్వాసం, కళ, నీతి, సూత్రాలు, న్యాయం, ఆచారాలు, మరియు ఇతర సామర్థ్యాలు, అలవాట్లు మొత్తాన్ని కలిపి సంస్కృతి” అని. – ఇ.బి.టేలర్ నిర్వచించారు.

“మానవుడు సృష్టించిన పరిసరమే సంస్కృతి.” – ఎం.జె. హెర్కొవిట్స్

సంస్కృతి గతి శీలమైనది, అవసరాలను తీర్చి, కోర్కెలను సంతృప్తి పరిచేది కనుక ఆయా సమాజ వ్యక్తుల రీతి, రివాజులననసరించి సంస్కృతులు మారుతూ వుంటాయి. అందుకే ఒక సంస్కృతి ప్రజలు మరో సంస్కృతిలో ఇమడటానికి ఇబ్బంది పడుతుంటారు.

సంస్కృతిలోని వివిధ అంశాలు పిల్లల సామాజీకీకరణ పై ఏవిధంగా ప్రభావాన్ని చూపిస్తాయో తెలుసుకొందాం.

### 2.6.4 సామాజీకీకరణ – సమవయస్కులతో సంబంధాలు (Relationship with peers)

ఒకే వయస్సు, వికాస స్థాయి అభిరుచులు, సామర్థ్యాలు దాదాపు ఒకే మాదిరిగా వుండే పిల్లల సమూహాన్ని సమవయస్కులు అంటారు.

గ్రామీణస్థాయి మరియు పట్టణప్రాంత సమవయస్కుల మధ్య కొన్ని తేడాలుంటాయి. గ్రామీణస్థాయిలో సమూహాలు

తెలిసిన పిల్లల మధ్యనే ఏర్పడి మత, కుల, అభిరుచులను బట్టి వుంటాయి. కానీ పట్టణ స్థాయిలో తల్లిదండ్రుల సాంఘిక స్థాయి, విద్యార్హతలు, నివసించే ప్రాంత పరిస్థితుల ప్రభావంగా సమవయస్కుల అభిరుచులు, లక్ష్యాలు, ఆశయాల పరంగా సమూహంగా ఏర్పడుతారు.

- ☞ సమూహంలోని సభ్యులందరు వారివారి అభిరుచి, ఆసక్తికి తగినట్లుగా వివిధ బాధ్యతలను నిర్వహిస్తూ వుంటారు.
- ☞ సందేహాల నివృతిలో తల్లిదండ్రుల కంటే, ఉపాధ్యాయుల కంటే సమవయస్క సభ్యులే ఎక్కువ పాత్ర వహిస్తారు. వేషబాషాల్లో, మాట్లాడే తీరు ప్రవర్తనా పద్ధతుల్లో సంపూర్ణ పరిపక్వతను పిల్లలు సమవయస్కుల నుండే పొందుతారు.
- ☞ పిల్లలు భావ వ్యక్తీకరణను విలువలు, ఇష్టా అయిష్టాలను సమవస్కులతో కలిసి మెలిసి ఉన్నపుడే వ్యక్తపరుస్తారు. అందువలన ఒకరి పట్ల ఒకరికి పూర్తి అవగాహన వుండి, సమూహంలో జరిగే పొరపాట్లను వారే సరిదిద్దుకొనే ప్రయత్నం చేస్తారు.
- ☞ ఆచారాలు, సంప్రదాయాలు మరియు అలవాట్లు విషయంలో పాఠశాల తర్వాత సమవయస్కుల సమూహమే బాధ్యత వహిస్తుంది.

ఎ) **స్నేహాలు – జెండర్** (Friendship and Gender) :

కౌమారులు ఎక్కువ సమయం సమవయస్కులతో గడుపుతారు. కాబట్టి వారి వైఖరులు, భాషణ, అభిరుచులు, వేషభాషలు, ప్రవర్తన పై సమవస్కుల ప్రభావం వుంటుంది. వారు ఎన్నుకొన్న సమవయస్కులలో అసాంఘిక ప్రవర్తన ఉంటే అవే అలవాట్లు కౌమారులు కూడా నేర్చుకొంటారు. కౌమార దశ అబ్బాయిలు, అమ్మయిలు ఎవరికి వారు స్వంత గుర్తింపు కోసం కోరుకోవడం, స్నేహితులను ఎన్నుకోవడం, ఏర్పరచుకొన్న విలువల కారణంగా సమవయస్కుల ప్రభావం తగ్గుతుంది. సాధారణంగా మగపిల్లల సమూహాలు ఎక్కువ పెద్దగా వుంటాయి. కాని వారి మధ్య బంధం అంతబలంగా ఉండదు. అదే ఆడపిల్లల సమూహాలు తక్కువ సభ్యులతో ఉన్నప్పటికి బలమైన కచ్ఛితమైన బంధాన్ని కల్గి వుంటాయి.

బాలబాలికలు పాఠశాలలో నిర్వహించు కార్యక్రమాల వల్ల ముఖ్యంగా కౌమార విద్య కార్యక్రమం (Adolescent education programme) బాలికలు మహిళా ఉపాధ్యాయులు మరియు తల్లి ఆధ్వర్యంలో లైంగికత పట్ల అవగాహనను ఏర్పరచుకొంటారు.

బి) **పోటీ**(Competetion), **సహకారం** (Coorperation)

పోటీ అనేది ప్రేరణకు అనుబంధంగా పనిచేస్తుంది. ఆరోగ్యకరమైన పోటీని కల్పించడం వల్ల విద్యార్థులు అభ్యసన యందు ప్రేరణ పొంది సత్ఫలితాలను సాధించగలరు. ఆరోగ్యకరమైన పోటి మంచి స్నేహానికి దారితీస్తే, అనారోగ్యకరమైన పోటి అసూయ ద్వేషాలకు మరియు సంఘర్షణలకు దారితీస్తుంది. పోటీ వల్ల వ్యక్తుల మధ్య సాధనా స్థాయి పెరుగుతుంది. సభ్యుల మధ్య సహకారం, సమన్వయమనేది సందేహాలను నివృతి చేసి ఆరోగ్యకరపోటీకి దోహదపడుతుంది.

సి) **పోటీ మరియు సంఘర్షణ** (Compitition and Conflict)

సాధారణంగా పిల్లలు ఒకరితో ఒకరు కలుసుకోవడానికి ఇష్టపడుతారు. అప్పుడు అప్పుడు వారి

ఆలోచనలలో,వైఖరులలో విభేదాలు ఏర్పడుతుంటాయి. తద్వారా వారి మధ్య వివాదాలు ఘర్షణలు ఉంటాయి.కాని అవి ఎక్కువ కాలం ఉండవు. కొంత కాలానికి వాటి మర్చిపోయి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం సహజం, సర్వసాధారణం. కాని పిల్లల కొట్లాటలు ఎక్కువ కాలం ఉండవు, కొంత సేపటికి కొట్లాటలను మరిచిపోయి ఒకరితో ఒకరు కలిసి స్నేహంగా ఉండడం జరుగుతుంది. తదుపరి వయసు మరియు వికాసాభివృద్ధి పరంగా ఉద్వేగపరిపక్వత మరియు సాంఘిక పరిపక్వత పెరిగి సంఘర్షణలు క్షీణిస్తాయి.

**డి) దౌర్జన్యం మరియు వేదించడం** (Aggression and bullying)

సాధారణంగా వ్యక్తులకు కోరికలు అపరిమితం. ఏ వ్యక్తికి కూడా అన్ని కోరికలు తీరవు. పిల్లల్లో కూడా తాము సాధించాలనుకున్న వాటిని సాధించలేనపుడు ఏర్పరుచుకొన్ని గమ్యాలను చేరుకోలేనప్పుడు దౌర్జన్యశీల ప్రవర్తనను వ్యక్తపరచడం జరుగుతుంది.

దౌర్జన్యశీలం – 1. వాక్‌దాడి,2. భౌతిక దాడి, 3. పరికరాత్మక దాడి(ఆయుదాలతో దాడి) చేయడం.

కోపం ఎక్కువగా ఉన్నప్పుడు కూడా దౌర్జన్యానికి పాల్పడే అవకాశం ఉంది. కావున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను నిందించడం మరియు శిక్షించడం కంటే ముందుగా ఆ ప్రవర్తనకు గల కారణాలను, నేపథ్యాన్ని పరిశీలించి, పర్యవసానాలను వివరించినట్లయితే పిల్లల్లో దౌర్జన్యకర ప్రవర్తనలను కొంతవరకు నివారించవచ్చు. ఈ సందర్భంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తన రూపొందించుటకు పాఠశాలలో ధ్యానం, యోగ వంటి కార్యక్రమాలను అమలు పరచడం,విద్యార్థులకు వారి సామర్థ్యాలకు తగినట్లుగా అనువైన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలుపరిచి వారి ఉద్వేగాలను అదుపుచేయడం, వాస్తవికత దృక్పథాలను తెలియజేస్తే బాగుంటుంది.

**ఇ) వేధించడం** (Bullying)

సామాజీకీకరణ ప్రక్రియలో మరొక దౌర్జన్యకర ప్రవర్తన ఏడ్పించడం, వేధించడం(Bullying). శిశువును తనకిష్టమైనవి చేయనీయకపోవడం, తన ఇష్టానికి విరుద్దంగా పెద్దలు ప్రవర్తించడం, మొదలగు కారణాల వల్ల తన ఈ కోపాన్ని తనకంటే చిన్నపిల్లల పట్ల తమ యొక్క బాదను రకరకాలు హింస ద్వారా వ్యక్తపరచడం జరుగుతుంది. ముఖ్యంగా గిల్లడం, గిచ్చడం, గుచ్చడం, జుట్టు లాగడం, దుస్తులు లాగడం చేస్తారు. ఆడపిల్లల కంటే మగపిల్లలు ఎక్కువగా ఇతరులు బాధిస్తారు. ఇటువంటి సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాళ్ళలోని న్యూనతా భావాలను అర్థం చేసుకొని సహనం వహించి కారణాలను అన్వేషించి తగిన మార్గదర్శకత్వ మంత్రణం ద్వారా వాళ్ళలోని ప్రవర్తనలో మార్పు తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుంది.

సామాజీకీకరణ ప్రక్రియలో సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు పిల్లలపై ప్రభావాన్ని చూపుతాయి. అందువలన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలలో చక్కటి సాంఘిక పరిపకత్వను రూపొందించుటకు వారి స్నేహాలను గమనిస్తూ అవసరమైతే ఎప్పటికప్పుడు వారిలో వాటవల్ల కల్గు దుష్పరిణామాలను వివరించి తగిన సూచనలు సలహాలను అందిస్తూ పిల్లల మధ్య ఆరోగ్యకరమైన పోటి ఉండేలా శ్రద్ధ వహించాలి. పిల్లల మధ్య సహాయ, సహకారం వంటి లక్షణాలను పెంపొందించాలి. జీవన నైపుణ్యాల శిక్షణ ద్వారా ముఖ్యంగా సహానుభూతి నైపుణ్యాలు పెంపొందించి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధికి తోడ్పడాలి.

## 2.7 ఉద్వేగ వికాసం (Emotional Development) :

పిల్లల్లో ఉద్వేగ వికాసం వివిధ దశల్లో వివిధ రకాలుగా అభివృద్ధి చెందుతూ వుంటుంది. పిల్లలకు పుట్టినప్పుడు ఉత్తేజము (Excitement) మాత్రమే ఉంటుంది. కొంత కాలం తర్వాత ఉద్వేగాలు ఒక నమూనాను అనుసరించి వికాసం చెందటం జరుగుతుంది. మొదటి సంవత్సరం లోనే ఉద్వేగాత్మక అభివ్యంజనం (Emotional expression) విశదంగాను, స్పష్టంగాను ఉంటుంది. కాబట్టి పసిబిడ్డ ఆలోచనలు, భావాలు మనకర్థమవటం జరుగుతుంది.

సాధారణంగా ఉద్వేగాలకు లోనుగాని వ్యక్తి అంటే ఎవరు ఉండరు. అయితే ఇవి కొందరిలో ఎక్కువగాను, మరికొందరిలో తక్కువగాను కనిపిస్తుంటాయి. నిత్యజీవితంలో అనేక కారణాలు మన ఉద్వేగాలకు కారణమవుతాయి. సంతోషం, దుఃఖం, ప్రేమ, నవ్వు, నిరాశ, భయం, కోపం మొదలైనవన్నీ ఉద్వేగాలు అనుభూతులు లేని జీవితాన్ని నిస్సారంగా వుంటుంది దానినిఊహించలేము.

### 2.7.1 ఉద్వేగాలు - ప్రాథమిక అవగాహన (Emotions - Basic understanding):

ఉద్వేగం లేదా ఎమోషన్ (Emotion) అనే ఆంగ్లపదం ఎమోవర్ (Emovere) అనే లాటిన్ పదం నుండి ఉద్భవించింది. Emovere అంటే ఉద్వేగ పరుచుట, ప్రేరేపించుట లేదా ఉత్తేజపరుచుట అని అర్థం.

ఉద్వేగం అంటే శారీరకంగా, మానసికంగా ప్రేరేపించబడిన లేదా కలియబెట్టబడిన మస్తిష్క స్థితి.

వ్యక్తి యొక్క తీవ్రమైన అంతరంగిక చలన స్థితి అని కూడా అంటాం.

సామాన్యంగా క్రింది పరిస్థితులలో బాలలు ఉద్వేగాలకు లోనవుతారు.

1. బాలల జీవనావసరాలు, మానసిక అవసరాలు సంతృప్తి చెందక పోవడం వల్ల
2. వివిధ పరిస్థితులలో, సన్నివేశాలలో కలిగే కోరికలు, ఆకాంక్షలు, ఆటంకాల వల్ల
3. బాలలు పెంపొందించుకోవలసిన విలువలు, స్వభావాలను బట్టి ఉద్వేగాలు ఏర్పడతాయి.

ఉద్వేగాలు రెండు రకాలు –

1. సంతోష, ఆనంద జనిత ఉద్వేగాలుగా – ప్రేమ,వాత్సల్యము,ఆనందం,సంతోషం, దయ, జాలి మొదలగు వాటిని చెప్పుకోవచ్చు.
2. దుఃఖం, బాధజనిత ఉద్వేగాలుగా – కోపం, అసూయ, ఈర్ష్య,ఆతృత, పగ మొదలైన వాటిని దుఃఖ జనిత ఉద్వేగాలుగా చెప్పుకోవచ్చు.

భారతీయ శాస్త్రీయ నృత్యం, నాటకాల ప్రకారం ప్రాథమికంగా ఉద్వేగాలు తొమ్మిది. వాటిని నవరసాలు అని కూడా పిలుస్తారు. అవి ప్రేమ, హాస్యం, విచారం, రౌద్రం, కోపం, ఉత్సాహం, భయం, విసుగు, ఆశ్చర్యం.

ఈ ఉద్వేగాలకు లోనయ్యే వ్యక్తులు లేక బాలలు సాధారణంగా కనబరిచే లక్షణాలను ....

- వ్యక్తి అంతర్గతంగా, శారీరకం, మానసిక అంశాలలో తీవ్ర పరిస్థితి ఏర్పడుతుంది.
- గుండె ఎక్కువగా కొట్టుకోవడం, రక్త పోటులో మార్పు కనబడడం, శరీరం కంపించడం, నోరుతడి ఆరిపోవడం, చెమటలు పట్టడం లాంటివి అగుపడతాయి.

- కనుచూపులలో, ముఖ కవళికలలో మార్పులు ఏర్పడతాయి.
- ఆలోచనలు, స్మృతి, విచక్షణ, జ్ఞాపకశక్తి కోల్పోవడం జరుగుతుంది.

### 2.7.2 ఉద్వేగ వికాస దశలు:

పిల్లలు పెరిగేకొద్దీ ఉద్వేగాలలో కొత్తదనం కనపరుస్తూ రోజురోజుకు సామన్యీకరణాన్ని (Generalization) పొందటం జరుగుతుంది. పిల్లల్లో పుట్టినప్పుడు ఉండే ఉత్తేజం క్రమంగా మూడు నెలల వయస్సులో అది దుఃఖం, ఆనందంగా విడవడి రెండు సంవత్సరాలకు భయం, కోపం, విసుగు, అసూయ, సంతోషం, ఆనందం, ఉల్లాసం, పెద్దల పట్ల ప్రేమ, పిల్లల పట్ల ప్రేమానురాగాలుగా ఏర్పడుతాయి. ఐదు సంవత్సరాలకు సిగ్గు, వ్యాకులత, భయం, విసుగు, ఆశాభంగం, కోపం, ఈర్ష్య మొదలైనవిగా కనబడుతాయి.

పుట్టుక నుండి అంతస్రావ గ్రంథులు చురుకుగా లేనందు వలన ఉద్వేగ ప్రతిస్పందనలు మొదట్లో అతి సౌమ్యంగా వుండి రానురాను గ్రంథులు చురుకుగా పనిచేసే కొద్ది ఉద్వేగాలు తీవ్రతరమవుతాయి. కాబట్టీ ఉద్వేగవికాసాన్ని వికాస దశల క్రమంగా వివిధ దశలలో ఉద్వేగ వికాసంను అధ్యయనం చేస్తే బాగుంటుంది.

శైశవంలో ఉద్వేగాలకు రెండు విశిష్ట లక్షణాలుంటాయి. ఒకటి ఈ దశలోని ఉద్వేగాలు వయోజనులు, కౌమారులు, బాల్యం ఉద్వేగాల నుంచి బాగా విభేదిస్తాయి. అంటే వారికి ఉద్వేగాన్ని కల్గించే ఉద్దీపన తీవ్రతకు అవసరమైన దానికంటే ఎక్కువగా స్పందిస్తారు. ఉద్వేగాల తక్కువ సమయం ఉండటం, ఇతర వస్తువుల పైకి దృష్టిని మరల్చగానే ప్రస్తుత ఉద్వేగాన్ని మరచిపోవడం లాంటివి. రెండవది ప్రజ్ఞాత్మకంగా ఎక్కువగా అభివృద్ధి చెందనందువల్ల పూర్వ అప్రియమైన ఉద్వేగాలు కల్గించిన ఉద్దీపనల పట్ల అదేవిధమైన ఉద్వేగాన్ని పెంచుకొంటారు. సాధారణంగా ఈ దశలో కనిపించే ఉద్వేగాలు, కోపం, భయం, కుతూహలం, సంతోషం, ప్రేమ మొ॥నవి.

పూర్వ బాల్యంలో ఉద్వేగాలు ఎక్కువ తీవ్రంగా తరచుగా వస్తూవుంటాయి. కాబట్టీ వారితో వ్యవహరించడం కొంత కష్టం. ఇవి అసూయ, తీవ్రమైన భయం, హఠం, వాటి ద్వారా ప్రకటించబడతాయి. ఉద్వేగాలకు కారణం మాత్రం మనోవైజ్ఞానికమైందే కాని శరీర ధర్మానికి సంబంధించి కాదు. శైశవ దశలో ప్రారంభమైన కోపం, భయం, కుతూహలం, సంతోషం, ప్రేమతోపాటు ఈ దశలో అసూయ, ఈర్ష్యలు కూడా ప్రారంభమవుతాయి. ఈ దశలో శైశవ దశలోని కారణాలు కాక కొన్ని కొత్త కారణాల వల్ల ఉద్వేగాలు ఉత్పన్నమవుతాయి. ఉదాహరణకు కథలు, బొమ్మలు, సినిమాల వంటి వాటి వల్ల కూడా భయం, సంతోషం, కల్గడం, ఏదైనా కృత్యాన్ని పూర్తిచేయడం లేదా ఆటలో గెలిస్తే సంతోషం పొందడం వంటివి. ఈ దశలో సాధారణంగా ఈర్ష్య అసూయలకు కారణాలు తల్లిదండ్రులు దృష్టి వారి మీద కాకుండా ఇతరులతో పంచుకోవడం లేదా తాము చేయలేని పనిని ఇతర పిల్లలు చేయడం, వారి దగ్గర లేని వస్తువు ఇతరుల దగ్గర ఉండటం వంటివి. ఈ దశలో ఇంకొక లక్షణం లింగపరంగా బాలల ఉద్వేగ ప్రకటనలో తేడాలు ప్రారంభం కావడం.

ఉత్తర బాల్యంలో పిల్లలు ఉద్వేగ ప్రకటన, ముఖ్యంగా అనహ్లాదకరమైన ఉద్వేగాల ప్రకటన, వారి వయస్సు వారికి సాంఘికంగా ఆమోదించదగిందికాదని తెలుసుకొంటారు. వారి వయసు వారు హఠం చేయడం చిన్న పిల్లల ప్రవర్తన లాగా వుంటుందని, భయానికి పారిపోవడం పిరికితనం అని భావిస్తారు. ఫలితంగా వారు బలమైన ఉద్వేగ నియంత్రణ నేర్చుకొంటారు.

ఉత్తర బాల్య దశలో కనబరచే ఉద్వేగాలు పూర్వ బాల్యదశతో పోల్చదగినదైనప్పటికీ కొన్ని విషయాలలో విభేదిస్తాయి. మొదటిది, వాటిని రేకెత్తించే పరిస్థితులు, రెండవది వాటి ప్రకటన తీరు. దీనికి కారణం, ఉత్తర బాల్యదశనాటికి కలిగే అనుభవం, అభ్యసనం పరిపక్వత, సాధారణంగా ఈ దశలో కోపం అనేది, వారిపట్ల ఎవరైనా తప్పుగా మాటలాడినపుడు కల్గుతుంది. ఈదశలో కూడా పరిసరాలలోని కారణాలవల్ల తీవ్ర ఉద్వేగాలకు లోనైనప్పటికీ ముందు దశతో పోలిస్తే ఉద్వేగ పరంగా ఇది నెమ్మదిగా ఉండేదశ.

ఈ దశ ఉద్వేగ వికాసంలో ప్రత్యేక అంశం 'ఉద్వేగ కెథార్సిస్' అంటే ఈ దశలో కూడా పిల్లలకు ఉద్వేగపరంగా భంగపరిచే సంఘటనలు అనుభవమైనప్పటికీ వాటిని ప్రకటించడంలో నియంత్రణ నేర్చుకొంటారు. దీనిలో భాగంగా వారిలో ఉన్న భావనలను, ఏదైనా కృత్యాల ద్వారా శాంతపరుస్తారు. ఇలా మనలను మనం ఉద్వేగ ఒత్తిడి నుంచి కాపాడుకోవడం కోసం చేసే పనిని 'ఉద్వేగ కెథార్సిస్' అంటారు. ఇందులో అవలంభించే పద్ధతులు అనేకం. అవి ఎక్కువగా యత్నదోష పద్ధతి ద్వారా అలవరుచుకొనేవే తప్ప మార్గదర్శకత్వం ద్వారా కాదు. ఇలా కొంతమంది ఆ సమయంలో ఏదైనా ఆటను ఆడటం లేదా బాగా దగ్గరి స్నేహితులతో చెప్పుకోవడం వంటి పనుల ద్వారా తమను తాము శాంతపరుచుకంటారు.

భావోద్రేక వికాసం అభ్యసనం (Learning), పరిపక్వత (Maturation) అనే రెండు కారకాల మీద ఆధారపడి వుంటుంది. ఉదాహరణకు మొట్టమొదటి శిశువుకు పాము అంటే భయం ఉండదు. కాని పాము హానిచేస్తుందనే విషయం క్రమేణా తెలుసుకొని పాముకు భయపడటం జరుగుతుంది. అదేవిధంగా వయసు పెరిగే కొద్ది ఉద్వేగ పరిపక్వత ఏర్పడుతుంది.

**కొన్ని సాధారణ ఉద్వేగాలు (Some common Emotions) :**

వ్యక్తుల్లో కనపడే కొన్ని సాధారణ ఉద్వేగాల గురించి తెలుసుకుందాము. అవి.

1. భయం, 2. కోపం, 3. అసూయ, 4. వ్యాకులత, 5. కుతూహలం

**I. భయం (Fear) :**

భయం, మౌలిక ఉద్వేగాలలో ఒకటి. భయం శారీరకంగా లేక మానసికంగా హాని కలుగుతుందని అనుకున్నప్పుడు వ్యక్తి లో కలిగే మానసిక స్థితి.

భయం అనేది బాధా పూరిత ఉద్వేగమైనా దాని వలన కొంత మంచి కూడా జరుగుతుంది. దేవునికి భయపడి సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండడం, అధికారికి భయపడి సరిగ్గా పనిచేయడం, ప్రమాదాలకు భయపడి జాగ్రత్తగా రొడ్డు భద్రతా నియమాలను పాటించడం – పరీక్ష తప్పుతానేమోనన్న భయంతో విద్యార్థి చదవడం లాంటి మంచి పనులేన్నో చూస్తూఉంటాం.

భయం అనేది ఒక స్థాయి వరకే వ్యక్తికి అదుపులోఉంటుంది. హద్దులు దాటితే అది అసాధారణమైన అను గుణ్యతలకు వ్యక్తిని లోనుచేస్తుంది. భయం విపరీతమైన తీరులకు భీతులకు (Phobia)దారితీయవచ్చు.

బాలల్లో భయాన్ని పోగొట్టడం ఎలా?

- ♦ భయాన్ని గురించి సరైన వివరణ ఇవ్వాలి.
- ♦ ధైర్యం కలిగే మాటలు చెప్పాలి.
- ♦ వివేక రహితమైన భయాలను సవివరంగా వివరించి నమ్మకం కలిగించాలి.
- ♦ భయాలను ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించాలి.

♦ భయాలను కలిగించే వస్తువులు, పరిస్థితులకు క్రమంగా అలవాటు చేయాలి.

♦ ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొన్నవారిని చూపి ధైర్యవహించేటట్లు చేయాలి.

సాధారణంగా బాల్యదశలో ఎక్కువగా వుంటుంది. తల్లిదండ్రులు ఒక్కొక్కప్పుడు 'బూచి' వస్తుందని; 'దెయ్యం' వస్తుందని భయపెట్టడం జరుగుతుంది. అట్లా భయపెట్టడం హానికరమైన ఫలితాలకు దారితీస్తుంది. లోటస్ (Lowton) అనే శాస్త్రవేత్త భయాన్ని 4 వర్గాలుగా విభజించారు.

ఎ) కొన్ని వస్తువులకు సంబంధించిన భయాలు : ఉదాహరణకు ఇంజక్షన్ అంటే భయం.

బి) ప్రత్యక్ష అనుకరణ ద్వారా భయం ఏర్పడటం : ఉదాహరణకు తుఫాను వచ్చినప్పుడు తల్లిదండ్రులు, ఇతర పెద్దలు ప్రవర్తించిన తీరును చూసి పిల్లవాడు దాన్ని అనుకరించడం వల్ల అతనిలో తుఫాను పట్ల భయం ఏర్పడవచ్చు.

సి) బాధాకరమైన అనుభవాల ద్వారా భయాలు ఏర్పడటం : ఉదాహరణకు ఒక కుక్క శిశువును కరచినట్లయితే, అది ఆ శిశువులో బాధాకరమైన అనుభవంగా స్థిరపడుతుంది.

డి) వయస్సుతోపాటు కొన్ని భయాలు, భయాందోళనలు మారిపోతాయి. వయస్సులో భయాన్ని కల్గించే విషయాలు లేదా వస్తువులు మరో వయస్సులో భయాన్ని కల్గించకపోవచ్చు. ఉదాహరణకు చిన్న వయస్సులో టపాసులు కాల్చడమంటే భయపడే శిశువు కొంచెం పెద్దయ్యాక టపాసులు కాల్చడమనే భయం తొలగిపోవచ్చు.

**2. కోపం** (Anger) **:**

సామాన్యంగా పిల్లలో కోపస్వభావము ఎక్కువగా వుంటుంది. కోపంతో వస్తువులు విసిరేస్తూ వుంటారు. పిల్లలు తమ కార్యక్రమాలకు భంగం కల్గించినపుడు చిరాకు, కోపం వ్యక్తపరుస్తారు. అదేవిధంగా పెద్ద పిల్లలకు యుక్తవయస్సు వచ్చినవారికి తమను ఎప్పుడు తప్పులు పడ్తూంటే, ఇతర పిల్లలతో అనవసరంగా పోల్చినపుడు కోపం వస్తుంది. కోపాన్ని ప్రకటించడంలో వైయక్తిక భేదాలుంటాయి.

కోపానికి కారణాలుః

♦ బాలలు చేస్తున్న పనులకు ఆటంకం కల్గించడంవల్ల.

♦ ప్రాథమిక అవసరాలైన ఆకలి, దప్పిక, నిద్ర తీరనప్పుడు

♦ శక్తికి మించిన పనులను కల్పించినపుడు

♦ తనపై చాడీలు, దాడి జరిగినప్పుడు.

♦ మితిమీరిన క్రమశిక్షణ అమలుపరిచినప్పుడు.

♦ వారి ఓపిక నశించినప్పుడు.

**కోపాన్ని అదుపులో ఉంచుకొనే పద్ధతులుః**

♦ బాలల్లో కోపం పుట్టించే విధంగా ప్రవర్తించక పోవడం.

♦ పరిస్థితులలను అవగాహన పరచడం వలన,

♦ బాలలపై అనవసరమైన అంక్షలు విధించకపోవడం వలన

♦ శక్తికి మించిన పనులు ఇవ్వకపోవడం వలన

♦ విసుగు పుట్టించే పనులను ఇవ్వకపోవడం వలన బాలలలో కోపాన్ని అదుపుచేయించవచ్చు.

3. **అసూయ** (Jealousy) **:**

అసూయ అనేది విచారకరమైన భావోద్రేకం (Unpleasant Emotion) శిశువు తనపట్ల ప్రేమ, వాత్సల్యం చూపడం లేదని తెలుసుకొన్నప్పుడు అసూయ ప్రకటిస్తారు. చిన్న పిల్లల్లో సహోదర స్పర్థ (Sibling Rivalry) వలన కూడా అసూయ పుడుతుంది. తల్లిదండ్రులు కొంత ఓర్పు వహించి పరిస్థితిని వివరించినట్లయితే కొంతవరకు సహోదర స్పర్థను అదుపు చేయవచ్చు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల పట్ల పక్షపాత వైఖరి చూపిస్తే అది అసూయకు దారితీస్తుంది.

బాలలల్లో ఒకరి వల్ల పొందే ప్రేమ వాత్సల్యాలను పొందలేక పోవడం వల్ల లేక పొందలేకపోతానెమో అనే భయం వలన కలిగే ఓర్వలేని మానసిక స్థితిని “అసూయ” అంటారు.

**కారణాలు:–**

బాలలు తమ తోబుట్టువుల వలన, తరగతిలో తన సహచరులవలన, వారు క్రితం అనుభవిస్తున్న ప్రేమ, వాత్సల్యాలలో ఇతరులు భాగం పంచుకోవడాన్ని ఓర్వలేక అసూయ పెంచుకొంటారు.

తల్లిదండ్రులు ఇతరులు వారి చూపే ప్రేమ, వాత్సల్యాలను పిల్లలయందు అపసవ్యంగా హెచ్చు తగ్గులతో చూపడం వలన వారిలో అసూయ ద్వేషాలు ఏర్పడతాయి.

**బాలల్లో అసూయ ద్వేషాలను తగ్గించడం ఎలా?:**

- ♦ అసూయ ద్వేషాలను ప్రదర్శించినప్పుడు, దండించడం వలన తరువాత తగిన విధంగా వివరణ ఇవ్వడం వల్ల...
- ♦ బాలల మధ్య, తోబుట్టువుల మధ్య మంచి పరస్పర సంబంధాలను పెంపొందించడం వలన
- ♦ పెరిగే బాలల్లో తగిన మానసిక భద్రతను మానసిక అవసరాలను తీర్చడం వలన బాలల్లో అసూయను తగ్గించవచ్చు.

**4 వ్యాకులత** (Anxiety) :

వ్యాకులత అనేది జరగబోయే కుంఠనం (Anticipated Frustration) వల్ల జరుగుతుంది. వ్యాకులత ఏర్పడినపుడు వేగంగా గుండె కొట్టుకోవడం, ఎక్కువ రక్తం కండరాలకు వెళ్ళడం, చెమట పట్టడం మొదలైన చర్యలకు దారితీస్తుంది. విద్యార్థులకు పరీక్షల సమయంలో కొంత వ్యాకులత ఏర్పడుతుంది. దీనినే పరీక్షావ్యాకులత (Test Anxiety) అంటారు.

ఆపద సరిగ్గా ఎక్కడ ఏ విధంగా వుందో ఎలా వస్తుందో తెలియని బాధతోకూడుకొన్న ఆందోళన స్థితియే “వ్యాకులత”.

**బాలల్లో వ్యాకులతను తగ్గించడం ఎలా?:**

- ♦ వివేకరహితమైన(అర్థరహితమైన) ఆలోచలను విశదపరచాలి. వివరించాలి.
- ♦ ముమ్మందు జరగబోయే విషయాల గురించి వాటిలో కష్ట సుఖాలను చర్చించాలి.
- ♦ బాలల్లో మనోస్థైర్యాన్ని కల్పించాలి / ముందు జాగ్రత్తలు వహించే విధంగా చేయాలి.
- ♦ అనవసర ఆందోళనలు లేక వ్యాకులతల వలన జరిగే పర్యవసానాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వివరించాలి.

5. **కుతూహలం** (Curiosity) **:**

మొదట్లో శిశువు తన పరిసరాల పట్ల ఆసక్తిని చూపకపోయిన పరిసరాలపట్ల కుతూహలం చూపుతాడు. కాబట్టి పిల్లల్లో పరిశీలనాశక్తిని పెంపొందించి అనేక వస్తువుల పట్ల అవగాహన ఏర్పరచాలి. శైశవదశలో పిల్లలు అనేక ప్రశ్నలు గుప్పిస్తుంటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వారికి తగిన జవాబులు చెప్తూ వారిలో కుతుహలాన్ని పెంపొందించాలి. పిల్లలకు కొన్ని సమస్యలు ఇచ్చి వాటికి పరిష్కారం వారే తెలుసుకొనేటట్లు చేయాలి.

### 2.7.3 ఉద్వేగ పరిపక్వత (Emotional Maturity):

ప్రస్తుత సమాజంలో యువత పిల్లలు,వృద్ధులు అనే బేదం లేకుండా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి గల కారణాలు ఒత్తిడి(Tension), కుంఠనం(Frustration), సంఘర్షణ(Conflicts) మొదలైన అంశాలు. ఈ అంశాలన్ని వ్యక్తి ఉద్వేగాలపైన చెడు ప్రబావాన్ని చూపుతాయి.

- ♦ వ్యక్తి తను ఉన్న పరిస్థిస్త్రలను అవగాహన చేసుకొని తన ఉద్వేగాలను అదుపులో ఉంచుకొనిఅనుగుణ్యంగా ఉపయోగించే మానసిక చర్యనే... ఉద్వేగ పరిపక్వత అని అంటారు.
- ♦ సమాజం హర్షించే విధంగాను, అభిలాషించిన తీరుగాను వ్యక్తి తన ఉద్వేగాలను అదుపులో ఉంచుకొని ప్రవర్తించటం ఉద్వేగ పరిపక్వత.

ఉద్వేగ పరిపక్వత గల వ్యక్తులు/బాలలు ఈ లక్షణాలను కలిగి ఉంటారు.

- ♦ ఆత్మ విశ్వాసాన్ని, నైతిక ప్రవర్తనాన్ని కలిగి ఉంటారు.
- ♦ తనశక్తి సామర్థ్యాలను గుర్తించగలిగి ఉంటారు.
- ♦ నిగర్విగా ఉంటారు.
- ♦ ఇతరుల విలువను గుర్తించగలుగుతారు.
- ♦ ఇంద్రియనిగ్రహం కల్గి ఉంటారు.

ఒక వ్యక్తి వివిధ సన్నివేశాలలో తన భావోద్వోగాలను ఎంతమేరకు అదుపులో ఉంచుకొని తన మానసిక సమతాస్థితి కోల్పోడో అది అతని భావోద్వేగ పరిపక్వతను(Emotional Maturity) సూచిస్తుంది. భావోద్వేగ పరిపక్వత గల వ్యక్తిసమస్యలెదురైనా కూడా నిబ్బరంగా వ్యవహరించగల్గుతారు. అదే విధంగా భావోద్వేగ పరిపక్వత గల శిశువు స్వీయ సర్ధుబాటు, కుటుంబసర్దుబాటు, సమవయస్కుల పాఠశాల మరియు సమాజిక సర్దుబాటులను కల్గివుంటాడు.కాలే అనే శాస్త్రవేత్త ప్రకారం "ఎవరైతే ఒత్తిడులను తట్టుకొనే సామర్థ్యం కలవారో వారే భావోద్వేగ పరిపక్వత (Emotional Maturity) కలిగిన వారు.

### 2.7.4 ఉద్వేగ వికాసంలో కుటుంబము మరియు పాఠశాల యొక్క పాత్ర
**(Role of Family and School in emotional development):**

1. ఉద్వేగ పరిపక్వత పెంపొందించుకోవడానికి,తల్లిదండ్రులు పిల్లలను సరియైన దిశగా నడిపిస్తూ వారి ఉద్వేగం నిర్వహణకు సరియైన మార్గాలు (Emotional Catharsis) సూచించి వారి వికాసానికి తోడ్పడాలి.
2. పిల్లలు అసభ్యకరంగా ప్రవరిస్తే అటువంటి సమయంలో వారిని సరిగా అర్థం చేసుకొని ఆప్యాయతతో దగ్గరికి తీసుకొని అవాంఛిత ప్రవర్తనను అధిగమించడానికి ఉపాధ్యాయులు చేయూతనివ్వాలి.
3. ఉద్వేగ వికాసంలో అనుకూల,ప్రతికూల ఉద్వేగాలు నేర్చుకోవడానికి అవకాలున్నాయి. కాబట్టి పిల్లల్లో ప్రతికూల ఉద్వేగాలు రేకెత్తించే సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలి.
4. పిల్లల ఉద్వేగాత్మక శక్తులను ఉద్వేగాత్మక విద్య ద్వారా నిర్మాణాత్మక ప్రయోజనాల వైపుకు మరలించాలి. అనగా స్వయం పరిపాలనా నిర్వహణ, లలిత కళా సంఘాలు, విజ్ఞానశాస్త్ర సంఘాలు, విజ్ఞానశాస్త్ర వస్తు ప్రదర్శనలు, మొదలైన వాటిని పాఠశాలల్లో నెలకొల్పాలి.
5. అవేగాక బాలభటోద్యం(Scouts), ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ సమాజిక ప్రజాసేవ, క్రీడలు – పోటీలు మౌఖిక చిక్కు ప్రశ్నల పోటీలు మొదలైన వాటి పట్ల సామర్థ్యాలు అభిరుచులను పెంచగల్గే అవకాశాలను కల్పించాలి.

## 2.8 భాషా వికాసం (Language Development) :

4M7R28

వ్యక్తి తన భావాలను, ఉద్దేశాలను, ఆలోచనలను ఇతరులకు తెలియపరచడానికి భాషణంను (Speech) ఒక సాధనంగా ఉపయోగిస్తారు.సంభాషిస్తున్న చేస్తున్న వ్యక్తి రెండు ప్రాకార్యాలను నిర్వహించాలి. అవి 1. ఇతరులు చెబుతున్న విషయాలను అర్థం చేసుకోవడం, తన అనుభూతులను, ఆలోచనలను ఇతరులకు అర్థమయ్యేలా తెలియపరచడం, భావవ్యక్తీకరణను సంభాషణ ద్వారా ఇంగితాల ద్వారా, గేయాలు,పాటలద్వారా, చిత్రాల ద్వారా వ్యక్తి భావాలను ఇతరులకు తెలియచేస్తారు.

మన భావాలను ఇతరులకు తెలియచేయడానికి, ఇతరులు చేస్తున్న విషయాలను అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. కాని వాటికి సంబంధించిన పునాదులు శైశవదశలోనే ఏర్పడుతాయి.

### 2.8.1 వాక్కు – వికాసం(Speach - Development) :

శిశువులు ఇతరులు చెప్పిన విషయాలను అర్థం చేసుకోగలరు. కాని వారు తమ అనుభూతులను ఆలోచనలను మాటల రూపంలో వ్యక్తం చేయలేరు. అందువలన ఇతర పద్ధతులు ద్వారా తమ అవసరాలను, భావాలను తెలియజేస్తారు.

ఉదా:– ఇంగితాలు, ముఖ కవళికలు, స్వర స్థాయి, మొదలయిన విషయాల ఆధారంగా శిశువులు వ్యక్తపరుస్తున్న విషయాలను ఇతరులు అర్థం చేసుకోవడం జరుగుతుంది. ఇది వారి ప్రజ్ఞాస్థాయి మీద, మాట్లాడుతున్న వ్యక్తి ప్రోత్సాహం మీద ఆధారపడి వుంటుంది.

**కేరింతలు :** స్వర పేటిక వికాసం చెందిన తర్వాత శిశువు అనేక రకాల శబ్దాలను చేయగలడు. ఆ శబ్దాలనుంచి క్రమంగా మాటలు ఉచ్ఛరించడం, ప్రారంభమవుతుంది. కేరింతలు 6 నెII వయసులో ప్రారంభమవుతాయి.. ఇవి హల్లు, అచ్చుల కలయిక కల్గిన శబ్దాల స్రవంతి. కేరింతకు ప్రత్యేక అర్థం ఉండదు. శైశవ దశ పూర్తయ్యే సరికి కేరింతలు అదృశ్యమవుతాయి.

**ఇంగితాలు :** భాషకు బదులుగా శిశువు ఇంగితాలను ఉపయోగించడం జరుగుతుంది. కొన్ని పదాలను అభ్యసించిన తర్వాత ఆ పదాలతో ఇంగితాలను కలిపి శిశువు వాక్యాలుగా రూపొందిస్తాడు. శిశువు 9 నుంచి 12 నెలల వయస్సులో సంప్రదాయ ఇంగితాలను ఉపయోగించడం జరుగుతుంది.

బై, బై అని చేతులు ఊపడం వంటి ఇంగితాలను 13 నెII వయస్సులో, అదేవిధంగా ఖాళీ కప్పును నోటి దగ్గర పెట్టుకోవడం ద్వారా పాలు కావాలని సూచించడం, చేతులను చాపడం ద్వారా ఎత్తుకొమ్మని సూచించడం వంటి ఇంగితాలను వ్యక్తపరచడం గమనించవచ్చు.

**సంభాషణ అభ్యసించడం :** శైశవ దశ మొదటి అర్థభాగంలో సంభాషణకు సంబంధించిన శరీర భాగాలపై అపరిపక్వత కారణంగా మాట్లాడలేదు. అందువల్ల తన అవసరాలను తెలియచేయుటకు ప్రాక్ సంభాషణా రీతులను ప్రకృతి సిద్ధంగానే ఉపయోగించే సామర్థ్యాలను శిశువులు కల్గివుంటారు.

**ప్రాక్ సంభాషణా రీతులు :**

ప్రాక్ సంభాషణా రీతులు ఏడ్వడం, కేరింతలు, ఇంగితాలు, ఉద్వేగాలు వ్యక్తీకరణ, ఏడ్వడం జన్మించిన మొదటి కొద్దినెలలు వరకు వుంటుంది. తర్వాత కేరింతలు వికాసం చెందుతాయి. కేరింతలనుంచి సంభాషణా సామర్థ్యం వికాసం చెందుతుంది.

**ఏడ్వడం :** ఏడ్వడం ద్వారా శిశువు తన అవసరాలను తెలియ చేస్తాడు. ఏడ్పు మొదటి సాంఘిక స్థాయి, ఏడ్పు స్వరస్థాయి ననుసరించి శిశువు ఏడుపునకు గల కారణాన్ని గుర్తించవచ్చు.

**ఉద్వేగాల వ్యక్తీకరణ :** ఉద్వేగాల వ్యక్తీకరణ అత్యంత ముఖ్యమైన 'ప్రాక్' భాషా రూపం. శిశువు తమ ముఖ కవళిక ద్వారా తమ ఉద్వేగస్థితులను వ్యక్త పరచడం జరుగుతుంది. శిశువులు తమ ఉద్వేగాలను నియంత్రించుకోలేరు. అందువల్ల వారు చెప్పదలచుకొన్న విషయాలను వారి ముఖ కవళికలను, శరీర కదలికలను, అనుసరించి మనం గుర్తించగలం. ఇతరుల ముఖ కవళికల ఆధారంగా శిశువు ఇతరులు చెప్పదలచుకొన్న విషయాలను శిశువు గ్రహించగలడు / తెలుసుకొంటాడు.

పూర్వ బాల్యంను ప్రాక్ పాఠశాల దశగా పేర్కొనవచ్చు. ఈ దశ అన్వేషణాత్మక దశ. ఈ దశలో అనేక ప్రశ్నలు వేస్తూ తన పరిసరాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు.

### 2.7.1 భాష - వికాసం (Language - Development):

భాషా వికాసం సాంఘీకరణలో ప్రముఖపాత్ర వహిస్తుంది. తన భావాలను ప్రసారం చేయగల బాలలు తమ సమవయస్కులతో చక్కని సాంఘిక సంబంధాలను ఏర్పరుచుకోగలరు, సమ్మతిని పొందగలడు. కాని భావ ప్రసారం చక్కగా చేయలేని బాలలు తన సమవయస్కుల ఆమోదాన్ని పొందలేరు. భాషా వికాసం ఆలస్యమై నియత విద్యాభ్యాసంలో వెనుకబడిపోవడం జరుగుతుంది.

**భాషా వికాసంలోని ముఖ్యాంశాలు :**

❖ భాషా వికాసం పిల్లలందరిలో ఒకే వేగంతో జరగదు. అందువల్ల భిన్న వయస్సులలో పిల్లలు భాష ద్వారా తమ భావాలను వ్యక్తీకరించడం జరుగుతుంది. భాష ద్వారా వ్యక్తీకరించిన విషయాలకంటే పెద్దలతో మాట్లాడినపుడు ఎక్కువ విషయాలను అర్థం చేసుకోగలరు.

❖ సగటున మగ పిల్లల్లో కంటే ఆడ పిల్లల్లో భాషా వికాసం ముందుగా జరుగుతుంది.

❖ భాషా వికాసం పిల్లలందరిల్లో ఒకే వేగంతో జరగదు. కాబట్టి ఒక శిశువు భాషా వికాసాన్ని ఇంకొక శిశువు భాషా వికాసంతో పోల్చరాదు.

❖ తల్లిదండ్రులు తమ పిల్లవాడిలో భాషా వికాసం సక్రమంగా జరగడం లేదని గుర్తించినప్పుడు సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించాలి.

**వాక్కు వికాసంలో మైలు రాళ్ళు(Mile Stone)/ ముఖ్య ఘట్టాలు :**

1. ఏడు రోజుల వయస్సులో శైశవదశలో ఉన్న శిశువు తన తల్లి వాక్కును గుర్తించగలడు. రెండు సంవత్సరాల వయస్సులో తన తండ్రి వాక్కు ఇతరుల వాక్కుకు మధ్య గల తేడాలను గుర్తించగలడు.
2. మూడు నెలల వయస్సులో అచ్చులను పోలిన శబ్దాలను చేయడం శిశువు ప్రారంభిస్తాడు. 6 నుంచి 8 నెలల వయస్సులో అచ్చులను పోలిన శబ్ధాలతో పాటు హల్లులను పోలిన శబ్దాలను కూడా కలిపి శబ్ధాలు చేయడం జరుగుతుంది.

   ఉదా:- డాడా, మామా వంటి శబ్దాలు
3. ఇతరులు చెప్పిన ఆజ్ఞలను అనుసరించి ప్రవర్తించగలడు. 15 నె॥ వయస్సులో అచ్చులు, హల్లులు శబ్దాలు చేయడం ప్రారంభించినపుడు ఆ శబ్ధాలు మాటలుగా ధ్వనిస్తాయి. 15 నె॥ వయస్సులో దాదాపు 10 మాటలను ఉచ్ఛరించగలడు.
4. 18 నెలల వయస్సులో బంతి లాంటి నామ వాచక పదాలను, తనకు ప్రాధాన్యత గల వ్యక్తుల పేర్లను ఉచ్ఛరించగలడు, భాషతోపాటు ఇంగితాలను కలిపి ఉపయోగించడం జరుగుతుంది. అదే వయస్సులో ఒక పనిని కాకుండా ఒక దాని తర్వాత ఇంకొక పనిని చేయగలడు.
5. 2 సం॥ల వయస్సులో సరళమైన పదాలను కలిపి వాక్యాలుగా ఉచ్ఛరించగలడు. 3 సం॥ వయస్సులో నాల్గుయిదు పదాలు గల వాక్యాలను ఉపయోగించగలడు, తాను విన్నమాటలను మరలా చెప్పగలడు. 4 సం॥ వయస్సులో భాషకు సంబంధించి అనేక వాక్యాలను అర్ధం చేసుకోగలడు. వస్తువుల మధ్య భౌతిక సంబంధాలను అర్థం చేసుకోగలడు. ఉదా: కింద, పైన, ప్రక్కన మొ॥నవి అదే వయస్సులోని పిల్లల పేర్లను, వయస్సును లింగాన్ని చెప్పగలడు. అంతేకాకుండా సర్వనామం ఉపయోగించడం ప్రారంభించెదరు. అపరిచితులు వారు ఉపయోగించే భాషను అర్థం చేసుకోగలరు.

**భాషణాన్ని పెంపొందించుటకు బాల్యంలో నిర్వహించవలసిన పనులు :**

ఎక్కువ సంఖ్యలో పదాలను వాటి అర్థాలను అభ్యసింపజేయాలి. అంతేకాక అంకెలను, రంగుల పేర్లను కూడా చెప్పమనాలి..

**ఉచ్ఛారణ :** కొన్ని శబ్ధాలు లేదా కొన్ని శబ్దాల కలయికను ఉచ్ఛరించడం కష్టమవుతుంది. అందువలన ఆ శబ్దాలను ఉచ్ఛరించడాన్ని పదే పదే పలుకుతూ అభ్యసింపజేయాలి. ఉదాహరణకు రేడియో ద్వారా, లేదా టెలివిజన్ కార్యక్రమాలను చూడటం ద్వారా కొత్త పదాలను అభ్యసించడమే కాకుండా వాటి ఉచ్ఛరణను ప్రోత్సహించాలి.

**వాక్యాలను నిర్మించడం :** 2 లేదా 3 సం॥ల వయసులో మూడు,నాలుగు పదాలు కల్గిన వాక్యాలను ఉచ్ఛరింపజేయాలి. ఆ వాక్యాలు అసంపూర్ణంగా వుంటాయి. 3 సం॥ల వయస్సు తర్వాత అయిదారు పదాలు గల వాక్యాలను చెప్పించాలి.

ఉత్తర బాల్యంలో బాలల భాష అహం కేంద్రీకృతంగా ఉంటుంది. అంటే శిశువు తన గురించి, తన అభిరుచుల గురించి, తన కుటుంబం గురించి మాట్లాడటం సర్వ సాధారణం, పూర్వ బాల దశ అంతమయ్యేనాటికి సాంఘికీకరణ పొంది భాషను ఉపయోగించడం ప్రారంభమవుతుంది. సాంఘిక సమూహాలు విస్తృతమైన కొద్ది బాలల భాష కూడా సాంఘీకరణం పొందడమే కాకుండా తక్కువ అహంకేంద్రీకృతమవుతుంది.

**ఆలోచన :** పియాజే ప్రకారం భాషనుపయోగించి అనేక విషయాలను మనసులో పొందుపరచుకోవడం జరుగుతుంది. భాషకు క్రియకు ఉన్న సంబంధాన్ని తొలగించడం ద్వారా సమర్థవంతంగా ఆలోచించడానికి అవకాశం పెరుగుతుంది. పదాలను ఉపయోగించడం ద్వారా తాత్కాలిక అనుభవాల పరిమితిని అదిగమించడం, ఆలోచించడం సాధ్యమవుతుంది. భాషను ఉపయోగించడం ద్వారా వర్తమాన, భవిష్యత్ భూత కాలాలకు సంబంధించిన విషయాలను గురించి ఒకే సమయంలో ఆలోచన చేయవచ్చు.

పూర్వ బాల్యదశల్లో పిల్లల్లో భాషా వేగంగా వికాసం చెందడం జరుగుతుంది.

**భాషలోని ఉపవ్యవస్థలు, పోనోలజి, సిమాంటిక్స్,ప్రొగ్మాటిక్స్ :**

భాషలో పై ఉపవ్యవస్థలు ఉన్నాయి. అవి శబ్దానికి సంబంధించినవి, అర్థానికి సంబంధించినవి, వాక్య నిర్మాణానికి సంబంధించినవి, నిత్య జీవితంలో ఉపయోగించే భాషకు సంబంధించినది, ఈ విషయాలపై పూర్తిగా పట్టు సాధించినప్పుడు మాత్రమే పిల్లల సమర్థవంతంగా భావ ప్రసారం (Communicate) చేయగలరు.

**ఫోనోలజి :**

ఇది మనం ఉచ్చరించే శబ్దాల క్రమాన్ని నిర్ణయిస్తుంది. భాషకు సంబంధించిన క్లిష్టమైన శబ్దాలను విన్నపుడు భాష తెలిసిన వ్యక్తి సులభంగా అర్థం చేసుకోవడం జరుగుతుంది. ఈ సామర్థ్యం భాషను అభ్యసించడం ద్వారా పొందడం జరుగుతుంది.

**సిమాంటిక్స్ :** అంటే పదాల అర్థాలను అధ్యయనం చేయడం పదాలు లేదా పదాల సమాఖ్యను ఉపయోగించి భాషను వ్యక్తపరచడం జరుగుతుంది. పిల్లలు మొదటగా ఒక పదాన్ని ఉపయోగించినపుడు ఆ పదం అర్థము పెద్దలు అదే పదాన్ని ఉపయోగించినపుడు దాని అర్థానికి సంబంధం వుండదు. వేల పదాల అర్థాలను అభ్యసించడం ద్వారా పూర్వ బాల్యదశలో సమర్థవంతంగా భాషను అభ్యసించడం జరుగుతుంది. అనేక పదాల అర్థాలను అభ్యసించినపుడు ఆ పదాలను భిన్న విధానాలతో కలిపి కొత్త అర్థాలను కూడా ఉత్పత్తి చేయగలరు. పదాలను ఏక్రమంలో అమర్చాలో తెలియచేసే శాస్త్రాన్ని వ్యాకరణం అని చెప్పవచ్చును. వ్యాకరణ సూత్రాలను అనుసరించి తప్పులేకుండా భాషను మాట్లాడటం పిల్లలు అభ్యసిస్తారు.

**ప్రొగ్మాటిక్స్ :**

నిత్య జీవితంలో సందర్భాన్ని అనుసరించి పదాలను ఉపయోగించడాన్ని ప్రొగ్మాటిక్స్ అనవచ్చు. ఒకే పదం ఒక సందర్భంలో ఒక అర్థాన్ని కల్గివుంటే ఇంకో సందర్భంలో ఇంకో అర్థాన్ని కల్గి వుంటుంది. పదాలతో పాటు ఇంగితాలు, కంఠస్వరం కూడా సందర్భాన్నిబట్టి పదానికి అర్థం ఇవ్వడమవుతుంది.

**బాలలలో సంభాషణ సామర్థ్య వికాసం :**

సాంఘికంగా సమూహం మన్నన పొందడంలో సంభాషణ అధిక ప్రాధాన్యతను కల్గివున్నట్లు ఉత్తర బాల్యదశలో ని బాలలు గుర్తిస్తారు. అందువల్ల సమర్థవంతంగా సంభాషించడానికి తగిన సామర్థ్యాలను పిల్లలు కల్గివుంటారు. కావున తమ సంభాషణా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇందుకోసం ముఖ్యంగా ఈ క్రింద కనపరచిన మూడు రకాల విషయాలు భాషణా సామర్థ్యాన్ని పెంచడానికి దోహదపడతాయి.

- మధ్య తరగతి, ఉన్నత తరగతికి చెందిన తల్లిదండ్రులు సంభాషణా సామర్థ్యానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తారు. తమ పిల్లలు సమర్థవంతంగా సంభాషించడానికి తగిన ప్రేరణను కల్పిస్తారు. అంతేకాకుండా ఉత్తర బాల్యదశలో తమ పిల్లలు భాషా ఉచ్చారణలో చేస్తున్న తప్పులను, వ్యాకరణానికి సంబంధించిన తప్పులను సరిదిద్దుతారు. అంతేకాక కుటుంబంలో జరిగే సంభాషణలో పాల్గొనడానికి పిల్లల్ని ప్రోత్సహిత్సారు.
- రేడియో, టెలివిజన్ ప్రసారాలు గమనిస్తే బాలలు తమ సంభాషణా సామర్థ్యాన్ని పెంపొందించుకొంటారు.
- పాఠశాల దశలో పిల్లలు అనేక విషయాలకు సంబంధించిన పాఠ్యాంశాలను అభ్యసిస్తారు. ఆ కారణంగా వారు కొత్త పదాలను, వాటి అర్థాలను అభ్యసించవలసివుంటుంది. వారు పదాలను తప్పుగా అర్థం చేసుకున్నట్లయితే ఆ పొరపాట్లను ఉపాధ్యాయులు సరిదిద్దడము జరుగుతుంది. పాఠశాలలో పాఠాలు చదడం, పుస్తకాలను చదవడం, ఇతరులతో సంభాషించడం, ప్రసార సాధనాలతో పరిచయం మొదలైన అంశాలు సంభాషించడానికి, రాయడానికి అనువైన పదజాలం అభ్యసించడానికి దోహదం చేస్తుంది. ప్రత్యేక అర్థాలుగల పదాలను, పరిమితంగా ఉపయోగించే పదాలను కూడా అభ్యసిస్తారు.

పైన పేర్కొన్న మూడు అంశాలు బాలల సంభాషణ,సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి.

**బాలలు అభ్యసించే కొన్ని ప్రత్యేక తరహా పదాలు:**

ఎ) మర్యాదను సూచించే పదాలు : ఉదా: 'దయచేసి', 'నమస్కారం', Good Morning, Bye bye మొదలైన పదాలను పిల్లలు ఉపయోగిస్తారు/ నేర్చుకొంటారు.

బి) రంగులకు సంబంధించిన పదాలు : సాధారణంగా ఉపయోగించే కొన్ని రంగుల పేర్లను అభ్యసించడమే కాకుండా పాఠశాలలో అతి తక్కువగా ఉపయోగించబడే రంగుల పేర్లను కూడా అభ్యసిస్తారు.

సి) సంఖ్యలను సూచించే పదాలు : పాఠశాలలో లెక్కలు వేయడం, అభ్యసించడం జరుగుతుంది. కాబట్టి సంఖ్యలను సూచించే పదాలను అభ్యసించడం జరుగుతుంది.

డి) కాలానికి సంబంధించిన పదాలు : కాలానికి సంబంధించిన పదజాలాన్ని పెద్దలు ఏ స్థాయిలో కల్గివుంటారో అదేస్థాయిలో కాలానికి సంబంధించిన పదజాలాన్ని అదే స్థాయిలో బాలలు అభ్యసించడం జరుగుతుంది.

ఇ) రహస్య పదజాలాన్ని ఉపయోగించడం : తమ స్నేహితులతో రహస్యమైన విషయాలను గురించి మాట్లాడుకోవడానికి రహస్య పదజాలాన్ని ఉత్తర బాల్యదశలో పిల్లలు ఉపయోగిస్తారు. ఉదా: 'క' భాష 'చ' భాష వంటివి. ఈ రకమైన రహస్య పదజాలాన్ని నేర్చి, సంభాషించి ఆనందపడతారు.

**ఉచ్ఛారణ :** ఈ వయసులో ఉచ్ఛారణకు సంబంధించిన పొరపాట్లు సహజంగా జరగవు. కాని కొత్త మాటలు ఉచ్ఛరించినపుడు పొరపాటు చేయవచ్చు. కాని పెద్దలు ఉచ్ఛారణ చేసినప్పుడు గమనించి పొరపాట్లను సరిదిద్దుకోవడం జరుగుతుంది. లేక పెద్దలు / ఉపాధ్యాయ ఉచ్ఛారణ దోషాలను సరిదిద్దాలి.

**వాక్యాలను నిర్మించడం :** ఉత్తర బాల్యదశలో అన్నిరకాల వాక్యాలను నిర్మించగల సామర్థ్యం బాలలకు వుంటుంది. ఆరు సం॥ల వయస్సు నుంచి పది సం॥ల వయస్సు వచ్చు వరకు వాక్యాలను సమర్థవంతంగా నిర్మించలేకపోయినా తొమ్మిది సం॥ల వయస్సు వచ్చే సరికి పొందిక గల పెద్ద వాక్యాలను నిర్మించగలరు.

## 2.8.3 భాషా వికాస దృక్పథాలు – స్కిన్నర్, బందురా, చామ్‌స్కీ :

**(Perspectives in Language Development - Skinner Bandura, Chomsky)**

మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలైన బి.ఎఫ్.స్కిన్నర్, ఎ.బందురా మరియు భాషా శాస్త్రవేత్త అయిన ఎన్.చామ్‌స్కీ యొక్క భాషా వికాస దృక్పథాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

**ఎ) స్కిన్నర్ దృక్పథం** (Perspectives of Skinner) **:**

అమెరికాకు చెందిన మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు బి.ఎఫ్.స్కిన్నర్ ప్రకారం అభ్యసన అంటే నేర్చుకోవడం అని అర్థం . ఏదో ఒక కార్యం. అందుకే అతడు ప్రతిపాదించిన సిద్ధాంతానికి 'కార్య సాధక నిబంధనం' అనే పేరు వచ్చింది. స్కిన్నర్ ప్రకారం అనుకరణ, పునర్బలన ప్రక్రియ ద్వారా భాషను పిల్లలు వేగంగా అభ్యసించడం జరుగుతుందని పేర్కొన్నాడు. పదాలను శిశువు ఉచ్ఛరించినపుడు పునర్బలన కల్పించడం ద్వారా పదాలను నేర్చుకొంటాడు. అంతేకాక కొత్తపదాలను ఉ చ్ఛరించినపుడు శిశువుకు తగిన ప్రోత్సాహాన్ని తల్లిదండ్రులు, పెద్దలు అందించుటవలన, ఉచ్ఛరణ దోషాలను సరిచేయడం వలన, తమ భాషా సామర్థ్యాన్ని పెంపొందించుకోంటారు. పాఠశాల దశలో పిల్లల పదజాలం (Vocabulary) అత్యధికంగా అభివృద్ధి చెందడం జరుగుతుంది. రేడియో, టెలివిజన్, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా పిల్లలు తమ సంభాషణా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి దోహదం చేస్తాయని స్కిన్నర్ అభిప్రాయపడ్డాడు.

**బి) బందూరా దృక్పథం** (Perspectives of Bandura) **:**

కెనాడాకు చెందిన ఆల్బ్రెడ్ బందురా సాంఘిక సంజ్ఞానాత్మక అభ్యసన సిద్ధాంతము (Social cognitive learning Theory) ను ప్రతిపాదించాడు. ఇతని ప్రకారం శిశువు తల్లిదండ్రులను, పెద్దలను వారు మాట్లాడే భాషా తీరును పరిశీలించడం వలన, అనుకరించడం ద్వారా భాషా వికాసం జరుగుతుందని అన్నాడు. శిశువులు పెద్దల భాషను అవధానంతో నిశితంగా పరిశీలించడం, వినడం ద్వారా భాషాభివృద్ధిని పొందుతారు. బందురా ప్రకారం శిశువు ఏ ప్రాంతములో అయితే నివసిస్తాడో ఆ ప్రాంత భాషను పరిశీలించి, అనుకరించి ఆ భాషను నేర్చుకోవడం జరుగుతుందన్నాడు. కనుక ఒక్కొక్క ప్రాంతంలో నివసించే శిశువులు ఆ ప్రాంతానికి సంబంధించిన భాషలు నేర్చుకోగల్గుతారు.

సి) **చామ్‌స్కీ దృక్పథం** (Perspectives of Chomsky)**:**

అమెరికాకు చెందిన భాషా శాస్త్రవేత్త నోమ్ చామ్‌స్కీ (Noam Chamsky) భాషా గ్రహణ సిద్ధాంతము (Language Acquisition Theory) ను ప్రతిపాదించాడు. చామ్‌స్కీ ప్రకారం పిల్లలు భాషను నేర్చుకోవడానికి అనువైన అంతర్గత సహజ సామర్థ్యంతో జన్మిస్తారన్నాడు. శిశువు మెదడు భాషా నిర్మాణానికి అవసరమైన నిర్మాణాలుండి ఎప్పుడైతే శిశువులు భాషా వినికిడికి గురి అవుతాడో అప్పుడు అవి పనిచేయడం ప్రారంభిస్తాయన్నాడు. దీనినే అతడు **"భాషా గ్రహణ యంత్రంగా (Language Aequisition Device - LAD)"** గా పేర్కొన్నాడు. తదుపరి ఇదే అన్ని మానవీయ భాషలకు సాధారణమైన అంతర్గత సూత్రాలుగా, సార్వత్రిక వ్యాకరణంగా వుండగలదని భావించాడు. శిశువు పరిసరాలలోని పెద్దల భాషాను ఈ LAD ఆధారంగా ప్రాథమిక భాషా దత్తాంశాన్ని, అర్థాన్ని వ్యాకరణాంశాలను రూపొందించు కొనగలదని ప్రపంచంలోని అన్ని భాషలకు ఇదే వర్తిస్తుందని తెలిపాడు. శిశువు మెదడులో సార్వత్రిక భాషా సూత్రాలను సార్వత్రిక వ్యాకరణ నిర్మాణాలను నిక్షిప్తం చేసుకొనే సామర్థ్యం పుట్టుకతో కల్గివుంటారని చామ్‌స్కీ పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోని అన్ని భాషలకు వర్తిస్తుందని తెలిపాడు.

చామ్‌స్కీ ప్రకారం పిల్లలు మెదడులో నిక్షిప్తమైన సార్వత్రిక వ్యాకరణ సూత్రాల నిర్మాణం/ సాధనం ద్వారా పరిసరాలలోని భాషా నిర్మాణమును అవగాహన చేసుకొంటారు. భాషకు సంబంధించిన ప్రాథమిక దత్తాంశమును, సాధారణ భాషా సూత్రాల ద్వారా వ్యాకరణ పరిజ్ఞానంను మరియు నియమాలను కొంత యత్న దోష ప్రక్రియల ద్వారా పెద్దల భాషకు సరిసమానంగా రూపుదిద్దుకోవడం జరుగుతుందని అభిప్రాయపడ్డాడు.

## 2.9 నైతిక వికాసం (Moral Development) :

పిల్లలకు మన సమాజంలో ఉన్న విలువలు, సత్ సంస్కృతి మొదలైన వాటి గురించి తెలియదు. అందువల్ల చిన్నతనం నుంచే పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేలా ప్రయత్నించాలి. ఏది తప్పు, ఏది ఒప్పు మొదలైన విషయాల గురించి ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లలకు తెలియచేయాలి. కాబట్టి వివిధ దశల్లో నైతిక వికాసం గురించి తెలుసుకుంటే ఉపాధ్యాయులకు నైతిక వికాసంను పెంపొందించుటలో దోహదపడతారు.

శైశవ దశలో శిశువుకు ఏవిధమైన నైతిక విలువలు గాని, అంతరాత్మగాని ఉండదు. వారు నైతికంగా మంచి వారుగా గానీ, చెడ్డ వారుగా కంటే అనైతికంగా ఉంటారు. వారి ప్రవర్తన ఎటువంటి నైతిక ప్రమాణాలపై ఆధారపడదు. ప్రజ్ఞాపరంగా తక్కువ వికాసం చెంది ఉండటం వల్ల శిశువు ఏది తనకు ఆనందాన్నిస్తే అది సరైందిగా, కష్టానిచ్చేది తప్పుగా భావిస్తారు. ఏది సరైంది ఏది తప్పో తెలియక పోవడం వల్ల వారికి నేరం చేసామన్న భావన ఉండదు. అంటే ఈ దశలో శిశువు నైతిక విలువలు కేవలం తన స్వంత ఆనందానికి గాని బాధకు గాని మాత్రమే పరిమితమై వుంటాయి. అయితే కాల క్రమంలో వారు తల్లిదండ్రుల నుంచి, ఇతరుల నుంచి విలువలు నేర్చు కొంటారు.

పూర్వ బాల్యంలో కూడా నైతిక వికాసం తక్కువ స్థాయిలోనే వుంటుంది. ఈ దశలోని పిల్లల ప్రజ్ఞా సామర్థ్యం అమూర్త సూత్రాలను అనుప్రయుక్తం చేసి, చేసిన పని తప్పో, ఒప్పో తెలుసుకొనేస్థాయికి ఎదగరు. సందర్భాలనుబట్టీ ఈ దశలోని పిల్లలు విలువలను నేర్చుకొంటారు. స్మృతిస్థాయి కూడా తక్కువగా ఉన్నందువలన ఒక సందర్భంలో తప్పు అని వాదించిన పనిని వారు మళ్ళీ చేయడానికి అవకాశం వుంటుంది. సాధారణంగా దీనిని పెద్దలు అవిధేయతగా భావించడం జరుగుతుంది. ఈ దశలోని పిల్లలు వివేచనం ఉపయోగించకుండా నియమాలను స్వయంగా చాలకంగా పాటిస్తారు. ఒక పనిని తప్పా, ఒప్పా అనేది దాని ఫలితం ఆధారంగా మాత్రమే గుర్తిస్తారు. ఈ దశలోని పిల్లలు శిక్షంపబడే పని తప్పు అని, పొగడ్త గాని, బహుమానం గానీ లభించే పని ఒప్పు అని అనుకొంటారు. అంతరాత్మ ఇంకా ఏర్పడనందున ఈదశలోని పిల్లలు తప్పుచేసి దొరికిపోయినప్పుడు బాధపడరు గాని శిక్షనుంచి తప్పించుకోవడానికి వారిప్రవర్తనను సమర్థించుకొనే ప్రయత్నం చేస్తారు.

ఉత్తర బాల్యంలో నైతిక విలువలు వృద్ధి చెందుతాయి. సాంఘిక సమూహాలు వివిధ రకాలైన తీవ్రతను ఆపాదిస్తాయి. అనేది తెలుసుకుని ఆ జ్ఞానాన్ని నైతిక భావనలను పెంపొదించుకోవడంలో వీరు ఉపయోగిస్తారు. ఈ దశలో తల్లిదండ్రులనుంచి నేర్చుకొన్న ప్రకారం కాకుండా ఏది తప్పు, ఏది ఒప్పు అనేది ఆ సంఘటన / సందర్భం ఆధారంగా నిర్ణయిస్తారు. ఉదాహరణకు 4 సం॥ల పిల్లవాడు అబ్ధం చెప్పడం తప్పు అంటారు. కాని 10 సం॥ పిల్లవాడు పరిస్థితులను బట్టీ అబద్ధం చెప్పడం తప్పుకాదని భావిస్తాడు.

ఈ దశలో నైతిక నియమాలు వారి సమ వయస్కులచే ప్రభావితం కాబడి వుంటాయి. కాని ఈ దశ పూర్తి అయ్యేసరికి పెద్దలు ఏర్పాటుచేసిన నియమాలను అనుసరించి ప్రవర్తిస్తారు. ఈ దశలో ఆత్మ భావన బాగా ఏర్పడటం వల్లవారు తప్పు చేసినప్పుడు సిగ్గు, తప్పు చేస్తామనే భావన ఏర్పడుతుంది. ఈ దశాంతానికి ఇంటి దగ్గర, బడిలో చేసే చిన్న చిన్న నేరాలు మానుకొంటారు.

బాల్యంలో లాగా ప్రవర్తన నియంత్రించే బాహ్య కారకాలు లేనప్పటికి వారిని నడిపించడానికి కచ్చితమైన నైతిక నియమ నిబంధనలు పెంపొందించుకోవడంలో కౌమారులు నేర్చుకోవలసిన ఒక ముఖ్య అంశం అంటే వారి వారి ప్రవర్తన

వారే నియంత్రించుకోవలసి వుంటుంది. వయోజనుల నైతిక వ్యవస్థను ఇనుమడించుకోవడానికి అవసరమయ్యే మూడు ముఖ్య విధులను కౌమార దశ అంతానికి వీరు సాధించాలి.

1. బాల్యంలో పరిస్థితుల అనుసారంగా ఉండే విలువలకు బదులు సాధారణ నైతిక భావనలను ఏర్పరుచుకోవడం.
2. ఈ భావనలను ఒక ఖచ్చితమైన నైతిక నియమ నిబంధనలు ఏర్పరుచుకోవడం.
3. ఎవరి ప్రవర్తనపై వారే నియంత్రణ తెచ్చుకోవడం.

6C2A5V

## 2.9.1 కోల్‌బర్గ్ నైతిక వికాస సిద్ధాంతం :

హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన లారెన్స్ కోల్‌బర్గ్ అనే మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త వివిధ నైతిక సందిగ్ధ పరిస్థితులను రూపొందించి 10 సం॥ నుంచి 16 సం॥ మధ్య వయస్సు ఉన్న పిల్లలకిచ్చి వారి తీర్పు ఆధారంగా సంజ్ఞానాత్మక నైతిక వికాస సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కోల్‌బర్గ్ తన సిద్ధాంతములో మూడు నైతిక వికాస స్థాయిలను గుర్తించాడు. ప్రతి స్థాయిలో రెండు దశలుంటాయి.

కోల్‌బర్గ్ సిద్దాంతంలోని మూడు స్థాయిలు ప్రతి స్థాయిలోని 2 దశలు క్రింది పట్టికలో ఇవ్వడమైనది.

| **స్థాయిలు(Levels)** | **దశలు(Stages)** |
|---|---|
| 1. పూర్వ సాంప్రదాయ నైతికత | 1. విధేయత – శిక్ష, నేపద్య నీతి |
| | 2. సహజ సంతోష – సహకారి సంతోష నేపద్య నీతి |
| 2. సాంప్రదాయ నైతికత | 3. మంచి బాలుడు – బాలిక నేపద్య నీతి |
| | 4. అధికారం – సామాజిక వ్యవస్థ నిర్వహణ నేపద్యనీతి |
| 3. ఉత్తర సాంప్రదాయ నైతికత | 5. వ్యక్తిగత – మానవహక్కులు – ప్రజాస్వామిక ఆమోదించబడిన చట్ట నీతి. |
| | 6. వ్యక్తిగత నీతి సూత్రాలు – అంతరాత్మ నీతి |

## స్థాయి : 1 పూర్వ సంప్రదాయ నైతికత :

కోల్‌బర్గ్ నైతిక వికాస సిద్ధాంతంలో ఇది మొదటి స్థాయి. ఈ స్థాయిలో నైతికతను 'భౌతిక, శారీరక శిక్ష పరంగా బాలలు అంచనావేస్తారు. ఈ స్థాయిలో నైతికత బాహ్యంగా నియంత్రించబడుతుంది. పెద్దలు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, అధికారులు చెప్పె నియమాలను బాలలు పాటిస్తారు. పాటించడం వల్ల శిక్ష తప్పుతుంది. శిక్ష పడే ప్రవర్తనలో తప్పులని భావిస్తారు. శిక్ష పడని ప్రవర్తనలను ఒప్పులని భావిస్తారు. ఈ స్థాయిలో రెండు దశలుంటాయి.

1. విధేయత, శిక్ష నేపద్య నీతి
2. సహజ సంతోష – సహకారి సంతోష నేపద్య నీతి

**1.మొదటి దశ :** విధేయత, శిక్షనేపద్య నీతి : ఇది పెద్దల నుంచి ముఖ్యంగా శిక్షన తప్పించుకోవడానికి వారికి లొంగిపోయేదశ. ఈ దశలో నైతికతను శారీరక శిక్ష పరంగా అంచనా వేస్తారు.

**2.రెండవ దశ :** సహజ సంతోష – సహకారి సంతోష నేపథ్య నీతి

ఈదశలో పిల్లవాడు బహుమానాలు పొందాలనే లక్ష్యంతో ప్రవర్తిస్తాడు. కొంత వరకు ఉన్నప్పటికీ ఆ పరస్పరతకు కారణం నిజానికి సానుభూతి, ఉదారత, కరుణ, నీతి కావడానికి కారణం స్వయం తృప్తి. ఒక విధంగా చెప్పాలంటే వారు ఇతరులతో బేరాలు చేస్తుంటారు. ఉదాహరణకు నీ వీడియోగేమ్ నాకిస్తే నువ్వు రాయడానికి పెన్ను ఇస్తా లేదా సాయంత్రం సినిమాకు తీసుకువెళ్తానంటే ఇప్పుడు హోమ్‌వర్క్ చేస్తా మొదలైనవి.

## స్థాయి : 2 సాంప్రదాయబద్ధమైన నైతికత :

కోల్‌బర్గ్ రెండవ స్థాయిని సంప్రదాయబద్ధమైన నైతికతగా పేర్కొన్నారు. ఈ స్థాయిలో వ్యక్తులు, బాలలు సాంఘీక/ సామాజిక నియమాలకు కట్టుబడి ఉండడం ముఖ్యం అని భావిస్తారు.

– సమాజంలో పాటిస్తున్న సంప్రదాయాలు, నియమనిబంధనలు, చట్టంన్యాయం ఆదారంగా, నైతిక తీర్పు నియంత్రించబడుతుందని అబిప్రాయపడతారు. వాటిని అనుసరించడం ఒప్పని, అనురించకపోవడం తప్పని భావిస్తారు.

– సమాజంలోని వ్యక్తులు తమ ఇష్టానుసారంగా కాకుండా సాంఘిక వ్యవస్థ ప్రకారం నడుచు కొంటే సరైన మానవ సంబంధాలను సాంఘిక పద్ధతులను పాటించవచ్చని నమ్ముతారు. ఈ స్థాయిలోను రెండు దశలుంటాయి. అవి

3దశ – మంచి బాలుడు – మంచి బాలిక నేపద్యనీతి

4దశ – అధికారం – సామాజికవ్యవస్థల నిర్వహణ నేపద్యనీతి.

## మూడవ దశ : మంచి బాలుడు – బాలిక నేపద్య నీతి

ఈ దశలో ఇతరులతో మంచి సంబంధాలు ఉండే ప్రవర్తనను మంచి ప్రవర్తనగా భావించడం జరుగుతుంది. ఈ దశలో పిల్లలు విషయాన్ని మంచి చెడ్డల నిర్ణయాన్ని ఇతరుల ప్రతిస్పందనల ఆధారంగా గ్రహిస్తారు. ఇతరుల అధిక శారీరక శక్తి కంటే వారి సమ్మతి, అసమ్మతి / ఆమోదన, నిరాకరణకు ఈ దశలోని వారు ఎక్కువ ప్రాముఖ్యాన్నిస్తారు.

## నాల్గవ దశ : అధికారం, సామాజికవ్యవస్థల నిర్వహణ నేపద్యనీతి :

ఈ దశలో నిందను తప్పించుకోవడానికి సంఘం ఆమోదించే నియమాలను పాటించాలని నమ్మడం వల్ల సాంఘిక రివాజులను, నియమాలను గుడ్డిగా అంగీకరిస్తారు. ఈ దశలో వ్యక్తుల ఆమోదానికి మాత్రమే కాకుండా సంఘం ఆమోదాన్ని కూడా పరిగణనలోకి తీసుకొంటారు. చట్టం, ధర్మం ప్రకారం నడుచుకొంటారు. కోల్‌బర్గ్ ప్రకారం ఎక్కువ శాతం వ్యక్తులు నైతికంగా ఈ స్థాయికి మించి ఎదగరు.

## స్థాయి : 3 : ఉత్తర సాంప్రదాయక నైతికత :

కోల్‌బర్గ్ పేర్కొన్న మూడవ స్థాయి – ఉత్తర సాంప్రదాయక నైతికత. ఈ స్థాయిలో నైతిక తీర్పుల నియంత్రణ ఈ వ్యక్తికి మాత్రమే ఉంటుంది. ఇది నైతిక సాధనలో అత్యున్నత స్థాయిగా గుర్తించవచ్చు.

సమాజంలో చట్టం, న్యాయవ్యవస్థ, సంప్రదాయాలు – మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా వుండాలి. మానవులు ప్రజాస్వామికంగా ఆమోదించబడిన నియమాల తీర్పులకులోబడి ప్రవర్తించాలి/పాటించాలి.

వీటిని పాంటించడం ఒప్పు – పాటించకపోవడం తప్పులు అవుతాయి. ఇది అంతరాత్మ ప్రబోధంతో తప్పు,ఒప్పులు వ్యక్తులు నిర్ణయించుకొంటారు. ఈ స్థితిలో వ్యక్తులు వ్యక్తిగత నీతి సూత్రాలను అంతరాత్మ నీతిని పాటిస్తారు.

ఈ స్థాయిలో కోల్‌బర్గ్ మరో రెండు దశలను గుర్తించాడు. అవి.

దశః5ః వ్యక్తిగత – మానవ హక్కులు – ప్రజాస్వామికంగా ఆమోదించబడిన చట్టనీతి.

దశః6ః వ్యక్తిగత నీతి సూత్రాలు – అంతరాత్మ నీతి

**అయిదవ దశ :** వ్యక్తిగత మానవ హక్కులు, ప్రజాస్వామికంగా అమోదించబడిన చట్టనీతి

ఇంతకు ముందు దశలలో లేనటువంటి నైతిక నమ్మకాలలో సారళ్యత ఈ దశలో వుంటుంది. ఈ దశలో నైతిక సాంఘికక్రమం, ఇతరుల హక్కులను నిర్వహించడానికి అవసరమయ్యే నియమాల అనుసారంగా వ్యక్తుల మధ్య ఒప్పందం కుదిరి వారు తదనుగుణంగా ప్రవర్తించడంతో కూడుకొంది. అయితే, ఇవి ఒక సంఘం కుదుర్చుకొన్న ఒప్పందాలు కాబట్టి సమయానుసారంగా సంఘానికి లాభదాయకమయ్యే విధంగా నియమాలను లేదా ఒప్పందాలను మార్చుకోవచ్చు.

**ఆరవదశ :** వ్యక్తిగత నీతి సూత్రాలు, అంతరాత్మ నీతి:

ఈ దశలో వ్యక్తి ఇతరుల విమర్శల నుంచి తప్పించుకోవడానికి కాకుండా తన ఆత్మ నిరసనను తప్పించుకోవడానికి సాంఘికంగా కాకుండా తన ఆత్మ నిరసనను తప్పించుకోవడానికి సాంఘిక ప్రమాణాలు, మనలో భాగమైనటువంటి ఆదర్శాలకు అనుగుణంగా ప్రవర్తిస్తాడు. ఈ విధమైన నిర్ణయాలు న్యాయం, కరుణ సమానత్వం వంటి అమూర్త సూత్రాలపై ఆధారపడి వుంటాయి. ఈ దశ చేరుకొన్న వ్యక్తికి అధిక వ్యక్తిగతమైన నైతిక నమ్మకాలు ఉంటాయి. ఇవి కొన్నిసార్లు ఎక్కువ మంది అంగీకరించే సాంఘిక క్రమానికి విరుద్ధంగా కూడా ఉంటాయి.

మనిషి నైతిక వికాసం అతని సంజ్ఞానాత్మక సామర్థాలపై ఆధారపడతాయని కోల్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. కోల్‌బర్గ్ నైతిక వికాసంలో ఏదశ ఏ వయస్సులో చేరుకొంటారని చెప్పకపోయినా చిన్న పిల్లలు ఎక్కువ పూర్వ సాంప్రదాయక ప్రతిస్పందనలను పెద్దవారు ఉత్తర సాంప్రదాయక ప్రతిస్పందనలను ప్రదర్శిస్తారు. అయితే, అందరిలో అన్ని సంస్కృతులలో ఈ వికాస క్రమం ఒకేలా వుంటుంది. ఒక వ్యక్తి మంచి స్థాయి నైతిక వికాసానికి చేరుకొన్నాక మళ్ళీ వెనక్కు తిరోగమనం ఉండదు.

## విద్యాను ప్రయుక్తం :

1. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు స్థితి పరీక్షలు నిర్వహించి లేదా పరిశీలించి వారు ఏ స్థాయిలో ఉన్నారో గుర్తించి ఆ తర్వాత స్థాయికి చేరుకోవడానికి అవకాశాలు కల్పించాలి. ఇలా చేసేటప్పుడు వారి వయస్సును పరిగణనలోకి తీసుకోవాలి. ఎందుకంటే మనం ఆశించే స్థాయికి అవసరమైన సంసిద్ధత పిల్లలలో ఉండటం అవసరం.
2. నైతిక వికాసం పిల్లల సంజ్ఞానాత్మక వికాసం పై ఆధారపడి వుంటుంది. కాబట్టి సంజ్ఞానాత్మక శక్తులను మెరుగుపరిచే కృత్యాలను కల్పించి తద్వారా నైతిక వికాసానికి తోడ్పడాలి.
3. ఉపాధ్యాయులు మొదట ఆదర్శంతమైన ప్రవర్తనను అలవరుచుకొని పిల్లలు వారిని అనుకరించి నైతికంగా ఉన్నతస్థాయికి చేరుకొనేటట్లు చేసి తద్వారా తమ సమాజాన్ని ఒక ఆదర్శంతమైన సమాజంగా పరివర్తన చెందడంలో అవసరమైన పాత్ర పోషించాలి.

### 2.9.2 నైతిక వివేచనంలో సాంస్కృతిక వైవిధ్యాలు (Cultural Variations in Moral Reasoning):

నైతిక నియమాలే మన ప్రవర్తన నిర్దేశించే సూత్రాలు కనుక పిల్లల్లో వాటిని జీర్ణించుకొనేలా చేయాలి. విభిన్ననైతిక విలువలు, నేపథ్యాల నుండి బడికి వచ్చే పిల్లలందరినీ ఒకరి విలువలను మరొకరు గౌరవించేలా, సహించేలా చేయడంలో పాఠశాల ప్రముఖ పాత్రవహించాలి. విలువలు కల్గించడం, విజ్ఞానంతో వివేకంతో మెలగడం వల్ల సమగ్రాభివృద్ధిలో అంతర్భాగం.

సాధారణంగా పిల్లలు తప్పు చేసినప్పుడు వారిని కొట్టడం, దండించడం చేస్తుంటాం, మరికొన్ని సందర్భాల్లో టీ.వి. చూడకుండా చేయడం, భోజనం లేకుండా చేయడం వాటిని పిల్లల నైతిక వికాసంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అందువలన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీలైనంతవరకు పిల్లలకు వాస్తవాలను తెలియచేయాలి. తప్పులకు గల కారణాలను అన్వేషించాలి, వాటి పర్యవసానాలను వివరించి వారికి నచ్చజెప్పడం చేయడం మంచిది. నైతిక విలువల ప్రాముఖ్యతను తెలియచేయాలి.

తూర్పు ఆసియా ఆదేశాలకు సంబంధించిన వ్యక్తులు వారు ఒక సమాజానికి చెందిన వారుగా, వ్యక్తుల మధ్య సత్సంబంధాలు కల్గి ఇతర వ్యక్తుల పట్ల వారి సంక్షేమం పట్ల నైతిక బాధ్యత కల్గేలా వ్యవహరిస్తారు. కాని పశ్చిమదేశాలకు చెందిన ప్రజలకు వైయక్తిక జీవితానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చి స్వతంత్రంగా వుండి వారిపట్ల మాత్రమే శ్రద్ధ వహించగలరు. కాని తూర్పుదేశాల ప్రజలు వారికంటే కూడా ఇతరులపట్ల శ్రద్ధ వహించగలరు.

కావున నైతిక వివేచనంలో సాంస్కృతిక బేధాలు వున్నాయని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. ఇటీవలన ఒక పరిశోధనలో అమెరికా మరియు చైనాకు చెందిన పిల్లల్లో నైతిక వివేచనంలో వైవిధ్యాలున్నట్లు కనుగొన్నారు.

## 2.10 ఆటలు – వికాసం (Play and Development):

UNO ప్రసాధించిన బాలల హక్కులలో ఆటలాడుకునే హక్కుకూడా ఒకటి

బాలల శారీరక బౌద్ధిక, మానసిక,, సాంఘిక ఉద్వేగాల వికాసాలకు ఆటలు ఎంతో ముఖ్యమని వారి క్షేమం శ్రేయస్సు కొరకు వారిని ఆటలలో పాల్గొనేటట్లు చేయడం పాఠశాల బాధ్యత అని UNICEF పేర్కొంది.

బాలలు స్వేచ్ఛగా ఆటలు ఆడితే సృజనాత్మకత, కల్పనలు, ఆలోచనలు, ఊహాలు వారిలో పెంపొందుతాయి.

పిల్లలు ఇతరులతో, తల్లిదండ్రులతో ఆడుకుంటునప్పుడు వారిలో స్నేహ భావనను, సాంఘిక కౌశలాలు, సమస్యాపరిష్కాలకు కావలసిన మార్గాలు లభిస్తాయి.

ఆటలు బాలల్లో అన్వేషణ శక్తిని పెంచి, భయాలను, భీతులను అదుపులో ఉంచి పెద్దల పాత్రపోషణకు కావలసిన అవకాశం కల్పిస్తాయి. సమూహాలలో ఆడుకుంటునప్పుడు పిల్లల్లో సహకారగుణాలు ,నాయకత్వ లక్షణాలు స్వయం నిర్ణయ శక్తులు వారిలో ఏర్పడతాయి.

పిల్లలు వారుండే ప్రాంతాలలో వారందరూ కలిసి వారికంటూ ఒక సంస్కృతిని ఏర్పరుచుకుంటారు. అంటే వారికంటూ ఒక భాష, సంకేతాలను, నియమ నిబంధనలు ఏర్పరుచుకుంటారు. ఈ బాలల సంస్కృతిని మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు Street Culture అని పేర్కొన్నారు.

7 సం॥లు – 12 సం॥ల మధ్య వయస్సున్న పిల్లలు వారున్న ప్రాంతాలలో (వీధి, గ్రామము, వాడలు, ఆటమైదానాలలో, నిర్మాణంలో ఉన్న పెద్ద భవంతులలో, కట్టడాలలో, ఫుట్‌పాత్‌లలో, తోటలలో, నదుల సమీపంలో, చెరువులలో,నీటికాలువలలో స్వేచ్ఛగా ఆడుకోవడం పిల్లలStreet Culture కు నిదర్శనం. బాలలStreet Culture ఒకరి పర్యవేక్షణ లేకుండా, వారిసమూహాలకే పరిమితం, గోప్యము, రహస్యం. ప్రస్తుతము ఈ బాలలు వీధి సంస్కృతులు కనుమరుగవుతున్నాయని భావిస్తున్నారు.

బాలలు "Street Culture" – బాలల వీధి సంస్కృతులు కనుమరుగువుతుందని – టి.విలు, వీడియో గేమ్స్, ట్యాబ్‌లు, మొబైల్ పోన్లు, స్మార్ట్ ఫోన్లు బాలల Street Culture ను కనుమరుగు చేస్తున్నాయని బాలలు ప్రకృతి రాహిత్య అస్వస్థతకు (Nature Deficit Disorder (NDD))లోనౌతున్నారని రిచర్డ్‌లోవ్ అనే శాస్త్రవేత్త అభిప్రాపడ్డాడు.

**2.10.1 ఆటలు అర్థం :** శిశువు బొమ్మలనే పరికరాలతో ఏర్పరచుకొనే పని ప్రంచాన్నే క్రీడ లేక ఆట అని మరియామాంటిసోరి అన్నారు. బొమ్మల ద్వారా వారి పరిసరాలను అందులోని వ్యక్తులను గురించి వారంతట వారే నేర్చుకొని. అవగాహన చేసుకొంటారు. ఆటలు పిల్లలకు క్రింది విధంగా ఉపయోగపడుతాయి.

7LCY87

- వస్తువులు ఏ విధంగా పనిచేస్తాయో తెలుసుకొంటారు.
- క్రొత్త ఆలోచనలు రేకెత్తుతాయి.
- కండరాలు ధృడపడుతాయి. కండరాలను నియంత్రించుకోవడం నేర్చుకొంటారు.
- ఊహా శక్తిని పెంపొందించుకోవడం జరుగుతుంది.
- సమస్య పరిష్కారం కనుగొంటారు.
- ఇతరులతో సహకరించుట నేర్చుకొంటారు.

## 2.10.2 ఆటలు – రకాలు (Types of Play):

పిల్లలు ఆడుకునే కొన్ని రకాల ఆటలు గురించి తెలుసుకుందాం.

a. శారీరక క్రీడలు – సంవేదన చలనాత్మక ఆటలు (Physical Play)
b. అన్వేషణాత్మక ఆటలు(Exploratory Play)
c. అనుకరణ క్రీడలు – ఆటలు
d. Make - Belive Play
e. వినోధదాయక ఆటలు
f. వ్యక్తపరచ గలిగే క్రీడ (Expressive Play)
g. నైపుణ్యంతో కూడుకున్న క్రీడ (Mani pulative Play)
h. ప్రతీకాత్మక క్రీడ (Symbolic Play)
i. ఒకరి బదులు మరొకరు ఆడే క్రీడ (Sorrogate Play)
j. ఆటలు (Games)

**a. శారీరక క్రీడలు – సంవేదన చలనాత్మక ఆటలు (Physical Play) :**

పిల్లలు పరుగెత్తడం, గెంతడం, చేతులు తిప్పడం, పల్టీలు కొట్టడం, మెట్లు ఎక్కడం, దొర్లడం, దాక్కోవడం – కనుక్కోవడం (Hide and seek) వంటి వాటిని శారీరక క్రీడలు లేక ఆటలతో ఆడుకోవడం జరుగుతుంది. ఈ రకం ఆటలు పిల్లల జ్ఞానేంద్రియ వికాసానికి, శారీరక అంగాల సమన్వయానికి దోహదపడతాయి.

ఇవి సాధారణ శారీరక వికాసానికి కూడా దోహదపడుతాయి. పిల్లలు తెలియకనో ఇష్టపడో ఇలాంటి శారీరక క్రీడల్లో పాల్గొనవలసి వస్తుంది. ఇలాంటి ఆటలను ఇతరుల సహకారముతో ఆడటం జరుగుతుంది. ఇవి వారి సామర్థ్యాల స్వీయ మదింపుకు తోడ్పడుతాయి. ఇది చాలా ముఖ్యమైన క్రీడ దీనికై ఎలాంటి వ్యయము లేకపోయినప్పటికీ మంచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. ఇవి మంచి శారీరక వికాసానికి తోడ్పడగలవు.

**b. అన్వేషణాత్మక ఆటలు**(Exploratory Play)ః ఈ రకం ఆటలలో శైశవంలోని పిల్లలుతమ శరీరబాగాలను అన్వేషించుకోవడం, తమ జుట్టును లాక్కోవడం, వేళ్ళను చీకడం, తమ జ్ఞానేంద్రియాలను తాకడం, ఆటల ద్వారా విసరడం, పగలగొట్టి అందులోని బాగాలను పరిశీలించడం, పుస్తకాలు, వార్తా పత్రికలలోని బొమ్మలను చూడడం, వాటిని గుర్తించడం లాంటి మొదలగు పనులతో ఆనందంపొందుతారు.

**c. అనుకరణ క్రీడలు – ఆటలు** (Imitative Play)**:** శైశవ దశలోని బాలలు తమ చుట్టూ ఉన్న వారు చేసే కృత్యాలను అనుకరిస్తూ సంతోషిస్తారు. పెద్ద చదువుతున్న పుస్తకాలు చదవడం, చీపురులతో ఇంటిని ఊడ్చడం, గరిటలతో వంటలు చేస్తున్నట్లు నటించడం, పెన్నులతో,క్రేయాన్‌లతో బొమ్మలు గీయటం లాంటివి చేయడంతో సంతోషపడతారు.

**d.** Make Belive Playః– ఈ రకం ఆటలకు పిల్లలు శైశవదశ అంతానికి ఆడడం ప్రారంభిస్తారు. బొమ్మలకు ప్రాణం ఉందని భావిస్తారు. వాటిని స్నానాలు చేయించి, పాలు పట్టించడం, దుస్తులు వేయడం, ఆహారం తినిపించడం వాటితో మాట్లాడడం లాంటివి చేస్తూ మగ ప్లిలలయితే ఖాళీ డబ్బాలను, పెట్టెలను వాహనాలతో పోల్చి వారే నడుపుతారు.

**e. వినోదధాయక ఆటలు**(Amusement Games)**:** పిల్లలు గేయాలు పాడడం, అభినయించడం, కథలు చెప్పడం, వినడం, టి.విలు చూడడం, డ్యాన్సులు చేయడం పుస్తకాలలోని బొమ్మలు చూడడం,ఇతరులను అంటే ఆట, కుంటి ఆట లాంటి క్రీడలలో పాల్గొని ఆనందాన్ని, వినోధాన్ని పొందుతున్నారు.

**f.** ఏకాంత క్రీడ **(Solitary Play)**

శైశవంలో పిల్లలు ఆడుకునే ఆటలకు నియమనిబంధనలు ఉండవు ఆవి స్వేచ్ఛ, యదేచ్ఛగా / స్వతహసిద్ధంగా ఆడుకుంటారు. పిల్లలు ఈ దశలో వారికిష్టమైన ఏ యొక్క నిర్భందము లేకుండా ఆడుకుంటారు.కాని వీరు సాధారణంగా ఒంటరిగా ఆడుకుంటారు. అందుకే వీరి ఆటలను ఏకాంతర క్రీడలు అంటారు. వీరు ఇతరపిల్లలతో కలిసి ఆడుకోరు. వారి సహకారం తీసుకోరు. ఆట వస్తువులను ఇచ్చిపుచ్చుకోవడాలు జరగవు. ఆటలు సామూహికంగా ఉండవు

ఈ రకమైన క్రీడ ఒంటరి ఆటను సూచిస్తుంది. పిల్లలు ఒంటరిగానే ఆడుటకు ఇష్టపడుతారు. సంతోషపడతారు. బొమ్మలే వారి మంచి స్నేహితులు. ఇటువంటి సమయంలో పెద్దలు పిలలు ఆడుకోవడాన్ని ప్రోత్సహించడం వారి వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది. బాలలు రోజులో ఏదో కొంత సమయంలో మాత్రమే ఆడుకోవడం జరుగుతుంది.

**g. సమాంతర క్రీడలు** (Parlallel Play)**:** శైశవ దశ అంతంలోనే పిల్లలు ఇతర పిల్లలు ఆడుకోవడాన్ని గమనిస్తారు. తరువాత తాము అలానే ఆడుకుంటారు. ఇతరులు ఆడే ఆటలను వీరు అనుకరిస్తూ ఆడడం వలన వీటిని సమాంతరఆటలు అంటారు. ఉదాహరణకు పాఠశాలలో పెద్ద పిల్లలు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆడుతున్నప్పుడు చిన్న పిల్లలు వాటిని చూసి ఆడతారు.

**h.** సంసర్గ క్రీడ **(Associative Play)**

శైశవ దశ పూర్తయి బాల్యదశ ప్రారంభమవుతున్నప్పుడు అంటే సుమారు 3 లేదా 4 సం॥ వయస్సులో పిల్లలు సమూహాలలో ఆడుకోవడం ప్రారంభిస్తారు. అయినప్పటికీ వారు వ్యక్తిగతంగా, స్వతంత్రంగా ఆడుకోవడానికే మొగ్గుచూపుతారు. ఉదాహరణకు చెప్పాలంటే పిల్లలు ఇసుకలో సమూహాలలో ఆడుతున్నప్పటికీ ఎవరికి వారు భవంతులను కోటలను నిర్మించడంలో నిమగ్నమవుతుంటారు. ఇక్కడ పిల్లలు సమూహంలో ఉన్నప్పటికీ ఎవరి ఆటల్లో వారు పూర్తిగా లీనమైవుంటారు. ఇది కొంత వరకు వ్యక్తిగతమైనపపటికీ ఇతర పిల్లల సహాయ సహకారాలను కోరుకుంటారు. శిశువు ఏకాంతర ఆట నుండి సామూహిక క్రీడా దశకు (**transition**) ఒక కీలకమైన సంక్రమణ దశగా పేర్కొనవచ్చు. ఈ దశలో పిల్లలు స్నేహితులను ఏర్పరుచుటకు అనువైనది. ఇది భాషా వికాసానికి, సృజనాత్మక ఆలోచనకు మరియు ఊహాత్మక ఆలోచనలకు దోహదపడుతుంది.

**i. సహకార ఆటలు (Co- Operative Games):**

పూర్వ బాల్యంలో ఏకాంతంగా ఆడుకోవడం సర్వసాధారణం. పూర్వబాల్యం అంతానికి పిల్లలు వారి కనుగుణంగా ఆటల్లో నియమాలను ఏర్పరుచుకుంటూ, మార్చుకుంటూ ఆడే ఆటలను ఇష్టపడతారు. నియమాలు లేదా షరతులతో కూడినటువంటి ఆటలలో 4 సం॥ల వయస్సులోపు పిల్లలు పాల్గొనలేరు. ఉత్తర బాల్యంలోని పిల్లలు బోర్డ్‌గేమ్స్, కార్డు గేమ్స్ మరియు మొ॥ ఔట్ డోర్ గేమ్స్, ఇన్ డోర్ గ్రేమ్స్ (చెస్, క్యారమ్స్,టెబుల్ టెన్నిస్,షటిల్, బ్యాట్మింటన్, కబడ్డీ, వాలీబాల్) మొదలగువాటిని ఆడి ఆనందించగలరు. ఈ ఆటలలో పిల్లలు ఆ ఆటకు సంబంధించిన నియమాలను, షరతులను తెలుసుకొని వాటిని పాటించగలరు. పెద్ద పిల్లలు నిర్దిష్టమైన నియమాలు గల ఆటలను ఆడుతూ ఆనందించ గలరు. అంటే పిల్లలు పెరుగుదలతోపాటు ఆటల సరళీ కూడా మారుతు వుంటుంది. ఈ రకం ఆటలు పిలల్లో మానసిక, సాంఘిక,శారీరక, ఉద్వేగ, నైతిక వికాసాలకు – పరిపక్వతలకు దోహదం చేస్తుంది.

**j. పోటీ క్రీడ** (Competitive Play)**:**

ఉత్తర బాల్యదశ ప్రారంబానికి  దాదాపు 5 సం॥ల వయస్సులో చేరుకొన్నప్పుడు, నియమ నిబంధనలతో కూడుకున్న జట్టు క్రీడలు ఆడుటకు సంసిద్ధంగా ఉంటారు. ఈ వయస్సులో పిల్లలు స్నేహితులతతో, పెద్దవారితో మరియు ఉపాధ్యాయులతో క్రొత్త ఆటలు నేర్చుకోవడంలో చురుకుగా వుంటారు. ఇటువంటి ఆటల్లో వారు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించుకొని ఇతర పిల్లలను అధిగమిస్తారు. పిల్లల యొక్క నైపుణ్యం మరియు దక్షతను పరీక్షించబడి స్నేహితులు, ఉపాధ్యాయులు మరియు పెద్దల చేత గుర్తించబడేటట్లు ప్రవర్తిస్తారు. ఇలాంటి పోటీ క్రీడలు బాలల్లో ఆత్మగౌరవాన్ని వాస్తవ స్నేహాన్ని పెంపొందింపచేస్తాయి.

**k. వ్యక్తపరచగల్గే క్రీడ**(Expressive Play) **:**

ఇది పేరుకు తగ్గట్టుగానే ఈ విధమైన ఆట పిల్లలు ఆటలాడునప్పుడు వారి స్వంత అభిప్రాయాలను, భావాలను వెలిబుచ్చుడానికి అవకాశాలు ఉంటాయి. ఇలాంటి ఆటల్లో డ్రాయింగ్ పేపర్స్, వాటర్ కలర్స్, క్రెయాన్స్, రంగుల పెన్సిళ్ళ, బంకమన్ను నీళ్ళు, స్పాంజి బొమ్మల తయారుచేయు మొదలగు కృత్యాలు / నమానాలు తయారు చేయడానికి మరియు ఇతర సంగీత వాయిద్యాల ద్వారా లయబద్ధమైన శబ్దాలను జనింపచేయుటకు సంగీత వాయిద్యాలు మొ॥నవి. ఇలాంటి కృత్యాలు అన్ని పిల్లలు వారి యొక్క సంవేదనలు, కోరికలు మరియు సామర్థ్యాలను వ్యక్తపరచడానికి దోహదపడుతాయి.

**l. నైపుణ్య క్రీడలు** (Manipulative Play) **:**

పిల్లలు పరిసరాలలోని వస్తువులను తమ ఆటలలో ఉపయోగిస్తూ ఆనందపడుతూ ఆడే ఆటలే నైపుణ్యక్రీడలు  . శైశవ దశ నుండే పిల్లలు వివిధ వస్తువులను పరికరాలను ఉపయోగిస్తూ ఆటలు ఆడడం ప్రారంభిస్తారు. పిల్లలు ఇంట్లో తల్లిదండ్రులతో లేదా పెద్దవారితో ఇంటిలోని వస్తువులతో ఆడుతూ వుంటారు. వయస్సు పెరిగే కొద్ది ఫజిల్స్, మరియు యంత్ర నిర్మితమైన బొమ్మలతో బ్యాట్,బాల్‌లతో ఆడుతుంటారు. ఈ విధమైన ఆటలు పిల్లల ఊహాశక్తిని, సృజనాత్మకతను ప్రేరేపించి వారిని వికాసవంతంగా అభివృద్ధి చెందేటట్లు చేస్తాయి.

**m. నాటకీకరణ క్రీడలు**(Dramatization Games) **:** బాలలు ఉదాహరణకు దొంగ – పోలీస్, చిల్లర కొట్టు – దుకాణదారుడు – ఖాతాదారుడు, ఉపాధ్యాయుడు – విద్యార్థులు, బస్సు డ్రైవర్ – కండక్టర్ వంటి పాత్రలను అనుకరిస్తూ, నటిస్తూ ఆడుకొంటున్నారు.

**n. ఒకరి బదులు ఇంకొకరు ఆడే ఆట (Surrogate Play):**

పిల్లలు పూర్తిగాని, పాక్షికంగాగాని  కదలలేని స్థితిలో ఉన్న పిల్లలు ఆటలు ఆడలేని పరిస్థితులలో, ఆడలేని సందర్భాలలో వేరే పిల్లలుగాని లేదా తల్లిదండ్రులుగాని ఆటలలో పాల్గొనే ఆటలను సరోగేటివ్ ఆటలుగా పరిగణింపవచ్చు. ఇటువంటి ఆటను పిల్లవాని బదులు వేరొకరు తన తరపున ఆడటం వలన పిల్లవాడు ప్రేరణపొంది ఆనందానికి లోనవుతాడు. ఉదాహరణకు దీపావళి సందర్భంగా పిల్లలు ఇతరులు బాణా సంచాకాల్చుటను తన కళ్ళతో గమనించి ఆనందపడతాడు. ఇది చాలాశక్తివంతమైన ఆట.

### 2.10.3 వివిధ వికాసాలు - ఆటలు (Play and different ............):

ఆటలు పిల్లలు వివిధ వికాసలపరంగా మూర్తిమత్వం అభివృద్ధి చెందడానికి సహాయపడుతాయి.

అవి : a) భౌతిక వికాసం, b) సాంఘిక వికాసం, c) ఉద్వేగ వికాసం, d) మానసిక వికాసం, e) నైతిక వికాసాలకు దోహదపడుతుంది. వీటి గురించి తెలుసుకుందాం.

**a) ఆటలు – శారీరక/ చలనాత్మక వికాసం (Plays - Phyical Development) :**

ఆటలు సూక్ష్మ కండర మరియు స్థూల కండరాల చలనానికి మరియు నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడుతాయి.

పిల్లలు కొన్ని శారీరక కదలికలను కేవలం సంతోషం కోసమే చేస్తారు. ఉదా వస్తువులను కిందకు పడవేసి ఆనందించడం, ఇదే కృత్యాలను మరలా మరలా చేయడం, ఇలాంటి కృత్యాలు సరళత్వం నుండి కఠినస్థాయి వరకు సంబంధించినవిగా వుంది శారీరక వికాసానికి దోహదపడుతాయి. శరారీక వికాసము అనేది ఆటల వలననే సంభవిస్తుంది. ఈ ఆటకు సంబంధించిన ప్రాథమిక ఫలితము పిల్లలకు సంతోషాన్ని అందించడం.

**b) ఆటలు – ఉద్వేగ వికాసం (Plays - Emotional Development) :**

పిల్లలు ఆటలాడునప్పుడు పంచుకోవడం, ఒకరిపట్ల ఒకరికి సంరక్షణ సహాకార భావాన్ని కల్గి వుండటం అలవరుచుకోవడం జరుతుంది. ఆటలు ఆడునప్పుడు నియమ నిబంధనలను పాటిస్తూ వారి గురించి ఆశించిన ఫలితాలను దృష్టిలో పెట్టుకొని తదనుగుణంగా ప్రవర్తిస్తారు. వ్యక్త్యంతర సంబంధాలు విజయవంతంగా కొనసాగించుటకు తగిన ఉద్వేగాలను / ఉద్వేగ పరిణితిని పొందుతారు. తల్లి దండ్రులు గాని తోబుట్టువులు గాని పిల్లలతో బోర్డ్ గేమ్‌లు గాని, క్రికెట్, బాల్ గేమ్స్ ఆడిన పిల్లల్లో ఆత్మగౌరవం ఎంతగానో వికసిస్తుంది. పిల్లలు తల్లిదండ్రులతో వారి ఆనందాన్ని సంతోషాన్ని పంచుకొనే ప్రయత్నంచేస్తే వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తే వారి పట్ల శ్రద్ధ వహిస్తున్నట్లు సందేశమంతుంది. అందువలన ఆటలు పిల్లల్లో ఆశించిన ఉద్వేగాలను ఆవేశాలను అదుపు చేసుకోవడం జరుగుతుంది.

**c) ఆటలు - సంజ్ఞానాత్మక వికాసము (Plays - Cognitive Development) :**

పిల్లలు ఆటలు మరియు క్రీడల వల్ల మానసిక ప్రేరణను పొందగలరు. పిల్లలు ఆటల వల్ల జ్ఞానాన్ని పొందగలరు. ఆటలు లేదా క్రీడలు ఆడునపుడు వారి ఆలోచనను, స్మృతి, నిర్ణయాధికారం, సమస్యా పరిష్కారం, సృజనాత్మక ఆలోచన మరియు ఉన్నత క్రమ ఆలోచనా నైపుణ్యాలను వినియోగించుకుంటారు. కనుక పిల్లలు సమస్య పరిష్కారంలో వారి ఆలోచనా సామర్థ్యాలను మరియు స్మృతిని ఉపయోగించగలరు. ఆటలు, ఫజిల్స్ మొదలగు వాటిలో పాల్గొనినపుడు వారి సమస్యా పరిష్కార నైపుణ్యాలను పెరుగుతాయి. ఆటలాడునప్పుడు పిల్లలు భాషను ఉపయోగించడం జరుగుతుంది. భాషా సామర్థ్యం కూడా బలపడుతుంది. ఎందుకంటే పిల్లలు ఆడునపుడు ఇతరులతో తన భావాలను భాష ద్వారా వ్యక్త పరచవలసి వుంటుంది.

పిల్లలు ఆటలాడేటప్పుడు చేతనంగా గాని, అచేతనంగా గాని పరిమాణం, ఆకారం, కాలం, రంగు, ప్రాదేశిక భావనలను అవగాహన చేసుకుంటారు. వివిధ వస్తువుల మధ్య సంబంధాన్ని, విద్య సంబంధిత బొమ్మలు, పదాలను ఉపయోగించడం వలన పిల్లల ప దజాలాభివృద్ధి, పరిసరాలు ప్రపంచానికి సంబంధించిన భావనలను అవగాహన చేసుకోగలరు.

d) **ఆటలు – సాంఘిక వికాసము** (Plays - **Social Development) :**

ఆటల వలన పిల్లలో పెద్ద ఎత్తున జరిగే వికాసం సాంఘీక వికాసమని పేర్కొనబడుతుంది. మొదట శిశువులు ఆహం కేంద్రీకృతం వుంటుంది. అదే శిశువు పెరుగుతున్న కొద్ది ఇతరులతో తన తోట వారితో ఆడుకోవడం ప్రారంభిస్తాడు. పిల్లలు పేరిగేకొద్ది జట్టుకృత్యాలలో, పోటీలలో పాల్గొనడం వలన సాంఘీక వికాసానికి లోనవుతాడు. ఇతరులతో తమ వస్తువులను, ఆలోచనలను పాలుపంచుకోవడం; ఓపిక, సహనం, నిర్లక్ష్యం మరియు గెలుపు – ఓటమిలకు సంబంధించిన అంశాలను అవగాహన చేసుకొంటారు. ఆటలు క్రీడలు ద్వారా పిల్లలు నియమాలు పాటించడం, రెఫరీ సంకేతాలు అర్థం చేసుకోవడం, ఇంటి సమాజంలోని ఆచార నియమాలను పాటించడం ద్వారా సాంఘికంగా మరింత మెరుగు పడతారు.

e) **ఆటలు – భాషా వికాసము** (P) **:**

అనేక మంది భాషాశాస్త్రవేత్తల అధ్యయనాల వల్ల సాంఘిక క్రీడలకు, భాషకు మధ్య సంబంధం ఉన్నట్లు ఋజువైంది. శిశువు రెండో సంవత్సరంలోకి అడుగిడగానే క్రీడలలో పాల్గొనడం జరుగుతుంది. ఇదే భాషా వికాసానికి దోహదపడుతుంది. శిశువు భాషా వికాసంలో క్రీడలు కీలక పాత్ర వహిస్తాయి. క్రీడలలో పాల్గొనునప్పుడు వారు మాట్లాడే భాషా తీరు, వారు వారి అభిప్రాయాలను తెలియజేసే పద్ధతి స్పష్టత, సహనం, ఆలోచనలు పంచుకోవడం, అవగాహన మొదలగు విషయాలను గమనింపవచ్చును. ఇదే వారిలో ఆత్మవిశ్వాసం చొరవను పెంపొందించి సమగ్రమూర్తిమత్వానికి దారితీస్తుంది.

f) **ఆటలు – నైతిక వికాసము** (Plays - Moral Development) **:**

క్రీడలు నియమ నిబంధనలతో కూడుకొని వుంటాయి. కాబట్టి అందులో పాల్గొను ప్రతి ఒక్కరు ఆ నియమ నిబంధనలకు కట్టుబడి వుండాలని పిల్లలు గ్రహిస్తారు. ఆటలలో నియమ నిబంధనలను పాటించకపోతే లేదా ఉల్లంఘిస్తే ఆ ఆటలనుండి తమను వెలివేయడం / నిషేధించడం జరుగుతుందని లేదా తగిన విధంగా శిక్షించడం జరుగుతుందని అర్థం చేసుకొంటారు. ప్రస్తుతం పిల్లలు ఎక్కువగా టీ.వి.ల్లో మ్యాచ్‌లను గేమ్స్‌ను చూస్తుంటారు మరియు పేపర్లలో చదువుతూ వుంటారు. కావున క్రీడల పట్ల సరియైన అవగాహన కల్గి వుండటం వలన నైతిక వికాసానికి –ఏవి తప్పులు, ఏవి ఒప్పులు అని తెలుసుకొంటారు.కనుక ఆటలు – క్రీడలు పిల్లల నైతిక వికాసానికి మూర్తిమత్వా లక్షణాల అభివృద్ధికి తోడ్పడుతుంది.

**2.10.4 ఆటలు / క్రీడలు – సామూహిక గతిశీలత (Games / Sports - Group Dynamics) :**

క్రీడలు, సమూహ గతిశీలత ఒకదానితో ఒక అవినాభావ సంబంధాన్ని కల్గి వుంటాయి. ఆటలు ఆడేటప్పుడు "సమూహంలోని సభ్యుల పరస్పర మానసిక సంబంధాల ప్రతిచర్యల వల్ల వారి అనుభూతుల ఉద్వేగం ఆధారంగా ఒక ఏకదృష్టిని పెంపొందించుకుంటారు.

క్రీడల్లో జట్లు పోటీల్లో సమూహ గతి శీలతకు దోహదంచేస్తుంది. ప్రతి జట్టుకు కొన్ని నిర్దిష్ట లక్ష్యాలు ఉంటాయి. అదేవిధంగా పిల్లలకు ఆటల పరంగా కొన్ని లక్ష్యాలుంటాయి. కాని ఆ లక్ష్య సాధన ఒంటరిగా సాధ్యం కాదు. అందుకు జట్టులో లేదా టీమ్‌లో సభ్యునిగా చేరి ఇతరులతో కలిసి ప్రయత్నిస్తే, శ్రమిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు. జట్టు భద్రతపరంగా కూడా చాలా అనుకూలంగా వుంటుంది మరియు గుర్తింపు లభిస్తుంది. టీమ్ వలన ప్రతి సభ్యుని వ్యక్తిగత

అవసరాలు, ఆశయాలు సంతృప్తి చెందుతాయి. టీమ్ నిబంధనల ప్రకారము టీమ్‌లోని ప్రతి సభ్యునికి బాధ్యత, విధులు మరియు స్థాయి వుంటాయి. జట్టు నాయకత్వం పటిష్టంగా ఉండి సభ్యులందరి ఆమోదం పొందేదిగా ఉంటే ఆ జట్టు అందరి మన్ననలను పొందుతూ విజయపరంపరలు సాగిస్తూ వుంటుంది.

**2.10.5 ఆటలు – విభేదాల పరిష్కారము** (Plays - **Conflict negotiation)**

సాధారణంగా ఆటల్లో విభేదాలు ఏర్పడటం సర్వసాధారణం, అప్పుడు టీమ్ లక్ష్యాలను సాధించడానికి టీమ్ లీడర్లు సంప్రదింపుల ద్వారా అవసరాలను తీర్చుకొని ఇరు వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించుకొని తమ అవకాశాలను మెరుగుపరచుకొంటారు.

ఒప్పందం(Agreement) అనేది– సంప్రదింపులు చేయడం లేదా మధ్యవర్తిత్వం నెరపడం వలన ఏర్పడే నైపుణ్యంతో కూడుకొన్న ప్రక్రియ. ఏ సమూహానికి నష్టం వాటిల్లకుండా ఇరువర్గాలు లాభపడే విధంగా స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిపి ఇద్దరికి/ఇరు వర్గాలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలి. ఇందుకోసం టీమ్ నాయకులు కొన్ని నైపుణ్యాలను పెంపొందించుకోవలసి ఉంటుంది.

అవి

- విభేదాలకు కారణమైన అంశాన్ని, దానికి గల కారణాలను, కారకాలను చర్చించాలి.
- చర్చించడానికి తగిన నైపుణ్యం పొంది వుండాలి. సమస్యా పరిష్కారం పట్ల అసక్తిని కల్గి వుండాలి.
- తన అవసరాలను/కాంక్ష స్థాయిని తగ్గించుకొని ఇతరుల సమస్యను తన సమస్యగా భావించి సమస్యా పరిష్కార మార్గం దిశగా ఆలోచించాలి.
- ఒప్పందాలలో ఆటవిడుపులతో ప్రత్యమ్నాయం ఎన్నుకోవడానికి సంసిద్ధులుగా వుండాలి.
- చర్చలను సఫలవంతం దిశగా పరిష్కరించుకొని తదుపరి వాటిని అమలు పరచాలి.

**2.11 స్వీయ జ్ఞానం : (Sense of Self)**

తనను గురించి తాను తెలుసుకోవడం వలన ఏ వ్యక్తియైన మంచి జీవనాన్ని గడపవచ్చు. అందువలన ప్రతి వ్యక్తి తన గురించి తాను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆత్మ భావనలో స్వీయ వర్ణన, స్వీయ గుర్తింపు, స్వీయ గౌరవం, ఆత్మగౌరవం, సామాజిక పోలిక, అంతర్గతీకరణం మరియు స్వీయ నియంత్రణ మొ॥ నవి ఉంటాయి.వాటి గురించి తెలుసుకుందాం.

**A) స్వీయ వర్ణన (Self Description):**

“ తనను గురించి తాను వర్ణించకోవడమే స్వీయవర్ణన అవుతుంది.” ప్రతి మనిషి ఒక అద్వితీయ వ్యక్తి. తన ప్రవర్తన, పనిచేసే విధానం, కుటుంబంలో సమాజంలో ప్రవర్తించే విధానం వంటి అన్ని విషయాలలో వ్యక్తిగత పద్ధతులు ఉంటాయి. తన గురించి తాను తెలుసుకుంటే తన లోటుపాట్లను సరిచేసుకునే లేక మార్పు చేసుకునే అవకాశం వుంది.

ఒక వ్యక్తి తన గురించి తెలుసుకోవాలంటే తన స్వంత అభిప్రాయాలతో పాటు తన గురించి స్నేహితుల, తల్లిదండ్రుల అభిప్రాయాలను, ఇతర కుటుంబ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవలసి వుంటుంది. స్వీయ వర్ణనలో ఈవిధంగా అందరి అభిప్రాయాల ద్వారా తాను ఎలాంటి వ్యక్తో తెలుస్తుంది. ఒకవిధంగా చెప్పాలంటే నిక్కచ్చిగా అభిప్రాయాలు వెల్లడించబడితే వ్యక్తి తనలోని బలాలను, బలహీనతలను తెలుసుకొని, బలహీనతలను తొలగించుకొని బలాలను మెరుగుపరచుకొనే అవకాశం వుంటుంది.

**B) స్వీయ గుర్తింపు (Self Recognization) :**

“ తన గురించి తాను గుర్తించడం స్వీయ గుర్తింపు అవుతుంది”. ఇది ముఖ్యంగా 3 విషయాలను గురించి తెలియజేస్తుంది. మొదటిది తనంటే తనకున్న వ్యక్తిగత అభిప్రాయం

రెండవది తనలోని సామర్థ్యాలపై అవగాహన మూడవది తనలోని లక్షణాలు తమ వ్యక్తిగత న్యాయనిర్ణయాలు మొదలగువాటిని తెలియజేస్తుంది.

ఇతరులు తనను గుర్తించాలని, పొగడాలని అందరూ కోరుకుంటారు. ఉన్న రంగంలో రాణించేందుకు, చేసే పని తీరును ఇతరులు మెచ్చుకోవాలని తాపత్రయ పడతారు. స్వీయ గుర్తింపు ఒక ముఖ్యమైన మానసిక వాంఛ.

**C) స్వీయ భావన/ఆత్మ భావన (Self Concept)**

“ పిల్లల్లో ఉత్తర బాల్యదశలో ఆత్మభావన ఏర్పడుతుంది” ఒక వ్యక్తికి తన గురించి తన గుణాలను గురించి ఏర్పరచుకొనే నమ్మకమే స్వీయభావన (“Self concept in the individuals believe about him self/ her self including the persons atributes and also what the self is”. - Boumeister, 1999)

వ్యక్తి తన స్వీయభావనను అంచనా వెసుకోవచ్చు తద్వారా తమ మూర్తిమత్వాన్ని మలచుకోవచ్చు. ప్రవర్తను సమాజానుకూలంగా మార్చుకోవచ్చు. సంఘం ఆమోదింపబడే రీతిలో మనగలగవచ్చు. కుటుంబం, పాఠశాల, సమాజము వ్యక్తి యొక్క ఆత్మభావనను ఏర్పరుస్తాయి.

**D) స్వీయ గౌరవం(Self Respect):**

“ ఆత్మగౌరవం అంటే తనంటే తనకు ఉన్న గౌరవం” తమను తాము గౌరవించుకొని ఇతరులచేతను గౌరవింపబడాలని కోరుకుంటారు. సమాజంలో గుర్తింపు, గౌరవం వ్యక్తి ఆత్మ గౌరవాన్ని పెంచుతుంది.

“ మనల్ని మనం అంచనావేసుకోవడాన్ని ఆత్మగౌరవం లేదా స్వీయగౌరవం అనవచ్చు. స్వీయ గౌరవవికాసం బాల్యదశ నుండే ప్రారంభమవుతుంది.

**బాలల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందడానికి పాటించవలసిన అంశాలు:**

- ప్రతికూల ఆలోచనలు వదలి సానుకూలంగా ఆలోచింపజేయాలి.
- ప్రతిరోజు తమను తాము గౌరవించుకొని, ఇతరులను గౌరవించడం నేర్పించాలి.
- బలహీనతలను తెలుసుకొని, ఇతరులతో చర్చించి వాటిని అధిగమించడానికి అవకాశాలు కల్పించాలి.
- ఇతరుల మీద ఆధారపడటం తగ్గించాలి.
- మనకు మనం విలువనిచ్చుకోవాలి.
- మనల్ని మనం ప్రతికూలంగా చూసుకోకూడదన్న లాంటి లక్షణాలను పెంపొందించాలి.

**E) సామాజిక పోలిక (Social Comparison):**

ఒక వ్యక్తి లేదా సమూహం యొక్క సామర్థ్యాలు, అభిప్రాయాలు లేదా ఇతర లక్షణాలను మరొవ్యక్తి లేదా సమూహం యొక్క సామర్థ్యాలు అభిప్రాయాలు లేదా ఇతర లక్షణాలతో పోల్చడం సామాజిక పోలిక అవుతుంది.

వ్యక్తులు తమకన్నా తక్కువ స్థాయి లేదా సామర్థ్యం గల వారితో పోల్చుకొంటే వారి స్థాయి కూడా క్రింది స్థాయికి పోతూవుంటుంది. అలాకాక తమ కన్నా ఉన్నతస్థాయి లేదా సామర్థ్యం గల వారితో పోల్చుకొంటే వారి స్థాయి కూడా ప్రస్తుతం ఉన్న స్థాయి కంటే పెరుగుతుంది.

విద్యార్థులు ఉన్నత సామర్థ్యం గల విద్యార్థులతో పోల్చుకొని వారితో కలిసి అభ్యసనం చేసినపుడు ఫలితాలు మెరుగ్గాను, తక్కువ సామర్థ్యం గల వారితో పోల్చుకొని అభ్యసనం చేసినపుడు ఫలితాలు తగ్గాయని బ్లాంటర్ తన పరిశోధనల ద్వారా తెలియజేశాడు.

కావున విద్యార్థులు సాదన స్థాయి, ప్రేరణ, ప్రయత్నాలు, తగిన ప్రమాణాలతో పోల్చుకొని పోలికలను అనుకూలంగా మలచుకొని ఉన్నతస్థాయికి ఎదగడానికి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

### F) అంతర్లీకరణ/అంత:కరణ (Internalization):

" తన నమ్మకాలను, వైఖరులను, విలువలను సంఘటిత పరచి తనలోకి ఇమిడ్చుకొనే ప్రక్రియే అంతర్లీకరణం" అంటారు.

అంతర్లీకరణం అనేది ముఖ్యంగా వివిధ విషయాలను ఇతరులతో చర్చించడం ద్వారా వృద్ధి చెందుతుంది.

కాబట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు పిల్లలకు మంచి రోల్‌మోడల్‌గా వ్యవహరించి పిల్లలతో అనేక విషయాలను చర్చించాలి. వారిలో అంతర్లీకరణ ప్రక్రియ ద్వారా ఆత్మభావనను పెంపొందించాలి.

### G) స్వీయ నియంత్రణ (Self Control):

" లక్ష్యాలను సాధించడానికి వ్యక్తి తన ప్రవర్తనను తాను నియంత్రించుకొనే ప్రక్రియ స్వీయ నియంత్రణ" అని చెప్పవచ్చు.

విజయ సాధనలో IQ కంటే స్వీయనియంత్రణ ముఖ్యపాత్ర వహిస్తుందని డక్‌వర్త్ అనే శాస్త్రవేత్త పేర్కొన్నాడు కాబట్టి విద్యా సాధనలో స్వీయనియంత్రణ ద్వారా ఎదురయ్యే ఆటంకాలను అధిగమించాలి. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉద్వేగ పరిపక్వత స్వీయ నియంత్రణలకు కావలసిన పరిస్థితులను కల్పించాలి.

## 2.12 సంస్కృతి – జండర్ వికాసం (Culture and Gender Development):

మానవుడు సృష్టించిన పరిసరమే సంస్కృతి – ఎం.జె. హెర్కొవిట్స్

1982 సం॥లో మెక్సికోలో జరిగిన ప్రపంచ సంస్కృతి సభలో – " ఒక సమాజానికి గల లక్షణాలు, ధృడమైన, విశేషమైన, ఆధ్యాత్మిక సంబంధమైన, మేధో సంబంధమైన మరియు ఉద్వేగ లక్షణాలను కల్గినటువంటిదే సంస్కృతి" అని నిర్వహించారు. ఇది కళలనే కాకుండా, జీవన విధానాలను, ప్రాథమిక హక్కులను, మానవ విలువలను సాంప్రదాయాలను మరియు నమ్మకాలను తెలియజేస్తుంది.

### జెండర్‌వికాసము (Gender Development):

జండర్ అంటే స్త్రీ, పురుష, పాత్రోచిత లక్షణాలకు సంబంధించిన పదము. సాధారణంగా జండర్ వికాసాన్ని మన భాషలో లైంగిక వికాసము లేక లింగ వికాసమని అనుకుంటూఉంటాము. కాని జండర్ వికాసానికి, లైంగిక వికాసానికి మధ్యగల కొన్ని నిర్దిష్టమైన వ్యత్యాసాలను తెలుసుకుందాం.

| లైంగిక వికాసం | జండర్ వికాసం |
|---|---|
| – లైంగిక వికాసము శారీరానికి సంబంధించినది | – జండర్ వికాసం సమాజానికి సంబంధించినది. |
| – లైంగిక సహజాతం (Sex Instinct) కు సంబంధించినది. పుట్టుకతో వచ్చే జైవికా, సహజ ప్రవృత్తి. | – సమాజపరంగా ఏర్పడే సాంఘిక ప్రవృత్తి |
| – స్త్రీ,పురుషప్రాథమిక లైంగిక అంశాలైన పునరుత్పత్తి వ్యవస్థలో గౌణ, లైంగిక లక్షణాల వికాసానికి సంబంధించినది. | – దుస్తులు, భాషణశైలి, ప్రవర్తనకు, నడవడికలకు సంబంధించిన స్త్రీ,పురుష పాత్రోచిత లక్షణాలకు సంబంధించినది. |
| – స్త్రీపురుష లైంగిక అంశాలు మార్పులకు లోనుకాదు. | – స్త్రీ, పురుష పాత్రోచిత లక్షణాలు లోనుకావచ్చు. |

పై కనబరిచిన వ్యత్యాసాల వలన ఈ అధ్యయనంలో జండర్ వికాసంఅనే శీర్షికతోనే చర్చించడం జరిగింది.

సంస్కృతి సమాజానికి సంబంధించినది. సమాజం మానవులకు సంబంధించినది. స్త్రీ–పురుషులు కలసి ఉంటేనే సమాజం. మానవులు సమాజాన్ని తీర్చిదిద్దుతారు. కనుక సంస్కృతి అన్ని సమాజాలలో ఒకేరకంగా వుండదు. ప్రస్తుత సమాజం కొన్ని జండర్‌పరమైన మార్పులు గమనిస్తున్నాము. ముఖ్యంగా బస్సులలో మహిళా కండక్టర్లు, మహిళా పైలెట్లు, మహిళా రెజ్లర్లు, మహిళా పోలీసులు, ఇటీవల ఆర్మీలో కూడా, ఆటల పోటీలలో పురుషునితో సమానంగా రాణిస్తూ మహిళలు ప్రాతినిద్యం వహిస్తున్నారు. కనుక మారుతున్న సమాజంలో అన్నిరంగాలలో స్త్రీ – పురుష పాత్ర కూడా మారుచున్నది.

మారుతున్న ప్రపంచంలో సంస్కృతి మారుస్తూ నేడు స్త్రీలు బయటికి వచ్చి ఆర్థికాభివృద్ధికి, దేశాభివృద్ధికి తోడ్పడుచున్నారు. తత్ఫలితంగా ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాల మేరకు చట్టాలను కూడా మార్చవలసిన, సవరించవలసిన అవసరం ఏర్పడింది. మానవ విలువలు సంప్రదాయాలు మరియు సాంఘిక, సామాజిక సంబంధాలు అభివృద్ధి సూచికలను మారుస్తున్నాయి. కాబట్టి సంస్కృతి లింగభేదం లేకుండా మారుతున్న సమాజం కొరకు దేశాభివృద్ధికి కారకాలైన సూచికలను అనుసరిస్తూ సమాజం అభివృద్ధికి తోడ్పడుతుంది.

**బాలలలో జండర్ వికాసంః–**

శిశువులు పుట్టినరోజు నుండే తల్లిదండ్రులు వానిరిని పోషించే తీరులోనే జెండర్ విచక్షణ(స్త్రీ – పురుష) విచక్షణ కనబడుతుంది. శిశువుల కొరకు వారుకొనే వస్తువులు అమ్మాయిలైతే గులాబీ రంగు(Pink)లో ఉంటుంది. దుస్తులుగాని, బేడ్‌షీట్లు, టవల్స్ మొదలగునవి.

మొదటి పుట్టినరోజున శిశువులకు బంధువులు, స్నేహితులు తీసుకొచ్చే బహుమతులలో విచక్షణ ఉంటుంది. మొదటి సం॥ పంతానికి శిశువులు స్వేచ్ఛా ప్రవృత్తిని కనబరిచినప్పుడు తల్లిదండ్రులు అమ్మాయిలైతే స్వేచ్ఛా ప్రవృత్తిని నిరుత్సాహ పరుస్తారు. అబ్బాయిల స్వేచ్ఛా ప్రవృత్తిని ప్రోత్సహిస్తారన్నది మనకు తెలిసిన విషయమే. ఈ రకంగా పిల్లల్ని పెంచడమన్నది మన సమాజంలో మనకిచ్చిన స్థిరీకరణ ఆలోచనే.

తల్లిదండ్రులు అబ్బాయిలను మగవారివలే, మాటల తీరు, దుస్తులు, నడవడు (ప్రవర్తనలను) అమ్మాయిలను ఆడవారివలే మాటల తీరు, ధరించే దుస్తులు, నడవడి ప్రవర్తనలను ప్రోత్సహించడం జరుగుతుంది.

ఆట వస్తువులు కొనివ్వడంలోను విచక్షణ చూపుతారు. అబ్బాయిలైతే కార్లు, రైలు, వ్యాన్‌లు, తుపాకులు మొ॥ అమ్మాయిలకైతే వంటసామాగ్రి, అలంకరణ సమామాగ్రిలు కొనివ్వడం చూస్తుంటాము.

మనో విజ్ఞానశాస్త్రవేత్తలు పూర్వబాల్యదశను స్త్రీ – పురుషపాత్రోచిత వికాసానికి క్లిష్టవయస్సుగా గుర్తించారు. ఎందుకంటే అబ్బాయిలైతే మగవారివలే, అమ్మాయిలైతే ఆడవారివలే ప్రవర్తించాలి.

వారు కనబరచే పాత్రోచిత ప్రవర్తనలను తల్లిదండ్రులు, బందువులు, సమవయస్కులు ఆమోదించాలి.

ఆమ్మాయిలు – అబ్బాయిలు తన పాత్రలలో ఇమడలేనప్పుడు మున్ముందు జరగబోయే వికాసాలలో ఆటంకాలు, సర్ధుబాటు సమస్యలు ఎదుర్కొవలసి ఉంటుంది. అన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం.

పిల్లలు/శిశువులు సాంప్రదాయబద్ధ స్త్రీ పురుష పాత్రోచిత ప్రవర్తనల అభ్యసనం ముఖ్యంగా 1. శారీరక రూపం గురించి, 2. ధరించే దుస్తులు గురించి, 3. (భాషణం) మాట్లాడేతీరు గురించి, 4. ప్రవర్తనలు గురించి తెలుపుతుంది.

పిల్లలు స్త్రీ, పురుష పాత్రోచిత ప్రవర్తనలను ఏక మొత్తంగా లేక ఒకేసారిగా అభ్యసించడం జరగదు. అది ఒక క్రమంలో జరుగుతుంది.

- శిశువుల్లో కొందురు బాలురని, కొందరు బాలికలని పెద్దల్లో కొందురు మాగవారనవి, కొందరు ఆడవారని గుర్తిస్తారు.
- తాము బాలుడని లేక బాలికని తెలుసుకుంటాడు.
- మగవారికంటూ ప్రత్యేక వస్తువులు, దుస్తులు, ప్రవర్తనలు ఉంటాయని ఆడవారికి ప్రత్యేక వస్తువులు, ప్రవర్తనలు దుస్తులు ఉంటాయని గుర్తిస్తారు.
- మగవారికంటూ కొన్ని పనులు, ఆడవారికంటే కొన్ని పనులుంటాయని తెలుసుకొంటారు.
- తొలి బాల్యం అంతానికి పిల్లలు/బాలలు స్త్రీలు(ఆడవారు) – పురుషులు (మగవారు) ఎవరు అన్న జ్ఞానాన్ని పొందుతారు. పిల్లలు/బాలలు స్త్రీ, పురుష పాత్రోచిత ప్రవర్తనలను తెలుసుకున్నంత మాత్రాన వాటిని ప్రదర్శించాలని లేదు. వారికి వాటిని ప్రదర్శించడానికి కావలసిన పరిస్థితులను, అవకాశాలను కల్పించాలి.
- అనుకరణ ద్వారా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నేరుగా అబ్బాయిలను మగవారివలే, అమ్మాయిలను ఆడవారివలె నటింపచేయాలి, నమూనాల వ్యక్తులను (Models) ను చూపి వారివలె నటించమనాలి. సరైన ప్రవర్తనలను ప్రోత్సహించాలి.
- పాఠశాలల్లో, నర్సరీలలో, ప్లేస్కూళ్ళల్లో అక్కడి ఉపాధ్యాయులు ఇచ్చే కృత్యాలు – ఆటలు – పాటలు –క్రీడలు. ఉదా॥ ఆబ్బాయిలకైతే బ్యాట్ – బాల్‌గేమ్స్, జంపింగ్, రోలింగ్, బాల్ గేమ్స్ ఆడిస్తే, అమ్మాయిలకైతే స్కిప్పింగ్, డ్రాయింగ్, పెయింటింగ్, కుట్టు పనులు, ముగ్గులు, వంటలు చేయడం లాంటి వాటితో ఆడిస్తుంటారు. ఇంటిలోకన్నా బడిలోనే ఆడ – మగ పాత్రోచిత ప్రవర్తనలను నేర్చుకొంటారు.

- ప్రసార సాధనాలు, కథల పుస్తకాలు, చిత్రాలు, బొమ్మల పుస్తకాలు, టి.విలలో కార్యక్రమాలను కంప్యూటర్ గేమ్స్, అడ్వర్‌టైజ్‌మెంట్లు చూడడం వలన కూడా స్త్రీ, పురుష పాత్రోచిత ప్రవర్తనలను నేరుస్తారు.
- పిల్లలు పాఠశాలలోనిగాని, తామునివశిస్తున్న ప్రాంతంలోని గాని ముఠాలుగా ఏర్పడడం అన్నది సహజం. మగపిల్లలు గాని, ఆడపిల్లలు గాని తామున్న ముఠా సభ్యుల అభిప్రాయాలకువైఖరులకు, ప్రవర్తనా తీరులకు అనుగుణంగా నడుచుకోవాలి. ఈ విధంగా ఉండడం వల్ల జెండర్ వికాసం ఇంకా చురుకుగా సాగుతుంది.
- ఉత్తర బాల్యం అంతానికి – పిల్లలు అబ్బాయిలు, అమ్మాయిలు వేరు వేరు సమూహాలుగా ఏర్పడతారు.
- అమ్మాయిలు తమకన్నా తక్కువని అబ్బాయిలు పొల్చుకొని ప్రవర్తిచడం వల్ల వారి మధ్య లైంగిక వ్యతిరేకత ఏర్పడుతుంది. ఈ భావం తోబుట్టువులు మధ్య కూడా ఏర్పడుతుంది.
- అబ్బాయి,అమ్మాయిలు తమ మధ్యనున్న ఖచ్చితమైన వ్యత్యాన్ని గుర్తిస్తారు. తమ అభిరుచులు, వైఖరులు, ఆటలు, పాటలు తమకే ప్రత్యేకమని భావిస్తారు. ఈ జెండర్‌కు సంబంధించిన జ్ఞానం – వికాసం పిల్లలో సంబవిస్తుంది.

**పియాజే సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతం:**

కోల్‌బర్గ్ – నైతిక సిద్దాంతం ప్రకారం పిల్లల్లో జెండర్ వికాసం క్రింది క్రమంలో జరుగుతుందని పేర్కొన్నారు.

- మొదట పిల్లలు తను బాలుడనో/బాలికనో తదాత్మ్యం(Gender Identity) చేసుకోవడం జరుగుతుందన్నారు.
- తను బాలుడో/బాలికనో అయినప్పుడు ఆడ – మగ అనే పాత్రోచితభావన స్థిరత్వం Gender stebilityను పొందుతుందని మార్పుకు లోనుకాదని నమ్మకం ఏర్పడుతుందన్నారు.
- జెండర్ స్థిరత్వభావం ఏర్పడిన తరువాత తను వ్యతిరేకలింగ సభ్యుల దుస్తులు ధరించినప్పటికి వారు చేపట్టే కృత్యాలు/పనులు చేసినప్పటికి, వారి లక్షణాలతో నటించినప్పటికి తమ జెండర్ నమ్మకంలో మార్పు (Gender Consintency)సంబవించదని భావన ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పైనపేర్కొన్న విధంగా జెండర్ సంబంధిత విషయాంశాల పట్ల జ్ఞాన నిర్మాణం జరుగుతుందని ప్రముఖ సంజ్ఞానాత్మక వికాస సిద్దాంత కర్తల అభిప్రాయం.

**ముఖ్యాంశాలు**

- పెరుగుదల, వికాసం అనే ఈ రెండు పదాలు ఒకదానికి ఒకటి వాడటం అనేది సర్వసాధారణం, కాని పెరుగుదల పరిమాణాత్మకమైనది వికాసం గుణాత్మక మైనది.
- ఒకే జాతికి చెందిన జీవుల పెరుగుదల, వికాసంలో ఉన్న నిర్ధిష్టమైన సూత్రాలను గమనించవచ్చు.
- వ్యక్తి వికాసంలో మార్తిమత్వ నిర్మాణంలో వంశికత మరియు పరిసరాలు రెండు సమానమైన పాత్రను పోషిస్తాయి.
- జీవన ప్రక్రియలు, పెరుగుదల వల్ల శరీరంలో సంభవించే పరిమాణాత్మక మార్పులనే శారీరక పెరుగుదల అంటారు.
- సాంఘిక వికాసం అనేది శిశువులో శారీరక, చలన ఉద్వేగ మానసిక, వికాసాలతో పాటు అభివృద్ధిచెందుతూ పాత్ర చాలా ఎక్కువగా ఉంటుంది.

- సామాజీకరణలో శిశువు పెరిగేకొద్ది అనేక విషయాలు నేర్చుకోవడం జరుగుతుంది. ఇది పుట్టినప్పటి నుండి మరణించేంత వరకు నిరంతరం జరిగే ప్రక్రియ.
- ఉద్వేగ వికాసం పిల్లల్లో వివిధ దశల్లో వివిధ రకాలుగా అభివృద్ధి చెందుతూ ఉంటుంది. నిత్య జీవితంలో అనేక కారణాలు ఉద్వేగాలకు కారణం అవుతాయి.
- భాషా వికాసం వ్యక్తి తన భావాలను, ఉద్దేశాలను, ఆలోచనలను ఇతరులకు తెలియపరచడానికి భాషణంను ఒక సాధణంగా ఉపయోగిస్తారు. కాని దీనికి సంబంధించిన పునాదులు శైశవంలో ఏర్పడతాయి.
- మనోవిజ్ఞానశాస్త్రవేత్తలైన బి.ఎఫ్. స్కిన్నర్, ఎ. బండూరా మరియు భాషా శాస్త్రవేత్త అయిన ఎన్. చామ్‌స్కీ మొ॥వారు భాషావికాసదృక్పథాల ద్వారా భాషావికాసాన్ని పేర్కొన్నారు.
- లారెన్స్ కోల్‌బర్గ్ నైతిక వికాస సిద్ధాంతమును ప్రతిపాదించాడు. ఇతడు ప్రతి నైతిక స్థాయిలో రెండు దశలను పేర్కొన్నాడు. కాని నైతిక వివేచనలో సాంస్కృతిక బేధాలున్నట్లు పరిశోదనలు నిరూపిస్తున్నాయి.
- యు.ఎన్.ఓ ప్రసాదించిన బాలల హక్కులలో ఆటలాడుకునే హక్కు కూడా ఒకటి. బాలల నియంత్రణ లేని స్వేచ్ఛగా ఆటలు ఆడితే వారిలో సృజనాత్మక, కల్పనలు, ఆలోచనలు ఊహాలు వారిలో పెంపొందుతాయి. ఆటలు వివిధ వికాసాల పరంగా మూర్తిమత్వ అభివృద్ధికి దోహదపడతాయి.
- తనను గురించి తాను తెలుసుకోవడం వలన ఏ వ్యక్తియైన మంచి జీవనాన్ని గడపవచ్చు. అందువలన ప్రతి వ్యక్తి తన గురించి తాను తెలుసుకోవలసిన అవసపం ఎంతైన ఉంది.

## మూల్యాంకనం

**వ్యాసరూప సమాధాన ప్రశ్నలు:**

1. వికాసం పై అనువంశికత మరియు పరిసరాల యొక్క ప్రభావమును వివరించండి.
2. శారీరక – చలనాత్మక వికాసమును వివరించండి.
3. సాంఘిక వికాసమును తెల్పి, సాంఘిక వికాసము పై ప్రభావము చూపు అంశములను గూర్చి చర్చించండి.
4. సాంఘికీకరణం అనగానేమి? సాంఘికీకరణంను ప్రభావితం చేయు అంశములను తెల్పి వివరించండి.
5. ఉద్వేగము అనగానేమి? దానిని నిర్వచించి, ఉద్వేగ పరిపక్వతలో కుటుంబం మరియు పాఠశాల యొక్క పాత్రలను చర్చించండి.
6. భాషా వికాసము తెల్పి – స్కిన్నర్, బండురా మరియు చామ్‌స్కీల యొక్క భాష వికాస దృక్పధాలను వివరించండి.
7. నైతిక వికాసమును పేర్కొని, కోల్‌బర్గ్ నైతిక వికాస సిద్ధాంతమును వివరించి విద్యాప్రాముఖ్యతను తెలపండి.
8. 'ఆటలు సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతాయి? ఎట్లు.

**లఘురూప సమాధాన ప్రశ్నలు:**

1. పెరుగుదల మరియు వికాసం మధ్యగల భేదాలను తెలుపండి.
2. వికాస సూత్రాలను పేర్కొనండి.
3. వికాసపు సూచికలు మరియు ఆటంకాలను తెలుపండి.
4. ఉద్వేగం, ఉద్వేగ పరిపక్వత అనే పదాల గూర్చి క్లుప్తంగా పేర్కొనండి.
5. ఆటలలో సామూహిక గతిశీలత యొక్క పాత్రను తెలుపండి.
6. స్వీయజ్ఞానం అనగానేమి? స్వీయజ్ఞానానికి సంబంధించిన అంశాలేవి?
7. లింగవికాసం పై సంస్కృతి యొక్క ప్రభావాన్ని తెలపండి.

**బహుళైచ్ఛిక ప్రశ్నలు:**

1. శిశువు ఏకాంతర ఆట నుండి సామూహిక క్రీడాదశకు ఒక కీలకమైన సంక్రమణ దశగా పేర్కొన్న క్రీడ ( )

ఎ) సమాంతర క్రీడ బి) సంసర్గ క్రీడ సి) సహకార క్రీడ డి) ఏకాంతర క్రీడ

2. ఈ కింది వాటిలో ఎదుగుదలలో కొన్ని మార్పులు హఠాత్తుగా సంభవించినట్లుగా మనకు కనిపిస్తాయి దీనికి సంబంధిచిన వికాస సూత్రం .......... ( )

ఎ) వికాసం అయబద్ధంగా కొనసాగుతుంది బి) వికాసం ఒక పరస్పర చర్య

సి) వికాసాన్ని ప్రాగుక్తీకరించవచ్చు. డి) వికాసం సంబదమైనది

3. 'సాంఘిక సంబందాలలో పరిపక్వత సాధించడమే సాంఘిక వికాసం' అని పేర్కొన్న శాస్త్రవేత్త ..... ( )

ఎ) గారెట్ బి) హర్లాక్ సి) నీరెన్‌సన్ డి) స్వీయ గౌరవం

4. ఈ కింది వాటిలో 'ఆత్మ భావనకు దోహదపడు ప్రక్రియ ......... ( )

ఎ) స్వీయ గుర్తింపు బి) స్వీయ వర్ణన సి) స్వీయ గౌరవం డి) అంతర్లీకరణం

5. ఆటల వలన పిల్లల్లో ఈ కింది వాటిలో పెద్ద ఎత్తున జరిగే వికాసం ............ ( )

ఎ) నైతికవికాసం బి) సాంఘికవికాసం సి) ఉద్వేగవికాసం డి) శారీరక చలనాత్మకవికాసం

**ఈ కింది ఖాళీలను పూరించండి.**

1. 'హెరిడిటరీ జీనియస్' గ్రంథకర్త ..............
2. సాధారణంగా మొదటి పన్ను ఏర్పడు వయస్సు .............
3. 'ఎమోషనల్ లెథార్జిస్' అనగా .................

4. మానవుడు సృష్టించిన పరిసరమే సంస్కృతి అని పేర్కొన్న శాస్త్రవేత్త ...............

5. కోల్‌బర్గ్ ప్రకారం వ్యక్తి చట్టం, ధర్మం ప్రకారం నడుచుకోవడం అనేది జరుగు దశ ...............

ఈ కింది వాటిని జతపరచండి.

| శాస్త్రవేత్తలు | పరిశోధనలు |
|---|---|
| 1) హావింగ్‌హర్స్ట్ | ఎ) ఉద్వేగాల విభజన |
| 2) ఎలిజబెత్ హర్లాక్ | బి) భాషాగ్రహణా సిద్ధాంతం |
| 3) లోటస్ | సి) మానవ వికాసదశలు |
| 4) నోమ్ చామ్‌స్కీ | డి) పాఠశాల వసతులు – విద్యావకాశాలు |
| | ఇ) వికాసదశలో నిర్వహించ దగిన కృత్యాలు |
| | ఎఫ్) అనువంశికతా ప్ర..... అధ్యయనాలు |

**ప్రాజెక్టు పనులు (Project tasks):**

1. సమీపములోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి 1 నుండి 5వ తరగతులు చదువుతున్న బాలబాలికల ఎత్తు , బరువులను నమోదుచేసి ఒక నివేదిక తయారుచేయండి.
2. మనో విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలలో ఉద్వేగ పరిపక్వత మాపనిని తీసుకొని సంబంధిత అధ్యాపకుల సహాయంతో పాఠశాల ఉపాధ్యాయుల 'ఉద్వేగపరిపక్వతను' అధ్యయనం చేసి నివేదిక తయారుచేయండి.
3. వ్యయామ ఉపాధ్యాయుని సహకారంతో వివిధ రకాల ఆటలను తెలుసుకొని వాటి ద్వారా కలుగు ఉపయోగాలను చర్చించి ఒక నివేదికను తయారుచేయండి.
4. పిల్లలు ఆటలాడు సమయంలో సంబంధించిన వివాదాలను ఏవిధంగా పరిష్కారము చేసుకొంటారో అధ్యయనం చేసి ఒక నివేదికను సమర్పించండి.

**పరామర్శ గ్రంథాలు (Biblio graphy):**


1. బి.ఏ మూడవ సంవత్సరం 'బాల, కౌమార మనోవిజ్ఞాన శాస్త్రం' , 2012: తెలుగు అకాడమి, హైదరాబాదు
2. బి.ఏ మొదటి సంవత్సరం 'మనోవిజ్ఞానశాస్త్రం – సామాన్య మనోవిజ్ఞానశాస్త్రం, 2012: తెలుగు అకాడమి, హైదరాబాదు
3. ఎం.ఏ మనోవిజ్ఞానశాస్త్రం 'పురోగమన సామాన్య మనోవిజ్ఞానశాస్త్రం' 2012: తెలుగు అకాడమి, హైదరాబాదు
4. బి.ఎడ్. 'విద్యా మనోవిజ్ఞానశాస్త్ర ఆధారాలు' 2012 : తెలుగు అకాడమి, హైదరాబాదు
5. డి.ఎడ్. 'విద్యా మనోవిజ్ఞానశాస్త్రం' 2011 : తెలుగు అకాడమి, హైదరాబాదు
6. Developmental Psychology : A life span approach' Elizabeth B.Hurlock. TATA McaGraw - Hill publishing company limited - New Delhi
7. సెకండరీ కోర్స్ 'మనోవిజ్ఞానశాస్త్రం' 222: సార్వత్రిక పాఠశాల జాతీయ విద్యాసంస్థ A-24-25, Institutional Area, Sector_62, Noida UP
8. Advanced Edl'.Psychology, S.S.Chauhan, Vikas publishing House Pvt.Ltd - New Delhi.
9. Education : Introduction to Basic concepts 'Source book for D.Ed students published by SCERT, B'lore, karnataka
10. Psychology text book for class XI & Xii, 2013, published by NCERT, New Delhi


***

# 3 సంజ్ఞానము మరియు సంజ్ఞానాత్మక వికాసము

## 3.0. పరిచయం (Introduction)

ఇతర జీవులతో పోలిస్తే మానవుని ప్రత్యేకత ఆలోచనా శక్తేనని, అందుకే అతనిని ఆలోచించే జంతువు (Thinking Animal) అంటారని మనకు తెలుసు. వ్యక్తి ఆలోచనలనుబట్టే ప్రవర్తన, ప్రవర్తనను బట్టే జీవితము ఉంటుందనే విషయాన్ని గమనిస్తూనే వుంటాము. ఇంద్రియజ్ఞానము, భావనలు ఏర్పరచుకొవడం, ఆలోచన, వివేచన, ఊహలు, సంశ్లేషణ, విశ్లేషణలు చేయడం తద్వారా సమస్యలను పరిష్కారము చేయుట వంటివి సంజ్ఞానాత్మక వికాసము క్రిందకు వస్తాయి. ఇవి సాధారణ జీవితాన్ని ఎలా ప్రభావితము చేస్తాయి? ఏ స్థాయి వారికి ఎట్లు బోధనను అందించాలి? వంటి విషయాలను ఈ అధ్యాయములో చర్చిస్తాము.

## సంజ్ఞానము (Cognition) అంటే ఏమిటి?

ఇంద్రియజ్ఞానం ద్వారా మనచుట్టూ జరుగుచున్న విషయాలను గ్రహిస్తూ, అవగాహన చేసుకొంటూ దానికనుగుణంగా ప్రవర్తిస్తుంటాము. జ్ఞానేంద్రియాల ద్వారా పొందిన జ్ఞానము మనోభావాల రూపములో నిలిచి ఉంటుంది. ఇది కొన్నిసార్లు ప్రత్యక్షజ్ఞానములో లేకపోయినా అనుభవములో ఉంటుంది. ఉదాహరణకు మామిడికాయను జ్ఞానేంద్రియముల ద్వారా ఒక్కసారి అనుభూతి చెందినపుడు అంటే కాయ రంగు, ఆకారము, పరిమాణము, గట్టిదనము, రుచి వంటివి పొందినపుడు అది ప్రత్యక్షము కాని సందర్భములలో కూడా దానిని అనుభూతి పొందగలము. అంటే ఇంద్రియజ్ఞానము ద్వారా ఒక్కసారి పొందిన అనుభూతి శాశ్వతముగా ఉంటుంది. ఈవిధముగా ఒక్కసారి ఏర్పరచుకొన్న భావము పరిణతిచెందే కొద్దిగా పెరుగుతూ ఉన్నత భావజాలమునకు దారితీస్తుంది. ఈవిధముగా **"వ్యక్తులు తమ జ్ఞానాన్ని ఆవిష్కరించుకోవడానికి సహాయపడే ఆలోచనల పరంపరనే "సంజ్ఞానము"** అంటారు.

ఆలోచన, అనుభవము మరియు జ్ఞానేంద్రియముల ద్వారా పొందే జ్ఞానం, అవగాహనలనే – మానసిక చర్యలనే 'సంజ్ఞానము' అంటారు.

(Cognition is a mental process of acquiring knowledge and understanding through thought, experience and the senses).

Cognition అను ఆంగ్లపదము Cognitio అను లాటిన్ పదము నుంచి ఏర్పడినది. Cognitio అంటే జ్ఞానము అని అర్థము. అభ్యసనం అనేది సంజ్ఞానమునకు ఒక ఉదాహరణ. అలాగే సమస్యా సాధన, నిర్ణయాలు తీసుకొనుట, తార్కికముగా ఆలోచించుట వంటివన్నీ సంజ్ఞానమునకు ఉదాహరణలే.

శైశవంలో శిశువులు పరిసరాల నుంచి లభించే ప్రేరణలకు స్పందిస్తూ, ఇంద్రియాలను ఉపయోగించి తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మెల్లగా అర్థము చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఈ దశ పూర్తయ్యేసరికి చిన్నచిన్న మాటలు, పదాలు, వాక్యాలు ఉపయోగించడం, కొంత ఆలోచన, స్మృతి, ప్రజ్ఞ వృద్ధిచెందుతుంది.

పూర్వబాల్యంలోని పిల్లలు అదేంటి? ఇదేంటి? అని ప్రశ్నిస్తూ, పరిసరాల గురించి తెలుసుకోవడంలో కుతూహలమును ప్రదర్శిస్తూ ఉంటారు. ఈ దశ చివరికి స్థల, కాల, రంగుల భావనలు ఏర్పడి కొంత ఆలోచన, వివేచనలతో, చిన్నచిన్న సమస్యలను పరిష్కరించగలుగుతారు. వాస్తవానికి, కల్పనకు తేడా తెలియక ఎక్కువగా ఊహల్లో ఉంటారు.

ఉత్తర బాల్యంలోని పిల్లలు ఊహ నుంచి క్రమంగా ఈ దశలో వాస్తవాలను గుర్తించే స్థితికి వస్తారు. ఎందుకు? ఎలా? అనే ప్రశ్నల ద్వారా కుతూహలాన్ని ప్రదరిస్తూ అవగాహన చేసుకొనడానికి ప్రయత్నిస్తారు. కథల పట్ల ఎక్కువ మక్కువ చూపుతారు. తార్కికంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. మంచి చెడుల మధ్య విచక్షణను ఏర్పరుచుకుంటారు.

కౌమారంలో ప్రజ్ఞ గరిష్ఠస్థాయికి చేరుకొని, స్వతంత్ర, సృజనాత్మక, విమర్శనాత్మక, అమూర్త ఆలోచనలు చేయగలుగుతారు. తార్కికముగా ఆలోచిస్తూ వాదప్రతివాదనల్లో పాల్గొని విషయాన్ని లోతుగా చర్చిస్తారు. కళలపట్ల ఆసక్తి, నైపుణ్యము ప్రదర్శిస్తారు. అన్వేషణ, పరిశోధన ఆసక్తి ఈ దశలో ఎక్కువగా వుంటుంది.

## 3.1 లక్ష్యాలు (Objectives):

ఈ యూనిట్ పూర్తి చేసిన ఛాత్రోపాధ్యాయులు:

- సంజ్ఞానము అంటే ఏమిటో అవగాహన చేసుకొంటారు.
- ఆలోచన, వివేచన, ప్రత్యక్షము, భావనోద్భవము, సృజనాత్మకత, ప్రజ్ఞ వంటి విషయాలను అవగాహన చేసుకుంటారు.
- సంజ్ఞానము, అధిసంజ్ఞానమునకు గల పోలితలు, బేధములు తెలుసుకుంటారు.
- ఆలోచన, వివేచన రకాలను అవగాహన చేసుకొనగలరు.
- సృజనాత్మకత లక్షణాలను మాపనము తెలుసుకుంటారు.
- ప్రజ్ఞ, ప్రజ్ఞాలబ్ది, ప్రజ్ఞా మాపనము తెలుసుకుంటారు.
- పియాజే మరియు వైగోట్స్కీ సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతములను తెలుసుకుంటారు.

### సంజ్ఞానాత్మక వికాస అంశాలు (Developmental factors of Cognition):

సంజ్ఞానాత్మకత అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది.బాల్య దశలో ఈ క్రింది అంశాలు సంజ్ఞానాత్మకతను ప్రభావితము చేస్తాయి. అవి :

- ప్రత్యక్షము (Perception)
- భావనలు (Conception)
- ఆలోచన (Thinking)

- వివేచన (Reasoning)
- భావనాత్మకత సంజ్ఞానము (Meta Cognition)
- సృజనాత్మకత (Creativity)
- ప్రజ్ఞ (Intelligence)
- బహుళప్రజ్ఞ (Multiple Intelligence)

### 3.2.1 ప్రత్యక్షము(Perception) :

దైనందిన జీవితములో మనము అనేక స్పర్శానుభూతులు పొందుతుంటాము. చాలా సందర్భాలలో వీటిని గుర్తించలేము. ఇంద్రియజ్ఞానానికి అనుభవపూర్వకమైన అర్థాన్ని యివ్వడమే 'ప్రత్యక్షము' అంటారు. అంటే జ్ఞానేంద్రియాల ద్వారా పరిసరాలలోని వస్తువులను,వాటి గుణాలను,వాటి మధ్య వున్న సంబంధాలను గ్రహించడమే. ఉదాహరణకు జీవితము అంటే ఒక్కొక్కరికి ఒక్కొక్క అర్థము వుంటుంది. వారి వారి అనుభవాలను బట్టి జీవితము ఒకరికి పూలపానుపులా అనిపిస్తే మరొకరికి ముళ్ళబాటగా తోస్తుంది.

ప్రత్యక్షము అనేది కేవలము పరిసరాలలోని ఉద్దీపనల వల్లనేకాక పూర్వానుభవాలు,అవసరాలు, మెదడులో జరిగే ప్రతీకాత్మక చర్యల పై కూడా ఆధారపడి వుంటుంది. వ్యక్తి పెరుగుదల, వికాసము, పరిణతి, పరిసరాలు కొంత వరకు ప్రభావితము చేస్తుంటాయి. వయస్సు పెరిగే కొద్దీ సరళముగావున్న ప్రత్యక్షము, సంక్లిష్టముగా మారుతుంది.

తన చుట్టూ ఉన్న పరిసరాలు, పరిస్థితులు ఏ విధముగా కనిపిస్తుందో, ఏ విధముగా వినిపిస్తుందో. ఏవిధంగా అనుభావాన్నిస్తుందో,రుచిని అందిస్తుందో, వాసనను యిస్తుందో అదే ప్రత్యక్షము – మోర్గాన్ నిర్వచించెను.

( To Perceive = To Attend + To Think )

#### ప్రత్యక్ష ప్రక్రియ (Preception Process)

ప్రత్యక్ష ప్రక్రియ నేరుగా నిర్ధారించలేము. కాని మనము పొందే సంవేదన (sensation) లను విశ్లేషిస్తూ వ్యాఖ్యానిస్తాము. అంటే మనము జ్ఞానేంద్రియాల ద్వారా పొందే దృష్టి, రుచి, వాసన, వినికిడి, స్పర్శలకు అర్థవంతముగా ప్రతిస్పందిస్తాము. వ్యక్తులందరిలో ఈ ప్రతిస్పందనలు ఇదే విధముగా ఉంటాయి.

ప్రత్యక్షమువల్ల అనేక విషయాలకు మన మనసులో ఒక ఆకారము, ఒక దృశ్యము, సంగీతము, నృత్యము మొదలగు భావనలు ఏర్పడి స్థిరీకరణ చెంది వుంటాయి. ఇలాంటి. వాటిని ఏక మొత్తముగా చూస్తామే కాని వినికిడిగా కాదు. ఉదాహరణకు సైకిల్ అంటే ఏక మొత్తముగా చూడబడుతుందే కాని చక్రాలు, చైన్, ఫెడల్ వంటి విడివిడి భాగాలుగా కాదు. దీనినే గెస్టల్ట్ ప్రత్యక్షభావన (Concet of Gestalt Preception) అంటారు.

గెస్టల్ట్ వాదములో ఏ విషయమైనా లేదా వస్తువైనా మొత్తముగానే ప్రత్యక్షమవుతుంది. ఉదాహరణకు



ఈ చిత్రాలను చూసినపుడు మొదటిది 'S' అను ఆంగ్ల అక్షరముగాను, రెండవది ⊥ ఒక ఒక అడ్డుగీతపై నిలిచివున్న ఒక నిలువు గీత లేదా తలక్రిందులుగా వున్న 'T' అను అక్షరముగాను తెలుస్తుంది. నిజానికి చుక్కలుగా వున్న ప్రదేశము కంటే ఖాళీగా వున్న ప్రదేశమే ఎక్కువ. అయినప్పటికీ వాటిని 'S', తలక్రిందులైన ' ' అక్షరాలు అనే సంక్షిప్త భావనగానే చూస్తున్నాము. దీనికి ప్రత్యక్ష భావనే కారణము. (Brain tends to see a thing as a meaningful organized whole)

**ప్రత్యక్షము – లక్షణాలు(Characterstics - Perception)**

- ప్రత్యక్షము సంవేదన (Sensation) లపై ఆధారపడి వుంటుంది.
- ఇది ఒక సంశ్లేషణ, విశ్లేషణలతో కూడిన ప్రక్రియ.
- ప్రత్యక్షానికి నిశితమైన పరిశీలన ఉంటుంది.
- సమన్వయముతో కూడిన ఒక ప్రత్యేక చర్య
- జ్ఞానేంద్రియాల సహాయముతో దీనిని ప్రారంభించవచ్చు.
- ఇది అంతర్గత,బహిర్గత ప్రేరకాలతో సులువుగా ప్రభావితమవుతుంది.

9B7HBU


**ప్రత్యక్ష వ్యవస్థాపన నియమాలు (Laws of Perceptual Organization)**

ప్రత్యక్ష ప్రక్రియ ఖచ్చితముగా జరిగేందుకు వివిధ వ్యవస్థాపక నియమాలు సహకరిస్తాయి.

అందులో కొన్ని :

i. **అవిరళ నియమము** (Law of Continuity)

కొన్ని ఉద్దీపనలను అవిరళముగా ఏర్పరిస్తే ప్రత్యక్షము వ్యవస్థాపనము జరుగుతుంది.



ఈ పటములో విడివిడిగా వున్నా చుక్కలను నిలువు, అడ్డుగీతలుగా చూస్తాము. కేంద్ర బిందువు వద్ద కలిసే నాలుగు గీతలుగా కాక, చుక్కలతో సమూహరించుకొన్న ఒక గుర్తు '+' గుర్తుగా ప్రత్యక్షము చేసుకొంటాము .

ii. **సామీప్య నియమము** (Law of proximity)


ఒక దానికొకటి దగ్గరగావున్న అంశాలను ఒక సమూహముగా ఏర్పర్చడాన్నే సామీప్యనియమము అంటారు.



పక్క పటములో మూడు జతలుగా వున్న గీతలను చూడగలిగినా అసంపూర్ణముగా కుడివైపునకు ఒంటరిగీతగా పరికించడానికి కారణము సామీప్య నియమము

iii. **సామ్య నియమము** (Law of Similarity)


ఒక దానికొకటి ఒకేలా వుండే అంశాలు ఒక సమూహముగా ఏర్పడతాయి. అవి రంగు, ఆకారము, పరిమాణము వంటివి కావచ్చు.



ఈ పటములో 3 త్రిభుజాలు, 3 వృత్తాలు, 3 చతురస్రాలు వేర్వేరుగా చూడగలగడమే సామ్య నియమము. ఎందుకంటే అవి ఆకారము మీద ఆధారపడి ఉన్నాయి.

iv. **పూరణ నియము** (law of Closure)

అసంపూర్తి ఆకృతులను అర్థవంతమైన పూర్ణాకృతులుగా చూడగలగడమే పూరణ నియమం.




పక్క పటములో విఘూతాలు (Shocks) వున్నా వాటిని గుర్తించ దగ్గ అర్థవంతమైన పూర్తి ఆకృతులుగా గమనించడమే పూరణ నియమము.

v. **ఆకృతి– క్షేత్ర సంబంధము** (Figure - Ground Relationship)

ఆకృతి – క్షేత్ర సంబంధాన్ని మొట్టమొదట రూబిన్(Rubin) అను మనోవిజ్ఞాన శాస్త్రవేత్త వివరించాడు.

ప్రజ్ఞ వ్యవస్థాపనలో ఆకృతికి, క్షేత్రానికి మధ్య బేధాన్ని చూడడం ఒక ప్రాథమిక సూత్రము. మనము చూసే ప్రతి వస్తువు వెనుక ఒక దృశ్యము వుంటుంది. మనము దృష్టిని నిలిపే వస్తువు ఆకృతిగాను,దాని వెనుక గల దృశ్యము క్షేత్రముగాను చెప్పవచ్చు. ఉదాహరణకు ఆకాశములో ఎగిరే పక్షిని ఆకృతిగా చూస్తే, దాని వెనుకగల ఆకాశము క్షేత్రముగా చెప్పవచ్చు.



ఈ పటములో ఒక సారి పూలకుండీని, మరొకసారి ఎదురెదురుగా చూసుకొనే రెండు ముఖాలను చూస్తాము. కానీ ఎవరికీ కూడా పూల కుండీని, రెండు ముఖాలను ఒకేసారి చూడడం సాధ్యం కాదు.

## ప్రత్యక్షమును ప్రభావితము చేసే కారకాలు (Influencing factors of perception)

వ్యక్తులలో ప్రత్యక్షమును రెండు రకాలైన అంశాలు ప్రభావితము చేస్తుంటాయి. అవి

i. వ్యక్తిగత కారకాలు(Personal Factors), ii. వస్తు గత కారకాలు (Objective Factors)

**i. వ్యక్తిగత కారకాలు:-**

వ్యక్తులలో సహజ సిద్ధముగా వుండే అభిరుచులు (Interest), వైఖరులు(Attitude), సాన్నిహిత్యం (familiarity), సందర్భం(Context), గతానుభవాలు (Previous Experinces) వంటి అంశాలు వ్యక్తిగత కారకాలు.

**అభిరుచి:-** వ్యక్తికి ఒక విషయం మీద ఏకాగ్రతను ఇచ్చేటట్టు చేయగలిగిన మానసిక శక్తినే అభిరుచి అంటారు. వ్యకిని ఏకాగ్రతతో పనిని కొనసాగింపచేసే శక్తియే అభిరుచి. వ్యక్తిగతముగా ప్రతివ్యక్తికి ఒక్కొక్క అంశము పట్ల ఒక్కొక్క అభిరుచి ఉంటుంది. దానిని అనుసరించి ఆయా అంశాలు వెంటనే ప్రత్యక్షము అవుతుంటాయి. ఒక దిన పత్రిక చూసిన వెంటనే కొందరికి వారివారి అభిరుచిని బట్టి రాజకీయాల పేజీని చూస్తే, కొందరు క్రీడా పేజీని చూస్తారు. అలాగే కొందరు సినిమా పేజీని చూస్తే, కొందరు సంపాదకీయం పేజీ వైపు ప్రత్యక్షం చేస్తుంటారు.

**వైఖరి:-** ఒకానొక పరిస్థితికి వ్యక్తికి ,వస్తువుకి పొందికగా ప్రతిస్పందించడానికి వ్యక్తికి ఉండే సంసిద్ధతనే వైఖరి అని ఫ్రీమన్ నిర్వచించెను.

వ్యక్తులలో విషయాల పట్ల ఒక ప్రత్యేక వైఖరిని కలిగి ఉంటారు. ఒక అంశము పట్ల కొందరికి అనుకూలవైఖరి వుంటే, మరి కొందరికి ప్రతికూల వైఖరి ఉంటుంది. రాజకీయాలలో ఒక పార్టీ పట్ల అనుకూలవైఖరి ఉన్నట్లయితే ఆ పార్టీకి చెందిన వారు మంచివారు, గొప్పవారని, దాని వ్యతిరేక పార్టీకి చెందిన వారు మంచి వారు కాదని ప్రత్యక్షము చేస్తారు.

**సాన్నిహిత్యం:-** వ్యక్తులకు పరిచయము వున్న విషయాలు చాలా సులువుగా ప్రత్యక్షములోకి వస్తాయి. ఉదాహరణకు పాఠశాలను వదిలిపెట్టినప్పుడు అంత పెద్ద గుంపులోసైతము మన పిల్లలను సులువుగా గుర్తించగలము .

**సందర్భము:-** కొన్ని సందర్భాలలో ఉద్దీపనలు సరియైన రీతిలో ఉంటే వెంటనే ప్రత్యక్షము అవుతాయి. ఉదాహరణకు డైనింగ్ హాలులోకి వెంటనే ఆహారపదార్థాలు ప్రత్యక్షములోకి వస్తాయి.

**గతానుభవాలు:-** ఒక విషయము/భావనను మనము ఎలా ప్రత్యక్షము చేలుకొంటూ గతానుభవాలపై ఆధారపడి వుంటుంది. ఉదాహరణము ' ƎƆИⱯ⅃UᗺMⱯ ' అని వ్రాసి ఉన్నప్పటికీ గతానుభవాలు వున్నందువల్ల

దానిని 'AMBULANCE' గానే గుర్తిస్తాము.

### ii. వస్తుగత కారకాలు:-

వస్తువుల ఆకృతులైన సామ్యం,పూర్ణత, సామీప్యం, సమమితి వంటి వస్తుగత కారకాలు ప్రత్యక్షముపై ప్రభావము చూపుతాయి.

**ప్రత్యక్షం - విద్యా విషయక ప్రాధాన్యత (Educational Implications)**

i. పిల్లలకు తగిన అనుభవము, చాలినంత విశ్లేషణ శక్తి వుండవు. కనుక వారిలో అర్థవంతమైన ఆకృతులను ఏర్పరచడానికి ఊహాలు, వివిధ రకాల భోధనోపకరణాలను ఉపయోగించాలి.

ii. పాఠ్యాంశములోని భావనల మధ్య సంబంధాన్ని గుర్తించునట్లు అర్థవంతముగా బోధించాలి.

iii. ఆకృతి - క్షేత్ర సూత్రాన్ని బోధనా విధానాలుగా అన్వయించాలి.

iv. మెరుగైన భావనలను ఏర్పరుచుకొనేటట్లు శిక్షణ యివ్వాలి.

v. పిల్లలలో జ్ఞానశిక్షణలో మెళుకువలు నేర్పాలి.

23KDWK

**ప్రత్యక్షములో వైపరిత్యాలు**

"కంటితో చూసేవన్ని నిజాలు కావు" అన్న నానుడిని వింటూనే వుంటాము. అంటే ప్రత్యక్షము మీద కేవలము ఉద్దీపనలే కాకుండా వ్యక్తిగత, వస్తుగత కారకాలు కూడా తమ ప్రభావాన్ని చూపుతుంటాయి. అందువల్ల అప్పుడప్పుడు మనము సరియైన ఉద్దీపనలను సైతము తప్పుగా చూస్తుంటాము. వీటినే భ్రమలు (Illusaions) అంటారు. రాత్రి సమయంలో తాడును చూసి పాముగాను, నీడలను చూసి దెయ్యముగా ను భ్రమపడుట. భ్రమలు అంటే అసత్య ప్రత్యక్షాలు. నిత్య జీవితములో ఏర్పడే అనేక అపార్థాలకు ఈ భ్రమలే కారణము. వ్యక్తులు భ్రమలకు లోనుకాకుండా ఉండాలంటే పరిస్థితులను వాస్తవ కోణములో పరిశీలించాలి.

ప్రచోధనములు వేరొకలాగా అనిపిస్తే అది భ్రమ, ప్రచోధము అసలు లేకుండా వున్నట్లు అనిపిస్తే అది విభ్రమ(Hallucinations). మత్తు పదార్థాలు ఎక్కువగా స్వీకరించే వారిలోనూ, మానసికంగా బాధపడే వారిలోనూ ఈ విభ్రమ ఎక్కువగా కనిపిస్తాయి.

### 3.2.2 భావన - భావనోద్భవము (Concept - Concept formation)

వ్యక్తులు తాము పొందే అనుభవాలు,అనుభూతులు, వాటిలోని సామాన్య లక్షణాలు మరియు వైవిధ్యాలను గమనిస్తారు. ఈ భావాలు, జ్ఞానము వల్ల పొందిన భావాలవల్ల కొన్ని కొత్త సంబంధాలు ఏర్పడుతాయి. వివిధ వస్తువులు లేదా విషయాల మధ్య సంబంధాన్ని గుర్తుల ద్వారా తెలుపునదే భావన.

ఒక వస్తువునకుగాని, వ్యక్తికిగాని సంఘటనకుగాని పరిస్థితికిగాని సంబంధించి కల్పించే సాధారణ అవగాహనను "భావన" అంటారు.

అనగా సామాన్యీకరించిన భావమే భావన. భావన అనే పదము వస్తువులకు, సంఘటనలకు సామాన్య ధర్మాన్ని నిర్ధేశిస్తుంది అని చెప్పవచ్చు. అభ్యసనను భావనలు బాగా ప్రభావితము చేస్తాయి. సరియైన భావనలు ఏర్పడకపోతే, అస్పష్టత వల్ల విషయము సరిగా అర్థము కాదు. దీని వల్ల పిల్లలు అనేక విషయాలలో వెనుకబడిపోతారు.

**భావనలు ఎలా ఏర్పడతాయి?**

భావనలు ఏర్పడాలంటే: i. సన్నివేశాన్ని బాగా పరిశీలించాలి,ii.సన్నివేశాలను పోల్చిచూసికొని వాటిలోని సమాన లక్షణాలను గుర్తించాలి, iii. గుర్తించిన లక్షణాలను సంక్షిప్తం చేయగలగాలి. iv. లక్షణాలను సరిచూడగలగాలి v. వాటి ఐక్యతను సరియైన నామకరణము చేయగలగాలి. వీటిని ఇదే క్రమములో సరిగా చేయగలిగినప్పుడు స్పష్టమైన భావాలు సులువుగా ఏర్పడతాయి.

**ముఖ్యమైన భావనలు (Important Concepts)**

పిల్లలలో వారి వయస్సు, అనుభవము మరియు పరిసరాల ప్రభావము వల్ల – రంగు, ఆకారము, బరువు, స్థలము, కాలము, సమయము వంటి మూర్త భావనలు, ఆత్మ భావన, రసానుభూతి, కళారాధన, సామాజికస్పృహ వంటి అమూర్తభావనలు ఏర్పడతాయి.

వ్యక్తి మానసిక వికాసములో భావనోద్భవం(Concept Formation) అనేది ఒకటి.

వ్యక్తి ఎదుర్కొనే ఉద్దీపనల వల్ల భావనలు ఏర్పడతాయి. ఒకే ఉద్దీపనకు భావన ఏర్పడదు. కొన్ని ఉద్దీపనల సముదాయంను వ్యక్తి ఎదుర్కొనప్పుడే వాటిలోని సామ్యత, పోలికలు, అంత:సంబంధాలను కలిపి భావనలను ఏర్పరుచుకుంటాడు.

ఉదా॥ త్రిభుజం అనే భావనను ఏర్పరుచుకోవడానికి బాలలు త్రిభుజం యొక్క సాధారణలక్షణాలను –

1. మూడు భుజాలుండాలి, 2. మూడుకోణాలుండాలి, 3. మూడుశీర్షాలుండాలి. 4. పటం సంవృతంగా ఉండాలి అనే లక్షణాల సముదాయంతో త్రిభుజం అనే భావన ఏర్పరుచుకుంటాడు.

**భావన – వర్గీకరణ (Classification of Concepts)**

విద్యా విషయక అంశాలలో మనకు రెండు రకాల భావనలు ఎదురవుతూ వుంటాయి. అవి

1. మూర్త భావనలు

2. అమూర్త భావనలు

1. మూర్త భావనలు అంటే వ్యక్తి తన జ్ఞానేంద్రియాలను స్పృశించగలిగే అంశాలతో భావనను ఏర్పరుచుకుంటే దానినే మూర్తభావన అంటారు.

ఉదా॥ కంటికి కనబడే ఆకార లక్షణాలతో ఏర్పడే భావనలు – గుర్రం, చేప, పీత మొ॥ వాసన కూడిన భావనలు ఏర్పరుచుకోవచ్చు ఉదా॥ గులాబీ వాసనతో వాటిని చూడకుండానే పుష్పం అనే భావన ఏర్పరుచుకుంటారు. మొ॥నవి.

2. అమూర్తభావనలు అంటే జ్ఞానేంద్రియాలకు అతీతంగా గుణాత్మకమైన లక్షణాలతో ఏర్పరుచుకొనే భావనలే. ఉదా॥ – సంతోషం, కాంతి సంవత్సరం అంటే, ప్రధానమంత్రి అంటే, ప్రజాస్వామ్యం అంటే, లౌకికవాదం మొ॥నవి.

**భావనలు – రకాలు (Types of Concepts)**

**సంఖ్యా భావన (**Number Concept**) :–** పిల్లలలో తొలుత కొన్ని, మరిన్ని చాలా,బోలెడన్ని వంటి భావనలు ఏర్పడతాయి. ఆ తర్వాత సంఖ్యలు అను భావాలు ఏర్పడతాయి.

**స్థల భావన (**Space Concept**):–** పిల్లలకు తొలుత దూరము,దిక్కులు, పరిమాణము వంటి వాటి పట్ల భావనలు ఉండవు. ఈ పక్క,ఆపక్క, అని చెపుతూ చేతులు చూపుతారు.తరువాత కుడివైపు, ఎడమవైపు,పైన,క్రింద భావనలు,వయస్సుతో పాటు నాలుగు దిక్కులు, ఇంకా వయస్సు పెరిగితే ఎనిమిది దిక్కుల పేర్లు చెప్పగలరు.

**సమయ భావన(**Time Concept**) :–** తొలుత సమయ భావన అమూర్తముగాను, సంక్లిష్టముగాను వుంటుంది. తర్వాత నిన్న, నేడు,రేపు, మొన్న, అటు రేపు వంటి భావనలు వయస్సుతో పాటు ఏర్పడతాయి.

**ఆకార భావన (**Form Concept**):–** మూడు సంవత్సరాల వయస్సుకు లోపే పిల్లలలో ఆకార భావనలు ఏర్పడతాయి. మొదట చిన్న ఆకారాల భావనలు ఏర్పడి వయస్సు పెరిగే కొద్దీవస్తువుల మధ్య తేడాలను గుర్తించగలిగే సామర్థ్యము పెరిగి వృత్తం, చతురస్రం, దీర్ఘచతురస్రం మొ॥లైన ఆకార భావనలు ఏర్పడతాయి.

**రంగు భావన(**Colour Concept**) :–** మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల మధ్య పిల్లలు ఎరుపు, నలుపు, తెలుపు వంటి ప్రాథమిక రంగులను గుర్తించగలరు. వయస్సు పెరిగే కొద్ది రంగులను సులువుగా గుర్తిస్తారు.

**అందము భావాన(**Beauty Concept**):–** అందానికి సంబంధించిన భావన క్లిష్టమైనది ఐదు సంవత్సరాల వయస్సు నుంచి మొదట ఇతరుల నుంచి అనుకరణ ద్వారా తర్వాత స్వయముగా ఈ భావాన్ని ప్రదర్శిస్తారు.

**ధన భావన(**Money Concept**):** ప్రాథమిక స్థాయి వరకు పిల్లలలో ధనము అనే భావన వుండదు. కేవలము వస్తువులను కొనుటకు ఉపయోగించేది అని మాత్రమే తెలిసి ఉంటుంది.దాని విలువ తెలియదు. వయస్సు పెరిగే కొద్దీ దాని విలువ దానితో చేయగలిగిన పనులు అన్నీ తెలుస్తాయి.

ఇలా భావనలు ప్రతి వ్యక్తిలో పుట్టుక నుంచి భావనలు ప్రారంభమై వయస్సుతో పాటు అభివృద్ధి చెందుతుంటాయి. మొదట మూర్త భావనలు ఏర్పడి క్రమంగా అమూర్త భావనల వైపుకు ప్రయాణిస్తాయి.

**భావనా వికాసము(Concept Development)**

భావనోద్భవము క్రింది వాటి వల్ల ఏర్పడుతుంది.

1. జ్ఞానేంద్రియాల అన్వేషణ(Sensory Manipulation): శిశువులు లేక బాలలు ఎదుర్కొనే ఉద్దీపనలకు ఇచ్చే ప్రతిస్పందనలు అనుభవం వల్ల భావనలు ఏర్పడతాయి.

2. చాలక ప్రదర్శన(Motor Manipulation): శరీర అవయవాలను కదిలించడం వల్ల కాళ్ళు, చేతులు కదిలించి వాటి స్పర్శలవలన పిల్లల్లో భావనోద్భవం పెరుగుతుంది.

3. ప్రశ్నించడం(Questioning): వయస్సు పెరిగేకొద్ది పిల్లల్లో కుతూహలం పెరిగి వారు ఎదుర్కొనే విషయాలన్నింటిని తెలుసుకోవాలనే ప్రయత్నంలో వాటికి సంబంధించిన ప్రశ్నలతో తమ అనుమానాలను నివృత్తి చేసుకొని సరైన భావనలు ఏర్పరుచుకుంటారు.

4. చదవడంవల్ల: తను తెలుసుకోవాలన్న విషయాంశాలకు సంబంధించిన పుస్తకాలను, వ్యాసాలను చదవడం వల్ల భావనలను ఏర్పరుచుకోవచ్చు.

5. ప్రజ్ఞా – వివేకం(Intellegence - Reasoning): పిల్లలు తమ ప్రజ్ఞా పాటవాలతో పలు విషయాలను మధ్య ఉన్న సన్నిహితత్వం, సంబంధాలను వివేకంతో విచక్షణంతో తార్కికంగా తెలుసుకొని భావనలను ఏర్పరుచుకుంటారు.

6. శిక్షణ:(Training) తగిన తర్ఫీదు, శిక్షణలతో – ప్రాజెక్టు పద్ధతి సమస్యాపరిష్కార పద్ధతి, ప్రయోగ పద్ధతులు Guided Enquiry, Meta Cognition మొదలైన వాటితో భావనలను ఏర్పరుచుకొంటారు.

7. సామాన్యీకరణములో ఆకాశములో ఎగిరేవన్నీ పక్షులు అని పేర్కొంటారు. గబ్బిలాలు పక్షులు కావని, అయినా ఎగురుతాయని అవి క్షీరదాలని తెలుసుకొంటారు. కాబట్టి సామాన్యీకరణములో కొన్ని సర్దుబాట్లు (Exceptions) ఉంటాయి.

8. అమూర్తీకరణములో ఒక వస్తువు,ఒక సంఘటనకు సంబంధించిన వివిధ విషయాలను విశదపరచడం జరుగుతుంది. ఉదాహరణకు ఏనుగును చూసి దానికి పెద్ద దంతాలు, పెద్ద తొండము, పెద్ద చెవులు, స్థంబాల వంటి కాళ్ళు వుంటాయని కళ్ళు మాత్రము చిన్నవిగా వుంటాయని విశదపరచడాన్నే అమూర్తీకణము అంటారు.

ప్రజ్ఞ పరిపక్వతా భావన వికాసానికి ఎక్కువగా తోడ్పడుతుంది. జ్ఞానేంద్రియ లోపము వున్న వాళ్ళు సరియైన భావనలను ఏర్పరుచుకోలేరు. అలాగే మూర్త భావనల వల్ల కూడా భావనా వికాసము జరుగుతుంది.

**భావనలు ఏర్పరుచుటలో ఉపాధ్యాయుల పాత్ర: (Role of Teachers in Conception)**

- భావనలు ఏర్పరుచుటలో ఉపాధ్యాయులు స్పష్టత పాటించి, వీలైనన్ని ఉదాహరణలు ఇస్తూ, నిత్య జీవితములోనికి అన్వయించునట్లు చేయాలి.
- ముఖ్యముగా సైన్సు వంటి అంశాలు బోధించేటప్పుడు సామాన్య ధర్మాలను గుర్తింపచేసి సరియైన భావనలకు తోడ్పడాలి. బోధనలో అప్పుడప్పుడు విద్యార్థులు పొందుతున్న భావనలను సరిచూస్తుండాలి.
- అభ్యసనకు అనుకూలించే భాషను,సంభాషణగా వాడాలి.
- విషయాల మధ్య గల సంబంధాలను సరియైన భావనలతో పోల్చి చెప్తు ఉండాలి.
- ప్రత్యక్ష అనుభావాలతో విద్యార్థులను సామాన్యీకరణం చేయగలిగే శక్తిని జనింపజేయడం.
- అమూర్త చింతనా గ్రాహకశక్తిని పెంపొందించడం
- వివిధ విషయాలకు సంబంధించిన ఆలోచనలు కల్గిఉండడం.
- వివేకంతో కూడిన నిర్ణయాలను విద్యార్థులు తీసుకొనేటట్లు చేయడం.
- సమస్యలను సక్రమంగా అవగాహన చేసుకొనే సామర్థ్యాలను పెంపొందించడం.

- ♦ సామాజిక, నైతిక విలువలను అవగాహన చేసుకోగలిగే అవకాశాలను కల్పించడం.
- ♦ విద్యార్థులకర్థమయ్యే రీతిలో బోధించడం - విషయాన్ని స్పష్టంగా విపులంగా విశదపరచడం.
- ♦ విషయాల భావనలను ఒక్కొక దానిని గుణాలను కష్టతరంగా కాకుండా బోధించడం. ఉదా॥ చతురస్రం, దీర్ఘ చతురస్రం భావనలను ఏర్పరిచిన తరువాత వివిధ చతుర్భుజాల రకాలను వివరించడం.
- ♦ విద్యార్థులు అడిగే సందేహాలను నివృత్తిచేయడం
- ♦ దృష్టాంతాలను వరుసక్రమంలో చెప్పడం
- ♦ ఉదాహరణలతో పాత భావనలను సరిచూచుకుంటూ వాటిని విస్తృతపరుస్తూ, నూతన భావనలతో సంధానపరుస్తూ బోధించడం.
- ♦ విద్యార్థులలో ఏర్పడిన భావనలను వారి చేతనే వివరణగానీ, నిర్వచించేటట్లు చేయించడం.

పై వాటినే కాకుండా ఉపాధ్యాయుడు తనదైన శైలిలో బోధించి విద్యార్థులలో భావనల ఉద్భవానికి దోహదపడాలి.

### 3.2.3 ఆలోచన(Thinking)

మానవున్ని ప్రపంచములోని జీవులన్నింటి కన్నా గొప్ప స్థాయిలో నిలిపినది అతని యొక్క ఆలోచనలే. ఆలోచన లేని మనిషంటూ వుండడు. ఏ పని చేయడానికైనా వ్యక్తీ ఆలోచనలే ప్రధానము ఆలోచనలే లేకపోతే మనిషి జీవితము యాంత్రికముగా తయారై,సమస్యలను పరిష్కరించుకోలేక, సర్దుబాటు లోపించి తనలోని ప్రజ్ఞాపాటవాలు, సామర్థ్యాలు పాడైపోయే ప్రమాదములో పడతాడు.

**మానవుడు బుద్ధి, జ్ఞానం కలిగినటువంటి జీవి ఈ బుద్ధి జ్ఞానం అనేవి వ్యక్తి యొక్క ఆలోచనల మీద, అతని వివేకం మీద ఆధారపడి ఉంటాయి..**

**"సవిస్తరమైన ఆలోచన, వివేకం, విచక్షణ అనేవి అతని జయప్రదమైన సుఖవంతమైన జీవనానికి ఎంతోఅవసరం. అందుకే ఈ అంశాలలో ఎక్కువ వికాసాన్ని కలిగినవారు చాలా సమర్థవంతులుగాను, గౌరవనీయులుగాను ఉంటారు. తరతరాలుగా పెంచుకుంటూ వస్తున్న సంస్కృతి నాగరికత, కొత్త విషయాలు కనిపెట్టటడం పరిశ్రమలు. నూతన జీవ విధానం, ఆధునికత మొ॥ వ్యక్తి ఆలోచనా శక్తికి, వివేకానికి నిదర్శనాలు.**

వ్యక్తి అభ్యసనా ప్రక్రియలో ఆలోచనకు అధిక ప్రాధాన్యత వుంది. అభ్యసనలో అనుభవాలను మిళితము చేసుకోవడం, వాటిని జ్ఞప్తియందుంచుకొని అవసరమైన సందర్భాలలో సందర్భానుసారముగా వినియోగించుకోవడం వంటి వాటికి ఆ ఆలోచనా శక్తి ఎంతైనా అవసరము.

**నిర్వచనాలు (Definitons)**

- ఆలోచన అనేది ఒక మానసిక చర్య. ఇది ఒక లక్ష్యం వైపు సాగుతుంది.
- స్మృతి చిహ్నాలు,భావనలు,ఊహా రూపాల ద్వారా జరిగే అంతర్గత సమస్యా పరిష్కారాన్నే 'ఆలోచన' అని. - N.L. MUNN పేర్కొన్నాడు.
- సమస్యా పరిష్కారము కొరకు చేయు అవ్యక్త ప్రవర్తనయే ఆలోచన అని మొహసిన్ అను శాస్త్రవేత్త అభిప్రాయము.

**ఆలోచన ప్రక్రియ (Thinking Process)**

ఆలోచన అనేది అనేక ప్రతీకలతో కూడుకొని వుంటుంది. అందులో ప్రధానమైనవి భావనలు, గుర్తులు/ చిహ్నాలు, ఊహారూపాలు మరియు గతానుభవాలు. మనము ఆలోచిస్తున్నప్పుడు గతానుభవాలు, ప్రస్తుత ప్రతిస్పందనలతో ఏదో ఒక రకముగా బంధితమై ఉంటాయి. వ్యక్తి తన సమస్యాపరిష్కారానికి తన ఊహలను ప్రత్యేక ఉద్దేశ్యంతో ఒక పద్ధతి ప్రకారం నిర్దేశించడాన్ని – ఆలోచన అంటారు. ఇందులో వ్యక్తి ప్రయత్న పూర్వకంగా తన ఊహలను ఒక క్రమబద్ధమైన పద్ధతిలో అమర్చి వాటితో తన అవసరాలను తీర్చుకోగలిగే క్రొత్త సంబంధాలను రూపొందించుకునే మానసిక చర్య "ఆలోచన".

**ఆలోచన లక్షణాలు (Characteristics of Thinking)**

- ఆలోచన ఒక జ్ఞానసంబంధమైన మానసిక చర్య.
- ఒక ఫలిత సాధనకు నిర్ధేశింపబడిన ప్రక్రియ.
- ఆలోచన అనేది సమస్యాపరిష్కార ప్రవర్తనకు సంబంధించినది.
- ఆలోచనలో శారీరక అన్వేషణకంటే మానసిక అన్వేషణే కీలకంగా వుంటుంది.
- ఆలోచనలో తరచుగా మార్పులు జరుగుతుంటాయి.
- ఆలోచనలు బయటకు కనిపించవు. అవి మానసిక సంభాషణల రూపములో వుంటాయి.

**ఆలోచన రకాలు (**Types of Thinking**)**

డెకార్టె (Decartus) – 'మానవ మనుగడకు మూలము మన ఆలోచన' అని పేర్కొన్నాడు.

అంటే సమాజ ఉన్నతి ప్రధానంగా వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఏర్పడే ఆలోచనల ప్రభావమే. అని అర్థం కొన్ని ఆలోచనలు ప్రపంచశాంతికి, విశ్వకళ్యాణానికి దోహదము చేస్తే మరికొన్ని వినాశానానికి, విఘాతానికి కారణమౌతాయి. అందువల్ల మనలో ఆలోచనలు ఎన్ని రకాలో పరిశీలిద్దాము.

**i. మూర్త లేక ప్రత్యక్ష ఆలోచన (**Concrete or Perceptual Thinking**)**

ఇది చాలా సులువైన ఆలోచనా పద్ధతి. ఒక విషయాన్ని జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహిస్తూ, ప్రత్యక్షముగా దానిని గురించి ఆలోచించడాన్ని మూర్త లేక ప్రత్యక్ష ఆలోచన అంటారు. ఇది అంశాలను నేరుగా చూడడం ద్వారా ఏర్పడుతుంది. ఉదాహరణకు పెన్ను, పుస్తకము, చెట్టు,.... చిన్న పిల్లలు ఈ రకమైన ఆలోచనలను చేస్తారు.

**ii. అమూర్త లేక భావాత్మక ఆలోచన (**Abstract or Conceptual Thinking**)**

ఇది క్లిష్టతరమైన ఆలోచనా విధానము. నిరాకారమైన విషయాలను గురించి ఆలోచిచండాన్నే అమూర్త లేక భావనాత్మక ఆలోచన అంటారు. తెలియని వాటి గురించి ఆలోచించడం,కొత్త విషయాలను కనుక్కోవడం, ఉత్సుకతను రేకెత్తించడం దీనిలోని కీలకమైన అంశాలు. ఉదాహరణకు శాస్త్రవేత్తలు, కవులు, వేదాంతులు ఈ రకమైన ఆలోచనలు చేస్తారు. యవ్వనదశ నుంచి ఈ ఆలోచనలుప్రారంభమవుతాయి.

**iii. సమైక్య ఆలోచన (Convergent Thinking)**

అందుబాటులో ఉన్న సమాచారమును, పుస్తక జ్ఞానాన్ని వుపయోగించుకొని ఒక లక్ష్యము వైపుగా పరిష్కారము సూచించడానికి చేయు ఆలోచనలే 'సమైక్య ఆలోచన'. ఈ రకమైన ఆలోచనలలో సృజనాత్మకతకు అవకాశము వుండదు. ప్రజ్ఞా పరీక్షలలో సమైక్య ఆలోచనా శక్తి గల వారు ఎక్కువ స్కోరును సాధిస్తారు.

ఉదా: $2 \times 2 = 4$

**iv. విభిన్న ఆలోచన (Divergent Thinking)**

ఒక విషయాన్ని అన్ని కోణాల నుంచి. రకరకాలుగా పరిశీలిస్తూ ఒక కొత్త ఒరవడిని సృష్టించే వాటినే 'విభిన్న ఆలోచనలు' అంటారు. అంటే సమస్యకు ఒక పరిష్కారమే కాక, సమాన ప్రాధాన్యత గల అనేక పరిష్కార మార్గాలను సూచించడమే. ఈ రకమైన ఆలోచనలలో సహజత్వము (Originality) ఎక్కువగా కనిపిస్తుంది. సృజనాత్మకత పరీక్షలలో భిన్న ఆలోచనా శక్తి గల వారు ఎక్కువ స్కోరు సాధిస్తారు.

**ఉదా:-** పైన పేర్కొన్న ఉదాహరణలకే, $2 \times 2 =$ ను $2 + 2$ అని, $5 - 1$అని, $4 \times 1$అని, $8/2$ అని చెప్పడము విభిన్న ఆలోచన.

**v. ఊహా ఆలోచన (Imaginative Thinking)**

స్మృతి పథములో వున్న స్మృతి చిహ్నాల ప్రతి రూపాల ద్వారా ఊహిస్తూచేయు ఆలోచనలే 'ఊహ ఆలోచనలు' అంటారు. ఉదాహరణకు జనాభా పెరుగుదల వల్ల 2025 సం. నాటికి భారతదేశపు స్థితిగతులు గురించి ఆలోచించడం.

**vi. సంసర్గ ఆలోచన (Associative Thinking)**

రెండు విషయాలు లేదా అంశాలు కలిసి వున్నప్పుడు ఒక దానిని గురించి ఆలోచిస్తున్నప్పుడు రెండవది కూడా గుర్తుకు వస్తుంటే దానిని సంసర్గ ఆలోచన అంటారు. ఉదాహరణకు పెళ్లి అన్న అంశమునుగూర్చి ఆలోచిస్తున్నప్పుడు, అప్రయత్నముగానే విందుభోజనము, పెళ్లిపందిరి, బంధువులు మొదలగు వారు గుర్తుకు రావడం. సంసర్గ ఆలోచనలు మంచి అభ్యసనానికి చాలా ప్రధానమైనవి.

**vii. నిర్దేశిత ఆలోచన (Directed Thinking)**

మనలోని ఆలోచనా విధానాన్ని ఉపయోగించి ఊహించిన రీతిలో ఫలితాలను పొందుతాము. ఈ ఆలోచనలు కొత్త విషయాలను కనుగొనడానికి ఉపయోగపడతాయి. పైన పేర్కొన్న మూర్త, అమూర్త, సమైక్య, విభిన్న, తార్కిక ఆలోచనలన్నీ నిర్దేశిత ఆలోచనలే. వీటిలో సృజనాత్మకత ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి దీనినే 'సృజనాత్మక ఆలోచన' అని కూడా పిలవవచ్చు.

**viii. అనిర్దేశిత ఆలోచన(Non-directed Thinking)**

నిర్దేశిత ఆలోచనకు భిన్నముగా,లక్ష్య సాధన లేకుండా చేసే ఆలోచనలే 'అనిర్దేశిత ఆలోచన' అంటారు. స్వైర కల్పనలు చేయడం, పగటి కలలు కనడం, ఊహాలలో విహరిస్తూ జీవితములో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోలేక పిచ్చిపిచ్చిగా చేయు ఆలోచనలు. వీటినే స్వైర ఆలోచనలు అని కూడా అంటారు.కౌమార దశలో ఇలాంటి ఆలోచనలు ఎక్కువగా వస్తాయి.

## ఆలోచనకు తోడ్పడే కారకాలు (Factors affecting Thinking)

ఆలోచనా ప్రక్రియకు అనేక రకాల కారకాలు తోడ్పడుతాయి. అందులో ప్రధానమైనవి.

**1. ప్రత్యక్షానుభూతి (Percepts)**

జ్ఞానేంద్రియాల ద్వారా వచ్చే సంవేదనలను **(Sensations)** గ్రహించినపుడు కలిగే మానసిక అనుభూతి ఆలోచనలను సృష్టిస్తుంది. ఆ అనుభూతి లేకపోతే ఆలోచనలు ప్రతిమల (Images) రూపములో వుంటాయి. అంటే విషయాన్ని ఒకసారి అనుభూతి చెందినపుడు అది మనస్సులో మెదులుతూవుంటుంది. ఆలోచనా ప్రక్రియకు దోహదపడుతుంది.

**2. ప్రతిమలు (**Images**)**

మనము ఇంద్రియాల ద్వారా పొందిన అంశాలు చిహ్నాలుగా, చిత్రాలుగా ఏర్పడతాయి. వాటినే ప్రతిమలు అంటారు. ఈ ప్రతిమలు నిజమైన వస్తువులకు,అనుభవాలకు మరియు చర్యలకు ప్రతీకలుగా వుంటాయి. ఇవి ఆలోచనలకు చాలా అవసరమవుతాయి.

**3. భావనలు (**Concepts**)**

ఆలోచనలలో ప్రతిమలు,అమూర్త భావనలు వుంటాయి. అంటే ఒక వస్తువును చూసినపుడు దాని లక్షణాలకు చెందిన భావనలు మనసులో ఏర్పడతాయి. వీటి వల్ల ఆలోచనా ప్రక్రియ సులభతరము అవుతుంది.

**4. గుర్తులు/సంకేతాలు (Signs & Symbols)**

మనకు పరిచయమై స్మృతిలో వున్న గుర్తులు, సంకేతాలు ఆలోచనలను ప్రభావితము చేయునవిగా వుంటాయి. ఉదాహరణకు అనేక రకాల రంగులో ఉన్నాయని తెలిసినా ఎర్ర రంగు, పచ్చ రంగులను ట్రాఫిక్ సిగ్నల్స్ గా వాడుతారనేది గుర్తు.

**5. భాష (Language)**

ఆలోచనలను ప్రభావితము చేయు కారకాలలో భాష ప్రధానమైనది. భాష లేనిదే ఆలోచన ప్రక్రియ జరగదు. చదివేటప్పుడు, వ్రాస్తునప్పుడు, వింటున్నప్పుడు మన మనస్సు పరిపరి విధాలుగా ఆలోచిస్తుంటుంది. అందువల్ల పుస్తకాలను ఎక్కువగా చదివేటప్పుడు ఆలోచనా ప్రక్రియ చాలా ఎక్కువగా వుంటుంది.

6. ఆలోచనలకు అభిరుచి, అవధానము చాలా ముఖ్యము.

7. ఆలోచనలకు ప్రేరణ చాలా అవసరము.

8. వ్యక్తిలో చురుకుదనము, సరళత్వము ఆలోచనలకు సహకరిస్తాయి. - పరిణితి పొందిన ప్రజ్ఞ ఉండాలి.

9. భాషాజ్ఞానము,జ్ఞాన అవగాహన ఆలోచనా వికాసానికి తోడ్పడుతాయి.

10. భిన్న సాంప్రదాయాలు, భిన్న సంస్కృతులు, వివిధ అలవాట్లు వున్న ప్రజలతో పరిచయమైనప్పుడు ఆలోచనాశైలి సక్రమంగా వుంటుంది. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకూడదు.

### తరగతి గదికి అన్వయము (Classroom Implications)

- విద్యార్థుల వయస్సు, స్థాయికి తగ్గట్టు కొన్ని సమస్యలను ఇచ్చి ఆలోచన చేయమనాలి.
- పాఠ్యాంశాలలోని భావాలను, నిత్య జీవితములో ఎట్లు వినియోగించుకోవచ్చో ఆలోచింపచేయాలి.
- విద్యార్థుల ఆలోచనలను చర్చించే దానికి అవకాశము ఇవ్వాలి. అలాగే భావ ప్రకటనా స్వేచ్ఛను ఇచ్చి ప్రోత్సహించాలి.
- విభిన్న ఆలోచనలు చేయడానికి కల్పనలు,ఉహలకు తావివ్వాలి.
- హేతుబద్ధమైన ఆలోచనలను విద్యార్థులలో ప్రోత్సహించాలి.

## 3.2.4 వివేచనము (Reasoning)

మనసు చేసే పనులలో ఆలోచనలు కలిగిన తర్వాతవాటితో విశ్లేషణ వివేచన వస్తుంది. ఇది మానవులలో మాత్రమే ఉండే ఒక ప్రత్యేక లక్షణము. వ్యక్తులలో ఉండే ఈ వివేచనా ప్రతిభనే 'విచక్షణా జ్ఞానము' అని కూడా అంటారు. వివేచనకు తార్కిక ఆలోచనా శక్తి ప్రధాన ఆధారము. ఇది ఆలోచనను ఒక క్రమబద్ధము చేసి ఆ ఆలోచన సరియైనదా?కాదా? ఎంత వరకు సమంజసము? అని నిర్ణయించడానికి వినియోగపడుతుంది.

**నిర్వచనాలు:**

- ఒక ఉద్దేశ్యము లేదా లక్ష్యముతో మనసులో జరిగే సోపానాత్మకమైన ఆలోచనలనే 'వివేచనా' అని – గ్యారట్ నిర్వచించెను
- ఉద్దేశ్యపూర్వకమైన పంచుకోబడిన ఆలోచనలే వివేచన – గేట్స్
- కేవలము గత సమాధానాల పునరావృత్తితోకాక పూర్వానుభవాలను జతపరిచి సమస్యలను పరిష్కరించుకో గలగడమే వివేచనా – మన్.

**లక్షణాలు:**

- వివేచనకు ఒక నిర్ధిష్టమైన గమనం ఉంటుంది.
- పూర్వ జ్ఞానాన్ని మరియు గత అనుభవాలను వినియోగించుకొంటుంది.
- గుర్తులు, చిహ్నాలు, భావనలు, భాష లాంటివి ఉంటాయి.
- సమస్యను పరిష్కరించుకోవడానికి ఉపయోగపడే ఒక అవ్యక్త చర్యగా వుంటుంది.
- సమస్యా పరిష్కారానికి ఇది ఒక మానసిక చర్య అవుతుంది.
- తార్కిక హేతుబద్ధమైన పంథాను అనుసరిస్తుంది.
- గమ్యసాధనే ధ్యేయంగా ఉంటుంది.
- ఆగమన, నిగమన పద్ధతులలో జరిగే ఆలోచనలే వివేచన.

**వివేచనా ప్రక్రియ (Reasoning Process)**

ప్రతి మనిషికి ఏదో ఒక సమస్య అనేక రూపాలలో వుంటుంది. అయితే వాటన్నింటికి పరిష్కారము ఒకేలా వుండదు. సమస్య, దాని తీవ్రతను బట్టి పరిష్కారమును ఆలోచిస్తాము. అంటే సమస్యను అనేక కోణాలనుంచి పరిశీలించి, విశ్లేషణ చేసి, పరిష్కారము కనుగొంటాము. ఈ పరిష్కారము కనుగొనడమనేది వ్యక్తి యొక్క వివేచన మీద ఆధారపడి వుంటుంది. దీనికి వ్యక్తిలో ప్రజ్ఞ, పట్టుదల, గతానుభవాలు ఎంతో అవసరము.

సమస్య పరిష్కార ప్రక్రియలో చేసే వివేచనలో కొన్ని ముఖ్యాంశాలు వుంటాయి. అవి

(1) సమస్యకు సంబంధించిన లక్ష్యం, సమస్య ఏమిటో కనుగొనడం.

(2) సమస్యా పరిష్కార మార్గాలను కనుగొనడం.

(3) ప్రతిస్పందనలను గుర్తించడం.

(4) సమస్యా పరిష్కారమార్గం సరియైనదా? కాదా? తెలుసుకునడం.

ఈ వివేచనా ప్రక్రియ అంతాకూడా వ్యక్తి యొక్క ఆలోచనాతీరు, సమస్య పట్ల వానికున్న వైఖరి, అంతరదృష్టిని బట్టి వుంటుంది.

**వివేచన రకాలు (Types of Reasoning)**

వివేచనా రెండు ప్రధాన రకాలుగా జరుగుతుంది. అవి:

i. ఆగమన వివేచన (Inductive Reasoning)

ii. నిగమన వివేచన (Deductive Reasoning)

**i. ఆగమన వివేచన:-** ఈ పద్ధతిలో వివేచన ఒక క్రమములో జరుగుతూ హేతుబద్ధమైన నిర్ణయానికి రావడం జరుగుతుంది. అంటే ప్రత్యేక (Particular) సందర్భాల నుంచి ప్రారంభమై సాధారణ(General) విషయాలవైపు పయనిస్తుంది. సాధారణ సూత్రాల నుంచి సిద్ధాంతమును నిరూపించడమే ఆగమనము.

ఉదాహణకు: ప్రతిరోజూ యోగా చెయ్యడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రాముడు ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అతని జ్ఞాపకశక్తి పెరిగినది. రాబార్ట్ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అతని జ్ఞాపకశక్తి పెరిగినది. రహీమ్ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అతని జ్ఞాపకశక్తి పెరిగినది. కావున మానవులు యోగాచేయడం వల్ల వాళ్ళ జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

ii. **నిగమన వివేచన:-** సాధారణ (General) సూత్రాల నుంచి ప్రత్యేక (Specific) అంశాలను ఆలోచించడమే నిగమనము. అంటే సిద్ధాంతము నుంచి సామాన్య విషయాలను రాబట్టుట.

ఉదాహరణకు: ఉష్ణమును గ్రహించినపుడు ఘన పదార్థాలు వ్యాకోచిస్తాయి. బంగారము, వెండి, రాగి, ఇనుము ఘన పదాదార్థాలు. కాబట్టి ఇవి వేడి చేసినపుడు వ్యాకోచిస్తాయి.

**తరగతిగది అన్వయం (Classroom Implications)**

- విద్యార్థులకు సంబంధించిన విషయాలను వారి ముందుంచాలి.
- సమస్యా పరిష్కారమును శాస్త్రీయ పద్ధతిలో ఆలోచించే అవకాశము ఇవ్వాలి.
- విద్యార్థుల వయస్సు, ప్రజ్ఞ, వైఖరి, అభిరుచిని బట్టి సమస్యల రూపకల్పన చేయాలి.

- గతానుభవాలు, పూర్వానుభవాన్ని ఉపయోగించుకొని వివేచన చేయునట్లు వీలు కల్పించాలి.
- నిర్ణయాలు తీసుకోవడంలో తర్ఫీదు ఇవ్వాలి.
- పాఠ్యాంశాలు, స్థానిక సమస్యల మీద చర్చలు ఏర్పాటు చేసి, వాటికి అనువైన మార్పులు సూచించే అవకాశమును కల్పించాలి.
- జీవితములో ఏర్పడు సమస్యలను విద్యార్థులకు తెలిపి, చర్చించి, వివేచన చేసే అవకాశము కల్పించాలి.
- విద్యార్థులకు ప్రశ్నలను అడిగే అవకాశము ఎక్కువగా ఇవ్వాలి.
- శాస్త్రప్రయోగాలు, ప్రాజెక్టులు నిర్వహింపచేసి వివేచనను పెంచే అవకాశాలు ఏర్పరచాలి.
- మంచి విద్యావేత్తల సమావేశాల ద్వారా వివేచనను పెంపొందించే అవకాశాలను కల్పించాలి.

52QL3J

### 3.2.5 స్వబుద్ధి / అతి సంజ్ఞానాత్మకత (Meta Cognition)

- **:: Knowing one:s own mind::**
- Meta Cognition అంటే వాచ్యాకార్థకంగా big thinking అని అంటే " విపులమైన ఆలోచన లేక స్వబుద్ధి".

  ఒక వ్యక్తి తన ఆలోచనల గురించి ఆలోచించడమే " Meta Cognition".
- ఆధునిక వ్యవహారిక పదకోశంలో Meta Cognition ను "స్వబుద్ధి" గా చెప్పబడింది.
- వ్యక్తి తన మనస్సులో జరిగే ఆలోచన ప్రక్రియలను తనకు తానుగా ఆలోచించకోవడమే "విపులమైన ఆలోచన" లేక "స్వబుద్ధి" గా చెప్పబడింది.
- వ్యక్తి తన ఆలోచనలను తానే ప్రశ్నించుకోవడం, విశ్లేషించుకోవడం, సంశ్లేషించుకోవడం, మద్దింపుజేసుకోవడం, మానసిక చిత్రణం(Visvatization) చేసుకొని ఊహించుకోవడం లాంటి ప్రక్రియలతో పరిశీలించడమే మోటాకాగ్నిషన్ లేక "స్వబుద్ధి" అంటారు.
- మెటాకాగ్నిషన్/స్వబుద్ధిని ఉపయోగించడం వల్ల విద్యార్థులు మంచి పాఠకులు(Readers) అవుతారు. పాఠ్యపుస్తకాలను తామే చదివి పాఠ్యాంశాలలోని విషయాలను సులభంగా అభ్యసిస్తారు. చాలా మంది విద్యార్థులకు తమ ఆలోచనలను గురించి ప్రశ్నించుకోవడం, విశ్లేషించుకోవడం, విచక్షించడం, మద్దింపు చేసుకోవడం లాంటివి తెలియవు. వీటిని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయడం వల్ల వారు నిజమైన, మంచి అభ్యాసకులౌతారు.

**మెటాకాగ్నిషన్ వలన ప్రయోజనాలు క్రింది విధంగా ఉంటాయి.**

1. విద్యార్థులు తమ పాఠ్యాంశాలను లోతుగా చదవగల్గుతారు. అవగాహన చేసుకోవటానికి తద్వారా జ్ఞానాన్ని నిర్మించుకోగల్గుతారు.
2. మెటాకాగ్నిషన్ ప్రక్రియలు – విద్యార్థుల్లో ఉన్న క్రమ మానసిక సామర్థ్యాలైన – విశ్లేషణాత్మక, సంశ్లేషణాత్మక, సృజనాత్మక, వివేచనాత్మక ఆలోచనలను పెంపొందిస్తుంది.

AKI6E6

3. విద్యార్థులను సమర్థవంతులైన వయోజనులుగా మారుస్తుంది. అంటే మెటాకాగ్నిషన్ (స్వబుద్ధిని) ప్రక్రియలను సమర్థవంతంగా ఉపయోగించగల విద్యార్థులు తమ పాఠశాల జీవితం నుండి సమర్థవంతమైన వ్యక్తిగత, పరిపక్వమైన వయోజన జీవితాన్ని అందుకోగలరు.

మెటాకాగ్నిషన్ ప్రక్రియలో 3 అంశాలు ఉంటాయి. అవి

1. ప్రణాళికను ఏర్పరుచుకోవడం.
2. వాటిని పర్యవేక్షించడం.
3. మూల్యాంకనం చేసుకోవడం.

పైన పేర్కొన్న మెటాకాగ్నిషన్ ప్రక్రియలను పఠనంలో ఉపయోగించడాన్ని తెలుసుకుందాం.

1. పఠన ప్రణాళికను ఏర్పరుచుకోవడం.
2. పఠన కార్యక్రమమును పర్యవేక్షించుకోవడం.
3. పఠన ఫలితాన్ని మూల్యాంకనం చేసుకోవడం.

**1. పఠన ప్రణాళికను ఏర్పరుచుకోవడం:**

- పాఠ్యాంశ శీర్షిక గురించి ఆలోచించడం
- పుస్తకం మొదట/కవర్‌పేజీని ముందు వెనుక చదవవలెను.
- పాఠం పేరును – పాఠ్య రచయిత గూర్చి చదవడం.
- పుస్తక/పాఠ్య పరిచయంను చదవడం.
- విషయ సూచికను / పాఠం ప్రారంభంలో ఉండే ఉద్దేశ్యాలను చదవడం.
- పుస్తకం/పాఠంలోని చిత్రాలను, ఫోటోలను, రేఖా చిత్రాలను శీర్షికలను చదవడం.
- పుస్తక / పాఠంలో ముఖ్య అంశాలను, ఉపశీర్షికల ముగింపు స్థూలంగ చూడడం.
- తెలిసిన విషయాలతో పాఠం చదివి తెలుసుకున్న విషయాలను అనుసంధానం చేసుకోవడం.
- పాఠం గాని/ పాఠ్యపుస్తకంలోని అంశాలు క్రమంలో అమర్చి విధానాన్ని గురించి ఆలోచించడం.
- పాఠంను తన సొంత మాటలతో వివరించడం మొదలైనవి.

**2. పఠన కార్యక్రమమును పర్యవేక్షించుకోవడం:**

- పాఠ్యంశాల పఠనం ద్వారా తనకెంత వరకు అర్థమైంది?
- పఠనం మధ్య ఏఏ సందేహాలు / అస్పష్టతలు ఏర్పడినాయా?

- "నేను చదివింది ఎంతవరుకూ, నాకు అర్థమైందని ప్రశ్నించుకొంటూ వాటి సమాధానాలు ఏర్పరుచుకొంటూ చదువుకుంటూ ముందకు వెళ్ళాలి.
- విద్యార్థి తన పఠన అవగాహనాన్ని, తనకున్న జ్ఞాన సంబందాలను ఏర్పరుచుకుంటూ,
- రాబోయే వాటిని ఊహించుకుంటూ,
- విషయాలను నిర్థారించుకుంటూ,
- రేఖీయ పటాలను (Graphic oganizes) తయారు చేసుకుంటూ
- ప్రశ్నలను ఏర్పరుచుకుంటూ - సమాధానాలను వెతుక్కుంటూ తన ఆలోచనలను పర్యవేక్షించుకోవాలి.
- విద్యార్థి తన ఆలోచనలను పర్యవేక్షించుకుంటూ గమనిస్తూ పాఠంను చదవడం వలన చదువుతున్నది అర్థం అవుతున్నదా? లేదా? తన మనసు పఠనం నుండి దారి తప్పుతున్నదా?
- చదువుచున్న విషయం గుర్తుందా?
- తను వేసుకున్న ప్రశ్నలకు సమాధానం లభించిందా?
- పాఠ్యాంశాలలో ముఖ్య /భావనలు/పదాలు గుర్తుకొస్తున్నాయా?
- మొదలైన వాటితో తన పఠనాన్ని తానే నియంత్రించుకొంటూ ముందుకు సాగవచ్చు.

**3. పఠన ఫలితాన్ని మూల్యాంకనం చేసుకోవడం:**

- పఠనానికి ముందు తాను అనుకున్న విధానం, క్రమాన్ని పాటించానన్నా? లేదా?
- ఏఏ అంశాలను పాటించాను? వేటిని వదిలివేసినానని సరిచూసుకోవడం.
- తన పఠన పర్యవేక్షణలోని లోపాలను గుర్తించడం లాంటివి చేపట్టాలి.

ఇలా ఈ మూడు ప్రక్రియలలో చేపట్టిటించడం వలన మెటాకాగ్నిషన్ (స్వబుద్ధి)ని పెంచుకోవచ్చును.

## 3.1.6 సృజనాత్మకత (Creativity)

**పరిచయము:-**

జన్మలలోకల్లా మానవ జన్మ గొప్పది అంటారు. మిగతా జీవరాశులతో పోలిస్తే మానవుడికి బుద్దిజ్ఞానము ఎక్కువ. ఈ బుద్దిజ్ఞానము వ్యక్తి ఆలోచనలు,వివేకము మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఆలోచనలు వ్యక్తీ తన వివేకాన్ని కోల్పోకుండా క్లిష్ట పరిస్థితులలో సైతము మంచిని కోరుకొనే విధముగా చేస్తుంది. ఈ కొత్త రకమైన ఆలోచనా ప్రక్రియనే 'సృజనాత్మకత' అంటుంటాము.

సృజనాత్మకత అంటే వ్యక్తి బహుముఖ ప్రజ్ఞకు సంబంధించిన అంశం. సృజనాత్మకత అంటే "ఒక కొత్త ఊహనుగాని, ఒక కొత్త వస్తువునుగాని ఉత్పత్తిచేయు ప్రక్రియే సృజనాత్మకత అని గిల్‌ఫర్డ్ నిర్వచించెను.

అంతే కాకుండా పాత అంశాలకు కొత్త రూపాన్నివ్వడం, వాటిని నూతనముగా వ్యవస్తీకరిచడం కూడా సృజనాత్మకత అయితే నూతనముగా సృష్టించ బడిన వస్తువుగాని, ఊహగాని, ఒక సమస్యా పరిష్కారానికి, వ్యక్తికి ఉపయోగపడాలి". అంటే సృజనాత్మకత అనేది కేవలము ఒక ప్రక్రియగా మాత్రమే కాకుండా దాని ద్వారా తయారయ్యే ఉత్పత్తిగా కూడా చూడాలి.

సృజనాత్మకత = ఉత్పత్తి ప్రక్రియ + ఉపయోగము

**నిర్వచనాలు:-**

- హచ్చిన్ సన్ (Hatchinson) ప్రకారము 'సృజనాత్మకత అనగా ఏదైనా కళ, భాష, సంగీతము లేక శాస్త్రజ్ఞాన పరంగా జరిగే నూతన ప్రక్రియ".
- మెడవిక్ (Medwick) ప్రకారం 'సృజనాత్మక ఆలోచన అనగా సంబందిత కారకాలను, కొత్తగా ఉపయోగపడే విధంగా, అవసరాలకు అనుగుణంగా, రూపొందించబడే ఆలోచన.
- 'వ్యక్తి ఆలోచనలలో కొత్త సంబంధాలను చూపి వాటిని వ్యక్తపరటడమే సృజనాత్మకత అని చాప్లిన్(Chaplin) పేర్కొన్నాడు.
- "ప్రజ్ఞా సామర్థ్యాలు మూర్తిమత్వ లక్షణాలు మరియు సమస్యా పరిష్కార లక్షణాలు యొక్క కలయికే సృజనాత్మకత"
  – అసుబెల్(Ausbell)
- సంబంధాలను మార్చుడం ద్వారా, కొత్త సంబంధాలను రూపొందించడం ద్వారా ఉపయోగకరమైనదిగా తనకు సంతృప్తినిచ్చేదిగా ఉందని ఆమోదించబడిన ఒక కొత్త పనినిచ్చే ప్రక్రియయే సృజనాత్మకత.

**సృజనాత్మకత - స్వభావము (Nature of Creativity)**

- సృజనాత్మకత సార్వత్రికమైనది.
- సృజనాత్మకత స్వతసిద్ధమైంది మరియు సంపాదితమైనది.
- సృజనాత్మకత ఎల్లప్పుడూ నవ్యతతో కూడుకున్నది.
- సృజనాత్మకత గమ్య నిర్ధేశికమైన ఒక విభిన్న ఆలోచన.
- సృజనాత్మకత ఒక ప్రక్రియ మరియు ఒక ఉత్పత్తి.
- సృజనాత్మకత పరిధి చాలా విస్తృతమైనది
- సృజనాత్మకత ప్రజ్ఞతో కొంత వరకు ముడిపడి వుంటుంది.
- సృజనాత్మకత ఒక సమస్యా పరిష్కారాన్ని నిర్దేశిస్తుంది.

**సృజనాత్మకత ప్రక్రియ లోని దశలు (**Process or Stages of Creativity**):-**

సృజనాత్మకత ప్రక్రియ నూతనత్వంతో ప్రారంభమై కొత్తకొత్త అంశాలకు దారితీస్తుంది. ఈ ప్రక్రియలోని దశలను వల్లాస్(Wallas) అనే శాస్త్రవేత్త 4 దశలల్లో వివరించాడు. అవి:

**1. సన్నాహ దశ (Preparatory Stage):-** ఒక వ్యక్తి తన కొత్త రచనను చేయాలనుకొన్నప్పుడు లేదా ఒక చిత్రాన్ని సృష్టించాలనుకొన్నప్పుడు వాటికి సంబంధించిన విషయాలను సేకరించాలి. వీటి కోసము తన స్మృతిలోని పాత భావాలను పునరాలోచించుకోవచ్చు. అనేక విషయాలను పరిశీలించవచ్చు. అనేక పుస్తకాలు చదువవచ్చు. సేకరించిన సమాచారాన్ని, స్మృతికి తెచ్చుకొన్న ఆలోచలను తనకు అనుకూలమైన రీతిలో సమీకరించుకొని నూతన సృష్టికి పూనుకొంటాడు. అందువల్లే దీనిని 'సన్నాహదశ' అంటారు.

**2. గుప్తస్థితి దశ (Incubation Stage):–** వ్యక్తులు సేకరించిన విషయాలతో సమాయత్త పడినపుడు సమస్యను ఒక పక్కన పెట్టి వేరే వ్యాపకములో లీనమౌతారు. అంటే తోటపని, చిత్రలేఖనం, సంగీతం మొదలగు వేమైనా. అప్పుడు సమస్యా పరిష్కారానికి సరియైన పరిస్థితి కలుగుతుంది. వ్యక్తిలో తన్యత తగ్గిపోతుంది. తను చేయబోవు సృష్టి కొంతకాలము వారి మనసులో అవ్యక్తంగా ఉంటుంది. అందుకే దీనిని "గుప్తదశ" అంటారు.

**3. అంతర్దృష్టిదశ (Illumination Stage):–** చేయదలచిన సృష్టి కొంతకాలము పొదుగులో ఉన్న తర్వాత వ్యక్తికి సృజనాత్మకత ఒక్కసారిగా స్ఫురిస్తుంది. సమస్యను ఈ విధముగా పరిష్కరించు కోవచ్చు. అన్న భావన తటాలున వస్తుంది. పొదుగు దశలో ఉండగా ఏదో ఒక దశలో ఓహో' ఈ విధముగా చేయాలి అన్న స్ఫురణ కలుగుతుంది. నూతనభావనలు ఏర్పడతాయి. ఈదశలో వ్యక్తి నూతన ఉత్సాహముతో మళ్ళీ సృజనాత్మకతను కొనసాగిస్తాడు.

**4. నిరూపణ దశ (Verfication Stage):–** వ్యక్తి తన సమస్యాపరిష్కార మార్గము లేదా ఊహాలను లేదా కల్పనలతో సరిపోల్చు కొంటాడు. ఈ రెంటికి పొంతన కుదిరినప్పుడే వ్యక్తి తన సృష్టిని సమాజములో తన తోటివారితో వ్యక్త పరుస్తాడు. దీనితో సృజనాత్మకత ప్రక్రియ పరిసమాప్తం అవుతుంది. అంటే సృజనాత్మకత విషయాన్ని మూల్యాంకనము చేస్తారు.

### సృనాత్మకతను పెంపొందించు విధానాలు:

సృజనాత్మకత అనేది కొంత వరకు వంశపారంపర్య లక్షణం అయినా చాలా వరకు పరిసర ప్రభావం ఉంటుంది. పిల్లలలో దీనిని గుర్తించి, వెలికితీసి, పెంపొందించవలసిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపైనా ఎంతైనా వుందని చెప్పవచ్చు. దాని కోసము క్రింది అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

- విద్యార్థులలో భయం, బిడియం వంటి అంశాలను పోగొట్టాలి.
- వక్తృత్వ పోటీలు, చర్చాగోష్టులు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు వంటివి నిర్వహించాలి.
- విభిన్న ఆలోచనలు, పట్టుదల, ఆత్మ విశ్వాసము ప్రోత్సహించాలి.
- అంతర్గత ప్రేరణను కలిగించే విధముగా కృత్యాలను కల్పించాలి.
- స్వేచ్ఛా భావాలను క్రమపరచకూడదు. లేదా కించపరచకూడదు.
- నవ్యత, నూతనుత్సాహాలను ప్రోత్సహించాలి.
- సైన్స్, ఎక్సిబిషన్స్, మ్యూజియం, విహార యాత్రలకు తీసుకెళ్లాలి.
- బ్రెయిన్ స్టార్మింగ్ పద్ధతిని ఉపయోగించాలి.(Brain Storming)

### సృజనాత్మకత మాపనము (Assessment of Creativity):–

వ్యక్తులలో సృజనాత్మకతను మాపనము చేయడానికి పరిశీలన పద్దతి, కృత్యాధార పద్ధతులు బాగా ఉపయోగిస్తారు. పాల్ టోరన్స్ (Paul Torrence) అను శాస్త్రవేత్త మిన్నిసోటా విశ్వవిద్యాలయములో (University of Minnesotta)అనేక సంవత్సరాలపాటు సృజనాత్మకతను మాపనము చేయడానికి పరిశోధనలు జరిపాడు.

ఈ పరీక్షల ఫలితముగా ::Minnesota Test of Creative Thinking" అను పరీక్షను తయారు చేశాడు. అందులో 10 రకాల పరీక్షలు ఉంటాయి. అవి ప్రతిది 4రకాల స్కోరింగును వెల్లడిస్తాము. అవి: దారాళత(Fluency), సరళత(Flexibility), స్వభావసిద్దాత(Neutrality) మరియు నవ్యత(Novelty).

అలాగే వల్లాహ్ & కాగన్ (Wallas & Kogan) అను శాస్త్రవేత్తలు రూపొందించిన సృజనాత్మక పరీక్షలలో 'అసాధారణమైన ఉపయోగాలు గల అంశాలు' ఉంటాయి.

ఉదాహరణకు క్రింది వస్తువులను అసాధారణంగా ఎట్లు వినియోగించవచ్చునో రాయండి?

- కత్తి
- వాహనాల టైర్
- పాత చెప్పులు
- సీసా మూతలు
- పాత వార్తాపత్రిక

ఈ పరీక్ష ప్రాథమిక స్థాయి వారికి ప్రస్తుతము వాడుకలో ఉన్నది. ఈ పరీక్షను ఉపయోగించిన 6-12 సంవత్సరాల వయస్సు గల వారి సృజనాత్మకతను అంచనా వేయవచ్చు. ఇందులో మరికొన్ని అంశాలు ఇలా వుంటాయి.

- మీరు ఆలోచించగల గుండ్రని వస్తువుల పేర్లు చెప్పండి.
- శబ్ధము చేసే కొన్ని వస్తువుల పేర్లు చెప్పండి.
- చక్రాలపై తిరిగే యంత్రాల పేర్లు చెప్పండి.
- నాలుగు భుజాలు గల వస్తువుల పేర్లు చెప్పండి, లాంటి పరీక్షలుంటాయి.

## 3.2.7 ప్రజ్ఞ (Intelligence)

### ప్రజ్ఞ – స్వభావము (Nature of Intelligence)

వ్యక్తులలో వైయుక్తికబేధాలను నిర్ణయించే కారకాలలో ప్రజ్ఞ ఒక ప్రధానమైన కారకము. మిగతా జీవరాసులతో పోలిస్తే మానవుణ్ణి అత్యున్నతుడుగా పేర్కొనడానికి కారణము అతని తెలివితేటలే. అంటువంటి మానవుని తెలివితేటలలో కూడా వ్యత్యాసాలు వున్నాయి. ఆ వ్యత్యాసాలకు అనువంశికత, పరిసరాలు వంటి అనేక కారణాలున్నప్పటికి వారిని బుద్ధిహీనులు, తెలివి తక్కువ వారు, తెలివైనవారు, మేధావులు అని వర్గీకరిస్తుంటాము. విద్యా విషయాలలోను, సాధన విషయములోను విద్యార్థులు కొందరు మెరుగ్గాను, కొందరు వెనుకబడి ఉండడానికి కారణము చాలా వరకు వారిలోని ప్రజ్ఞే. అందువల్ల ఉపాధ్యాయులు, ప్రజ్ఞఅంటే ఏమిటి? ప్రజ్ఞా ప్రాముఖ్యత, ప్రజ్ఞారకాలు, ప్రజ్ఞాలబ్ధి, ప్రజ్ఞా మాపనం, ప్రజ్ఞా పరీక్షలు వంటి విషయాలను తెలుసుకోవలసి వుంటుంది.

## ప్రజ్ఞ – నిర్వచనాలు (Definitions of Intelligence)

ప్రజ్ఞను వివిధ కోణాల నుంచి పరిశీలించ వచ్చును. ఇప్పుడు వరకు 60కి పైగా నిర్వచనాలు ఉన్నాయంటే దాని ప్రాధాన్యత ఏమిటో మనకు తెలుస్తున్నది. వీటన్నింటిని క్లుప్తీకరించి 3 ప్రధాన అంశాల క్రింద వర్గీకరించిచెప్పవచ్చు. అవి:

**1. నూతన పరిస్థితులను వేగముగాను, సమర్థవంతముగాను, ఎదుర్కొని సర్థుబాటు చేసుకొను సామర్థ్యం:**

- ప్రతీకాత్మక ప్రక్రియలను ఉపయోగించి వ్యక్తి సర్దుబాటు చేసుకొను సామర్థ్యమే ప్రజ్ఞ – ఎడ్వర్డ్
- ఒక నిర్దిష్ట దిశలో ఆలోచనతో, ఆత్మవిమర్శతో సర్దుబాటు చేసుకోగలిగేశక్తే ప్రజ్ఞ – బినే
- కొత్త సమస్యలకు, పరిస్థితులకు అనుగుణ్యతను పొందే, సామాన్య మానసిక శక్తియే ప్రజ్ఞ – స్టెర్న్

**2. అమూర్త భావనలను వినియోగించుకోగలిగే సామర్థ్యము:**

- అమూర్తచింతనానికి కావలిసిన సామర్థ్యమే ప్రజ్ఞ – మెక్‌డోగెల్.
- అమూర్త ఆలోచనా శక్తియే ప్రజ్ఞ – టెర్మన్
- తన గ్రాహ్యక శక్తిని వ్యక్తపరచే అతీత శక్తియే ప్రజ్ఞ – గాల్టన్

**3. సంబంధాలను అర్థం చేసుకొని త్వరగా అభ్యసించే సామర్థ్యం:**

- పరస్పర సంబంధాలను చూడగలిగే అంతర్గత శక్తియే ప్రజ్ఞ – స్పియర్‌మన్
- అభ్యసించడానికి దోహదపడే సామర్థ్యాల సంయుక్త నిర్వహణే ప్రజ్ఞ – గేట్స్
- సర్దుబాటు, సాంఘిక విలువలు, సృజనాత్మకత లక్షణాలు గల కృత్యాలను చేసే వ్యక్తిలో గల సామర్థ్యమే ప్రజ్ఞ – స్తోడార్ద్

పైన నిర్వచనాలన్నింటిని సమగ్రముగా కూర్చి వేష్లర్ అను శాస్త్రవేత్త ప్రజ్ఞను క్రింది విధముగా నిర్వచించాడు.

“ప్రయోజనాత్మకంగా ప్రవర్తించడానికి, హేతుబద్దముగా ఆలోచించడానికి,తనచుట్టూ వున్నా పరిసరాలతో ఫలప్రదంగా మలచుకోవడానికి వ్యక్తికి అవసరమయ్యే సామర్థ్యమే ప్రజ్ఞ”

## ప్రజ్ఞ – రకాలు (Types of Intelligence)

థారన్‌డైక్ అను అమెరికా మనోవిజ్ఞానశాస్త్రవేత్త మూడు రకాలుగా వర్గీకరించాడు. అవి:

**1. అమూర్త ప్రజ్ఞ (Abstract Intelligence):–** అక్షరాలు, అంకెలు, చిహ్నాలు, చిత్రాలు, మాటలు, పదాలు వంటి వాటిని అర్థంచేసుకోవడం, వాటి ద్వారా అర్థాలను తెలియజేయడానికి అవసరమయ్యే శక్తినే ‘అమూర్త ప్రజ్ఞ’ అంటారు.

**2. యాంత్రిక ప్రజ్ఞ (Mechanical Intelligence):–** భౌతికంగా కనిపించే వస్తువులను నిర్వహించగలిగే సామర్థ్యాన్నే ‘యాంత్రిక ప్రజ్ఞ’ అంటారు. అంటే వస్తువులను, పరికరాలను, యంత్రాలను నిర్వహించ గలిగే సామర్థ్యమన్న మాట.

**3. సాంఘిక ప్రజ్ఞ (Social Intelligence):-** వ్యక్తి తన చుట్టూ వున్న వారిని అర్థం చేసుకొని వారి భావాలకు జాగ్రత్తగా ప్రతిస్పందించి అనుకొన్నది సాధించగలిగే సామర్థ్యమే 'సాంఘిక ప్రజ్ఞ'అంటారు.

## ప్రజ్ఞాలబ్ధి - భావన (Concept of Intelligence Quotient: I.Q)

### i. శారీరక వయస్సు - మానసిక వయస్సు (Chronological Age - Mental Age)

ప్రతి వ్యక్తికి రెండు రకాల వయస్సులున్నాయి.

అవి: i. శారీరకవయస్సు, ii. మానసిక వయస్సు.

వ్యక్తి జన్మించిన తేది నుండి కాలమును లెక్క గట్టడమే 'శారీరక వయస్సు', ఇది శరీరానికి సంబంధించినది. దీనిని సంవత్సరాలు, నెలలు, రోజులలో కొలుస్తారు. వ్యక్తి శారీరక వయస్సుతో సంబంధము లేకుండా ఒక ప్రజ్ఞా నికషలో అతని నిష్పాదనను బట్టి నిర్ణయించేది 'మానసిక వయస్సు'. మానసిక వయస్సు అన్న భావనను మొట్టమొదట ఆల్ఫ్రేడ్ బినే అనే శాస్త్రవేత్త సూచించాడు.

### ii. ప్రజ్ఞాలబ్ధి (Intelligence Quotient)

ఒక వ్యక్తి మానసిక వయస్సుకు, శారీరక వయస్సుకు ఉండే నిష్పత్తిని 100చే గుణించగా వచ్చే లబ్దాన్ని 'ప్రజ్ఞాలబ్ది'అంటారు. దీనిని స్టెర్న్ అను శాస్త్రవేత్త మొట్ట మొదట ప్రతిపాదించాడు.

$$\text{ప్రజ్ఞాలబ్ధి} = \frac{\text{మానసిక వయస్సు}}{\text{శారీక వయస్సు}} \times 100$$

### iii. ప్రజ్ఞాలబ్ధి స్థిరత్వము (Consistency of Intelligence Quotient)

ప్రజ్ఞ అనేది వ్యక్తిలో పుట్టుకతో వచ్చే ఒక సహజమైన అంతర్గతశక్తి. ఇది శారీరక వయస్సుతో పాటు మారుతుంటుంది. అంటే వ్యక్తి శారీరక వయస్సుతో పాటు అతని మానసిక వయస్సుకూడా మారుతుంటుంది. అందువల్ల వ్యక్తులందరిలో ఈ ప్రజ్ఞా లబ్ది స్థిరముగానే ఉంటుంది. అయితే ఉత్తేజకర వాతావరణము, మంచి ప్రోత్సాహము కల్పించునట్లయితే ప్రజ్ఞా లబ్ధి కొంత పెరిగే అవకాశమున్నదని పరిశోధనలు తెలుపుతున్నాయి.

## 4. ప్రజ్ఞా లబ్ధి పరిమితులు (Limitations of Intelligence Quotient)

వివిధ రకాలైన ప్రజ్ఞా పరీక్షల ద్వారా ప్రజ్ఞా లబ్ధిని లెక్కించవచ్చు. అయితే దీనిని ఉపాధ్యాయులు చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి. ఉదాహరణకు 18 సంవత్సరాల వయస్సుగల వారి ప్రజ్ఞాలబ్దిని గనించే టప్పుడు వారి మానసిక వయస్సుకూడా 18గానే తీసుకుంటాం. వీరి ప్రజ్ఞా పరీక్షలను అమూర్త, మూర్త, ప్రజ్ఞాలను మాత్రమే కొలుస్తాము, కానీ సాంఘిక ప్రజ్ఞను కొలవము. కాబట్టి ప్రజ్ఞా లబ్ధి విషయములలో జాగ్రత్తపడాలి.

## 5. ప్రజ్ఞా విభాజనము (Classifications of Intelligence Quotients):-

వ్యక్తులపై పరిశోధనలు జరిపి, టర్మన్-మిర్రల్ అను శాస్త్రవేత్తలు ప్రజ్ఞాలబ్ధి ఆధారముగా ప్రజ్ఞా విభాజనరేఖా పటమును గీసి, అది దాదాపు సామాన్యసంభావ్యతా వక్రరేఖని పోలి ఉంటుందని నిరూపించారు. దీని ప్రకారము అధిక సంఖ్యాకులు 90 నుంచి 100 మధ్య ఉన్నట్లు గమనించారు. ప్రజ్ఞాలబ్ధి ఆధారంగా వ్యక్తులను క్రింది విధంగా విభజించిరి.

| ప్రజ్ఞాలబ్ధి | వర్గము | జనాభాలోశాతము |
|---|---|---|
| 20 కంటె తక్కువ | తక్కువ మూడులు | 1.5% |
| 20 - 50 | బుద్ధిహీనులు | 2.3% |
| 50 - 70 | అల్ప బుద్ధులు | 5.0% |
| 70 - 90 | తెలివి తక్కువవారు | 19.0% |
| 90 - 110 | సగటు ప్రజ్ఞావంతులు | 48.0% |
| 110 - 130 | ఉన్నత ప్రజ్ఞావంతులు | 21.0% |
| 130 - 150 | అత్యున్నత ప్రజ్ఞావంతులు | 0.1% |
| 150 కంటే ఎక్కువ | మేధావులు,ప్రతిభావంతులు | 0.23% |

## ప్రజ్ఞా - మాపనము (Measurement of Intelligence)

ప్రజ్ఞామాపనం అనేది బాహ్యంగా కనిపించే ఎత్తు, బరువు వంటి వాటిని కొలవడం కాదు. వ్యక్తి యొక్క అంతర్గత సామర్థ్యాలను కొలవడం, గత 100 సంవత్సరాల నుంచి అనేక మంది మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు ప్రజ్ఞను మాపనం చేయడానికి ఎన్నో రకాల ప్రజ్ఞా పరీక్షలను కనుగొన్నారు. అందువల్లనే మనోవిజ్ఞాశాస్త్రములో ప్రజ్ఞను పరీక్షించడానికి ఉన్నన్ని పరీక్షలు మరి ఏయితర అంశాన్ని పరీక్షించడానికి లేవని చెప్పవచ్చు.

ఫ్రెంచ్ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త 'ఆల్ఫ్రేడ్ బినే' (Alfred Binnet), 1980 సంవత్సరములో మొట్ట మొదటి ప్రజ్ఞాపరీక్షను ఫ్రెంచ్ భాషలో రూపొందించాడు. సైమన్ అనే మరొకశాస్త్రవేత్తతో కలసి ఫ్రాన్స్ దేశంలోని విద్యార్థుల సాధనాస్థాయి తగ్గిపోవడానికి కారణాలను కనుక్కోవడానికి బినే ఈ పరీక్షలు నిర్వహించాడు. అందువల్ల దీనిని 'బినే - సైమన్ ప్రజ్ఞామాపని' (Binnet - Simon Intelligence Scale) అని పేరు వచ్చినది.ఇది 3 నుంచి 13 సంవత్సరాల వయస్సుగల వారికి 50 అంశాలతో కూడిన ప్రజ్ఞపరీక్షను రూపొందించారు.

టర్మన్, మెర్రల్ అను శాస్త్రవేత్తలు కలసి ఈ ప్రజ్ఞా పరీక్షలను ఆధునీకరించి 2 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారికి ఉపయోగపడే విధముగా తయారు చేశారు. ఈ విధముగా ప్రజ్ఞా పరీక్షలు ధారణ,స్మృతి,తారతమ్య వివేచన వంటి ప్రజ్ఞాకారకాలపై ఆధారపడి తయారు చేశారు.

## ప్రజ్ఞా పరీక్షలు - రకాలు (Types of Tests of Intelligence)

ఒక వ్యక్తిని అతని మానసిక వయస్సుగల వారితో పోల్చినప్పుడు, అతని ప్రజ్ఞ ఏస్థాయిలో వున్నదో పరిగణచేయు సాధనములను 'ప్రజ్ఞానికష' అనవచ్చు. నికషలో విషయాన్ని బట్టి,ఒకసారి ఎంత మందిని మాపనము చేయవచ్చు,. అన్న భావనను బట్టి ప్రజ్ఞానికషలను 4 రకాలుగా విభజించడం జరిగినది. అవి:

1. శాబ్దిక - అశాబ్దిక పరీక్షలు (Verbal - Non Verbal Tests)
2. వైయక్తిక - సామూహికపరీక్షలు(Individual - Group Tests)

B121FH

3. పేపర్ పెన్సిల్ - నిష్పాదన పరీక్షలు(Paper Pencil - Performance Tests)

4. శక్తి - వేగ పరీక్షలు(Power - Speed Tests)

- ప్రజ్ఞా పరీక్షలను విషయాంశాలఆధారముగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు. అవి:

1. శాబ్దిక-పరీక్షలు:- శాబ్దికపరీక్షల్లోని విషయాంశాలకు జవాబు యివ్వడానికి భాషాజ్ఞానము, గణితజ్ఞానము అవసరము వుంటుంది. ఈ పరీక్షలలో శాబ్దికావగాహన, వ్యతిరేకార్థాలు, పదాలను వర్గీకరించడం,వివేచించడం,గణిత భావనకు తగిన ప్రశ్నలు వుంటాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే ప్రయోజ్యులకు తప్పనిసరిగా చదవడం, వ్రాయడం, గణించడం వచ్చి వుండాలి, ఇక్కడ ప్రయోజ్యులిచ్చే సమాధాలను బట్టి వారి ప్రజ్ఞాలబ్ధిని మాపనము చేస్తారు.

**ఉదా:-** ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్ పరీక్ష, వేష్లర్ శాబ్దికపరీక్ష

2. అశాబ్దిక పరీక్షలు:- ఈ అశాబ్దిక పరీక్షలలో రకరకాల డిజైన్‌లను పరిశీలించడం, చిత్రాలు గీయడం, మరియు వాటికి ఆదేశానుసారముగా ప్రతిస్పందించవలసి వుంటుంది. ఈ పరీక్షలకు చదవడం,రాయవలసిన అవసరం ఉండదు. ఉదా:- డ్రా-ఎ-మ్యాన్‌పరీక్ష, రావన్స్‌స్టాండర్డ్ ప్రోగ్రెసివ్ మాట్రసిస్‌పరీక్ష.

• ప్రజ్ఞాపరీక్షను ఒక్కసారిగా ఎంతమంది ప్రయోజ్యులమీద తీసుకోవడం జరుగుతుందో వారి సంఖ్యానుపరంగా పరీక్షలను రెండు రకాలుగా విభజన చేయడం జరిగినది. అవి:

**1. వైయక్తికపరీక్షలు:-** ఒక సారి ఒక వ్యక్తిని మాత్రమే పరీక్షించడానికి వీలుగల వాటినే 'వైయక్తిక లేదా వ్యక్తిగత పరీక్షలు అంటారు. ఉదా:- బీనే - సైమన్ పరీక్షలు, వేష్లర్ పిల్లల ప్రజ్ఞామాపని

**2. సామూహిక పరీక్షలు:-** ఒకేసారి ఒకరికన్నా ఎక్కువ మందిని పరీక్షించడానికి వీలుగా ఉండే పరీక్షలను 'సామూహికపరీక్షలు' అంటారు.

ఉదా:- ఆర్మీ ఆల్ఫా పరీక్ష, ఆర్మీబీటా పరీక్ష, రావన్స్ స్టాండర్డ్ ప్రోగ్రెసివ్ మాట్రసిస్ పరీక్ష

• ప్రయోజ్యుడు ప్రతిస్పందించే తీరు ఆధారముగా ప్రజ్ఞా పరీక్షలను రెండు రకాలుగా విభజించారు. అవి:

**1. పేపర్ పెన్సిల్ పరీక్షలు:-** ప్రజ్ఞాపరీక్షల్లోని ప్రశ్నలకు, జవాబులు/ప్రతిస్పందనలను ప్రయోజ్యులు పెన్సిల్(పెన్) పేపర్‌పై వ్రాసి ఇవ్వగలిగే వాటిని 'పేపర్ పెన్సిల్ పరీక్షలు' అంటారు.

ఉదా:- ఆర్మీఆల్ఫాపరీక్ష, రావన్స్‌స్టాండర్డ్‌ప్రోగ్రెసివ్ మాట్రసిస్ పరీక్ష

**2. నిష్పాదనపరీక్షలు:-** పరీక్షల్లోని ప్రశ్నలకు ప్రయోజ్యులు కొన్ని కౌశలాలు లేదా నైపుణ్యాలను ప్రదర్శించవలసి వుంటుంది.

ఉదా:- భాటియా ప్రజ్ఞామాపని, కోహ్‌బ్లాక్ డిజైన్ పరీక్ష

- ప్రయోజ్యులు ప్రజ్ఞా పరీక్షలను పూర్తిచేయవలసిన సమయము మరియు కాలము ఆధారముగా పరీక్షలను రెండు రకాలుగా విభజించారు. అవి:

**1. శక్తి పరీక్షలు:–** ప్రయోజ్యుడు తనకు ఇష్టమొచ్చిన పద్ధతిలో, కావలసిన సమయం తీసుకొని ఒకటి తరువాత ఒకటి పూర్తి చేసుకొంటూ పోయో వాటిని 'శక్తి పరీక్షలు' అంటారు.

ఉదా: రావన్స్ ప్రోగ్రసివ్ మాట్రసిస్ పరీక్ష, పింటుర్ పాటర్ సన్ పరీక్ష

**2. వేగ పరీక్షలు:–** నిర్ణీత సమయములో త్వరగా పరీక్షాంశాలను పూర్తిచేయవలసిన వాటిని 'వేగపరీక్షలు' అంటారు.

ఉదా: ఆర్మీఆల్ఫా పరీక్ష,ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్ పరీక్ష.

**ప్రజ్ఞా పరీక్షల ప్రయోజనాలు:**

- విద్యార్థుల స్థాయి ఆధారముగా వారిని వర్గీకరించవచ్చు.
- విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవచ్చు.
- విద్యార్థులలో సాధనా సామర్థ్య శక్తి ఉన్నదా?లేదా? తెలుసుకోవచ్చు.
- . విద్యార్థుల శక్తి సామర్థ్యాలను అనుగుణ్యమైన కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు.
- విద్యా పరంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన వారిని గుర్తించి, తగిన బోధనా వ్యూహాలను నిర్ణయించుకోవచ్చు.

**ప్రజ్ఞా పరీక్షల పరిమితులు:**

- ప్రజ్ఞను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణముగా మాపనము చేయు పరీక్షలు ప్రస్తుతము అందుబాటులో లేవు.
- శ్రమ,ఖర్చు,శిక్షణ పొందిన వారు లేరు.
- ప్రజ్ఞా నికషలపై పూర్తి నమ్మకములేదు.
- ప్రజ్ఞా లబ్దిని లెక్కించినా దానిని విద్యార్థులకు సక్రమంగా తెలుపలేము.
- పట్టుదల,ఆత్మవిశ్వాసము వంటి లక్షణాల మాపనములో పరిమితి ఉంది.

## ప్రజ్ఞా – సిద్ధాంతాలు (Theories of Intelligence)

అనేక మంది మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ప్రజ్ఞను నిర్వచించుటలో ఏకాభిప్రాయములో లేరు. అందువల్ల వారివారి పరిశీలనలు, పరిశోధనల, అనుభవాల ప్రాతిపదికగా ప్రజ్ఞను వివిధ రకాలుగా వివరించారు. వాటిననుసరించే అనేక ప్రజ్ఞా సిద్ధాంతాలు వాడుకలోకి వచ్చాయి. అందులో కొన్ని ముఖ్యమైన వాటిని చర్చిదాం.

### 1. ఏక కారక సిద్దాంతము (Unifactor Theory):–

దీనిని బినే,టర్మన్, స్టెర్న్ లాంటి సాంప్రదాయ మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు రూపొందించారు. వీరి ప్రకారము ప్రజ్ఞ అనేది ఒకే అంశం(Factor). దీని ప్రకారము ఒక వ్యక్తి గణితములో మంచి తెలివితేటలు కనబరిస్తే అతను విజ్ఞానము, సాంఘికశాస్త్రము, సంగీతము, చిత్రకళ, మరేదైనా రంగములో కూడా ఒకే రకముగా ప్రజ్ఞను కనబరుస్తాడని అర్థము. కాని వివిధ మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనలో తేలినదేమింటంటే వ్యక్తులు ఒక అంశములో కనబరిచిన ప్రతిభను మరో అంశంలో కనబరచాలేదని గుర్తించారు. అందువల్ల ఈ సిద్ధాంతము ఆమోదము పొందలేక పోయినది.

**2. ద్వి కారక సిద్ధాంతము (Two factor Theory):-**

ఈ సిద్ధాంతాన్ని స్పియర్‌మన్(Spearmann) అను శాస్త్రవేత్త ప్రతిపాదించాడు. ఇతని ప్రకారము ప్రజ్ఞలో సాధారణ కారకము (General factor), నిర్ధిష్ట కారకము(Specific factor) అను రెండు రకాల అంశాలు వుంటాయని, సాధారణ కారకము ఒకటే ఉంటుంది కానీ నిర్ధిష్ట కారకాలు అనేకము ఉంటాయని పేర్కొన్నాడు. గణిత చాతుర్యం,వాగ్ధార,ప్రాదేశిక సంబంధము మొదలైన వాటన్నింటికి ఒకే సమాన్య కారకమని, దానినే 'G' కారకమని అని చెప్పాడు. కాని ప్రతి దానిలో ఒక్కొక్క ప్రత్యేక కారకము 'S' వుంటుందని స్పియర్‌మన్ సూచించాడు.

**3. బహుకారక సిద్ధాంతము (Multi Factor Theory):-**

ఈ సిద్ధాంతాన్ని ఎడ్వర్డ్ లియో థారన్‌డైక్(Edward Leo Thorndike) అను శాస్త్రవేత్త ప్రతిపాదించాడు. దీని ప్రకారము ప్రజ్ఞలో అనేక కారకాలు ఉంటాయి. ఈ కారకాల ప్రభావం ప్రతి మానసిక చర్యలోను ఉంటుంది. రెండు మానసిక చర్యల మధ్య ఉన్న సహసంబంధము, ఈ రెండు చర్యలలోను ఒకే రకమైన కారకాలు ఎంతవరకు ఉంటాయనే విషయము మీద ఆధారపడి ఉంటుంది. ఈ సిద్ధాంతముపై ఆధారపడి థారన్‌డైక్ సి.ఎ.వి.డి(C.A.V.D) అను పరీక్షను రూపకల్పన చేసారు. :C: అంటే వాక్యపూరణము(Completion),:A: అంటే గణిత వివేచనము(Arithmetic Reasoning), :V: అంటే పదజాలము(Vocablary), :D: అంటే నిర్ధశాను గమనము(Following Direction)

**4. సామూహిక కారక సిద్ధాంతము (Group factor Theory):-**

ప్రజ్ఞ మీద అనేక పరిశోధనలు చేసిన తరువాత లూయీ థర్‌స్టన్ అను అమెరికా మనోవిజ్ఞాన శాస్త్రవేత్త ఈ సిద్ధాంతమును ప్రతిపాదించాడు. తను రచించిన గ్రంథం 'ప్రాథమిక మానసిక సామర్థ్యాలు(Primary Mental Abilities)' లో ప్రజ్ఞ అనేక కారకముల ఫలితమేనని సూచించాడు. ఈ బహు కారకములో కొన్ని కొన్ని సన్నిహిత్వం కలిగి ఉంటాయని, అలా సాన్నిహిత్వం కలవాటిని ఒక సమూహముగా (Group) పేర్కొనవచ్చని థర్‌స్టన్ ప్రతిపాదించాడు. ఇతని పరిశోధనల ప్రకారము ప్రతి పనిలోను, ఏడు రకాలైన ప్రాథమిక మానసిక సామర్థ్యాలు ఉన్నట్లు కనుగొన్నాడు. అవి: i. శాబ్దిక సామర్థ్యం-V-(Verbal), ii. స్మృతి-M-(Memory), iii. తార్కిక సామర్థ్యం-R-(Reasoning),iv. సంఖ్యా సామర్థ్యం-N-(Numerical Ability), v. ప్రాదేశిక సంబందాలు-S-(Spatial Relationships), vi. ప్రత్యక్షాత్మక సామర్థ్యం-P-(Perceptual Ability), vii. పద ధారాళతులు-W-(Word Fluency). ఈ సిద్ధాంతము ప్రకారము థర్‌స్టన్ మానసిక సామర్థ్యాల పరీక్షను తయారు చేసాడు.

**5. ప్రజ్ఞా స్వరూప సిద్ధాంతము (Theory of Structure of Intellect):-**

ఈ సిద్ధాంతాన్ని గిల్‌ఫర్డ్ (J.P.Guiford) అను శాస్త్రవేత్త ప్రతిపాదించాడు. ఇతర సిద్ధాంతాల కంటే ఈ సిద్ధాంతము ప్రజ్ఞా అంశాలను సంతృప్తి కరముగా వివరించుట చేత సమకాలినములో ఎక్కువ మంది శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతమును ఆదరిస్తున్నారు. ప్రజ్ఞలోని విషయాలను అంశవిశ్లేషణ (Factor Analyses) అను సాంఖ్యక శాస్త్రపద్ధతిలో పరిశోధించి మూడు విశేషకాలను ప్రతిపాదించాడు. అవి i. విషయాలు(Content),ii. ప్రచాలకాలు (Operatons), iii.ఉత్పత్తులు(Products). ప్రతి విశేషకములోను కొన్ని ప్రత్యేక కారకాలుంటాయి. విషయాలలో 5కారకాలు, ప్రచాలకాలలో 5 కారకాలు, ఉత్పత్తులలో 6 కారకాలు వుంటాయి. ప్రత్తి వ్యక్తి ప్రజ్ఞను మూడు విశేషకాలను ఉపయోగించుకోవడం జరుగుతుంది. అంటే 5x5x6 =150 కారకాల సంయుక్త ప్రభావమే ప్రజ్ఞా అని గిల్‌ఫర్డ్ అభిప్రాయము.

**సాంస్కృతిక ప్రభావము లేని పరీక్షలు (Culture Fair Tests)**

CACPHT

ప్రజ్ఞా పరీక్షలలోని అంశాల సాధన భాష, సంస్కృతి వంటి పరిమితులు లేకుండా ఎక్కడైనా, ఎవరికైనా నిర్వహించడానికి వీలు కలిగి ఉండాలి. ఈ విధమైన పరీక్షలను'సంస్కృతీ ప్రభావములేని పరీక్షలు' అంటారు. ప్రజ్ఞా పరీక్షలలో వినియోగించే శాబ్ధిక పరీక్షలకు అనేక పరిమితులుంటాయి. ఉదాహరణకు దినార్ లేదా రూబుల్ ఎన్ని రూపాయలు అన్న బినే ప్రజ్ఞా మాపనిలో 5 సంవత్సరాల వారి కోసము వాడిన ఒక ప్రశ్న వినియోగము సరిగా తెలియని వారు ఆ ప్రశ్నకు సరిగా జవాబు చెప్పలేరు. దానికి సంస్కృతే కారణం. ఈ పరిమితులను అధిగమించడానికి శాబ్ధికేతర లేదా నిష్పాదన పరీక్షలు వాడుకోవచ్చు.

## 3.2.8 బహుళప్రజ్ఞ (Multiple Intelligence)

అనేక రంగాలలో రాణించే వ్యక్తులను మనము చూస్తుంటాము. ప్రతి వ్యక్తి ఏదో ఒక రంగములో ప్రావీణ్యతను కలిగి ఉంటారు. కొందరు చదువులో రాణిస్తే, కొందరు ఆటలలో ప్రావీణ్యతను చూపుతారు. కొందరు సంగీతము పట్ల మొగ్గు చూపితే కొందరు శాస్త్రవిజ్ఞానము వైపు ప్రజ్ఞను కనపరపస్తుంటారు. అయితే చాలా కొద్ది మందిలో ఈ వ్యక్తిగత ప్రజ్ఞ రకరకాలుగా వుండి రెండు గాని అంతకన్నా ఎక్కువగాని రంగాలలో ప్రావీణ్యత సాధించునట్లు చేస్తుంది. దానినే బహుళప్రజ్ఞ ఆనవచ్చు. మన తరగతి గదులలో ఉన్న విద్యార్థులలో కూడా కేవలము చదువు పట్లనే కాకుండా ఆటలు,పాటలు,సంగీతము,నృత్యము,డ్రాయింగ్,పెయింటింగ్ వంటి అనేక రంగాలలో రాణిస్తున్న విద్యార్థులు కూడా ఉంటారు.

చదువులో మంచి మార్కులు సాధించినప్పుడే వారిని ప్రజ్ఞావంతులని లేకపోతే వెనుకబడిపోయారని అంటుంటాము. ప్రతిభ లేదా ప్రజ్ఞ అంటే చదువులో రాణించడమైనా? ఇతర రంగాలలో రాణించి చదువులో ప్రతిభలేకపోతే వారు ప్రజ్ఞావంతులుకారా? వ్యక్తులు విభిన్న రంగాలలో రాణించడానికి గల కారణాలు ఏమిటి అన్న విషయాన్ని హోవార్డ్గార్డినర్(Howard Gardiner) అను శాస్త్రవేత్త తన గ్రంథము"Frames of Mind" లో బహుళ ప్రజ్ఞ అను సిద్ధాంతము రూపములో వివరించాడు.

హెూవార్డ్ గార్డినర్ ప్రకారము ప్రజ్ఞ అనేది వ్యక్తులలో రకరకాలుగా వుంటుంది. ఒక్కొక్క ప్రజ్ఞ ఒక్కొక్క నైపుణ్యాన్ని చూపుతుంది. ఈ నైపుణ్యాలు, ప్రజ్ఞ కలిసి ఒకదానితో ఒకటి ప్రతి చర్య జరుపుతూ సమస్యా పరిష్కారాన్ని సులువుగా చూపుతాయి. ఈ విలక్షణ లక్షణాల ఆధారముగా ప్రతిభ చూపిన వ్యక్తులపై పరిశోధనలు చేసి గార్డినర్, 8 రకాల ప్రజ్ఞల గురించి వివరించాడు. అవి:

**1. భాషా ప్రజ్ఞ (Language Intelligence)**

పదాల అమరిక, వాక్య నిర్మాణము , పదసముదాయ వినియోగంలో నైపుణ్యములు భాషా ప్రజ్ఞ అవుతాయి. పదాలను ధారాళముగా వాడగలగడం, వాక్యాలను వ్యాకరణ దోషాలు లేకుండా వ్రాయగలగడం వంటివి భాషా ప్రజ్ఞను సూచిస్తాయి. చక్కని భాష పటిమ, వాక్ చాతుర్యము దీనికి ఉదాహరణలు. గ్రంథ రచయితలు, కవులు, ప్రసంగీకులు మొదలైనవారు ఎక్కువ భాషా ప్రజ్ఞను ప్రదర్శించగలుగుతారు.

**2. తార్కిక గణితప్రజ్ఞ (Logical Intelligence)**

ఏ విషయాన్నైనా తార్కికముగాను, విమర్శనాత్మకముగాను ఆలోచించే వారు ఈ తార్కిక ప్రజ్ఞను కలిగి వుంటారు. వీరిలోఅమూర్తమైన ఆలోచన మరియు వివేచన ఉంటుంది. వీరు సంఖ్యలు, గుర్తులు బాగా వినియోగించడంతో పాటు, ఫజిల్స్‌ను బాగా సాధించగలుగుతారు. శాస్త్రవేత్తలు, గణిత మేధావులు, సామాజిక దార్శినికులు ఈ ప్రజ్ఞను ఎక్కువ కలిగి వుంటారు.

**3. ప్రాదేశిక ప్రజ్ఞ (Special Intelligence)**

మానసిక ప్రతిమలు,ఊహాత్మక నమూనాలు రూపొందించడము, ఈ రకమైన ప్రజ్ఞ. ప్రాదేశిక ప్రపంచాన్ని మనస్సులో నిక్షిప్తము చేసుకొని దానికి ఊహారూపం ఇవ్వగలరు. గణిత భావన ప్రకారము చెప్పాలంటే 3D కి సంబంధించిన జ్ఞాము అని అర్థము. శిల్పులు, చిత్రకారులు, భవన నిర్మాణ కారులు, డిజైనర్స్ మొదలగు వారిలో ఈ ప్రజ్ఞ అధికము. రాజా రవి వర్మ చిత్రాలు, అజంతా, ఎల్లోరా శిల్పాలు ఈ రకమైన ప్రజ్ఞకు చక్కని ఉదాహరణలు.

**4. సంగీత ప్రజ్ఞ (Misical Intelligence)**

సంగీతములోని సప్తస్వరాల పట్ల సరియైన ప్రతిభను చూపగలగడమే సంగీత ప్రజ్ఞ. లయ ప్రధానముగా సంగీతాన్ని సృష్టించ గలిగే వారిలో ఈ ప్రజ్ఞ ఎక్కువ. సంగీత వాయిద్యాలను చాలా సులువుగా వినియోగిస్తూ కొత్త అంశాలను సృష్టించే కళాకారులు, సుబ్బలక్ష్మి, లతామంగేష్కర్, బాల మురళీకృష్ణ వంటి గాయకులు, ఎ.ఆర్. రహమాన్, ఉస్తాద్ వంటి సంగీతకారులలో ఈ సంగీత ప్రజ్ఞ ఎక్కువ.

**5. శరీర చలనాంగాల విన్యాసప్రజ్ఞ (Bodily-kinestistic Intelligence)**

శరీరము, శరీరములోని వివిధ భాగాలను సులువుగాను, అర్థవంతముగాను నియంత్రించ గలిగే సామర్థ్యము కలిగి ఉండడమే శరీర విన్యాస ప్రజ్ఞ. డాన్సర్స్, అథ్లేట్స్, స్పోర్ట్స్ పర్సన్స్, జిమ్నాస్ట్స్ మరియు యోగా చేసే వారిలో ఈ ప్రజ్ఞ ఎక్కువ.

**6. వ్యక్తిగత సంబంధాల ప్రజ్ఞ (Inter Personal Intelligence)**

ఇతరులతో కలిమిడిగా ఉండగలడం, ఇతరుల భావాలు, ప్రేరణలు, కోరికలు అర్థము చేసుకోగలగడం వాటికి అనుగుణముగా ప్రవర్తించడం మొదలగునవి కలవారిలో ఈ రకమైన ప్రజ్ఞ వుంటుంది. మత బోధకులు, రాజకీయ నాయకులు, సంఘసంక్షేమ కార్యకర్తలు, సైకాలజిస్టులు మొదలగు వారిలో ఈ ప్రతిభ ఎక్కువ.

**7. అంతర వ్యక్తిగత ప్రజ్ఞ (Intra Personal Intelligence)**

వ్యక్తి తనను గురించితాను ఒక అంచనాకు రాగలగడమే అంతర వ్యక్తిగత ప్రజ్ఞ. అంటే వ్యక్తి తన అవసరాలను, ఉద్వేగాలను శక్తి సామర్థ్యాలకు తగ్గట్టు ఆరోగ్యకరమైన ఆత్మబావన, వ్యక్తిగత సర్దుబాటు, ఆత్మ సంతృప్తి కలిగి వుండడం. ఈ రకమైన ప్రజ్ఞ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి సహకరిస్తుంది. తత్త్వవేత్తలు, ఆధ్యాత్మిక చింతన, భావాలు కలవారు, ఈ రకమైన ప్రజ్ఞను కలిగిన వారు, యోగి వేమన, రామకృష్ణ పరమహంస, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మొదలగువారు.

### 8. ప్రాకృతిక ప్రజ్ఞ (Esthetic Intelligence)

ప్రకృతికి సంబందించిన అంశాల పట్ల సరియైన, సంపూర్ణ అవగాహన కలిగి ఉండడమే ఈ రకమైన ప్రజ్ఞ. ప్రకృతి అందాలు, సోయగాలు, రుచులు, సువాసనలు ఆశ్వాదించడము. ప్రకృతి ప్రేమికులలో ఈ రకమైన ప్రజ్ఞ ఎక్కువ. పక్షులు/జంతువుల ప్రేమికులు, వృక్షశాస్త్రవేత్తలు మొదలగువారు.

### బహుళప్రజ్ఞవికాసం – తరగతి అన్వయం:

- పిల్లల్లో వున్నా వివిధ రకాల బహుళప్రజ్ఞలను వెతికితీసే కృత్యాలను ప్రవేశపెట్టాలి.
- కేవలము తరగతి గది, పాఠ్యాంశాలే కాకుండా వ్యక్తిగత, సామాజిక అంశాల పట్ల కూడా దృష్టి పెట్టి ప్రోత్సహించాలి.
- ప్రశ్నలకు ఒకే జవాబు మాదిరి కాకుండా భిన్నమైన జవాబుల ఆలోచనకు అవకాశమివ్వాలి.
- తరగతి గది వాస్తవ విషయాలను అందిచాలి.
- పిల్లలలో గల బలాబలాలు,సాధ్యాసాధ్యాలను వారికి తెలియజేయాలి.
- సహజసామర్థ్యాలను, ప్రతిభను గుర్తించడానికి పిల్లలు అనేక కృత్యాలలో పాల్గొనేటట్లు అవకాశం ఇవ్వాలి.

## 3.2. సంజ్ఞానాత్మక వికాసదృక్పదాలు-వైయుక్తికబేధాలు

## (Perspectives of Coginitive Development- Individuval differeces)

పిల్లలలో సమాచార ప్రసారము, భాషా అభ్యసనము, ప్రత్యక్ష నైపుణ్యాలు, భావ ప్రాదాన్యతలు, అవధానవిస్మృతి వంటి భావనలు ఎలా విస్తరిస్తాయో అధ్యయనమే - సంజ్ఞానాత్మక వికాసము. పిల్లల శారీరక వయస్సు ఒకటిగా వున్నా వారిలో మానసిక స్థాయి ఎందుకు భిన్నముగా ఉంటుందనే అంశం ప్రధానముగా అధ్యయనం చేయడమే సంజ్ఞానాత్మక వికాసము.

తరగతి గదిలో ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకొని బోధిచడం అసాధ్యము. ఎందుకంటే వీరిలో సగటు అభ్యాసకులే కాకుండా నెమ్మదిగా అభ్యసించే 'మంద అభ్యాసకులు' మరియు వేగముగా అభ్యసించ గలిగే 'ప్రతిభావంతులు' వుంటారు. వీరితో పాటుగా కొంతశాతము శారీరక, మానసిక వైకల్యము కలవారు కూడా ఉంటారు. అందువల్ల వీరందరికి ఒకేరకమైన పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలు తయరుచేసినప్పటికీ బోధనా తీరులో భిన్నత్వము చూపాలి. దీని కోసము పిల్లలను ప్రత్యేకముగా అధ్యయనము చేయడానికి ఈ సంజ్ఞానాత్మక వికాసము చాలా ఉపయోగపడుతుంది.

విద్యార్థుల మధ్య అనేక అంశాలలో భేదాలు ఉంటాయి. ఒక్కొక్కప్పుడు సమరూప కవలలో సహితము ఈ బేధాలు వుంటాయి. అభ్యసన సామర్థ్యాలలోను, సాంఘిక, నైతిక, ప్రజ్ఞా వికాసాలలో వైవిధ్యాలు గోచరిస్తాయి. వీటినే వైయక్తికబేధాలు అంటారు. ఇవి వ్యక్తికి, వ్యక్తికి మాత్రమే కాదు ఒకే వ్యక్తిలో కూడా వివిధ అంశాల పట్ల వికాసములో తేడాలు గుర్తించవచ్చు. ఈ వైయక్తిక బేధాలను గమనిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించవలసి ఉంటుంది.

### 3.3.1. సామాజిక నేపథ్యాలు (Social Context)

మానవుడు సంఘజీవి. పుట్టింది మొదలు మరణించే వరకు ప్రతిరోదు, ప్రతిక్షణం తన చుట్టు ఉన్న పరిసరాల నుంచి ఏదో ఒక అంశాన్ని గ్రహిస్తువుంటాడు. గృహము, స్నేహితులు, సమవయస్కులు, పాఠశాల, సమాజము మొదలగునవి వ్యక్తి యొక్క సంజ్ఞానాత్మక వికాసమును ఎంతగానో ప్రభావితం చేస్తాయి. శిశువు పెరిగే నేపథ్యమును బట్టి వారి సంజ్ఞానాత్మక వికాసము. ఉన్నత లేదా నిమ్న స్థాయిలో వుండి పోతుంది.

పిల్లలు ఏదేశస్థులైనా, ఏ సమాజములోని వారైనా వారి యొక్క కుటుంబ, సామాజిక నేపథ్యాలతోనే అభివృద్ధి సాధిస్తారు. దీని వల్లనే పిల్లలు సర్ధుబాటు, పోటీతత్వము, కలుగోలుతనము వంటి భిన్నమైన సాంఘిక నైపుణ్యాలను అలవరుచుకొంటారు.

సంజ్ఞానాత్మక వికాసము యొక్క సామాజిక నైపథ్యాలు, వ్యక్తి యొక్క సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు పరస్పరం ఆధారపడి వుంటాయి. సమాజము యొక్క కట్టుబాట్లు, ఆచార్య వ్యవహారాలు, విలువలు సంస్కృతిలో ప్రతిబింబిస్తాయి. అవి వ్యక్తి సంజ్ఞానాత్మక వికాసమును ఎంతగానో ప్రభావితం చేస్తాము.

### 3.3.2 వైయక్తిక బేధాలు (Individual differences)

చారిత్రకంగా క్రీ.పూ. 5వ శతాబ్దములో ప్లేటో అను తత్త్వవేత్త ప్రతివ్యక్తి ప్రకృతిపరంగా కొన్ని ప్రత్యేకతలుంటాయని వాటి ప్రకారమే వారికి విద్య నందించాలని పేర్కొన్నాడు. అలాగే 18వ శతాబ్దములో తత్త్వవేత్త రూసో కూడా విద్యార్థుల వైయక్తికబేదాల కనుగుణముగానే బోధనా వ్యవస్థ వుండాలని తను రచించిన **'ఎమిలి'** గ్రంథములో పేర్కొన్నాడు. 1929 లో జాన్ డ్యూయి తన ప్రసిద్ద రచన 'Democrasi and Education" అను గ్రంథములో వ్యక్తిగత విద్యార్థుల బేధాలను నిర్మాణాత్మకంగా పోషించడం వల్లే దేశాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నాడు.

వైయక్తిక బేధాలను శాస్త్రీయ దృక్పథములో పరిశీలించిన మొట్టమొదటి శాస్త్రవేత్త ఇంగ్లండ్ దేశస్తుడు. 'ప్రాన్సిస్ గాల్టన్' (Sir. Francis Galton). ఇతని సుప్రసిద్ధ రచన 'ఇంక్వయిరీ ఇన్ టు హ్యూమన్ ఫాకల్టి అండ్ ఇట్స్ డెవలప్‌మెంట్' వైయక్తిక బేధాల అధ్యయనంలో తొలి రచన. గాల్టన్ తరువాత వైయక్తిక బేధాలపై బాగా కృషి సల్పిన వారు మెకిల్‌కాటిల్.

వైయక్తిక బేధాలు ఏర్పడడానికి రెండు ముఖ్య కారకాలున్నవి. అవి అనువంశిక మరియు పరిసరాల ప్రభావము. అలాగే తల్లిదండ్రుల ఆర్థికస్థాయి, పిల్లలపెంపకం, క్రమశిక్షణ, వారిపట్ల చూపే ఆప్యాయత, ఆనురాగము, ప్రేమాభిమానాలు మొదలైనవి చాలా వరకు వైయక్తికబేదాలకు కారణమవుతాయి.

### వైయక్తిక బేధాలు - రకాలు

వైయక్తిక బేధాలను సాధారణముగా రెండు రకాలుగా తెలుపువచ్చు. అవి:

1. అంతర వ్యక్తిగత బేధాలు(Inter Individual Differences),
2. అంత: వ్యక్తిగత బేధాలు(Intra Individual Differences)

**1. అంతర వ్యక్తి గత బేధాలు:-** ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తుల మధ్య ఉన్న వైవిద్యాలను 'అంతర వ్యక్తిగత బేధాలు' అంటారు. అభిరుచులు,వైఖరులు,ఆసక్తులు, అలవాట్లు, ఆలోచనలు, ఉద్వేగాలు, సహజాతాలు, కౌశలాలు, సాధన మూర్తిమత్వము వంటి అంశాలలో వ్యక్తుల మధ్య వైవిద్యాలు కనబడతాయి.

**2. అంత:వ్యక్తిగత బేధాలు:–** ఒకే వ్యక్తిలో వివిధ సామర్థ్యాల స్థాయిలో తేడాలను కలిగి ఉండడమే 'అంత:వ్యక్తిగత బేధాలు'. ఒక వ్యక్తి బాగా చదువగలడు కాని రాయలేడు. బాగాపాడగలడు కాని నాట్యము చేయలేడు. బాషలో పాండిత్యము గల వ్యక్తి గణితములో రాణించలేడు.

**వైయక్తిక బేధాలు అధ్యయనం వల్ల ఉపాధ్యాయునికి ప్రయోజనాలు**

వైయక్తికబేధాల పరిజ్ఞానము ఉపాధ్యాయునికి ఎన్ని రకాలుగా వినియోగపడుతుంది.

- విద్యార్థులలో వారావారి సామర్థ్యాలను గుర్తించి, దానికనుగుణంగా బోధనను కొనసాగించవచ్చు.
- పిల్లలకు చక్కని మార్గదర్శకత్వం చూపవచ్చు.
- విద్యార్థుల ప్రజ్ఞాస్థాయి, అభిరుచులు,వైఖరుల ప్రకారము భోధనా కృత్యాలను కొనసాగించవచ్చు.
- తరగతి నమూనా గతిశీలతలను అవగాహనచేసుకోవచ్చు.
- అమూర్త భావనలు పొందే పిల్లలలో ప్రత్యక్ష భావనలు ఏర్పరచడానికి ఉపయోగపడతాయి.
- బోధనా ప్రక్రియలో పిల్లలలో స్వతంత్ర ఆలోచనలు,సృజనాత్మకతను పెంపొందించడానికి దోహదపడతాయి.
- విద్యార్థి కేంద్రీకృత విద్యను కొనసాగించడానికి తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడానికి సహాయపడతాయి.

## 3.4 సంజ్ఞానాత్మక వికాస దృక్పధాలు

### 3.4.1 పియాజే సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతం (Piaget Theory of Cognitive Development)

వ్యక్తి సంజ్ఞానాత్మక వికాసాన్ని, నిర్మాణాన్ని, నిర్వహణను అవగాహన చేసుకోవడానికి స్విట్జర్లండ్ దేశస్తుడు. జాన్‌పియాజే (Jean Piaget) ఒక ఖచ్చితమైన చట్రాన్ని రూపొందించాడు. దీని ప్రకారము వ్యక్తి పుట్టినప్పటి నుంచి తన పరిసరాలతో ప్రతిచర్యలను జరుపుతూ ప్రపంచానికి సంబందించిన జ్ఞానాన్ని సంపాదించుకొనే చురుకైన పాత్ర పోషిస్తాడు. వ్యక్తి తన అనుభవాలను అర్థం చేసుకోవడానికి కొన్ని సంజ్ఞానాత్మక నిర్మాణాలు తోడ్పడతాయని వాటినే 'స్కిమాటా' (Scimata) అంటారని పేర్కొన్నాడు. స్కిమాటా అంటే వ్యక్తి యొక్క సంఘటిత ప్రవర్తన నమూనాలకు కారణమైన సంజ్ఞానాత్మక నిర్మాణాలు. వ్యక్తి పుట్టుకతోనే కొన్ని స్కిమాటాలను పొందివుంటాడు. ఉదాహరణకుశిశువు చనుపాలు తాగడం, పెదవులకు తాకించే ఏ వస్తువునైనా పీల్చుట, పట్టుకొనుట, తన్నుట మొదలైనవి.

**సంజ్ఞానాత్మక వికాస అంశాలు:–**

జీన్ పియాజే (Jean Piaget) తన సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతం తను పిల్లలను పరిశీలించి పిల్లలు ఏ విధంగా సంఖ్యా, కాలం, నైతికత, మొదలైన వాటి భావనలను ఏర్పరచుకొంటారని శోధించి రూపొందించాడు. పియాజే సంజ్ఞానాత్మక వికాసం గురించి అధ్యయనం చేసిన మొదటి మనో విజ్ఞానశాస్త్రవేత్త.

**పియాజే సిద్ధాంతం:**

– పిల్లల్లో జరిగే మానసిక అంశాలకు సంబంధించినది.

– సిద్దాంత వికాసం గురించి ప్రస్తావిస్తుంది కాని అభ్యసనం గురించికాదు.

– జ్ఞానాత్మక వికాసం నిర్ధిష్టదశలలో జరుగుతుంది – ప్రతి దశలో నిర్ధిష్టమాన ప్రవర్తనాంశాలు ఉంటాయని పేర్కొంటుంది.

**జ్ఞానాత్మక వికాసం:**

జీవ సంబంధ విషయాల పరిపక్వతలతో పరిసరాల అనుభవాల ఫలితంగా ఏర్పడే క్రమానుసార వ్యవస్థీకరణ వికాసమే – జ్ఞానాత్మక వికాసం అని పియాజే అభిప్రాయం.

పియాజే సిద్ధాంతంలో ముఖ్యమైన మూడు అంశాలు వివరిస్తుంది.

1. స్కిమాటాలు (Schema/Schemataw)

2. శిశువు ఒక దశ నుండి మరొక దశకు మారునప్పుడు/ వెళ్లేటప్పుడు శిశువుకు సాధ్యమయేటట్లు చేయగల సర్దుబాటు ప్రక్రియను గూర్చి వివరిస్తుంది. అందులో ముఖ్యమైన 3 ప్రక్రియలు,

1. విలీనం (Assimilation)
2. సానుకూలత (Accommodation)
3. సమతుల్యత (Eqilibrium)

81VT9I

**1. విలీనం అంటే:** (Gssimilation) తెలుసుకొంటున్న విషయాలు జ్ఞానాన్ని/భావనలకు అనువైన అంశాలుగా ముందున్న జ్ఞానంతో మిళితంచేయుట/గ్రహించుట/ఇమద్చుకొముట/కలుపుకొనుట

**2. సానుకూలత** (Accommodation): క్రొత్తగా తెలుసుకొంటున్న జ్ఞానం/ భావం, భావనలు గాని – ఇంతకు ముందున్న జ్ఞానంతో ఇముద్చుకొని/మిళితంచేసుకొని జ్ఞానాన్ని పునర్వ్యవస్థీకరించుకోవడం/కొనుట, ఉన్నత జ్ఞాన నిర్మాణం జరగడం.

**3. సమతుల్యత** (Eqilibrium): ప్రతిసారి నూతన అభ్యసన అంశాలు శిశువు స్వీకరించాలనుకున్నప్పుడు శిశువు ఒక అసమతుల్య స్థితికి లోనై విలీనం – సానుకూల ప్రక్రియల ద్వారా శిశువు సమతుల్యస్థితిని సాధించడంతో క్రొత్త జ్ఞాన నిర్మాణం జరుగుతుందని పియాజే పేర్కొన్నాడు. లేక ఉన్నత స్కిమాటాలు(Schema) ఏర్పడతాయని పియాజే పేర్కొన్నాడు.

ఉదా॥ ఒక విద్యార్థి త్రిభుజం గురించిన పాఠం విన్నాడు అనుకుందాం. విద్యార్థి ఈ విషయాల పట్ల అసమతుల్యతకు లోనవుతాడు. అప్పుడా విద్యార్థి త్రిభుజ లక్షణాలను గ్రహిస్తాడు. త్రిభుజ లక్షణాలను తెలిపే స్కిమాటాలు ఏర్పరుచుకుంటాడు. త్రిభుజం అంటే అదే జ్ఞాన నిర్మాణం జరిగింది. విలీనం చేసుకొని సానుకూలతతో ఒక స్కిమాటాలను తయారు చేసుకుంటాడు. సమతుల్యతను సాధించుకొంటూ మరలా ఇంకో తరగతిలో త్రిభుజంలోని రకాలు గురించి తెలుసుకొంటాడు అనుకుందాం.

అప్పుడు విద్యార్థి ఈ నూతన విషయాన్ని త్రిభుజంలోని రకాలను తనలో విలీనం చేసుకొంటాడు. విలీనం చెందిన విషయాలు ఇంతక ముందున్న Schemaలోకి సానుకూలత చెందాలి aceommodate కావాలి. అయితే విద్యార్థి ఒక నూతన స్కిమాటాలను రూపొందించుకొన్నాడన్నమాట

ఈSchemaలో త్రిభుజ లక్షణాలు త్రిభుజ రకాలు ఉంటాయి. ఇలా – విలీనం – సానుకూలతలను సాధించి సమతుల్య స్థితి పొంది సర్దుబాటు చేసుకొంటాడు. అంటే ఉన్నత క్రమ స్కిమాటాలను రూపొందించుకొన్నాడన్నమాట

ఇలా ఒక విషయం – త్రిభుజాల గురించిన జ్ఞానం పెరుగుతుంది. జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. జ్ఞాననిర్మాణం జరుగుతుందన్నది పియాజే అభిప్రాయం.

సమతుల్య స్థితి- త్రిభుజం గురించిన పాఠం ప్రారంభంతో

అసమతుల్య స్థితి-త్రిభుజ లక్షణాలను గ్రహిస్తాడు/అవగాహన చేసుకుంటాడు

- వితన ప్రక్రియతో
- సానుకూలత ప్రక్రియతో
- నూతన స్కిమాటాలను ఏర్పరుచుకొంటూ త్రిభుజం గురించిన జ్ఞాన నిర్మాణం జరిగింది. ఈ స్కిమాటా - ఒక రాతప్రతి / Index కార్ లాంటిది. ఇందులో త్రిభుజ లక్షణాలు ఉంటాయి.
- సర్ధుబాటు చేసుకొని సమతుల్య స్థితి
- త్రిభుజ రకాలు - తరగతి ప్రారంభం
- మరలా అసమతుల్యస్థితి
- త్రిభుజ రకాలు గ్రహించడం - అవగాహన చేసుకవోడం ఇంతకు ముందున్న త్రిభుజం గురించిన స్కిమాటాలోని
- విలీనం
- సానుకూలతలతో
- నూతనంగా ఉన్న క్రమ స్కిమాటాలను ఏర్పరుకోవడం
- సర్దుబాటు.
- సమతుల్యస్థితికి రావడం.

## సంజ్ఞానాత్మక వికాస దశలు:-

సంజ్ఞానాత్మక వికాసము క్రమంగా 4 దశలలో జరుగుతుందని పియాజే సూచించాడు. ఈ దశలలో పిల్లలు ఇంద్రియ చలనాత్మక చర్యలపై ఆధారపడే స్థితి నుంచి అమూర్త శిక్షణ చేయగల స్థితికి మారుతారని పియాజే చెప్పారు. అవి: 1. ఇంద్రియచాలకదశ 2. పూర్వ ప్రచాలక దశ 3. మూర్త ప్రచాలకదశ 4. అమూర్త ప్రచాలక దశ. వీటిని గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

### 1. ఇంద్రియచాలకదశ (Sensory Motor Stage)

ఈ దశ శిశువు పుట్టుక నుంచి 2 సంవత్సరాల అంతం వరకు ఉంటుంది. ఈ దశలో ముఖ్య లక్షణమైన భాషా రాహిత్యం వల్ల శిశువు పరిసరాలతో ఇంద్రియచాలక పరస్పర చర్యలకే పరిమితమై తన పరిసరాలలోని వస్తువులు, వ్యక్తులు, పరిస్థితులను గురించి అవగాహనను చేసుకుంటారు. అందువల్ల ఈ దశ ఇంద్రియచాలకదశగా పిలవబడుతుంది.

ఈ దశలో ఏర్పడే ముఖ్యమైన భావన **'వస్తుస్థిరత్వ భావన'** అనే ముఖ్య లక్షణం కనిపిస్తుంది. అంటే వస్తువు కనబడకపోయినా ఎక్కడో ఒక చోట ఉండివుంటుందని వెతకడం. 8నెలల శిశువు వస్తువు కనబడకపోతే దానిని వెతికే ప్రయత్నము చేయదు. అదే 10 నెలల శిశువు వెతుకుతుంది.

శిశువు ఇంద్రియజ్ఞానముతో స్పందిస్తూ కొన్ని సమన్వయ రాహిత్య పనులు చేస్తూ కదిలే వస్తువలపై దృష్టి నిలుపుతుంది. చేతులు తనవని పట్టుకొన్న వస్తువు తనపరిసర భాగము కాదని తెలుసుకొంటుంది. ఈదశలో పిల్లలు ప్రాక్‌భాషణ రూపాలైన ఎడుపులు, ఇంగితాలు, ముద్దుపలుకులు ఉపయోగిస్తూ తమ భావాలను ప్రకటిస్తారు. అందుకే ఈ దశను 'ప్రాక్ – భాషాదశ' అని కూడా అంటారు.

ఈ దశలో పిల్లలు ఇతరుల ప్రవర్తనను అనుకరిస్తారు. ఉదాహరణకు బాయ్, టాటా, నమస్తే చెప్పడం, పెద్దలు మాట్లాడేత తీరును అనుకరించడం, నటించడం చేస్తూ ఉంటారు. ఈ వయస్సులోని పిల్లలు భిన్న పద్ధతులను ఉపయోగించి వస్తువుల లక్షణాలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు. ఉదాహరణకు వివిధ వస్తువుల రంగు, రుచి, ఆకారాలు, అవిచేసే శబ్దాలను తమ జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహిస్తారు.

ఈ దశ అంతములో కనబడే మరొముఖ్యమైన ప్రవర్తనా లక్షణం యత్నదోష పద్ధతి కంటే అంతరదృష్టి ఆలోచనను ఎక్కువగా ఉపయోగిస్తారు. పరిశీలించగలగే కృత్యాల నుంచి ఆలోచన ద్వారా తమ సమస్యలను పరిష్కారాన్ని తెలుసుకుంటారు.

ఈ దశలో స్కీమాటా(Schemata)లు మానసికస్వభావంగా మారుతుంది. శిశువు కేంద్రీయ నాడీవ్యవస్థ అభివృద్ధి చెందడం వలన పరిసరాలకు అనుగుణంగా తనను మలుచుకోవడం ప్రారంభిస్తాడు.

## 2. పూర్వ ప్రచాలక దశ (Pre-operational Stage)

ఈ దశ 2 వసంత్సరం అంతము నుండి 7 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ దశ ప్రారంభంలో శిశువు ఇంద్రియాచాలక అన్వేషణకు బదులుగా సంకేతాలను, ప్రతీకలతో (పదాలు, పేర్లు, పరికరాలు) ప్రత్యక్ష చర్యలను చేపడతాడు. భాషను అభ్యసించడం వల్ల ఆలోచనలు, ప్రతీకాత్మక ప్రాతినిధ్య ఊహాచిత్రాల ఆధారంగా ఆలోచించగలుగుతారు.

దీనిని పూర్వభావనాత్మకదశ (Pre-conceptual Stage), అంతర్బుద్ధి ఆలోచనాదశ (Intuitive thought stage) అని రెండు ఉపదశలుగా విభజించారు.

**పూర్వభావనాత్మకదశ:** ఈ దశ 2 సంవత్సరాల నుండి 4 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ దశలో భాషా వికాసం చాలా వేగంగా ఉంటుంది. అందువల్ల భాషను, చిహ్నాలను, వస్తువులను ప్రతీకలుగా భావించి సమస్యాపరిష్కార సామర్థ్యంను పెంచుకొంటారు.

ఈ దశలోని పిల్లలు వస్తువులను గుర్తించి వాటి పోలికల ఆధారంగా వర్గీకరిస్తారు. ఈ దశలో రెండు లక్షణాలు కనబరుస్తారు. అవి: **1. సర్వత్మాక భావన**(Animism) **2. అహంకేంద్రీకృత భావన** (Egocentrism)

సర్వత్మాక భావన అంటే జీవంలేని వస్తువులకు శిశువు జీవాన్ని ఆపాదించడము. కదిలే వస్తులన్నింటికి ప్రాణం ఉండదని భావిస్తారు. ఉదాహరణకు శిశువు తమ బొమ్మకు కూడా ప్రాణం ఉన్నట్లుగా భావించి దానితో మాట్లాడుతూ, అన్నం తినిపించడం, సాన్నం చేయించడం, జడలు వేయడం చేస్తారు.

తన ముందున్న వాటినేగాక లేని వాటిని,తెలియని వాటిని ప్రతీకలుగా అంతర్గతము చేసుకోవడం ప్రారంభిస్తారు. ఎప్పుడు చూడని పులులు, సింహాలు, దయ్యాలు మొదలైన వాటి గురించి అంతర్గతము చేసుకొని మాట్లాడతారు. ప్రాణం వున్న, ప్రాణం లేని వస్తువుల తేడాను గుర్తించలేరు.

అహం కేంద్రీకృత భావన అంటే తన చుట్టూ ప్రపంచమంతా కేంద్రీకరించబడి ఉందనుకోవడం. తను నడుస్తుంటే తనతో పాటే సూర్యడు కూడా వస్తాడని నమ్మకం, తన ఆలోచనలు, తమ అభిప్రాయాలే ముఖ్యమని అనుకోవడం ఇతరులకు అవసరాలు, ఆలోచనలు, అభిప్రాయాలు ఉంటాయని అనుకోక పోవడం ఈ భావనయొక్క ముఖ్యలక్షణం.

**అంతర్బుద్ధిదశ:** ఈ దశలో పిల్లలు వస్తువులను పోల్చడం, సామ్యాలను, వైషమ్యాలను గుర్తించడం, వర్గీకరించడం, సమాన్యీకరించడం లాంటి మానసిక చర్యలను మెరుగ్గా చేపట్టగలరు. ఉదాహరణకు ఆపిల్స్, ఆరెంజి, అరటి, బత్తాయి, నిమ్మ, ద్రాక్ష లాంటి పండ్లను రంగు, రుచి, ఆకారాల ఆధారంగా వర్గీకరించగలుగుతారు. అవన్నీ పండ్లని సామాన్యీకరించగలుగుతారు.

సమస్యను పరిష్కరించగలిగే సామర్థ్యం ఉన్నప్పటికి దానిని వివరించే వికాసం పూర్తిగా పొంది ఉండరు. ఈ దశలో కనబడే మరో భావనను **పదిల పరుచుకొనే భావన లోపం** మరియు **అవిపర్యయాత్మక భావన లోపం**.

**పదిలపరుచుకొనే భావన లోపం:** సాధారణంగా ఒక వస్తువు బాహ్య ఆకారంలో మార్పులు తీసుకువచ్చినప్పటికి ఆవస్తువుయొక్క గుణాలలో మార్పులు ఉండవు అనే భావనను పదిలపరుచుకొనేభావన అంటారు. కాని ఈ దశలోని పిల్లలకు ఈ భావం ఏర్పడదు. ఉదాహరణకు రెండు సన్నని పొడవు గ్లాసులలో సమానంగా నీరు పోసి చూపించి అందులో ఒక గ్లాసులోని నీటిని తీసుకొని వేరొక పొట్టి, వెడల్పయిన గ్లాసులో ఆనీటినిపోసి నీరు ఎందులో ఎక్కువ ఉందని అడిగితే పొడవైన గ్లాసులోనే నీరు ఎక్కువగా ఉందని చెపుతాడు. ఈ భావననే పదిలపరుచుకొనే భావనలోపం అని అంటాం.

**అవిపర్యయాత్మకభావనలోపం:** ప్రతి తార్కిక కార్యాన్ని తిరిగి చెప్పవచ్చు అనే భావనలేకపోవడం ఉదాహరణకు ఒకే పరిమాణం, ఆకారం, లక్షణాలున్న ఉన్న రెండు మట్టి గోళాలను చూపించి ఒక దాని ఆకారాన్ని మార్చినప్పుడు దాని లక్షణాలలో పరిమాణాలలో మార్పుచెందుతుంది అన్న భావనే అవిపర్యయాత్మక భావన.

### 3. మూర్త ప్రచాలకదశ (Concrete Operationa Stage)

ఈ దశ 7 సంవత్సరాల నుండి 11 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ దశలో పిల్లలు తమ ముందు వాస్తవంగా కనిపించే వస్తువులనే కాకుండా మెదడులో ఉండే భావాలను, ఉద్దేశ్యాలు, లక్షణాలు ఉపయోగించి కూడా నేర్చుకొంటారు. ఈ దశలోని పిల్లలు వస్తువుల గురించి తెలుసుకుంటారు. ఆలోచించగలిగి వాటి మధ్య ఉన్న సంబంధాలను బేధాలను గుర్తించగలుగుతారు. ఉదాహరణకు ఒక త్రిభుజము ఒక చతుర్రసం మధ్యగల, లేక ఒక పక్షి ఒక జంతువు మధ్యగల సంబంధాలను, బేధాలను, పోలికలను గుర్తించగలుగుతారు. ఈదశలో పిల్లల ఆలోచనలు ఎక్కువ తార్కికంగా, క్రమబద్ధంగా, విచక్షణంగా కూడా ఉంటాయి. ఆగమనాత్మక, నిగమనాత్మక ఉపగమాలను ఉపయోగిస్తారు. పిల్లల ఆలోచనాక్రమం అహం కేంద్రీకృత ఆలోచనలు తగ్గుతూ ఇతరులు కూడా తన లాంటి భావనలు, అనుభవాలు ఉంటాయని అభిప్రాయానికి వస్తారు. ఇతరుల దృష్టితో చూడడం ప్రారంభిస్తారు.

ఈ దశలో కాల, స్థల, సంఖ్యా భావనలేర్పడి వస్తువులను అన్ని కోణాల నుంచి అవగాహన చేసుకొని తార్కికంగా ఆలోచిస్తారు. ఇతరుల దృష్టి నుంచి కూడా ఆలోచించి, అవగాహన చేసుకొని, సర్దుబాటు పాటిస్తారు. సమస్యా పరిష్కారశక్తి ఉండదు. సత్యము – అసత్యము, హింస–అహింస, నీతి–అవినీతి, దేశభక్తి వంటి అమూర్త భావనల గురించి సంపూర్ణంగా ఆలోచించలేరు.

**4. అమూర్త ప్రచాలకదశ (Formal Operational Stage)**

ఈ దశ శిశువుల11వ సంవత్సరం నుండి ఈ దశ ప్రారంభమౌతుంది. తార్కిక ఆలోచనల ద్వారా అమూర్తంగా వ్యవహరించడంతో పిల్లలు మానసిక ప్రచాలనాల ద్వారా సమస్యలను అర్థం చేసుకోగలరు. విషయాలను ఒక స్థితి నుంచి మరొయొక స్థితికి బదలాయించగలరు. అంటే శాబ్దికంగా ఉన్న విషయాన్ని చిత్రాల రూపంలో లేక పట్టికల రూపంలో మార్చగలరు లేదా చిత్రాలు, పటాల రూపంలో ఉన్న దానిని శాబ్దిక రూపంలోనికి మార్చగలరు.

ఈ దశలోని పిల్లలు ప్రకల్పన, నిగమనాత్మక, వివేచనం చేయగలరు. కార్యకారక సంబంధం గురించి ఆలోచించగలరు, సమస్యలకు పరిష్కారమార్గాలు ఉంటాయని గ్రహించగలరు. ఈ దశలో ప్రజ్ఞ బాగా వికాసము చెందడంతో అమూర్త ఆలోచనలు వస్తాయి. దైనందిన జీవితములోని మూల సూత్రాలను గమనిస్తూ చక్కగా అవగాహన చేసుకొంటారు.

### విద్యా ప్రాధాన్యత (Educational Importance):-

- వివిధ దశలలో మానసిక వికాసము స్పష్టముగా ఉండడం వల్ల బోధనాభ్యసన కృత్యాలను తయారు చేసి సమర్థవంతముగా బోధించవచ్చు.
- పిల్లల మానసిక వికాసానికి అనుగుణముగా పాఠ్య ప్రణాళికలను తయారుచేయవచ్చు.
- మానసిక పరిస్థితిసరిగాలేని పిల్లలకు సరియైన మార్గదర్శకత్వం, మంత్రణము ఇవ్వవచ్చు.
- సహజ, వాస్తవ వాతవరణములో అభ్యసన జరుపవచ్చు.
- అమూర్త భావనలను పెంపొందించవచ్చు.
- తరగతిలో వచ్చే సమస్యల పరిష్కార మార్గాలను పిల్లలే చేయునట్లు ప్రోత్సహించవచ్చు.
- పిల్లలు తామే స్వయంగా కొన్ని పనులు నిర్వహించేటట్లు అవకాశాలు కల్పించవచ్చు.

**3.4.2 వైగోట్ స్కి నిర్మాణాత్మక సిద్ధాంతము:** లెక్ సెమోనోవిచ్ వైగోట్స్కి(Lev Semonivich Vygotsky) రష్యా దేశస్థుడు. విద్యావంతుడు. వైద్యశాస్త్రాన్ని - న్యాయశాస్త్రాన్ని అభ్యసించినవాడు. ఎక్కువగా సాహిత్య, తత్త్వశాస్త్ర విషయాల విశ్లేషణలతో ఎక్కువ కాలం గడిపేవాడు. తత్ఫలితంగా ఏర్పడిన సిద్ధాంతమే - సాంఘిక - సాంస్కృతిక సిద్ధాంతం (Soceio - Culture -Theory) ఈ సిద్ధాంతం జ్ఞాన నిర్మాణాత్మక వాదానికి (Cognitive - corstpctivison) ఉతమిచ్చింది.

వైగోట్స్కీవాదము - నిర్మాణాత్మక వాదంలో కొన్ని ముఖ్యాంశాల గురించి తెలుసుకుందాం.

"జ్ఞానం వికాసం" అన్నది వ్యక్తి సాంఘికంగా జరిపే పరస్పర క్రియల(Interaction) ద్వారా సంభవిస్తుంది.

- వ్యక్తిలో ఉన్నత క్రమ మానసిక ప్రక్రియలు ఏర్పడడం అన్నది అతను సంఘం/సమాజంతో నెరిపే సాంఘిక ప్రక్రియల ఫలితమే.
- వ్యక్తి ఉన్న పరిసరాలు/సమాజం అతని ఆలోచనలను ప్రభావితం చేస్తుంది.

– జ్ఞానాత్మక వికాసంలో భాష, భాషణం ముఖ్య పాత్రను పోషిస్తుంది.

– వైగోట్స్కీ ప్రకారం – శిశువు శైశవదశలో ఉన్నప్పుడు అతని ఆలోచనలు, భాష వేరు వేరు ప్రక్రియలు, కాని 3 – 4 సం॥కల్లా భాష – ఆలోచన ప్రక్రియలు కలిసిపోతాయి. శాబ్దిక ఆలోచనలను పెంపొందిస్తుంది. శిశువుల జ్ఞానాత్మక వికాసంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమని వారే పిల్లలకు సామాజిక అంశాలను అందించి వాటిని అంతర్గతీకరణం (Internalize) చేయిస్తారు.

పిల్లలు/శిశువుల పుట్టుకతోనే కొన్ని ప్రాథమిక (Basic) సామర్థ్యాలతో పుడతారని అవే వారి బౌద్ధిక వికాసంనకు ఉపయోగపడుతుందని అన్నాడు. అవి: 1. అవధానం(attention) 2. సంవేదనలు(Sensation) 3. ప్రత్యక్షం(Perception) 4. స్మృతి (Memory) వీటిని ఉపయోగించుకుంటూ / సమాజం / సంఘంలో ప్రతి చర్యలు(Interaction) జరుపుకుంటూ ఉన్నతక్రమ మానసిక సామర్థ్యాలను – విశ్లేషించడం, సంశ్లేషించడం, మదింపుచేయడం, విభిన్నంగా ఆలోచించడం మొ॥ పెంపొందించుకుంటాడని పేర్కొన్నారు.

– వైగోట్స్కీ ప్రకారం శిశువుల అభ్యసంనేర్పు – సామర్థ్యంగల బోధకుడుతో ప్రతి చర్యలు జరపడం వల్ల జరుగుతుందన్నాడు. దీనినే సహకార సంభాషణ అని అన్నాడు. ఉదా॥ ఒక అబ్బాయి సుడోకు చిక్కును (Sudnko Przzle) సాధిస్తున్నాడనుకొందాం. అబ్బాయి తనకు తానుగా కొంత వరకు చేయగలిగాడుగాని పూర్తి చేయ లేక పోయాడు అప్పుడు అతని తండ్రి నేర్పు–సామర్థ్యంగల వ్యక్తిగా చర్చించడం, వివరించడం చేసి చూపడంతో ఆ శిశువు చిక్కును సాధించడం నేర్చుకుంటాడు.

వైగోట్స్కీ సిద్ధాంతంలో 2 ముఖ్య విషయాల్ని గుర్తింకోవాలి.

**1. అన్యమైన ఉన్నత జ్ఞాన వనరు** (More knowledge able other)MKO):

పిల్లల్లో అభ్యసనం – అన్యమైన ఉన్నత జ్ఞాన అంశంతో ప్రతిచర్యలు జరపడం వల్ల సంభవిస్తుంది. ఆ అంశం తల్లిదండ్రులు కావచ్చు, ఉపాధ్యాయుడు కావచ్చు, పెద్ద పిల్లలు కావచ్చు – సాంఘిక సాధనాలైన డిక్షనరీ, ఎన్‌సైక్లోపిడియా, ఇంటర్‌నెట్‌లు గ్రంథాలయంలోని పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కావచ్చు.

**2. సామీప్యవికాసబేధం / క్షేత్రం** (Zone of Proximal Development):

ఒక విద్యార్థి/వ్యక్తి/శిశువు ఒక విషయాన్ని సంపూర్ణంగా అభ్యసించే సామర్థ్యం ఉన్నా తనకు తానుగా కొంత మేరకు నేర్చుకోగలడు. కాని తన కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వ్యక్తి (MKO) ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులుగాని, స్నేహితులుగాని, – నెట్, DTC, Encyclo pedia లసహకారంతో సంపూర్ణంగా నేర్చుకోగల్గుతాడు. అంటే తనకు తానుగా నేర్చుకున్నదానికి – ఇతరుల సహకారంతోస ంపూర్ణంగా నేర్చుకోవడానకి మధ్య సామీప్యవికాసభేదాన్ని Zone of Proximal Development అంటారు.

వైగోట్స్కీ తన సిద్ధాంతంలో పేర్కొన్న మరొక ముఖ్య అంశం “స్కఫోల్డింగ్” స్కఫోల్డింగ్ అంటే ‘సారువ’ అని అర్థం. సాధారణంగా పెద్ద పెద్ద బిల్డర్‌లు, వంతెనలు, ఫ్లైఓవర్ పైభాగాలు కట్టినప్పుడు బిల్డర్‌లు “సారువ” సహాయంతో నిర్మిస్తారు.

అలాగే శిశువుల జ్ఞాననిర్మాణంలో MKO సారువలవలే సహాయ సహకారలు అందించి తగ్గించి ఉన్నత జ్ఞాన నిర్మాణానికి దోహదపడుతారన్నది వైగోట్స్కీ అభిప్రాయం.

భాషకు సంబంధించి వైగోట్స్కీభావన:

శిశువు సాంఘిక ప్రతిచర్యలు జరపడని భావ ప్రసారానికి భాష అవసరం భాష సాంఘిక వాతావరణంలోనే వికసిస్తుంది. జ్ఞానాత్మక వికాసంలో భాష రెండు ప్రధాన పాత్రలను పోషిస్తుందన్నాడు.

1. పెద్దలు, తల్లిదండ్రులు, పిల్లలకు సమాచారాలను అందించడానికి భాష ముఖ్య సాధనం.

2. శిశువులకు వారి భాష తమ జ్ఞాన నిర్మాణానికి ఒక సాధనం అవుతుందని అభిప్రాయపడ్డాడు.

భాష వల్ల తన చుట్టూ ఉన్న వస్తువులు, వ్యక్తులు, పరికరాలు, సామాగ్రి, సామాజిక అంశాలకు 'పేరు' ఉంటుందని, ప్రతిదీ ఏదో విధంగా ఉపయోగపడుతుందని గ్రహిస్తారు.భాషను మాట్లాడే తీరును బట్టి జరిగే ప్రక్రియలను ఇలా పేర్కొంటాడు. అవి: 1. సాంఘిక భాషణం 2. వ్యక్తిగత-స్వీయభాషణ Out Speech - బాహ్యా భాష - అంతర్భాషణంInner Speech సాంఘిక భాషణం - శిశువు ఇతరులతో మాట్లాడానికి ఉపయోగపడే సాంఘిక ప్రతిచర్యలు జరపడానికి వ్యక్తి స్వీయ మార్గదర్శకత్వం కొరకు రెండు రకాల భాషణంను ఉపయోగిస్తారు. అవి

**బాహ్యాభాషణం:-** తనకు తానుగా బంటరిగా, గట్టిగా మాట్లాడుకోవటం సాధారణంహా చిన్న పిల్లల్ని గమనించినట్లయితే ఆటలో ఉన్నప్పుడు తరుచుగా తమకు తామే మాట్లాడుకుంటుంటారు. ఇది వారి ఆలోచనలను స్వీయ నిర్దేశనం చేస్తుంది. మార్గదర్శకం చేస్తుంది. పెద్దలు కూడా ఒక్కొక్కసారి సమస్యలు ఒంటరిగా మాట్లాడుకోవడం గమనిస్తుంటాం.

**అంతర్భాషణం:** శిశువులు ఎవరైతే Private Speech ను ఎక్కువగా ఉపయోగించేవారు మెరుగైన సాంఘిక సామర్థ్యాలను కలిగి ఉంటారు. తమలోతామే మాట్లాడుకోవడం జరుగుతుంది. కాని నిశ్శబ్దంగా, మానసిక అంతరాలల్లో మాట్లాడుకుంటూ ఆలోచిస్తారు. అంతర్భాషణంతో ఇతరులతో సంభాషించరు. శిశువు వయస్సు పెరిగే కొద్ది బాహ్యాభాషణం (Out Speech )మెల్లగ అంతరీకరణం చెంది Innter Speech అంతర్భాషణంగా వికసిస్తుందని వైగోట్స్కీ పేర్కొన్నాడు.

## 3.5 భావనోద్భమును ఏర్పరుచుటలో సదుపాయాలు (Facilitating Concept Formation)

### 3.5.1. పిల్లల ఆలోచనలతో భావనా నిర్మాణము చేయుట (Building on Children:s Existing ideas)

జీవితములో ప్రతిరోజూ ఏదో ఒక విషయము లేదా అంశము లేదా వస్తువులను చూస్తూనే వుంటాము. మనము గమనించే ఆ అంశాలపట్ల మనకుండే అవగాహననే 'భావన' అంటారు. అంటే వస్తువుపట్ల గాని, విషయముపట్లగాని మనం ఏర్పరుచుకొనే సామాన్య భావమే 'భావన' అని ఇంతకు ముందే తెలుసుకున్నాము. ఉదా: పుస్తకము, పిల్లి, దేవుడు.అంటే ఒక వస్తువును చూపినపుడు లేదా పేరు చెప్పినప్పుడు వాటిపై ఉన్న అవగాహనతో తెలుసుకుంటాము.

భావన అనే పదము వస్తువులను, సంఘటనలకు సామాన్య ధర్మాన్ని నిర్దేశిస్తుందని మనము గమనించాము. అనగా సామాన్యీకరించిన భావమే భావన అని అర్థము. ఏదైనా జంతువును చూచినపుడు అది శాఖాహారి జంతువా? లేక మాంసాహారి జంతువా? అని గుర్తించగలగడం. అలాగే అది సాదు జంతువా? లేక క్రూర జంతువా? గుర్తించగలగడం. అంటే ఒక విషయము లేదా అంశాన్ని గురించి చెప్పినప్పుడు వాటి సామాన్య ధర్మాలను చెప్పగలగడమే భావనోద్భవము అని చెప్పవచ్చు. ఉదాహరణకు సింహం పేరు చెప్పినప్పుడు దాని లక్షణాలతో వివరించడం భావనోద్భవము యొక్క ఫలితమే.

పిల్లలలో పాఠశాల అనగానే, బడి అని గుర్తుకురావడం. అందులో ఉపాధ్యాయుల, విద్యార్థులు, ఆటస్థలము, పాఠ్యపుస్తకాలు మొదలైనవి గుర్తుకు రావడం, పాఠశాల భావన ఏర్పరుచుకొనేటప్పుడు పిల్లలు పేరుకు ప్రాధాన్యత ఇవ్వరు. కేవలం వాటి లక్షణాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. తమ పరిసరాలలోని అంశాలను పరిశీలించుట ద్వారా పిల్లలలో ఈ అవగాహన ఏర్పడుతుంది. పాఠశాల గురించిన ఆలోచనలను ఏర్పరుచుకొని వాటిని ఒక క్రమ పద్దతిలో అవగాహన చేసుకొంటారు. దీనినే భావన నిర్మాణము అనవచ్చు.

భావన నిర్మాణము ⇒ పరిశీలించడం అవగాహనచేసుకోవడం ఆలోచించడం ఆలోచనలు క్రమీకరించుకోవడం.

జ్ఞానేంద్రియాలు,మూర్త అనుభవాలు, ప్రజ్ఞ వంటివి భావనోద్భవానికి బాగా తోడ్పడతాయి. పిల్లలు పరిశీలన ద్వారా కొన్ని అంశాలను పరిశీలించినపుడు సంపూర్ణ అవగాహన ఏర్పడవచ్చు. ఏర్పడకపోవచ్చు. పరిశీలించిన అంశాలను వివరించడం, ఇతర అంశాలతో వాటికి గల సంబంధాలను అవగాహన చేసుకోవడం, ఆలోచించడం, ఆలోచనలు క్రమపరచుకోవడం ద్వారా భావనోద్భవము ఏర్పడుతుంది. భావనోద్భవము అభ్యసనను ఎక్కువగా ప్రభావితము చేస్తుంది. సరియైన భావనలు ఏర్పడకపోతే అభ్యసన అస్పష్టముగా ఉండి విషయము సరిగా అర్థముకాదు.

### 3.5.2 బంధాలను ఏర్పరచడం (Making Connections)

భావనల మధ్య బంధాలను ఏర్పరచడము భావనోద్భవములో ఒక ముఖ్య అంశము. కొత్త భావనలు ఎదురైనపుడు పిల్లలు అప్పటికే ఏర్పరుచుకొని వున్న పాత భావనలతో వాటిని అనుసంధానము చేసుకొని అవగాహన చేసుకొంటారు. దీనివల్ల భావన నిర్మాణము జరిగి భావనలు త్వరగా ఏర్పడి అవి స్థిర పడిపోతాయి.

### 3.5.3 భావనలు ఏర్పరచడం - అర్థవంతం చేయడం (Making Meanings)

మెరుగైన భావన నిర్మాణము జరగాలంటే విషయాలు/వస్తువుల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. సరియైన, ఖచ్చితమైన అర్థమును పొందినపుడే పిల్లలు భావనలను ఏర్పరుచుకోగలరు తద్వారా నిజ జీవితములో వినియోగించుకోగలరు. ముందుగా సులభతర అంశాలను అవగాహన చేసికొన్నప్పుడే సంక్లిష్ట అంశాలు అవగాహనతో భావనోద్భవము జరుగుతుంది.

### 3.5.4 భావనలు ఏర్పరచడంలో సంబంధాలు (Relationships)

రెండు గాని అంతకన్నా ఎక్కువగాని విషయాలు / వస్తువుల మధ్య సంబంధాలను గుర్తించడం ద్వారా కూడా పిల్లలు భావనలను ఏర్పరుచుకొంటారు. అంటే వస్తువులు లేదా విషయాల మధ్య పోలికలు, బేధాలు గుర్తించడం, లక్షణాలను పోల్చడం, వంటి గుణాలలోని అంత:సంబంధాలను బట్టి భావనలను గుర్తించడం జరుగుతుంది. ఉదాహరణకు తెల్లని పాలు, నల్లని జుట్టు, పదునైన కత్తి వంటి భావనలతో రెండేసి లక్షణాలు ఉన్నప్పటికీ వాటి మధ్య దగ్గర సంబంధము ఉంది. అందువల్ల వస్తువుల మధ్య ఇలాంటి సంబంధాల వలన భావనలు సులభంగా ఏర్పడతాయి.

### 3.5.5 ఉన్నత భావాలు (Big Ideas)


అసాధ్యమైన,మన్నన పొందగలిగే ఏదైనా ఒక ప్రతిపాదన లేక ప్రణాళికనే 'ఉన్నత భావము/ గొప్పఆలోచన' అంటారు. ఉదాహరణకు మన రాష్ట్రంలో జరిగే Inspire Awards కొరకు పాఠశాలల్లో పెద్ద ఆలోచనలతో పోటీలో పాల్గొంటారు. దీనినే గొప్ప ఆలోచనలు అని, ఉన్నత ఆలోచనలు అని అంటారు. విభిన్న అంశాల మధ్య గందరగోళ పరిస్థితులలో ఉన్నప్పుడు ఆ అంశాల నుండి అర్థవంతమైన సంతోషాన్నిచ్చే ఆలోచననే 'గొప్ప ఆలోచన' అనవచ్చు. గణిత సూత్రాలు, సైన్స్ సిద్ధాంతాలు ఉన్నత భావాలు/ గొప్ప ఆలోచనలకు ఉదాహరణ.

## 3.5.6 భావనా చిత్రాలు (Concept Maps)


జ్ఞాన నిర్మాణానికి, సమాచార నిర్వహణకు విషయాన్ని చిత్ర రూపములో వివరించుటకు తోడ్పడునవే 'రేఖాత్మక నిర్వహణ'. ఇవి తక్కువ స్థలంలో ఎక్కువ అవగాహన కల్పిస్తూ భావనా నిర్మాణాలను ఏర్పరుస్తాయి. విషయములోని సంబంధాలను, తారతమ్యాలను,లక్షణాలను, స్వభావాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో సులువుగా అందిస్తుంది. పెద్ద పెద్ద అంశాలు/ విషయాలను చిన్న చిన్న చిత్రాల ద్వారా ప్రదర్శించి అవగాహన పరచడమే రేఖాత్మక నిర్వహణల ముఖ్య లక్షణము.

అభ్యసనాంశాలను రేఖాత్మకంగా నిర్వహించడానికి అనేక రూపాలున్నాయి. విషయాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయుడు ఉపయోగించుకోవాలి. అందులో రకాలు

1. అభ్యసన అంశాల మధ్య "సంబంధాలను" తెలిపే రేఖాత్మకచిత్రణం.




2. అభ్యసన అంశాల మధ్య "వర్గీకరణను" వివరించే రేఖాత్మక చిత్రణం.




3. అభ్యసన అంశాల మధ్య ఉన్న లక్షణాలను "పోల్చే" రేఖాత్మకచిత్రణం.

ఉదాహరణ వెన్ డయాగ్రమ్





1. పక్కనున్న రేఖాచిత్రాన్ని వివరించండి.


4. అభ్యసన అంశాల "క్రమమును" వివరించే రేఖాత్మకచిత్రణం.

ఉదాహరణకు గొలుసు చిత్రాలు మరియు వలయచిత్రాలు

గొలుసుచిత్రం అనగా ఒక అంశాన్ని పొడిగించుకొంటూ పోతూ భావనలను చూపే చిత్రము.




వలయచిత్రం అనగా భావన ఒక అంశముతో మొదలై సంబంధాల ద్వారా చివరికి మొదటి అంశమును చేరడాన్ని చూపే చిత్రము.





5. భావనోద్భవన రేఖాత్మకచిత్రణం.

ఉదాహరణకు ఫ్లోచార్టు ఈ చిత్రము ద్వారా ఒక విషయంలోని అంశాలను క్రమపద్ధతిలో అమర్చి చూపించవచ్చు.



ఉదాహరణకు చెరువు గురించి మీకు తెలిసినది చెప్పండి అని అడిగినపుడు పిల్లలు తమకున్న అనుభవాలను తెలుపుతారు. వాటిలోని కీలక పదాలతో ఇలా **మైండ్‌మ్యాపింగ్** తయారవుతుంది. (మానసిక చిత్రం)




మానసిక చిత్రంలోని ఏదైనా ఒక భావన గురించి స్పష్టంగా ఒక క్రమములో ఆలోచింపజేయడాన్ని **కాన్సెప్ట్‌మ్యాప్** (భావనాత్మక చిత్రం) అంటారు.

చెరువు - చేపలు పట్టడం

- గాలం తీసుకోవడం
- చెరువుకు వెళ్ళడం
- గాలానికి ఎరను గుచ్చడం
- గాలం నీళ్ళలోకి విసరడం
- గాలాన్ని పైకి లాగడం
- గాలానికి చిక్కిన చేపను తీసుకోవడం
- బుట్టలో వేసుకోవడం
- అమ్మడం/కూర చేయడం

మానసిక చిత్రంలోని ఒక భావనకు సంబంధించిన అనుసంధాన భావనలను ఆలోచింపచేయడాన్ని కాన్సెప్ట్‌వెబ్ (భావనా జాలకం) అంటారు.




పై రేఖాత్మక చిత్రాలే కాకుండా ట్రీచార్ట్లు, ఫిష్ బోన్ డయాగ్రమ్ , టైమ్‌లైన్ మ్యాపింగ్ చిత్రాల ద్వారా భావనోద్భవమును కలిగించవచ్చు. ఇలాంటి రేఖాత్మక చిత్రాల ద్వారా పాఠ్యాంశ బోధనచేసి భావనోద్భవ భావన కలిగించాలి.

- రేఖాత్మక చిత్రణంను ఉపయోగించి బోధనను చేపటడం వల్ల ప్రయోజనాలు ఏమిటంటే అభ్యసించిన అంశాలు/ సమాచారం ఎక్కువ రోజులు ధారణలో ఉంటుంది. సులభంగా పునస్మరణ చేసుకోవడానికి వీలౌవుతుంది.
- విద్యార్థులలో పఠన అనగాహనను పెంపొందిస్తుంది.
- వివిధ విషయాంశాలను అభ్యసించడం సులభతరం అవుతుంది. అభ్యసన సాధనను పెంచుకోగల్గుతారు.

- విద్యార్థులలో ఉన్నత క్రమ మానసిక ప్రక్రియలకు ఆలోచనలకు - జ్ఞాన నిర్మాణానికి దొహదపడుతుంది.

కావున ఉపాధ్యాయులు తమ పాఠ్యాంశాలకు అనుగుణంగా రేఖాత్మక చిత్రణంను గీసి - విద్యార్థుల చేత గీయించాలి. విద్యార్థులలో జ్ఞాననిర్మాణానికి దొహదపడాలి.

## 3.5.7 అనుభావాత్మక అభ్యసనము (Experiential Learning)

శిశువు/విద్యార్థులు తన జ్ఞానేంద్రియాల ద్వారా పరిసరాల నుంచి జ్ఞానాన్ని పొందుతూ దాని ద్వారా అనుభవాలను పొందుతారు. ఈ అనుభవాలు పరిసరాలు ద్వారా లేదా చుట్టుప్రక్కల వ్యక్తుల ద్వారా గ్రహిస్తారు. వ్యక్తిగతంగా చూడడం, తాకడం, చేయడం లాంటి ప్రత్యక్ష అనుభవాలు, ఇంకొకరు చెపితే వినడం ద్వారా పరోక్ష అనుభవాలు ఏర్పడతాయి. ప్రత్యక్ష అనుభవాల వల్ల ఏర్పడే భావనలు పరోక్ష అనుభవాల కంటే ఎక్కువ కాలము గుర్తుంటాయి.

అనుభవాలే అభ్యసనానికి ప్రధాన మూలము. ఈ అభ్యసనానుభావాలు ఎంత ప్రభావముగా ఉంటే అభ్యసన అంత ఎక్కువగా జరిగి, ఎక్కువ కాలము జ్ఞప్తియందు ఉంటాయి. జ్ఞానేంద్రియాల ద్వారా ప్రత్యక్ష అనుభవాలను పొంది, వాటి ద్వారా నేర్చుకోవడాన్నే 'అనుభావాత్మక అభ్యసనము' అంటారు. ఈ అనుభావాల అభ్యసనాన్ని 'కొహెన్' అను శాస్త్రవేత్త అభ్యసనపై జ్ఞానేంద్రియాల ప్రభావము ఎలా వుంటుందో వివరించాడు. రుచి చూడడం ద్వారా 1%, స్పందించడం ద్వారా 1.5%, వాసన చూడడం ద్వారా 3.5%, వినుట ద్వారా 11%, చూడడం 83% వరకు అభ్యసన జరుగుతుందని నిరూపించాడు.

లాటిన్ భాషలో "Experentia docet stultos" అని అంటారట.అట్లా అంటే అనుభవం మంద బుద్ధిని కూడా వివేకినిజేయును" అని ఒక వ్యక్తికి కావలసిన జ్ఞానం, నైపుణ్యాలను సరైన వైఖరులను, ఆలోచనలను-అనుభవాలను కల్పించడం ద్వారా అభ్యసింపజేయవచ్చునని David Kolbఅనే శాస్త్రవేత్త జన్యమైన అభ్యసన సిద్ధాంతాన్ని రూపొందించెను.


- అభ్యసన ప్రక్రియలో జ్ఞాననిర్మాణం రూపాంతరం చెందిన అనుభవాల ఫలితమేనన్నారు.
- అభ్యసనం ఒక మానసిక ప్రక్రియగాని దాని ఫలితంకాదు.
- అభ్యసనం అనుభవాల ఫలితంగా ఏర్పడే ఒక నిరంతర ప్రక్రియ
- అభ్యసనం - పరసరాలతో సర్దుబాటు చేసుకొనే ఒక పరిపూర్ణప్రక్రియ
- అభ్యసనం సాంఘిక అంశాలు - వ్యక్తిగత అంశాల మధ్య జరిగే పరస్పర జ్ఞాననిర్మాణ ప్రక్రియ.
- అభ్యసనం ఒక జ్ఞాన నిర్మాణప్రక్రియ.

**కోల్బ్ – అభ్యసన వలయం –**

కోల్బ్ రూపొందించిన అనుభవజన్య అభ్యసనంలో 4 ప్రక్రియలను పేర్కొంటూ వాటిని ఒక వలయంలో అమర్చినాడు.

మూర్త అనుభవాలు (Concrete Experiences)

క్రియాశీలక ప్రయోగం(అనుభవం (Active Experimentation)



పర్యావలోచన (నిశిత) పరిశీలన (Reflective Obseration)

అమూర్త భావనలను గ్రహించడం (Abstract Conceptavalization)

కోల్బ్ ప్రకారం వ్యక్తి/ విద్యార్థి పరిస్థితులు / పరిసరాలకనుగుణంగా అభ్యసన వలయంలో ఏ ప్రక్రియలోనైన ప్రవేశించవచ్చు. కాని విద్యార్థి పేర్కొన్న 4 ప్రక్రియలను సాధనచేయాలి. చేస్తేనే అభ్యసన – జ్ఞాన నిర్మాణం సంభవిస్తుందన్నాడు. ఇప్పుడు వలయంలో ఒక్కొక్క ప్రక్రియ గురించి తెలుసుకుందాం.

1. మూర్త అనుభవాలు: విద్యార్థి తన జ్ఞానేంద్రియాలతో చేపట్టే స్పష్టమైన, నిర్దిష్టమైన అనుభవాల వలన ఏర్పడే అనుభూతులే "మూర్తఅనుభవాలు"(Concrete Experiences).

2. అభ్యసన అంశాలను – పరిసరాలను వివిధ దృక్పథాలతో నిశితంగా,లోతుగా పరిశీలించి ఆలోచించి వాటిని అవగాహన చేసుకోవడమే – పర్యావలోచన నిశిత పరిశీలన(Reflective Observation).

3. అభ్యసనంలోని అంశాలను / పరిస్థితులను తార్కికంగా విశ్లేషించి వాటిని బుద్ధిపూర్వకంగా అవగాహన చేసుకోవడమే అమూర్తభావనల సంగ్రహణ(Abstract - conceptvalization).

4. క్రియాత్మకం – (పనులతో/చేయడంతో)గా చుట్టూవున్న వారిని – పరిస్థితులను ప్రభావితం చేయడమే క్రియాశీలక/ ప్రయోగాత్మక అనుభవం(Active Expermentaation).

కోల్బ్ క్రింది ఉదాహరణ అభ్యసన వలయంలోని ప్రక్రియలను వివరిస్తుంది.

- ఉదా॥ ఒక వ్యక్తి సైకిల్‌తొక్కడం నేర్చుకోవాలనప్పుడు.
- ఇతరులు సైకిల్ తొక్కడాన్ని నిశితంగా పరిశీలించడం/చూడడం(Reflective Observation)
- సైకిల్‌లో వివిధ భాగాలు పనిచేసే తీరు, నడిపే తీరు భావనలను అవగాహన చేసుకోవడం(Abstract Conceptnalization)

- పెద్దల నుండి/సైకిల్ నడపడం తెలిసిన పెద్ద పిల్లల నుండి సూచనలు, అందుకోవడం –/balancing/pedaling/lokking/braking etc...(Concrete experience)
- సైకిల్ పైకెక్కి కూర్చోని – నడపడం/త్రొక్కడం అంటే అనుభవపూర్వకంగా అభ్యసించడం(Active experimen tation).
- ఉపాధ్యాయులు విద్యార్థులకు అనుభవజన్య కృత్యాలను (Internship, fieldtrips, Excursions, Field Research,Project works)ఇచ్చేటప్పుడు క్రింది విషయాలను గుర్తించుకోవాలి.
- విద్యార్థులకు వ్యక్తిగతంగాను, అర్థవంతంగాను ఉండాలి.
- విద్యార్థులు అనుభవజన్య కృత్యాలు పూర్తి అయ్యేవరకు వారు స్వేచ్ఛగా తమ అనుభవాలను చర్చించే పరిస్థితిని కల్పించాలి.
- విద్యార్థుల అనుభవాలలో వారి అనుభూతులను,ఆలోచనలను, వైఖరులను, భావనలను, సృజనను, వారి మూర్తిమత్వం, బౌద్ధిక కౌశలాలను సృశింపజేసే విధంగా ఉండాలి. జ్ఞాన నిర్మాణం జరగాలి.
- విద్యార్థి తన గత అనుభవాలను సంపూర్ణంగా వినియోగించుకొనే విధంగా అనుభవజన్య కృత్యాలుండాలి.

తరగతిలో పిల్లలకు ఊరికే మాటల ద్వారా చెప్పడంకన్నా, ప్రయోగము ద్వారా చేసి చూపడమో, వారి ద్వారా చేయించడమో లేదా ప్రత్యక్షముగా చేయుచున్నప్పుడు చూపించడమో చేయుట వలన వారి అనుభవాలు బలంగా ఏర్పడతాయి. అందుకే పిల్లలకు ప్రయోగ పద్దతి, ప్రాజెక్టు పద్ధతి, కృత్యాధార పద్దతి వంటి అనుభవాత్మక పద్ధతుల ద్వారా బోధిస్తే ఆ అభ్యసన అర్థవంతమవుతుంది. కాబట్టి తరగతి గది లోపల మరియు వెలుపల పిల్లలకు అభ్యసనానుభవాలు ఎంత ఎక్కువగా అందిస్తే అభ్యసన అంత బాగా జరుగుతుంది.

ప్రజ్ఞాలబ్ధి $= \frac{\text{మానసిక వయస్సు}}{\text{శారీక వయస్సు}} \times 100$

**ముఖ్యాంశాలు(Key points)**

- ♦ సంజ్ఞానము అంటే వ్యక్తులు తమ జ్ఞానాన్ని ఆవిష్కరించుకోవడానికి ఉపయోగపడే ఆలోచనల పరంపర.
- ♦ ప్రత్యక్షం, భావనలు, ఆలోచన, వివేచన సృజనాత్మకత, ప్రజ్ఞా వంటి అనేక అంశాలు సంజ్ఞానాత్మక వికాసమునకు తోర్పడతాయి.
- ♦ ఇంద్రియాల జ్ఞానానికి అనుభవపూర్వమైన అర్థమే – ప్రత్యక్షము.
- ♦ ప్రత్యక్షాన్ని వ్యక్తిగత కారకాలు, వస్తుగత కారకాలు ప్రభావితం చేస్తాయి.
- ♦ వస్తువులు, సందర్భాలు, విషయాలు, సమూహాలుగా ఉపయోగపడే మానసిక ప్రక్రియయే భావనలు అంటారు.
- ♦ వ్యక్తులలో అంతర్గత సమస్యా పరిష్కార ప్రవర్తనే ఆలోచన. క్రమబద్ధమైన ఆలోచనా విధానమే 'హేతుబద్ద ఆలోచన'. ఎలాంటి లక్ష్యంలేకుండా వుండే ఆలోచనయ 'స్వైర ఆలోచన'.
- ♦ పూర్వానుభవానాలను జతపరచి సమస్యలను పరిష్కరించుకోగల సామర్థ్యమే వివేచన.
- ♦ సృజనాత్మకత = ఉత్పత్తి ప్రక్రియ + ఉపయోగము.
- ♦ ప్రజ్ఞను ప్రజ్ఞాలబ్ధితో కొలుస్తారు.

- బహుళ ప్రజ్ఞా భావనను ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త – హొవర్డ్ గార్డినర్
- వ్యక్తుల మధ్య కనిపించే శారీరక, మానసిక, ఉద్వేగ, సామాజిక పరమైన తేడాలనే వైయుక్తిక బేధాలు అంటారు.
- పియాజే ప్రకారం వ్యక్తి తన అనుభవాలను అర్థం చేసుకోవడానికి కొన్ని సంజ్ఞానాత్మక నిర్మాణాలు తోడ్పడతాయి. వాటినే 'స్కిమాటా' అంటారు.
- వైగాట్స్కీ ప్రకారం శిశువు ఇతరుల సహాయంతో చేయగలిగి తద్వారా స్వతంత్రముగా చేయగలుగు కృత్యాలనే సామీప్య వికాస ప్రదేశం ZPD అంటారు.
- భావనలు చిత్రాల రూపంలో వ్యక్తీకరించడమే 'భావనా చిత్రాలు' అంటారు.
- అభ్యసించిన అంశాలను ప్రతిబింబిస్తూ నేర్తుకోవడమే అనుభవాత్మక అభ్యసనము.

## మూల్యాంకనము (Evaluation)

1. యాజే సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతమును వివరించండి.
2. వైగోట్స్కీ నిర్మాణాత్మక సిద్ధాంతము ప్రస్తు కాల పరిస్థితులకు ఎట్లు అన్వయించవచ్చో తెలపండి.
3. బహుళ ప్రజ్ఞా సిద్ధాంతాన్ని వివరించండి.
4. ప్రత్యక్ష వ్యవస్థాపనా నియమాలు తెలపండి.
5. భావనోద్భములో ఉపాధ్యాయుల పాత్ర రాయండి.
6. ఆలోచన లక్షణాలను తెలిపి, ఆలోచనకు తోడ్పడు కారకాలు రాయండి.
7. వివేచనను తరగతి గదికి ఎట్లు అన్వయించవచ్చు.
8. ప్రజ్ఞా పరీక్షల రకాలను తెలపండి
9. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపాధ్యాయుడిగా నీవు చేపట్టు కృత్యాలేవి?
10. భావనోద్భమును ఏర్పచడంలో పిల్లలకు కలుగజేయవలసిన సదుపాయాలను రాయండి.

## వ్యాసరూప ప్రశ్నలు

1. భావనోద్భవములో ఉపాధ్యాయుని పాత్ర వివరించండి.
2. సంజ్ఞానము అంటే ఏమిటి? సంజ్ఞానాత్మక వికాస అంశాలు వివరించండి.
3. ఆలోచన అనగానేమి? ఆలోచన ప్రక్రియ, లక్షణాలు, రకాలు రాయండి.

4. సృజనాత్మకతను నిర్వచించి, అందలి దశలను పేర్కొనండి.

5. ప్రజ్ఞ అనగానేమి అని ఒక నిర్వచనాన్ని తెలిపి అందలి రకాలను వివరించండి.

6. పియాజే సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతాన్ని సోదాహరణంగా వివరించండి.

## లఘురూప సమాధాన ప్రశ్నలు

1. వివేచనను నిర్వచించి లక్షణాలు తెలపండి.
2. స్వబుద్ధి అంటే ఏమిటి? దాని వలన కలిగే ప్రయోజనాలను తెలపండి.
3. ప్రజ్ఞా పరీక్షలు, వాటి రకాలు తెలపండి.
4. సంజ్ఞానాత్మక వికాస దృక్పథాలు, వైయుక్తిక బేధాలు వివరించండి.
5. వైగోట్స్కీ, నిర్మాణాత్మక సిద్దాంతాన్ని రాయండి.
6. కోల్బ్ అభ్యసన వలయం గూర్చి రాయండి.

## ప్రాజెక్టు పనులు (Project works)

1. పాఠశాలల పరిశీలనలో భాగంగా విద్యార్థులలో పాఠశాల / చదువు పట్ల ఎలాంటి ఆలోచనలు వున్నాయో పరిశీలించి వ్యాఖ్యానించండి.
2. పాఠశాలలో పిల్లల మధ్య గల వైయక్తిక బేధాలను పరిశీలించండి.
3. పాఠశాల పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడానికి కొన్ని కృత్యాలు రాయండి.
4. ప్రజ్ఞా మాపనలను సేకరించి వాటితో విద్యార్థుల ప్రవర్తనను లెక్కించు విధానమును వివరించండి.

# 4 అభ్యసనము

## 4.0 పరిచయం (Introduction):

వ్యక్తి వికాసంలో అభ్యసనానికి ప్రముఖ స్థానం ఉంది. శిశువు తల్లి గర్భంలో నుంచి బయట పడినప్పటి నుండి తనతో పాటు చుట్టు ఉన్న వ్యక్తులతో, పరిసరాలతో సర్దుబాటు చేసుకొంటూ ఎన్నో విషయాలను అభ్యసించడం/నేర్చుకోవడం/ చేయగలగడం/తెలుసుకోగలగడం జరుగుతుంది. అప్పుడే పుట్టిన శిశువు ఏడ్వడం (Crying) ఉచ్వాస, నిశ్వాస క్రియలు జరపడం, అమ్మ దగ్గర పాలు త్రాగడం, సహజసిద్ధమైన ప్రతి చర్యలు మిగిలిన అన్ని విషయాలు మానవులు నేర్చుకోవలసినదే. అంటే అభ్యసించవలయును.

అభ్యసనమనే ప్రక్రియలో ఉద్వేగాత్మక వికాసం (Emotional Development), ప్రేరణ (motivation) సాంఘిక ప్రవర్తన (Social Behaviour) మూర్తి మత్వం (Personality) మొదలైన విషయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలి. అభ్యసనం అనే ప్రక్రియ ద్వారా వ్యక్తి తన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగాత్మక, నైతిక, బాషా వికాసానికి దోహదం చేసుకొంటాడు.

GITKR4

### లక్ష్యాలు (Objectives) :

- అభ్యసన అర్థాన్ని, నిర్వచనాలను గ్రహిస్తారు.
- అభ్యసనపై గృహము, పాఠశాల, పరిసరాల పాత్ర గురించి తెలుసుకుంటారు.
- అభ్యసనాన్ని ప్రభావితం చేసే కారకాలను గురించి అవగాహన చేసుకుంటారు.
- అభ్యసనా సిద్ధాంతాలను గురించి, తరగతిగదిలో వాటిని ఎలా ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుని తరగతిగదిలో ఉపయోగించుకుంటారు.
- వివిధ రకాల అభ్యసన పద్ధతుల గురించి అవగాహన చేసుకుంటారు.
- అభ్యసన బదలాయింపు మరియు వాటి అణువర్తనాలను గురించి తెలుసుకుంటారు.
- అభ్యసనలో స్మృతి పాత్రను గురించి తెలుసుకుని, స్మృతిని పెంపొందించుకునే విధానాన్ని తెలుసుకొంటారు.
- మార్గదర్శక పరిశోధనను గురించి తెలుసుకుంటారు.
- అభ్యసనలో సమీకృత ప్రాజెక్టులు, వాటి పాత్రను గురించి అవగాహన చేసుకుంటారు.
- సహకార అభ్యసనం, భాగస్వామ్య అభ్యసనంను గురించి తెలుసుకుని ఆచరిస్తారు.
- అభ్యసనంలో జట్టుపని అభ్యాసకుని స్వయం ప్రతిపత్తిని గురించి తెలుసుకుంటారు.

**అభ్యసనము – నిర్వచనాలు(Learning - Definitions) :**

అభ్యసనాన్ని హిల్‌గార్డ్, హంటర్ (Hilgard & Hunter) అనే శాస్త్రవేత్తలు క్రింది విధంగా నిర్వహించారు.

అభ్యసనం అంటే అనుభవం, శిక్షణ ద్వారా ప్రవర్తనలో మార్పు జరిగేచర్య (Learning is the process of change in behaviour due to experience and Training).

డెస్సికో, క్రాఫర్డ్ (Dececco & Crowford) అనే శాస్త్రవేత్తలు వ్రాసిన గ్రంథంలో "దిసైకాలజి ఆఫ్ లర్నింగ్ అండ్ ఇన్‌స్ట్రక్షన్స్", ఈ క్రింది విధంగా అభ్యసనాన్ని నిర్వహించారు.

అభ్యసనం అనేది పునర్బలనం చెందిన ఆచరణ వల్ల ప్రవర్తనా రీతిలో ఏర్పడే దాదాపు శాశ్వతమైన మార్పు పై నిర్వచనంలో మూడు విషయాలు కనిపిస్తాయి.

1) అభ్యసనమనేది ప్రవర్తనలో జరిగే మార్పు

2) ఈ మార్పు ఆచరణ వల్ల ఏర్పడుతుంది

3) అటువంటి మార్పు దాదాపు శాశ్వతమైనది.

**గేట్స్ (Gates) :** అభ్యసనమంటే అనుభవం ద్వారా, శిక్షణ ద్వారా ప్రవర్తనలో వచ్చే మార్పు

**కింబ్లే :** అభ్యసనమనేది ప్రవర్తనా శక్తి సామర్థ్యంలో సర్వసాధారణమైన దాదాపు శాశ్వతమైన మార్పు. ఇది పునర్బలనంతో కూడిన ఆచరణ వల్ల ఏర్పడుతుంది.

**హెర్బన్ హాన్ :** అభ్యసనమనేది ప్రవర్తనలో లేదా ప్రవర్తనాశక్తి సామర్థ్యంలో ఇంచుమించు శాశ్వతమైన మార్పు. ఇది అనుభవం ద్వారా వస్తుందేకాని జబ్బు, అలసట, మత్తు పదార్థాల వల్ల తాత్కాలికంగా శరీరంలో జరిగే మార్పు వల్ల కాదు.

అభ్యసన వల్ల ప్రవర్తనలో మార్పు అప్పటికప్పుడే రాకపోయినప్పటికీ ప్రవర్తనా శక్తి సామర్థ్యంలో మార్పు వస్తే అది తరువాత ప్రవర్తనలో మార్పుకు దారితీస్తుంది.

**అభ్యసన లక్షణాలు (Characterstics of Learning) :**

– సాధారణంగా అభ్యసనం అనేది ఒక లక్ష్యాన్ని గానీ, గమ్యాన్ని గానీ నిర్దేశించి ఉంటుంది.

– అభ్యసనం గతిశీలకమైంది.

– వ్యక్తికీ, మొత్తం పరిసరానికీ మధ్య జరిగిన చర్య ప్రతిచర్యల ఫలితమే అభ్యసనం.

– అభ్యసించే వేగంలో వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య భేదాలు ఉంటాయి.

– ఒక సందర్భంలో లేదా స్థితిలో నేర్చుకొన్న విషయాన్ని ఇతర సంబంధిత పరిస్థితులలో అనుప్రయుక్తం చేయడం.

– అభ్యసనం ఒక చర్యాత్మక మానసిక ప్రక్రియ. అంటే మనం గ్రహించే సమాచారాన్ని ఇంతకుముందు జ్ఞానంతో సరిపోల్చుకొని నూతన జ్ఞానాన్ని పెంపొందించుకోవడం. ఇది నిరంతరంగా కొనసాగే ప్రక్రియ.

**4.3. అభ్యసన నేపథ్యాలు(Context of Learning) :** 1. కుటుంబము, 2. పాఠశాల, 3. పరిసరాలు – సమాజం

పిల్లలలో అభ్యసనానికి తొలిమెట్టు ఇల్లు, గృహ వాతావరణంలో పిల్లల అభ్యసనం రకరకాలుగా జరుగుతుంది. పిల్లలు మొదటగా అభ్యసనాన్ని అనుకరణ ద్వారా గృహ వాతావరణంలోని తల్లిదండ్రులు, సహోదరులు, ఇంటిలోని ఇతర వ్యక్తుల ద్వారా నేర్చుకుంటారు. తర్వాత కొంత వయస్సు వచ్చిన తర్వాత పాఠశాలకు వెళ్ళడం జరుగుతుంది. అంతకు ముందు కుటుంబం బాలల అభ్యసనంను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం.

**ఎ) కుటుంబం (Family) :**

కుటుంబ వాతావరణం, క్రమశిక్షణా పద్ధతులు, తల్లిదండ్రులు పిల్లల మధ్య సంబంధం, తల్లి దండ్రుల పెంపక విధానం మొదలగునవి అభ్యసనను ప్రభావితం చేస్తాయి. కుటుంబంలో తల్లి దండ్రుల విద్యాస్థాయి, అభ్యసన పట్ల వారి దృక్పథం, గృహంలో చదువుకున్న వ్యక్తుల సంఖ్య అభ్యసనను ప్రభావితం చేయును.

కుటుంబం పిల్లల అభ్యసన మీద గణనీయమయిన ప్రభావాన్ని కలుగజేస్తుంది. కుటుంబ కారకాలలో ప్రధానమైనవి.

* **కుటుంబ అవ్యవస్థ (Family disorganisation) :** కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు సక్రమంగా లేకుండా ఎప్పుడూ తగాదాలు, గొడవలు ఉంటే ఆ ప్రభావం పిల్లల అభ్యసనపై పడి చదువులో వెనకబడిపోతారు.

* **తల్లిదండ్రుల ఆశలు (Parental Aspirations) :** కొంత మంది తల్లి దండ్రులు సామాజిక అంతస్తు కోసమని పిల్లల కోసమని పిల్లల చదువుల విషయంలో ఎన్నో ఆశలు కల్పించుకొని ఎంత చదివినా ఇంకా చదవమని ఒత్తిడి తెస్తూ ఉంటారు. వారి శక్తికి మించిన లక్ష్యాలను సాధించడంలో విఫలమై తనకు కలుగుతున్న అనుమానాల మధ్య చిక్కుకొని మానసిక సంఘర్షణల వల్ల ఏదీ సాధించలేని పరిస్థితి ఏర్పడుతుంది. కావున అభ్యసన విషయంలో పిల్లలను అనవసరమయిన ఒత్తిడులకు గురి చేయకూడదు.

* **కుటుంబంలో శిశువు పుట్టుక వరుసక్రమం (Birth order) :** కుటుంబంలోని పిల్లల్లో శిశువు స్థానం కూడా అభ్యసనను ప్రభావితం చేస్తుంది. అంటే కుటుంబంలో ఏకైక సంతానం ఉంటే అభ్యసన విషయంలో ఎక్కువ శ్రద్ధను ప్రదర్శిస్తూ గైడ్ చేయడం వల్ల వారు అభ్యసనలో ఎక్కువగా రాణించే అవకాశం కలదు. కాని ఏకైక సంతానం కదా అని ఎక్కువ గారాబం చేస్తే అభ్యసనలో వెనుకబడటానికి అవకాశం కలదు. ముగ్గురు లేదా నలుగురు ఉంటే వారి చదువు విషయంలో సరియైన శ్రద్ధ చూపలేక పోవడం వలన అభ్యసనలో వెనకబడిపోయే అవకాశం కలదు.

**బి) పాఠశాల (School):**

కుటుంబం తరువాత కొంత వయస్సు వచ్చిన తరువాత పిల్లలు పాఠశాలకు వెళ్ళడం జరుగుతుంది. పాఠశాల వాతావరణంలో ఉపాధ్యాయుల ద్వారా, ఇతర విద్యార్థుల ద్వారా అభ్యసన ఏవిధంగా ప్రభావితం అవుతందో పరిశీలిద్దాం.

అభ్యసనను ప్రభావితం చేసే పాఠశాల కారకాలను క్రింది విధంగా పేర్కొన వచ్చును.

**భౌతిక సదుపాయాలు :** భవనాలు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం మొదలగునవి.

**మానవ వనరులు :** సుశిక్షితులైన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది.

**పరిపాలన విధానం :** పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య సంబంధం, క్రమశిక్షణ పద్ధతులు.

**సహపాఠ్యేతర కార్యక్రమాలు :** ఆటలు, పాటలు, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.

**గ్రంథాలయం, ప్రయోగశాల, ఆటస్థలం, తోటబడి :** వంటి సదుపాయాలు.

**బోధనోపకరణాలు :** దృశ్య, శ్రవణోపకరణాలు, బహుళమాధ్యమ (multi-media) బోధనోపరకణాలు, బహుళ ప్రచార సాధనాలు (mass media) వినియోగం మొదలగునవి.

- ఉపాధ్యాయులు – ఉపాధ్యాయుల మధ్య సంబంధాలు.
- పాఠశాలలో ఉపాధ్యాయులు అనుసరించే బోధనా పద్ధతులు.
- ఉపాధ్యాయ – విద్యార్థుల నిష్పత్తి.
- బ్లాక్ బోర్డ్, గ్రంథాలయం, పక్కా భవనాలు, పరిశుభ్ర వాతావరణం, టాయిలెట్ సౌకర్యాలు.

- ఉపాధ్యాయులు
- ఆకర్షణీయమైన పాఠ్య ప్రణాళిక.
- ద్విభాషా తత్వము బహుభాషా తత్వం.
- విద్యార్థుల - ఉపాధ్యాయుల మధ్య సంబంధాలు మొదలగునవి.

**సి) పరిసరాలు(Environment) :**

పిల్లలు పాఠశాల తర్వాత పరిసరాలలోని వివిధ అంశాల ద్వారా అనేకానేక క్రొత్త విషయాలను వాటి ద్వారా అభ్యసనను పొందుతారు.

**అదెలాగో పరిశీలిద్దాం :**

పరిసర కారకాలైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పద్ధతుల ద్వారా అభ్యసనాన్ని పొందుతారు. సమాజంలో విద్య పట్ల గల అభిప్రాయాలు, ప్రాముఖ్యత, సదుపాయాలు, వివిధ సామాజిక సంస్థల సహకారం మొదలగునవి అభ్యసనము ప్రభావితం చేయును. స్థానిక గ్రంథాలయాలు, సాంస్కృతిక కేంద్రాలు, రేడియో, దూరదర్శన్, వార్తా, పత్రికలు, ఇంటర్‌నెట్ వంటి సదుపాయాలు అభ్యసనను దోహదం చేస్తాయి.

## 4.4 అభ్యసనాన్ని ప్రభావితం చేసే కారకాలు (Factor inflvencing Learning) :

అభ్యసనాన్ని ప్రభావితం చేసే వివిధ రకాల కారకాలను గురించి తెలుసుకొన్నాము. ఇప్పుడు పిల్లల్లో అభ్యసనమును నిర్ణయించే కారకాలు గురించి తెలుసుకుందాము. వీటిని ముఖ్యంగా మూడు రకాలుగా విభజించవచ్చును. అవి

1) అభ్యాసకునికి సంబంధించిన కారకాలు

2) అభ్యసన అంశానికి సంబంధించిన కారకాలు

3) అభ్యసించే పద్ధతికి సంబంధించిన కారకాలు

1) **అభ్యాసకునికి సంబంధించిన కారకాలు :** ఇందులో చాలా కారకాలు ఉన్నాయి.

**(Factors related to Learner)**

| | | | |
|---|---|---|---|
| 1) పరిపక్వత | 2) ప్రేరణ | 3) ఏకాగ్రత | 4) వైఖరి |
| 5) అవసరాలు | 6) ఆసక్తి | 7) స్మృతి | 8) ఉద్వేగాలు |
| 9) సహజసామర్థ్యాలు | 10) మూర్తిమత్వం | 11) ప్రజ్ఞ | 12) గమ్యసాధన |
| 13) వయస్సు | 14) లింగ బేధం | 15) అధ్యయన | 16) అలవాట్లు |
| 17) పూర్వజ్ఞానం | 18) శారీరక ఆరోగ్యం | 19) మానసిక ఆరోగ్యం | |

అభ్యాసకుని అభ్యసనం బాగా జరగాలంటే పై కారకాలు అన్ని సక్రమంగా ఉన్నట్లయితే అభ్యసనం ఆశించినంత వరకు బాగా జరుగును.

అభ్యసన నిర్ణకయకాలైన సంసిద్దత, పరిపక్వత, ప్రేరణ, అవసరాల గురించి తెలుసుకొందాం.

**అభ్యసనం - సంసిద్దత :**

ఏదైనా విషయాన్ని అభ్యసించడానికి వ్యక్తి శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉండటాన్నే సంసిద్ధతగా చెప్పవచ్చు. అభ్యసించేవారు సంసిద్ధులుగా ఉంటే నేర్చుకోవడంలో పూర్తి ఏకాగ్రతను నిలుపగలుగుతారు. వారి పూర్తి శక్తిని దానిలో వినియోగిస్తారు. తద్వారా సులభంగానూ, త్వరగానూ, సమర్థవంతంగా నేర్చుకోగలుగుతారు. అంతేకాక నేర్చుకొన్న దానిని నిత్యజీవితంలో ఎక్కువగా ఉపయోగించుకొనే అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు ఒక విషయాన్ని నేర్పాలంటే, మొదట వారు ఇది నేర్చుకోవడానికి సంసిద్ధులుగా ఉన్నారా? లేదా? అనేది ఉపాధ్యాయులు గమనించాలి. సంసిద్ధులుగా ఉంటే నేర్పించవచ్చు. ఒకవేళ విద్యార్థులు సంసిద్ధంగా లేకపోతే, సంసిద్ధంగా లేకపోవడానికి గల కారణాలను పరిష్కరిస్తూ విద్యార్థులను అభ్యసనకు సంసిద్ధులను చేయాలి.

పాఠశాలలోనే కాక ఇంటి వద్ద కూడా పిల్లలు అభ్యసించేందుకు సంసిద్ధంగా లేనప్పుడు తల్లిదండ్రులు చదవమని ఒత్తిడి చేస్తే, పిల్లలు చదివినట్లు నటిస్తారే కానీ, నిజంగా చదివే అవకాశాలు తక్కువే. కాబట్టి ఉపాధ్యాయులు – తల్లిదండ్రుల సమావేశాలలో ఇటువంటి విషయాలపై చర్చించి తల్లిదండ్రులకు కూడా 'సంసిద్ధత' గురించి తెలియజేసి, విద్యార్థుల అభ్యసనం మెరుగుపడే విధంగా చూడాలి.

I8N4UR

**అభ్యసనం పట్ల విద్యార్థులు సంసిద్ధంగా ఉండని కొన్ని సందర్భాలు**

నేర్చుకొనే విషయం వల్ల కలిగే ప్రయోజనం తెలియకపోవడం.

వైవిధ్యమైన బోధన కాకుండా యాంత్రికంగా బోధించడం.

తీవ్రమైన సాంఘిక, ఆర్థిక అవసరాల లోటు.

ఇంటిలోగానీ, పాఠశాలలో గానీ ఏదైనా విచారకరమైన సంఘటన జరిగినప్పుడు.

భోజన విరామ సమయంలో బోధించడం.

పాఠశాల సమయం అయిపోయిన తరువాత బోధించడం, ఆటల పీరియడ్‌లో ఆటలకు వెళ్లనీయకుండా ఉంచి పాఠాలు బోధించడం మొదలైనవి.

నేర్చుకోవడానికి కావలసిన శారీరక పరిపక్వత లేకపోవడం.

ఉపాధ్యాయులు ఎప్పుడూ విద్యార్థుల అభ్యసనా సంసిద్ధతను గమనిస్తూ ఎప్పటికప్పుడు వారిని సంసిద్ధులను చేయడానికి తగిన చర్యలు చేపట్టాలి.

### 4.4.1. పరిపక్వత (Matcration)

జన్మత: వ్యక్తిలో ఉన్న సహజసామర్థ్యాలు వయసుతోపాటూ క్రమంగా వికసించటాన్ని పరిపక్వత అంటారు. అభ్యసించవలసిన అంశానికి తగిన పరిపక్వత లేనిదే ఎంత శిక్షణ ఇచ్చినా అభ్యసనం జరగదు. ఉదాహరణకు – ఆరు నెలల శిశువుకు అ, ఆ – లు నేర్పితే నేర్చుకోలేరు. అంటే ఆ– ఆలు నేర్చుకొనేంత పరిపక్వత ఆరునెలల వయస్సు ఉన్న ఏ పిల్లలకు ఉండదు. కాబట్టి అభ్యసనం అనేది పరిపక్వత మీద ఆధారపడి ఉందని తెలుస్తుంది.

పరిపక్వత అనేది వ్యక్తిలో సహజసిద్ధంగా వయస్సుతో పాటు జరిగే ఒక ప్రక్రియ. దీనిలో ప్రధానంగా రెండు అంశాలు ఉంటాయి. అవి ఒకటి పరిసరాలలోని ఉద్దీపనలను గ్రహించగలగడం. రెండోది గ్రహించిన దానిని వినియోగించుకొని ప్రతిస్పందించగలగడం. పరిపక్వతపై పరిసర ప్రభావం కంటే ఆనువంశికత ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పక్షులు ఎగరడమనేది పరిపక్వతతోనే జరుగుతుంది. కాని మానవుల ప్రవర్తనలోని మార్పులు పరిపక్వతతో వచ్చాయా? లేదా? అభ్యసనంతో వచ్చాయా అని నిర్ణయించడం అంత సులభం కాదు. కానీ జాగ్రత్తగా గమనిస్తే ఈ రెండింటి మధ్యగల భేదాన్ని గమనించవచ్చు.

ఉదాహరణకు – ఒక పిల్లవాడు సైకిలు తొక్కుతున్నాడు. అంటే దానికి ఆ పిల్లాడికి తగినంత పరిపక్వత, అభ్యాసంతోనే సాధ్యమవుతుంది. ఒకవేళ కేవలం పరిపక్వతతోనే సైకిలు తొక్కగలిగితే, అంతే పరిపక్వత ఉన్న పిల్లలందరూ సైకిలు తొక్కాలి. కానీ అలా జరగడం లేదు కదా! అంటే సైకిలు తొక్కాలంటే పరిపక్వత, అభ్యసనం రెండు కావలసిందే.

అభ్యసనం సమర్థవంతంగా జరగాలంటే తగినంత పరిపక్వత అవసరం. కానీ నేడు పూర్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పరిపక్వత రాక ముందే చాలా విషయాలు నేర్పుతున్నారు. ఈ విధంగా చేయడం వల్ల పిల్లలు నేర్చుకోవడానికి చాలా సమయం పడుతుంది. అంతేగాక భావనలు సరిగా ఏర్పడక ఒకదానికొకటి చెప్పడం, రాయడం చేస్తుంటారు. పరిపక్వత రాక ముందే పిల్లలు అసలు అభ్యసించక పోవచ్చు లేదా ఏదో కొంత అభ్యసించినప్పటికీ అభ్యసనం అనేది వారికి భారంగా మారవచ్చు. తద్వారా అభ్యసన పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. కాబట్టి పరిపక్వతాస్థాయిని బట్టి పాఠ్యప్రణాళికల రూపకల్పన చేయాలి.

### 4.4.2. ఉద్వేగాలు (Emotions)

ఇవి జీవితంలో రంగుల హరివిల్లుల వంటివి. వీటిని రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. ధనాత్మక ఉద్వేగాలు ఆనందాన్ని కలిగించే ఉద్వేగాలు (నమ్మకం, సంతోషం, వాత్సల్యం, లైంగిక, ప్రేమ, నిరీక్షణ, కుతూహలం మొదలైనవి) 2. ఋనాత్మక ఉద్వేగాలు – దు:ఖాన్ని కలిగించే ఉద్వేగాలు (ఆతృత, భయం, సిగ్గు, కోపం, అలసట, అసూయ, భంగపాటు మొదలైనవి ఉద్వేగాన్ని ఆంగ్లంలో Emotion అంటారు. ఇది Emovere అనే లాటిన్ పదం నుండి వచ్చింది. దీని అర్థం ఆంతరంగిక చలన స్థితి (Stirred up staus) శరీరంలో ప్రతీ అణువు కంపిస్తూ మనస్సు చలించే స్థితిగా భావించవచ్చు. వంశ పారంపర్యం, పరిపక్వత, మానసిక శారీరక ఆరోగ్యం, ఎడ్రినలిన్ గ్రంధి వంటి అంత:స్రావ గ్రంధులు, పరిసరాలు మొదలైనవి ఉద్వేగాలపై ప్రభావం చూపుతాయి. తీసుకునే ఆహార పదార్థాలు, యోగ, ధ్యానం వంటి క్రియలు కొంత వరకు ఉద్వేగ వికాసంలో తోడ్పడతాయి.

### నిర్వచనం:

జీవి బాహ్యా పరిసరాలతో ప్రతిస్పందించేటప్పుడు ఆంతరంగికంగా శరీరంలో వచ్చే మార్పుల వల్ల వ్యక్తి ప్రవర్తనలో మార్పు వస్తుంది. దీనినే ఉద్వేగంగా నిర్వచించవచ్చు. పిల్లలు 1. అనుకరణ ద్వారా 2. నింబంధన ర్వారా ఉద్వేగాలను అభ్యసిస్తారు.

**1. అనుకరణ ద్వారా:** స్వతహాగా పిల్లలకు భయం అనే ఉద్వేగం పుట్టుకతో ఉండదు. ఉదా: పామును చూసినప్పుడు పెద్దలు కంగారుపడడం, భయపడడం వంటి ఉద్వేగాలను గమనిస్తారు. ఈ విధంగా తాము భవిష్యత్తులో భయం అనే ఉద్వేగాన్ని నేర్చుకుంటారు. ఎవరి ఇంట్లోనైతే పెద్దలు బొద్దింకలకు, బల్లులకు భయపడతారో వారి పిల్లలు కూడా వాటికి భయపడటం నేర్చుకుంటారు. దీనిని సుమారు మూడు సంవత్సరాల వయస్సులో అనుకరణ ద్వారా అభ్యసిస్తారు.

**2. నిబంధన ద్వారా:** భయం, కోపం, ప్రేమ మొదలైన ఉద్వగాలు నిబంధన ద్వారా నేర్చుకుంటారు. ఉదా: ఆల్బర్ట్ అనే 11 సంవత్సరాల బాలుని ప్రయోజ్యునిగా తీసుకొని వాట్సన్ జరిపిన ప్రయోగం గమనించినట్లుయితే అర్థమౌతుంది. ఈ ప్రయోగానికి ముందు ఆల్బర్ట్‌కు జంతువులంటే భయం లేదు. కాని పెద్ద శబ్దాలకు మాత్రం ఉలిక్కి పడేవాడు. ఆల్బర్ట్ కుందేలుతో ఆడుతున్నప్పుడు అతడికి తెలియకుండా పెద్ద శబ్దాన్ని కలిగించాడు. వెంటనే ఆల్బర్ట్ ఉలిక్కిపడి ఏడవడం మొదలు పెట్టాడు. ఈ ప్రయోగాన్ని మరికొన్నిసార్లు చేసిన తరవాత ఆల్బర్ట్ కుందేలుకు భయపడనారంభించాడు.

శిశువులలో మానసిక, శారీరక పరిపక్వత పొందేకద్ది భావ ప్రకటనలో పరిపక్వత ఏర్పడుతుంది. భావోద్రేకాలు కొంత అదుపుతో, తొందరపాటు లేకుండా ప్రకటించడం జరుగుతుంది. **– జెర్సీల్డ్**

## 4.4.3. అభ్యసన వాతావరణం (LEARNING ENVIRONMENT)

దీనిని నిర్వచించడానికి ముందు విద్యార్థులు నేర్చుకోవడానికి అనువైన ప్రదేశాలేవో తెలుసుకోవలసిన అవసరం ఉంది. అనియత పద్ధతిలో ఇంటి వద్ద, ఇరుగు పొరుగు వారితో స్నేహితులతో, సమాజంతో పరస్పర సంబంధాల వల్ల పిల్లలు నేర్చుకుంటారు. వీటన్నిటితో పాటు ఎక్కువగా నేర్చుకోవడానికి అనువైన ప్రదేశం పాఠశాల. ఇల్లును మొదటి అభ్యసనా కేంద్రంగా, తల్లిని మొదటి గురువుగా భావిస్తారు. ఉత్తేజకరమైన ఇంటి వాతావరణం, ఉత్సాహాన్ని ప్రేరణను కలిగించే తల్లిదండ్రులు చక్కని అభ్యసన వాతావరణాన్ని కల్పించిన వారౌతారు. బడికి వెళ్ళె వయస్సు వచ్చిన తరువాత పిల్లలు నియత పద్ధతిలో విద్యనభ్యసించవలసి ఉంటుంది. కాబట్టి తప్పకుండా పిల్లలందరూ పాఠశాలకు వెళ్ళవలసి ఉంటుంది. ఎందరో గొప్ప వ్యక్తులను తయారు చేయగలిగే కేంద్రం కేవలం పాఠశాల మాత్రమే అలాంటి అభ్యసనా కేంద్రం, వాతావరణం ఎలా ఉండాలనుకుంటున్నారు?

JHYSX3

### నిర్వచనం:

ఆహ్లాదకరమైన భౌతిక సదుపాయాలు, మనస్సుకు ఉత్తేజం ఉల్లాశం కలిగించే పరిసరాలు, అభ్యసనకు తోడ్పడే వసతులు, చక్కని సాంఘిక సంబంధాలను ఏర్పర్చగలిగే పరిస్థితి వాటిని సరిగ్గా నిర్వహించగలిగే యాజమాన్యం కలిగిన వాతావరణమే అభ్యసన వాతావరణంగా నిర్వచించవచ్చు.

### 1. భౌతిక వాతావరణం:

చక్కని పాఠశాల భవనం, విశాలమైన ఆటస్థలం నీడనిచ్చే చెట్లు, మొక్కలు, శారీరక, మానసిక వికాసానికి దోహదపడే ఆటవస్తువులు, గ్రంథాలయం, వివిధ సబ్జెక్ట్‌లకు చెందిన ప్రయోగశాలలు, కంప్యూటర్ ఆధారిత అభ్యసన సదుపాయం, గాలి, వెలుతురు, ధారాళంగా వచ్చే పరిశుభ్రమైన తరగతి గదులు, విజ్ఞానాన్ని రేకెత్తించే పిల్లలతో తయారు చేయబడిన రంగురంగుల చార్టులు, కూర్చోవడానికి బల్లలు, మంచి నల్లబల్ల, పిల్లలు వారి భావాలను వ్యక్తపరచడానికి రన్నింగ్ బ్లాక్ బోర్డ్, బోధనాభ్యసనను ఫలవంతం చేయు పరికరాలు, టీచింగ్ లర్నింగ్ మెటీరియల్, వాటిని సక్రమంగా ఉపయోగించడానికి సబ్జెక్ట్‌లకు సరిపడ ఉపాధ్యాయులు మొదలైనవి భౌతిక వాతావరణంగా భావించవచ్చు.

### కృత్యం:

భౌతిక వాతావరణాన్ని సంపన్నవంతం చేయుటకు మరికొన్ని సూచనలు ఇవ్వండి.

2. మానసిక వాతావరణం

ఇది తరగతి గదిలో ఉపాధ్యాయుడు కలిగించే అభ్యసన వాతావరణం, పిల్లలు సౌకర్యవంతంగా నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. ఉపాధ్యాయుని నిదానం, ఓపిక, విద్యార్థులకు సహాయపడే దయగల గుణం, ధనాత్మక నియంత్రణ, స్పష్టమైన నియమ నిబంధనలను ఏర్పర్చి వాటి వలన ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేసి పాటించగలిగే ఉపాధ్యాయులు ఈ వాతావరణాన్ని నెలకొల్పుతారు. మానసిక వాతావరణంలోని అంశాలు.

1) **విద్యార్థుల భావ స్వేచ్ఛకు వీలుకల్పించాలి:** పాఠ్యాంశానికి సంబంధించిన భావాలను వ్యక్తపర్చగలిగే స్వేచ్ఛ, ఇతరులతో సంబంధాలను ఏర్పర్చి ఉద్వేగ వికాసంలో తోడ్పడేలా చేయాలి.

2) **విద్యార్థులతో రూపొందించబడిన చార్టులతో అలంకరించాలి:** విద్యార్థులు రాసిన కథలు, వ్యాసాలు, గేయాలు, చిత్రాలు, కార్టూన్‌లతో తరగతి గోడలు అలంకరించబడితే విద్యార్థుల యొక్క ఆత్మ విశ్వాసం పెంపొందుతుంది. ఉపాధ్యాయులతో, ఇతర విద్యార్థులతో గుర్తింపబడతారు.

3) **విద్యార్థులను వారి పేర్లచో పిలవాలి:** ఇది మిగతా అన్నింటికంటే ముఖ్యమైనది. ప్రతీ ఒక్కరినీ ప్రత్యేకమైన వారిగా భావిస్తూ, గౌరవించాలి.

4) **తెలియని విషయం తెలియదని ఉపాధ్యాయుడు ఒప్పుకోవాలి:** ఉపాధ్యాయునికి అన్ని విషయాలు తెలియవలసిన అవసరం లేదు. ఊహాజనితమైన సమాధానాలిచ్చి తప్పుదోవ పట్టించడానికి బదులుగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ వారికి కూడా అవకాశం ఇవ్వవచ్చు.

5) **విద్యార్థులతో పాటుగా చదవాలి, రాయాలి:** సాధారణంగా తల్లిదండ్రులు ఇంటి వద్ద, పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను చదవమని, వ్రాయమని ఒత్తిడి తెస్తూ విసుగు తెపించే బదులుగా చదవడం వల్ల, రాయడం వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు తెలిపి, రోల్ మాడల్‌గా ఉంటూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తాము చదవాలి, వారితో పాటు రాయాలి.

6) **ఉపాధ్యాయుడు ప్రశాంతంగా ఉండాలి:** విద్యార్థులలో భయానక వాతావరణాన్ని నిరోధించి స్నేహ పూర్వక వాతావరణశం నెలకొల్పాలంటే మొదట ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఎల్లవేళలా ప్రశాంతంగా ఉండాలి. అభద్రతా భావాన్ని తొలగించాలి.

7) **విద్యార్థుల మధ్య సామరస్యాన్ని నెలకొల్పాలి:** విద్యార్థుల మధ్య అభిప్రాయ భేదాలుండవచ్చు. అవి ఎక్కువైతే తరగతి గది ప్రశాంతత నశిస్తుంది. అభ్యసన వాతావరణం కలుషితమౌతుంది. కనుక విద్యార్థుల మధ్య ఏర్పడిన వైరుధ్యాలను వెంటనే సామరస్య పూర్వకంగా పరిష్కరించాలి.

8) **తరచుగా ఉపాధ్యాయులు చిరునవ్వు చిందించాలి:** తరగతి గది వినోదాత్మకంగా ఉత్సాహబరితంగా, ప్రేరేపించే విధంగా ఉండాలంటే అడపాదడపా చిన్ని హాస్యపూరక కథలు, బోధించే విషయానికి సంబంధించిన హాస్య సంఘటనలు చెప్పాలి. విద్యార్థులతో సహా మనస్ఫూర్తిగా నవ్వగలగాలి.

9) **సమస్య సాధనకు విద్యార్థులకే అవకాశాలివ్వాలి:** సమస్యలు పరిష్కరించడానికి విద్యార్థులకే అవకాశం ఇచ్చినట్లయితే విద్యార్థులు ఆలోచించడానికి అవకాశం వస్తుంది. పరిష్కరించగలిగితే ఆత్మ విశ్వాసం పెంపొందుతుంది.

10) **విద్యార్థులతో సమానంగా వారితో పాటు కూర్చోవాలి:** దీని వల్ల విద్యార్థులకు బెరకు, భయం, ఆత్మన్యూనతా భావం తొలిగిపోతుంది. వారికి వచ్చే సందేహాలను ధైర్యంగా అడగగలడు. ఎప్పుడైతే విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకుంటారో, వారు జీవితంలో ఎదురయ్యే అన్యాయాలను సమర్థవంతంగా ప్రశ్నించగలుగుతారు.

11) **సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి:** ఎప్పుడూ పాఠ్యాంశాలకు సంబంధించిన విషయలే కాకుండా కనీసం వారానికి ఒక రోజు విద్యార్థులలో ఉన్న సహజ సామర్థ్యాలను వెలికితీయడానికి, వారిని ఆయారంగాలలో ప్రోత్సహించడానికి సాంస్కృతిక, సాహిత్యపరమైన కార్యక్రమాలు, క్విజ్‌లు, పాటలు, నాటక పోటీలు నిర్వహించాలి.

### 4.4.4. ప్రేరణ (Motivation)

అభ్యసనాన్ని ప్రభావితం చేయడంలో అతి ముఖ్యమైన కారకాన్ని ప్రేరణగా చెప్పవచ్చు. వ్యక్తికి అభ్యసించాలనే ప్రేరణ ఉంటే, నేర్చుకొనే అంశం పట్ల పూర్తి ఏకాగ్రతను నిలుపగలుగుతారు. అదే విధంగా వారి పూర్తి శక్తి సామర్థ్యాలు వినియోగిస్తారు. నేర్చుకొనే వ్యక్తికి ప్రేరణ లేనట్లయితే అభ్యసనలో మనస్సును కేంద్రీకరించలేరు. క్రో & క్రో శాస్త్రవేత్తలను అనుసరించి ప్రేరణ అనేది అభ్యసనానికి మూలాధారం వుడ్‌వర్త్ ప్రకారం అన్ని రకాల ప్రవర్తనకు ప్రేరణనే మూలాధారం.

బెర్నాల్డ్ ప్రకారం "ప్రత్యేకమైన లక్ష్యాలవైపు చర్యను ఉత్తేజపరిచే దృగ్విషయమే ప్రేరణ. ప్రేరణలో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి.

అవి 1. అంతర్ ప్రేరణ లేదా అంతర్గత ప్రేరణ (Intrinsic Motivation)

2. బాహ్య లేదా బహిర్గత ప్రేరణ (Extrinsic Motivation)

**అంతర్ ప్రేరణ :** వ్యక్తిపై ఎటువంటి బాహ్య ప్రభావం లేకుండా తనంతట తనకు స్వాభావికంగా ఏర్పడే ప్రేరణనే అంతర్గత ప్రేరణ లేదా అంతర్ ప్రేరణ అంటారు.

పనిపట్ల తమంతట తమకే ఆసక్తి, నిబద్దత, పట్టుదల ఉన్నవారికి అంతర్గత ప్రేరణ ఉన్నట్లుగా భావించవచ్చు. ఉదాహరణకు ఎలాంటి బహుమానం, దండనా లేదా పరిక్షలలో మార్కులు తెచ్చుకోవాలనే నిబంధన ఏమీ లేకపోయినప్పటికీ ప్రతిరోజూ వారంతట వారే చదువులో నిమగ్నం కావడం.

**బాహ్యప్రేరణ :** ఒక వ్యక్తి స్వతహాగా నేర్చుకోవాలని లేకపోయినప్పటికీ బహుమానం కోసమో, దండన తప్పించుకొనేందుకు నేర్చుకొంటే ఆ వ్యక్తి బహిర్గత ప్రేరణతో నేర్చుకొన్నాడని చెప్పవచ్చు.

అంతర్గత ప్రేరణ పొందిన వారు నేర్చుకోవడం ద్వారా సంతృప్తిని, ఆనందాన్ని పొందుతారు. కాబట్టి వీరు ఎక్కువగా నేర్చుకోగలుగుతారు. వీరు బహుమానం కోసమో, దండన తప్పించుకోవడం కోసమో చూడకుండా ఎప్పుడూ ఒకే తీరులో చదువుతుంటారు. బహిర్గత ప్రేరణపై ఆధారపడి అభ్యసించే వారు, బహుమానం, దండన పద్ధతిని తీసివేస్తే అప్పటి నుంచి వారి అభ్యసనం సన్నగిల్లుతుంది.

కొంతమంది విద్యార్థులు పదోతరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారు. తరువాత ఇంటర్మీడియట్ పరిక్షలో కనీసం ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఎందుకంటే పదో తరగతి వరకు ఇంటివద్ద తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు కూర్చోబెట్టి చదివించేవారు. చదవకపోతే దండించేవారు. ఇంటర్మీడియట్‌కు వచ్చిన తరువాత అలాంటి నిబంధన ఏమీ లేదు. అంటే బహిర్గత ప్రేరణ లేదు. అందువల్ల విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారు. దీనిని బట్టి మనకు తెలిసింది ఏమిటంటే బహిర్గత ప్రేరణ తాత్కాలికమైందనీ, అంతర్గత ప్రేరణ, దీర్ఘకాలికమైందనీ, బహిర్గత ప్రేరణ ఎలా ఉండాలంటే, అది విద్యార్థులలో అంతర్గత ప్రేరణను పెంపొందించేదిగా ఉండాలి. అలాంటప్పుడు బహిర్గత ప్రేరణలు కూడా మంచి ఫలితాలను ఇస్తాయి.

**బహిర్గత ప్రేరణను ఉపయోగించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు**

1. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను గుర్తించి, వారికి ఉత్తేజం కలగడానికి అవసరమైన మేరకు మాత్రమే బహిర్గత ప్రేరణలను ఉపయోగించాలి.

2. పిల్లలు బహిర్గత ప్రేరణలకు అలవాటు పడకుండా జాగ్రత్త పడాలి.

3. ఎప్పుడూ ఒకేవిధమైన బహిర్గత ప్రేరణలను, అంటే ఎప్పుడూ బహుమానం ఇవ్వడమో లేదా ఎప్పుడూ శిక్షించడమో కాకుండా వైవిధ్యమైన ప్రేరణలను ఉపయోగించాలి.
4. పిల్లల శక్తి సామర్థ్యాలను మించిన లక్ష్యాలను నిర్దేశించి, వాటిని సాధిస్తే బహుమానం ఇస్తామంటే ప్రయోజనం వుండదు. కాబట్టి నిర్దేశించే లక్ష్యాలు సాధించగలిగే విధంగా ఉండాలి.

**అంతర్గత, బహిర్గత ప్రేరణల మధ్య వైరుధ్యం**

ఒక విద్యార్థికి సంగీతం నేర్చుకోవాలనే అంతర్గత ప్రేరణ ఉంది. కానీ వారి తల్లిదండ్రులు సంగీతం నేర్చుకోవడానికి అనుమతించకుండా, చదువులో మంచి మార్కులు తెచ్చుకొమ్మని చెప్పడం, మంచి మార్కులు పొందితే బహుమానం ఇస్తామని అంటే ఆ విద్యార్థికి అంతర్గత, బహిర్గత ప్రేరణల మధ్య సంఘర్షణ ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితిలో విద్యార్థి దేనిలోనూ రాణించలేక పోతాడు. అంతర్గత, బహిర్గత ప్రేరణల మధ్య వైరుధ్యం లేకుండా ఉన్నట్లయితే ఆ విద్యార్థికి ఉత్సాహం మరింత పెరిగి అభ్యసనం విజయవంతం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**విద్యార్థులలో ప్రేరణను పెంపొందించే విధానాలు**

1. స్వేచ్ఛాపూరిత వాతావారణంలో అభ్యసన కొనసాగేటట్లు చూడటం.
2. పాఠ్యప్రణాళికలు విద్యార్థుల స్థాయికి, ఆసక్తులకు, సహజ సామర్థ్యాలకు అనుగుణంగా ఉండాలి.
3. విద్యార్థులకు మార్గదర్శకత్వం, మంత్రణం అందుబాటులో ఉండాలి.
4. సమవయస్కుల మధ్య సత్సంబంధాలు, సహకారం ఉండాలి.
5. ఫలితాల జ్ఞానాన్ని అందుబాటులో ఉంచడం.
6. బహుమానం, దండనలు సందర్భోచితంగా అవసరం మేరకే వినియోగించాలి.
7. చర్చావేదికలు, సెమినార్‌లను నిర్వహించడం.
8. విద్యార్థులు సరైన లక్ష్యాలను ఏర్పరచుకోవడానికి సహకరించడం.

**అభ్యసనం – సాధనా ప్రేరణ (Achievement Motivation)**

సాధనా ప్రేరణకు ఆధారం 'సాధించాలి' అనే భావన ఉండటం. వ్యక్తికి ఏదైనా సాధించాలి అనే కోరిక లేదా చేసే సాధననే సాధనా ప్రేరణ అంటాం. మెక్లిలాండ్, అట్కిన్‌సన్ ప్రకారం అనేక లక్ష్యాలతో సంబంధం ఉండి సాధారణంగా కొన్ని ఉన్నత ప్రమాణాలను సాధించాలనే ధ్యేయం వైపుగా కొనసాగింప చేసే చర్యలతో కూడిన ప్రవర్తనే సాధనా ప్రేరణ. మైకెవర్ చెప్పింది "ఈనాడు నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం రేపు నేను ఏ స్థాయిలో ఉండాలో నిన్ననే నేను ఆలోచించుకొని ఉండటమే" సాధన ప్రేరణకు మంచి ఉదాహరణ. ఎవరికైతే సాధించాలనే కోరిక ఉంటుందో వారు మాత్రమే ఏదైనా సాధించ గలుగుతారు. సామర్థ్యాలు ఉన్నప్పటికీ కూడా సాధించాలనే కోరిక లేకపోతే వారు ఆ సామర్థ్యాలను వినియోగించుకోలేరు. విద్యార్థులలో సాధన ప్రేరణ అనేది, ఆ విద్యార్థి తల్లిదండ్రులతో, ఇతర కుటుంబసభ్యులతో ఉండే సంబంధ బాంధావ్యాలను బట్టి, వారు విద్యకు ఇచ్చే విలువ ఆధారంగానూ, పాఠశాలలోని ఉపాధ్యాయులతో, సమవయస్కులతో ఏర్పడే చర్య–ప్రతిచర్యల వల్ల నూతన పరిచయాల వల్ల ఏర్పడుతుంది. అంటే ఉపాధ్యాయులు విద్యార్థుల సాధనా ప్రేరణను పెంచవచ్చు. సాధన ప్రేరణకు అలవాటు పడిన వ్యక్తి తనుసాధించిన గెలుపులో ఆనందాన్ని, సంతృప్తినీ, ఒకరకమైన గర్వాన్ని పొందుతాడు. జీవితలక్ష్యం స్పష్టంగా లేని వారికి సాధనాప్రేరణ తక్కువగా ఉంటుంది. సాధనాప్రేరణ తక్కువ ఉన్నట్లయితే వారి సామర్థ్యాల మేరకు కూడా వారు అభ్యసించలేరు.

**4.4.5. అభిరుచులు (Interests):**

దీనిని ఆసక్తి లేదా ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయంగా భావించవచ్చు. అభిరుచులు సహజంగా వ్యక్తులలో ఉంటాయి. ఇవి అభ్యసనం వల్ల కూడా ఏర్పడతాయి. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, కుటుంబసభ్యులు, చిన్ననాటి స్నేహితులు, నివసించే పరిసరాల నుండి అభిరుచులు ఏర్పడతాయి. అభిరుచులు వయస్సుతో పాటు మారవచ్చు. అందుకే రాజకీయంలో శాశ్వత మిత్రులుగాని శాశ్వత శత్రువులు గాని ఉండరని అంటారు. అంటే నేడు ఇష్టపడిన వ్యక్తి, వస్తువు, విషయం ఆ తరువాత అయిష్టంగా మారడానికి అవకాశం ఉంది. ఏ వ్యక్తినైతే మనం బాగా ఇష్టపడతామో ఆ వ్యక్తి ఇష్టాలను కూడా మనకు ఇష్టాలుగా మార్చుకుంటాం. అందుకే ఏ ఉపాధ్యాయుడైతే విద్యార్థులను బాగా ఇష్టపడతాడో, ఆ ఉపాధ్యాయున్ని విద్యార్థులందరూ ఇష్టపడతారు, అభిమానిస్తారు. అంతే కాకుండా అతడు బోధించే సబ్జెక్ట్‌ను పిల్లలు ఇష్టపడతారు. (If you want to be a good teacher, either you should love your students or you should love your children. If you love but you will be the best teacher) అందుకే ఈ మధ్య కష్టపడి చదవండి అనే నానుడి ప్రఖ్యాతి గాంచింది. ఏ వ్యక్తినైతే మనం ద్వేషిస్తామో, అతడు ఇష్టపడే వాటిని కూడా మనం ద్వేషిస్తాం. మనకు ఇష్టం లేని వ్యక్తి ద్వేషించే విషయాన్ని మనం ప్రేమిస్తాం. అందుకే శత్రువు యొక్క శత్రువు మిత్రుడౌతాడు. డిక్షనరీ ఆఫ్ సైకాలజి ప్రకారం అభిరుచిని మూడు రకాలుగా నిర్వచించవచ్చు.

1) **వ్యక్తి యొక్క అవధానాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచు స్థితి:** ఉదాహరణకు ఒక పిల్లవాడు లైబ్రరీలో ఒకే రకమైన సబ్జెక్ట్ పుస్తకాల మీదనే ఎక్కువ ధ్యాస (అవధానం) పెడుతున్నాడని అంటే అతనికి ఆ సబ్జెక్ట్ ఇష్టమై ఉంటుందని తెలుపుతుంది.
2) **వ్యక్తికి ఒక కృత్యము, ఒక వ్యాపకము, ఒక విషయము అతి ముఖ్యమని అనిపించే అనుభూతి:** ఉదాహరణకు ఒక పిల్లవాడు తన తీరిక సమయాలలో డ్రాయింగ్ వేస్తూ గడుపుతున్నాడంటే అతనికి డ్రాయింగ్ అంటే ఇష్టమన్నమాట.
3) **వ్యక్తిని ఒక వైపుకు లేదా ఒక దిశకు లేదా గమ్యానికి నడిపించే ప్రేరణా స్థితి:** ఉదాహరణకు ఒక పల్లవాడు పాఠశాల సమయం తరువాత ఎవరి ప్రోద్బలంతో కాకుండా తనకు తానే ప్రతీరోజు కరాటే క్లాసులకు వెళ్లుతున్నాడంటే అతనికి కరాటేపై అభిరుచి ఉందని అర్థం.

పైన పేర్కొన్న విధంగా అభిరుచులను మార్చడానికి అవకాశం ఉంది. కనుక తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు వారు ఆశించిన అభ్యసనాంశాలపై అభిరుచులను పెంపొందించడానికి కృషి చేయాలి. విద్యార్థులకు కేవలం తెలివితేటలు ఉంటే సరిపోదు. వారు సహజంగా అభిరుచి చూపించే విషయంపై ప్రోత్సాహాన్ని అవ్వగలిగితే ఆ రంగంలో రాణిస్తాడు. లేదా ఏదైనా సబ్జెక్ట్‌పైన అభిరుచిని ఏర్పరచగలిగితే వారు ఆ రంగంలో ప్రావీణులౌతారు.

**అభిరుచిని తెలుసుకొనే పద్ధతులు:**

1) **ప్రకటిత అభిరుచి (State interest):** పిల్లలే స్వయంగా తమకు ఇష్టమైన విషయం పేరు వృత్తి పేరు వెల్లడిస్తారు. ఉదాహరణకు ఒక పిల్లవాడు తనకు విజ్ఞాన శాస్త్రమంటే ఇష్టమని తాను డాక్టర్‌ను కావాలని అనుకుంటున్నానని తెలిపితే దానిని ప్రకటిత అభిరుచిగా భావించవచ్చు.
2) **వ్యక్తి అభిరుచి (Manifest interest):** వ్యక్తులు తమ ఇష్టాయిష్టాలను స్వయంగా వెల్లడించరు. వారిని పరిశీలించినప్పుడు, వారు ఏ అంశంలో ఎక్కువగా నిమగ్నమవుతున్నారో దేనిలో ఎక్కువ అవధానం చూపుతున్నారో దానిట గమనించడం వలన తెలుసుకునే అభిరుచిని వ్యక్తి అభిరుచి అనవచ్చు. అంటే వ్యక్తి తన అభిరుచి తన కృత్యాల ద్వారా వ్యక్త పరుస్తారన్నమాట.

**4.4.5. అభిరుచులు (Interests):**

దీనిని ఆసక్తి లేదా ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయంగా భావించవచ్చు. అభిరుచులు సహజంగా వ్యక్తులలో ఉంటాయి. ఇవి అభ్యసనం వల్ల కూడా ఏర్పడతాయి. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, కుటుంబసభ్యులు, చిన్ననాటి స్నేహితులు, నివసించే పరిసరాల నుండి అభిరుచులు ఏర్పడతాయి. అభిరుచులు వయస్సుతో పాటు మారవచ్చు. అందుకే రాజకీయంలో శాశ్వత మిత్రులుగాని శాశ్వత శత్రువులు గాని ఉండరని అంటారు. అంటే నేడు ఇష్టపడిన వ్యక్తి, వస్తువు, విషయం ఆ తరువాత అయిష్టంగా మారడానికి అవకాశం ఉంది. ఏ వ్యక్తినైతే మనం బాగా ఇష్టపడతామో ఆ వ్యక్తి ఇష్టాలను కూడా మనకు ఇష్టాలుగా మార్చుకుంటాం. అందుకే ఏ ఉపాధ్యాయుడైతే విద్యార్థులను బాగా ఇష్టపడతాడో, ఆ ఉపాధ్యాయున్ని విద్యార్థులందరూ ఇష్టపడతారు, అభిమానిస్తారు. అంతే కాకుండా అతడు బోధించే సబ్జెక్ట్‌ను పిల్లలు ఇష్టపడతారు. (If you want to be a good teacher, either you should love your students or you should love your children. If you love but you will be the best teacher) అందుకే ఈ మధ్య కష్టపడి చదవండి అనే నానుడి ప్రఖ్యాతి గాంచింది. ఏ వ్యక్తినైతే మనం ద్వేషిస్తామో, అతడు ఇష్టపడే వాటిని కూడా మనం ద్వేషిస్తాం. మనకు ఇష్టం లేని వ్యక్తి ద్వేషించే విషయాన్ని మనం ప్రేమిస్తాం. అందుకే శత్రువు యొక్క శత్రువు మిత్రుడౌతాడు. డిక్షనరీ ఆఫ్ సైకాలజి ప్రకారం అభిరుచిని మూడు రకాలుగా నిర్వచించవచ్చు.

1) **వ్యక్తి యొక్క అవధానాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచు స్థితి:** ఉదాహరణకు ఒక పిల్లవాడు లైబ్రరీలో ఒకే రకమైన సబ్జెక్ట్ పుస్తకాల మీదనే ఎక్కువ ధ్యాస (అవధానం) పెడుతున్నాడని అంటే అతనికి ఆ సబ్జెక్ట్ ఇష్టమై ఉంటుందని తెలుపుతుంది.
2) **వ్యక్తికి ఒక కృత్యము, ఒక వ్యాపకము, ఒక విషయము అతి ముఖ్యమని అనిపించే అనుభూతి:** ఉదాహరణకు ఒక పిల్లవాడు తన తీరిక సమయాలలో డ్రాయింగ్ వేస్తూ గడుపుతున్నాడంటే అతనికి డ్రాయింగ్ అంటే ఇష్టమన్నమాట.
3) **వ్యక్తిని ఒక వైపుకు లేదా ఒక దిశకు లేదా గమ్యానికి నడిపించే ప్రేరణా స్థితి:** ఉదాహరణకు ఒక పల్లవాడు పాఠశాల సమయం తరువాత ఎవరి ప్రోద్భలంతో కాకుండా తనకు తానే ప్రతీరోజు కరాటే క్లాసులకు వెళ్లుతున్నాడంటే అతనికి కరాటేపై అభిరుచి ఉందని అర్థం.

పైన పేర్కొన్న విధంగా అభిరుచులను మార్చడానికి అవకాశం ఉంది. కనుక తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు వారు ఆశించిన అభ్యసనాంశాలపై అభిరుచులను పెంపొందించడానికి కృషి చేయాలి. విద్యార్థులకు కేవలం తెలివితేటలు ఉంటే సరిపోదు. వారు సహజంగా అభిరుచి చూపించే విషయంపై ప్రోత్సాహాన్ని అవ్వగలిగితే ఆ రంగంలో రాణిస్తాడు. లేదా ఏదైనా సబ్జెక్ట్‌పైన అభిరుచిని ఏర్పరచగలిగితే వారు ఆ రంగంలో ప్రావీణులౌతారు.

**అభిరుచిని తెలుసుకొనే పద్ధతులు:**

1) **ప్రకటిత అబిరుచి(State interest):** పిల్లలే స్వయంగా తమకు ఇష్టమైన విషయం పేరు వృత్తి పేరు వెల్లడిస్తారు. ఉదాహరణకు ఒక పిల్లవాడు తనకు విజ్ఞాన శాస్త్రమంటే ఇష్టమని తాను డాక్టర్‌ను కావాలని అనుకుంటున్నానని తెలిపితే దానిని ప్రకటిత అభిరుచిగా భావించవచ్చు.
2) **వ్యక్తి అభిరుచి (Manifest interest):** వ్యక్తులు తమ ఇష్టాయిష్టాలను స్వయంగా వెల్లడించరు. వారిని పరిశీలించినప్పుడు, వారు ఏ అంశంలో ఎక్కువగా నిమగ్నమవుతున్నారో దేనిలో ఎక్కువ అవధానం చూపుతున్నారో దానిట గమనించడం వలన తెలుసుకునే అభిరుచిని వ్యక్తి అభిరుచి అనవచ్చు. అంటే వ్యక్తి తన అభిరుచి తన కృత్యాల ద్వారా వ్యక్త పరుస్తారన్నమాట.

3) **అభిరుచి మాపనలు :** ప్రయోజ్యులకు ప్రశాంత వాతావరణంలో పేపర్, పెన్సిల్ పరీక్షలు నిర్వహించి వారి అభిరుచులను మాపనం చేస్తారు. దీనికి ఉపయోగించే అభిరుచి మాపనలు – స్ట్రాంగ్ ఔద్యోగిక అభిరుచి మాపని, మినిసోటా ఔద్యోగిక అభిరుచి శోధిక, క్యూడర్ సాధారణ అభిరుచి సేర్వ, క్యూడర్ వృత్తి సర్వే, ఓహియో అభిరుచి సర్వే, లి థోర్పే వృత్తి అభిరుచి శోధిక మొదలైనవి. వీటిలో స్ట్రాంగ్ ఔద్యోగిక అభిరుచి మాపని గురించి తెలుసుకుందాం.

**స్ట్రాంగ్ ఔద్యోగిక అభిరుచి మాపని:** దీనిని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన స్ట్రాంగ్ అనే మనో విజ్ఞాన శాస్త్రవేత్త రూపొందించాడు. దీనితో వివిధ వృత్తులకు, పరిపాలనకు, పాఠశాల విషయాలకు, వినోద కార్యక్రమాలకు సంబంధించి ప్రాథమిక అభిరుచులను మాపనం చేస్తారు. ఈ మాపనిలో కింది పట్టికలో తెలిపినట్లుగా ప్రతీ విషయానికి ఎదురుగా L (ఇష్టం) I (చెప్పలేను) D (అయిష్టం) అను అక్షరాలు ఉంటాయి. ప్రయోజ్యులు తమకు సంబంధిచిన దానిని వృత్తంతో చుట్టాలి.

| క్రమ సంఖ్య | విషయము | ఇష్టం | చెప్పలేను | అయిష్టం |
|---|---|---|---|---|
| 1. | భౌతిక శాస్త్రం | L | I | D |
| 2. | సంగీతం | L | I | D |
| 3. | కుట్లు అల్లికలు | L | I | D |
| 4. | భూగోళ శాస్త్రం | L | I | D |

### 4.4.6 సహజ సామర్థ్యాలు (Aptituds)

సృష్టిలో అనేక రకాల జీవరాసులున్నాయి. వాటిని జంతువులు, మొక్కలుగా వర్గీకరించవచ్చు. మనకు కనిపించే అనేక రకాలైన మొక్కలలో ప్రతీ దానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. కొన్నింటిని, నీడ కొరకు, కొన్నింటిని కలప కొరకు, కొన్నింటిని ఔషదాలుగా, కొన్నింటిని కాయగూరల కొరకు, అలంకరణ కొరకు, పువ్వుల కొరకు, పండ్ల కొరు, వంట చెరుకు కొరకు, ఇలా అనేక రకాలుదా ఉపయోగపడతాయి. ఉపయోగపడదుకున్న ముళ్ల చెట్టును కూడా కంచెగా ఉపయోగిస్తాము. అసలు ఉపయోగపడని చెట్టు అంటూ ఉండదు. అదే విధంగా మనుషులలో కూడా భిన్న రకాలైన శక్తి సామర్థ్యాలుంటాయి. ప్రతీ ఒక్కరు ఈ సమాజానికి ఏదో రకంగా ఉపయోగపడే వారే. ప్రతీ వ్యక్తిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతను గుర్తించి అతనిని ఆ విధంగా ఉపయోగించుకున్నట్లయితే ఆ వ్యక్తితో పాటు సమాజానికి కూడా లాభం చేకూరుతుంది. వ్యక్తిలో ఉండే ఆ ప్రత్యేకతనే సహజ సామర్థ్యంగా పరిగణించవచ్చు.

ఒక వ్యక్తి ఒక రంగంలో రాణించడానికి వ్యక్తిలో స్వతహాగా పుట్టుకతో వచ్చిన సామర్థ్యాన్ని సహజ సామర్థ్యంగా భావించవచ్చు. అంటే పుట్టుకతోనే ప్రతీ వ్యక్తికి ఒక ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. ఆ సామర్థ్యాన్ని గుర్తించి ఆ రంగోలో తగిన శిక్షణ ఇస్తే ఆ రంగంలో మాస్టర్ అవుతాడు. ఉదాహరణకు ఒకే సారి ఒకే శిక్షణను పొందిన వైద్యులలో ఒకరు అత్యధిక నైపుణ్యాన్ని సంపాదించి ఆ వైద్యుడిని మించిన వారు లేరు అనుకునేలా పేరు ప్రఖ్యాతులు గాంచితే అది బ్యాచికి చెందిన మరొక వైద్యుడు అంత పేరు ప్రఖ్యాతులు పొందలేక పోవచ్చు. దీనికి కారణం ఏమంటే, మొదటి వ్యక్తిలో వైద్యుడికి ఉండవలసిన సామర్థ్యాలు అతనికి పుట్టుకతో వచ్చాయి. రెండవ వ్యక్తికి అవి లేవు అని భావించవచ్చు. అదే విధంగా సంగీతం నేర్చుకున్న వ్యక్తి అంతర్జాతీయ ఖ్యాతి పొందితే తమ సహచరులకు అంతే గుర్తింపు రాక పోవడానికి కారణం, వారిలో సహజ సామర్థ్యం లేకపోవడమే, వ్యక్తులు వివిధ రంగాలను వారి వారి అభిరుచులను బట్టిగాని, జీత భత్యాలు ఎక్కువ ఇచ్చే దానిపై ఆధారపడి ఎంపిక చేసుకుంటారు. కొందరు ప్రతీ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొని ఎంపికైన వాటిలో దేనిలో అయితే జీతం ఎక్కువగా ఉంటుందో దానిలో స్థిర పడాలనుకుంటారు. కాని సరైన ఫలితాలను సాధించలేక సంతృప్తి పొందలేకపోవడానికి కారణం అతను తన సహజ సామర్థ్యానికి తగిన వృత్తిని చేపట్టలేకపోవడమే.

**కృత్యం**

> సంఖ్యా పరంగా ప్రపంచంలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశం ఒలంపిక్ క్రీడలలో అనేక చిన్న దేశాల కంటే చివరిలో ఉండటానికి గల కారణాలు ఏమై ఉండవచ్చు? రాయండి.

## సహజ సామర్థ్యం – నిర్వచనం

1. ఒక పనిని నిర్వహించడానికి కావలసిన సామర్థ్యం పుట్టుకతోనే స్వతహాగా కొంత ఉంటే దానికి తగిన శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ప్రావీణ్యులను తయారుచేయవచ్చు. ఒక ప్రత్యేకమైన విభాగంలో, ఉన్నత స్థాయిని చేరగలిగే కౌశలాన్ని శక్తి సామర్థ్యాన్ని సహజ సామర్థ్యం అంటారు. **– మన్.**
2. కొన్ని ప్రత్యేకమైన సమస్యలను పరిష్కరించడానికి తోడ్పడే లక్షణాలు కలిగిన ప్రవర్తననే సహజ సామర్థ్యం అంటారు. **– బింగ్‌హం.**
3. వ్యక్తి భవిష్యత్తులో ప్రత్యేక కౌశలాన్ని, సామర్థ్యాన్ని సూచించే ప్రస్తుత పరిస్థితినే సహజ సామర్థ్యం అంటారు. **– క్లార్క్ యల్ హల్**
4. సామర్థ్యాలను, నైపుణ్యాలను నేర్చుకోవడానకి, సాధనను ప్రదర్శించడానికి అవసరమైన అంతర్గత శక్తులను, అభివృద్ధి చెందిన సామర్థ్యాలను తెలిపే దానిని సహజ సామర్థ్యం అంటారు. **– హన్, మాక్‌లీన్**

వ్యక్తి రంగంలో రాణించగలడో తెలిపేదే సహజ సామర్థ్యం. ఎక్కువ సహజ సామర్థ్యం గలిగిన వ్యక్తి తక్కువ సమయంలో నైపుణ్యతను సాధించగలడు. ఎంత ఎక్కువ సహజ సామర్థ్యం ఉంటే అంత ఎక్కువగా ఆ వ్యక్తి ఆ రంగంలో రాణించగలడు. వ్యక్తిలో సహజ సామర్థ్యం ఒక నిగూఢ శక్తిగా ఉంటుంది. అది సరైన శిక్షణ ద్వారా వికసిస్తుంది. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులలో ఉన్న సహజ సామర్థ్యాన్ని గుర్తించి సరైన శిక్షణ సూచించగలిగి, దానిపై సరైన అభిరుచి, వైఖరులను పెంచ గలిగితే విద్యా వ్యవస్థ లక్ష్యాలు నెరవేరినట్టే. ఉదాహరణరు సచిన్ టెండూల్కర్‌కు క్రికెట్ ఆటకు సంబంధించిన సహజ సామర్థ్యాలు, విశ్వనాథ్ ఆనంద్, కొనేరు హంపికి చెస్‌లో, అభినవ్ బింద్రేకు విలువిద్యలో, ఎ.ఆర్. రహెమాన్‌కు మ్యూజిక్‌లో, ఆర్.పి పట్నాయక్‌కు గానంలో, సానియా మిర్జాకు టెన్నిస్ సహజ సామర్థ్యాలు ఉండడం వల్లనే వారు వారి రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం జరిగింది. ఒకవేళ సచిన్ టెండూల్కర్‌ను చెస్‌లో, విశ్వనాథ్ ఆనంద్‌కు క్రికెట్‌లో, అభినవ్ బింద్రేను సంగీతంలో, సానియా మిర్జాను విలువిద్యలో ప్రోత్సహించినట్లయితే వారికి సరియైన సహజ సామర్థ్యాలు లేని కారణంగా సాధారణ వ్యక్తులుగా మిగిలేవారు.

## సహజ సామర్థ్యాలను గుర్తించడం

సహజ సామర్థ్యాలను గుర్తించడానికి రెండు రకాల పరీక్షలున్నాయి. వ్యక్తుల అభిరుచిని కనుగొని వారికి ఆ రంగంలో సహజ సామర్థ్యం ఉందో లేదో తెలుసుకోవడానికి చేసే పరీక్షలు, ఉదాహరణకు – మెకానిజం మీద ఇష్టం ఉన్న వ్యక్తికి బెన్నేట్ మెకానికల్ అప్టిట్యూడ్ టెస్ట్, సంగీతంపై అభిరుచి ఉన్న వ్యక్తికి షీ షోర్ మెజర్స్ ఆఫ్ మూజికల్ టాలెంట్ టెస్ట్, చిత్రలేఖనం మీద అభిరుచి ఉన్న వ్యక్తికి షీషోర్ ఆర్ట్ జడ్జ్‌మెంట్ టెస్ట్, ఉపాధ్యాయవృత్తిని చేపట్టాలని ఇష్టం ఉన్న వారికి టీచింగ్ అప్టిట్యూడ్ టెస్ట్‌లు ఉపయోగిస్తారు. రెండవ రకమైన సహజ సామర్థ్య పరీక్షలు ప్రత్యేకంగా ఎలాంటి అభిరుచి లేని వ్యక్తులను పరీక్షించడానికి వారిలో ఉన్న సహజ సామర్థ్యాలను గుర్తించడానికి ఉపయోగిస్తారు. ఇలాంటి పరీక్షలను సహజ సామర్థ్య పరీక్ష మాల అంటారు. ఉదాహరణకు డిఫరెన్షియల్ అప్టిట్యూడ్ టెస్ట్ బ్యాటరీ.

**డిఫరెన్షియల్ అప్టిట్యూడ్ టెస్ట్ బ్యాటరీ:** దీనిని థర్‌స్టన్ ప్రాథమిక శక్తుల సిద్ధాంతం ఆధారంగా జార్జ్ కె బిన్నేట్, అతని అనుచరులు రూపొందించారు. దీనిలో 8 రకాల సహజ సామర్థ్య పరీక్షలుంటాయి.

1. శాబ్దిక వివేచనం(Verbal Reasoning)
2. అమూర్త వివేచనం (Abstract Reasoning)
3. స్థాన సంబంధాలు (Space Relations)
4. సంఖ్యాత్మక సామర్థ్యం (Numarical Ability)
5. క్లరికల్ వేగం, ఖచ్చితత్వం (Clerical Ability)
6. యాంత్రిక వివేచనం (Mechanical Reasoning)
7. భాషా వాడుక స్పెల్లింగ్ (Language usage - Spelling)
8. భాషా వాడుక వ్యాకరణం (Language usage - Grammar)

**సహజ సామర్థ్యాలను గుర్తించడం – ప్రాముఖ్యత :**

1. సహజ సామర్థ్య పరీక్షలు మార్గదర్శకత్వానికి వెన్నెముక లాంటివి. విద్యార్థి దశలో గాని, వృత్తి స్వీకరించే దశలో గాని, వారి సహజ సామర్థ్యాల ఆధారంగా మార్గదర్శకత్వం చేస్తే, ఆ వృత్తిలో సఫలత సాధించగలరు.
2. విద్యార్థుల సహజ సామర్థ్యాలు ఉపాధ్యాయులకు తెలిసి ఉన్నట్లయితే వారి సహజ సామర్థ్యాల పట్ల అభిరుచిని, ధనాత్మక వైఖరిని పెంపొందించవచ్చు.
3. సహజ సామర్థ్యాల పరిజ్ఞానం విద్యార్థులకు కలిగించినట్లయితే వారు తమకు సహజ సామర్థ్యం లేని వృత్తులను చేబట్టి అసంతృప్తి, నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా చూడవచ్చు.
4. సహజ సామర్థ్యాల పరిజ్ఞానం ఆయా సంస్థ యాజమాన్యాలకు తెలిసి ఉండడం వలన తాము ఇచ్చే శిక్షణకు అనువైన విద్యార్థులను ఎంపిక చేసుకొని వారి సమయం, డబ్బు వృధా కాకుండా కాపాడుకోవచ్చు.
5. వివిధ సహజ సామర్థ్యాలకు అనువైన కరిక్యులంను రూపొందించడం వలన విద్యార్థుల శక్తి సామర్థ్యాలు పూర్తిగా వినియోగించుకోవడానికి వీలౌతుంది.

**4.4.7. వైఖరులు (Attitudes)**

పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనబడుతుంది. అనే సామెత అందరికీ తెలిసి ఉంటుంది. మనం వ్యక్తులను, విషయాలను, సంస్థలను ఎలా చూస్తే అలాగే కనబడతాయి. విద్యార్థికి పాఠశాల చాలా బావుంది అనే అభిప్రాయముంది అంటే, అతనికి పాఠశాల పట్ల ధనాత్మక వైఖరి ఉన్నట్టుగా భావించవచ్చు. అంతే కాదు, అతను విద్య పట్ల అభిరుచిని పెంపొందించుకొని విద్యలో ఉన్నత స్థితి పొందవచ్చు. ఒక వేళ పాఠశాలలో ఉపాధ్యాయులు దండిస్తారు. ఏ మాత్రం భద్రత లేదు అని భావిస్తే, పాఠశాల పట్ల ఋణాత్మక వైఖరి ఉన్నట్లుగా భావించవచ్చు. అతడు విద్యపట్ల అంతగా సుముఖత వ్యక్తపర్చడం లేదంటే విద్యలో వెనకబడడానికి అవకాశం ఉంది. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు అన్నం తినకపోతే, మారాం చేస్తుంటే బడికి పంపిస్తే రోగం కుదురుతుంది, పంతుల్యా రోగం కుదురుస్తాడని అటుంటారు. అప్పటి మట్టుకు భయపడినా, బడిపట్ల ఋణాత్మక వైఖరి ఏర్పడదు. వల్ల పిల్లలు బడికి వెళ్లె వయస్సులో పాఠశాలకు సర్దుబాటు కావడానికి చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది.

ఏ విషయంపైన అయినా ధనాత్మక వైఖరి ఉంటే, వ విషయం అభ్యసనం మెరుగుగా ఉంటుంది. సంతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తుంది. ఆ విషయంపైన అభిరుచి ఏర్పడుతుంది. సమాజంలో ప్రతీ అంశంలో మంచి చెడులుంటాయి. మంచిని చూడగలిగితే సంతోషంతో పాటు, సంతృప్తి మిగులుతుంది. చెడును మాత్రమే చూస్తే, అసంతృప్తికి గురయ్యే ఏ పనినైనా సమర్థవంతంగా చేయలేరు. వైఖరులు తల్లిదండ్రుల నుంచి, కుటుంబసభ్యుల నుంచి, సమవయస్కుల సమూహం నుంచి, ఇరుగు పొరుగు వారి నుంచి నేర్చుకునే అవకాశం ఉంది. కొంత మంది తీవ్రవాదం వైపు ఆకర్షించబడడానికి కారణం వారు పుట్టిపెరిగిన వాతావరణంస కుటుంబ సభ్యుల వైఖరి కారణమౌతుంది. లేదా స్నేహాలు కారణమౌతాయి. ఏ సామాజిక వాతావరణంలో పెరిగిన పిల్లలు ఆ వాతావరణపు వ్యక్తుల వైఖరిపై వారి వైఖరి నిర్మింపబడే అవకాశం ఉంటుంది. వైఖరులనునవి శాశ్వతం కాదు. మారడానికి అవకాశం ఉంది వైఖరులు పుట్టుకతో ఏర్పడేవి కావు. జీవితానుభవాల వల్ల లేదా అభ్యసనం ద్వారా ఏర్పడతాయి. ఎవరి ప్రభావం పిల్లల పైన ఎక్కువగా ఉంటుందో, ఆ వ్యక్తుల వైఖరి ఆ పిల్లలకు ఏర్పడుతుంది. ఒక సారి ఏర్పడిన ప్రతికూల వైఖరి జీవితాంతం ఉంటుందనే నిబంధన ఏమీ లేదు. నూతన అనుభవాల వల్లగాని, అభ్యసనవల్లగాని అనుకూల వైఖరి ఏర్పడవచ్చు.

ఉపాధ్యాయుడు తాను బోధించే విషయంపైన చక్కని వైఖరిని కలిగి ఉన్నప్పుడు ఆ పిల్లలు ఆ విషయంపైన ధనాత్మక వైఖరిని ఏర్పరుచుకోగలడు. ఏ వృత్తిలో అయితే కొనసాగుతూ ఆ వృత్తిపై ధనాత్మక వైఖరి లేనట్టయితే అసంతృప్తితో పాటు, ఆ వృత్తిని ఇతరులు కూడా అయిష్టపడై విధంగా తయారౌతుంది. వైఖరి లేనట్టయితే అసంతృప్తితో పాటు, ఆ వృత్తిని ఇతరులు కూడా అయిష్టపడే విధంగా తయారౌతుంది. విద్యార్థి ఎంత ప్రజ్ఞావంతుడైనప్పటికీ విద్యపట్ల ఋణాత్మక వైఖరి కనబరిస్తే, విద్యలో రాణించలేడు.

"ఒక పరిస్థితిపట్ల గాని, వ్యక్తిపట్ల గాని, విషయం పట్ల గాని, వస్తువుపట్ల గాని పొందికగా ప్రతిస్పందించడానికి ఉండే సంసిద్ధతను వైఖరి అంటారు". – ఫ్రీమన్

"సాంఘిక విషయాలకు బాహ్యంగా ప్రతిస్పందించే సంసిద్ధత." – మెగ్రోన్స్

వైఖరులను వ్యక్తి బాహ్య ప్రవర్తన ద్వారా మాత్రమే తెలుసుకోవచ్చు. ఇవి వ్యక్తిలో విడిగా ఉండక, అతని మానసిక, ఉద్వేగ స్థితిలో కలిసి పనిచేస్తాయి. వైఖరులకు వ్యక్తిగత, సాంఘిక, రాజకీయ, ఆర్థిఖ, నైతిక సంబంధం ఉంటుంది.

**కృత్యం**

| వ్యక్తి వైఖరి విధానాలు అతని మూర్తిమత్వ వికాసంలో ఎలా దోహదపడతాయి? |
|---|

వైఖరులు సాంఘిక ప్రవర్తనలో పెంపొందే భావనలు, ముఖ్య భాగాలైన కులాలు, మతాలు, వివాహం, కుటుంబ సంబంధాలు మొదలైన సాంఘిక సంస్థలకు వైఖరులు పునాధి రాళ్ల వంటివి. సాంఘిక వాతావరణంలో పెంపొందే ఏవైనా దురాభిప్రాయాలుంటే వాటిని తొలగించి సమర్థవంతంగా సరియైన ఉద్దీపనలను పాఠశాల ఇవ్వడం ద్వారాధనాత్మక వైఖరులను పెంపొందింప చేయవచ్చును.

వ్యక్తి సహజ సామర్థ్యాలు అతనికి ఏ రంగంలో ప్రావీణుడు కాగలడో సూచిస్తే, ఆ సామర్థ్యాలపై సరైన అభిరుచి కలిగించి దాని పట్ల ధనాత్మక వైఖరి పెంపొందింప చేసినప్పుడు పరిపూర్ణ మానవునిగా రూపుదిద్దగలం. ఈ మూడింటి మధ్య సమన్వయం లేకపోతే సంపూర్ణాభివృద్ధి కొరవడుతుంది.

**పాఠశాల వైఖరులు:** పిల్లలకు పాఠశాల పట్ల వైఖరులు సహజంగా వారికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉన్న అనుభవాల

వల్ల ఏర్పడతాయి. అనుభవాలు తృప్తిని కలిగిస్తే, అనుకూల వైఖరులలు, అసంతృప్తిని కలిగిస్తే, ప్రతికూల వైఖరులు ఏర్పడతాయి. పిల్లలకు బడిపట్ల వైఖరులు వారు బడిలో చేరకముందు గాని, చేరిన తరువాత గాని ఏర్పడతాయి.

బడిలో చేరడానికి ముందు ఏర్పడే వైఖరులు పైన తెలియజేసిన విధంగా పిల్లల తల్లిదండ్రులు బడిపట్ల, ఉపాధ్యాయుల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండి, సంతృప్తిని కలిగించే విధంగాపిల్లలతో సంభాషిస్తే, అంటే పాఠశాలలో ఆటలు ఆడిస్తారు, చక్కని కథలు చెప్తారు, అని చెప్తే, ఇంటి కన్నా బడ పదిలం అనే భావన కలిగిస్తే అనుకూల వైఖరులు ఏర్పడి, పాఠశాల వయసుంసలో ఎలాంటి మరాం చేయకుండా పాఠశాలకు వెళతారు. అదే విధంగా పాఠశాలలోకి అడుగు పెట్టగానే ఉపాధ్యాయులు బయపెట్టే విధంగా కాకుండా కథలను చెప్తూ, అటలాడిస్తూ, తల్లిదండ్రుల మాటలను నిజం చేస్తూ ఆత్మీయతతో, స్వేచ్ఛా పూర్వక వాతావరనాన్ని కలిగిస్తే పిల్లలుతొందరగా సర్దుబాటు అయి విద్య పట్ల దనాత్మక వైఖరిని కొనసాగిస్తారు. ఇతర బడి బయట పిల్లలను సైతం ఆకర్షిస్తారు.

**పిల్లలకు పాఠశాల పట్ల, విద్య పట్ల అనుకూల వైఖరులు ఏర్పడడానికి చేపట్ట వలసిన కార్యక్రమాలు**

1. ఇంటికన్నా బడి పదిలం అన్న భావన తల్లిదండ్రులలో కలిగించాలి. తద్వారా బడిలో చేరబోయే తమ పిల్లలకు అనుకూల వైఖరులు ఏర్పర్చగలుగుతారు.
2. పాఠశాలల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు, ఆటల పోటీలకు బడిలో చేరబోయే పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలి. వారి పిల్లలను సైతం తీసుకురావాలని కోరాలి.
3. ఉపాధ్యాయులు పిల్లలను చిరునవ్వుతో పలకరిస్తూ, స్నేహ పూరిత వాతావరణం నెలకొల్పాలి.
4. స్వేచ్ఛాపూరిత వాతావరణంలో విద్యనేర్చుకునేటట్లు చేయాలి.
5. విద్యార్థుల ఆసక్తులకు అనుగుణంగా సహపాఠ్య కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.
6. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా అవకాశాలు కల్పించి విజయం సాధించే దిశగా కృషి చేయాలి. విజయం సాధించినప్పుడు అభినందించాలి.
7. పాఠ్యాంశాలు కృత్యాల ద్వారా, ప్రాజెక్ట్‌ల ద్వారా నేర్చుకునేటట్టు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.
8. పాఠ్యాంశాలకు కృత్యాల ద్వారా, ప్రాజెక్ట్‌ల ద్వారా నేర్చుకునేటట్టు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.

వైఖరి మాపనులు ఈక్వల్లి అప్పియరింగ్ ఇంటర్వెల్ స్కేల్ థర్‌స్టన్ రూపొందించాడు. క్యుములేటివ్ స్కేల గట్‌మన్ రూపొందించాడు. రేటింగ్ స్కేల్ లైకర్ట్ రూపొందించాడు.

వైఖరులను మాపనం చేయడానికి చాలా వరకు రేటింగ్ స్కేల్‌లు వాడతారు. ఈ స్కేల్‌లో కొన్ని ప్రవచనాలుంటాయి. వాటికి ఎదురుగా ఐదు బింధవులతో కూడిన మాపని ఉంటుంది.

1. పూర్తిగా అంగీకరిస్తున్నాను – 5 గణనలు
2. అంగీకరిస్తున్నాను – 4 గణనలు
3. చెప్పలేను (సందిగ్ధం ఉంటే) – 3 గణనలు
4. వ్యతిరేకిస్తున్నాను – 2 గణనలు
5. పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను – 1 గణన

ఉదాహరణ: ఉపాధ్యాయ వృత్తి మాపని.

కింద ఇచ్చిన ప్రవచనాలను చదివి దానికి ఎదురుగా ఉన్న నీవు ఏకీభవించే ఏదైనా గడిలో టిక్ మార్క్ పెట్టండి.

| క్ర.సం | ప్రవచనం | పూర్తిగా అంగీ కరిస్తున్నాను | అంగీకరి స్తున్నాను | చెప్పలేను | వ్యతిరేకి స్తున్నాను | పూర్తిగా వ్యతి రేకిస్తున్నాను |
|---|---|---|---|---|---|---|
| 1 | ఉపాధ్యాయ వృత్తి మందకోడిగా ఉంటుంది | | | | | |
| 2 | ఉపాధ్యాయ వృత్తికి అసాధారణ సామర్థ్యాలు అవసరం లేదు | | | | | |
| 3 | జాతి నైతిక ప్రమాణాలు ఉపాధ్యాయులపై ఆధారపడతాయి | | | | | |
| 4 | ఉపాధ్యాయ వృత్తిబతుకుతెరువుకు ఒక మార్గం | | | | | |
| 5 | అన్ని వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి ఆదర్శమైనది | | | | | |
| 6 | ఉపాధ్యాయులు, తమ వృత్తిలో పిల్లలతో ఆనందంగా ఉండవచ్చు | | | | | |
| 7 | ఉపాధ్యాయ వృత్తి సోమరులకు తగిన ఉద్యోగం | | | | | |
| 8 | విద్యా బోధన వలన ఆత్మ సంతృప్తి పొందవచ్చు. | | | | | |

### 4.4.8 స్మృతి (Memory)

మానవుని జీవితంలో స్మృతి ఎంతో ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. "స్మృతి లేనిదే జీవితము లేదు" వ్యక్తి గతములో అభ్యసించిన విషయాలను లేదా అనుభవాలను గుర్తుకు లేదా జ్ఞాపకానికి తెచ్చుకోవడాన్ని "స్మృతి" అంటారు. అభ్యసనము మరియు స్మృతి రెండూ కూడా రూపాయి నాణానికి రెండు తలాల వంటివి. అభ్యసనము లేనిదే స్మృతి లేదు. స్మృతి లేకపోతే అభ్యసనం జరగదు. విద్యారంగంలో స్మృతి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులు నూతన విషయాలను నేర్చుకోవాలన్నా విభిన్నంగా ఆలోచించాలన్న, అభ్యసించిన విషయాలను పరీక్షలలో రాయాలన్నా స్మృతి ఎంతో ముఖ్యము.

బందువుల పేర్లు, ఒక వ్యక్తి పేరు, ఊరిపేరు, తల్లిదండ్రుల పేర్లు ఇలాగా ఎన్నో విషయాలు గుర్తుపెట్టుకొని అడిగినపుడు తిరిగి వెంటనే చెప్పడం జరుగుతుంది. దీనికి మూలం స్మృతే.

పూర్వం గ్రీకు తత్వవేత్త అయిన ప్లేటో "మానవుని మనస్సు లక్క ముద్ద లాంటిది" అని అన్నాడు. మానవుడు తను అనుభవించే అనుభవాలు అభ్యసనం ద్వారా ఏర్పరుచుకొనే జ్ఞానం లక్కలాంటి మనస్సుపై ముద్రలు వేస్తాయని, వాటిని ఉపయోగించుకొని తన సమస్యలను పరిష్కరించుకొంటాడని పేర్కొన్నాడు.

స్మృతిపై శాస్త్రీయపద్దతులలో పరిశీలన చేసినవారిలో గాల్టన్ (Sir Fransis Galton) ఒకరు. ఇతడు స్థాపించిన 'మానవమితి ప్రయోగశాల'లో (Anthropometric Lab) మనుషులు స్మృతిపై అనేక పరిశీలనలను, తాను ప్రచురించి "ఇంక్వయిరీ ఇన్ టు హ్యూమన్ ఫ్యాకల్టీ అండ్ ఇట్స్ డెవలప్‌మెంట్" (Inquiry into Human Faculty and its development)లో పొందుపరిచాడు.

స్మృతిని గురించి శాస్త్రబద్ధంగా మొట్టమొదట పరిశోధన చేసిన వ్యక్తి జర్మనీ దేశస్థుడైన "హెర్మన్ ఎబ్బింగాస్" (Hermann Ebbinghaus) ఇతను 1885వ సం॥లో "ఆన్ మెమొరి (On memory) అనే గ్రంథం ప్రయోగాత్మక మనోవిజ్ఞానం(Expermental Psychology)లో ఒక మైలురాయి ఎబ్బింగాస్ స్మృతిపై చాలా ప్రయోగాలు చేశాడు.

స్మృతిలో మూడు దశలున్నాయి.

ఎ) ఒక అనుభవం లేదా ఉద్దీపన మెదడు మీద ముద్ర మేయడం.

బి) నాడీ వ్యవస్థపై ఈ అనుభవాలు, లేదా ఉద్దీపనలు కొన్ని మార్పులు చేయడం.

సి) ఈ మార్పులవల్ల ప్రవర్తన ప్రభావితమవుతుంది.

**స్మృతి నిర్వచనం :**

**స్టౌట్ :** మునుపు నేర్చుకొన్న విషయాలను అలాగే జ్ఞాపకానికి తెచ్చుకోవడాన్ని స్మృతి అనవచ్చు.

**రైబర్న్ :** గత అనుభవాలను మెదడులో స్థిరీకరింపచేసి మనకు అవసరమైనప్పుడు వాటిని చేతనంలోకి తీసుకొని రాగలిగిన శక్తినే స్మృతి అందురు.

**స్మృతి ప్రక్రియ** : మనలో స్మృతి ప్రక్రియలో ముఖ్యంగా 3 దశలున్నాయి

అవి. 1) ఎన్‌కోడింగ్ లేదా స్మృతి చిహ్నాలు (Engram or Neurogram)

2) ధారణ (Retention)

3) జ్ఞప్తికి తెచ్చుకోవడం (Retrieval)

**స్మృతి చిహ్నాలు :** పరిసరాలలోని అనుభవం లేదా ఉద్దీపనలను జ్ఞానేంద్రియాలు గ్రహించి జ్ఞాన నాడుల ద్వారా మెదడును చేరి, మెదడుపై ముద్రలు వేయబడును. వీటిని ఎన్‌గ్రామ్ లేదా న్యూరోగ్రామ్ అందురు. ఇవి ఎంత బలంగా ముద్రింపబడితే అంత ఎక్కువ కాలం గుర్తుండును.

**ధారణ:** మనము అనుభవపూర్వకంగా నేర్చుకొన్న విషయాలను మెదడులో కొంతకాలం పాటు నిల్వ ఉంచుకోవడాన్ని 'ధారణ' అందురు. (Retention)

**పున:స్మరణ :** అవసరమైనప్పుడు ధారణలో ఉన్న అనుభవాలు తిరిగి జ్ఞాప్తికి తెచ్చుకోవడాన్ని పున:స్మరణ అందురు. ఎన్‌గ్రామ్ సరిగా లేక ధారణ తక్కువైనపుడు కాలం గడిచేకొద్ది పున:స్మరణ తగ్గిపోవును.

**స్మృతిలో అంశాలు :**

స్మృతి అంశాలలో 1. అభ్యసనం 2. ధారణ 3. పున:స్మరణ 4. గుర్తింపు 5. పునరభ్యసనం మొదలైనవి ఉంటాయి. మనం ఇప్పుడు ఈ అంశాలను ఒక్కొక్కటిగా తెలుసుకుందాం.

**1. అభ్యసనం** (Learning)

స్మృతి ప్రక్రియలో అభ్యసనం మొదటి సోపానం. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల ప్రకారం మంచి అభ్యసనం జరగాలంటే ఈ కింది పద్ధతులను అవలంభించాలని పేర్కొన్నారు.

- అభ్యసనఅంశాలను అర్థవంతంగా అమర్చి నేర్చుకోవడం(Meaningful learning)
- అభ్యసన అంశాలను అన్నింటిని ఒకసారి, ఒకే దఫా నేర్చుకోవడం(Massed learning)
- అభ్యసించేటప్పుడు విద్యార్థులు మధ్య మధ్యలో విరామం తీసుకుంటూ అభ్యసించడం
- అభ్యసన అంశాలను భాగాలుగా విభజించి, ఒక్కొక్కభాగాన్ని అభ్యసించుకొంటూ ముందుకు వెళ్ళడం (Part Method of learning)

• విషయాంశాలను మొత్తంగా, సంపూర్ణంగా, పూర్తిగా మొదటి నుంచి చివరి వరకు చదివి నేర్చుకోవడం (Whole Method of Learning)

• ఏకాగ్రతతో (Concentration) నేర్చుకోవడం

• నేర్చుకోవాలనే మొదటి మెట్టుగా చెప్పడం వల్ల పై పద్ధతులను ఉపయోగించి విషయాంశాలను నేర్చుకొంటే అవి స్మృతి పథంలో ఎక్కువకాలం ఉంటాయి.

**2. ధారణ** (retention)


స్మృతి ప్రక్రియలో రెండవ సోపానం ధారణ. నేర్చుకొన్న విషయాలను మెదడులో కొంతకాలం నిలుపుకోవడాన్ని ధారణ అంటారు.

అభ్యసన అంశాలు మన జ్ఞానేంద్రియాల ద్వారా మెదడును చేరి స్మృతిచిహ్నాలను ఏర్పరుస్తాయని ముందే తెలుసుకున్నాం. ఏర్పడిన స్మృతి చిహ్నాలు బలంగా,నాణ్యతతో (అవగాహనతో) ఏర్పడినపుడు అవి నిరూపణకు గురికావు.

గత అనుభవాలను లేదా అభ్యసన అంశాలను విద్యార్థులు పున:స్మరించుకోవడం, నూతన అభ్యసన అంశాలకు అన్వయించడం వల్ల 'ధారణ' పెరుగుతుంది. ఈ ధారణశక్తిలో వ్యక్తుల మధ్య తేడాలు ఉంటాయి.

**ధారణ వక్రరేఖ – లక్షణాలు:**

క్రింద పేర్కొన్న పటంలో ఎబ్బింగాస్ చేసిన ప్రయోగాలద్వారా గీయబడిన ధారణ వక్రరేఖను గమనించండి.




**ధారణ వక్ర రేఖ**



**ఎబ్బింగ్ హాస్**

| **అభ్యసించిన తరువాత కాలము** | **స్మృతి శాతము** | **విస్మృతి శాతము** |
|---|---|---|
| 20 నిమిషాల తరువాత | 53% | 47% |
| 1 రోజుల తరువాత | 34% | 66% |
| 2 రోజుల తరువాత | 28% | 72% |
| 6 రోజుల తరువాత | 25% | 75% |
| 31 రోజుల తరువాత | 21% | 79% |

- వ్యక్తి అభ్యసించిన తొలి దశలలో విస్మృతి చాలావేగంగా జరుగుతుంది.
- వ్యక్తి అభ్యసించిన విషయాలు పూర్తి క్షయానికి లోనుకావు.
- ధారణ కాలం ఎక్కువ అయ్యే కొద్ది అభ్యసనాంశాలు కొద్దో గొప్పో స్మృతిపథములో ఉంటుంది.

పై విషయాలను ధారణ వక్రరేఖలో గమనించవచ్చు.

**3. పున:స్మరణ**(Recall) :

స్మృతి ప్రక్రియలో మూడవ సోపానం పున:స్మరణ. మన ధారణలో ఉన్న అభ్యసన అనుభవాలను, విషయాంశాలను గుర్తుకు తెచ్చుకోవడాన్ని లేదా జ్ఞప్తికి తెచ్చుకోవడాన్ని పున:స్మరణ అంటాం.

మన విద్యావిధానంలో అనేక సందర్భాలలో విద్యార్థుల ధారణను పరీక్షించడం జరుగుతుంది. అందులో పున:స్మరణకు సంబంధించిన అనేక విషయాలుంటాయి. పరీక్షలలో వ్యాసరూప ప్రశ్నలు, ఖాళీలు పూరించడం మొదలైన ప్రశ్నలకు జవాబులు రాయాలంటే విద్యార్థులు వారు అభ్యసించిన విషయాంశాలను పున:స్మరణ చేసుకోవలసిందే.

**4. గుర్తింపు** (Recognition) :

స్మృతి ప్రక్రియలో నాలుగో సోపానం గుర్తింపు. గతంలో చూసిన మూర్త అనుభవాలు లేదా అంశాలు వస్తువు ఆధారంగా గుర్తించగలగడమే "గుర్తింపు". సాధారణంగా పున:స్మరణకంటే గుర్తింపు తేలిక

మనం చాలా ఏళ్ళ క్రితం చూసిన వ్యక్తి మళ్ళీ కనిపించినట్లయితే ఆ వ్యక్తిని చూడగానే అతన్ని గుర్తిస్తాం. అయితే పేరు మరిచిపోయి ఉండవచ్చు. ఆ వ్యక్తి తిరిగి కనిపించడం వల్లనే మనం అతణ్ని గుర్తించగలిగాం.

మన పాఠశాలలో త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పరీక్షా పత్రాలలో కనబడే బహుళైచ్ఛిక ప్రశ్నలు (Multiple Choice Questions) గుర్తింపుకు సంబంధించినవే.

$$\text{గుర్తింపు గణన} = \left[\frac{\text{ఒప్పులు} - \text{తప్పులు}}{\text{మొత్తం}}\right] \times 100$$

ఉదా॥ - ఒక విద్యార్థి ఒక పరీక్షలో 15 బహుళైచ్ఛిక ప్రశ్నలకు 12 ప్రశ్నలకు మాత్రమే సరైన సమాధానం ఇచ్చినప్పుడు అతని గుర్తింపు గణన క్రింది విధంగా గుర్తిస్తారు.

$$\text{గుర్తింపు గణన} = \frac{12 - 3}{15} \times 100 = 60$$

**5. పునరభ్యసనము** (Relearning) :

స్మృతి ప్రక్రియలో అయిదవ సోపానం పునరభ్యసనం. మనం ఒకసారి అభ్యసించిన విషయాన్ని కొంతకాలం అయిన తరువాత మరచిపోతాం. ఆ విషయాన్ని మళ్ళీ అభ్యసించవలసి వచ్చినప్పుడు దాన్ని త్వరగా నేర్చుకొంటాం.

అభ్యసించిన విషయాంశాలను కొంతకాలం తరువాత తిరిగి అభ్యసించడాన్ని పునరభ్యసనం అంటారు. పునరభ్యసన కాలం, ఇంతకు ముందు అభ్యసించడానికి పట్టిన కాలం కంటే తక్కువగా ఉంటుంది. కాబట్టి దీన్ని "పొదుపు పద్ధతి" అని కూడా అంటారు, పునరభ్యసనం గురించి ప్రయోగాలు చేసిన వాడు ఎబ్బింగ్‌హాస్ (Ebbinghaus). పునరభ్యసన పొదుపును కూడా మనం గనించవచ్చు. ఆ గణనను పొదుపు గణన (Saving Score) అంటారు.

$$\text{పొదుపు గణన} = \left[\frac{\text{అసలు ప్రయత్నాలు} - \text{పునరభ్యసన ప్రయత్నాలు}}{\text{అసలు ప్రయత్నాలు}}\right] \times 100$$

ఉదా॥ ఒక విద్యార్థి ఒక పద్యాన్ని కంఠస్థం చెయ్యడానికి 10 సార్లు చదవలసి వచ్చింది. నెలరోజులు గడిచిన తరువాత

పున:స్మరణ చేయిస్తే అనేక తప్పులు దొర్లాయి. దాన్ని మళ్ళీ దోషం లేకుండా కంఠస్థం చేయడానికి 5 సార్లు చదవవలసి వచ్చింది. అప్పుడు ఆ విద్యార్థి పునరభ్యసన గణన లేదా పొదుపు గణన ఈ క్రిందివిధంగా లెక్కిస్తారు.

కఠంస్థం చేయడానికి అసలు ప్రయత్నాలు = 10

పునరభ్యసన ప్రయత్నాలు = 5

పొదుపు గణన $= \frac{10 - 5}{10} \times 100$

$= 50\%$ పొదుపు.

**స్మృతి – రకాలు**

1) స్వల్పకాలిక స్మృతి (Short term memory)

2) దీర్ఘకాలిక స్మృతి (Long term memory)

3) బట్టీ స్మృతి (Rote memory)

4) తార్కిక స్మృతి (Logical memory)

5) క్రియాత్మక స్మృతి (Active memory)

6) నిష్క్రియాత్మక స్మృతి (Possive memory)

**1. స్వల్పకాలిక స్మృతి :** మనము అభ్యసించిన విషయాలను కొంత కాలము మాత్రమే స్మృతిలో ఉంచుకోవడాన్ని స్వల్పకాలిక స్మతి అందురు. ఉదా. ఇతరుల పోన్ నంబర్లు, పదవ తరగతి హాల్ టికెట్ నంబరు, గణితము పరీక్షలో మొదటి ప్రశ్న మొ॥ వి కొంతకాలం మాత్రమే గుర్తుంటాయి. దీనినే స్వల్పకాలిక స్మృతి అందురు.

**2. దీర్ఘకాలిక స్మృతి:** గతంలో అభ్యసించిన విషయాలు ఎక్కువ కాలంపాటు గుర్తుండే స్మృతిని దీర్ఘకాలిక స్మృతి అందురు. ఉదాహరణకు మనపేరు, తల్లిదండ్రుల పేర్లు, మన విద్యార్హత, పుట్టిన తేది కొన్ని ముఖ్యమైన వ్యక్తులు, సంఘటనలు జీవితాంతం గుర్తుంటాయి. దీనినే దీర్ఘకాలిక స్మృతి అందురు.

**3. బట్టీ స్మృతి :** ఈ రకమైనన స్మృతిలో అభ్యాసకుడు అభ్యసించే విషయాన్ని యథాతదంగా అందులోని అర్థం తెలియకపోయినా వల్లె వేయడం. విద్యార్థుల గణితంలో, ఎక్కాలు, సూత్రాలు తెలుగు పద్యాలు కంఠస్థం పెట్టడంలో బట్టి స్మృతి ఉపయోగిస్తారు.

**4. తార్కిక స్మృతి :** ఈ రకమైన స్మృతిలో అభ్యసించే విషయాన్ని అర్థం చేసుకొని వాటికున్న సంబంధాలను గుర్తించుకొని అభ్యసించిన అంశాలను గుర్తుపెట్టుకునే పద్ధతిని తార్కిక స్మృతి అందురు. ఇందులో ఏమిటి? ఎలా? అనే విధంగా అర్థం చేసుకొంటారు.

**5. క్రియాత్మక స్మృతి :** ఇందులో అభ్యాసకుడు నేరుగా పాల్గొని అభ్యసించిన లేదా తెలుసు కొన్న విషయాలను కొంత కాలంపాటు స్మృతిలో ఉంచుకొంటాడు. ఉదాహరణకి ఆర్కిమెడిస్ సూత్రాన్ని ప్రయోగపూర్వకంగా నిర్వహించి గుర్తుంచుకోవడం, త్రిభుజ నిర్మాణాలు, చతుర్భుజ నిర్మాణాలు, ప్రయోగాలు చేసి గుర్తుంచుకోవడం, కథలను, సంఘటనలను, సన్నివేశాలను నాటకీకరణం చేయడం ద్వారా వాటిని నేర్చుకొని జ్ఞప్తికి ఉంచుకోవడం.

**6. నిష్క్రియాత్మక స్మృతి :** ఈ రకమైన స్మృతిలో అభ్యాసకుడు కొన్ని విషయాలను సిద్ధాంత రీత్యా కేవలం చదివి గాని, వినిగాని గుర్తించుకోవడాన్ని నిష్క్రియాత్మక స్మృతి అందురు.

పున:స్మరణ చేయిస్తే అనేక తప్పులు దొర్లాయి. దాన్ని మళ్ళీ దోషం లేకుండా కంఠస్థం చేయడానికి 5 సార్లు చదవవలసి వచ్చింది. అప్పుడు ఆ విద్యార్థి పునరభ్యసన గణన లేదా పొదుపు గణన ఈ క్రిందివిధంగా లెక్కిస్తారు.

కఠంస్థం చేయడానికి అసలు ప్రయత్నాలు = 10

పునరభ్యసన ప్రయత్నాలు = 5

పొదుపు గణన $= \frac{10 - 5}{10} \times 100$

= 50% పొదుపు.

**స్మృతి – రకాలు**

1) స్వల్పకాలిక స్మృతి (Short term memory)

2) దీర్ఘకాలిక స్మృతి (Long term memory)

3) బట్టీ స్మృతి (Rote memory)

4) తార్కిక స్మృతి (Logical memory)

5) క్రియాత్మక స్మృతి (Active memory)

6) నిష్క్రియాత్మక స్మృతి (Possive memory)

**1. స్వల్పకాలిక స్మృతి :** మనము అభ్యసించిన విషయాలను కొంత కాలము మాత్రమే స్మృతిలో ఉంచుకోవడాన్ని స్వల్పకాలిక స్మతి అందురు. ఉదా. ఇతరుల పోన్ నంబర్లు, పదవ తరగతి హాల్ టికెట్ నంబరు, గణితము పరీక్షలో మొదటి ప్రశ్న మొ॥ వి కొంతకాలం మాత్రమే గుర్తుంటాయి. దీనినే స్వల్పకాలిక స్మృతి అందురు.

**2. దీర్ఘకాలిక స్మృతి:** గతంలో అభ్యసించిన విషయాలు ఎక్కువ కాలంపాటు గుర్తుండే స్మృతిని దీర్ఘకాలిక స్మృతి అందురు. ఉదాహరణకు మనపేరు, తల్లిదండ్రుల పేర్లు, మన విద్యార్హత, పుట్టిన తేది కొన్ని ముఖ్యమైన వ్యక్తులు, సంఘటనలు జీవితాంతం గుర్తుంటాయి. దీనినే దీర్ఘకాలిక స్మృతి అందురు.

**3. బట్టీ స్మృతి :** ఈ రకమైనన స్మృతిలో అభ్యాసకుడు అభ్యసించే విషయాన్ని యథాతదంగా అందులోని అర్థం తెలియకపోయినా వల్లె వేయడం. విద్యార్థుల గణితంలో, ఎక్కాలు, సూత్రాలు తెలుగు పద్యాలు కంఠస్థం పెట్టడంలో బట్టి స్మృతి ఉపయోగిస్తారు.

**4. తార్కిక స్మృతి :** ఈ రకమైన స్మృతిలో అభ్యసించే విషయాన్ని అర్థం చేసుకొని వాటికున్న సంబంధాలను గుర్తించుకొని అభ్యసించిన అంశాలను గుర్తుపెట్టుకునే పద్ధతిని తార్కిక స్మృతి అందురు. ఇందులో ఏమిటి? ఎలా? అనే విధంగా అర్థం చేసుకొంటారు.

**5. క్రియాత్మక స్మృతి :** ఇందులో అభ్యాసకుడు నేరుగా పాల్గొని అభ్యసించిన లేదా తెలుసు కొన్న విషయాలను కొంత కాలంపాటు స్మృతిలో ఉంచుకొంటాడు. ఉదాహరణకి ఆర్కిమెడిస్ సూత్రాన్ని ప్రయోగపూర్వకంగా నిర్వహించి గుర్తుంచుకోవడం, త్రిభుజ నిర్మాణాలు, చతుర్భుజ నిర్మాణాలు, ప్రయోగాలు చేసి గుర్తుంచుకోవడం, కథలను, సంఘటనలను, సన్నివేశాలను నాటకీకరణం చేయడం ద్వారా వాటిని నేర్చుకొని జ్ఞప్తికి ఉంచుకోవడం.

**6. నిష్క్రియాత్మక స్మృతి :** ఈ రకమైన స్మృతిలో అభ్యాసకుడు కొన్ని విషయాలను సిద్ధాంత రీత్యా కేవలం చదివి గాని, వినిగాని గుర్తించుకోవడాన్ని నిష్క్రియాత్మక స్మృతి అందురు.

ఉదాహరణకి తరగతి గది ఉపాధ్యాయుడు నీటిలో ఈత కొట్టడంని గురించి చెబుతాడు. పిల్లలు విని తెలుసుకోవడాన్ని నిష్క్రియాత్మక స్మృతి అందురు. ఇలాగే విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన విషయాలను చేయకుండానే నేర్చుకోవడాన్ని నిష్క్రియాత్మక స్మృతి అందురు.

**స్మృతికి చెందిన మరికొన్ని భావనలు :**

**1. డెజావు లేదా మిథ్యాపరిచయము :** ఒక్కొక్క సారి మనం ఇప్పుడు చూస్తున్న విషయాన్ని ఇంతకు ముందు ఎప్పుడో చూసినట్లు భ్రమ కలుగుతుంది. వాస్తవానికి ఇంతకుముందు ఎప్పుడూ దానిని చూడలేదు. ఇలాంటి భావం కలగడానికి కారణం మనం ఇది వరకు చూసినదానికి ఇప్పుడు చూస్తున్నదానికి దగ్గర పోలికలు ఉండడం. దీనినే "డెజావు" అంటాము. ఇది ఒక ఫ్రెంచ్ పదము.

**2. జైగార్నిక్ ప్రభావము :** జైగార్నిక్ అనే సోవియట్ మనో విజ్ఞాన శాస్త్రవేత్త తన పరిశోధనలో పూర్తిగా నేర్చుకొన్న విషయాల కన్నా లేదా పూర్తిగా చేసిన పనులకన్నా మధ్యలో వదిలి వేసిన లేదా ఆపివేసిన విషయాలు లేదా పనులు ఎక్కువ కాలం గుర్తుంటాయని కనుగొన్నాడు. దీనినే జైగార్నిక్ ప్రభావము అంటారు.

## విస్మృతి (Forgetting):

విస్మృతి అంటే మరచిపోవడం. పుట్టింది మొదలు ప్రతివ్యక్తి అనేక అనుభవాలను చవిచూస్తాడు. అవన్నీ అతనికి గుర్తుండవు. కొన్ని విషయాలు మరచిపోతారు. పాఠశాలలో నేర్చుకొన్న అనేక విషయాలను కూడా విద్యార్థులు మరచిపోతారు. నిత్యజీవితంలో కొన్ని విషయాలు మాత్రం జీవితాంతం జ్ఞాపకముంటాయి. అవిమరచిపోవాలన్నా మరచిపోలేం.

**విస్మృతికి కారణాలు:**

విస్మృతికి కిందికారణాలు పేర్కొనవచ్చు.

1. అనుపయోగంవల్ల స్మృతి క్షయం (Passive decay through discuse)
2. అవరోధం (Inhibition)
3. దమనం (Repression)
4. అపసామాన్య విస్మృతి (Abnormal Forgetting)

**1. అనుపయోగంవల్ల స్మృతి క్షయం:**

శరీర ధర్మశాస్త్రజ్ఞుల ప్రకారం స్మృతి జరిగినపుడు మెదడులో కొన్ని చిహ్నాలేర్పడతాయి. వీటిని స్మృతి చిహ్నాలంటారు. ఇలాంటి స్మృతి చిహ్నాలు కాలం గడిచే కొద్దీ క్షీణించిపోయి కొంతకాలానికి పూర్తిగా నశించిపోతాయి. కాని మనం ఒక విషయాన్ని మరచిపోయినా, తిరిగి కొన్ని సంకేతాలవల్ల ఆ విషయాన్ని గుర్తుకు తెచ్చుకోగలగుతాం. కొన్ని విషయాలు వాడుకలో లేకపోయినా స్మృతిలో ఉంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఈతకొట్టడం, సైకిల్ తొక్కడం, టైపు చేయడం మొదలైనవి నేర్చుకొని తరువాత చాలాకాలం పాటు వాడుకలో లేకపోయినా తిరిగి ఆ కౌశలాలు ప్రదర్శించగలుగుతాడు. ఒక్కొక్కసారి చిన్ననాటి అనుభవాల్ని, చిన్నతనంలో నేర్చుకొన్న పద్యాలు, పాటలు ముసలితనంలో కూడా జ్ఞాపకానికి రావచ్చు. కాని ఒక్కొక్కసారి రెండు మూడు వారాలు కిందట నేర్చుకొన్న విషయాలు పునఃస్మరణ చేయటం కష్టతరమవుతుంది. పై కారణాలవల్ల స్మృతి చిహ్నాలు అనుపయోగంవల్ల క్షీణిస్తాయనే సిద్ధాంతం సరియైంది కాదని తేలింది.

**2. అవరోధం:**

విస్మృతి అవరోధంవల్ల జరగవచ్చు. దీన్నే 'జోక్య ప్రభావం' (Interference effect) అంటారు. అవరోధం రెండు రకాలు. ఎ) పురోగమన అవరోధం, బి) తిరోగమన అవరోధం.

**ఎ) పురోగమన అవరోధం (Proactive inhibition) :** పురోగమన అవరోధమంటే గతంలో చేర్చుకొన్న విషయాలు ఇప్పుడు నేర్చుకొన్న విషయాల స్మృతికి ఆటంకంగా ఉండడం అంటే పాత అభ్యసనం కొత్త అభ్యసనానికి అవరోధంగా ఉండటం అని అర్థం. ప్రయోగశాలలో పురోగమన అవరోధాన్ని గురించి కిందివిధంగా పరిశీలించవచ్చు.

| సమూహం | నేర్చుకోవడం | నేర్చుకోవడం | పున:స్మరణ |
|---|---|---|---|
| ఎ) ప్రయోగాత్మక సమూహం | 10 వేమన శతక పద్యాలు | 10 సుమతీశతక పద్యాలు | సుమతీశతక పద్యాలు |
| బి) నియంత్రిత సమూహాం | విశ్రాంతి | 10 సుమతీశతక పద్యాలు | సుమతీశతక పద్యాలు |

పై ప్రయోగంలో వేమనశతక పద్యాలను నేర్చి,సుమతీశతక పద్యాలను నేర్చి – సుమతీశతక పద్యాలను పున:స్మరణ చేసుకోవడానికి వేమన శతక పద్యాలు అవరోధం కలిగించడాన్ని పురోగమన అవరోధం అంటారు. విషయాల మధ్య సారూప్యం ఎక్కువగా ఉన్నప్పుడు పురోగమన అవరోధం జరుగుతుంది.

**బి) తిరోగమన అవరోధం (Retroctive inhibition) :** ఇందులో కొత్తగా నేర్చుకొన్న విషయాలు గతంలో నేరుక్రొన్న విషయాల పునంస్మరణకు అవరోధం కలిగిస్తాయి. అంటే కొత్త అభ్యసనం, పాత అభ్యసనానికి అవరోధంగా ఉండటం. ప్రయోగ నమూనా ఇలా ఉంటుంది.

| సమూహం | నేర్చుకోవడం | నేర్చుకోవడం | పున:స్మరణ |
|---|---|---|---|
| ఎ) ప్రయోగాత్మక సమూహం | 10 వేమన శతక పద్యాలు | 10 సుమతీశతక పద్యాలు | వేమన శతక పద్యాలు |
| బి) నియంత్రిత సమూహాం | వేమన శతక పద్యాలు | విశ్రాంతి | వేమన శతక పద్యాలు |

పై ప్రయోగంలో వేమనశతక పద్యాలను నేర్చి,సుమతీశతక పద్యాలను నేర్చి – వేమనశతక పద్యాలను పున:స్మరణ చేసుకోవడానికి సుమతీ శతక పద్యాలు అవరోధం కలిగించడాన్ని తిరోగమన అవరోధం అంటారు.

**3. దమనం (Repression):**

కొన్ని విషయాలను మనం కావాలని మర్చిపోతాం. దీన్ని దమనం అంటారు. దమనం ఒక రక్షణతంత్రం. దమనంలో మనకు ఇష్టంలేని విచారకమైన విషయాలను, సంఘటనలను ఆచేతన మనసులోకి నెట్టివేస్తాం లేదా పంపించి వేస్తాం. అలా అచేతనంలో ఉండే అణచివేయబడ్డ విషయాలు, సంఘటనలు చేతన మనసులోకి రావాలని ప్రయత్నం చేస్తాయి. దమనం ఎక్కువయినప్పుడు ఆ విషయాలు, సంఘటనలు చేతన మనసులోకి కలల ద్వారా మానసిక రుగ్మతల (Mental disorders) ద్వారా బయటపడతాయి.

మనోవిశ్లేషణవాదులు (Psycho analysis) దమనం చేయబడ్డ విషయాలను, సంఘటనలు గూర్చి కలల విశ్లేషణ (Dream analysis) ద్వారా తెలుసుకొంటారు. స్వేచ్ఛా సంసర్గం (Free association) ద్వారా దమనం చేయబడ్డ విషయాలు, సంఘటనలు, అనుభవాలు వెలికితీయడం జరుగుతుంది. స్వేచ్ఛా సంసర్గంలో వ్యక్తి తనకు తోచిన విషయాలను స్వేచ్ఛగా వ్యక్తపరుస్తాడు. వాటిని మనోవిజ్ఞానశాస్త్రవేత్త (Psychologist) శ్రద్ధగా విని విశ్లేషణ చేస్తాడు.

**4. అపసామాన్య విస్మృతి:**

స్మృతి నాశనం (Amnesia) అనేది మానసిక ఆఘాతంవల్ల (Mental truma), శారీరక అఘాతంవల్ల (Physical truma) జరగవచ్చు. స్మృతి నాశనం అనేది ఒక అపసామాన్య విస్మృతి. ఇంకొక అపసామాన్య విస్మృతిని ఫ్యూడ్ (FEUD) గా పేర్కొనవచ్చు. ఇందులో ఒక వ్యక్తి గతజీవితం మరచిపోయి వేరే ప్రదేశానికి వెళ్ళి కొత్త పేరుతో కొత్త జీవితం ప్రారంభించవచ్చు. తిరిగి ఏదైనా ఘాతం (Shock) సంభవించినపుడు పూర్వ జ్ఞాపకాలు తిరిగి రావచ్చు.

**స్మృతి పెంచేందుకు పద్ధతులు (Methods of improving memory):**

స్మృతిని పెంచేందుకు లేదా ధారణను పెంచేందుకు దోహదం చేసే కారకాలను కింది విధంగా పేర్కొనవచ్చు.

**1. ప్రేరణ (Motivation) :** సక్రమమైన ప్రేరణ స్మృతికి దోహదం చేస్తుంది. ప్రేరణ సరిగా ఉంటే ధారణ కూడా ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులలో ధారణ సరిగా ఉండాలంటే ఉపాధ్యాయుడు వారిలో ప్రేరణ కలిగించాలి.

**2. అభిరుచి, అవదానం (Interest, Attention) :** అభిరుచి, అవధానం అనేవి స్మృతిని పెంచేందుకు దోహదం చేస్తాయి. సక్రమమైన అభిరుచి, క్రమమైన అవధానం కలిగి ఉన్నప్పుడు ధారణ కూడా సక్రమంగా ఉంటుంది. కాబట్టి విద్యార్థులు పాఠ్యాంశాలలో అభిరుచిని పెంచుకొని ఏకాగ్రత కలిగి, అవధానంతో విషయాన్ని నేర్చుకున్నప్పుడు వారి స్మృతి పెరుగుతుంది. అవధానానికి ఆటంకం కలిగించే విషయాలను తొలగించినప్పుడు స్మృతి అభివృద్ధి చెందుతుంది.

**3. తక్కువ భావోద్రేకత (Less Emotional) :** భావోద్రేకం ఎంత ఎక్కువగా ఉంటే స్మృతి అంత తక్కువగా ఉంటుంది. ఉద్రేకతతో నేర్చుకొన్న విషయాలు స్మృతిపథం నుంచి త్వరగా తొలగిపోతాయి. కాబట్టి విషయాలను నేర్చుకొనేటప్పుడు ప్రశాంతంగా వుండాలి.

**4. భావాల సంసర్గం (Association of ideas) :** భావాల సంసర్గంవల్ల స్మృతిని పెంపొందించవచ్చు. ఉదాహరణకు తాజ్‌మహల్‌కు, షాజహాన్‌కు సంసర్గం (Association) ఏర్పరచినప్పుడు తాజ్‌మహల్ పేరు చెప్పగానే షాజ్‌హాన్ గుర్తుకు రావడం జరుగుతుంది. ఒక్కొక్కసారి వైషమ్యం (Contrast) ద్వారా స్మృతి జరగవచ్చు. ఉదాహరణకు స్వర్గం గుర్తుకు రాగానే దానికి వ్యతిరేకమైన పదం నరకం కూడా గుర్తుకు వస్తుంది.

**5. అతి అభ్యసనం (Over learning) :** అతి అభ్యసనం అంటే ఒక విషయం నేర్చుకున్న తరువాత కూడా దాన్ని పదేపదే చదవడం. దీనివల్ల పునర్బలనం (Reinforcement) జరిగి ధారణ పెంపొందుతుంది.

**6. వల్లెవేయడం (Recitation) :** వల్లెవేయడంవల్ల స్మృతిలో అభివృద్ధి ఏర్పడుతుంది. ధారణ పెరుగుతుంది. కాబట్టి విద్యార్థులు కొన్ని విషయాలను వల్లె వేయడం ద్వారా ధారణశక్తిని పెంపొంధించుకోవచ్చు.

**7. కొండగుర్తులు (Mnemonic devices) :** స్మృతిని పెంపొందించుకునేందుకు కొండగుర్తుల పద్ధతి చాలావరకు తోడ్పడుతుంది. ఉదాహరణకు VIBGYOR అనే కొండగుర్తు నేర్చుకుంటే ఇంద్రధనస్సులోని రంగులన్నీ గుర్తుకు వస్తాయి. గణవిభజన చేయడానికి 'యమాతారాజభానసలగం' అనే కొండగుర్తు తోడ్పడుతుందనేది అందరికీ తెలిసిన విషయమే.

**4.4.9 మూర్తిమత్వం:**

మూర్తిమత్వం అంటే కేవలం శరీర సౌష్టవం, అందం అని సాధారణమైన వ్యక్తులు భావిస్తారు. సినిమాలో నటించే హీరో, హీరోయిన్‌ల పర్సనాలిటి గురించి సర్వ సాధారణంగా మాట్లాడుతారు. కాని మూర్తిమత్వం అంటే శారీరక లక్షణాలే కాకుండా మానసిక, సాంఘిక, నైతిక లక్షణాలు కూడా ఉంటాయి.

"వ్యక్తి లక్షణ సమగ్ర స్వరూపాన్ని అతని ప్రవర్తనా విధానాన్ని సూచించి అవి వ్యక్తి తన పరిసరాలతో ఏ విధంగా సర్దుబాటు చేసుకొంటాడో నిర్దేశించేదే మూర్తిమత్వం". – హిల్‌గార్డ్

"వ్యక్తి పరిసరాలతో ప్రతిచర్యను పొందినప్పుడు ప్రస్ఫుటమయ్యే అతని శాశ్వత మానసిక లక్షణాల ప్రత్యేక వ్యవస్థాపనను సూచించేదే మూర్తిమత్వం." – విల్‌బర్డ్ జేమ్స్

"సంస్కృతి ఆత్మాశ్రయ పక్షమే మూర్తిమత్వం – ఇ. ఫారిస్

**మూర్తిమత్వ మూలకాలు:**

పీటర్ సాండిఫర్డ్ మూర్తిమత్వ మూలకాలను ఈ కింది విధంగా గుర్తించాడు.

1. **భౌతిక లేదా శారీరక లక్షణాలు** (Physical Traits)**:** ఒక వ్యక్తికి బాహ్యలక్షణాలైన ఎత్తు, జుట్టు రంగు, చర్మంరంగు, శరీర నిర్మాణం, ఆరోగ్యం, అందం మూర్తిమత్వాన్ని అంచనా వేయడానికి దోహదపడతాయి.

2. **శరీర నిర్మాణ లక్షణాలు** (Physiological Traits)**:** వ్యక్తి జీవన క్రియలు, రక్తవర్గం, రక్తంలోని ఖనిజాల నిష్పత్తి, అంత:స్రావ సమతుల్యం, రక్త ఒత్తిడి మొదలైనవి కూడా మూర్తిమత్వాన్ని నిర్దేశిస్తాయి.

3. **భౌద్ధిక సామర్థ్యాలు** (Intellectual Abilities)**:** వ్యక్తి మూర్తిమత్వాన్ని గుర్తించడానికి అతని ఆలోచన, సృజనాత్మకత, ప్రజ్ఞ, విద్యాసాన కూడా తోడ్పడతాయి.

4. **సహజ సామర్థ్యాలు**(Aptitude)**:** అనువంశికంగా ప్రాప్తించి శిక్షణ ద్వారా అభివృద్ధి చెందే సంగీత, చిత్రలేఖన, నాట్య, గణిత, భాషా సామర్థ్యాలు కూడా వ్యక్తి ఆ మూర్తిమత్వ మూలకాలవుతాయి.

5. **కౌశలాలు (Skills):** వివిధ శారీరక విషయాలలో సులభంగాను, నిర్దిష్టంగాను చేయగల క్రియలు – ఆటలాడటం, రాయడం, గీయడం మొదలైనవి కూడా మూర్తిమత్వంలోని అంశాలే.

6. **అలవాట్లు (Habits):** వ్యక్తి తన దైనందిన జీవితంలో చేసే ఆర్జిత ప్రతిస్పందనలైన అలవాట్లు అతని మూర్తిమత్వంలోని భాగమే.

7. **శక్తులు** (Abilities)**:** వ్యక్తి సంవేదనలు, వివేచన, విషయనిర్ణయం, ధారణశక్తి, భాషాశక్తి పరిశీల స్మృతి, అవధానం మొదలైన అంశాలు కూడా మూర్తిమత్వంలో భాగమే.

8. **లక్షణాంశాలు** (Traits)**:** విశిష్టమైన పరిశీలనా రీతులైన – సౌమ్యం, దౌర్జన్యశీలత, సరళం, కోపశీలత, దురుసు స్వభావం, మందకొడి స్వభావం మొదలైనవి. తాత్కాలికమైన, శాశ్వతమైన వ్యక్తికి సహజంగా ప్రాప్తించిన లేదా పరిస్థితులను బట్టి వర్జించినవి – ఇవి కూడా మూర్తిమత్వంలోని అంశాలే.

పైన పేర్కొన్న మూలకాలు వ్యక్తుల్లో స్వతంత్రంగా ఉండవలసిన పనిలేదు. ఇవి చాలా వరకు పరస్పర పరివ్యాప్తమై ఉంటాయి.

మూర్తిమత్వ వికాసం

మూర్తిమత్వం పుట్టుకతోటే రూపొందించబడినప్పటికి పరిసరకారకాలు, వ్యక్తి అలవాట్లు మూర్తిమత్వ వికాసంలో తోడ్పడేటట్లు చేస్తాయి.

1. **శారీరక కారకం:** శరీరం, నిర్మాణం, ఆకారం పుట్టుకతో నిర్ణయించబడినప్పటికి ప్రతిరోజు ఉదయం లేదా సాయంత్రం చేసే శారీక వ్యాయామం వల్ల మంచి ఆకృతి ఏర్పడుతుంది. సమతుల్య ఆహారం తీసుకోవడం ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు శరీరపు పంగును మెరుగుపరుస్తాయి.

2. **భౌద్ధిక కారకం:** పుట్టుకతో అనువంశికత ద్వారా వ్యక్తి తెలివితేటలు నిర్ణయించబడినప్పటికి పాఠశాలల్లో చక్కగా వినడం ద్వారా, చర్చల్లో పాల్గొనడం ద్వారా, పఠన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా పజిల్స్‌ను సాధించడం

ద్వారా, సమస్యలను పరిష్కరించడం ద్వారా తెలివితేటలు మెరుగుపడతాయి. మెదడుకు ఎలాంటి పనిచెప్పని వ్యక్తి కంటే అనుక్షణం మెదడుకు పనికల్పించే వ్యక్తి చెలివితేటలు బాగా ఎక్కువగా వికసిస్తాయి.

3. **ఉద్వేగ కారకం:** ఉద్వేగం అనగా మనసు చలించే స్థితి. ఇవి జీవితంలో రంగుల హరివిల్లుల వంటివి. ఉద్వేగాలు లేని జీవితం నిస్సారం అవుతుంది. ఉద్వేగాన్ని అదుపులో ఉంచుకుంటూ అవసరమైన మేరకు ప్రదర్శించే వ్యక్తి మిగతా వారికి ఆదర్శంగా ఉంటాడు. ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి యోగ, ధ్యానం వంటి అంశాలు దోహదపడతాయి. పెద్ద కంపెనీలు తమ సంస్థలలో పెద్ద ఉద్యోగాలు నియామకానికి ప్రథమంగా వ్యక్తి E.Q (Emotional Quotient)ను పరీక్షిస్తారు.

4. **భావ ప్రసారణ కారకం:** ఎంతసేపు మాట్లాడామన్నది ముఖ్యం కాదు. ఎదుటి వ్యక్తి ఎంత గ్రహించాడన్నదే ముఖ్యం. మాట్లాడే భాష ఎదుటి వ్యక్తికి అర్థమయ్యే రీతిలో ఉండాలి. తక్కువ ప్రసంగించి ఎక్కువ సమాచారం అందించగలిగే వ్యక్తి మూర్తిమత్వం మిగతావారి మూర్తిమత్వంపైన ప్రభావితం చేయగలదు. వ్యక్తి ప్రసంగిస్తున్నప్పుడు అతని హావభావాలు (Body Language) ప్రసంగానికి అనుగుణంగా ఉండాలి. అదే విధంగా రాసిన సమాచారం కూడా అందరికి అర్థమయ్యే రీతిలో పాఠకులకు విసుగు కలిగించకుండా అర్థమయ్యే రీతిలో ఉండాలి.

**మూర్తిమత్వ వికాసానికి తోడ్పడునవి (**A sound mind Resides in a sound body**):**

**1. శారీరక వ్యాయామం** (Physical Exercise)**:** ఆరోగ్యకరమైనటువంటి మనస్సు ఆరోగ్యకరమైన శరీరంలో ఉంటుంది. వ్యక్తి మానసిక స్థితి బాగుపడాలంటే అతడి శారీక స్థితి బాగుండాలి. వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు ఉదయం వేళల్లో వ్యాయామంగాని, సాయంత్రం వేళల్లో చెమటొడిచే ఆటలు ఆడాలి. దీనివల్ల శరీరం చక్కటి ఆకృతిని దాలుస్తుంది. ఎరిక్ ఎరిక్సన్ ప్రకారం ఎవరైతే ఎక్కువగా ఆటలు ఆడుతారో వారే పాఠ్యాంశాల విషయాలలో బాగా శ్రమించి వేధావంతులు అవుతారు. శారీరక వ్యాయామం చేయకుండా ఉండేవారు (Obesity)తో బాధపడుతారు. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల హృదయ సంబంధ వ్యాధులకు గురవుతారు.

**2. ధ్యానం** (Meditation)**:** యోగ లేదా ధ్యానం వల్ల శారీరక వ్యాధులు దూరమై మానసిక ప్రశాంతత నెలకొల్పబడుతుంది. శరీరంలోని బాహ్య, అంతస్రావి గ్రంథుల మధ్య సమతుల్యత ఏర్పడి చక్కగా స్రవిస్తాయి. దీనివల్ల ముఖంలో ప్రశాంతత ఉద్వేగాల నియంత్రణ ఏర్పడి మూర్తిమత్వ వికాసం జరుగుతుంది. దీనివల్ల స్మృతి వికసిస్తుంది. చక్కని ఆలోచనలు వస్తాయి. యోగ వల్ల శారీరక అనారోగ్యాలు, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గిపోతాయి.

**3. పఠనం** (Reading)**:** వ్యక్తులకు విజ్ఞానం, శ్రవణం వల్ల, పఠనం వల్ల కులుగుతుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు ఉపన్యాసకుల పాఠ్యాంశ శ్రవణం వల్ల పాఠాలను వింటూ అంశాలను రాసుకోవడం వల్ల విజ్ఞానం ఆర్జించవచ్చు. ప్రస్తుత కాలంలో మనోవిజ్ఞానశాస్త్రవేత్తల అభిప్రాయాల ప్రకారం విన్నదాని కంటే కూడా స్వయంగా అభ్యసన వల్ల ఎక్కువగా నేర్చుకోగలుగుతున్నారు. ఎవరైతే ఎక్కువ పుస్తకాలు చదువుతారో వారు మిగతా వ్యక్తుల కంటే ఉన్నతంగా ఉంటారు. ఎక్కువ జ్ఞానాన్ని కలిగి ఉన్న వ్యక్తులు ఇతరులను ప్రభావితం చేయగలరు. కాబట్టి క్రమం తప్పకుండా పఠనాన్ని అర్థవంతంగా అభ్యసనం చేయాలి.

## మూర్తిమత్వ వికాసానికి అవరోధపరిచేవి:

**1. అతినిద్ర (Over sleeping):** సాధారణంగా యువతీయువకులకు 8 గంటల నిద్ర సరిపోతుంది. చిన్న పిల్లలకు నిద్ర ఎక్కువ అవసరమైనప్పటికి క్రమేపి వయస్సు పెరుగుతున్నాకొద్దీ నిద్ర అవసరం తగ్గుతుంది. అనారోగ్యానికి గురైన వ్యక్తులు డాక్టర్ సలహామేరకు 8 గంటల కంటే ఎక్కువ నిద్రపోవచ్చు. తీవ్ర ఉద్వేగాలకు లోనైనప్పుడు నిద్ర సమయం తగ్గి అనారోగ్యానికి గురవుతారు. అతి నిద్ర వల్ల అనారోగ్యంతో పాటుగా, సమయం సరిపోనందువల్ల తమ తోటి వారికంటే విద్యార్థులు చదువులో వెనకబడతారు.

**2. బద్ధకం (Laziness):** పనిచేయగలిగే శక్తి సామర్థ్యం ఉండి కూడా పని చేయలేకపోవడాన్ని బద్ధకం అనవచ్చు. పని నుంచి తప్పింకోవడాన్నే బద్ధకం అంటారు. విద్యార్థులు పాఠసాల నుంచి ఇంటిపని తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఉపాధ్యాయుడు ఇచ్చిన సమస్యల నుంచి కూడా తప్పించుకుంటారు. దీనివల్ల మెదడుతోపాటు శరీరం కూడా మొద్దుపారుతుంది. చెయ్యి విరిగిన వ్యక్తికి డాక్యర్ కట్టుకట్టి కొంతకాలం ఎముక అతుకేవరకు మెడకు వేలాడతీస్తారు. కట్టువిప్పిన తరవాత యధాస్థితికి రావడానికి ఎలాగైతే నెలల తరబడి పడుతుందో అదివిధంగా బద్ధకం కలిగిన వ్యక్తి మెదడు, శరీరం చరుకుదనాన్ని కోల్పోతుంది.

**3. వాయిదా వేయడం (Postponement):** మహాత్మాగాందీ గారి ప్రకారం రేపు చేయాల్సిన పని ఈ రోజు, ఈ రోజు చేయాల్సిన పని ఇప్పుడే చేయనన్నాడు. నేటి విద్యార్థులు మాత్రం పనులను వాయిదా వేస్తూ కాలం గడుపుతున్నారు. పరీక్షలకు వారం రోజుల ముందుగా, హడావిడిగా సిద్ధం అవుతూ హడావిడిగా సిద్ధం అవుతూ ఉద్వేగానికి గురికావడం వల్ల తక్కువ మార్కులతో నెట్టుకొస్తున్నారు. అందువల్ల విద్యలో గుణాత్మకతకూడా లోపిస్తుంది. ఉపాధ్యాయుడు ఇచ్చిన ఇంటిపనిని ఏ రోజుకు వ రోజు చేస్తూ, ఒక ప్రణాళికను రూపొందించుకొని ఆ ప్రణాళిక ప్రకారం మొత్తం సిలబస్‌ను విభజించుకోవాలి. దాని ప్రకారం చదివినప్పుడు విద్యార్థులు విద్యలో రాణించగలుగుతారు.

### 4.5. అభ్యసనా దృక్పథాలు – తరగతి బోధనలో వాటి అనువర్తనాలు:

"కోటి విద్యలు కూటికోసమే" అనే సామెత అభ్యసనానికీ అవసరాలకూ ఉన్న సంబంధాన్ని ప్రస్ఫుటంగా తెలియజేస్తుంది. విద్యను అభ్యసించడం వల్ల అవసరాలు తీరాలి. విద్య ఎప్పుడైతే అవసరాలను తీర్చలేదో అప్పుడు విద్యను అభ్యసించాలన్న కోరిక కలగదు. అవసరాలు రెండు రకాలు అవి. 1) ప్రాథమిక అవసరాలు, 2) గౌణ అవసరాలు మాస్లో 5 రకాల అవసరాలను గురించి పేర్కొన్నాడు.

వ్యక్తి మనుగడకు ప్రాథమిక అవసరాలైన ఆహారం, నీరు, నిద్ర మొదలైనవి తీరాలి. వ్యక్తి వికాసానికి గౌణ అవసరాలైన మానసిక భద్రత, సాంఘిక గుర్తింపు, ఆత్మగౌరవ, ప్రేమ మొదలైనవి అవసరము. ప్రాథమిక అవసరాలకూ అభ్యసనానికీ రెండు రకాల సంబంధం ఉంటుంది. ఒకటి ప్రాథమిక అవసరాలు తీరని వ్యక్తి ఏదైనా అభ్యసించవలసి వస్తే ఆ వ్యక్తి దానిపై దృష్టిని నిలుపలేడు. ఎందుకంటే మనస్సు తాగేనీరుమీదా, ఆహారంమీదా ఉంటుంది కాబట్టి, అంటే ఆ వ్యక్తి ప్రాథమిక అవసరాలు తీరందే అభ్యసనంపై దృష్టిని నిలిపే అవకాశం ఉండదు. ఉదాహరణకు – తరగతిలోని విద్యార్థులందరికీ ఆకలి అవుతున్నప్పుడు పాఠం చెప్తే వారు పాఠం నేర్చుకోలేరు. ఇక్కడ వ్యక్తి ప్రాథమిక అవసరాలు అభ్యసనానికి తాత్కాలిక ఆటంకాన్ని కలిగించాయి. ప్రాథమిక అవసరాలకు అభ్యసనానికి ఉన్న రెండోరకమైన సంబంధం ఏమిటంటే అభ్యసించే విద్య మౌలిక అవసరాలు తీర్చుకోవడానికి దోహదపడితే దానిని సమర్థవంతంగా అభ్యసించే అవకాశం ఉంటుంది.

గౌణ అవసరమైన, సాంఘిక గుర్తింపు పొందడానికి బాలలు కొన్ని విషయాలను నేర్చుకొంటారు. ఉదాహరణకు ఒక విద్యార్థి తను ఆంగ్లం నేర్చుకొని మాట్లాడితే ఆ గ్రామంలో మంచి గుర్తింపు వస్తుందని అనుకోవడం. ఆ విధంగానే అతడు ఆంగ్లం బాగా నేర్చుకొని గుర్తింపు పొందాడు. మంచి మార్కులు తెచ్చుకొని తరగతిలో గుర్తింపు పొందేందుకు కూడా విద్యార్థులు కష్టపడి చదువుతారు. ఒక విద్యార్థికి పరీక్షలో తక్కువ మార్కులు వస్తే ఉపాధ్యాయుడు, ఆ విద్యార్థి కుటుంబసభ్యులు చిన్నచూపు చూస్తే. అప్పుడు ఆ విద్యార్థి ఆత్మగౌరవానికి భంగం కలిగిందని భావించి తరువాత పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకొంటాడు. ఇలా మంచి మార్కులు తెచ్చుకొని తరగతిలో గుర్తింపు పొందేందుకు కూడా విద్యార్థులు ఇష్టపడి చదువుతారు. ఈ విధంగా గౌణ అవసరాలకు అభ్యసనకు విడదీయరాని బంధం ఉంటుంది.

ప్రాథమిక అవసరాలతోపాట గౌణ అవసరాలైన ప్రేమ, వాత్సల్యం, గుర్తింపు, ఆత్మగౌరవం మొదలైన వాటిని విద్యను అభ్యసించే కాలంలోనూ, అటు తరువాత ఉద్యోగం పొందే అవకాశం ఉన్న విద్యను అభ్యసించే కాలంలోను గౌణ అవసరాల వల్ల సమర్థవంతంగా అభ్యసిస్తారు.

అభ్యాసకుడు అభ్యసించాలంటే వ్యక్తిగత కారకాలే కాకుండా అభ్యసించే అంశంకి సంబంధించిన కారకాలు కూడా చాలా ముఖ్యం. అవి. ఎ) అభ్యసన అంశాల పరిమాణము బి) దాని అర్థం సి) అంశాల కష్టతరస్థాయి డి) అంశాలు పాఠంలో వ్యవస్తీకరణ చెందిన విధానం.

అభ్యసన పద్ధతికి సంబంధించిన కారకాలు (Factors related to method) అభ్యసించడానికి కొన్ని పద్ధతులు ఉంటాయి. అవి సందర్భాన్ని బట్టి ఉపయోగిస్తే అభ్యసనం బాగా జరుగుతుంది. అవి ఎ) విరామ, నిర్విరామ పద్ధతి బి) పూర్ణ, ఖండ పద్ధతి, సి) కంఠస్థము, డి) అతి అభ్యసనం మొదలగునవి.

**4.5.1 వర్తమాన అభ్యసన సిద్ధాంతాలు (Current theories of learning):**

ఒక శాస్త్రజ్ఞుడు ఎన్నో ప్రయోగాలు, పరిశోధనలు, చేసి ఒక ఆదర్శాన్ని, ఆశయాన్ని, ఆలోచనా విధానాన్ని దృక్పథాలను ఏర్పరుచుకొని ఒక సిద్దాంతాన్ని ఏర్పరుస్తాడు. ఆ ఆశయాన్ని దృక్పథాలను ఏర్పరచిన నియమాలను అతని అనుచరులు పున:పరిశీలన, పరిశోధనలు చేసి సిద్ధాంతాన్ని బలపరుస్తారు. ఆ విధంగా 'అభ్యసనం' పై ఏర్పడిన సిద్దాంతాలు కొన్నింటిని గురించి తెలుసుకుందాం.

అభ్యసన ప్రక్రియ కొన్ని ముఖ్య సిద్ధాంతాలు అవి 1) నిబంధనం (Conditioning) 2) యత్నదోష అభ్యసనం (Trial and Error) 3) అంతర్‌దృష్టి (Insight learning) 4) పరిశీలనాభ్యసనం (Learning by observation) 5) బ్రూనర్ బోధనా సిద్ధాంతం (Bruneis learning Theory) 6) నిర్మాణాత్మక సిద్ధాంతము(Constructivism)

**1) నిబంధనం (Conditioning):**

'డ్రెవర్' ప్రకారం ఒక ఉద్దీపనకు, వస్తువుకు లేదా పరిస్థితికి అంతకు ముందు లేనటువంటి ఒక స్వభావ సిద్ధంకాని ప్రతిస్పందనను కల్పించడాన్ని నిబంధనం అంటారు.


(Conditioning may be defined as follows: Conditioning is a process by which a response comes to be elicited by a stimulus, object on situation other than that to which it is the natural response - Drever).


నిబంధనం రెండు రకాలు. ఎ) శాస్త్రీయ నిబంధనం (Classical conditioning) బి) కార్యసాధక నిబంధనం (Operant conditioning)

### ఎ) శాస్త్రీయ నిబంధనం (Classical conditioning):

రష్యా దేశానికి చెందిన ఇవాన్‌పావ్‌లోవ్ (Ivan Pavlov) అనే శరీరధర్మ శాస్త్రవేత్త ఒక ప్రయోగం ద్వారా నిబంధనం అనే ప్రక్రియను కనిపెట్టారు. ఇతను కనిపెట్టిన నిబంధనాన్ని శాస్త్రీయ నిబంధనం (Classical Conditioning) అంటారు.

పావ్‌లోవ్ ఒక కుక్కను తీసుకొని దానిని కదలకుండా బంధించాడు. దాని నోటిలోని లాలాజల గ్రంథులనుంచి ఒక రబ్బరు గొట్టాన్ని అమర్చాడు. ఆ రబ్బరు గొట్టం ఇంకొక చివరను ఒక కొలపాత్రలో ఉంచాడు. కుక్కనోటిలో లాలాజలం ఊరినప్పుడు అది రబ్బరు గొట్టం ద్వారా కొలపాత్రను చేరుతుంటుంది. కుక్క నోటిలో ఎప్పుడు ఎంత లాలాజలం ఊరింది అనేది మాపనం (Measure) చేయవచ్చు.



### పావ్‌లోవ్ ప్రయోగము:

పటంలో చూపినట్లు పావ్‌లోవ్ ఆకలితో ఉన్న కుక్కను తీసుకొని దానిని ప్రయోగ పరికరాల మధ్య బంధించాడు. దాని నోటిలోని లాలాజల గ్రంథులకు ఒక రబ్బరు గొట్టాన్ని అమర్చి, రెండవ చివరను ఒక కొలత పాత్రలో ఉంచాడు. ఆ విధంగా కుక్కనోటి నుంచి ఎంత లాలాజలం ఊరుతుందో తెలుసుకొన్నాడు.

1. మొదటిదశలో, కుక్క నోటి దగ్గర ఆహారం (సహజఉద్దీపన) ఉంచినప్పుడు దాని నోటి నుంచి ఎంత లాలాజం ఊరిందో గమనించాడు. ఇలా అనే ప్రయత్నాలు చేసి లాలాజల పరిమాణాన్ని మాపనం చేశాడు.

2. రెండోదశలో పావ్‌లోవ్ ఒక అసహజ ఉద్దీపనగా, గంటను మోగించి వెంటనే ఆహారాన్ని కుక్కకు అందించాడు. లాలాజలాన్ని కుక్క స్రవించడం గమనించాడు. ఇలా ప్రతి ప్రయత్నంలో గంటను మోగించడంతో పాటు ఆహారం ఇవ్వడం వల్ల కుక్క లాలాజలాన్ని స్రవించడాన్ని గమనించాడు.

3. మూడోదశలో గంటను మోగించిన వెంటనే గంట సబ్దానికే కుక్క లాలాజలాన్ని స్రవించింది. ఇలా కుక్క ఆహారం అందకముందే గంట సబ్దానికే లాలాజలాన్ని స్రవించడాన్ని పావ్‌లోవ్ గమనించడం జరిగింది.


ప్రయోగంలో ఒక అసహజ(నిబందిత) ఉద్దీపనకు (గంట శబ్దం) ఒక సహజ (నిర్నిబందిత) ఉద్దీపనతో (వహారం) పాటు ఉపయోగించడం వల్ల అసహజ ఉద్దీపన (గంట శబ్దం) క్రమంగా సహజ ఉద్దీపన (ఆహారం) లక్షణాలను సంతరించుకొంది. సహజ ప్రతిస్పందనకు (లాలాజలాన్ని స్రవించడం) మధ్య బంధం ఏర్పడిందని పావ్‌లోవ్ అభిప్రాయపడ్డాడు.

అంటే అసహజ ఉద్దీపనకు ప్రాముఖ్యం ఏర్పడిందని పావ్‌లోవ్ అభిప్రాయపడ్డాడు. అంటే అసహజ ఉద్దీపనకు ప్రాముఖ్యం ఏర్పడింది. అందుకే దీనిని ఉద్దీపన ప్రాముఖ్య నిబంధనం (Type ‘S’ Conditioning) అంటారు.

పావ్‌లోవ్ అనేక ప్రయోగాలను చేసి ఫలితాలను ప్రచురించడంతో దీన్ని “పావ్‌లోవ్ సాంప్రదాయక నింబధన సిద్ధాంతం”(Classical Conditioning Theory) అంటారు.


పావ్‌లోవ్ ప్రయోగ క్రమాన్ని కింది విధంగా సూచించవచ్చు.

1. మొదటి దశ





| | |
|---|---|
| ఆహారం ఇచ్చినప్పుడు | లాలాజలం స్రవించడం జరుగుతుంది. |
| (సహజ ఉద్దీపన) | సహజ ప్రతిస్పందన |
| (Unconditined stimulus - UCS) | (Unconditioned Response - UCR) |

2. రెండవ దశ




| | |
|---|---|
| గంట శబ్దం (కృత్రిమ ఉద్దీపన)తో ఆహారం (సహజ ఉద్దీపన) ఇచ్చినప్పుడు | లాలాజలం స్రవించడం జరుగుతుంది. సహజ ప్రతిస్పందన(UCR) |

3. మూడవ దశ




| | |
|---|---|
| గంట శబ్దంకు | లాలాజలం స్రవించడం జరుగుతుంది. |
| (నిబంధిత ఉద్దీపన) | (నిబంధిత ప్రతిస్పందన) |
| (Conditioned Stimulus- CS) | (Conditioned Response -CR) |

ఒక ఉద్దీపనకు అంతకుముందు లేనటువంటి స్వభావ సిద్ధంకాని ప్రతిస్పందనకు ఏర్పరచడానికి ‘నిబంధనం’ అని డ్రెవర్ నిర్వచించేను

శాస్త్రీయ నిబంధనంలో కొన్ని నియమాలున్నాయి. వాటిని కిందివిధంగా చెప్పవచ్చు.

**ఎ. పునర్బలన నియమం (Law of Reinforcement) :** గంటను ఆహారానికి జోడించడం వల్ల నిబంధనం ఏర్పడింది. ఈ జోడించడం ఎంత ఎక్కువ ఉంటే అంత బలంగా నిబంధిత ప్రతిస్పందన (Conditioned response) ఏర్పడుతుంది. ఇట్లాంటి సంబంధాన్ని 'పునర్బలనం' అంటారు.

**బి. విరమణ (Extinction) :** ఒకసారి నిబంధనం జరిగిన తరువాత ఆ నిబంధనాన్ని విరమణ చేయవచ్చు. ఇది ఎట్లా చేస్తారంటే గంట (నిబంధిత ఉద్దపన) ఇచ్చిన తరువాత ఆహారం (నిర్నిబంధిత ఉద్దీపన) ఇవ్వడం మానేస్తే క్రమేణా నిబంధనం నశిస్తుంది. దీన్నే 'విలుప్తీకరణం' అని కూడా అంటారు.

**సి. అయత్న సిద్ధస్వాస్థ్యం (Spontaneous recovery) :** ప్రయోగాత్మకంగా నిబంధనం విరమణ చేసినప్పటికి ఒక్కొక్కసారి నిబంధన చర్య ఉన్నట్లుండి బయల్పడుతుంది. దీన్నే అయత్న సిద్ధస్వాస్థ్యం అంటారు.

**డి. సామాన్యీకరణం (Generalization) :** ఒకసారి ఒక ఉద్దీపనకు నిబంధనం జరిగినప్పుడు అదే ఉద్దీపనను పోలిన ఉద్దీపనలకు కూడా నిబంధనం విస్తరించడం జరుగుతుంది. దీన్నే సామాన్యీకరణం అంటారు. ఉదాహరణకు గంటకు లాలాజలం ఊరడం అనే నిబంధిత ప్రతిస్పందన ఏర్పరచిన తరువాత ఆ గంటను పోలిన ఉద్దీపనలకు కూడా నిబంధనం అన్వయిస్తుంది. అంటే బజర్, హార్న్‌కు కూడా లాలాజలం ఊరడమనే నిబంధిత ప్రతిస్పందన విస్తరించవచ్చు.

వాట్సన్ అనే శాస్త్రవేత్త తన ప్రయోగంలో ఆల్‌బర్ట్ అనే బాలునికి తెల్ల ఎలుకంటే భయాన్ని కృత్రిమంగా కల్పించాడు. అది ఎలాగంటే ఆ బాలుడు తెల్లఎలుకను సమీపించినపుడు పెద్ద పళ్ళాన్నికింద పడేసి, పెద్ద శబ్దం వచ్చేటట్లు చేశాడు. ఆల్‌బర్ట్ అనే బాలుడు తెల్ల ఎలుకంటే అమిత భయాన్ని వ్యక్త పరచాడు. ఆ బాలుడు తెల్ల ఎలుక కాకుండా తెల్ల బొచ్చుతో చేసిన బొమ్మలను చూసినా, అలాంటి వస్తువులు చూసినా భయం వ్యక్తపరిచాడు. అంటే ఆ బాలుడు తన భయాన్ని సామాన్యీకరణ చేసుకున్నాడని తెలుస్తుంది.

**ఇ. విచక్షణ (Discrimination):**

నిబంధనకు సంబంధించిన మరొక ముఖ్యమైన అంశం విచక్షణ అనేది. ఇది సామాన్యీకరణానికి వ్యతిరేకమైంది. విచక్షణలో ఒక ప్రత్యేకమైన ఉద్దీపనకు మాత్రమే నిబంధనం జరుగుతుంది. ఉదాహరణకు తెల్ల ఎలుకతో పాటు, తెల్లబొచ్చుతో కూడిన బొమ్మలకు, వస్తువులకు భయపడ్డ బాలుడు తన భయాన్ని తెల్ల ఎలుకకు మాత్రమే పరిమితం చేసుకోడాన్ని విచక్షణ అంటారు.

**ఎఫ్. ఉన్నత క్రమ నిబంధనం (Higher order conditioning):**

ఒక సారి నిబంధన ఏర్పాటుచేయడంలో ఉపయోగించిన నిబంధిత ఉద్దీపనను, మిగతా నిబంధన ప్రయోగాలలో నిర్నిబంధిత ఉద్ధీపనగా ఉపయోగించవచ్చని పావ్‌లోవ్ కనుక్కొన్నాడు. ఆ ఉన్నత క్రమ నిబంధనను తెలుసుకుందాం. మొదటి క్రమంలో నిబంధన ఏర్పడిన తరువాత

| | |
|---|---|
| గంట శబ్దంకు | కుక్క లాలాజలంను స్రవిస్తుంది. |

రెండవ క్రమంలో

| | |
|---|---|
| బల్బును వెలిగించడం<br>గంటశబ్దన్ని ఇవ్వడం | కుక్క లాలాజలాన్ని స్రవించడం |

**ఎ. పునర్బలన నియమం (Law of Reinforcement) :** గంటను ఆహారానికి జోడించడం వల్ల నిబంధనం ఏర్పడింది. ఈ జోడించడం ఎంత ఎక్కువ ఉంటే అంత బలంగా నిబంధిత ప్రతిస్పందన (Conditioned response) ఏర్పడుతుంది. ఇట్లాంటి సంబంధాన్ని 'పునర్బలనం' అంటారు.

**బి. విరమణ (Extinction) :** ఒకసారి నిబంధనం జరిగిన తరువాత ఆ నిబంధనాన్ని విరమణ చేయవచ్చు. ఇది ఎట్లా చేస్తారంటే గంట (నిబంధిత ఉద్దపన) ఇచ్చిన తరువాత ఆహారం (నిర్నిబంధిత ఉద్దీపన) ఇవ్వడం మానేస్తే క్రమేణా నిబంధనం నశిస్తుంది. దీన్నే 'విలుప్తీకరణం' అని కూడా అంటారు.

**సి. అయత్న సిద్ధస్వాస్థ్యం (Spontaneous recovery) :** ప్రయోగాత్మకంగా నిబంధనం విరమణ చేసినప్పటికి ఒక్కొక్కసారి నిబంధన చర్య ఉన్నట్లుండి బయల్పడుతుంది. దీన్నే అయత్న సిద్ధస్వాస్థ్యం అంటారు.

**డి. సామాన్యీకరణం (Generalization) :** ఒకసారి ఒక ఉద్దీపనకు నిబంధనం జరిగినప్పుడు అదే ఉద్దీపనను పోలిన ఉద్దీపనలకు కూడా నిబంధనం విస్తరించడం జరుగుతుంది. దీన్నే సామాన్యీకరణం అంటారు. ఉదాహరణకు గంటకు లాలాజలం ఊరడం అనే నిబంధిత ప్రతిస్పందన ఏర్పరచిన తరువాత ఆ గంటను పోలిన ఉద్దీపనలకు కూడా నిబంధనం అన్వయిస్తుంది. అంటే బజర్, హార్న్‌కు కూడా లాలాజలం ఊరడమనే నిబంధిత ప్రతిస్పందన విస్తరించవచ్చు.

వాట్సన్ అనే శాస్త్రవేత్త తన ప్రయోగంలో ఆల్‌బర్ట్ అనే బాలునికి తెల్ల ఎలుకంటే భయాన్ని కృత్రిమంగా కల్పించాడు. అది ఎలాగంటే ఆ బాలుడు తెల్లఎలుకను సమీపించినపుడు పెద్ద పళ్ళాన్నికింద పడేసి, పెద్ద శబ్దం వచ్చేటట్లు చేశాడు. ఆల్‌బర్ట్ అనే బాలుడు తెల్ల ఎలుకంటే అమిత భయాన్ని వ్యక్త పరచాడు. ఆ బాలుడు తెల్ల ఎలుక కాకుండా తెల్ల బొచ్చుతో చేసిన బొమ్మలను చూసినా, అలాంటి వస్తువులు చూసినా భయం వ్యక్తపరిచాడు. అంటే ఆ బాలుడు తన భయాన్ని సామాన్యీకరణ చేసుకున్నాడని తెలుస్తుంది.

**ఇ. విచక్షణ (Discrimination):**

నిబంధనకు సంబంధించిన మరొక ముఖ్యమైన అంశం విచక్షణ అనేది. ఇది సామాన్యీకరణానికి వ్యతిరేకమైంది. విచక్షణలో ఒక ప్రత్యేకమైన ఉద్దీపనకు మాత్రమే నిబంధనం జరుగుతుంది. ఉదాహరణకు తెల్ల ఎలుకతో పాటు, తెల్లబొచ్చుతో కూడిన బొమ్మలకు, వస్తువులకు భయపడ్డ బాలుడు తన భయాన్ని తెల్ల ఎలుకకు మాత్రమే పరిమితం చేసుకోడాన్ని విచక్షణ అంటారు.

**ఎఫ్. ఉన్నత క్రమ నిబంధనం (Higher order conditioning):**

ఒక సారి నిబంధన ఏర్పాటుచేయడంలో ఉపయోగించిన నిబంధిత ఉద్దీపనను, మిగతా నిబంధన ప్రయోగాలలో నిర్నిబంధిత ఉద్ధీపనగా ఉపయోగించవచ్చని పావ్‌లోవ్ కనుక్కొన్నాడు. ఆ ఉన్నత క్రమ నిబంధనను తెలుసుకుందాం. మొదటి క్రమంలో నిబంధన ఏర్పడిన తరువాత

| | |
|---|---|
| గంట శబ్దంకు | కుక్క లాలాజలంను స్రవిస్తుంది. |

రెండవ క్రమంలో

| | |
|---|---|
| బల్బును వెలిగించడం<br>గంటశబ్దన్ని ఇవ్వడం | కుక్క లాలాజలాన్ని స్రవించడం |

మూడవ క్రమంలో

| | |
|---|---|
| బల్బును వెలిగించడం | కుక్క లాలాజలాన్ని స్రవిస్తుంది. |

ఒక గంట శబ్దానికి లాలాజలం ఊరటం అనే ప్రక్రియ నిబంధనం చేసిన తరువాత గంటశబ్దంతో పాటు బల్బును వెలిగించడంను జతపరచినప్పుడు ఆ బల్బు వెలుగుకే కుక్క లాలాజలం స్రవించడం జరుగుతుంది. దీన్నే ఉన్నతక్రమ నిబంధనమని పేర్కొంటారు.

**శాస్త్రీయ నిబంధనము – విద్యాప్రాముఖ్యత :**

- అక్షర రూపాలకు, అక్షర శబ్దాలకు మధ్య
- సంఖ్యా భావనలకు, అంకెల రూపానికి మధ్య
- వస్తువుల పేర్లకు ,వస్తువలకు మధ్య నిబంధనం ఏర్పరచడం వల్ల విద్యార్థులు/బాలలు నేర్చుకుంటారు, అభ్యసిస్తారు.
- ట్రాఫిక్‌లైట్స్ /స్కూల్ బెల్ లకు అనుగుణంగా వ్యక్తులు, విద్యార్థుల ప్రవర్తనలకు నిబంధనం వల్లే జరుగుతుంది.
- గానంలో,నృత్య భంగిమలకు, తాళానికి మధ్య నిబంధనం ఏర్పరచాలి. నిబంధనం వల్లే గానంలో, నృత్యంలో సారూప్యం వస్తుంది.
- విద్యార్థులలో ఒక కృత్యాన్ని క్రమబద్ధంగా నిర్వహించడానికి శాస్త్రీయ నిబంధన తప్పనిసరి.
- మంచి క్రమశిక్షణను అలవరుచుటకు
- చెడు అలవాట్లను తొలగించుటకు
- మంచి వైఖరులను పెంపొందించుటకు
- భయాలను తొలగించుటకు
- పాఠ్యాంశాల వైపు ఆకర్షింపబడుటకు
- వేళ్ళను కొరకడం, గోళ్ళను కొరకడం, బెడ్‌వెట్టింగ్ లాంటివి మాన్పించుటకు శాస్త్రీయ నిబంధన నియమాలను అన్వయింపచేయవచ్చును.

**బి. కార్యసాధక నిబంధనం (Operant conditioning) :** కార్యసాధక నిబంధనానికి మూలపురుషుడు అమెరికాకు చెందిన శాస్త్రజ్ఞుడు బి.ఎఫ్.స్కిన్నర్ (B.F. Skinner). బుర్‌హుస్ ఫ్రెడరిక్ స్కిన్నర్ ప్రతిపాదించిన కార్యసాధక నిబంధన సిద్ధాంతం అతడు జీవులపై చేసిన ప్రవర్తనా అధ్యయనాలు మనోవిజ్ఞానశాస్త్రాన్ని ముఖ్యంగా విద్యామనోవిజ్ఞానశాస్త్ర విభాగాన్ని చాలా ప్రభావితం చేశాయి. కార్యసాధక నిబంధనాన్ని పరికరాత్మక నిబంధనం (Instrumental Learning)అని కూడా అంటారు.


స్కిన్నర్ పట్టభద్రుడైన తరువాత ఒక పుస్తకాల దుకాణంలో పనిచేశాడు. అక్కడ పావ్‌లోవ్, వాట్సన్‌ల వ్యాసాలు, పుస్తకాలు, గ్రంథాలను చదివి మనోవిజ్ఞానశాస్త్రాన్ని చదవాలని నిర్ణయించుకొన్నాడు. హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో చేరి మనోవిజ్ఞాశాస్త్రంలో పిహెచ్.డి.ని సాధించారు.

స్కిన్నర్ కార్యసాధక నిబంధన సిద్ధాంతం ప్రకారం


1. జీవులు తాము ఉన్న పరిసరాలలో ఎప్పుడూ క్రియాత్మకంగా ఉంటాయి. తనుచుట్టూ ఉన్న పరిసరాంశాలతో ప్రతిస్పందిస్తూ, చర్యలు జరుపుతూ ఉంటాయి.
2. కార్యసాధక నిబంధనంలో ఉద్దీపనలు పునర్బలన కారకాలు(Reinforcers) అవుతాయి.

3. నేర్పుతో క్రమానుసారంగా జీవి ఉన్న పరిసరాలను నియంత్రించడం ద్వారా వాటి ప్రవర్తనలను నియంత్రించవచ్చు.

ఇతను ఒక ఎలుకను ఒక పేటిక (Box) లో ఉంచాడు. ఆ పేటికలో ఒక ఇనుప ఊచ (Iron rod) ఉంటుంది. ఆ ఇనుప ఊచను కిందికి నొక్కవచ్చు. ఆకలిగా ఉన్న ఎలుకను పేటికలో ఉంచినప్పుడు అది ఆహారాన్వేషణకు అనేక ప్రయత్నాలు చేస్తుంది. యాదృచ్ఛికంగా అది ఊచను కిందికి నొక్కినపుడు వెంటనే ఆహారం ఇవ్వడం జరుగుతుంది. ఈవిధంగా ఎలుక ఇనుపఊచను నొక్కడం ద్వారా ఆహారం పొందవచ్చని తెలుసుకుంటుంది. దీన్నే 'కార్యసాధక నిబంధనం' అని స్కిన్నర్ వివరించాడు.




స్కిన్నర్ పేటిక



బి.ఎఫ్. స్కిన్నర్

ఆహారం కావలసినప్పుడల్లా ఊచను కదిలించి ఆహారాన్ని, (ఎక్కువ పునర్బలన ఉద్దీపనలను) పొందడాన్ని ఎలుక అభ్యసించింది.

పై విధంగా ప్రతిస్పందనలు ఉద్దీపనల మధ్య సంసర్గం ఏర్పడుతుంది. సరైన ప్రతిస్పందన (Response)లకు మాత్రమే పునర్బలన ఉద్దీపనం (Stimulus) ఇవ్వబడుతుంది. అందుకే ఈ సంసర్గం 'R' Type నిబంధనం. ప్రతిస్పందనలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వజం వల్ల దీన్ని R - S నిబంధనం అని కూడా అంటారు.

ప్రతిస్పందనల – ఉద్దీపనల మధ్య ఏర్పడే సంసర్గాలే ప్రవర్తనలు అని, ప్రవర్తనలు కనబడటం, కనబడకపోవడం అనేది, ఉద్దీపనలు అందడం, అందక పోవడంపై ఆధారపడే ఉంటుందని స్కిన్నర్ పేర్కొన్నాడు. ఎలుక పేటికలోని ఇనుప ఊచను కదిలించినప్పుడు ఆహారం (పునర్బలన ఉద్దీపన) దొరకనప్పుడు క్రమేణా ఎలుక ఊచను కదిలించడాన్ని ఆపివేస్తుంది. దీన్నే 'విరమణం' అంటారు. బి.ఎఫ్. స్కిన్నర్ రూపొందించిన కొన్ని సూత్రాలు ప్రవర్తనావాదాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనది కార్యక్రమయుత అభ్యసనం(Programmed learning).

కార్యసాధక నిబంధనం ఉపయోగించి విద్యారంగంలో ఒక నూతన ప్రక్రియను ప్రవేశపెట్టారు. దీన్నే కార్యక్రమయుత అభ్యసనం (Programmed learning) అంటారు. బోధనా యంత్రం అని కూడా దీన్ని పేర్కొంటారు. ఈ పద్ధతిలో క్లిష్టతరమైన బోధన విషయాల (Complex Teaching aspects) ను చిన్న చిన్న విభాగాలుగా విభజిస్తారు. ఈ విభాగాలను చట్రాలు (Frames) అంటారు. అంటే ఈ పద్ధతిలో బోధించే విషయాన్ని చిన్న చిన్న సోపానాలుగా విభజిస్తారు. విద్యార్థి ఈ చట్రంలోని విషయాన్ని చదివి ఒక ప్రశ్నకు లేదా సమస్యకు జవాబు ఇవ్వవలసి ఉంటుంది. తానిచ్చిన జవాబు సరియైనదీ కానిది అప్పటికప్పుడే సరిచూసుకోవచ్చు. ఇక్కడ స్వీయాభ్యసనం (Self learning) జరుగుతుంది. విద్యార్థి

తానిచ్చిన జవాబు సరియైనదా కాదా అని అప్పటికప్పుడు తెలుసుకోగలుగుతాడు. ఇక్కడ వ్యక్తిగత తారతమ్యాలను బట్టి అభ్యసనం జరుగుతుంది.. భోధనా యంత్రాలను అసలు మొట్టమొదట కనుగొన్నది ప్రెస్సి (Pressey) అనే శాస్త్రజ్ఞుడు తరువాత దీన్ని స్కిన్నర్ అభివృద్ధి పరచాడు.

**శాస్త్రీయ నిబంధన సిద్ధాంతం, కార్యసాధక నిబంధన సిద్ధాంతం మధ్య వ్యత్యాసాలు**

| శాస్త్రీయ నిబంధన సిద్ధాంతం | కార్యసాధక నిబంధన సిద్ధాంతం |
|---|---|
| * ఉద్దీపన (Stimulus) ఆధారిత నిబంధనం దీనినే S Type నిబంధనం అందురు.<br>* ఉద్దీపన + ప్రతిస్పందనల మధ్య బందం ఏర్పడును<br>* సహజమైన ఉద్దీపనకు, కృతిమమైన ఉద్దీపనకు బంధం ఏర్పడును<br>* ప్రతిస్పందనను రాబట్టడం జరుగుతుంది.<br>* అభ్యాసకుని పాత్ర నిష్క్రియాత్మకం | * ప్రతిస్పందన(Response) ఆధారిత నిబంధనం. దీనినే R Type నిబంధనం అందురు.<br>* ప్రతిస్పందన + ప్రతిఫలానికి మధ్య బంధం ఏర్పడును<br>* ప్రతిస్పందన స్వచ్ఛందముగా ఏర్పడును<br>* ప్రతిస్పందనను వ్యక్త పరచడం జరుగుతుంది.<br>* అభ్యాసకుని పాత్ర క్రియాత్మకం |

**2) యత్న – ప్రయత్న 'దోష అభ్యసన పద్ధతి (Trial and Error Learning)**

ఎడ్వర్డ్.లి. థార్న్‌డైక్ అమెరికా దేశపు మనోవిజ్ఞానశాస్త్రవేత్త, హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విలియం జేమ్స్ పర్యవేక్షణలో కోడిపిల్లలు, పిల్లులపై అనేక ప్రయోగాలను నిర్వహించారు. కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టాను పొందారు.

తను రచించిన “ Animal Intelligence: Experimental Studies ” అనే గ్రంథంలో తన ప్రయోగ ఫలితాలను పొందుపరిచారు. థార్న్‌డైక్ చేపట్టిన పిల్లిపై ప్రయోగం – తత్ఫలితంగా అతను పేర్కొన్న నియమాలను వాటి వివరణను తెలుసుకొందాం.

యత్న, దోష అభ్యసనంలో ప్రయత్నాలు చేసి తప్పులు చేయడం, వాటిని దిద్దుకోవడం ద్వారా అభ్యసనం ఏర్పడుతుంది. యత్నదోష అభ్యసనం మీద పరిశోధన చేసిన వారిలో ముఖ్యమైన వ్యక్తి ఎడ్వర్డ్ లియో థారన్‌డైక్ (E.L. Thorndike) ఫజిల్‌బాక్స్‌ను ఉపయోగించి ప్రయోగాలు జరిపాడు.

ఫజిల్ పెట్టెలో ఆకలిగా ఉండే ఒక పిల్లినుంచాడు. పజిల్ పెట్టెకు బయట పిల్లికి కనబడేవిధంగా ఆహారాన్ని ఏర్పాటు చేశాడు. ఫజిల్‌పెట్టె తలుపు తీయాలంటే పిల్లి ఒక మీటను నొక్కాలి. తలుపు తీయడానికి పిల్లి అనేక ప్రయాత్నాలు చేసింది. ఆఖరుకు యాదృచ్ఛికంగా మీటను నొక్కినపుడు తలుపు తెలుచుకుంది. పిల్లి ఫజిల్ పెట్టెలో నుంచి బయటకు వచ్చి ఆహారం తీసుకొంది. అంటే పిల్లి అనేక ప్రయత్నాలు చేసి, అనేక తప్పులు చేసి చివరకు సరియైన ప్రయత్నం చేసింది. ఆ తరువాత మళ్ళీ అదే పిల్లిని అదే ఫజిల్ పెట్టెలో ఉంచినపుడు, మళ్ళీ కొన్ని ప్రయత్నాలు చేసి మీటను నొక్కింది. కానీ రెండోసారి చేసిన తప్పుల సంఖ్య తగ్గిపోయింది. అభ్యసనానికి పట్టినకాలం కూడా తగ్గిపోయింది.

ఇలా పలుమార్లు పిల్లిని ప్రయోగానికి ఉపయోగించినప్పుడు అది మీటను తాకడం లేదా కదిలించడం ద్వారా తలుపును తెరవవచ్చు అనే విషయాన్ని నేర్చుకొంది. అంటే పరిశీలనలో తేలినదేమంటే, నిరంతర ప్రయత్నాల మీదట చేసే దోషాల సంఖ్య తగ్గిందనీ, అభ్యసించడానికి పట్టిన కాలం కూడా తగ్గిపోయిందనీ, మీటను నొక్కి, తలుపును తెరిచి ఆహారాన్ని పొందడాన్ని పిల్లి అభ్యసించిందనే అంశం రుజువైంది.


ప్రయత్నాల సంఖ్య పెరగడం వల్ల దోషాల సంఖ్య తగ్గి అభ్యసనం ఏర్పడుతుందని చెప్పే ఈ పద్ధతినే “యత్న –

దోష అభ్యసన పద్ధతి” అంటారు.


యత్న – దోష అభ్యసన ప్రక్రియలోని అంశాలు

1. జీవి ప్రేరణ పొందటం
2. గమ్యం వైపు కదలటం
3. అడ్డంకులు ఏర్పడడం
4. వివిధ చర్యలు/ప్రతిస్పందనలు చేయటం
5. యాదృచ్ఛికంగా ఫలితాన్ని పొందడం
6. ప్రతి స్పందనను/ప్రతిచర్యను ఎంపిక చేసుకోవడం
7. సరికాని ప్రతిచర్యలను తొలగించుకోవడం
8. ఫలితాన్నిచ్చిన ప్రతిచర్యను స్థిరపరుచుకోవడం – బంధాన్ని ఏర్పరుచుకుంటుంది.
9. సమస్యకు, ప్రతిచర్యకు మధ్య ఉన్న సంబంధాన్ని గట్టిపరుచుకోవడం.

పై అంశాలు జంతువుల్లో నైనా, పిల్లల్లోనైనా, మానవుల్లో నైనా తప్పక కన్పిస్తుంది. తద్వారా అభ్యసనం జరుగుతుంది.



ఇ.యల్. థార్న్ డైక్



పజిల్ బాక్స్

**థారన్‌డైక్ అభ్యసన సూత్రాలు :**

థారన్‌డైక్ పజిల్‌పెట్టెలో పిల్లిని ఉంచి చేసిన ప్రయోగాల ద్వారా కొన్ని అభ్యసన సూత్రాలను రూపొందించాడు. థారన్‌డైక్ ప్రకారం అభ్యసనం ఒక సంధానం (Connection) ద్వారా ఏర్పడుతుంది. కాబట్టి థారన్‌డైక్ సిద్ధాంతాన్ని సంధాన సిద్ధాంతం (Connectionism) అని పేర్కొంటారు.

థారన్‌డైక్ అభ్యసన సూత్రాలలో మూడు సూత్రాలు ముఖ్యమైనవి అవి ఏమంటే

1) సంసిద్ధతా నియమం (Law of Readiness)

2) అభ్యాస నియమం (Law of frequency)

3) ఫలిత నియమం (Law of effect)

**1. సంసిద్ధతా నియం (Law of readiness)**

సంసిద్ధతా నియమం థారన్‌డైక్ సిద్ధాంతాలలో చాలా ముఖ్యమైంది. తరగతిలో బోధించే విషయాలు విద్యార్థి అవసరాలకు తగినట్లుగా ఉన్నప్పుడు అతడు అభ్యసించడానికి సంసిద్ధుడవుతాడు. ‘గుర్రాన్ని తొట్టి వరకు తీసుకెళ్ళవచ్చు.

కాని దాని చేత నీళ్ళు తాగించలేరు' అనే సామెత మనకందరికి తెలుసు. కాబట్టి అభ్యసనంలో అతిప్రధాన విషయం అభ్యాసకునిలో సంసిద్దతను కలిగించడం.

హెర్బర్ట్ (Herbert) తాను తయారు చేసిన బోధన పద్ధతిలో మొదటి దశగా విద్యార్థిని సిద్ధం చేయడం అని పేర్కొన్నాడు. తరగతిలో బోధించే విషయాలు వ్యక్తికి భావి జీవితంలో ఉపయోగపడేవిగా ఉండాలి.

**సంసిద్ధతా నియమం యొక్క విద్యా ప్రాముఖ్యత :** ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధన చేసేటప్పుడు చేయవలసిన మొదటి పని వారిలో ప్రేరణ కలిగించడం. అభ్యసించే అంశాలు విద్యార్థుల అవసరాలకు సంబంధించినవిగా ఉండాలి. తెలిసిన విషయం నుంచి తెలియని విషయాలకు (From known to unknown వెళ్ళడమనే బోధన సూత్రం పాటించాలి.

ఉపాధ్యాయుడు మార్గదర్శకుడిగా ఉండి విద్యార్థులలో బోధనపట్ల ఆసక్తి కలిగించాలి. విద్యార్థులలో సంసిద్ధతను పెంపొందించడానికి బహుమతులు ఇవ్వడం, కథలు చెప్పడం, గేయాలు పాడడం, అభినయించడం, బోధనోపకరణాలను, దృశ్యశ్రవణపరికరాలను ఉపయోగించడం మొదలగునవి దోహదం చేస్తాయి.

**2. అభ్యాస నియమం (Law of frequency)**

"అభ్యాసం కూసువిద్య" అనే సామెత అందరికీ తెలుసు. అభ్యాస నియమాన్ని రెండుగా విభజించవచ్చు.

1) ఉపయోగ నియమం, 2) నిరుపయోగ నియమం

ఉపయోగ నియమం ప్రకారం అభ్యసించిన విషయాన్ని ఉపయోగించినపుడు అభ్యసనం పటిష్ఠమవుతుంది. అలాకాకుండా అభ్యసించిన విషయాన్ని ఉపయోగించకుండా ఉన్నపుడు అది నిరుపయోగమవుతుంది. దీన్నే "నిరుపయోగ నియమం" అని పేర్కొంటారు.

**అభ్యాస నియమం యొక్క విద్యా ప్రాముఖ్యత:** అభ్యాస నియమం చాలా వరకు డ్రిల్లను (Drill) సమర్థిస్తుంది. డ్రిల్ ద్వారా సరియైన పదకోశపదజాలాన్ని, కౌశలాలను అభ్యసించవచ్చు. అదే కాకుండా అభ్యాసనియమం ఇంటిపనిని (Home work)
ప్రోత్సహిస్తుంది. విద్యార్థికి కొన్ని నియోజనాలు ఇచ్చి వాటిని ఇంటిలో పూర్తి చేయమన్నప్పుడు, విద్యార్థికి అవగాహనకి పెంపొందుతుంది.

విద్యార్థులు తాము తరగతిలో నేర్చుకొన్న విషయాలను నిత్యజీవితంలో ఉపయోగించినపుడు తాము అభ్యసించిన విషయాలు వారి మనసులో నిలిచిపోతాయి. అదేవిధంగా పున:స్మరణ (Review) ద్వారా విద్యార్థులు తాము అభ్యసించిన విషయాలు సక్రమంగా జ్ఞాపకం పెట్టుకుంటారు. సమర్థవంతమైన అభ్యసనానికి పున:స్మరణ అమితంగా దోహదం చేస్తుంది.

**3. ఫలిత నియమం**

ఈ నియమం ప్రకారం అభ్యసనం ఫలితాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. ఒక ఉద్దీపనకు (Stimulus), ప్రతిస్పందనకు (Response) మధ్య సంధానం ఏర్పడినప్పుడు సంతృప్తికరమైన, పరిస్థితి నెలకొన్నప్పుడు ఆ సంధానం పటిష్ఠమౌతుంది. అట్లాకాకుండా అసంతృప్తికరమైన పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ సంధానం క్షీణిస్తుంది.

**ఫలిత నియమం యొక్క విద్యా ప్రాముఖ్యత (Educational implications of Law of effect):**

- ఫలిత నియమం ప్రకారం తరగతిలో ఏర్పరిచే అనుభవాలు సంతృప్తికరంగా ఉండాలి.
- విద్యార్థులకు అభ్యసించడానికి తగిన ప్రేరణ ఉండాలి. ప్రేరణ లేనిదే సక్రమమైన అభ్యసన జరగదు.
- విద్యార్థుల అవసరాలకు తగినట్లు బోధనాంశాలను సవరించాలి. తాము నేర్చుకొనే విషయాలు జీవితంలో తమకు ఉపయోగపడతాయని విద్యార్థులు తెలుసుకున్నప్పుడు అభ్యసనం సక్రమంగా జరుగుతుంది.


- విద్యార్థులకు విజయంతో కూడిన కార్యక్రమాలు ఏర్పాటు చేసినపుడు అభ్యసనం సక్రమంగా జరుగుతుంది.
- విద్యార్థుల సక్రమమైన అభ్యసనం చేసినప్పుడు బహుమతులు, ప్రశంసలు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులకిచ్చే నియోజనాలు (Assigments) వారు సాధించగలిగేవిగా ఉండాలి.
- విద్యార్థి చేసిన పనిని ఉపాధ్యాయుడు మెచ్చుకొన్నప్పుడు విద్యార్థి సంతోషిస్తాడు. అది సంతృప్తిని కలిగిస్తుంది.
- "Joyful Learning" అభ్యసన పరిస్థితులలో జరిగే అభ్యసనం పటిష్ఠంగా ఉంటుంది.

**4) అంతర్దృష్టి అభ్యసనం (Insighful Lerning)**


జర్మనీ దేశస్థులైన మాక్స్‌వర్దిమర్, కర్టకోఫ్కా, కోహ్లెర్, లెవిన్‌లు "గెస్టాల్ట్‌వాదాన్ని"(Gestaltism) ప్రతిపాదించారు. గెస్టాల్ట్ వాదాన్ని సంజ్ఞానాత్మక వాదమని కూడా అంటారు. 'గెస్టాల్ట్' అనే జర్మనీ భాషా పదం సమగ్రంగా లేదా "సంపూర్ణంగా" లేదా 'మొత్తంగా' అనే అర్థాన్ని ఇస్తుంది.

గెస్టాల్ట్ (సంజ్ఞానాత్మక వాదులు) వ్యవస్థీకృత మొత్తం(Organized whole) లేదా సమగ్రాకృతి (Configuration) అనే అర్థంతో "గెస్టాల్ట్" అనే పదాన్ని తమ సిద్ధాంతాలలో ఉపయోగించుకొన్నారు. ఒక అంశంలోని విడి భాగాల జ్ఞానం కంటే ఆ అంశాన్ని మొత్తంగా అధ్యయనం చేస్తేనే సమగ్రజ్ఞానం సంభవం అనేది గెస్టాల్ట్‌వాదుల భావన.

జర్మన్ దేశానికి చెందిన కోహెలర్ (Kohler) అంతర్దృష్టి అభ్యసనంపై ప్రయోగాలు చేశాడు. ఇతను 1914 సంవత్సరంలో టెనరిఫ్ (Tennereef Islands)) దీవులలో సుల్తానా అనే చింపాంజీతో పాటు ఇతర చింపాంజీల మీద కూడా ప్రయోగాలు జరిపాడు. పై ప్రయోగాలను గురించి వివరించేందుకు "ది మెంటాలిటి ఆఫ్ ఏప్స్" (The mentality of apes) అనే గ్రంథాన్ని రాశాడు. చింపాంజీలకు, మానవులకు మెదడు పరిమాణం, నిర్మాణంలో చాలా దగ్గరి సంబంధం ఉంది. అందుకే కోహెలర్ చింపాంజీలను ఎన్నుకొని వాటికి సమస్యలనిచ్చి అవి సమస్యా పరిష్కారమెట్లా చేసింది గమనించాడు.



**చింపాంజి రెండు కర్ర మొక్కలను ఒక్కటిగా అతికించడం**



**కొహిలర్**

ఒక ప్రయోగంలో కోహెలర్ ఒక చింపాంజీని ఒక గదిలో ఉంచి ఆ గది కప్పుకు ఒక అరటి పండ్ల గెలను వేలాడదీశాడు. ఆ గదిలో రెండు కర్రలనుంచాడు. ఆ కర్రలను ఒకదానికొకటి అమర్చడానికి వీలుంది. చింపాంజి మొట్టమొదట ఒకే కర్రతో అరటిపండ్లను అందుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. కాని విఫలమయింది. రెండు కర్రలలో ఏదీ కూడా విడివిడిగా వాడినపుడు పండ్లనందుకోవడానికి వీలుగా లేదు. ఉన్నట్లుండి చింపాంజీకో సమస్యా పరిష్కార మార్గం అవగతమైంది. అది మొత్తం సన్నివేశాన్ని గ్రహించగలిగింది. రెండు కర్రలు కలిపినప్పుడే పండ్లనందుకోవడానికి వీలవుతుందని గ్రహించింది. అంటే చింపాంజీ సన్నివేశంలోని అన్ని అంశాలను ప్రత్యక్ష వ్యవస్థీకరణ (perceptual

organisation) చేసుకొని తన సమస్యను పరిష్కారించుకొన్నదన్నమాట. దీన్నే అంతరదృష్టిఅభ్యసనం అని పేర్కొన్నాడు. సమస్యకు పరిష్కారం ఉన్నట్లు అవగతం అవడం.

పరిష్కార మార్గం మెరుపులాగా (Like a flash) తటాలున ఏర్పడడం అంతర్‌దృష్టి అభ్యసనం యొక్క లక్షణం.

**విద్యాప్రాముఖ్యత :**

విద్యా రంగంలో అంతర్‌దృష్టి అభ్యసనం ప్రముఖస్థానమాక్రమించు కుటుంది. కింది విషయాలలో అంతర్‌దృష్టి అభ్యసనం గమనించవచ్చు.

- సమస్యాపద్ధతిలో విద్యార్థులకు సమస్యలనిచ్చి వాటికి పరిష్కారం కనుక్కోమన్నప్పుడు వారిలో సృజనాత్మకత పెంపొందుతుంది.
- ప్రాజెక్టు పద్ధతిలో అంతర్‌దృష్టి అభ్యసనం ఉపయోగపడుతుంది. ప్రాజెక్టు అంటే ఒక ఉద్దేశంతో కూడిన కార్యక్రమం ఏర్పాటు చేయడం.
- విద్యార్థులకు విషయాంశాలను బోధించినప్పుడు అర్థసహితంగా బోధించినపుడు వారావిషయాన్ని సులభంగా అభ్యసిస్తారు.
- విద్యార్థులకు విషయాలు బోధించేటప్పుడు ఉపాధ్యాయులు వ్యవస్థాపనం మీద దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడు విద్యార్థులకు బోధనాంశాలు సక్రమంగా అవగతమవుతాయి.

**నిబంధన సిద్ధాంతాలకు, అంతర్‌దృష్టి అభ్యసన సిద్ధాంతానికి మధ్య గల వ్యత్యాసాలను తెలుసుకొందాం.**

| నిబంధన సిద్ధాంతాలు | అంతర్‌దృష్టి అభ్యసన సిద్ధాంతం |
|---|---|
| ప్రవర్తనా వాదం | జ్ఞాన నిర్మాణాత్మకవాదం |
| (పావ్‌లోవ్, స్కిన్నర్, థార్న్‌డైక్ సిద్ధాంతాలు) | (కోహెలర్ సిద్ధాంతం) |
| ఉద్దీపన – ప్రతిస్పందనలు లేక ప్రతి చర్యల మధ్య ఏర్పడే సంసర్గమే అభ్యసనం | పరిస్థితులలోని విషయాంశాల వ్యవస్థీకరణ స్థాపనమే అభ్యసనం. |
| చిన్న చిన్న భాగాలు/అంశాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా అభ్యసనం జరుగుతుంది. | భాగాలలోకన్నా '.మొత్తం" – "సంపూర్ణం" ముఖ్య లక్షణాలను గ్రహించడం ముఖ్యం. |
| యత్న –దోష పద్ధతికి/ ఉద్దీపన – ప్రతిచర్యలకు ప్రాదాన్యత ఇస్తారు. | అంతర్‌దృష్టి(Insight)కి ప్రాముఖ్యతనిస్తారు |
| బహిర్గతమైన శారీరక ప్రవర్తనలకు ప్రాదాన్యత ఇస్తారు | వ్యక్తి/ జీవి అంతర్గత మానసిక చర్యలకు ప్రాముఖ్యతనిస్తారు. |
| సృజనాత్మకతకు, వివేచనానికి, ఆలోచనలకు చోటులేదు | సృజనాత్మకతను, సమస్యా పరిష్కారానికి, ఆలోచనలకు, వివేచనలకు చోటుంటుంది. |
| ఇది విశ్లేషణాత్మకమైనది | ఇది సంశ్లేషణాత్మకమైనది. |

**సాంఘిక అభ్యసన సిద్ధాంతం:**

విద్యామనోవిజ్ఞాన శాస్త్రంలో "పెరుగుదల – వికాసాల" అధ్యయనం పిల్లల మానసిక, సాంఘిక, ఉద్వేగ, నైతిక వికాసాలగురించి, మీరు చాలా విషయాలు తెలుసుకొని ఉంటారు.

L7TC1Q

శైశవదశలో ఎనిమిది, తొమ్మిది నెలల వయస్సున్న పిల్లలు చిన్నచిన్న చలన కౌశలాలను, మాటలను, ఇంగితాలను (Gestures) పెద్దలను పరిశీలించి, అనుకరించి నేర్చుకొంటారు.

బాల్యదశలో పిల్లలు పాఠశాలకు వెళ్ళడం ప్రారంభించినప్పుడు తమ తోటి పిల్లల ప్రవర్తనలను అనుకరిస్తారు. తమకు ఇష్టమైన ఉపాధ్యాయుల ప్రవర్తనలను అనుకరిస్తారు. ఇంటిలో జరిగే అనేక సాంఘిక విషయాలను పరిశీలించి అనుకరిస్తారు.

ఉదాహరణకు మాట్లాడే భాష, ఆహార నియమాలు, వేషధారణ, పూజా విధానాలు, పండుగలు జరుపుకొనే విధానాలు, ఆచారాలు, నియమాలను పిల్లలు పరిశీలించి అనుకరణ ద్వారా అభ్యసిస్తారు.

కౌమారదశలో "వ్యక్తిపూజ" (Hero worship) అనే మానసిక ప్రక్రియ ఎక్కువగా ఉంటుంది. వ్యక్తిపూజలో పిల్లలు తాము అభిమానించే, ఇష్టపడే వ్యక్తి, లేదా వ్యక్తులు నుంచి తాము ఏది ఇష్టపడతారో ఆ ప్రవర్తనను అభ్యసిస్తారు.


ఉదాహరణకు మాట్లాడేతీరు,శారీరక కదలికలు, అభినయం, ఆలోచనలు, అభిప్రాయాలు, వైఖరులు, ఇష్టాయిష్టాలు మొదలైనవాటిని అనుకరణతో అభ్యసిస్తారు.

తాము అభిమానించే వ్యక్తిని నమూనాగా (Model) ఏర్పరుచుకొని తమ శీల నిర్మాణానికి (Character building) సమగ్ర మూర్తిమత్వ వికాసానికి ఉపయోగించుకొంటారని సాంఘిక మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ విధంగా సాంఘక అంశాలనుపరిశీలించి అనుకరణ ద్వారా అభ్యసిస్తారు. కాబట్టి దీనిని "సాంఘిక అనుకరణ అభ్యసనం" అని అంటారు. నిశిత పరిశీలన చేస్తూ, అనుకరణ ద్వారా అభ్యసించడం వల్ల ఈ అభ్యసనవిధానాన్ని "అనుకరణ అభ్యసనం" (Learning through Imitation) అంటారు.

ఎవరినో ఒకరిని అదర్శనమూనాగా (Model) చేసుకొని, వారి ప్రవర్తనలను నిశితంగా పరిశీలిస్తూ, వారిలాగా ప్రవర్తించడం వల్ల దీనిని "నమూనా అభ్యసనం" (Learning by Modelling) అని కూడా అంటారు. నిశిత పరిశీలనా దృష్టితో జరిగే అభ్యసనం కాబట్టి దీనిని "పరిశీలనా అభ్యసనం' అని కూడా అంటారు(Learning through Observation).

పిల్లలు పరిశీలనద్వారా అనేక విషయాలు నేర్చుకుంటారు. పాత్ర క్రీడ ద్వారా పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. వారు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను , న్యాయధిపతులను మొదలైనవారిని వేషబాషలు, సంభాషణల ద్వారా అనుకరిస్తారు. ఇది సాంఘికీకరణ ప్రముఖపాత్ర వహిస్తుంది. బండూరా ప్రకారం పిల్లలకు సరియైన నమూనాలుండాలి. పిల్లలకు నెహ్రూ, గాంధీజి, పటేల్, సుభాష్ చంద్రభోష్ మొదలైన దేశభక్తులను గురించి చెప్పినప్పుడు, వారి పటాలను చూసినప్పుడు పిల్లలు వాళ్ళను అనుకరించాలనుకుంటారు. ఉపాధ్యాయుడు కూడ విద్యార్థులకు ఆదర్శప్రాయుడిగా ఉండాలి. అప్పుడే వారిలో సక్రమైన ప్రవర్తన ఏర్పడుతుంది.





డా॥. బండూర

పరిశీలనాభ్యసనంలో రెండు రకాల మానసిక ప్రక్రియలున్నాయని అభిప్రాయపడ్డాడు.

1. వ్యక్తి నమూనా వ్యక్తితో మమేకమై ఆ వ్యక్తి యొక్క ప్రవర్తనాంశాలను ఉద్దేశ్యపూర్వకంగా స్వీకరించడం జరిగుతుంది. ఈ ప్రక్రియను 'తదాత్మీకరణం" (Identification) అన్నాడు.

2. వ్యక్తి నమూనా వ్యక్తి యొక్క ప్రవర్తనాంశాలను తన మానసిక వ్యవస్థలోకి సంగ్రహించుకోవడం జరుగుతుంది. ఈ మానసిక ప్రక్రియను "అంతర్లీకరణం" (Internalization) అన్నాడు.

పరిశాలనాభ్యసనంలో నాలుగు సోఫానాలుంటాయని 'బండూరా' పేర్కొన్నాడు. అవి.

1. అవధానం(attention)
2. ధారణ(Retention)
3. పునరుత్పాదన(Performance)
4. పునర్బలనం (Reinforcement)

పై వాటిని గూర్చి తెలుసుకుందాం.

**1. అవధానం**(attention): పరిశీలనాభ్యసనంలో నేర్చుకొనే వ్యక్తి, నమూనా వ్యక్తి యొక్క ప్రవర్తనాంశాలను ఆర్జించుకోవలన్నప్పుడు ఏకాగ్రతతో నమూనా ప్రవర్తనలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది. అవధానం, ఏకాగ్రత సక్రమంగా అర్థవంతగా ఉండే అంశాలను గ్రహించే ప్రక్రియ సులభతమవుతుంది.

**2. ధారణ**(Retention): గ్రహించిన అంశాలను జ్ఞప్తికి ఉంచుకోవడం ధారణ. నిశితంగా పరిశీలించిన అంశాలను దృశ్యరూపంలోగాని, శాబ్ధిక రూపంలోగాని గుర్తుంచుకోవాలి. మనసులో వాటిని అనుకరించాలి లేక అనుసరించాలి.

**3. పునరుత్పాదన– నిష్పాదన**(Performance): పరిశీలనాభ్యనం – నిశితంగా గమనించిన ప్రవర్తనాంశాలను స్మృతి పథం నుంచి జ్ఞప్తికితెచ్చుకొని నమూనా వ్యక్తిలా ప్రదర్శించడమే పునరుత్పాదన లేక నిష్పాదన. అంటే నేర్చుకొంటున్న వ్యక్తి తనకునచ్చిన ప్రవర్తనాంశాలను నమూనా వ్యక్తి నుండి గ్రహించి జ్ఞప్తికి ఉంచుకొని అవసరం వచ్చినప్పుడు ప్రదర్శించడమే పునరుత్పాదన.

**4. పునర్బలనం**(Reinforcement): పరిశీలనాభ్యసనం ద్వారా అనుకరించిన నమూనా ప్రవర్తనాంశాలు – నమూనా ప్రవర్తనలాగా ఉన్నదా? లేదా? అన్నది ప్రదర్శన తరువాత దాని కదే పునర్బలనం వల్ల తెలుస్తుంది. నమూనా ప్రవర్తనను కొనసాగించడమా? వద్దా? అనేది కూడా పునర్బలనం మీద ఆధారపడి ఉంటుంది.

పిల్లలు/ బాలలు తాము అనుకరణ ద్వారా ప్రదర్శించిన ప్రవర్తనలకు 'ధనాత్మక పునర్బలనం' అందినప్పుడే, బహుమతులు, పొగడ్తలు, ప్రశంసలు ఆమోదం మొదలగునవి అందినప్పుడు వాటిని కొనసాగిస్తారు. లేదా ఋణాత్మక పునర్బలనం' విమర్శలు, నిందలు, దండనలు అందినప్పుడు అటువంటి ప్రవర్తనలను కనబరచరు.

పరిశీలనాభ్యసనంలో జరిగే అనుకరణ బాలలు/పిల్లలు నమూనా వ్యక్తి ప్రవర్తనలను అవధానంతో ఆర్జించి, ధారణలో ఉంచుకొని, దానిని ప్రదర్శించినప్పుడు ,అతడు పొందే పునర్బలనం ఆధారపడి ఉంటుందని బండూరా అభిప్రాయపడ్డాడు.

**విద్యానుప్రయుక్తం**

1. విద్యార్థులు ఇతరుల ప్రవర్తనను పరిశీలించి అనేక విషయాలు నేర్చుకొంటారు. కాబట్టి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు స్ఫూర్తిని కలిగించే ప్రవర్తనను పిల్లల ముందు ప్రదర్శించాలి.

2. ఆమోదయోగ్యమైన ప్రవర్తనను విద్యార్థులు ప్రదర్శించినప్పుడు ఆ ప్రవర్తనను మెచ్చుకొని అవి విద్యార్థులలో స్థిరపడేటట్టు, అదేవిధంగా ఇతరులు దానిని చూసి ప్రేరణ పొందేటట్లు ఉపాధ్యాయులు చేయాలి.
3. ఆమోదయోగ్యం కాని ప్రవర్తనను విద్యార్థులు ప్రదర్శించినప్పుడు ప్రతికూలమైన పునర్బలనం గావించి వారు ఆ ప్రవర్తనను మానుకోనేటట్లు చేయాలి. తద్వారా ఇతరులు అలాంటి ప్రవర్తనను అలవర్చుకోకుండా కొంతమేరకు నిరోధించవచ్చు.
4. ఏదో ఒక రంగంలో పేరు ప్రఖ్యాతులు గడించిన స్థానిక పెద్దలను విద్యార్థులకు నేరుగా పరిచయం చేసి వారు పిల్లలతో మాట్లాడే అవకాశం కల్పించాలి. నేరుగా మాట్లాడించే వీలుకాకపోతే ఉపాధ్యాయుడే వారి గురించి చెప్పి పిల్లలు దానిని నుంచి ప్రేరణ పొందేటట్లు చేయాలి.
5. దేశనాయకుల, శాస్త్రజ్ఞుల, వివిధ రంగాలలో విశిష్టమైన స్థానంలో ఉన్నవారి జీవితచరిత్రలను, వారు అందించిన సేవల గురించి నాటకాల ద్వారా తెలపాలి. ఇలా తేలిపేటప్పుడు విద్యార్థుల స్థాయిని దృష్టిలో ఉంచుకొని చెప్పాలి.
6. విద్యార్థులు బహుమానం, దండనపై ఆధారపడకుండా వారే సొంత ప్రమాణాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు ప్రయత్నించేటట్లు, తద్వారా సంతృప్తిని పొందేందుకు విద్యార్థులను సంసిద్ధలను చేయాలి.

**5. బ్రూనర్ బోధనా సిద్ధాంతం (Bruner's Theory of Instruction)**

జెరోం బ్రూనర్, మనోవిజ్ఞాశాస్త్రవేత్త తన రచించిన "The Process of Education" అనే గ్రంథంలో బోధన సిద్ధాంతంకు, పాఠ్యప్రణాళిక రచనలకు, బోధన కార్యక్రమాలకు మూలం అయింది.

- ప్రవర్తనావాదులు ప్రతిపాదించిన నిబంధనల ద్వారా మానవులకు వివేచనా సామర్థ్యం ఉందన్న విషయాన్ని గుర్తించక పోవడాన్ని తప్పిదంగా పేర్కొన్నాడు.
- అభ్యసన ప్రకియలో విదార్థులు ఏ విధంగా ఆలోచిస్తున్నారన్న విషయం పట్ల దృష్టి సారించాలని అభ్యసన అంశాల పట్ల కాదని అభిప్రాయపడ్డాడు.
- అభ్యసనం అంటే జ్ఞాననిర్మాణం అని జ్ఞానానికి వ్యక్తి అనుభవాలకు మధ్య సంబంధం ఉందన్నాడు.
- బ్రూనర్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ఆవిష్కరణ అభ్యసనం (Discovery Learning) అని బోధన / శిక్షణ సిద్ధాంతం (Theory of Instruction ) అని అంటారు.

బ్రూనర్, పియోజె సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతంలో స్ఫూర్తి పొందాడు. పియాజెతో స్పూర్థి పొందినప్పటికీ కొన్ని విషయాలలో బ్రూనర్ పియాజెతో ఏకీభవించలేదు. పియాజె పిల్లలు పరిపక్వతకు చేరినప్పుడు బోధించాలంటే, బ్రూనర్, మాత్రం పరిపక్వతతో సంబంధం లేదంటాడు. ఇతను ప్రవర్తనావాద అభ్యసన సిద్ధాంతాలను వ్యతిరేకించాడు. బ్రూనర్ ప్రకారం

- ఏ విషయమైనా, ఎవరికైనా, ఏ వికాసదశలో నైనా ఫలవంతంగా బోధించవచ్చును
- విద్యార్థిలోని ఆసక్తి, కూతూహలం అభ్యసనానికి ప్రధాన అంశాలు అవుతాయి.
- విద్యార్థి స్వీయ అభ్యసనానికి ఎక్కువ ప్రాముఖ్యం కల్పించాలి.
- ఉపాధ్యాయుడు పర్యవేక్షకుడై, సలహా పూర్వక పాత్రను మాత్రమే చేపట్టాలి.
- బోధనా విషయాల కంటే బోధనా పద్ధతికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

MH5142

అందుకోసం ఇతడు తెలిపిన విధానమే బ్రూనర్ బోధనా సిద్ధాంతంగా పిలువబడుతుంది.

**బోధనా సిద్ధాంతంలో నాలుగు అంశాలు వున్నాయి. అవి**

1. సన్నద్ధత(Learning readiness)
2. విషయనిర్మాణం(Content Constuction)
3. వరసక్రమం(Confent seriation)
4. పునర్బలనం(Reinforcement)

**1. సన్నద్ధత :** బోధించవలసిన విషయాలను విద్యార్థి పూర్వ అనుభవాలకు, ఆసక్తులకు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మలచి అభ్యాసికులలో అభ్యసన సన్నద్ధతను కలిగించాలి అని అంటాడు.

**2. విషయనిర్మాణం :** ఏ విషయమైనా విద్యార్థుల సులభంగా అర్థం చేసుకొని వినియోగించుకొనే విధంగా విషయ నిర్మాణం చేసుకోవాలని బ్రూనర్ అభిప్రాయం. విషయనిర్మాణం సరళమైన వాటి నుంచి కఠినమైన వాటికి, తెలిసిన దాని నుంచి తెలియని దానికి అనే సూత్రాల ఆధారంగా జరగాలి అంటాడు. ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయిని దృష్టిలో ఉంచుకొని విషయ నిర్మాణం చేయాలి. ఉపాధ్యాయుడు విషయ నిర్మాణాన్ని సక్రమంగా ఏర్పరుచుకొని బోధిస్తే, విద్యార్థులలో ఆ విషయానికి సంబంధించిన మౌలిక 'భావనలు' ఏర్పడతాయి. విషయం అవగాహన అవుతుంది.

**3. వరుసక్రమం :** విద్యార్థులకు నేర్పవలసిన విషయాన్ని ఉపాధ్యాయుడు "క్లిష్టత, తార్కికత" ఆధారంగా వరుసక్రమంలో పేర్చుకోవాలి, తరువాత బోధించాలి.

**4. పునర్బలనం :** అభ్యసనాన్ని పునర్బలనం చెందించడానికి బహిర్గత ప్రేరణల కంటే అంతర్గత ప్రేరణలే ముఖ్యమైనవని బ్రూనర్ అభిప్రాయం. ఉపాధ్యాయుడు బహిర్గత ప్రేరణలను కల్పించినప్పటికీ, సమస్యలు పరిష్కరించాననే తృప్తి లేదా ఒక విషయాన్ని నేర్చుకొన్నాననే ఆనందమే విద్యార్థికి నిజమైన ప్రేరణ కలిగిస్తుందని ఈ అంతర్గత ప్రేరణే విద్యార్థి అభ్యసనాన్ని ముందుకు నడిపిస్తుందన్నది బ్రూనర్ అభిప్రాయం.

**విద్యానుప్రయుక్తం**

1. బ్రూనర్ అన్నట్లు "బోధించడానికి మానసిక పరిపక్వతతో పనిలేదన్న" దానితో విభేదించిన్పటికీ, విద్యార్థులకు విషయాన్ని అవగాహన చేయించడంలో ఉపాధ్యాయుడి పాత్ర చాలా ముఖ్యమైందని విద్యావేత్తలు గ్రహించగలిగారు.
2. బోధనకు ఉన్న అర్థాన్ని విస్తృత పరిచింది. బోధనంటే కేవలం పుస్తకంలో ఉన్నది ఉన్నట్లు చెప్పడం కాక విషయ నిర్మాణం, క్రమం కూడా బోధనలో భాగమేనని గుర్తించేటట్లు చేసింది.
3. అభ్యసనంలో అంతర్గత ప్రేరణ ప్రాముఖ్యాన్ని పెంచింది.

## 6. నిర్మాణాత్మక సిద్ధాంతం –(వైగోట్స్కీ అభ్యసన సిద్ధాంతం)(Constructivist Learning Theory)

రష్యా దేశస్థుడైన లెవ్ సెమోనోవిచ్ వైగోట్స్కీ (Lev Semonouich Vygotskey) సాంఘిక సాంస్కృతిక సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఈ సిద్ధాంతం జ్ఞాన నిర్మాణాత్మక వాదానికి ఊతమిచ్చింది.

ఉద్దీపన ప్రతిస్పందనల మధ్య బంధం ఏర్పడటం వల్ల అభ్యసనం జరుగుతుందని తెలిపే ప్రవర్తనావాదుల వాదాన్ని వ్యతిరేకించి అనుభవాల ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుందని పియాజే, వైగాట్స్కీ తెలిపారు. వీరు సంజ్ఞానాత్మకవాదాన్ని బలపరిచారు.

జ్ఞాన నిర్మాణాత్మక వాదం ప్రకారం వ్యక్తులు తమ అనుభవాల ద్వారా జ్ఞానాన్ని నిర్మించుకొంటారు. అభ్యసనం అంటే జ్ఞాన నిర్మాణం అని వీరు భావించారు. అభ్యసన ప్రక్రియలో పరిశీలించదగ్గ బాహ్య ప్రవర్తనల కంటే శిశువు

మస్తిష్కంలో జరిగే ప్రక్రియను ప్రాధాన్యం ఇవ్వాలి. అభ్యసనం వల్ల కలిగే ఫలితం (Product) కంటే అభ్యసనం జరిగే విధానం చాలా (Process) ముఖ్యం అనే ధోరణే ఈ వాదం ముఖ్య ఉద్దేశ్యం.

పిల్లలు తమంతట తాముగా తమకు తెలిసిన పూర్వ జ్ఞానాన్ని వినియోగించుకొని, ప్రస్తుత అనుభవాలతో నూతన విషయాలను ఆవిష్కరించుకోవడాన్ని జ్ఞాన నిర్మాణం అందురు. జ్ఞాన నిర్మాణంలో ఆలోచనలు. పూర్వ అనుభవాలు అత్యంత కీలకపాత్రను పోషిస్తాయి.

**జ్ఞానం ఒకరు అందించేది కాదు. అది పరస్పర భోదన** (Reciprocal Teaching) **:**

ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు 2-4 విద్యార్థులు కలిసి సహయోగ సమూహంగా (Collaborative Group) ఏర్పడతారు. ఒక అంశాన్ని ఒకరి తరువాత ఒకరు డైలాగుల ద్వారా వెల్లడిస్తారు. దీనిలో ప్రశ్నించడం, సంక్షిప్తీకరించడం, స్పష్టీకరించడం, ప్రాగుప్తీకరించడం అనే నాలుగు సంజ్ఞానాత్మక వ్యూహాలను సమూహ సభ్యులు ఉపయోగిస్తారు. ఉపాధ్యాయుడు విషయాన్ని గురించిన ప్రశ్నలను అడుగుతారు. విద్యార్థులు జవాబులు చెబుతారు. అదనంగా ప్రశ్నలడుగుతారు ఒక వేళ సభ్యుల మధ్య విషయాన్ని గురించి బేదాభిప్రాయాలుంటే విషయాన్ని తిరిగి చదువుతారు. ఉపాధ్యాయుడు విషయాన్ని సంక్షిప్తీకరిస్తాడు. విద్యార్థులు విషయం మొత్తాన్ని చర్చించి తెలియని విషయాలను స్పష్టీకరించుకుంటారు.

**భాగస్వామ్య అభ్యసనం**(Collaborative Learning) **సహకార అభ్యసనం**(Cooperative Learning) :

వైగాస్కీ ప్రకారం నిపుణలైన సమవయస్కులు ఇతర పిల్లల వికాసానికి తోడ్పడగలరు. భాగస్వామ్య అభ్యసనంలో పిల్లలు చిన్ని చిన్న సమూహాలుగా ఏర్పడి ఉమ్మడి లక్ష్య సాధనకు పాటుపడుతారు. సామర్థ్యాలను పెంచుకుంటారు. సృష్టించబడేది పిల్లల మదిలో జరిగే మానసిక ప్రక్రియల ద్వారా జ్ఞానం ఉత్పన్నమవుతుంది. పిల్లలు ప్రశ్నించడం, బడిలో నేర్చుకున్న దానిని బయట అనుభవాలతో అన్వయించుకోవడం, సమస్యలకు వివిధ కోణాల్లో చక్కగా స్పందించడం, తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడం లాంటి సందర్భాలలో జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

వైగాట్స్కీ సిద్దాంతములోని అంశాలు:

పిల్లలు తమ జ్ఞానాన్ని తామే నిర్మించుకుంటారు. అభ్యసనం వల్లనే వికాసం జరుగుతుంది. పిల్లల జ్ఞానాత్మక వికాసంలో బాష ప్రముఖస్థానం వహిస్తుంది.

**సమీపస్థ వికాస ప్రాంతము** (Zone of Proximal Development (ZPD)

అంటే విద్యార్థికి ఒక విషయాన్ని పూర్తిగా అభ్యసించే సామర్థ్యం ఉంటే తనకు తానుగా కొంత మేరకు నేర్చుకోగలడు. కాని తనకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వ్యక్తి సహాయ సహకారంతో పూర్తిగా నేర్చుకోగలుగుతాడు. అంటే నేర్చుకోవడానికి మధ్య ఉన్న దూరాన్నే సమీపస్థ వికాస ప్రాంతము అందురు.

**స్కఫోల్డింగ్** (Scaffolding)

వైగట్స్కీ తన సిద్దాంతంలో పేర్కొన్న మరో ముఖ్య అంశం 'స్లఫోల్డింగ్' అంటే సహాయ సహకారం అందించడం అని అర్థం. వైగాట్స్కీ ప్రకారము పిల్లల జ్ఞాన నిర్మాణములో ఏర్పడే సమీపస్థ వికాస ప్రాంతములను సామాజిక సాధనాలైన కంప్యూటర్లు, ఇంటర్‌నెట్‌లు, ఎన్‌సైక్లోపీడియాలు, టిక్షనరీలు, వీడియే క్లిప్పింగ్‌లు, లైబ్రరీలు, లాబొరేటరీలు కూడా పూరించగలుగుతాయని పేర్కొన్నాడు. దానినే సామాజిక స్కఫోల్డింగ్ అన్నాడు,

వైగాట్స్కీ మానవునిలో జరిగే మానసిక ప్రక్రియలను రెండు రకాలుగా వర్గీకరించాడు అవి

1. దిగువస్థాయి మానసిక ప్రక్రియలు
2. ఉన్నత స్థాయి మానసిక ప్రక్రియలు

**1. దిగువస్థాయి మానసిక ప్రక్రియలు:** వీటిని అంతర్గత సామర్థ్యాలని కూడా చెప్పవచ్చును. ఇవి వ్యక్తికి జన్మత: పుట్టుకతో సహజసిద్ధంగా సంక్రమించే మానసిక అంశాలు. ఉదాహరణకి పరిశీలించడం, గుర్తించడం, గుర్తుకు తెచ్చుకోవడం, ప్రశ్నించడం, పోల్చడం, తెలుసుకోవడం.

**2. ఉన్నత స్థాయి మానసిక ప్రక్రియలు:** వ్యక్తి సమాజంలో పరస్పర చర్యలు జరపడం వల్ల దిగువస్థాయిలోఈ మానసిన ప్రక్రియల్లో అనుసంధానం ఏర్పడటం వల్ల వ్యక్తి ఆలోచనలు, ప్రవర్తనలు ఉన్నతంగా వికసిస్తాయి. ఉదా: విశ్లేషణ, సంశ్లేషణ, సృజనాత్మకంగా ఆలోచించడం, వివేచన, విచక్షణము.

**విద్యా అనుప్రయుక్తాలు:**

- అభ్యసన ప్రక్రియల్లో భాగస్వామ్య అభ్యసనానికి పరిస్థితులు కల్పించాలి.
- భాషా వికాసానికి తోడ్పడాలి
- అభ్యసన అంశాలు అర్థవంతుగాను, స్థానిక అంశాలతో అనుసంధానం చేయాలి
- సంక్లిష్ట భావనల అవగాహనకు అందిన సమాచారాన్ని విశ్లేషణ, సంశ్లేషణ, వివేచన, ఆలోచనలకు దోహదం చేసే పద్ధతులను చేపట్టాలి.

### 4.5.2 అభ్యసన వక్రరేఖలు (Learning Curves)


అభ్యసన పురోగతి సూచించే వక్రరేఖలను – అభ్యసన వక్రరేఖలు అంటారు.

అభ్యసన వక్రరేఖలు మూడు రకాలు. అవి.

1. ఆరోహణ వక్రరేఖలు (Positively accelerted curves)
2. అవరోహణ వక్రరేఖలు (Negatively accelerted curves)
3. S ఆకారపు వక్రరేఖలు (S-shaped curves)

1. ఆరోహణ అభ్యసన వక్రరేఖ: పురోగమనదిశలో ఉంటుంది.

దక్షత/నిష్పాదన, ఒప్పుల సంఖ్య




కాలం/ప్రయత్నాల సంఖ్య


"X" అక్షంపై ప్రయత్నాల సంఖ్య లేక కాలము (Time)

"Y" అక్షంపై అభ్యసనం నిష్పాదన, దీక్షతను ఒప్పులు (Correct Responcses) గా తీసుకోన్నప్పుడు.

ప్రయత్నాల సంఖ్య పెరిగేకొద్ది – విద్యార్థుల అభ్యసనం వారు కనబరచే ఒప్పులు సంఖ్యలు నిష్పాదన(Performance)లేక దక్షత(Efficiency) క్రమేణ పెరుగుతుంది.

2. అవరోహణ అభ్యసన వక్రరేఖ – అభ్యసన వక్రరేఖ తిరోగమన దిశలో ఉంటుంది.

దక్షత/నిష్పాదన, తప్పుల సంఖ్య




కాలం/ప్రయత్నాల సంఖ్య

"X" అక్షంపై ప్రయత్నాల సంఖ్య లేక కాలము (Time)


"Y" అక్షంపై అభ్యసనం నిష్పాదన, దీక్షతను తప్పులలో

కాలం, ప్రయత్నాల సంఖ్య పెరిగేకొద్ది – విద్యార్థుల అభ్యసనం వారు కనబరచే తప్పుల సంఖ్య నిష్పాదన(Performance)లేక దక్షత(Efficiency) క్రమేణ తగ్గుతుంది.

3. S ఆకారపు అభ్యసన వక్రరేఖలు –

Y

దక్షత/నిష్పాదన, ఒప్పుల సంఖ్య



X

కాలం/ప్రయత్నాల సంఖ్య

"X" అక్షంపై ప్రయత్నాల సంఖ్య లేక కాలము (Time)
"Y" అక్షంపై అభ్యసనం నిష్పాదన, దీక్షతను ఒప్పులలో

అభ్యసన అంశాలు తొలుత కఠినంగా ఉంది, తరువాత మెల్లగా సులభతరంగా మరలా కఠినంగా ఉన్నప్పుడు S ఆకారపు అభ్యసన వక్రరేఖలు ఏర్పడతాయి.

4. **లాక్షణిక అభ్యసన వక్రరేఖ (Typical Learning curve)**

Y

దక్షత/నిష్పాదన, ఒప్పుల సంఖ్య




X

కాలం/ప్రయత్నాల సంఖ్య

"X" అక్షంపై ప్రయత్నాల సంఖ్య లేక కాలము (Time)
"Y" అక్షంపై అభ్యసనం నిష్పాదన, దీక్షతను ఒప్పులలో

లాక్షణిక అభ్యసన వక్రరేఖలో కింది అంశాలుంటాయి.

ఎ. **ప్రారంభస్ఫూర్తి (Initial spurt) :** అభ్యసనంలో మొట్టమొదట స్ఫూర్తి ఉంటుంది. అంటే అభ్యసనం చాలా వేగంగా జరుగుతుంది. దీన్నే ప్రారంభస్ఫూర్తి అంటారు.

బి. **చాంచల్యదశ (Stage of fluctuation) :** ప్రారంభస్ఫూర్తి తరువాత అభ్యసనం కొంత మందకొడిగా జరుగుతుంది. అభ్యసన వేగంలో హెచ్చుతగ్గులు లేదా ఎగుడుదిగుడు లొస్తాయి.

సి. **పీఠభూమి దశ (Platean stage) :** పీఠభూమిదశ అభ్యసన ప్రక్రియలో కీలకమైన దశ. ఈ దశలో అభ్యసనం స్తంభించి, ఎటువంటి పురోగమనం లేకుండా నిలిచిపోతుంది. వ్యక్తి తన అభ్యసన వేగంలో ఏ మాత్రం అభివృద్ధి చూపించలేక పోతాడు. ఎంత ప్రయత్నం చేసినా వ్యక్తి ముందు దశలో ఉన్న దక్షత కంటే హెచ్చు దక్షత సాధించలేడు. అభ్యసనం ఆగిపోయిందనే భ్రమ కలుగుతుంది. అయితే అది పొరపాటు. పీఠభూమి దశ తాత్కాలికం మాత్రమే. దీన్ని సవరించడానికి అభ్యసన పద్ధతులలో లోపాలను తొలగించడం, వ్యక్తికీ ప్రేరణ కలిగించడం, పునర్బలనం కలిగించడం మొదలైన పద్ధతులనవలంబించాలి. ఒక్కోసారి గమ్యం చేరడంలో ఎదురయ్యే ఆటంకాలవల్ల పీఠభూమిదశ కలగవచ్చు. తగిన ప్రోత్సాహకం ఇవ్వడం ద్వారా విద్యార్థి పీఠభూమి దశను అధిగమించేటట్లు చెయ్యవచ్చు.

### 4.5.3 అభ్యసన బదలాయింపు (Transfer of Learning)

అభ్యసన బదలాయింపునకు గారెట్ (Garrett) కింది నిర్వచనాన్నిచ్చారు. అభ్యసన బదాయింపంటే ఒక స్థితిలో జరిగిన అభ్యసనం, పూర్తిగా గానీ, పాక్షికంగాగానీ ఇతర పరిస్థితులకు అనుప్రయుక్తం కావడం.

అభ్యసన బదలాయింపులో నాలుగు రకాలున్నాయి. వాటిని కిందివిధంగా వివరించవచ్చు.

1) అనుకూల బదలాయింపు (Positive Transfer)

2) వ్యతిరేక బదలాయింపు (Negative Transfer)

3) శూన్య బదలాయింపు (Zero Transfer)

4) ద్వి పార్శ్వబదలాయింపు (Bilatoral Transfer)

**అభ్యసనం**

**1. అనుకూల బదలాయింపు (Positive Transfer)**

అనుకూల బదలాయింపులో ఒకరంగంలో ఇచ్చిన శిక్షణ ఇంకొక రంగానికి తోడ్పడుతుంది. ఉదాహరణకు కారు నడపడంలో ఇచ్చిన శిక్షణ ట్రాక్టర్ నడపడంలో సహాయపడుతుంది. అలాగే టైపు కొట్టడం బాగా వచ్చిన కంప్యూటర్ మీద సులభంగా పనిచేయగలుగుతాడు. హిందీ బాగా వచ్చిన వ్యక్తి సంస్కృతాన్ని సులభంగా నేర్చుకోవడానికి వీలవుతుంది.

**2. వ్యతిరేక బదలాయింపు (Negative Transfer)**

ఒక వ్యక్తికి ఒక రంగంలో ఇచ్చిన శిక్షణ ఇంకొక రంగంలో అభ్యసనానికి ఆటంకాన్ని కలిగిస్తే దాన్ని వ్యతిరేక బదలాయింపు అంటారు. ఉదాహరణకు తెలుగు లేదా హిందీ నేర్చుకొన్నవాళ్ళు ఇంగ్లీషు నేర్చుకోవడం చాలా కష్టం. దీనివల్ల తేలేదేమంటే రెండు రంగాలలో ఉన్న విషయాలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటే అది బదలాయింపుకు ఆటంకం కలిగిస్తుంది.

**3. శూన్య బదలాయింపు (Zero Transfer)**

శూన్యబదలాయింపులో ఎటువంటి బదలాయింపు జరగదు. ఉదాహరణకు ఆటలలో ప్రతిభ చూపడానికి, పాఠ్యాంశాలలో ప్రగతి చూపడానికి సంబంధంలేదు.

**4. ద్విపార్శ్వ బదలాయింపు (Bilateral Transfer)**

ద్విపార్శ్వబదలాయింపంటే ఒకవైపు చేతితో నేర్చుకొన్న విషయం లేదా కౌశలాన్ని ఇంకొక చేతితో చేయడానికి దోహదపరచడం ఉదాహరణకు ఒక చేతితో బాణాలు వేయడం బాగా వస్తే రెండో చేతితో కూడా బాణాలు వేయడం సులభతరమవుతుంది.

**అభ్యసన బదలాయింపునకు సంబంధించిన సిద్ధాంతాలు (Theories of Transfer of Learning)**

అభ్యసనబదలాయింపుకు సంబంధించిన సిద్ధాంతాలు కిందివిధంగా చెప్పడం జరిగింది.

1. **నియత క్రమశిక్షణా సిద్ధాంతం (Theory of formal discipline) :** ఇది చాలా పురాతన సిద్ధాంతం దీన్నిప్పుడు శాస్త్రవేత్తలంగీకరించడంలేదు. విద్యుక్త క్రమశిక్షణా సిద్ధాంతం ప్రకారం మనసులో కొన్ని విభాగాలుంటాయి. అవి ఏవంటే వివేచనం (Reasoning), ఆలోచన (Thinking), జ్ఞాపకం (Memory) పరిశీలన (Observation), తీర్పు (Judgement) మొదలైనవి. పురాతనకాలంలో పై విభాగాలు బలపరచుకోవడానికి కొన్ని కార్యక్రమాలేర్పాటు చేసేవారు. పరిశీలన పెంపొందించేందుకు సైన్స్ బోదించడం, వివేచనం పెంపొందించేందుకు తర్కశాస్త్రం బోధించడం, ఏకాగ్రత (Concentration) పెంపొందించేందుకు లెక్కలు బోధించడం పూర్వకాలంలో అనుసరించేవారు. ప్రస్తుతం ఈ సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలు తోసిపుచ్చారు.

2. **సమరూప మూలకాల సిద్ధాంతం (Theory of Identical elements) :** ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వ్యక్తి ఇ.ఎల్.థారన్‌డైక్, సమరూప మూలకాల సిద్ధాంతం ప్రకారం రెండు విషయాల మధ్య మౌలికంగా సామ్యం (Similarity) ఉంటే అభ్యసన బదలాయింపు జరుగుతుంది. పై సిద్ధాంతం ప్రకారం విషయంలో సారూప్యం (Similrity of content) వైఖరీలో సారూప్యం (Similrity of attitudes) అభ్యసన బదలాయింపుకు దోహదం చేస్తాయి. పద్ధతులలో సారూప్యం (Similarity of methods) కూడా బదలాయింపును కలిగిస్తుంది. ఉదాహరణకు గణిత నైపుణ్యాలు సక్రమంగా ఉంటే దీన్ని యాంత్రిక, సాంకేతిక విద్యలకు బదలాయింపు చేయవచ్చు. దీనికి కారణం సంకేతాలు, సూత్రాలలో సారూప్యం. అదేవిధంగా భాష నేర్చుకొనేటప్పుడు కూడా ఒకేరకమైన వ్యాకరణ సూత్రాలున్న భాషలలో ఒకదాన్ని నేర్చుకొంటే మరొకదాన్ని సులభంగా అభ్యసించవచ్చు. అంటే భాషాసూత్రాలలో సారూప్యం వల్ల శిక్షణ బదలాయింపు జరుగుతుంది. టైపురైటర్లో, కంప్యూటర్లో, కిబోర్డులో సారూప్యం వల్ల టైపు కొట్టడం నేర్చుకున్న వ్యక్తి కంప్యూటర్ నేర్చకోవడం సులభమవుతుంది.

3. **సామాన్యీకరణ సిద్ధాంతం (Theory of genaralisation) :** చార్లెస్‌జడ్ శిక్షణ బదలాయింపుకు సంబందించి పై సిద్దాంతాన్ని రూపొందించాడు. సామాన్యీకరణ సిద్ధాంతం ప్రకారం అభ్యసన పరిస్థితుల్లో సమరూప అంశాలకంటే, సామాన్యీకరణవల్ల అభ్యసన బదలాయింపు సక్రమంగా జరుగుతుంది. జడ్ తన ప్రయోగంలో రెండు సమూహాలను తీసుకొన్నాడు. మొట్టమొదటి సమూహానికి పరావర్తన సిద్ధాంతం (Theory of reflection) గురించి వివరించాడు. రెండో సమూహానికి అలాంటి వివరణ ఇవ్వలేదు. రెండు సమూహాలను నీటి అడుగుభాగంలో ఉన్న గమ్యాన్ని బాణంతో కొట్టమన్నాడు. మొట్టమొదట రెండు సమూహాలలోని వారు బాణం ప్రయోగించడంలో సమానమైన దక్షత చూపారు. కాని నీటిమట్టాన్ని మార్చినపుడు పరావర్తన సిద్ధాంతం గురించి శిక్షణ పొందిన సమూహంలోనివారు కొత్త పరిస్థితిని గ్రహించి గమ్యాన్ని బాణంతో సమర్ధవంతంగా కొట్టారు. పరావర్తన సిద్ధాంతం గురించిన పరిజ్ఞానం లేని రెండో సమూహంవాహు గమ్యాన్ని బాణంతో కొట్టడంలో ఎక్కువ తప్పులు చేశారు.

సామాన్యీకరణ సిద్ధాంతం ప్రకారం విద్యార్థులకు సూత్రాలు నేర్పడం, సిద్ధాంతాలు నేర్పడం చేయాలి. ఉదాహరణకు ఒక మోటారుకారు ఇంజన్‌ను బాగుచేయకలిగిన మెకానిక్, మోటారుబోటును బాగుచేయగలుగుతాడు దీనికి కారణం పై రెండింటిని బాగు చేయడంలో అనుసరించే సూత్రాలు ఒకటే గనుక.

**4.** **ఆదర్శాల సిద్ధాంతం (Theory of Ideals) :** ఆదర్శాల సిద్ధాంతాన్ని రూపొందించిన శాస్త్రవేత్త బాగ్లే (Baghley). దీనికి, సామాన్యీకరణ సిద్ధాంతానికి కొన్ని పోలికలున్నాయి. ఆదర్శాల సిద్ధాంతం ప్రకారం ఒక విషయం ప్రాముఖ్యాన్ని, ప్రాధాన్యతను గుర్తించడం వల్ల ఒక వైఖరి విధానం రూపొందించబడుతుంది. ఆ వైఖరి విధానం అభ్యసన బదలాయింపుకు మూలమవుతుంది. ఉదాహరణకు ఇంటిలో పరిశుభ్రత పాటించే వ్యక్తి ఆఫీసులో కూడా పరిశు భ్రతను పాటిస్తాడు.

**5.** **ట్రాన్స్‌పొజిషన్ సిద్ధాంతం (Theory of Transposition) :** దీన్ని గెస్టాల్టువాదులు ప్రవేశపెట్టారు. సమగ్రాకృతి సిద్ధాంతం అనికూడ దీన్ని పేర్కొంటారు. ఈ సిద్ధాంతం ప్రకారం వ్యవస్థానికి (Parts), సమస్తానికి (Whole) మధ్య ఉండే సంబంధాన్ని కొత్త పరిస్థితులలో కూడా అవలంబించి బదలాయింపు చేయడం జరుగుతుంది.

గెస్టాల్టువాదులు, సూత్రాలు (Principles) గాక సంబంధాలను ముఖ్యంగా పరిగణిస్తారు. వీరు 'సమగ్రాకృతికి ప్రాముఖ్యానిచ్చారు.

**శిక్షణ బదలాయింపుకు సంబంధించిన విద్యా ప్రాముఖ్యత**

విద్యలో శిక్షణ బదలాయింపునకు తగు ప్రాముఖ్యం ఉంది. ఒకరంగంలో నేర్చుకొన్న విషయాన్ని ఇంకొక రంగానికి అన్వయించడం ముఖ్యం కాబట్టి ఉపాధ్యాయుడు విద్యార్థులు తాము నేర్చుకొన్న విషయాలను ఇతర రంగాలకు అన్వయించేటట్లు చూడాలి. దీన్ని సాధించడానికి కింది సూచనలు పాటించాలి.

1. పాఠశాలలో నేర్చుకున్న విషయాలు నిత్యజీవితంలో ఉపయోగపడేటట్లుగా చూడాలి.
2. బట్టీ (Rote learning) అభ్యసనం కాకుండా విద్యార్థుల అర్థసహితంగా నేర్చుకొనేటట్లు చూడాలి. అప్పుడే వారిలో అంతర్‌దృష్టి ఏర్పడుతుంది.
3. దృశ్య శ్రవణ పరికరాల ద్వారా బోధన ఏర్పాటు చేసినపుడు అభ్యసనం ఆసక్తికరంగా, ప్రభావవంతంగా వుంటుంది.
4. విద్యార్థులు తమ సమస్యలకు పరిష్కారం తామే చేసికొనేటట్లు చూడాలి.
5. విద్యార్థులలో సరియైన వైఖరులు, విలువలు పెంపొందించినపుడు అవి వారికి జీవితకాలం ఉపయోగపడతాయి.

### 4.5.4 పునశ్చరణ మరియు అభ్యాసం పాత్ర (Role of Repetition and Practice)

1. పావ్‌లోవ్ తన ప్రయోగాల ద్వారా పేర్కొన్న ఒక ముఖ్య నియమం “పునర్బలన నియమం” దీని ప్రకారం ఒక సహజ ఉద్దీపన(ఆహారం) ఒక కృత్రిమ ఉద్దీపనతో (గంటశబ్దం) పదే పదే జోడించడం వల్ల ఏర్పడే నిబంధిత ప్రతిస్పందన (లాలాబలంను స్రవిచండం) బలంగా ఉంటుందని పేర్కొన్నా డు. అంటే పునరుక్తి(Repetition) వలన అభ్యసించిన విషయం బలంగా స్మృతి పదంలో ఉంటుందని.
2. థార్న్‌డైక్ తన ప్రయోగాలలో పిల్లుల్ని పదేపదే తను తయారు చేసిన ఫజిల్ బాక్స్‌లో ఉంచడంవలన అవి తక్కువ ప్రయత్నాలలోనే తక్కువ సమయంలోనే బాక్స్‌లో కవాటాన్ని ఉపయోగించి, తలుపు తెరుచుకొని ఆహారాన్ని అందుకొంటాయని పేర్కొన్నాడు. అభ్యసనంలో పునరుక్తి(Repetition) ప్రాముఖ్యతను పేర్కొన్నాడు.

   అభ్యాసం (Repetition) కూసువిద్య ఉద్దీపన – ప్రతిస్పందనల మధ్య ఏర్పడిన సంధానాలను పటిష్టపరచడానికి వాటని పదేపదే ఉపయోగించాలి. అందుకే ఈ నియమం – అభ్యాసన నియమం. Law of Exercise ఎక్కాలు చెప్పడాన్ని, పద్యాలను, గేయాలను వల్లించడాన్ని, డ్రిల్లింగ్‌ను ప్రోత్సహిస్తుంది. ఇంటి పనిని (Home work )ను సమర్థింస్తుంది. నియోజనాలను (Assignments) ఇవ్వడాన్ని సమర్థిస్తుంది.
3. స్కిన్నర్ ప్రయోగంలోని ఎలుక పేటికలోని ఊచను కదిలించి – ఆహారాన్ని పొందుతుంది. తొలి ప్రయత్నాలలో ఊచకదలి ఆహారంను పొందడం యాదృచ్ఛిమైన అనేక ప్రయత్నాలు(Repetition) ఫలితంగా ఎలుక ఊచ కదలికకు, ఆహారం పొందడానికి మధ్య సంబంధాన్ని గ్రహిస్తుంది లేక అభ్యసిస్తుంది. స్కిన్నర్ కూడా పునరుక్తి(Repetition) ప్రాముఖ్యతను ప్రస్తావించెను.
4. హాల్స్(Hulls) సిద్ధాంతం ప్రకారం జీవిలో అలవాటు ఏర్పడడానికి కారణం జీవి ఒక పనిని పదేపదే చేయడం వల్ల అది ఒక అలవాటుగా మారుతుందన్నాడు. పునరుక్తి(Repetition) అలవాటుకు బలాన్ని చేకూరుస్తుందన్నాడు.
5. ఎబ్బింగాస్(Ebbing haus) రూపొందించిన స్మృతి – విస్మృతిలకు సంబంధించిన ధారణ వక్రరేఖలు అనేక విషయాల్ని తెలియజేసింది. అభ్యసనం జరిగిన తొలిదశలలో విస్మృతి చాలా వేగంగా ఉంటుందని దాదాపు 66% అభ్యసన అంశాలను ఒకరోజులోనే మరచిపోతామని ప్రయోగపూర్వకంగా నిరూపించాడు. అలాగే అభ్యసించిన విషయాల్నే మరలా, మరలా అభ్యసించడంవల్ల అది మరుపుదారితీయదని పేర్కొన్నాడు. పునరుక్తి (Repetition)ను సమర్థించాడు.

   సంజ్ఞానాత్మక వాదులైన పియాజే, వైగోట్స్కీల అభిప్రాయాలు

“అభ్యసనం అంటే జ్ఞాన నిర్మాణం” అనే భఆవంలో పునరుక్తి(Repetition) పాత్రయేంటో తెలుసుకుందాం.

**1. కోహిలర్ అంతర్‌దృష్టి అభ్యసన సిద్ధాంత కర్త ప్రకారం**

- పునరుక్తి ప్రయత్నాలు అభ్యసన సాఫల్యాలకు నాంది పులుకుతుంది.
- పునరుక్తి ప్రయత్నాలు(Repetion)
- అభ్యసన అంశాలు, మొదదులో సరైన స్మృతి చిహ్నాలను (Encodings) ఏర్పరచడానికి దోహదం చేస్తుంది. అభ్యసనం బలపడుతుంది.
- అభ్యసన అంశాలను పునరుక్తి చేయడం ద్వారా జీవి ఏర్పరుచుకున్న అభ్యసన అంశాలను వ్యవస్థీకరణకు – పునర్వ్యవస్థీకరణకు దొహదం చేస్తుంది.

**2. జీన్ పియాజే–**

- జీవి ఏర్పరుచుకొనే జ్ఞాన నిర్మితుల(Schemata)కు మరియు కొత్తదనంతో ఏర్పడే సృజనాత్మక వికాసంతో నూతనజ్ఞాన నిర్మితులకు (New - reoganzed Schemata) అవకాసం ఏర్పరుస్తుంది.
- పునరుక్తి శిశువులో త్వరితంగా (accomodation) కు దారి తీసి సులభంగా పరిసరాలతో/అభ్యసన అంశాలతో అనుగుణ్యత(adaptation)కు దోహదం చేస్తుంది.

**3. వైగోట్స్కీ–**

- శిశువులలో ఉన్నత క్రమ మానసిక సామర్థ్యాల వికాసానికి పునరుక్తి(Repetition) అనుభవాల వలన సిద్ధిస్తుందన్నాడు.
- పునరుక్తి వలన అభ్యసన అంశాలు/విషయాంశాలు శిశువులో అంతర్గత కారణమౌతుంది.

**4. ఆల్‌ఫ్రెడ్ బండూరా–** పరిశీలనాభ్యసన సిద్ధాంతకర్త ప్రకారం

- పునరుక్తి పరిశాలనవలన పిల్లలు నమూనా ప్రవర్తనలను సులభంగా వ్యక్తపరచగలరు
- నేర్చిన నైపుణ్యాలను, కౌశలాలను పదే పదే పునరుక్తి కరించడం వల్ల క్రొత్త, సంక్లిష్ట కార్యలను/పనులను (Task)లను సాధించవచ్చు.

అభ్యసన ప్రక్రియలో పునరుక్తి (Repetition) అనేది చాలా ముఖ్యమని / అవసరమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. విషయానైన ఒక మారు చదివిన సాధించిన అది/అవి నిలకడగా మదిలో ఉండదని ఆ విషయాన్ని పదేపదే పునరుక్తి చేయడం వల్లే అభ్యసనం జరుగుతుందని చెప్పవచ్చు. ఎక్కాలనునేర్వడం, గేయాలు పద్యాలను వల్లించడం, పదజాలాభివృద్ధి వాటి అర్థాలను అవగాహన చేసుకోవడం మొదలగు వాటిని పునరుక్తి ద్వారానే సాధ్యమౌతుంది.

అందు “సాధనమున పనులు సమకూరు” అని (Practice makes the man perfect) అని చెప్పుకుంటాం.

మనము జీవితం ఎన్నో విషయాలను నేర్చుకుంటాం. దీనినే అభ్యసనం అంటాము. అభ్యసనం నిర్వచనాలు ఇది వరకే తెలుసుకొన్నాము. అనేక విషయాలను అనేక రకాలుగా నేర్చుకొంటాము. ఆ విషయాలను నేర్చుకోవాలంటే చేసిన పనిని అనేకసార్లు చేస్తే అది మనకు అలవడుతుంది. ఉదాహరణకి తెలుగులో పద్యాలు గాని, గణితములో ఎక్కాలు గాని, ఒక పాటను పడటం గాని, సంగీతం నేర్చుకోవడంగాని, సైకిలు త్రొక్కడం గాని, వంట చేయడం గాని, సైన్సులో బొమ్మలు గీయడం గాని పై పనులు అన్నీ ఒకేసారి సాధన చేస్తే రావు. అనేకసార్లు తిరిగి తిరిగి చేయాల్సి ఉంటుంది. ఏకసంథాగ్రాహులు ఒకసారి విన్నా, ఒకసారి చదివినా, ఒకసారి చేసినా నేర్చుకుంటారు. కాని అది అందరికీ సాధ్యము కాదు. కనుక ఒక అంశాన్ని అభ్యసించాలంటే పునశ్చరణ (Repetition) మరియు అభ్యాసం అవసరం.


చదివిన విషయం శాశ్వతంగా స్మృతిలో ఉండిపోవాలంటే పునశ్చరణ చాలా అవసరం. అనేక ప్రయోగాల వల్ల తెలిసింది ఏమంటే ఒక విషయం బాగా వచ్చిందనుకొన్న తరువాత కూడా మరికొన్ని సార్లు అదనంగా పునశ్చరణ చేయాలి. దీనినే అతి అభ్యసనం అని అంటారు. అతి అభ్యసనం (Over Learning) ఒక విషయాన్ని మనసులో శాశ్వతంగా ఉండేటట్లు చేసి విస్మృతిని తగ్గిస్తుంది. స్మృతిని పెంచుతుంది.

అభ్యాస నియమాన్ని ఇ.యల్. థార్న్‌డైక్ యత్నదోష అభ్యసనంలో దాని ప్రాముఖ్యతను చెప్పాడు. అభ్యాసము అంటే చేసిన పనిని మరలా చేయడం అభ్యాసము మనిషిని నిష్ణాతున్ని (Practice makes man perfect) చేస్తుంది. అభ్యాసం చేయడం వలన స్మృతిని పెంచి విస్మృతిని తగ్గిస్తుంది.

### 4.5.5 మార్గదర్శక పరిశోధన (Guided Inquiry)

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక ఉన్నత విద్యలను చదవడానికి, వారి అవసరాలు తీరడానికి అనుగుణంగా వారిని ఎలా విద్యావంతులను చేస్తాము? విశ్వావ్యాప్త సమాచారాన్ని సేకరించడానికి వారిని ఎలా తయారుచేస్తాము? వారిని సక్రమంగా ఆలోచింపచేయడానికి సరియైన నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రావీణ్యులు కావడానికి జీవితాంతం అభ్యసించడానికి, క్రొత్త విషయాలు కనుక్కోవడానికి మార్గాలేంటి? ఆనేటివి మన ముందున్న ప్రశ్నలు. వాటికి అనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దలుగలమా? పిల్లల సంజ్ఞానాత్మక వికాసానికి, సామర్థ్యాలను సాధించడానికి అభ్యసించడానికి, అన్వేషించడానికి వివిధ రకాల మార్గాలేమిటి?

వివిధ రకాల సమాచారం సేకరించు సమీకృతపరిశోధన ద్వారా పాఠ్యాంశాలను, భావనలను, మరియు సమాచారాన్ని సేకరించుటకు మార్గాలు, ఉపాధ్యాయుని సూచనలు, పాఠశాల, గ్రంథాలయము మరియు తోటి విద్యార్థుల సహకారము మరియు సమన్వమే మార్గదర్శక పరిశోధన అందరు.




పై ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడంలో అనేక పద్ధతులు ఉన్నప్పటికీ మార్గదర్శక పరిశోధన అనునది ఒక మెరుగైన పద్ధతి.

మార్గదర్శక పరిశోధన జీవితాంతం అభ్యసించడానికి ఉపయోగపడుతుంది. ఇది విద్యార్థులను లోతుగా ఆలోచించడానికి ఉపయోగపడుతుంది. తద్వారా అన్ని విషయాలలో సఫలీకృతులు అవుతారు. అభ్యసనా సామర్థ్యాన్ని పెంచుతుంది.

అభ్యసించడానికి మార్గదర్శత పరిశోధన అనేది ఒక మార్గము దీనికి సక్రమమైన ప్రణాళిక, పర్యవేక్షణ, నిరంతరం మూల్యాంకనము అవసరము తద్వారా విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదించి మంచి నైపుణ్యాన్ని పొందగలరు.

మార్గదర్శక పరిశోధన విధానంలో విద్యార్థి జ్ఞానార్జన కొరకు క్రింది నమూనాలోని ప్రశ్నలకు సమాధానము ఇచ్చుకుంటూ ముందుకు సాగాలి.

### మార్గదర్శక పరిశోధన కొరకు విస్తరింపబడిన ప్రశ్నలు:

పైన తెలిపిన ప్రశ్నలు, తదుపరి అభ్యసనము కోసం విద్యార్థులను ప్రేరేపించును. దీని ద్వారా విద్యార్థులలో ఆలోచన సామర్థ్యాన్ని పెంచి అభ్యసనము మెరుగుపరచాలి.

**ప్రయోజనాలు:**

- సాంఘిక భాష – పఠన నైపుణ్యాలు అభివృద్ధి చెందును
- స్వీయ అవగాహనను నిర్మించుకొంటారు
- పరిశోధనలోని అభ్యసించడంలో స్వతంత్ర్యంగా వ్యవహరిస్తారు
- హెచ్చు స్థాయిలో ప్రేరేపించబడుదురు.
- పరిశీలన ప్రాజెక్టుల్లో అభ్యసన పద్ధతులను నైపుణ్యాలు అన్వయించ చేస్తారు

### 4.5.6 సమీకృత ప్రాజెక్టులు పాత్ర (Role of Integrated Projects)

అభ్యసనములో విద్యార్థులు స్వయంగా పాల్గొని ఏదైనా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి చేయడాన్ని లేదా ఏదైనా సమస్యకు పరిష్కారం కనుగొనడం గాని చేయడాన్ని సమీకృత ప్రాజెక్టులు అందరు.

సమీకృత ప్రాజెక్టు అనేది విద్యార్థులందరు కలిసి ఆలోచించి చేసే సమీష్టి పని. ఇది ఆచరణ ద్వారా అభ్యసనం (Learning by doing) అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుంది. ఇది 'జాన్‌డ్యూయీ' 'వ్యవహారిక సత్తావాదం' (Pragmatism)తో దగ్గర సంబంధం ఉంది.

'థార్న్‌డైక్' యత్నదోష అభ్యసన సిద్ధాంతంలోని సంసిద్ధత నియమం, అభ్యాస నియమం మరియు ఫలిత నియమాలపై ప్రాజెక్టు పని ఆధారపడి వుంటుంది.

**ఉదాహరణకి –**

- పరిసరాల విజ్ఞాన పాఠ్యపుస్తకంలోని పదాల ఉత్తలేఖనము – ఒక విశ్లేషణ
- గ్రామములోని నీటి వనరులను చూపు గ్రామ పటాన్ని గీయండి.
- సంకలన పద సమస్యలను చేయడంలో విద్యార్థులు కనబరిచే సాధారణ దోషాలు – వివరణ

ప్రాజెక్టులు చేపట్టడం వలన విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం పెరిగి వారిలో సంఘీభావం కలుపుగోరుతనం, స్వయంగా నిర్ణయాలు తీసుకొనే నైపుణ్యాలు, ప్రణాళిక, ఆచరణ, ఫలితాలు సాధించడం అనే అంశాలు అభివృద్ధి చెందుట తద్వారా విద్యార్థులు నిష్ణాతులు అవుతారు. కనుక సమీకృత ప్రాజెక్టులు విద్యార్థులచే చేయించి వారి నైపుణ్యాలను అభివృద్ధి పరచాలి.

### 4.5.6 సహకార అభ్యసనము–భాగస్వామ్య అభ్యసనము

(Cooperative Learning - Collaborative Learning)

బోధన అభ్యసన ప్రక్రియలలో నిర్మాణాత్మకవాదులు కొన్ని విలువైన, ఫలవంతమైన సూత్రాలను అన్వయింపచేశారు. అందులో ముఖ్యమైనవి సహకార అభ్యసనము మరియు భాగస్వామ్య అభ్యసనము.

**(అ) సహకార అభ్యసనము** (Cooperative Learning )

సహకార అభ్యసము అనేది ఒక సమూహిక అభ్యసన కృత్యము. ఇందులో అభ్యాసకులు తన సొంత అభ్యసనముతో పాటు సమీపములోని ఇతర వ్యక్తుల అభ్యసనానికి తోడ్పడుతారు. ఇది వ్యవస్థీకరింపబడిన సమూహాము యపొక్క సాంఘిక పద్ధతి. ఈ పద్ధతి సాంఘిక మరియు విద్యా సామర్థ్యాలను ప్రోత్సహించును. విద్యార్థులకు అభ్యసనానికి ఎంతగానో ఉ పయోగపడే పద్ధతి. ఇది విద్యార్థులకు సాంఘిక నైపుణ్యాలనే కాకుండా సామూహికంగా ఎలా సహకరించయకోవాలో నేర్పుతుంది. దీని ద్వారా విద్యా ప్రమాణాలను మరియు సామర్థాలను సేకరిస్తారు.

**సహకార అభ్యసనం లక్షణాలు** (Characteristics of Cooperative Learning)

- అభ్యాసకులు సాధారణ విద్యా కృత్యాలు సాధించడానికి సహకారంతో సామూహికంగా పనిచేస్తారు.
- జట్టులో పనిచేయడానికి సహకారం, సాంఘిక ప్రవర్తనను వ్యక్తపరుస్తారు.
- విద్యార్థులు ధనాత్మకంగా (Positive)ఒకరిపైన ఒకరు ఆధారపడి ఉంటారు.
- జట్టులోని సభ్యులంతా వ్యక్తిగతంగా బాధ్యత వహిస్తారు.

**సహకార అభ్యసనం లక్ష్యాలు** (Objectives of Cooperative Learning)

- సహకార అభ్యసనం అభ్యాసకులకు అభిప్రాయాలకు వ్యక్తపరచడానికి అవకాశం కల్పిస్తుంది.
- సమాచార, ప్రసార నైపుణ్యాలను అభివృద్ధిపరుస్తుంది.
- శాస్త్రీయ ఆలోచనలకు పెంపొందిస్తుంది.
- అభ్యాసకులను ఉత్తేజపరుస్తుంది.
- ఇందులో ఒత్తిడి లేని వాతావరణం కల్పిస్తుంది
- విద్యార్థుల మధ్య సహకారం భావం అలవడుతుంది

**ప్రయోజనాలు:**

విద్యార్థులు కొన్ని అభ్యసన అంశాలను అభ్యసించేటపుడు వాళ్లలో సహకారభావం అభివృద్ధి చెమది వాళ్ళ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచి వారి నైపుణ్యాలను అభివృద్ధపరచుకుంటారు. సహకార అభ్యసనం వలన కలిగే కొన్ని ప్రయోజనాలను గురించి తెలుసుకుందాము.

- ఈ పద్ధతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని అభివృద్ధిపరచి తద్వారా వారి విద్యాసాధన మెరుగుపరువును.
- విద్యార్థుల ధారణను మెరుగుపరుస్తుంది.
- అభ్యసన అనుభవాల ద్వారా విద్యార్థులు తృప్తిచెందుదురు
- సమూహ మరియు సమాచార, ప్రసార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొంటారు.
- ఆత్మసంతృప్తి కలిగిస్తుంది
- సొంత జ్ఞానాన్ని నిర్మించుకుంటారు
- సాంఘిక లక్షణాలను అభివృద్ధి పరచుకుంటారు
- వ్యక్తుల మధ్య సమూహాల మధ్య సంభాషణను అభివృద్ధి పరుచుకుంటారు
- ఉపాధ్యాయులపైన ఆధారపడకుండా సొంతంగా అభ్యసన సామార్థ్యాలను అభివృద్ధి పరుచుకుంటారు.
- ఒంటరితనము అనే భావనను తొలగించుకుంటారు.
- సమూహ సభ్యునిగా భావించి ధైర్యమును నెలకొల్పుతారు.

సహకార అభ్యసనములోని అంశాలు: వ్యక్తి గత పోటీతత్త్వం మరియు వ్యక్తిగత ప్రయత్నం కన్నా సమూహ ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తుంది. ఇది కొన్ని అంశాలకు లోబడి ఉంటుంది.

**1. అనుకూల సామూహికత్వం:**

- సమూహములోని సభ్యుల అందరి ప్రయత్నాలు సమూహ విజయానికి దారితీస్తాయి.
- సమూహ ప్రయత్నానికి వ్యక్తిగత ప్రయత్నం మూలం

**2. ముఖాముఖి సంభాషణ:**

- సభ్యులందరూ సమూహ విజయానికి చర్చించుకుంటారు.
- ప్రతి ఒక్కరూ వారి జ్ఞానాన్ని బోధిస్తారు
- అవగాహన అంశాలను చర్చిస్తారు
- పూర్వ అనుభవాలను అనుసంధానం చేస్తారు

**3. వ్యక్తిగత మరియు సామూహిక బాధ్యత:**

- సమూహం సాధ్యమైనంత చిన్నదిగా ఉండాలి
- వ్యక్తిగత నికషను అందించాలి
- ప్రతి విద్యార్థి తన ప్రగతిని సమూహం ముందు ఉండాలి
- సమూహంలోని ప్రతి వ్యక్తి ప్రగతిని నమోదు చేయాలి
- ప్రతి సమూహంలో ఒక పరిశీలకుడు ఉండాలి. అతనికి అందరు నివేదికు అందజేయాలి

**4. వ్యక్తంతర నైపుణ్యాలు – చిన్న సమూహాలు**

- సాంఘిక నైపుణ్యాలు నాయకత్వం, నిర్ణయాలు తీసుకోవడం, నమ్మకాన్ని పెంచుకోవడం, సమాచార మరియు ప్రసార నైపుణ్యాలు, సంఘర్షణలను ఎదుర్కొనే సామర్థ్యం మొదలగు అంశాలను బోధించాలి.

**5. సమూహ ప్రక్రియ:**

- సమూహములోని సభ్యులందరు తమ గమ్య సాధనకు మార్గాలను గురించి చర్చించుకోవాలి.
- సమూహంలోని వ్యక్తుల బలాలను, బలహీనతలను గురించి వివరించండి
- సామూహిక ప్రవర్తన గురించి చర్చించి నిర్ణయాలు తీసికోవాలి

**(ఆ) భాగస్వామ్య అభ్యసనము** (Collaborative Learning) :

ఒక సమస్యను పరిష్కరించడంలో గాని, ఒక వస్తువు రూపకల్పనలో గాని, ఒక పనిని చేయడంలో గాని కొంత మంది అభ్యాసకులు సమూహకంగా చేరి పనిచేయడాన్ని భాగస్వామ్య అభ్యసనము అందురు. సమూహములోని సభ్యులందరు చురుకుగా చర్చల్లో పాల్గొంటారు. చర్చల్లో చురుకుగా పాల్గొనడంతో అభ్యసనం కొనసాగును. వాస్తవానికి అది ఒక సాంఘిక చర్య. ఇందులో విద్యార్థులు అనుకూలమైన సర్దుబాటు కలిగి వ్యక్తిగత బాధ్యత వహిస్తారు. విషయాలను ముఖాముఖిగా చర్చించి ఫలప్రదం చేస్తారు. వ్యక్తిగత లక్ష్యాలను రూపొందించుకొని భాగస్వామ్య నైపుణ్యాలను కలిగి ఉంటారు. స్వీయ విశ్లేషణ చేసుకుంటారు. భాగస్వామ్య అభ్యసన ప్రక్రియలో అభ్యాసకులు ఒకరితో ఒకరు ఆలోచనలను పంచుకొంటారు. ఇతరుల పనితీరును ప్రశ్నించుకుంటారు. వస్తురూపకల్పన దిశగా అభ్యసన కొనసాగుతుంది.

**భాగస్వామ్య అభ్యసనం – లాభాలు:**

- ఉన్నత ఆలోచనలు కలిగిన నైపుణ్యాలను పెంచుకుంటారు.
- ఉపాధ్యాయ – విద్యార్థుల మధ్య సంబంధాన్ని బలపరుస్తుంది.
- సామర్థ్యాన్ని పెంచుతుంది
- ఆత్మ గౌరవము పెరుగును
- అభ్యసన అనుభవాలు సంతృప్తినిస్తాయి.
- విషయ అవగాహన అభివృద్ధి చెందును

- మౌళిక భావ (Oral Communicative Skills)ప్రసార నైపుణ్యాలు అభివృద్ధి చెందును
- సాంఘిక పరస్పరత నైపుణ్యం అభివృద్ధి చెందును
- చురుకైన అన్వేషణాత్మక అభ్యసన వాతావరణాన్ని రూపొందించును
- వ్యక్తిగత బాధ్యతాయుత సమస్యా పరిష్కార సాంఘిక చర్యను ప్రోత్సహిస్తుంది
- విభిన్న అవగాహనను కల్గిస్తుంది,
- అభ్యసనలలో విద్యార్థి బాధ్యతను పెంచుతుంది
- పాఠ్య ప్రణాళికను రూపొందించడంలో విద్యార్థులను భాగస్వామ్యులు చేస్తుంది
- విమర్శనాత్మక ఆలోచనను కల్గిస్తుంది
- వ్యక్తిగత నైపుణ్యాలను రూపొందిస్తుంది
- వ్యక్తంతర సంబంధాలను కల్గిస్తుంది
- ధనాత్మక వైఖరులను అభివృద్ధిపరుచును
- విద్యార్థులలో సాధనా స్థాయిని, హాజరుశాతాన్ని పెంచును
- సమస్యా పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధిపరచును

**సహకార, భాగస్వామ్య అభ్యసనానికి పోలికలు:**

- బాధ్యతలు పంచుకొనే దిశగా సాగును
- సామూహిక క్రియ ద్వారా అభ్యసనం జరుగును
- జట్టులో పాల్గొనడం వలన ఉన్నత ఆలోచన నైపుణ్యాలు అభివృద్ధి చెందును
- అబ్యాసకుడు చురుకైనవాడు
- ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య బాధ్యతలు పంచబడును

**బేధాలు:**

| సహకార అభ్యసనం | భాగస్వామ్య అభ్యసనము |
|---|---|
| - లక్ష్యాన్ని సాధించడానికి ఇది ఒక పరస్పర చర్య | - వ్యక్తిగత జీవన విధానానికి ఇది ఒక వేదాంతం |
| - సాంఘిక నైపుణ్యాభివృద్ధిలో ఇది ఒక బోధనా లక్ష్యం | - సాంఘిక నైపుణ్యాలను పరీక్షిస్తుంది |
| - వ్యక్తిగత, సాంఘిక, సంజ్ఞనాత్మక నైపుణ్యా అభివృద్ధిని బలపరుస్తుంది | - జ్ఞాన నిర్మాణాన్ని స్వయం ప్రతిపత్తిని బలపరుస్తుంది |
| - ప్రతి అభ్యాసకుడు లక్ష్యాసాధనతో చేసే కృత్యాలు వ్యవస్తీకరించబడినవి | - విద్యార్థులే కృత్యాలను నిర్మించుకొని చర్చింపబడును |
| - ఉపాధ్యాయుని పాత్ర కేంద్రీకరింపబడి ఉండును | - విద్యార్థులపై ఉపాధ్యాయుని ప్రభావం ఉండును |
| - ఉపాధ్యాయుడు దగ్గరుండి పర్యవేక్షించును | - దగ్గరుండి పర్యవేక్షించడం |
| - ఉపాధ్యాయుని పాత్ర చురుకైనది | - ఉపాధ్యాయుడు సౌకర్యకర్త మాత్రమే |
| - పునరావృతం కాని కృత్యాలను ఎన్నుకోవడం జరుగును | - వస్తు రూపకల్పన దిశగా అభ్యసనం కొనసాగును. |
| - విద్యార్థులు కృత్యము చివర నియోజనాలను మూల్యాంకకనం కొరకు సమర్పిస్తారు. | - పునరావృతం అయ్యే కృత్యాలను నిర్వహించబడును |
| | - ముసాయిదా (చిత్తుప్రతిని) తదుపరి పూర్తి చేయడానికి ఆపి ఉంచుదురు |

### 4.5.7. విభిన్న అభ్యసన వనరుల పాత్ర: (Divorce Resources for Learning)

పిల్లల అభ్యసనలో పాఠశాల ఉపాధ్యాయుడు తరగతిగది, నల్లబల్ల, తదితర అంశాలే కాకుండా విభిన్న వనరులు కూడా ప్రముఖపాత్ర వహిస్తాయి. నేటి విద్యా విధానాలలో వీటి పాత్ర ఎంతో అవసరం. వివిధ వనరులను ఎంతగా వినియోగించుకుంటే అభ్యసనం అంత బాగా జరిగి విద్యార్థి పురోభివృద్ధి చెందును. వివిధ వనరులు

**స్వీయ వనరులు:** ప్రజ్ఞ, స్మృతి, ఆలోచన, మూర్తిమత్వం

**గృహ వనరులు :** తల్లిదండ్రులు, విద్య, నివాసప్రాంతము, సాంఘికస్థాయి, ఆర్థిక స్థాయి

**సాంఘిక వనరులు:** ప్రకృతి, ఆర్థిక NGO's, G.O's సాంఘిక పరిపాలన

**సాంకేతిక వనరులు :** సినిమా , వీడియో, ఇంటర్నెట్, కంప్యూటర్, ఓ. హెచ్. పి., స్మార్ట్ క్లాస్

**మాస్ మీడియా :** టీవి, రేడియే, సెల్‌ఫోన్స్, న్యూస్ పేపర్స్, బుక్స్, మ్యాగ్‌జైన్స్ మొ॥నవి

పై వనరులు వినియోగించడం వలన విద్యార్థి అభ్యసనం, అభ్యసన సామర్థ్యం మెరుగుపడి మేటి విద్యార్థిగా రాణించగలడు.

### 4.5.8. జట్టు పని (Group work)

సాంప్రదాయ బోధనాభ్యసన ప్రక్రియలో ఉపాధ్యాయుని పాత్ర ఎక్కువగాను, పిల్లల భాగస్వామ్యం తక్కువగాను ఉంటుంది. ఇతర విద్యార్థుల నుండి సమాచారం గ్రహించడం తక్కువగా వుంటుంది. సాంప్రదాయక పద్ధతిలో పిల్లల్ని తరగతి గదిలో కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు ఏకపక్షంగా బోధించడం సరికాదు. పిల్లలకి అందుబాటులో ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయునికి అందుబాటులో పిల్లలు వుండేటట్లు చేసి పిల్లలు చేస్తున్న పనిని ఉపాధ్యాయుడు పరిశీలిస్తూ వుండాలి. అలాగే పిల్లలు చేత జట్టు పని చేయించాలి. దీనివల్ల పిల్లలంతా సమైక్యంగా

- బోధనాభ్యసన ప్రక్రియల్లో చురుకుగా పాల్గొంటారు.
- అభ్యసన ప్రక్రియలు కల్పించినపుడు సందర్భోచితంగా పిల్లలు వ్యక్తిగతంగాను, జట్టులోను మరియు పూర్తి తరగతి పనిలోను పాల్గొంటారు. చిన్న జట్టులు ద్వారా అభ్యసన ప్రక్రియలు నిర్వహించుట చాలా అవసరం.
- జట్టు పని వల్ల పిల్లలు ఒకరితో ఒకరు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను పంచుకొంటారు.
- అభ్యసనంలో చురుగ్గా పాల్గొని సమాచార నైపుణ్యాలను అభివృద్ధి పరచుకొంటారు.
- నాయకత్వ లక్షణాలు అలవడుతాయి.
- ఆలోచనా సామర్థ్యం పెంచుకొంటారు
- అభ్యసనం ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుగును.
- మంచి ఫలితాలను ఇస్తుంది.

కనుక అభ్యసనంలో జట్టు పని ద్వారా మంచి ఫలితాలను సాధించాలంటే పిల్లలను జట్లుగా విభజించాలంటే ఎపుడు ఒకేరకంగా విభజించకూడదు. జట్టులో అన్ని స్థాయిల పిల్లలు వుండేటట్లు చూడాలి. ఆహ్లాదకర వాతావరణంలో స్వేచ్ఛగా పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పేలా ప్రోత్సహించాలి. జట్టుపనిలో పిల్లల స్వయం అభ్యసనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. మంచి ఫలితాలు సాధించి ప్రోత్సహించాలి.

### 4.5.9 తరగతి గది చర్చ (Classroom Discussion)

సాధారణంగా పాఠశాలల్లో ఎక్కువ భాగం సాంప్రదాయకంగా ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని పాఠ్యాంశాలను బోధిస్తారు. ఇక్కడ ఉపాధ్యాయుని పాత్ర ఎక్కువ, విద్యార్థుల పాత్ర చాలా తక్కువ. దీనివలన పిల్లలకు

అభ్యసనం దూరంగా వుంటుంది. దీనిని తగ్గించాలంటే బోధనాంశాలపై తరగతి గదిలో చర్చ జరగాలి. పాఠ్యప్రణాళిక, విద్యార్థుల అవసరాలు, సామాజిక అంశాలపైన తరగతి గదిలో వాటిని చర్చకు పెట్టాలి. విద్యార్థులందరూ ఇలాంటి చర్చల్లో పాల్గొనేటట్లు చూడడం వలన వారందరూ స్వేచ్ఛగా వారి భావాలను వ్యక్తపరచి భావాలను పంచుకుంటారు. చర్చ అనంతరం చేసిన తీర్మానాలు తీసుకొన్న నిర్ణయాలు విద్యార్థులలో ఆశించిన మార్పులు తీసుకొస్తాయి.

**తరగతి గదుల్లో చర్చలు నిర్వహించడం వలన విద్యార్థులలో ...**

- ఆత్మవిశ్వాసం పెరుగును
- భావ ప్రసార నైపుణ్యాలు అభివృద్ధి చెందును
- సామాజిక స్పృహ ఏర్పడును.
- ఆత్మ పరిశీలన చేసుకొంటారు
- తన పాత్రను అంచనా వేసుకుంటారు
- ప్రోత్సహించబడుతారు
- సర్దుబాటుకు అలవాటుపడుతారు.
- మూర్తిమత్వ లక్షణాలను పెంపొందించుకొంటారు.

అభ్యసనములో తరగతి చర్చ మంచి ఫలితాలతో సాధించి పిల్లల్లో చురుకుదనాన్ని కల్గించి బోధన అభ్యసన ప్రక్రియ కొనసాగును.

### 4.5.10 అభ్యాసకుని స్వయం ప్రతిపత్తి (Learner's Atonomy)

బోధనా అభ్యసన ప్రక్రియల్లో అభ్యాసకునికి స్వేచ్ఛ కల్పిస్తే, అతను చురుగ్గా అభ్యసనములో పాల్గొని మంచి ఫలితాలను సాధిస్తాడు. భయం, ఒత్తిడి లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉన్న చోటే పిల్లల్లో వికాసం బాగా పెరుగుతుంది. పిల్లల అభిప్రాయాలకు అభిరుచులకు అనుగుణంగా తగిన స్థానం కల్పించినపుడు మాత్రమే వారు ఆనందంగా, ఆహ్లాదంగా అభ్యసనంలో పాల్గొని బాగా నేర్చుకొంటారు. శిశుకేంద్రిత బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించి బోధనలో పిల్లలు చురుగకుగా పాల్గొనేలా చేయాలి. తరగతి గదిలో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించినపుడే అభ్యాసకుని స్వయం ప్రతిపత్తికి అవకాశం కలిగి అభ్యసనం కొనసాగును.

**అభ్యాసకుని స్వయం ప్రతిపత్తికి మార్గాలు**

- తరగతి గదిలో ఉపాధ్యాయుడు పిల్లలకి స్వేచ్ఛనిచ్చి తమ సందేహాలను అడిగి నివృతం చేసేలాగా అవకాశం కల్పించాలి.
- అభ్యాసకులను ప్రశ్నించేలా ప్రోత్సహించాలి.
- స్థాయికి తగిన బోధన అభ్యసన ప్రక్రియలు చేపట్టాలి.
- కృత్యాలు అనేవి ఉత్సాహం, ప్రేరణ, ఆసక్తిని కలిగించేవిగా వుండాలి.
- ఉపాధ్యాయుడు మార్గదర్శిగా, సలహాదారుడుగా, సౌలభ్యకర్తగా, స్నేహితుడిగా వ్యవహరించాలి.
- పరస్పరం తోటి వారితో నేర్చుకొనేలా చూడాలి.
- ఒత్తిడి, దండన లేని వాతావరణాన్ని కల్పించాలి.
- ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించేలా చూడాలి.

పిల్లలకి స్వయంప్రతిపత్తి ని కల్పిస్తే అనుకూల వైఖరిని అభివృద్ధి చెంది తన మానసిక వికాసం జరుగును. తద్వారా ప్రజ్ఞ, మూర్తిమత్వం వికసింపబడును. కనుక అభ్యసనంలో దీనిపాత్ర ఎంతైనా వుందని చెప్పవచ్చును.

**4.5.11 సౌలభ్యకర్తగా ఉపాధ్యాయుడు (Role of Teacher as a Facilitator)**

ప్రాథమికంగా బోధనాభ్యసన ప్రక్రియలో పాఠశాల, ఉపాధ్యాయుడు, నల్లబల్ల మొదలగు అంశాలు అభ్యసనానికి దోహం చేస్తాయి. ఆధునిక విద్యారంగంలో పిల్లల భాగస్వామ్యంతో కూడిన బోధనాభ్యసన సందర్భాలను కల్పించాలి. అభ్యసనం బాగా జరగాలంటే ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుడిగానే కాక ఒక స్నేహితుడిలాగా, సౌలభ్యకర్తగా సామర్థ్యాన్ని పెంచడానికి పాటుపడాలి. లేదంటే పిల్లలకు, ఉపాధ్యాయునికి మధ్య దూరం పెరిగి అభ్యసనం ఆశించినంత మేర జరగదు. కనుక ఉపాధ్యాయుడే అన్నీ తానై చేయకుండా విద్యార్థులకు కావలసిన అభ్యసన వాతావరణాన్ని, ఉపకరణాలను కలుగజేయాలి.

**4.5.12. సౌలభ్యకర్తగా ఉపాధ్యాయుడికి ఉండవలసిన లక్షణాలు**

- సఫలమైన శ్రవణ సామర్థ్యం కలిగివుండడం
- నిష్కళంకమైన స్వభావము
- అవగాహన శక్తి కలిగి వుండడం
- గౌరవం కలిగి వుండడం
- ప్రజ్ఞవంతుడై వుండడం
- వృత్యంతర ప్రసార నైపుణ్యాలను కల్గి వుండడం
- పిల్లలను ప్రేరేపించే సామర్థ్యం కలిగి వుండడం
- సాంకేతిక పరిజ్ఞానం కలిగి వుండడం
- నూతనంగా / ఆధునిక బోధనా పద్ధతులను అవలంభించి స్మార్ట్ తరగతి నిర్వహణ
- అభ్యసనం (e-Learning) సాంఘిక అనుసంధానం (Social Networking)

మొదలగు అంశాలను తరగతి గదిలో ప్రవేశపెట్టి విద్యార్థులలో అభ్యసనం జరిగేటట్లు వ్యవహరించాలి.

## 4.6 అభ్యసన వైకల్యాలు (Learning Disabillities)

వ్యక్తుల మధ్య వైయక్తిక భేదాలు ఉంటాయని మనకు తెలుసు. పిల్లలు అభ్యాసన విషయములోను ఇలాంటి భేదాలు కనిపిస్తాయి. అభ్యసనంలో ముఖ్యంగా చదవడంలో, వ్రాయడంలో, అవగాహన చేసుకోవడంలో చిన్ని చిన్ని సమస్యలు సాధించడంలో ఒక్కొక్కరు ఒక్కొక్కరకమైన పద్ధతిని పాటిస్తుంటారు. కొంత మంది పిల్లలలో ఈ విషయాలలో వైపరిత్యాలు ఉంటాయి. ఈ వైపరిత్యాలే అభ్యసనా వైకల్యానికి దారితీస్తాయి. కొంత మంది కొన్ని రకాల ప్రత్యేక సమస్యలను కలిగి వుంటారు. ఇవి వారికి అభ్యసన పట్ల ప్రయాసను కలిగిస్తుందే కాని అయిష్టతను కలగనీయదు. వీరిలో శారీరక, మానసిక, ఇంద్రియపరమైన లోపాలు లేనప్పటికీ అభ్యసనరీతిలో మాత్రం వైకల్యాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితులలో ప్రతి ఉపాధ్యాయుడికి అభ్యసనా వైకల్యము అంటే ఏమిటి? దానికి దారితీసే కారణాలు, కారకాలు ఏవి? పిల్లలలో అభ్యసన వైకల్యాలు ఏ రీతిలో ఉంటాయి? వంటి విషయాల పట్ల అవగాహన ఎంతైనా అవసరము.

చదవడం(పఠనము), వ్రాయడం(లేఖనము), అంకగణిత ప్రక్రియలు చేయడం, భావవ్యక్తీకరణ చేయడములో ఒకటి లేదా ఎక్కువ అంశాలలో ఇబ్బంది కలవారిని 'అభ్యసనా సామర్థ్యం లోపించిన పిల్లలు' అంటారు. 1962 సం॥లో 'శామ్యూల్ కిర్క్' (Samuel Kirk) అనుశాస్త్రవేత్త 'అభ్యసన వైకల్యము' అన్న పదాన్ని మొట్ట మొదట ఉపయోగించాడు. తన గ్రంథం Exceptional Children లో ఇలాంటి సమస్యలున్న పిల్లలను Children with Learning Difficulties or Children with Specific Learning Needs అని పేర్కొన్నాడు.

### నిర్వచవాలు (Definitions)

ఎవరి అభ్యసన ప్రక్రియలో ప్రత్యేక సమస్యలుంటాయో, ఎవరి అవధాన ప్రక్రియలో సమస్యలుంటాయో వారినే అభ్యసన లోపాలుగల పిల్లలు అంటారు(Sensorydysfunctions).

బుద్ధి మాంద్యత, ఇంద్రియ వంచనం లేదా బోధనా సంబంధిత కారకాలు లేదా ప్రవర్తనా సమస్యలవల్ల కాకుండా కేంద్ర నాడీ వ్యవస్థ పని తీరులోని లోపము వల్ల చదవడం, వ్రాయడం, భాష, భాషణం, గణిత సంబంధిత ప్రక్రియలలో అవ్యవస్థ వున్న పిల్లలనే 'అభ్యసన వైకల్యముగల పిల్లలు' అంటారని కిర్క్ నిర్వచించాడు.

పిల్లలలో వారికున్న అసలు సామర్థ్యాలకు మరియు అంశాల వల్ల అంటే

- కేంద్రనాడి వ్యవస్థ పనితీరులో లోపమువల్ల
- జన్యుపరమైన కారకాల వల్ల
- నాడీ వ్యవస్థ పరిపక్వత, విలంభిత చర్యవల్ల
- జీవ ప్రక్రియ సమతుల్యత దెబ్బతినడం వల్ల అభ్యాసన వైకల్యము సంభవిస్తుందని తెలుస్తున్నది.

**అభ్యసనా వైకల్యముగల పిల్లల స్వభావము/లక్షణాలు**(Characteristies of Learning Disabled)

- తక్కువ వినికిడి శక్తి మరియు లోపము ఉండవచ్చు లేదా
- నరాలకు సంబంధించిన దృష్టిలోపాలు ఉండవచ్చు లేదా
- మాటలు, పదాలు తిరగదిప్పి చదవడం లేదా వ్రాయడం చేయవచ్చు.

- రేఖాపటాలను గీయడంలో తక్కువపు:నశ్చరణ ఉండవచ్చు.
- చేతివేళ్ళపై పటుత్వము తక్కువ అందువల్ల వ్రాత సరిగా ఉండకపోవచ్చు.
- అపరిపక్వ ఉచ్చారణ
- భాషా అభ్యసనలో లోపము
- గణిత సంబంధిత లోపాలు
- ప్రతిస్పందనలు సరిగా లేకపోవడం
- నిష్పాదన సరిగా చూపక పోవడం కావచ్చు.

పై పేర్కొన్న లక్షణం ఒకటన్నా ఉండవచ్చు లేదా రెండుకు మించి ఉండవచ్చు.

**అభ్యసన వైకల్యానికి కారణాలు** (Causes for Learning Disability)

అభ్యసన వైకల్యానికి దారితీసే వివిధ కారణాలను ప్రధానంగా క్రింది విదముగా వర్గీకరించవచ్చు. అవి:

**1. అంతర్గత కారణాలు:–** కేంద్ర నాడీ వ్యవస్థ నిర్మాణము లేదా పనితీరులో అవ్యవస్థ ఏర్పడడం దీన్నే Minimal Brain Dysfunction అంటారు. దీని వల్లనే అభ్యసన వైకల్యము సంభవిస్తుంది. అలాగే రక్తములో అతి తక్కువ చక్కెరస్థాయి Hypoglisemia అభ్యసన సమస్యలకు దారితీస్తుంది. అంతే కాకుండా నాడీ వ్యవస్థకు హాని కలిగించే మరే ఇతర కారణాలైనా అభ్యసన సమస్యలను కల్గించవచ్చు.

**2. జన్యుపరమైన కారణాలు:–** పిల్లలలో అభ్యసన సమస్యలు అతిక్రియాశీలత (Hyperactivity) అను ప్రవర్తన జన్యు పరంగా కూడా ఏర్పడవచ్చు. అలాగే "Turner's Syndrom" అను జన్యుపరమైన లోపమువల్ల కూడా అభ్యసనా వైకల్యాలు ఉంటాయి.

**3. పరిసరాల ప్రభావ కారణాలు:–** శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఆమె వాడిన మందులు, మత్తు పదార్థాలు లేదా క్లిష్టతరమైన ప్రసవము, ప్రసవ సమయములో ప్రాణవాయువు సరిగా అందకపోవడం, నెలలు నిండకముందే జన్మించిన శిశువుకు సరియైన సంరక్షణ లేకపోవడం శిశువు వికాసమునకు సరియైన ఉద్దీపనలు లేకపోవడం, బోధనా వైఫల్యాలు వంటి పరిసరాలు పిల్లల అభ్యసన వైకాల్యాలకు కారణము కావచ్చు.

### 4.6.1 అభ్యసనా వైకల్యము – రకాలు (Types of Learning Disabillites)

పిల్లలలో కనిపించే అభ్యసననా వైకల్యాలను వారు ఎదుర్కొనే ప్రాథమిక సమస్యలను బట్టి వివిధ రకాలుగా పేర్కొనవచ్చు.

**1. భాషణములో వైకల్యాలు:–** పిల్లలు వ్యక్త పరచిన పదాలను అర్థం చేసుకోవడములోనూ, తిరిగి వాటిని వ్యక్త పరచడములోను ఏర్పడు లోపాలు. దీనిలో Dysphasia, Aphasia అను రెండు ప్రధాన రకాలు వున్నాయి.

Dysphasia వైకల్యముగల పిల్లలలో వ్యక్త పరచిన పదాలను అర్థముచేసుకోవడం, తిరిగి వ్యక్త పరచడములో పాక్షిక అసామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

Aphasia వైకల్యముగల పిల్లలలో వ్యక్త పరచిన పదాలను అర్థము చేసుకోవడంలో, తిరిగి వ్యక్త పరచడములోను అశక్తులు.

**2. పఠనములో వైకల్యాలు:-** పిల్లలు చదవడములో రెండు రకాల వైకల్యాలు ఏర్పడతాయి.

Dislexia చదవడంలోను, చదివిన దానిని గ్రహించడములోను, పదాలను సరిగా చదవలేకపోవడములోను సమస్యలను ఎదుర్కొనుట.

Alexia ముద్రణ రూపములో వున్న భాషను చదవడంలో ఏర్పడు లోపము.

**3. లేఖనములో వైకల్యాలు:-** చేతివ్రాతకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొనుట

Disgrapia దృష్టి మరియు చలన సమన్వయలోపమున్నవాళ్ళుగాని, చూచి వ్రాయడములోగాని సమస్యలు కలిగి ఉండడం

**4. గణిత వైకల్యాలు:-** గణిత సంబంధమైన అంశాలు, సంఖ్యా పరమైన జ్ఞానాన్ని పొందడంలోను, సంఖ్యలను చదవడం, వ్యక్తపరచడంలలో వైకల్యము కలిగి వుండడమే Dyscalculia అంటారు.

**అభ్యసన వైకల్యం గల పిల్లలను గుర్తించడం:** (Identification of Learning Disabled Children)

సాధారణముగా అభ్యసన లోపాలుగల పిల్లలను పాఠశాలలో చేరిన తర్వాత సులువుగా గుర్తించవచ్చు. పిల్లలలో ఈ అభ్యసన వైకల్యాలను గుర్తించడానికి కిర్క్ మూడు ముఖ్యమైన పద్ధతులను వివరించాడు. అవి

- వైద్య పరీక్షలు
- కుటుంబ, పాఠశాల మరియు పరిసరాల అధ్యయనము
- ప్రవర్తనను అంచనా వేయడం.

ఈ పద్ధతుల ద్వారా అభ్యాసన వైకల్యాలను అంచనా వేయడం వల్ల పిల్లల బలహీనతలు బాగా తెలుస్తాయి. పిల్లలు ఏఏ అంశాలలో వైకల్యమును కలిగి ఉన్నారో సులువుగా తెలుస్తుంది. అప్పుడు వారికి ఎలాంటి సహాయము అందించాలో ఎలాంటి విద్యాకార్యక్రమాలు ఏర్పాటు తెలుసుకోవచ్చు.

### 4.6.2 అభ్యసన వైకల్యంను తొలిదశలోనే నివారించుట (Importance of Early Intervention)

- అభ్యసన అసమర్థత కలవారికి అవసరమైన వైద్య సహాయము మరియు మార్గదర్శకత్వము ఇవ్వవచ్చు.
- పాఠశాల పట్ల వ్యతిరేకత ఏర్పడకుండా వారు బడిలో ఉండేటట్లు చేయవచ్చు.
- వైకల్యము స్థాయిని తెలుసుకోవడం వల్ల మంచి బోధనాభ్యసన పద్దతులు ఉపయోగించి వారిని సాధారణ పిల్లలు అభ్యసించేటట్లు చేయవచ్చు.

**అభ్యసనావైకల్యము - వ్యక్తిగత విద్యా కార్యక్రమం** (Individualized Education Planning IEP)

అభ్యసన వైకల్యంగల పిల్లలకు మూడు రకాలైన విద్యా సదుపాయాలను ఏర్పరచవచ్చు.

1. ప్రత్యేక విద్య:- అభ్యసన వైకల్యం గల పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటుచేసి వారికి ప్రత్యేక విద్యను అందించుట. వీరికి వైయక్తిక బోధనతో పాటు ప్రత్యేక బోధనాపద్ధతులు ద్వారా నేర్పాలి. సాధారణ విద్యనే ప్రత్యేకముగా బోధన చేయాలి.

2. పాక్షిక వేర్పాటు విద్య:- సాధారణంగా పాఠశాలలోనే ప్రత్యేక ఉపాధ్యాయులద్వారా తరగతులు నిర్వహించడం. ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణను పొంది సాధారణ ఉపాధ్యాయులతో పాటే బోధన చేస్తారు. ఇక్కడ పాఠాలు మాత్రమే విడిగా బోధిస్తారు మిగిలిన పాఠశాల కార్యక్రమాలలో వీరు పిల్లలందరితో కలసి జరుపుకుంటారు.

3. విలీన/సహిత విద్య:- తక్కువ స్థాయిలో వున్న అభ్యసన వైకల్యముగల పిల్లలను సాధారణ పిల్లలతో పాటుగానే సాధారణ పాఠశాలలలోనే వుంచి బోధన చేస్తారు. సహిత పాఠశాలలుగా గుర్తించిన సాధారణ పాఠశాలలో రిసోర్స్ టీచర్స్ ద్వారా వీరికి ప్రత్యేక విద్యను అందిస్తారు.

### 4.6.3 భేదాత్మక అభ్యసనము (Differentiated Learning)

పిల్లలలో కనిపించే సామర్థ్యాలకు అనుగుణంగా, ఉపాధ్యాయులు వారికి అందుబాటులో వున్న వనరులను, బోధన సామాగ్రిని దృష్టిలో ఉంచుకొని బోధనా చేయడమే 'భేదాత్మక అభ్యసము' అంటారు. అభ్యసన వైకల్యము, విద్యలో వెనుకబాటు తనము గల పిల్లలలో వారిలోని అసమర్థత ఆధారముగా బోధనాభ్యసన సామాగ్రి, కృత్యాలు, పాఠ్యాంశాలు మార్చవలసి ఉంటుంది. ఉదాహరణకు - పఠన సమస్యలుగల పిల్లలకు బొమ్మల పుస్తకాలు, అక్షరమాల చార్టులు, దృశ్య బోధనా పరికరాలు ఉపయోగించాలి. అలాగే లేఖన సమస్యలుగల పిల్లలకు వార్తాపత్రికలను, చిత్రాలను కత్తిరించి అతికించడం, యాక్షన్ కార్డులు ఉపయోగించడం, చూస్తున్న కార్డులో ఏమున్నదో చేసి చూపమనడం, వస్తువులను వర్గీకరించి చెప్పమనడంవంటివి చేయించాలి.

### 4.6.4 ప్రత్యేక విద్య (Special Education)

ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు అందించే విద్యనే ప్రత్యేక విద్య అంటారు.

ప్రత్యేక అవసరాలుగల పిల్లల విద్యా అవసరాలను తీరుస్తూ, వారి మూర్తిమత్వ వికాసానికి, సాంఘికీకరణకు తద్వారా తగిన పునరావాసమును కల్పించడానికి దోహదపడే శాస్త్రమే ప్రత్యేకవిద్య

వ్యక్తి యొక్క శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక వికాసాలకు మూల బిందువు 'విద్య'. సమగ్ర వికాసానికి, విద్యకు అవినాభావసంబంధమున్నది. కనుకనే మన రాజ్యాంగవేత్తలు 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలందరికీ సార్వత్రిక నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను ఆర్టికల్ 45 ద్వారా రాజ్యాంగములో పొందుపరచారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం ఇటువంటి పిల్లల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది.

### ప్రత్యేక విద్య - స్వభావము & పరిధి (Nature and Scope of Special Education)

ప్రత్యేక విద్యను సాధారణ పాఠశాలలకు వెలుపల నిర్వహిస్తారు. సాధారణ పాఠశాలలో అవసరాలు తీరని పిల్లలకు మాత్రమే ఈ విద్యను ఏర్పాటుచేస్తారు. కొన్ని చోట్ల సాధారణ పాఠశాలలలోనే ప్రత్యేక విద్యను నిర్వహిస్తారు. ప్రత్యేక విద్యలో విద్యా విధానమే శిశు కేంద్రితముగా ఉంటుంది. పిల్లలు ఉపాధ్యాయుల సహాయముతో తమ విద్యా కార్యక్రమాలను నిర్ణయించుకొంటారు. ప్రత్యేక విద్యలో ప్రతి విద్యార్థి తన స్థాయి గౌవరమును పొందుతారు. బోధనాభ్యసన కృత్యాలు, పద్ధతులు, సామాగ్రి సహజముగా ఉండి పిల్లల అవసరాల మేరకు ఉంటాయి. ప్రత్యేక అవసరాలుగల పిల్లల తల్లిదండ్రులను ప్రాథమిక ఉపాధ్యాయులుగా పరిగణించి వారిని కార్యక్రమాలలో చేరుస్తారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాల అంచనా, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకనము మొదలగునవి దీని పరిధిలోకి వస్తాయి. అవి.

- వ్యక్తిగత విద్యావసరాలను తీర్చడం
- వ్యక్తిగత బోధనా పద్ధతులు కృత్యాలు, మూల్యాంకనం చేయడం

- మనోవైజ్ఞానిక పద్ధతులతో బోధన చేపట్టడం
- ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక శిక్షణ ఏర్పరచడం
- పునరావాసము కల్పించడం.

**ప్రత్యేక అవసరాలు గల పిల్లలు (Children with Special Needs)**

ఒక తరగతిలోని పిల్లలందరు ఒకే వయస్సుతో పాటు దాదాపుగా ఒకేరకమైన జ్ఞానము, అవగాహనా శక్తిని కలిగి వుంటారని వారి కోసము ఒకే రకమైన పాఠ్య ప్రణాళికలను తయారుచేస్తారు. అయితే దీనికి కొంత భిన్నముగా కొందరు పిల్లలు త్వరగా అభ్యసనము చేసే వారిగా ఉంటే కొందరు నెమ్మదిగా అభ్యసిస్తుంటారు. అలాగే శారీరక లేక మానసిక వైకల్యముతో బాధపడే వారు కూడా ఉంటారు. వీరందరికి ఒకేలా బోధనా చేస్తే అది అందరికి ఒకేలా చేరదు. అందువల్లనే వారివారి అవసరాలను లేదా స్థాయిలను బట్టి వారికి విద్య నేర్పాల్సి ఉంటుంది. ఇలా వ్యక్తిగతముగా విద్యావసరాలను గలిగిన వారినే ప్రత్యేక అవసరాలుగల పిల్లలు అంటారు. సాధారణ జనాభాలో సుమారు 10 – 15 శాతము వరకు ప్రత్యేక అవసరాలుగల పిల్లలుంటారు.

వివిధ రకాల శారీరక, మానసిక సవాళ్ళను ఎదుర్కొనేవారు, ప్రతిభావంతులు, మందకొడిగా అభ్యసించే వారు మొదలగు పిల్లలకు సాధారణ తరగతుల కోసము తయారు చేసిన విద్యాప్రమాణాలు సరిపోవు. వీరికోసం ప్రత్యేక విద్యా కార్యక్రమాలను తయారుచేయాల్సి ఉంటుంది.

**రకాలు:–** శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ లక్షణాలలో భిన్నత్వము ఉన్న పిల్లలను మనము ప్రత్యేక అవసరాలుగల పిల్లలుగా పేర్కొంటాము. ఇటువంటి పిల్లల వర్గీకరణ గురించి తెలిసినపుడే ఉపాధ్యాయులు ఆ పిల్లల అవసరాలకు తగ్గట్టు బోధన చేయగలరు. ప్రొఫెసర్ డన్ అనే శాస్త్రవేత్త ప్రత్యేక అవసరాలుగల పిల్లలను 12 రకాలుగా వర్గీకరించాడు. అవి: 1. ప్రతిభావంతమైన ప్లిలలు 2. బోధించగల మానసిక బుద్ధిమాంద్యత గలవారు. 3. తర్ఫీదు ఇవ్వగల బుద్ధిమాంద్యత గలవారు. 4. సామాజిక విషమయోజనం కలవారు. 5. భావోద్రేకము లోపించినవారు. 6. భాషణ లోపం కలవారు. 7. చెవిటివారు. 8. కొద్దిపాటి వినికిడిలోపమున్నవారు, 9. అంధులు. 10. కొద్దిపాటి దృష్టి లోపముకలవారు. 11. అంగవైకలమున్నవారు, 12. దీర్ఘకాలిక అనారోగ్యముకలవారు.

## 4.7 స్నేహపూర్వక, సమ్మిళిత అభ్యసన వాతావరణం కల్పించడం (Creating Inclusive learned friendly Environment)

సమ్మిళిత విద్యకు సంబంధించిన అంశాలు మన రాజ్యాంగంలో పొందుపరచినప్పటికీ ఇంకా చాలా మంది పిల్లలు వారి ప్రాథమిక హక్కు అయిన ఎలిమెంటరీ విద్యను సాధించలేకపోతున్నారు. ఈ విషయమై యునైటెడ్ నేషన్స్ మిలీనియం డిక్లరేషన్ – 2000 మిలీనియం అభివృద్ధి గమ్యాలపై సంతకం చేసిన దేశాల్లో భారతదేశం కూడా ఉంది. ఇందులోని ప్రధాన అంశం 2015 నాటికి సార్వత్రిక విద్యను సాధించడం. అయితే ఈ గమ్యం చేరడానికి ఇప్పటికే మనదేశంలో "సర్వశిక్షా అభియాన్", "విద్యాహక్కు చట్టం – 2009" అమలు ద్వారా సార్వత్రిక ఎలిమెంటరీ విద్య సాధన దిశగా కృషి జరుగుతోంది. రాష్ట్రంలో పిల్లల నమోదు(Enrolment) విషయంలో 100 శాతం లక్ష్యం ప్రతి సంవత్సరం సాధించినప్పటికీ ఒక స్థాయి (ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత) పూర్తి అయిన తరువాత నిలకడ (retention)ను పరిశీలిస్తే 100 శాతం సాధించడం లేదు. ఇలాంటి విషయమై మన రాష్ట్ర విద్యా గణాంకాలను పరిశీలించినట్లయితే 10 సంవత్సరాల క్రితం ఒకటవ తరగతిలో చేరిన ప్రతి 100 మంది విద్యార్థులలో కేవలం 62 మంది మాత్రమే 10వ తరగతికి చేరుకున్నారు. అదే షెడ్యూల్డు కులాలకు చెందిన వారు 50 మంది, షెడ్యూల్డు

తెగలకు చెందినవారు కేవలం 32 మంది మాత్రమే 10వ తరగతికి చేరుకున్నట్లు గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. అంతేకాకుండా ఎలిమెంటరీ స్థాయిలో చేపట్టిన వివిధ సర్వేల గణాంకాలు విద్యార్థులు ఆశించిన కనీస స్థాయిలకు చేరుకోలేకపోతున్నారనీ, అలాగే గుణాత్మక విద్యను అందించడంలో పాఠశాలలు విఫలమవుతున్నాయనీ సూచిస్తున్నాయి.

### 4.7.1. ప్రాధాన్యత (Importance)

సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించుటకై ప్రభుత్వం అన్ని వసతులను కల్పించి, విద్యార్థులను పాఠశాలల్లో 100 శాతం నమోదు చేయించినప్పటికిని, పైన పేర్కొన్న గణాంకాల ద్వారా మనం ఇంతవరకు ఆశించిన స్థాయిలో నమోదును, గుణాత్మక విద్యను పిల్లలందరిలో సాధించలేకపోతున్నాం. వీరికి అనేక కారణాలు ఉన్నప్పటికీ ప్రధానంగా పాఠశాలలో బోధనాభ్యసన ప్రక్రియలు ప్రతి విద్యార్థికీ అర్థవంతమైన రీతిలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగకపోవడంగా పేర్కొనవచ్చు. ప్రతి విద్యార్థిని తరగతి గదిలో కేవలం శారీరకంగా ఉపస్థితిలో ఉంచగలుగుతున్నాం. కాని మానసిక ఉపస్థితి కొనసాగేలా చేస్తే నిజమైన "సమ్మిళితం" అవుతుంది. అంటే ప్రతి విద్యార్థికీ ఈ పాఠశాల నాది, ఇది ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉందనీ, అలాగే తరగతి గదిలో జరిగే ప్రక్రియలన్నీ ఆసక్తిదాయకంగా ఉన్నాయనే భావనను కలిగించవలసి ఉంది. అంతేగాకుండా తోటి విద్యార్థులలో సహజీవనం అనివార్యమనీ, అందరిలో ఉన్న శక్తియుక్తులతో తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకొంటూ, ఆచరణాత్మక కృత్యాలతో సహ (Peer), సహకార (Cooperation) అభ్యసనాలతో కూడిన కార్యక్రమాలతో సమాజ నిర్మాణ కార్యక్రమాలను చేపట్టాలన్న తపనను విద్యార్థులలో కలిగించేలా కార్యక్రమాలను చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందు గురించి స్నేహపూర్వక సమ్మిళిత అభ్యసన వాతావరణాన్ని ఉపాధ్యాయుడు పాఠశాలలో ఏర్పరచడం అవశ్యకం.

### 4.7.2 బహుళ వనరుల అవసరం (Need for Multiple Resources)

సమ్మిళిత పాఠశాలలో కేవలం సాధారణ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలే కాకుండా 1) సాంఘికంగా వెనుకబడిన వర్గాల పిల్లలు 2) భాషా సమస్యలు గల పిల్లలు 3) లింగ వివక్షతకు గురవుతున్న పిల్లలు 4) అల్ప సంఖ్యాక వర్గాలు, అణచివేత వంటి వివక్షతకు గురవుతున్న పిల్లలు ఉంటారు. వీరందరికి ఒకే విధమైన వనరుల ద్వారా విద్యను అందించినచో, వారు వారి అవసరాలు, స్థాయిలు తృప్తిచందక పాఠశాలల్లో కొనసాగలేక నిలుపుదల (Drop out)కు లోనయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రతి అభ్యాసకుడు విలక్షణమైన (Unique) వాడని, అతనిలోని వైవిద్య అవసరాలు కలిగించే ఒత్తిడి నుండి స్వేచ్ఛ పొంది, ఎలాంటి అడ్డంకులు లేని అభ్యసనాన్ని కొనససాగించేలా చూడవలసిన బాధ్యత సమ్మిళిత పాఠశాల పైన ఉంది. కాబట్టి స్నేహపూర్వక, విలీన అభ్యసన వాతావరణాన్ని ఏర్పరచడంలో బహుళ వనరులను కల్పించాలి. ఇవి పిల్లల వైవిద్య అవసరాలను తీర్చుటకు దోహదం చేస్తాయి.

- బహుళ వనరుల తరగతి గదిలో విద్యార్థులందరు బోధనాభ్యసన ప్రక్రియలో చురుకుగా పాల్గొనుటను ప్రోత్సహిస్తాయి.
- పిల్లల్లో ఆసక్తిని, ఆలోచనను పెంపొందించి క్రియాత్మక అభ్యసనానికి దారి తీస్తాయి.
- పిల్లలు అంశాల పట్ల చర్చించి, విశ్లేషించి, తగిన పరిష్కారాలను, నిర్ణయాలను చేసి అనుభవపూర్వకంగా అభ్యసించే వాతావరణాన్ని కల్పిస్తాయి.
- ప్రతి అభ్యాసకుడు అందరితో కలిసి పాల్గొనుట వల్ల వారిలో సామూహిక మనస్తత్వాలు (Group mindedness), నాయకత్వ లక్షణాలు అలవడతాయి.

- పిల్లల్లోని అంతర్గత శక్తులను వ్యక్తం చేయుటకు అవకాశం ఇస్తాయి. తద్వారా తగు మార్గదర్శకత్వాన్ని అందించుటకు, ప్రావీణ్యంతో కూడిన వికాసానికి తోడ్పడతాయి.
- బహుళ వనరులు పిల్లలలో అర్థవంతమయ్యే అభ్యసనకు, భాగస్వామ్య అభ్యసనం పొందేటట్లుగ సృజనాత్మకతతో కూడిన తరగతి గది కార్యక్రమాలను రూపొందిస్తాయి.
- సమాజంలోని భౌతిక, మానవ వనరులన్నింటిని పాఠశాల వ్యవస్థలో భాగస్వామ్యం చేసి విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరచడంలోపాటు వారిలో సుస్థిర అభివృద్ధి భావనలను ఏర్పరుస్తాయి.

### 4.7.3 వైవిధ్య భరితమైన అవసరాలకు అనుగుణ్యత చెందే మార్గాలు/దారులు (Ways and Means of adopting to Divers Needs)

2009 విద్యా హక్కు చట్టము ప్రకారము 6 – 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందే హుక్కను కలిగివున్నారు. పాఠశాలలకు రాలేని పిల్లలకు సైతము ఈ హక్కు వర్తిస్తుంధి. వీరందరికి విద్యనందించడం కేవలము ప్రభుత్వానిదే బాధ్యత కాదు. ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరు కూడా సమిష్టిగా బాధ్యత వహించగలిగితే ఇది సులభతరము అవుతుంది. వైకల్యముతో వున్నా పిల్లలకు క్రింది సౌకర్యాలను కల్పించ గలగాలి.

- ఇంటి వద్దనే కాకుండా పాఠశాలలలో కూడా కనీస మౌళికవసతులను ఈ పిల్లలకు కల్పించాలి.
- వైకల్యము తగ్గించడానికి వీలైన పరికరాలను, పాఠశాలలలో వారు కూర్చొనడానికి వసతి, రాంపు సౌకర్యాలు కల్పించాలి.
- వీలైనంత వరకు వారికి ప్రత్యేక సహాయకులను ఏర్పాటు చేయాలి.
- వీరు ప్రత్యేకముగా చదువుకొనడానికి ఒక ప్రత్యేక ఉపాధ్యాయుణ్ణి నియమించాలి.
- గృహ ఆధారిత విద్యను కల్పించి ప్రోత్సహించాలి.
- వైద్య చికిత్స, ఫిజియో థెరఫి, స్పీచ్‌థెరఫి వంటి సౌకర్యాలు ఏర్పటుచేయ్యాలి.
- శారీరక, మానసిక సమస్యలు, వరాల బలహీనతలు కలవారికి వైద్య నిపుణులచే చికిత్స చేయించాలి.

### 4.7.4 నమ్య ప్రణాళిక (Fiexible plan)

విద్యార్థులు మానసికముగా ఉల్లాసంగా ఉన్నపుడే బోధనాభ్యసన ప్రక్రియ సులభతరము అవుతుంది. కాని ప్రస్తుత పరిస్థితులలో పాఠశాలలో గల పిల్లలు యాంత్రికముగా తయారై విద్య అంటే కేవలము మార్కులు లేదా గ్రేడులకు పరిమితమైన ఒక ప్రక్రియగా భావిస్తున్నారు. దీనికోసం వివిధ పుస్తకాలు చదవడం, గైడులు/ప్రశ్నలనిధి నుంచి కాపీ చేసుకోవడం, బట్టీపట్టడం వంటి అర్థరహితమైన అంశాలవైపు వున్నారు. అలాగే ఉపాధ్యాయులు కూడా పిల్లల అభ్యసన అవసరాలను, వారి స్థాయిలను గుర్తించలేక బోధనాంశాలను కృత్యాధారముగా చెప్పలేక సతమతమవుతున్నారు. అందుకని ఎప్పటికప్పుడు పిల్లలకు నాణ్యమైన విద్యానందించాలంటే బోధనాంశాలు, బోధనా ప్రక్రియలు, బోధనా పద్ధతులు, మూల్యాంకనా పద్ధతులు మొదలగు సరళమైన ప్రణాళికలను విద్యార్థుల స్థాయికి అనుకూలంగా మార్చుకోవలసి ఉంటుంది. దీనికనుగుణంగా సరియైన ప్రణాళికలను మార్పుచేసుకోవలసి ఉంటుంది.అందుకే నమ్య ప్రణాళిక (Flexible planning) అవసరమౌతాయి. దీని కోసం క్రింది అంశాలను గుర్తుంచుకోవాలి.

- బోధన సమయములో ఉపాధ్యాయుడు కుర్చీలో కూర్చోనరాదు. పిల్లల మధ్యనే నేలమీద కూర్చొని పిల్లలతో కలసిపోయి బోధనా చేయాలి.
- పిల్లలందరూ చురుకుగా, ఆసక్తికరంగా వుండునట్లుగా అభ్యసన కృత్యాలను తయారుచేసుకోవాలి.
- ప్రతి అంశాన్ని వ్యక్తిగతంగా కాని, సమూహముగా కాని, పూర్తితరగతిగా కాని పిల్లలతో మాట్లాడుతూ, చర్చిస్తూ, అభ్యసన ప్రక్రియలు ఏర్పటుచేయాలి.
- తరగతి బోధనా ప్రక్రియలలో వీలైనంత వరకు ఆకర్షణీయమైన, Low cost or no cost materialను వాడగలగాలి.
- ప్రతి అంశమును బోధించుటకు ముందుగా పిల్లల యొక్క పూర్వ జ్ఞానమును పరిశీలించి దాని ఆధారముగా బోధనా ప్రక్రియను ప్రారంభించాలి.
- గుర్తించబడిన విద్యార్థులకు అనువైన విద్యా కార్యక్రమాలు ఏర్పరచాలి.
- ప్రణాళిక అమలును ఎప్పటికప్పుడు మదింపు చేయడానికి సరియైన మూల్యాంకనా పద్ధతులను గుర్తించాలి.

### 4.7.5 తరగతిగది నిర్వహణ (Classroom management)

నిర్వహణ ఒక సాదారణ ప్రక్రియ. ఒక అంశాన్ని, ఎట్లు, ఏ రకంగా వేటి సహాయముతో విజయవంతముగా చేయవచ్చో ముందుగా ఒక ప్రణాళికను చేసుకోవడమే నిర్వహణ.

అనుకొన్న లక్ష్యాలతో బోధనాభ్యసన ప్రక్రియను విద్యార్థుల సహాయసహకారాలతో ఏ విధంగా, ఎట్లు సమర్థవంతముగా నిర్వహించ వలెనో, విద్యార్థులు ప్రవర్తనను ఎట్లు నియంత్రించవలెనో తెలుపునదే తరగతిగది నిర్వహణ.

ఒక తరగతిలో కార్యక్రమాలన్నీ అనుకున్నవి అనుకొన్నట్టుగా సక్రమంగా జరిపించి మంచి ఫలితాన్ని రాబట్ట గలిగేదే తరగతిగది నిర్వహణ.

ఒక కుటుంబానికి తండ్రి ప్రధాన సుత్రధారిగా వుండి కుటుంబానికి నిర్థిష్టమైన ప్రణాళికతో కార్యక్రమాలు జరిపిస్తుంటాడు. అలాగే తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు కూడా ఒక Role model. అందువల్ల తరగతిగది నిర్వహణ సక్రమంగా వుండాలి అంటే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయడి యొక్క పాత్ర ఎంతైనా వుందని చెప్పవచ్చు. అంటే తరగతి యొక్క వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చి అభ్యసనా ప్రక్రియ సక్రమంగా జరగడానికి తరగతి నిర్వహణా సామర్థ్యం ఎంతైనా అవసరమని చెప్పవచ్చు. సక్రమమైన తరగతిగది నిర్వహణ క్రింది విధముగా సహాయపడుతుంది.

- పిల్లలలు ఒకరితో ఒకరు స్నేహసంబంధాలను పెంచుకొని అభివృద్ధి చెందుతారు.
- శిశు కేంద్రిత విద్యకు ప్రధానమవుతుంది.
- ప్రత్యేక అవసరాలుగల పిల్లలతో వారి అవసరాల మేరకు అబ్యసన జరిగేలా చేస్తుంది. పిల్లలందరు బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొనేలా చేస్తుంది.
- తరగతి గది లోపల గోడల నిండా ఆకర్షణీయమైన బోధనోపకరణాల ఏర్పాటుకు దోహదము చేస్తుంది.

- పిల్లలలో స్వీయ అభ్యసనానుభవాలను కలిగిస్తుంది.
- బోధనాభ్యసన ప్రక్రియలో ఎల్లప్పుడూ ఒక కొత్తదనాన్ని సూచిస్తుంది.
- పిల్లలలో అభ్యాసన పట్ల అనుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుంది.
- చక్కని సమయపాలన, మంచి క్రమశిక్షణల ద్వారాపిల్లలలో మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తుంది.

**4.7.6 సమ్మిళిత పాఠశాలలు** (Inclusive Schools)

విద్య అందరి హక్కు. సమాజములో పిల్లలందరికీ ఉచిత నిర్బంద విద్య (Free and Compulsory Education) అందిచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ అది పాఠశాల స్థాయిలో కార్యరూపములో కనిపించుట లేదు. శారీరక, మానసిక లోపాలుగల పిల్లలను, బలహీన వర్గాల వారిని ఇతర పిల్లలతో సమానంగా కాకుండా సమాజము, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకముగా చూడడం జరుగుచున్నది.

18వ శతాబ్దము వరుకు ప్రత్యేక అవసరాలుగల పిల్లలు, బాలికలు, కొన్ని రకాల అణగారిన వర్గాలు విద్యకు దూరంగానే వున్నారని చెప్పవచ్చు. అయితే మన దేశములో మొట్టమొదట సారిగా వినికిడిలోపము కలవారికి ముంబాయిలో National Institute for Hearing Impaired(NIHH) సంస్థను, దృష్టిలోపము కలవారికి డేహ్రాడూన్లో National Institute for Visually Handicapped(NIVH)సంస్థను, మానసిక వికలాంగులకు హైదరాబాద్‌లో National Institute for Mentally Handicapped (NIMH) సంస్థను, మరియు చెన్నై నగరములో బహుళ వికలత్వము కలవారికి National Institute for Empowerment of Persons with Muliiple Disabilities(NIEPMD) అను సంస్థలను స్థాపించారు.

సమ్మిళిత విద్య ప్రస్తుతము పార్లమెంట్ రిపోర్టులో సూచించబడి వున్నది. విద్యపై నియమించబడిన అనేక కమిటీలు / కమిషన్లు విలీన విద్య అవసరము, దాని ప్రాధాన్యతను బాగా వివరించి చెప్పడం జరిగినది. వికలాంగులకు సాధారణ పిల్లలలాగా చదువురాదనే భావాన్ని తప్పు అని, వీరిని సాధారణ పిల్లలతో కలిపి విద్యాభ్యాసము చేయించవచ్చని నిర్ధారిస్తూ 1974లో వైకల్యముగల పిల్లలకు సమ్మిళిత విద్యాచట్టాన్ని భారత ప్రభుత్వము చేసింది. ఈ సమ్మిళిత పాఠశాలలు ప్రస్తుతము సర్వ శిక్షాభియాన్ ఆధ్వర్యములో నిర్వహించబడుచున్నవి.

**సమ్మిళిత పాఠశాల ఆవశ్యకత :-**

నేటి సమాజంలో సమ్మిళిత విద్య యొక్క ప్రాధాన్యత ఎంతైనా వున్నది. ఈ పాఠశాలల వల్ల -

- అన్ని వర్గాల పిల్లల హక్కులను పరిరక్షించడం.
- ప్రత్యేక అవసరాలుగల పిల్లలలో ఆత్మస్థైర్యాన్ని కలిగించడం.
- అందరు పిల్లల మాదిరిగానే తాము అభ్యసన చెయగలమని నమ్మకము ఏర్పడడం.
- గ్రామీణ స్థాయిలో నివశిస్తున్న వారికి కూడా విద్యా సౌకర్యాలు ఏర్పరచడం.
- చదువులో వెనుకబడిన వారికి చేయూత ఇవ్వడం. వారికి విద్యా సదుపాయాలు కల్పించడం.
- జాతి/మత/కుల/లింగ వివక్షతత లేకుండా అందరికి సమాన విద్యావకాశాలు కల్పించుట.
- బహుళ బాష నేపథ్యము కలవారికి భాషా వివక్షత లేకుండా విద్యా సౌకర్యాలు కల్పించుట.
- పిల్లలలో ఆత్మన్యూనతా భావాలను తొలగించి ఆత్మ విశ్వాసాన్ని కలిగించడం.
- పిల్లలలో సహాయ, సహకార భావాలను ఏర్పరచడం.
- పాఠ్యేతర కార్యక్రమాలలో స్వేచ్ఛగా పాల్గొనునట్లు విద్య అందించడం జరుగుతుంది.

## మూల్యాంకనం

**వ్యాసరూప ప్రశ్నలు** **8 మార్కులు**

1. అభ్యసనాన్ని నిర్వచించి, దాని స్వభావాన్ని తెలపండి?
2. అభ్యసనం – సంసిద్ధత, పరిపక్వత, ప్రేరణలపై ఆధారపడి ఉంటుంది. చర్చించండి?
3. సాంప్రదాయక నిర్బంధనం, కార్యసాధక నిబంధనా సిద్ధాంతాల మధ్య గల తేడాలను తరగతిగది అన్వయాలతో పాటు వివరించండి.
4. సాంఘిక అభ్యసన సిద్ధాంతం, ఇతర అభ్యసన సిద్ధాంతాల కంటే మెరుగైనదని ఎలా చెప్పగలరో వివరించండి.
5. అభ్యసన ప్రక్రియ యత్నదోష పద్ధతిలో ఏ విధంగా జరుగుతుంది? థార్న్‌డైక్ ప్రతిపాదించిన అభ్యసన సూత్రాలను గురించి వివరంగా తెలపండి.
6. అభ్యసనా బదలాయింపు అంటే ఏమిటి? ఎన్ని రకాలు? శిక్షణ బదలాయింపు ఏ విధంగా సంభవిస్తుందో తెలిపే ముఖ్య సిద్ధాంతాలను వివరించండి.
7. ప్రత్యేక విద్య, సాధారణ విద్య, విలీన విద్యలు ఒకదానితో ఒకటి ఎలా విభేదిస్తాయో చర్చించండి?

**సంక్షిప్త ప్రశ్నలు** **4 మార్కులు**

1. అభ్యసనాన్ని ప్రభావితం చేసే కారకాలు ఏమిటి?
2. బ్రూనర్ బోధనా సిద్ధాంతం రుగించి తెలపండి?
3. పరిశీలనాభ్యసనంలోని సోపానాలను వివరించండి?
4. అంతర్‌దృష్టి అభ్యసనం అంటే ఏమిటి?
5. 'అభ్యసన వక్రం' గురించి వివరంగా తెలపండి.
6. లాక్షణిక అభ్యసన వక్రరేఖలో అంశాలను పేర్కొనండి?
7. స్మృతి అనగానేమి? స్మృతి అంశాలను తెలపండి?
8. విస్మృతి అనగానేమి? విస్మృతికి గల కారణాలను పేర్కొనండి.
9. స్మృతిని పెంపొందించే పద్ధతులను పేర్కొనండి.

**అతి సంక్షిప్త ప్రశ్నలు** **2 మార్కులు**

1. అభ్యసన వైకల్యతను పేర్కొనండి.
2. సక్రమమైన తరగతి గది ఏ విధంగా విద్యార్థులకు సహాయపడుతుంది.
3. అభ్యసన ప్రక్రియలో 'పీఠభూమి' అంటే ఏమిటి?
4. శాస్త్రీయ నిబంధనంలోని నియమాలను పేర్కొనండి.
5. స్మృతి ప్రక్రియలో ఎన్ని దశలు కలవు? అవి ఏవి?
6. అభ్యసన వైకల్యాలు గల పిల్లల లక్షణాలను పేర్కొనండి.

7. నమ్యప్రణాళికలో ఉపాధ్యాయుడు గుర్తుంచుకోవలసిన అంశాలను తెలపండి.

8. సమ్మిళిత పాఠశాల అవశ్యకతను తెలపండి.

**ఖాళీలు పూరించండి** **1/2 మార్కు**

1. థార్న్‌డైక్ రచించిన ……….. అను గ్రంథంలో తన ప్రయోగ ఫలితాలను రూపొందించారు.
2. గుర్రాన్ని తొట్టెవరకు తీసుకువెళ్ళవచ్చు కాని దానిచేత నీళ్ళు తాగించలేరు. అనే సామెత థారన్‌డైక్ అభ్యసన సూత్రాలలోని ఏ నియమానికి వర్తిస్తుంది?
3. గెస్టాల్ట్ భావన ……………
4. బ్రూనర్ రచించిన ……….. అను గ్రంథం బోధనా కార్యక్రమాలకు మూలం అయింది.
5. "ఎన్‌క్వైరీ ఇన్‌టూ హుమన్ ఫ్యాకల్టీ అండ్ ఇట్స్ డెవలప్‌మెంట్" గ్రంథ రచయిచ ……………

**బహుళైచ్ఛిక ప్రశ్నలు** **1/2 మార్కు**

1. బోధనా యంత్రాన్ని మొట్ట మొదట కనుగొన్నది ( )

   ఎ) స్కిన్నర్ బి) ప్రెస్సి సి) థారన్‌డైక్ డి) కొహెల్లర్

2. గ్రహించిన అంశాలను జ్ఞప్తికి ఉంచుకోవడం ( )

   ఎ) అవధానం బి) ధారణ సి) నిష్పాదన డి) పునరుత్పత్తి

3. "థియరీ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్" అను సిద్ధాంతాన్ని ప్రతిపాదించినది ( )

   ఎ) బ్రూనర్ బి) పియాజె సి) థారన్‌డైక్ డి) పావ్‌లోవ్

4. అభ్యసనం స్తంభించి పురోగమనం లేకుండా నిలిచిపోవడం ( )

   ఎ) చాంచల్యదశ బి) ప్రారంభస్ఫూర్తి సి) విరమణ డి) పీఠభూమిదశ

5. ఒక వ్యక్తికి ఒక రంగంలో ఇచ్చిన శిక్షణ ఇంకొక రంగంలో అభ్యసనానికి ఆటంకాన్ని కలిగిస్తే దానిని ఏమంటారు ( )

   ఎ) అనుకూల బదలాయింపు బి) వ్యతిరేక బదలాయింపు

   సి) శూన్య బదలాయింపు డి) ద్విపార్శ్వ బదలాయింపు

6. నేర్చుకున్న విషయాలను మెదడులో కొంతకాలం నిలుపుకోవటాన్ని ……… అంటారు ( )

   ఎ) అభ్యసనం బి) స్మృతి సి) ధారణ డి) విస్మృతి

7. గుర్తింపు గణన ( )

   ఎ) $\frac{\text{ఒప్పులు}}{\text{తప్పులు}}$ బి) ఒప్పులు – తప్పులు

   సి) $\frac{\text{ఒప్పులు} - \text{తప్పులు}}{\text{మొత్తం}}$ డి) $\left[\frac{\text{ఒప్పులు} - \text{తప్పులు}}{\text{మొత్తం}}\right] \times 100$

8. పొదుపు గణన ( )

ఎ) అసలు ప్రయత్నాలు – పునరభ్యసన ప్రయత్నాలు

బి) పునరభ్యసన ప్రయత్నాలు – అసలు ప్రయత్నాలు

సి) $\frac{\text{అసలు ప్రయత్నాలు – పునరభ్యసన ప్రయత్నాలు}}{\text{అసలు ప్రయత్నాలు}}$

డి) ఏదీకాదు

9. ఇప్పుడు చూస్తున్న విషయం ఇంతకు ముందు ఎప్పుడో చూసినట్టు భ్రమ కలిగితే? ( )

ఎ) డెజావు బి) జైగార్నిక్ సి) దమనం డి) అవరోధం

10. అపసామాన్య విస్మృతిని ............. గా పేర్కొనవచ్చు ( )

ఎ) అమ్నీషియా బి) ఫ్యూజ్ సి) ప్రేరణ డి) దమనం

**జతపరచండి** **1/2 మార్కు**

| | | |
|---|---|---|
| 1. నియత క్రమశిక్షణ సిద్ధాంతం | ( ) | ఎ) చార్లెస్‌జడ్ |
| 2. సమరూప మూలకాల సిద్ధాంతం | ( ) | బి) కోహెల్లర్ |
| 3. సమాన్యీకరణ సిద్ధాంతం | ( ) | సి) బాగ్లే |
| 4. ఆదర్శాల సిద్ధాంతం | ( ) | డి) థారన్‌డైక్ |
| 5. ట్రాన్స్‌పొజిషన్ సిద్ధాంతం | ( ) | ఇ) థామస్ ఎక్వినీస్ |

# 5 మూర్తిమత్వం

**మనిషి ఎలాంటివాడో హృదయం వల్లనే కాదు ముఖంలోను తెలుస్తుంది.**

**- జార్జ్ మాక్ డొనాల్డ్**

మూర్తిమత్వం అనే పదానికి అర్థం మనోవిజ్ఞానాత్మకంగా కూడా విస్తృతమైనది. సామాన్యులు మూర్తిమత్వం అంటే 'వ్యక్తి బాహ్య శారీరక రూపురేఖలు మాత్రమే అంచనావేసి వాడుతుంటారు. కంటికి అందంగా ఉన్నంతమాత్రాన వ్యక్తి మంచి మూర్తిమత్వం కలవాడనుకోవడం పొరపాటు. ఉపాధ్యాయులుగా మనం ఈ పదానికి శాస్త్రవేత్తలు అందజేసిన విస్తృతర్థాన్ని తెలుసుకొందాం. నవీన విద్యా విధాన లక్ష్యాలతో విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వాన్ని పెంపొందించడం ఒకటి " సంరపూర్ణ మూర్తిమత్వం" లేక సమగ్ర మూర్తిమత్వం (Integrated Personality) అంటే వ్యక్తి సామాజిక ప్రవర్తలన్ని సక్రమంగా సమాజం ఆశించిన విధంగా ఉండడం అన్నమాట. అందుకని ఈ పదానికి మనం అనుకొనే వ్యక్తి బహిర్గత లక్షణాలకు సంబంధించిన అర్థం సరిపోదు.

## 5.1 మూర్తిమత్వం(Personality) అర్థం

మూర్తిమత్వం "పర్సోనా" అనే లాటిన్ పదం నుండి పుట్టినది. "పర్సనాలిటి" అనే ఆంగ్లపదం, లాటిన్ భాషయందు 'పర్సొనా' ముసుగు అని అర్థం పూర్వం నాటకాలలో వివిధ పాత్రలు ధరించేటప్పుడు ముఖాలకు పాత్రొచితంగా ముసుగులు వేసుకొని అభినయం చేసేవారు. అదే విధంగా ఒక వ్యక్తి తన జీవితరంగంలో కొడుకుగా, అన్న, తమ్ముడుగా పెండ్లైన తరువాత భర్త, తన పిల్లలకు తండ్రిగా, మామగారిగా, తాతయ్యగా వివిధ పాత్రలు వేయాల్సి ఉంటుంది. ప్రతిపాత్రకు, కనిపించిన 'ముసుగు' వేసుకొని నటించవలసి ఉంటుంది. మనం జీవితనాటక రంగం– ఆటలాడే బొమ్మలాంటి వారే కనుక వివిధ పరిస్థితులలో వివిధ రకాలుగా ప్రవర్తిస్తుంటారు. కాబట్టి మూర్తిమత్వం అంటే కంటికి కనిపించే బాహ్య శారీరక రూపురేఖలు మాత్రమే కాక వ్యక్తియొక్క అంతర్గత మానసిక, సామాజిక, తాత్విక, ఉద్వేగ లక్షణాలను పూర్తిగ వివరించే సమగ్రమైన (Comprehensive)పదం.

## 5.2 నిర్వచనాలు:–

దినదినానికి ప్రబలిపోతున్న మనోవిజ్ఞానప్రభావం వలన అనేక మంది శాస్త్రజ్ఞులు మూర్తిమత్వాన్ని అనేక మంది అనేక రకాలుగా నిర్వచించుకుంటూ వచ్చారు.

కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం.

1. **కాటిల్:** ఒక సన్నివేశంలో ఒక వ్యక్తి ఏమి చేస్తాడో ప్రాగుప్తీకరించడానికి దోహదపడేదే మూర్తిమత్వం.
2. **ఇ.డబ్ల్యు.బర్జెస్** "వ్యక్తి నివసించే సంఘంలో ఆ వ్యక్తి పాత్రను, హోదాను నిర్ణయించే లక్షణాంశాల సమైక్యం".
3. **జె.ఎఫ్ బ్రౌన్:** "మూర్తిమత్వం అంటే వ్యక్తి యొక్క లక్షణాంశాల గుణాత్మక నమూనా."

4. **కాంటర్:** ఒక వ్యక్తి జరిపే ప్రతిచర్యల మొత్తము,  ఒక వ్యక్తి చేసే, చేయగల కృత్యాల మొత్తమే అతని మూర్తిమత్వం.
5. **ప్రిన్స్:** జైవిక స్వత: సిద్ధ గుణాలు, ధోరణులు, ప్రచోదనాలు, సంపాదిత లక్షణాలు, సహజాతాలు మొదలైన లక్షణాలను కలిపి మూర్తిమత్వం అంటారు.
6. **జి.డబ్ల్యూ. ఆల్‌పోర్ట్:** వ్యక్తి తన పరిసరాలతో చేసుకొనే ప్రత్యేకమైన సర్దుబాటును నిర్ణయించే మానసిక, భౌతిక అంశాలగతిశీలక వ్యవస్థాపనమునే 'మూర్తిమత్వం' అని జి.డబ్ల్యూ. ఆల్‌పోర్ట్ నిర్వచించెను. ఈ నిర్వచన్ చాలా అర్థవంతంగా ఉందని చాలా మంది శాస్త్రవేత్తలు అంగీకరించారు.

పై నిర్వచనం "మానసిక, భౌతిక అంశాలు" అనడంలో – వ్యక్తి బాహ్యలక్షణాలు, మానసిక అంశాలు– సాంఘిక, ఉద్వేగ, నైతిక, తాత్విక లక్షణాలన్ని ఇమిడి ఉన్నాయి. "గతిశీలక వ్యవస్థాపనం" అనడంలో వ్యక్తి మూర్తిమత్వం స్థిరమైనది(Untsable) కాదని, అది నిత్యం పరిస్థితులు, పరిసరాల ఫలితంగా మార్పు చెందుతూ వుంటుందని వ్యక్తమౌతుంది మరియు వ్యక్తి తనున్న పరిసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన సర్దుబాట్లు చేసుకొంటుంటాడని తెలుపుతుంది. పై నిర్వచనాలన్నింటిని విశ్లేషించినప్పుడు మూర్తిమత్వం అంటే కొన్ని ముఖ్యమైన అంశాలు మనకు తెలియవస్తాయి. అవి

– ఇదివ్యక్తిలోని అన్ని భౌతిక – మానసిక అంశాల పొందిక
– ఇది సాంఘిక /ఉద్వేగ పరమైనది.
– వ్యక్తిలో ప్రత్యేక లక్షణాలు కూడా ఉంటాయని
– గతిశీలకమైనదని (Dynamic)
– జన్యు, పరిసరాల ప్రభావంతో పాటు అభ్యసనం, అనుభవాల వల్ల వ్యక్తి మూర్తిమత్వం ప్రభావితం అవుతుందని
– మూర్తిమత్వంలో వైయక్తిక భేదాలుంటాయని తెలుపుతుంది.

## 5.3 మూర్తిమత్వ లక్షణాలు:

1. **మూర్తిమత్వం ప్రత్యేకమైనది, నిర్ధిష్టమైనది:** ఎవరి మూర్తిమత్వం వారిది. ప్రతి ఒక వ్యక్తి ఒక విశిష్టమైన రీతిలో సర్దుబాటు చేసుకుంటాడు. సమరూప కవలలు కూడా ఒకే రకమైన మూర్తిమత్వాన్ని కలిగి ఉండరు.
2. **మూర్తిమత్వం వ్యక్తి స్వీయ చైతన్యం :** భాటియా పేర్కొన్నట్లు ఒక వ్యక్తిలో ఆత్మ భావన ప్రవేశించినపుడే మనిషి వ్యక్తిగా మారతాడు. కుక్కలకు, పసిపిల్లలకు మూర్తిమత్వాన్ని ఆపాదించలేము. కారణము – వారిలో ఆత్మ భావన ఉండదు.
3. **వ్యక్తిని గురించిన ప్రతి ఒక్క అంశం మూర్తిమత్వంలో చేరి ఉంటుంది.**
   వ్యక్తి వికాసంలోని శారీరక వికాసం, మానసిక వికాసం, ఉద్వేగ వికాసం, సామాజిక వికాసం, నైతిక వికాసంలోని అంశాలు చేతన, ఉపచేతన, అచేతన అంశాలు, జ్ఞానాత్మక, భావాత్మక, చలనాత్మక అంశాలన్ని మూర్తిమత్వంలో చేరి ఉంటాయి.
4. **మూర్తిమత్వం వ్యవస్థీకృతంగా, ఏకీకృత మొత్తంగా ఉంటుంది:**
   ఒక వ్యక్తిలోని లక్షణాన్ని గానీ, కొన్ని లక్షణాలను బట్టి గానీ  అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేయలేము. ఒక వ్యక్తి మూర్తిమత్వం అతని జైవిక, సామాజిక అంశాల మొత్తము.
   పరిస్థితులు, పరిసరాలకు అనుగుణంగా వ్యక్తిలోని మూర్తిమత్వ అంశాలన్ని వ్యవస్థీకృతమై ఏకీకృతంగా పనిచేస్తుంది.
5. **మూర్తిమత్వం గతిశీలకమైనది:** మార్పునకు లోనవుతూఉంటుంది.
6. నిర్దిష్టగమ్యం వైపు లక్ష్యించి పని చేస్తుంది.

7. మూర్తిమత్వంపై అనువంశికత, పరిసరాల ప్రభావం ఉంటుంది.
8. మూర్తిమత్వం అభ్యసనం, అనుభవాలు ఆర్జన మీద ఆధారపడి ఉంటుంది.
9. మూర్తిమత్వాన్ని వివరించవచ్చు. అంచనా వేయవచ్చు.
10. మూర్తిమత్వ లక్షణాలు స్థిరంగా ఉంటాయి, కాని స్థబ్దంగా ఉండవు.

## 5.4 మూర్తిమత్వ మూలకాలు:

వ్యక్తి యొక్క మూర్తిమత్వంలో భౌతిక – మానసిక కారకాలు వ్యవస్థీకృతమై ఏకీకృతంగా పరిస్థితులు – పరిసరాలకనుగుణంగా పనిచేస్తుందని పీటర్ సాండి ఫర్డ్ అభిప్రాయపడ్డాడు. మూర్తిమత్వంలో ఈ క్రింది మూలకాలు (Elements) లేక అంశాలు ఉంటాయని పేర్కొన్నాడు.

1. **భౌతిక లక్షణాలు / శారీరక లక్షణాలు :** చర్మం రంగు, జుట్టు రంగు, అందం మొదలైనవి.
2. **శరీర నిర్మాణ లక్షణాలు :** జీవన క్రియలు, రక్త పీడనం, రక్తవర్గాలు, ఖనిజ మూలకాలు.
3. **బౌద్ధిక సామర్థ్యాలు :** ప్రజ్ఞ, విద్యా సాధన
4. **అలవాట్లు :** ఆర్జిత ప్రతిస్పందనలు
5. **కౌశలాలు :** ఒక పనిని నిర్ధిష్టంగా చేయడమును కౌశలం అంటారు.
   ఉదా:– రాయడం, గీయడం, నడవడం మొదలైనవి.
6. **సహజ సామర్థ్యాలు:** అనువంశికంగా ప్రాప్తించి శిక్షణ ద్వారా అభివృద్ధి చెందేవి.
   **ఉదా:** సంగీతం, నాట్యం, చిత్రలేఖనం.
7. **శక్తులు :** స్మృతి, వివేచన, ధారణ, ఆలోచన, సృజనాత్మకత శక్తులు
8. **లక్షణాంశాలు:** విశిష్ట ప్రవర్తనారీతులనే లక్షణాంశాలు అంటారు.
   **ఉదా:** కోపం, సౌమ్యం, ఏకాకి, ఉద్వేగ స్థిరత్వం.
9. వైఖరులు.
10. అభిరుచులు

పై పేర్కొన్న మూలకాలన్నీ మూర్తిమత్వ నిర్వహణలో పరివ్యాప్తం (Overlapping)గా ఉంటాయి.

## 5.4 మూర్తిమత్వాన్ని రూపొందించే కారకాలు:

మూర్తిమత్వంలోని అంశాలను తెలుసుకున్న తరువాత ఉపాధ్యాయులైన మనం అవి ఎట్లా రూపొందించుకొంటాయో వాటి కారకాలు గూర్చి తెలుసుకోవడం చాలా ముఖ్యం

సమస్త లక్షణాంశాల సమన్వితమైన వ్యక్తి, పరిసరాలతో చేసే ప్రతిస్పందనలు అతని మూర్తిమత్వం అని తెలుసుకొన్న మనం, వ్యక్తి మూర్తిమత్వాన్ని వికసింపజేసే 1. శారీరక కారకాలు, 2. సాంఘిక సాంస్కృతిక కారకాలను గురించి తెలుసుకోవడం ముఖ్యం.


పిల్లల్లో మూర్తిమత్వం వికాసం వారికి అనువంశికంగా లభించే శరీర లక్షణాల మీద వాటిని వికసింపచేసే భౌతిక పరిస్థితుల మీద, వారిపై ప్రభావం చూపే సాంఘిక పరిసరాల మీద ఆధారపడి ఉంటుంది. వీటిలో వ్యక్తి మూర్తిమత్వానికి ఏది ఎక్కువ దోహదం చేస్తుందో చెప్పడం కష్టం. కాని తప్పని సరిగా ఇవి ఉమ్మడిగా వ్యక్తి మూర్తిమత్వ వికాసానికి దోహదం చేస్తాయి.

**5.4.1 శారీరక కారకాలు :** శరీరాకృతికి మూర్తిమత్వ ప్రవృత్తులకు సంబంధం ఉందని. రూప ఉపగమ సిద్ధాంత కర్తలు – హిప్పోక్రటీస్, క్రెష్మర్, షెల్డన్, యూంగ్, స్ప్రాంగర్ మొదలైన వారు అభిప్రాయపడ్డారు.

వ్యక్తి శరీరములోని వివిధ వ్యవస్థలు వాటి పనితీరు, వాటి మధ్య ఉన్న సమన్వయం మూర్తిమత్వంపై ప్రభావం చూపుతాయి. అందులో ముఖ్యమైనవి 1. నాడీ వ్యవస్థ(Nervus System), 2. అంతఃస్రావకగ్రంథులల వ్యవస్థ (Endo Craine System)

1. నాడీ వ్యవస్థ:

నాడీమండల వ్యవస్థలో ముఖ్యమైన మూడు భాగాలున్నాయి. అవి: 1. కేంద్రీయ నాడీవ్యవస్థ. 2. పరిధీయ నాడీవ్యవస్థ. 3. స్వయం చోదిత నాడీవ్యవస్థ. నాడీ మండల వ్యవస్థలోని భాగాలను రేఖాత్మక చిత్రం 1లో చూడవచ్చు




పై కనబరిచిన నాడీవ్యవస్థ పిల్లల యొక్క మూర్తిమత్వ అంశాలను ఏవిధంగా ప్రభావితం చేస్తుందో తెలుసుకొందాం.

**1) కేంద్రీయ నాడీవ్యవస్థ:**

మెదడు, కశేరు నాడీదండం(వెన్నుపాము) కేంద్రీయనాడీవ్యవస్థలోని 2 ప్రధానాభాగాలు.

మెదడును 3 ముఖ్య భాగాలుగా శాస్త్రవేత్తలు విభజించారు. అ) ముందు మెదడు

ఆ) మధ్య మెదడు. ఇ) వెనుక మెదడు అవి.

అ) ముందు మెదడును మస్తిష్కం(Cerebrum) అంటారు. ఇందులో వివిధ సమాచారాలను గ్రహించి విశ్లేషించే జ్ఞాననాడులున్నాయి. పిల్లల అనుభూతులను(Feelings) ఇముడ్చుకొనే శక్తి దీనికి ఉంది. పిల్లల ఆలోచనాశక్తి, వివేచనశక్తి, ధారణశక్తి, తెలివితేటలు మస్తిష్కవల్కనిర్మాణం పనితీరులపై ఆధారపడి ఉంటుంది. మెదడులో ఉన్న ద్వారగోర్థం(Diencephalon) అంటారు. ఈ బాగంలో పిల్లల ఉద్వేగాలైన కోపం, బాధ, ఆనందం, దుఃఖం, సంతోషంలాంటి భావావేశాలను నియంత్రించే కేంద్రాలున్నాయి. ఇక్కడ కోపాన్ని, ఆకలిని నియంత్రించే కేంద్రాలు హైపోథాలమస్‌లో ఉన్నాయి.

ఆ) మధ్య మెదడుః ఇది వ్యక్తి కండరవ్యవస్థను నియంత్రిస్తుంది. మధ్య మెదడు పనితీరు మీద వ్యక్తి చాలకకౌశలాలు ఆధారపడి ఉంటాయి. (థార్న్‌డేక్ పేర్కొన్న యాంత్రిక ప్రజ్ఞకు ఇది మూలం).

ఇ) వెనుక మెదడుః వెనుక మెదడులో 1. అనుమస్తిష్కం(Cerebellum) 2. మెదడుకాండం(Brain Stem) అనే రెండు భాగాలున్నాయి.

అనుమస్తిష్కం వ్యక్తి శరీరాన్ని సమతాస్థితిలో ఉంచడానికి దోహదం చేస్తుంది. మెదడు కాండంలోని మజ్జాముఖం అనేది వ్యక్తి శ్వాసక్రియ, హృదయస్పందన, రక్తపీడనం, శరీరఉష్ణోగ్రత, లాలాజలస్రావకం, జీర్ణక్రియ మొదలైన అసంకల్పిత చర్యలను తన ఆధీనంలో ఉంచుకొంటుంది.

2) పరిధీయ నాడీవ్యవస్థ:

మెదడు నుంచి, వెన్నుపాము నుంచి ఉద్భవించే 43 జతల నాడులను పరిధీయనాడీవ్యవస్థ అంటారు. మెదడు నుంచి ఉద్భవించే 12 జతల నాడులను కపాలనాడులనీ, వెన్నుపాము నుంచి ఉద్భవించే 31 జతల నాడులను వెన్ను నాడులనీ అంటారు.

పిల్లల దృశ్య / శ్రవణ విచక్షణా వేగం, వివిధ ఉద్దీపనలకు చేసే ప్రతిచర్యావేగం, కండరబలం, చలన వేగాలలో భేదం మొదలైనవి పరిధీయ నాడుల పనితీరుపై ఆధారపడి ఉంటాయి.

3. స్వయంచోదిత నాడీవ్యవస్థ (The Autonomous NervousSystem):

పిల్లలు ఏదైనా వేడివస్తువును తాకినప్పుడు, వెంటనే చేతిని వెనుకకను తీసుకొంటారు. ఎక్కువ కాంతి కళ్ళమీద పడ్డప్పుడు వెంటనే కళ్ళు మూసుకొంటారు. ముక్కుల్లోకి ధూళిపోతే తుమ్ముతారు. దుమ్ము గొంతులోకెళితే దగ్గుతారు. ఇవన్నీ అసంకల్పిత ప్రతీకార చర్యలు(Reflex actions). వీటిని ప్రతిక్రియ చర్యలని (Reflexes) కూడా అంటారు. ఇవి పిల్లల బాధాకరమైన లేదా అపాయకరమైన ఉద్దీపనల నుంచి కాపాడుతాయి.

ఈ నాడీ వ్యవస్థలో రెండు భాగాలున్నాయి. అవి: 1. సహానువర్తి నాడీవ్యవస్థ, 2. సహానువర్తి పరనాడీ వ్యవస్థ

సహానువర్తి నాడీవ్యవస్థ జరిపే ప్రతిచర్యలు రెండు రకాలు అవి: 1. నిబంధన రహిత ప్రతిచర్యలు. 2. నిబంధన సహిత ప్రతిచర్యలు

నిబంధనరహిత ప్రతిచర్యలు పుట్టుకతో వస్తాయి. కాని నిబంధన సహిత ప్రతిచర్యలు అభ్యసిస్తే వస్తాయి. ఒకే పనిని పిల్లలు అనేకసార్లు చేయడం ద్వారా ఏర్పడేవి. ఇవాన్‌పావ్‌లోవ్ అనే రష్యన్‌శాస్త్రవేత్త చేసిన ప్రయోగాలు ఇచ్చిన నియమాలు నిబంధన సహిత ప్రతిచర్యల ప్రయోగాఫలితాలని మీకు తెలిసినదే.

నాడీ కణాలకు విభజన చెందే శక్తిని కోల్పోతే వాటి వల్ల ప్రభావితమైన అంగాలు, అవయువాలు పనిచేయవు. పురుద్ధరింపబడవు. కావున శిశువు జన్మించిన వెంటనే వారికి ఇవ్వవలసిన వ్యాధినిరోధక మందు పోలియో చుక్కలు, మీజిల్స్, డి పి టి మొదలగు వ్యాక్సిన్స్ ఇవ్వాలి. మొదటి మూడు సంవత్సరాలు మంచి పౌష్టికాహారం ఇచ్చి శారీరకవ్యవస్థలు వృద్ధి – అభివృద్ధికి తోడ్పడాలి.

మానవ శరీరంలోని వివిధ అవయవాలమధ్య సమన్వయం ఏర్పరచేవాటిలో హార్మోనులనే రసాయన పదార్థాలు ముఖ్య పాత్రను వహిస్తాయి. మరియు మూర్తిమత్వాన్ని ప్రభావితం చేస్తాయి.రసాయన పదార్థాలను స్రవించే కణజాలాన్ని గ్రంథులు అంటారు. గ్రంథులు రెండు రకాలు

1. నాళసహిత గ్రంథులు(Exocrine glands), 2. నాళరహితగ్రంథులు లేక అంతఃస్రావకగ్రంథులు

1. నాళరహితగ్రంథులు(Endo crine glands)ః ఇవి తమ స్రావకాలను నేరుగా రక్తంలోకి స్రవించవు. ఉదాహరణకు లాలాజల గ్రంథులు, జఠరగ్రంథులు, కాలేయం, మూత్రపిండాలు, స్వేదగ్రంథులు, జననాంగ గ్రంథులు.

2. నాళరహిత గ్రంథులు లేదా అంతఃస్రావకగ్రంథులు: వీటికి నాళాలు ఉండవు. ఇవి విడుదలచేసే రసాయన పదార్థాలను 'హార్మోనులు' అంటారు. ఇవి ప్రత్యక్షంగా రక్తంలోకి విడుదల అవుతాయి. రక్తం వీటిని శరీరంలోని వివిధ భాగాలకు

తీసుకుని వెడుతుంది. ఇవి జీవక్రియల స్థాయిని పెంచడం కాని, తగ్గించటంకాని చేస్తాయి. వినాళగ్రంథుల గురించి వాటి స్రావకాలను గురించి వాటి వల్ల ఏర్పడే ప్రవర్తనారీతులు, లక్షణాలను గురించి తెలుసుకుందాం.

**1. పీయూష గ్రంథి / పిట్యూటరి గ్రంథి:**

- బఠాణి గింజ పరిమాణంలో ఉంటుంది. మెదడులో ఉంటుంది.
- మిగతా అంతఃస్రావగ్రంథులను నియంత్రణ పరుస్తుంది. అందుకే దీనిని ప్రధాన గ్రంథి (Master Gland)అంటారు.
- ఇది వ్యక్తి కండరాలు, లైంగిక అవయవాలు, మానసిక వికాసం మొదలైన వాటి మీద ప్రభావం చూపుతుంది.
- పీయూష గ్రంథి స్రవించే హార్మోను – పెరుగుదల హార్మోన్(Growth harmone) .
- ఈ హార్మోన్ తగినంత స్రవించబడకపోతే – శిశువులో మరుగుజ్జుతనము వస్తుంది.

  ఎక్కువ స్రవించబడితే అతి దీర్ఘ కాయత్వం వస్తుంది.
- ఈ గ్రంథి స్రవించే అనేక హార్మోన్‌ల కారణంగా పిల్లలు చతురులుగా, సాత్విక స్వభావులుగా, మానసిక స్థిరత్వం గలవారుగా ఉంటారు.

**2. అవటు గ్రంథి / థైరాయిడ్ గ్రంథి:**

- ఇది గొంతుక వద్ద వాయు నాళానికి దగ్గరగా ఉంటుంది.
- ఇది స్రవించే హార్మోన్ – **థైరాక్సిన్.**
- థైరాక్సిన్ హార్మోన్ ఉత్పత్తికి అయొడిన్ అవసరము.
- పిల్లలలో అయొడిన్ లోపం వలన సామాన్య గాయిటర్ వస్తుంది.
- థైరాక్సిన్ లోపిస్తే పిల్లలలో తన్యత ఏర్పడుతుంది. సోమరితనం, మందకొడిగా ప్రవర్తిస్తారు.
- థైరాక్సిన్ స్రావకం పిల్లల యవ్వన దశలో లోపించినపుడు – క్రెటివిజమ్ అనే స్థితి ఏర్పడుతుంది.
- ఈ స్థితిలో మెదడు వికసించదు. మంద బుద్ధిత్వం, మానసిక క్షీణత, అస్థి పంజరం పెరుగుదలలో లోపం, జననేంద్రియాల వికాసం ఆలస్యమవుతుంది.
- థైరాక్సిన్ స్రావకం వయోజన దశలో లోపించినపుడు – మిక్సోడిమా అనే స్థితి ఏర్పడుతుంది.
- ఈ స్థితి లో వ్యక్తి మందకొడిగా ప్రవర్తించడం, లైంగిక అశక్తత కనిపించడం, నిద్రలేమి, మందబుద్ధితో ప్రవర్తించడం జరుగుతుంది.
- థైరాక్సిన్ స్రావకం తీవ్రంగా ఉండే పిల్లలు ప్రభావశీలురుగా, అత్యాశాపరులుగా కనబడతారు.

**3. పార్శ్వ అవటు గ్రంథి / పారా థైరాయిడ్ గ్రంథి:**

- ఇది అవటు గ్రంధికి దగ్గరగా ఉంటుంది.
- ఇది స్రవించే హార్మోన్ – పారాథార్మోన్.
- ఇది తక్కువైతే ఎముకలలో గట్టితనం ఏర్పడకపోవడం, ఎక్కువైతే కండరాలు ఉత్తేజపడి సంకోచస్థితిలో ఉండటం జరుగుతుంది. ఈ స్థితిని **టిటాని** అంటారు.

**4. అధివృక్క గ్రంథి / అడ్రినల్ గ్రంథి:**

- మూత్రపిండాలపై టోపీలా ఉండే వినాళ గ్రంథులే అడ్రినల్ గ్రంథులు.
- ఈ గ్రంథి స్రవించే హార్మోన్ – ఎడ్రినలిన్.
- ఈ స్రావకం ఎక్కువయితే త్వరగా జననేంద్రియ వికాసం, అమ్మాయిలకు మీసాలు రావడం, పురుషుల వలె స్వరం బొంగురు కావడం జరుగుతుంది.
- వ్యక్తి ఉద్వేగాలపై అడ్రినలిన్ ఎక్కువగా పని చేస్తుంది.
- ఎడ్రినలిన్‌ను Fight or Flight హార్మోన్ అని కూడా అంటారు.

**5. ముష్కాలు/ టెస్టీస్ :**

- ముష్కాలు పురుష లైంగిక హార్మోన్‌లు అయిన టెస్టోస్టిరాన్లు, ఆండ్రోజనులను స్రవిస్తాయి.
- టెస్టోస్టిరాన్లు విడుదల కాకపోతే అబ్బాయిలలో మగ లక్షణాలు వృద్ధికావు. ఈ పరిస్థితిని **నపుంసకత్వం** అంటారు.

**6. స్త్రీ బీజ కోశాలు:** ఇవి స్త్రీ లైంగిక హార్మోన్‌లయిన ఈస్ట్రోజన్‌లు, ప్రొజెస్టిరాన్‌లను స్రవిస్తాయి.

ఈస్ట్రోజన్‌లు విడుదల కాకపోతే అమ్మాయిలలో స్త్రీలక్షణాలు వృద్ధికావు. అతిగా స్రవింపబడితే దౌర్జన్యశీలతను కనబరుస్తారు, తక్కువగా స్రవిస్తే సంగీత సాహిత్య కళలలో ప్రావీణ్యతను ఆర్జిస్తారు.

**7. క్లోమం (మిశ్రమ గ్రంథి):**

- దీనిలో లాంగర్ హ్యాన్స్ పుటికలు రక్తంలోని గ్లూకోజ్‌ను నియంత్రిస్తాయి.

### 5.4.2 సాంఘిక, సాంస్కృతిక కారకాలు:

వ్యక్తి మూర్తిమత్వ వికాసంలో శారీరక లక్షణాలతో పాటు సాంఘిక, సాంస్కృతిక కారకాలు కూడా ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ కారకాలు రెండు రకాలు.

1. జననపూర్వ కారకం
2. జననాంతర కారకం

**జననపూర్వ పరిసరం**

తల్లి గర్భం దాల్చినప్పటి నుంచీ బిడ్డను ప్రసవించే వరకూ అంటే దాదాపు 9 నెలలు కాలాన్ని (360 రోజులు) జననపూర్వ కారకంగా పేర్కొనవచ్చు. జననపూర్వ పరిసరంలో తల్లి ఆహార అలవాట్లు, తల్లి శారీరక మానసిక ఆరోగ్యం, మందుల వాడకం, తల్లిదండ్రుల వైఖరి ముఖ్యమైనవి.

**తల్లి ఆహార అలవాట్లు** : గర్భస్థ శిశువు పెరుగుదల తల్లి తీసుకొనే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. తల్లి పౌష్టికాహారం తీసుకొన్నట్లయితే గర్భస్థ శిశువు పెరుగుదల సక్రమంగా ఉండి తగినంత బరువు, పొడవు, అంతర్గత అవయవాల అభివృద్ధి జరిగి ఆరోగ్యవంతమైన శిశువు జన్మించే అవకాశం ఉంటుంది. అలాకాక తల్లి పౌష్టికాహారం తీసుకోకపోయినా, తినవలసిన దానికంటే ఎక్కువ తిన్నా, లేదా తక్కువ తిన్నా అనారోగ్యకరమైన శిశువు జన్మించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**తల్లి శారీరక, మానసిక ఆరోగ్యం :**

పుట్టబోయే శిశువు ఆరోగ్యం తల్లి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అనుసరించి ఉంటుంది. కొన్ని జబ్బులు తల్లి ద్వారా గర్భస్థ శిశువుకు కూడా వచ్చే ప్రమాదం ఉంది. ఉదాహరణకు AIDS అంతేకాకుండా తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు,

ఏదైనా ప్రమాదం జరిగినా తల్లి పొట్ట బాగా ఒత్తిడికి గురైనా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగా ఉండే అవకాశం ఉంది. తల్లి ఆరోగ్యంగా ఉంటే సహజ ప్రసవం జరిగే అవకాశం ఉంటుంది. అలా కాకపోతే ప్రసవానికి ఇబ్బంది ఎదురై పరికర (ఫోర్‌సెప్స్) సహాయంతో చేసే ప్రసవంతో శిశువుకు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ.

తల్లి శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమైంది. తల్లికి ఉద్వేగస్థిరత్వం లేకుండా ఉండటం, ఎక్కువగా ఆందోళనకు గురైనా అది గర్భస్థ శిశువుపై ప్రభావం చూపిస్తుంది. గర్భిణి మానసిక ఆరోగ్యం తన భర్త, ఇతర కుటుంబ సభ్యులు అందించే సహాయ సహకారాలను బట్టి ఉంటుంది. గర్భిణి శారీరక, మానసిక ఆరోగ్యాలు దేనికి అదే కాకుండా. శారీరక అనారోగ్యం మానసిక అనారోగ్యానికీ, అదే విధంగా మానసిక అనారోగ్యం శారీరక అనారోగ్యానికీ దారితీసే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి గర్భిణి శారీరక, మానసిక ఆరోగ్యాలు రెండూ కూడా ముఖ్యమైనవే.

### తల్లిదండ్రుల వైఖరి :

తల్లిదండ్రుల వైఖరి అనేది శిశువు జననపూర్వ పరిసర కారకంగానూ, అదేవిధంగా జననాంతర పరిసర కారకంగానూ ఉంటుంది. ప్రస్తుతానికి ఇక్కడ జననపూర్వ తల్లిదండ్రుల వైఖరిని గురించి మాత్రమే ప్రస్తావించడమైంది.

గర్భస్థ శిశువు తల్లిదండ్రులు (భార్య, భర్త) నిజానికి శిశువు కావాలని అనుకొంటున్నారా? అంటే వారు మానసికంగా, శారీరకంగా సిద్ధంగా ఉన్నారా? భార్యాభర్తలకు అప్పుడే సంతానం వద్దనుకునప్పటికీ, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల బిడ్డకు జన్మను ఇవ్వవలసి వస్తే తల్లి శారీరక, మనసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. తద్వారా పుట్టే బిడ్డ ఆరోగ్యం కూడా సరిగ్గా ఉండదు. అంతేకాక తల్లిదండ్రులు ఆ బిడ్డను జాగ్రత్తగా చూసుకోలేరు. అలాంటప్పుడు పుట్టినబిడ్డ నిర్లక్ష్యానికి గురికావచ్చు.

భార్యాభర్తలలో సంతానం కావాలని ఒకరికి ఇష్టం ఉండి మరొకరికి ఇష్టం లేకుండానే శిశువుకు జన్మను ఇస్తే, ఆ శిశువు ఆలనా, పాలనా సరిగ్గా జరగదు. అదేకాకుండా భార్యాభర్తలకు ఆడ శిశువు మాత్రమే కావాలనుకుంటే, మగశిశువు జన్మించడమో లేదా మగశిశువు కావాలనుకుంటే ఆడశిశువు జన్మిస్తే వారు ఆ శిశువును సరిగ్గా ఆదరించరు. తద్వారా శిశువు మూర్తిమత్వంపై ప్రభావం ఉంటుంది. అలాగే పెళ్లి అయిన తరవాత చాలా సంవత్సరాల వరకూ సంతానం లేక తరువాత సంతానం కలిగినప్పుడు బిడ్డను చాలా అపురూపంగా చూడటం, అతిగారాబంగా చూసుకోవడం వల్ల శిశువుకు సర్దుబాటు సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

### జననాంతర పరిసరం :

జననపూర్వ పరిసరం, జననాంతర పరిసరాలపై ప్రభావం చూపిస్తుంది. జననాంతర పరిసరంలో ముఖ్యమైనవి.

1. కుటుంబం (గృహం) 2. ఇరుగుపొరుగువారు
3. సమవయస్కులు 4. పాఠశాల
5. ప్రసార మాధ్యమాలు.

### 1. కుటుంబం :

శిశువు జన్మించిన తరవాత శిశువు అవసరాలను తీర్చడంలో మొదటివారు తల్లి, ఆ తరవాత కుటుంబ సభ్యులు. తల్లి పాలతో పెరిగినవారు ఆరోగ్యంగానూ, భద్రతా భావంతో పెరుగుతారు. తల్లి దగ్గర పాలు లేకపోయినా, పాలు ఉన్నప్పటికీ ఇవ్వడానికి ఇష్టపడకపోయినా పిల్లల్లో భద్రతారాహిత్య భావం పెరిగే అవకాశం ఉంది. తల్లిపాలు లేదా

డబ్బాపాలు పట్టేవిధానంపై అలాగే మలమూత్రాల విసర్జనా శిక్షణపై పిల్లల మూర్తిమత్వం ఆధారపడి ఉంటుంది. విసర్జనలో శిక్షణ సరిగ్గా లేనట్లయితేపక్క తడపటం అలాగే కచ్చితమైన వేళలు లేకుండా మలమూత్రాల విసర్జన జరిగే అవకాశం ఉంటుంది. ఇది పిల్లల సమయపాలనై ప్రభావం చూపిస్తుంది.

పిల్లల పెంపకం తీరు కూడా మూర్తిమత్వంపై ఎనలేని ప్రభావాన్ని చూపిస్తుందని అనేక పరిశోధనలు తెలిపాయి. రాడ్కె పిల్లలు పెరిగిన గృహ వాతావరణానికీ వారి ప్రవర్తనకూ మధ్య సంబంధాన్ని తెలిపారు.

| గృహ వాతావరణలో తల్లిదండ్రుల పెంపకశైలి | తత్సంబంధ పిల్లల ప్రవర్తన లక్షణాలు |
|---|---|
| 1. తిరస్కరణకు గురిఅయితే | సర్దుబాటు సమస్యలు, అభద్రతా భావం, కలహాశీలి, పరపీడన అధైర్యం, బిడియం, హఠం, చెప్పింది పాటించకపోవడం. |
| 2. అతి సంరక్షణ "అతిగారబం" | శిశుప్రవర్తన, ఉపసంహరణ, పరాధీనత, అభద్రతాభావం, కోపం, ఈర్ష్య, సర్దుబాటు సమస్య. |
| 3. తల్లిదండ్రుల అధిపత్య/అధికార ధోరణి | ఆధారపడి ఉండటం, బిడియం, లోబడి ఉండటం, మర్యాదపూర్వక, ఆత్మచేతనం, సహకరించక పోవడం, తన్యత, సాహసం, జగడాలమారి, అనాసక్తత. |
| 4. నమ్రత గల తల్లిదండ్రులు | కోపం, అజాగ్రత్త, అవిధేయత, స్వతంత్రత, ఆత్మవిశ్వాసం, ఇతరులతో త్వరగా స్నేహం చేయడం, న్యూరాటిక్ |
| 5. సామరస్యం, మంచి సర్దుబాటు | అణకువ, మంచి సర్దుబాటు, శాంతం, ఆనందం, అనుకూలత, సహకారతత్వం, అత్యధిక సర్దుబాటు, స్వతంత్రత. |
| 6. తార్కికత, శాస్త్రీయ దృక్పథం | స్వావలంబన, సహకారతత్వం, బాధతాయుత ప్రవర్తన. |
| 7. స్థిరమైన కచ్చితమైన క్రమశిక్షణ | మంచి సర్దుబాటు |
| 8. పిల్లలకు బాధ్యతను ఇవ్వడం | మంచి సర్దుబాటు, స్వావలంబన, భద్రత భావనలు |

కుటుంబ వ్యవస్థ రూపాలు, కుటుంబ పరిమాణం, శిశువు జన్మక్రమం, ఇంటి దగ్గర మాట్లాడేభాష, సాంఘిక ఆర్థిక స్థాయి మొదలైనవి పిల్లల మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపిస్తాయి.

కుటుంబ వ్యవస్థ రూపాలైన వ్యష్టి కుటుంబం, సమిష్టి కుటుంబం పిల్లల మూర్తిమత్వాలపై వివిధ రకాలుగా ప్రభావాన్ని చూపిస్తాయి. సమిష్టి కుటుంబంలో చాలా మంది కలిసి ఉండటం,కలిసి భోజనాలు చేయడం, కష్టసుఖాలు పంచుకోవడం జరుగుతుంది. అందుకే పిల్లలకు సహజీవనం, త్యాగం, ప్రేమ, సేవ మొదలైన గుణాలు అలాగే కార్యవిభజన సక్రమంగా జరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే సమిష్టి కుటుంబంలో కుటుంబ పెద్ద నిర్ణయమే అంతిమ నిర్ణయం అవుతుంది. కాబట్టి పిల్లల స్వేచ్ఛ తగ్గుతుంది. స్వేచ్ఛ తగ్గడం వల్ల పిల్లల వ్యక్తిత్వం, సృజనాత్మక శక్తులు సంపూర్ణంగా వికసించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. వ్యష్టి కుటుంబంలో వివిధ రకాల అనుభవాలు పొందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి వీరిలో సాంఘికీకరణ తక్కువగా ఉంటుంది. వ్యష్టి కుటుంబంలోని పిల్లలకు స్వేచ్ఛ ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

తోబుట్టువుల సంఖ్య కూడా పిల్లల మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఒక సంతానం ఉన్న కుటుంబానికి ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ సంతానం ఉన్న కుటుంబాల పిల్లల మూర్తిమత్వ అభివృద్ధిలో భేదాలు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే ఒకరికంటే ఎక్కువ సంతానం ఉన్నట్టయితే ఆ పిల్లలు ఒకరితో ఒకరు ఆడుకోవడానికీ, పోటీపడటానికీ, కొట్టుకోవడానికీ, సహోదర స్పర్ధకు సహజమైన పరిసరాలు ఉండి మూర్తిమత్వాభివృద్ధిలో ముఖ్యమైన ఉద్వేగ వికాసానికి చక్కటి అవకాశం ఉంది. కాబట్టి ఒక్క సంతానమే ఉన్న ఆటలాడుకొనే అవకాశం తక్కువ, తల్లిదండ్రులు వారి పూర్తి

ఏకాగ్రతను ఆ శిశువుపై ఉంచి ప్రతి చిన్న తప్పును ఎత్తిచూపించే అవకాశం ఉంది. అదే కాకుండా శిశువు ప్రతి విషయంలో జోక్యం చేసుకొనే అవకాశం ఉంది. ఆ జోక్యం చేసుకొనే స్వభావం శిశువును నచ్చకపోవచ్చు.

**శిశువు జన్మక్రమము**(Child birth order)**:**

అన్ని సమాజాలలో శిశువు జన్మక్రమానికి ఆ శిశువు మూర్తిమత్వానికీ అవినాభావ సంబంధం ఉందని అసుబెల్ అభిప్రాయపడ్డాడు.

పిల్లల జన్మక్రమానికి వారి మూర్తిమత్వానికి సంబంధించిన లక్షణాలపై షాక్టెర్, కోచ్, వైల్ & డేవిస్ నిర్వహించిన పరిశోధనా ఫలితాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

1. జ్యేష్ఠులు చాలా అతురత చూపిస్తారు. అతురత కలిగించే సన్నివేశాలలో ఇతరుల మీద ఆధారపడతారు.
2. జ్యేష్ఠులు ఉద్వేగపు ఒడిదుడుకుల నుంచీ, కోపం నుంచీ చాలా ఆలస్యంగా కోలుకుంటారు. మధ్యములు ఇతరుల మాటలు తొందరగా వింటారు. ఎక్కువగా సంఘీభావంతో ఉంటారు.
3. కనిష్ఠులు ఎప్పుడూ కుటుంబంలో తమ వ్యక్తిత్వం నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు.
4. కుటుంబంలో ఏకైక సంతానం, ఆఖరి సంతానం ప్రవర్తన ఇంచుమించు ఒకే విధంగా ఉంటుంది. వాళ్ల మీద అందరూ ఎక్కువగా ఆప్యాయతలు కనబరచడం వల్ల పసివాళ్లలాగే ప్రవర్తిస్తారు.

పిల్లల జన్మక్రమాన్ని అనుసరించి తల్లిదండ్రులు పిల్లలను పెంచడంలో భిన్న పద్ధతులను అవలంభిస్తారు.

**కుటుంబ భాష – భాషణ శైలి:**

ఇంటిలో మాట్లాడే భాషకూడా పిల్లల మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఉపయోగించే భాష మృదువుగా, మధురంగా స్పష్టంగా ఉంటే నలుగురితో మెప్పు పొందుతారు. సాంఘికీకరణకు, ఇతరులతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంలో భాష ముఖ్యపాత్ర వహిస్తుంది.

కుటుంబ సాంఘిక ఆర్థికస్థాయి కూడా పిల్లల మూర్తిమత్వంపై ప్రభావం చూపిస్తాయి. సాంఘికంగా, ఆర్థికంగా, ఉన్నతస్థాయిలో ఉన్న కుటుంబంలోని పిల్లలకు సమాజంలో సులభంగా గుర్తింపు, విస్తృతమైన అనుభవాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ పిల్లలకు ఆత్మ విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో సాంఘిక, ఆర్థిక స్థాయి ఉన్నతంగా ఉండే కుటుంబంలోని పిల్లలకు డబ్బును దుర్వినియోగం చేస్తూ విలాసవంతమైన జీవనానికి అలవాటుపడి, వ్యసనాలకు బానిసలవుతారు.

**ఇరుగు–పొరుగు వారు :**

కుటుంబం తరవాత పిల్లల మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపించేది ఇరుగు–పొరుగు వారే. పిల్లలు పాఠశాలలో చేరక పూర్వం ముఖ్యంగా 2 నుంచీ 5 సంవత్సరాల వారు ఇంటి చుట్టుపక్కల ఉన్న ఇతర పిల్లలతో ఆడుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇలాంటి అవకాశాలు కల్పిస్తే సాంఘికీకరణకు తోడ్పడుతుంది. ఇలా సాంఘికీకరణ చెందినవారు బడిలో తొందరగా మిగతా పిల్లలతో కలవగలుగుతారు. పాఠశాలలో చేరిన తరవాత కూడా చుట్టపక్కల వారితో ఉండే సంబంధాలు పిల్లలలో సహకారభావాన్ని, ప్రేమ, ఆప్యాయతలను, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంలో తోడ్పడతాయి. చుట్టుపక్కల వారు ఉపయోగించే భాష, ఆచార వ్యవహారాలు పిల్లల మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపిస్తాయి.

### సమవయస్కులు :

పిల్లల్లో సమవయస్కుల ప్రభావం చాలా కనపడుతుంది. కౌమారదశలో పిల్లలు తల్లిదండ్రులతో లేదా ఇతర కుటుంబ సభ్యులతో కంటే కూడా ఎక్కువ సమయం సమవయస్కులతో గడిపేందుకు ఇష్టపడతారు. ఒకపిల్లవాని మూర్తిమత్వం అభివృద్ధిలో ఆ పిల్లవాని సమవయస్కుల వలన ఆహార అలవాట్లు, దుస్తుల ధరింపు, క్రమశిక్షణ, ఆటపాటలు, వైఖరులు, విలువలు, అభిరుచులు, విజ్ఞాన సముపార్జన, బాధ్యతలను పంచుకోవడం మొదలైన లక్షణాలు పెరుగుతాయి. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలకు మంచి సమవయస్కులను ఎన్నకోవడానికి తోడ్పడాలి లేదా సమవయస్కుల నుంచి మంచిని మాత్రమే గ్రహించే విధంగా శిక్షణను ఇవ్వాలి.

### పాఠశాల :

మూర్తిమత్వాన్ని అభివృద్ధి చేయడంలో పాఠశాలలు కీలకపాత్రను పోషిస్తాయి. పాఠశాలలు విద్యార్థుల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు, నైతిక విలువలను పెంపొందింపజేస్తాయి. అయితే వీటి అభివృద్ధి అన్ని పాఠశాలల్లో ఒకే విధంగా ఉండకుండా పాఠశాలలు పనిచేసే తీరు, చేపట్టే సహపాఠ్య కార్యక్రమాలను బట్టి ఉంటుంది. పనిచేసే తీరులో ముఖ్యంగా 3 రకాలు ఉన్నాయి. అవి.

1. ప్రజాస్వామిక – ప్రోత్సాహపూరిత పాఠశాలలు
2. అప్రజాస్వామిక – నిరుత్సాహపూరిత పాఠశాలలు
3. నిరంకుశ – దండనాపూరిత పాఠశాలలు

ప్రజాస్వామిక – ప్రోత్సాహపూరిత పాఠశాలలు: ఈ వాతావరణంలో పనిచేసే పాఠశాలల్లో ఉపాధ్యాయులకూ – విద్యార్థులకూ మధ్య సంబంధాలు అలాగే విద్యార్థుల మధ్య సంబంధాలు బాగా ఉంటాయి. పాఠశాలలో చేపట్టే కార్యక్రమాల రూపకల్పనలో, నిర్వహణలో ఉపాధ్యాయుల, విద్యార్థుల పాత్ర గణనీయంగా ఉంటుంది. ఈ పద్ధతిలో విద్యార్థుల అభిప్రాయాలకు విలువ ఉంటుంది. అలాగే వారి సహజ సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొనే వీలుంటుంది. దీనిలో ఉపాధ్యాయుడి మూర్తిమత్వాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొనే వీలుంటుంది. విద్యార్థులు పాఠశాలలకు సంతోషంగా వచ్చి సమైక్య మూర్తిమత్వాన్ని పెంపొందించుకొంటారు.

అప్రజాస్వామిక – నిరుత్సాహపూరిత పాఠశాలలు: ఈ వాతావరణంలో పనిచేసే పాఠశాలలకు పిల్లలుగాని, ఉపాధ్యాయులుగాని సంతోషంగా ఉండరు. విద్యార్థుల అభిప్రాయాలకు విలువ ఉండదు. కాబట్టి విద్యార్థులు బోధనాభ్యసన కార్యక్రమాలలో, పాఠశాల కార్యమ్రాలలో మొక్కుబడిగా పాల్గొంటారు.

నిరంకుశ, దండనాపూరిత పాఠశాలలు: ఈ వాతావరణంలో పనిచేసే పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య, విద్యార్థుల మధ్య సత్సంబంధాలు ఉండవు. ఇక్కడ ఉపాధ్యాయులు ఏది చెబితే అది మాత్రంమే విద్యార్థులు చేయాలి. విద్యార్థుల అభిప్రాయాలకు విలువ ఉండదు. విద్యార్థులు ఉపాధ్యాయులంటే భయపడతారు. దీనిలో విద్యార్థులు భయానికి చదవవలసిందే కానీ ఆసక్తిగా చదవరు. కాబట్టి పిల్లల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం జరిగే అవకాశం ఉండదు.

### ప్రసార మాధ్యమాలు :

శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులవల్ల ప్రసార మాధ్యమాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పూర్వం ప్రసార మాధ్యమాలు పరిమితంగానూ, ప్రసారం చేసే కార్యక్రమాలు తక్కువగానూ, కొద్ది సమయం మాత్రమే ఉండేవి. గతంలో ప్రసారమాధ్యమాలు అందరికీ అందుబాటులో ఉండేవికావు. నేడు చాలా వరకు అవి

అందుబాటులోకి వచ్చాయి. ప్రసారమాధ్యమాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల వల్ల నేడు ప్రపంచమే ఒక గ్రామంగా మారింది. ప్రసార మాధ్యమాల వల్ల ఏ మూల, ఏమి జరిగినా వెనువెంటనే అది ప్రపంచంలోని ప్రతిఒక్కరు తెలుసుకొనే వీలుకలిగింది. నేడు చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకూ ప్రసారమాధ్యమాలు జీవితంలో అంతర్భాగంగా మారిపోయాయి. ప్రసారమాధ్యమాలు రేడియో, టి.వి., సినిమాలు, వార్తపత్రికలు, దినపత్రికలు, సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్ మొదలైనవి. ప్రతి ఒక్కరి జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రసార మాధ్యమాల గురించి ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచగమనాన్ని నిర్దేశించే వాటిలో ప్రసారమాధ్యమాలు ముఖ్యమైనవి.

ప్రసారమాధ్యమాల ప్రభావం వ్యక్తుల పాదాలకు వేసుకొనే పాదరక్షల నుంచీ వేసుకొనే దుస్తులు, పెట్టుకొనే గడియారాలు, ఆభరణాలూ, అలంకారసామాగ్రి, జుట్టు కత్తిరించుకోవడం, అలాగే ఆహార అవాట్లు, ఉపయోగించే భాష, మాట్లాడే తీరు, విలువలు పెంపొందించుకోవడంలో, ఆసక్తులను  అభివృద్ధి చేసుకోవడంలో, వైఖరులలో, విజ్ఞానసముపార్జన వరకు అన్ని అంశాలలో ఉంది.

ప్రసారమాధ్యమాల ప్రభావం వల్ల పిల్లల ప్రవర్తనపై అనుకూలంగా లేదా ప్రతికూలంగా ఉండవచ్చు.

ప్రపంచంలో ఏ మారుమూల ఏమి జరిగింది తెలుసుకొనే అవకాశం నేడు ఉంది. విద్యార్థులు ప్రపంచంలో జరిగే సంఘటనలలోని మంచి వాటితో ప్రేరణను, స్ఫూర్తిని పొంది అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. విద్యార్జనలో విద్యార్థులు కేవలం ఉపాధ్యాయుడిపైన, పాఠ్యపుస్తకాలపై ఆధారపడటం కాకుండా టి.వి, రేడియో పాఠ్యాంశాలతో అలాగే ఇంటర్‌నెట్ ద్వారా లాభపడవచ్చు. మంచి సినిమాలను చూడటం ద్వారా కూడా మూర్తిమత్వాన్ని అభివృద్ధి పరచుకోవచ్చు.

పప్రసారమాధ్యమాలతో ఎంతో లాభం ఉన్నప్పటికీ పిల్లలు టి.విలలో నిరంతరంగా వచ్చే కార్యక్రమాలను చూసుకొంటూ చదువును నిర్లక్ష్యం చేయడం, అలాగే గంటల కొద్దీ ఇంటర్‌నెట్ ముందు కూర్చొని అశ్లీల దృశ్యాలను చూడటం, ఆటలాడటం ద్వారా చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారు. అంతేకాక జీవనానికి అవసరమైన జీవన నైపుణ్యాలను నేర్చుకొనే దశలో సమయం వృథా చేయడం వల్ల బతకడానికి కావలసిన నైపుణ్యాలను సంపాదించుకోలేక పోతున్నారు. పిల్లలు ప్రసారమాధ్యమాలను సద్వినియోగం చేసుకోవడానికి తల్లిదండ్రులూ అదేవిధంగా పాఠశాలలూ తగిన సూచనలనూ సలహాలనూ ఇవ్వాలి.

పిల్లలు నివసించే పరిసరాలలోని పరిస్థిస్త్రలు, జీవరాశులు, పరిసరాలలోని మనుష్యుల ఆచారాలు, వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, నివసించే పద్ధతులు, వ్యక్తి మూర్తిమత్వ వికాసంపై ప్రభావం చూపుతాయి. పిల్లలు పెరిగే సమాజంలోని సంస్కృతి, పిల్లల భాష, వేషధారణ, అలవాట్లు, వైఖరులు, నమ్మకాలు, అభిరుచులు, నడవడి అన్నింటిని ప్రభావితం చేస్తుంది. సమాజంలోని మతాలు, రాజకీయపార్టీలు, వారి సిద్దాంతాలు, రాజకీయ నాయకులు, సాంఘిక సేవాసంస్థలు, కవులు–వారి రచనలు,పత్రికలు, టి.విచానల్స్, రేడియో కార్యక్రమాలు, సినిమాలు మొదలైనవి కూడా పిల్లల మూర్తిమత్వ లక్షణాలు ఏర్పడటానికి దోహదం చేస్తాయి.

## మూర్తిమత్వ సిద్ధాంతాలు

ఇవి మూడు రకాలు 1) రూప ఉపగమ సిద్ధాంతాలు

2) లక్షణాంశ ఉపగమ సిద్ధాంతాలు

3) నిర్మితి సిద్ధాంతాలు

### 1. రూప ఉపగమ సిద్ధాంతాలు:

వ్యక్తి రూపురేఖలననుసరించి మూర్తిమత్వాన్ని వివరిస్తారు. వీటిని వివరించిన వారిలో ముఖ్యులు.

ఎ) హిప్పోక్రటీస్ - గ్రీకు

బి) క్రెష్మర్ - జర్మనీ

సి) షెల్డన్ - యుఎస్ఎ

డి) యూంగ్ - స్విట్జర్లాండ్

ఇ) స్ప్రాంగర్ - జర్మనీ

### మూర్తిమత్వ లక్షణాంశ ఉపగమ సిద్ధాంతాలు:

- వ్యక్తిలోని లక్షణాలను ఆధారంగా చేసుకొని మూర్తిమత్వాన్ని వివరించిన సిద్ధాంతాలు.
- ఒక వ్యక్తిలో దాదాపు శాశ్వతంగా ఉండే గుణాన్ని లక్షణాంశం అంటారు.

ఉదా:- వదరుబోతు, మౌనస్వభావి, నిష్కపటి, సాహసి, కలుపుగోలు, చిరాకు స్వభావి, చంచల స్వభావి, ఆశావాది, శాంత స్వభావి, చతురత, మంచి స్వభావం మొదలైనవి.

ఆల్పోర్ట్ , కేటిల్ మరియు ఐసెంక్‌లు ఈ సిద్ధాంతానికి సంబంధించినవారు

### నిర్మితి సిద్ధాంతాలు:

- వ్యక్తి ఒక సమగ్ర నిర్మితి, వ్యక్తి యొక్క సమగ్ర రూపాన్ని అతని ప్రవర్తనాంశాలను వివరించే మూడవ ఉపగమం నిర్మితి సిద్ధాంతాలు
- నిర్మితి సిద్ధాంతాలలో చాలా ముఖ్యమైన సిద్ధాంతాలు.

1) మనో విశ్లేషణ సిద్ధాంతం - సిగ్మండ్ ఫ్రాయిడ్

2) మనో సాంఘిక వికాస సిద్ధాంతం - ఎరిక్ ఎరిక్సన్

- **సిగ్మండ్ ఫ్రాయిడ్:**

మనో విశ్లేషణ మూర్తిమత్వ సిద్ధాంతములో మూడు ముఖ్యమైన విభాగాలు ఉన్నాయి.

1) మూర్తిమత్వ నిర్మాణము (అచిత్తు, అహం, అధ్యహం)

2) మూర్తిమత్వ గతిశీలత (చేతనం, ఉపచేతనం, అచేతనం)

3) మనోలైంగిక వికాసం (మౌఖిక, ఆసన, శిశ్న, గుప్త, జననాంగ దశలు)

**ఎరిక్‌సన్ సిద్ధాంతము:**

మనో సాంఘిక వికాస సిద్ధాంతములో 8 దశలు, 8 క్లిష్టపరిస్థితులు ఉన్నాయి.

**మనో విశ్లేషణ సిద్ధాంతము:**

సిగ్మండ్ ఫ్రాయిడ్

- ఆస్ట్రియా దేశస్థుడు, మనోవిశ్లేషణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.
- మనో విశ్లేషణ సిద్ధాంతము మూర్తిమత్వాన్ని వివరించే ఒక సిద్ధాంతమే కాకుండా మా ప్రవర్తనను వివరించేవాదము మరియు మానసిక వ్యాధులకు చికిత్స చేసే ఒక పద్ధతి కూడా.
- మనో విశ్లేషణ సిద్ధాంతములో 3 ప్రధాన అంశాలు ఉన్నాయి. అవి

    1) మూర్తిమత్వ నిర్మాణము

    2) మూర్తిమత్వ గతిశీలత

    3) మూర్తిమత్వ మనోలైంగిక వికాసం

**1) మూర్తిమత్వ నిర్మాణము:** మూర్తిమత్వ నిర్మాణంలో 3 ఉప అంశాలున్నాయి. అవి

**ఎ) అచిత్తు (ID):**

- జీవ సంబంధమైనది.
- వంశపారంపర్యం, మొరటుది, వినాశకారి, జంతు స్వభావం కలది, అహంకారి
- అచిత్తు కలగాపులగంగా ఉండే తన కోరికలను వెంటనే తీర్చుకోవాలని అనుకుంటుంది. అయితే తన కోరికలు తాను తీర్చుకోలేదు.
- తన కోర్కెలు తీర్చుకోలేనపుడు కుంఠనాలు ఏర్పడి మానసిక ప్రతిమలను ఏర్పరచుకొని తన కోర్కెలను తీర్చుకుంటుంది. దీనినే ఇష్టశుద్ధి అని అంటారు.
- అంటే అచిత్తు ప్రాథమిక చింతన ప్రక్రియ ద్వారా పని చేస్తుంది.
- అచిత్తు ఆనంద సూత్రం ప్రకారం పని చేస్తుంది. ఇది జీవసంబంధమైనది.

**బి) అహం:**

- అనుభవాలు ద్వారా శిక్షణ ద్వారా అచిత్తులోని కొంత భాగం అహంగా మారుతుంది. దీనికి పరిసరాలతో సంబంధం ఉంటుంది. వాస్తవిక సూత్రం ఆధారంగా పని చేస్తుంది.
- గౌణ ప్రక్రియ చింతనం ద్వారా పని చేస్తుంది.
- ఇది కార్య నిర్వహకుడుగా పని చేస్తుంది. ఇది పరిసర సంబంధమైనది.

**సి) అధ్యహం:**

- ఇది వ్యక్తి అంతరాత్మ.
- గురువులు, తల్లిదండ్రులు, మంచి స్నేహితుల వల్ల వికసించే భాగం.
- పర్యవేక్షకుడు, నీతి బోధకుడు.
- నియమానుసారంగా ప్రవర్తించేది.
- సంస్కృతిని పరిరక్షించేది.
- ఆదర్శ సూత్రం ప్రకారం పని చేస్తుంది. సంస్కృతి సంబంధమైనది.

**మూర్తి మత్వ గతిశీలతలు:** ఇందులో 3 ఉపఅంశాలున్నాయి. అవి

**ఎ) చేతనం:** వ్యక్తి చైతన్యవంతుడిగా ఉన్నప్పుడు తన జ్ఞానేంద్రియాల ద్వారా స్వీకరించే అనుభవాలన్నింటిని చేతనం అంటారు.

**బి) ఉపచేతనం:** ఇది మనసులోని కొంచెం లోతైన భాగం. అచేతన అనుభవాలను, దాచుకుంటుంది. అవసరమున్నపుడల్లా తన అనుభవాలను గుర్తుకు తెచ్చుకొనేందుకు ఉపయోగపడే భాగమే ఉపచేతనం.

**సి) అచేతనం:** మనసులోని అతిలోతైన భాగం. వ్యక్తి యొక్క అనుభవాలు ఏవైతే అవమానాన్ని, సంఘర్షణలను, మానసిక ఒత్తిడిని కలిగిస్తాయో మరియు సాధించలేని వాంఛలు, కోరికలు, చిన్ననాటి చేదు అనుభవాలు మనస్సులోని అచేతనం లోనికి నెట్టి వేయబడతాయి. ఇందులోని విషయాలు అవసరమున్న, ఎంత ప్రయత్నించినా గుర్తుకురావు.

## మనో లైంగిక వికాస దశలు:

- పుట్టినప్పుడే శిశువులో కొంత మోతాదులో లైంగిక శక్తి ఉంటుంది. దీనినే లిబిడో అంటారు.
- లిబిడో మనోలైంగిక దశల గుండా క్రమంగా శరీరంలోని కొన్ని కేంద్రముల ద్వారా అభివ్యక్తమవుతూ లైంగిక సహజాతాన్ని తృప్తి పర్చుకుంటుంది.
- ఒక్కొక్క దశలో శరీరంలోని ఒక్కొక్క కేంద్రము కామోద్దీపన కేంద్రంగా పని చేస్తుంది.

### 1) మౌఖిక దశ: ఒక సంవత్సరం - నోరు కామోద్దీపన కేంద్రం.

- ఈ దశ ముఖ్య లక్షణం శైశవ కాముకత.
- కార్ల్ అబ్రహం ఈ దశను రెండు ఉప దశలుగా విభజించారు.

ఎ) **మౌఖిక నిష్క్రియాత్మక దశ:** తల్లి శరీర అవయవాలని శిశువు తన అవయవాలుగా భావించే దశ.

బి) **మౌఖిక దౌర్జన్యదశ:** తల్లి శరీర అవయవాలు తనవి కావని శిశువు చిలిపి చేష్టలు చేసే దశ.

- ఈ దశలో స్థిరీభవనం చెందడం వలన ధనదాహం, అధికార దాహం, ప్రేమ దాహం, నిరాశావాదులు, వివాద స్వభావులు ద్వేషభావం కలగడం, గోళ్ళు కొరకడం, పండ్లు కొరకడం, అతిగా తినడం, అన్ని అతిగా ప్రదర్శిస్తారు.

### 2) ఆసన దశ: 2 - 3 సం॥ పాయువు కామోద్దీపన కేంద్రం

- కార్ల్ అబ్రహం ఈ దశను 2 ఉపదశలుగా విభజించారు.

**ఎ) ఆసన బహిష్కరణ దశ:** ఇక్కడ శిశువు మలమూత్ర విసర్జనాలను ఎక్కువగా చేసి సంతృప్తి చెందుతాడు.

**బి) ఆసన ధారణ దశ:** మలమూత్ర విసర్జనలు చేయక సంతృప్తి చెందుతాడు.

ఈ దశలో స్థిరీభవనము చెందడం వలన ఉదార స్వభావులు, దానధర్మాలు చేసే వారు గాను, ప్రేమానురాగాలు అందించేవారు గాను, సహాయకారిగాను లేదా మొండివారిగాను, కాలాన్నిక్రమాన్ని పాటించని వ్యక్తులుగా, స్వార్థపరులుగాను, పిసినార్లుగాను తయారవుతారు.

**3) శిశ్నదశ:** 3–5 సం॥ జననేంద్రియ అవయవాలు కామోద్దీపన కేంద్రం.

ఈ దశలో ఎడిపస్ కాంప్లెక్స్, ఎలక్ట్రా కాంప్లెక్స్ అనే భావనలు ఏర్పడును.

**ఎ) ఎడిపస్ కాంప్లెక్స్:** అబ్బాయిలు తల్లిప్రేమానురాగాలు పొందడం. ఈదశలో వీరికి తండ్రి ప్రత్యర్థి.

**బి) ఎలక్ట్రా కాంప్లెక్స్:** అమ్మాయిలు తండ్రిప్రేమానురాగాలు పొందడం. ఈ దశలో తల్లి వీరికి ప్రత్యర్థి.

- ఈ దశలో అహం ఏర్పడుతుంది.
- ఈ దశలోనే ప్రేమ, ఈర్ష్యల మధ్య సంఘర్షణలు మొదలవుతాయి.

**4) గుప్తదశ:**

- యవ్వనారంభం, పూర్వ కౌమారదశలో ఉంటుంది.
- ఈ దశలో తాదాత్మీకరణము మరియు అంతరీకరణం అనే ప్రక్రియ వల్ల ఏర్పడును.

  ఈ దశలోనే అధ్యహం బాగా అభివృద్ధి చెందుతుంది.

**5) జననాంగ దశ:**

- ఉత్తర కౌమారం, తొలి వయోజన దశ (11 సంవత్సరాల పైన)
- ఈ దశలో మొదట్లో ఆడ, మగ పిల్లలు కలిసిమెలసి ఆడుకుంటారు.

కాలక్రమేణ సజాతి లింగాకర్షణ ఏర్పడుతుంది. తరువాత విజాతి లింగాకర్షణ ఏర్పడుతుంది.

## రక్షక తంత్రాలు

సంఘర్షణలు – కుంఠనాలు – ఒత్తిడి – మనో వ్యాకులత – విషమయోజనం – మానసిక రుగ్మత.

- ఈ పదాన్ని మొదట ఉపయోగించిన వారు – ఫ్రాయిడ్.
- సంఘర్షణల వల్ల కుంఠనాలు ఏర్పడతాయి. కుంఠనాల వల్ల ఒత్తిడి, ఒత్తిడి వల్ల మనో వ్యాకులత ఏర్పడుతుంది.
- కుంఠనాల వల్ల ఏర్పడ్డ మనో వ్యాకులతను తగ్గించుకొనేందుకు వ్యక్తి ఉపయోగించే చేతన, అచేతన ప్రక్రియలను రక్షక తంత్రాలు అంటారు.

  (లేదా)

  వ్యక్తి ఉద్రిక్త పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగించే అచేతన ప్రక్రియలు.
- ఇవి మూర్తిమత్వం చిన్నాభిన్నం కాకుండా కాపాడుతాయి.
- వ్యక్తి అహాన్ని పరిరక్షిస్తాయి. కాని ఇందులో ఆత్మ వంచన భావన దాగి ఉన్నది.

## 1. ప్రేరక తారుమారు:

తనలోని ప్రేరకాలకు వ్యతిరేకమైన ప్రేరకాలను ఊహించుకొని ఉపశమనం పొందడం.

- ఉపాధ్యాయుడు దండించిన తరువాత విద్యార్థిని పిలిచి నీవు బాధపడుతున్నావా? అంటే లోపల బాధగా ఉన్నా పైకి లేదు అని చెప్పడం.

## 2. దమనం:

బాధాకరమైన విషయాలను, అపజయాలను, అవమానకరమైన అనుభవాలను, బలవంతంగా మరచిపోవటానికి చేసే ప్రయత్నం.

- ప్రాథమిక రక్షక తంత్రం.
- మిగిలిన రక్షక తంత్రాలకు ఆధారం.
- దీనినే ప్రేరేపిత విస్మృతి అంటారు.
- మానసిక నాడీ రుగ్మతలు కలిగిన వ్యక్తులు దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు.

**ఉదా:** బ్యాంక్ బ్యాలెన్స్ తగ్గిపోతుందని అప్పులను మరిచి పోవడం.

## 3. ప్రక్షేపణం:

వ్యక్తి తన లోపాలను తీరని కోర్కెలను అసంతృప్తి భావాలను ఇతర వ్యక్తులకు గానీ, వస్తువులకు గానీ ఆపాదించడం. తన తప్పులు, అపజయాలకు ఇతరులను బాధ్యులుగా చేయటం.

- ఇతరుల తప్పులను భూతద్దంలో చూపించడంలాంటిది.
- దమనం తరువాత ఎక్కువగా ఉపయోగించే రక్షక తంత్రం.
- అడలేక మద్దెల ఓడు వంటిది.

**ఉదా:** 1) అవినీతి పరుడికి ప్రపంచమంతా అవినీతి మయంగా కనబడడం.

2) పరీక్ష ఫెయిల్ అయిన విద్యార్థి ఫెయిల్ అవడానికి అధ్యాపకులే కారణం అని చెప్పడం.

3) పరీక్ష పత్రం తప్పులు తడకలుగా ఉన్నదని అనడం.

4) ఆకర్షణలేని ఒక యువతి, పురుషుడు తన వెంట పడుతున్నాడని అనడం.

## 4. హేతుకీకరణం:

లక్ష్య సాధనలో విఫలమయిన వ్యక్తి తన చర్యను సహేతుకంగా సమర్థించుకోవడం.

**ఉదా:**

1) పరీక్ష తప్పిన విద్యార్థి పాస్ కావడం వలన లాభం లేదు అనడం.
2) మంత్రి పదవి దక్కని డాక్టర్ ఎమ్మెల్యే, రోగులే దైవాలుగా భావించాను, వారికి సేవ చేయడానికే నాకు సమయం లేదు అని చెప్పడం.
3) డేటింగ్‌కు తిరస్కరించిన తన క్లాస్‌మేట్‌ను ఆమె అంత అందగత్తె కాదులే అని సమర్థించుకోవడం.

4) అందని ద్రాక్ష పుల్లన.

5) తీయని నిమ్మపండు

**5. విస్తాపనం:** కోరికలను లేదా ధ్యేయాన్ని అంగీకరిస్తాడు కానీ గమ్యాన్ని మారుస్తాడు.

**ఉదా:** 1) అత్త మీది కోపం దుత్త మీద చూపించడం లాంటిది.

2) ఎదురింటావిడ మీది కోపాన్ని పిల్లల మీద చూపించడం.

3) నాయకుడి మీద కోపాన్ని ప్రతినాయకుడు విలన్ల మీద చూపించడం.

4) ఆఫీసర్ మీద కోపాన్ని గుమస్తా తన భార్య మీద చూపించడం.

**6. ప్రతి గమనం:**

పూర్వపు స్థితిని పొందడాన్ని ప్రతిగమనం అంటారు. పెద్దల వలె ఆలోచించి సమస్యా పరిష్కారం కానప్పుడు పిల్లలవలె ప్రవర్తించడం.

**ఉదా:** 1) ఉద్యోగాన్ని కోల్పోయిన వ్యక్తి పిల్లల్ని పట్టుకొని ఏడ్వడం.

2) పదే పదే పుట్టింటికి వెళ్ళే నూతన వధువు.

3) రాత్రి పూట పక్కతడిపే యువకుడు.

4) రోడ్డు మీద వేగంగా వాహనాన్ని నడపడం.

**7. తాదాత్మీకరణము:**

ఒక వ్యక్తి ఇతరులలో కలిగిన అభిలషణీయమైన లక్షణాలను తన మూర్తిమత్వంలో చేర్చుకోవడం.

(లేదా)

వ్యక్తి తను సాధించలేనివి ఇతరులు సాధించినపుడు తానే సాధించినట్లు అనుభూతి పొందడం.

**ఉదా:** 1) తాను ఓడిన తన మిత్రుడు గెలిచాడన్న అనుభూతిని పొందడం.

2) కండక్టర్ కొడుకు కలెక్టరు అయినపుడు కండక్టరు యొక్క అనుభూతి తాదాత్మీకరణం.

**8. పరిహారము:**

ఒక వ్యక్తి ఒక రంగంలో రాణించనపుడు మరో రంగంలో రాణించడం. (ప్రత్యామ్నాయం ఎన్నుకోవడం.)

**ఉదా:** 1) చదువుపట్ల ఆసక్తిలేని రమణ మహర్షి గొప్ప తాత్వికుడుగా మారడం.

2) నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు పిల్లలకు చదువు చెప్పించడం.

3) చదువులో వెనుకబడిన విద్యార్థి ఆటలలో ప్రతిభ చూపించడం.

4) పిల్లలు లేని మహిళ ఒక కాన్వెంట్‌లో టీచర్‌గా చేరడం.

5) అవిటి తనంతో బాధపడే హెల్లెన్ కెల్లర్ గొప్ప సంఘ సేవకురాలిగా, కవయిత్రిగా రాణించడం.

**9. స్వైరకల్పనం:**

పగటి కలలు కనడం. తీరని కోరికలను కలలలో సంతృప్తి చెందడం.

**11. నిరాకరించుట:**

సహించలేని వాస్తవాన్ని నిజం కాదని త్రోసివేసి తాత్కాలిక ఉపశమనం పొందడం.

**ఉదా:** భార్య మరణ వార్త విన్న భర్త అది నిజం కాదని తోసి వేయడం.

**12. ఉపసంహరణ:**

వ్యక్తి తనకు సంబంధించని పరిస్థితులకు దూరంగా ఉండటం.

**ఉదా:** పేరంటాలకు వెళ్ళే మహిళలు అక్కడ అవమానం జరుగుతుందని పేరంటాలకు పోకపోవడం.

**13) ఉదాత్తీకరణం:**

ఉద్వేగాత్మకమైన / ఉద్వేగపూరితమైన ఆలోచనలను, నిర్మాణాత్మక క్రియలలో కేంద్రీకరించడం.

**ఉదా:** ప్రేయసిపై కవితలు రాసే ప్రేమికుడు గొప్ప కవిగాను, గొప్ప చిత్రకారుడుగాను మారడం. జక్కన్న, అన్నమయ్య మరియు తులసీదాస్ మొదలైనవారు.

**విద్యా విషయ ప్రాముఖ్యత:**

- శారీరక శిక్ష అనే భావనను తుడిచిపెట్టి ప్రేమ, కరుణ, దయ, ఆప్యాయతలు పిల్లలపై చూపించాలని వీరి భావన.
- దౌర్జన్య శీలతలు, లైంగిక వాంఛలు, సహజ సిద్ధమేనని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు వీటిని సక్రమంగా తీసుకొని రావాలని నొక్కి చెప్పాడు.
- ఫ్రాయిడ్ శైశవ దశ, బాల్య దశలకు అధిక ప్రాముఖ్యతను ఇచ్చాడు.

**మనో సాంఘిక వికాస సిద్ధాంతం:** ఎరిక్ ఎరిక్సన్ (జర్మనీ)

- వ్యక్తి అహం సాంఘిక పరిస్థితులతో జరిగే చర్యఫలితంగా అతనిలో వ్యక్తిత్వం ఏర్పడుతుంది అని ఈయన భావన.
- వ్యక్తి అహం, సృజనాత్మకమైనదని ఇది 8 వికాస దశల గుండా ప్రయాణిస్తుందని ఒక్కొక వికాసదశలో ఒక మనో సాంఘిక క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటుందని, ఈ ఎదుర్కోవడంలో వ్యక్తి అహం సఫలం కావచ్చు లేదా విఫలం కావచ్చు అని పేర్కొన్నాడు.
- ఈ సఫలత, విఫలత వలనే అతని వ్యక్తిత్వం రూపొందించబడుతుంది.

| | | | |
|---|---|---|---|
| 1. పూర్వశైశవం: | 1 సంవత్సరం | జైవిక కార్యక్రమములు | నమ్మకం–అపనమ్మకం |
| 2. ఉత్తర శైశవం: | 2–3 సం॥ | స్వయం పోషక కౌశలములు | స్వయం ప్రతిపత్తి – సందేహం |
| 3. క్రీడా దశ: | 3–5 సం॥ | శారీరక క్రీడలు, మానసిక క్రీడలు, సాంఘిక పనులు చేయడానికి | చొరవ చూపడం – తప్పు చేశానన్న భావన |
| 4. పాఠశాల దశ: | 6–10, 11 సం॥ | పాఠశాల నైపుణ్యాలు, చేతిపనులు | శ్రమించడం – న్యూనతా భావం |
| 5. కౌమార దశ: | 12–20 సం॥ | వ్యక్తిగా గుర్తింపు పొందడానికి ప్రయత్నిస్తాడు. (యవ్వనారంభ దశ) | పాత్ర గుర్తింపు – పాత్ర సందిగ్ధం |

6. పూర్వ 20-30 సం॥ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం (వ్యక్తి పూజ దశ) సన్నిహితం - ఏకాంతం

- తన ఆలోచనలకు, తన భావనలకు, తన సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యక్తులతో సంబంధాలను ఏర్పరచుకొని పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

---

7. మధ్యవయోజన దశ: 30-60 సం॥ ఉత్పాదకత - స్తబ్ధత.

- వీరి వల్ల సమాజంలో విలువలు పెరుగుతాయి. నూతన విలువలు ఉద్భవిస్తాయి. సమాజం వికసిస్తుంది.

---

8. పరిపక్వ దశ: 60 సం॥ పైన సమర్థత / సమగ్రత - నిరాశ

క్రింది తరాల వారికి తమ ఆదర్శాలను తెలుపుతూ అహాన్ని సంతృప్తి చేసుకొంటాడు.

---

## మూర్తిమత్వ మాపనాలు

- అప్రక్షేపక
  - వ్యక్తిగత
    - ఎ) వ్యక్తిచరిత్ర అధ్యయనం
    - బి) పరిపృచ్ఛ
    - సి) ప్రశ్నావళి
    - డి) స్వీయ చరిత్ర
  - విషయనిష్ట
    - ఎ) నిర్ధారణ మాపనులు
    - బి) శోధన సూచికలు
    - సి) మర్తిమత్వ శోధికలు
    - డి) సన్నివేశ పరీక్షలు (స్థితి పరీక్షలు)
    - ఇ) పరిశీలనా పద్ధతి
    - ఎఫ్) సంఘటన రచనా పద్ధతి
    - జి) జీవిత చరిత్రలు
    - హెచ్) సాంఘిక మితి
- ప్రక్షేపక
  - చిత్రాలను ఉపయోగించేవి (వాఖ్యానాత్మకాలు)
    - అ) సిరామరకల పరీక్ష
    - ఆ) ఇతివృత్తగ్రాహ్యక నికష
    - ఇ) చిల్డ్రన్స్ అప్పర్ సెషన్ టెస్ట్
  - భాషను ఉపయోగించేవి (అభివ్యంజకాలు)
    - అ) పద సంసర్గ పరీక్ష
    - ఆ) వాక్య పూరణ పరీక్ష
    - ఇ) కథాపూరణ పరీక్ష
    - ఈ) చిత్ర క్రమీకరణ పరీక్ష

**నిర్ధారణ మాపనులు:**

- ఒక వ్యక్తిని గురించి తెలుసుకోవడానికి గాని, అతడు ఇతరులను ఏమేరకు ప్రభావితం చేశాడని తెలుసుకోవడానికి గాని, అతనిని ఇతరులు ఎలా నిర్ధారణ చేశారని తెలుసుకోవడానికి ఉపయోగపడే సాధనం.
- నిర్ధారణ మాపనం ద్వారా బాహ్య వర్తనులను సులభంగా అంచనా వేయవచ్చు. కాని అంతర్వర్తనులను అంచనా వేయడం కష్టం.
- నిర్ధారణ మాపనంలో ప్రయోక్తలు ప్రయోజ్యునికి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉండవలెను.
- ఒక వ్యక్తిలోని లక్షణాంశాల స్థాయిని తెలుసుకోవడానికి అనువైన పనులు.

- నాయకత్వం, సహకారం, భావోద్రేక సమతుల్యత, నమ్మకం వంటి లక్షణాంశాలను అంచనా వేస్తారు.
- నిర్ధారణ మాపనిలో ముఖ్యమైన అంశాలు

  ఎ) లక్షణాంశాన్ని స్పష్టంగా నిర్వచించవలెను.

  బి) లక్షణాంశాలు స్థాయిని పేర్కొనవలెను.

**నిర్ధారణ మాపనిలోని దోషాలు:**

- **హాలో ప్రభావం (పరివేష్ఠిత ప్రభావం):** పూర్వం ఏర్పడిన అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యక్తిలోని లక్షణాంశాలను అంచనా వేయడం.
- **ఔదార్య దోషం:** ఒక లక్షణాంశాన్ని ఎక్కువస్థాయిలో గుర్తించడం.
- **కేంద్రీయ స్వభాష దోషం:** లక్షణాలు నిర్ణయించేటప్పుడు అధిక నిమ్న స్థాయిలకు ప్రాముఖ్యతను ఇవ్వకుండా మధ్యస్థ స్థాయికి గుర్తించడం.

**వాడుకలో ఉన్న నిర్ధారణ మాపనులు:**

- హాగర్టీ అల్సన్, విట్‌మన్ రేటింగ్ స్కేలు (నర్సరీ నుండి హైస్కూల్ స్థాయి వరకు) నర్సరీ – హైస్కూల్ విద్యార్థుల ప్రవర్తనా సమస్యలు, ప్రవర్తనా స్వభావం కొరకు
- ది విని లాండ్ సోషియల్ మెచ్యూరిటీ స్కేలు:–

  నవజాత శిశువు – 30 సం॥ వరకు

  కాలక్రమేణ పరిపక్వతలో వచ్చే మార్పులను గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడేది.

  స్టాన్‌ఫర్డ్ బినే ప్రజ్ఞామాపని వలె ప్రామాణికరించబడినది. నిర్ధారణ మాపనులు అన్నింటి కంటే శ్రేష్ఠమైనది.
- ది ఫేల్స్ పేరంట్ బిహేవియరల్ స్కేలు:

  పిల్లల పట్ల తల్లిదండ్రుల ప్రవర్తన.
- విటన్ బర్నెస్ సైక్రియాట్రిక్ రేటింగ్ స్కేలు:

  మానసిక రోగులకు ఉద్దేశించబడినది.

**మూర్తిమత్వ శోధికలు:**

- ఒక వ్యక్తి గురించి ఇతరులు అంచనా వేసేవి నిర్ధారణ మాపనులు.
- ఒక వ్యక్తి లక్షణాంశాలను తనంతట తానే అంచనా వేసుకోవడం మూర్తిమత్వ శోధికలోని ముఖ్యాంశము.
- మూర్తిమత్వ శోధికలు ప్రశ్నావళి రూపంలో గాని, శోధన సూచికల రూపంలోగాని ఉంటాయి.
- శోధిన సూచికలు ఒక వ్యక్తిలో లక్షణాంశం ఉన్నదా? లేదా? అని తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు.
- ప్రశ్నావళుల ద్వారా ఏ రకమైన సమాచారామైనా సేకరించవచ్చు కానీ, మూర్తిమత్వ శోధికలు మూర్తిమత్వాన్ని మాత్రమే అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.

### బెల్ అనుగుణ్యత శోధిక:

- ఈ ప్రశ్నలను 5 అంశాల క్రింద విభజించి మూర్తిమత్వాన్ని అంచనా వేస్తారు.

  అవి 1) గృహ సర్దుబాటు 2) ఆరోగ్య సర్దుబాటు 3) ఉద్వేగ సర్దుబాటు

  4) వృత్తి సర్దుబాటు 5) సాంఘిక సర్దుబాటు

### మిన్నెసోటా మల్టి ఫేసిక్ పర్సనాలిటీ ఇన్వెంటరీ: (MMPI)

- దీనిని హతావే, మెకన్లీ కనుగొన్నారు.
- దీనిలో 550 ప్రశ్నలు ఉంటాయి.

**1)** **డిప్రెషన్:** నిరుపయోగమైన ఆలోచనలు, నిరాశావాదం, నిరుత్సాహం.

**2)** **హైపోకాండ్రియాసిస్ (అకారణ శరీర దుశ్చింత):** ఆరోగ్యాన్ని గురించి, శరీరాన్ని గురించి అనవసరంగా అదుర్దా చెందడం.

**3)** **హిస్టీరియా:** శరీర సంబంధం కాని శిరోభారం.

**4)** **హైపోమానియా (అల్పోన్మాదం):** అధికంగా ఉద్రేకపడడం.

**5)** **సైకోస్తీనియా:** అర్థరహితమైన పనులు పదే పదే ధృఢంగా చేయడం.

**6)** **పెరినాయియా (చిత్రభ్రమ):** అధిక అనుమానాలు, ఔన్నత్య విభ్రమణం.

**7)** **సైకోపథిక్ డీవియేషన్స్ (సైకోపథిక్ విచలనం):** సంఘవ్యతిరేఖమైన ఆలోచనలు.

**8)** **స్త్రీ తత్వ, పురుషత్వ అభిరుచి:** స్త్రీ పురుషులలో భావోద్రేక వ్యక్తీకరణ.

**9)** **స్కిజోఫ్రినియా:** స్కిజో – గ్రీకు పదం. మనస్సు చిన్నాభిన్నం కావడం, ఆధారం లేని ఊహలు.

**10)** **సోషియల్ డిస్పెటన్స్ (సాంఘిక అంతర్వర్థనం):** సంఘానికి దూరంగా ఉంటారు.

### ప్రక్షేపణ పరీక్షలు:

### 1. సిరా మరకల పరీక్ష:

- హెర్మన్ రోషాక్ (స్విట్జర్లాండ్)
- ప్రక్షేపణం అనే పదాన్ని మొదటగా ప్రతిపాదించినది ఫ్రాయిడ్.
- ప్రక్షేపణ పరీక్షలను మూర్తిమత్వాన్ని అంచనావేయడానికి ఉపయోగించిన వారు ఫ్రాంక్
- వ్యక్తి తనకు తెలియకుండానే తనలోని లక్షణాంశాలను, అవసరాలను, ఘర్షణలను ఇతర వ్యక్తులకు గానీ, ఇతర వస్తువులకు గానీ ఆపాదించడాన్ని ప్రక్షేపణం అంటారు.
- వ్యక్తి అంతర్గత లక్షణాంశాలను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.
- దీనిలో ప్రయోజ్యుడు ఒక అస్పష్టమైన ఉద్దీపనలకు తనకు తెలియకుండానే ప్రతిస్పందిస్తాడు.
- ఈ ప్రతిస్పందనల ఆధారంగా మూర్తిమత్వాన్ని అంచనా వేస్తారు.

- ఇది వయోజనులకు ఉద్దేశించబడింది.
- దీనిలో 10 కార్డులుంటాయి.

  5 – తెలుపు, నలుపు

  2 – నలుపు, ఎరుపు

  3 – పంచ వర్ణాలు
- కార్డులను ఒక దాని తరువాత ఒకటి ఇస్తారు.
- దీనిని నిర్వహించడానికి నిర్దిష్టమైన సమయం లేదు.  కానీ తీసుకొన్న సమయాన్ని నమోదు చేస్తారు.
- కార్డులను ఏ కోణం నుంచైనా పరిశీలించవచ్చు.
- దీనిలో మూర్తిమత్వాన్ని అంచనా వేయడానికి క్రింది విషయాలు తోడ్పడతాయి.

**ఎ) స్థానము / ప్రదేశం:**

W – మొత్తం

D – పెద్ద భాగం

d – చిన్న భాగం

s – ఖాళీ ప్రదేశం

**బి) విషయం:**

H – మానవ రూపం

A – జంతు రూపం

Hd – మానవ భాగం

Ad – జంతు భాగం

N – ప్రకృతి అకారాలు (కొండలు, సెలయేర్లు, మేఘాలు)

O – ప్రాణరహిత వస్తువులు (దీపం, టేబుల్, బల్లలు)

**సి) నిర్ణాయకాలు:**

C – రంగు

K – తేలికపాటి రంగు

F – ఆకారం

M – కదలిక / చలనం

**డి) మౌలికాంశాలు:**

1) ప్రత్యేక అభిప్రాయాలు

2) సాధారణ అంశాలు

**2. ఇతివృత్త గ్రాహ్యక నికష: (TAT)**

- కథను సూక్ష్మంగా గ్రహించడం / చెప్పడం.

- దీనిని ముర్రే, మోర్గాన్‌లు రూపొందించినారు.
- దీనిలో ప్రయోజ్యుడు తనకు తెలియకుండానే తనలోని నిగూఢమైన వైఖరులను, ప్రేరణలను సంఘర్షణలను కథ ద్వారా వ్యక్తం చేస్తాడు.
- మూర్తిమత్వం అంచనా వేయడానికి కథానాయకుడు, కథాసారాంశం, కథా పరిణామం వంటి విషయాలని పరిగణనలోనికి తీసుకుంటారు.
- ఇది వయోజనులకు ఉపయోగిస్తారు.
- దీనిలో చిత్రాలు ఉన్న 30 కార్డులు ఉంటాయి. ఒక ఖాళీ కార్డు ఉంటుంది.
- స్త్రీ, పురుషులు ఉపయోగించు గరిష్ట కార్డుల సంఖ్య – 20
- స్త్రీ, పురుషులు వేరు వేరుగా (ప్రత్యేకంగా) ఉపయోగించే కార్డుల సంఖ్య – 10

**4. CAT (Children Apperception Test)**

- ఎల్. బెల్లాక్, ఎస్.ఎస్. బెల్లాక్ రూపొందించినారు.
- 3 – 10 సంవత్సరాల పిల్లలకు
- 10 కార్డులు ఉంటాయి. వాటిలో జంతువుల బొమ్మలుంటాయి.

**వాక్యపూరణ పరీక్షలు:**

- దీనిని బౌద్ధిక సామర్థ్య పరీక్షగా ఉపయోగించినవారు – ఎబ్బింగ్ హాస్.
- దీనిని ఒక మూర్తిమత్వ పరీక్షగా మొదటిసారిగా ఉపయోగించిన వారు – పేనీ మరియు టెండల్
- దీనిలో అసంపూర్ణమైన వాక్యాలు ఉంటాయి.
- ప్రయోజ్యుడు ఆ వాక్యాన్ని పూర్తి చేయడానికి వాడిన సమాధానాలను బట్టి మూర్తిమత్వాన్ని అంచనా వేస్తారు.
- వ్యక్తులలోని విషమ యోజనాన్ని తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడును.

ఉదా:– 1) The Rhode's sentence completion test.

2) The Rotter incomplete sentence blank.

**పద సంసర్గ పరీక్ష: ప్రక్షేపణ పరీక్ష**

- మొట్టమొదట తయారు చేసిన వారు – గాల్టన్
- మొదట ఉపయోగించినవారు – కెంట్, రోషనాఫ్

**2) కథాపూరణ పరీక్ష:** ఇది ఒక ప్రక్షేపణ పరీక్ష.

**3) వాక్య పూరణ పరీక్ష:** ఇది ఒక ప్రక్షేపణ పరీక్ష.

**4) చిత్ర క్రమీకరణ పరీక్ష:** ఇది ఒక ప్రక్షేపణ పరీక్ష.

**సన్నివేశ పరీక్షలు / స్థితి పరీక్షలు:**

- ఇటీవల రూపొందించబడినవి.
- ముందుగా యోచించిన సన్నివేశంలో ప్రయోజ్యులను ఉంచి వారు ఇచ్చే ప్రతిస్పందనల ఆధారంగా మూర్తిమత్వాన్ని అంచనా వేసే పరీక్షలు.

**ఉదా:** 1) నిజాయితీ, నిజాయితీ లేమి పరీక్ష – మే మరియు హార్ట్ షోర్న్

2) సాంఘిక మితి:– జె.ఎల్. మోరీనో రూపొందించారు.

- వ్యక్తుల మధ్య ఇష్టాయిష్టాలను తెలుసుకొనే సాధనం (లేదా)
- సాంఘిక సంబంధాలను అంచనా వేసే సాధనం –సాంఘిక మితి.
- దీని ఫలితాలను చిత్రం లేదా పటము ద్వారా తెలిపితే దానిని సోషియోగ్రామ్ అంటారు.

**OSS: Officers of stratagic service Test (సైన్యంలో సిబ్బంది ఎంపికకు)**

**సైకోడ్రామా:– మనో ప్రక్షేపక నాటిక.**

- మానసిక రుగ్మతలు కలిగిన వ్యక్తుల లక్షణాలను తెలుసుకోవడానికి మనో విశ్లేషకులు ఒక పాత్రను సృష్టించి ఆ పాత్ర పోషణ ద్వారా ప్రయోజ్యుని లక్షణాంశాలను అంచనా వేస్తారు. ఈ సన్నివేశ పరీక్షలను ధైర్యం, పట్టుదల, నిజాయితీ, చొరవ, స్వేచ్ఛ మొదలగు లక్షణాంశాలను అంచనా వేస్తారు.

మానసిక ఆరోగ్యం **(Mental Health)**

సూఫీ అయిన **బజాయిద్** తన గురించి ఇలా చెప్పారు. "నేను యవ్వనములో విప్లవాత్మక భావాలున్నప్పుడు భగవంతున్ని ఇలా ప్రార్థించేవాడిని భగవంతుడా ఈ ప్రపంచాన్ని మార్చే శక్తిని ఇవ్వమని".

"నేను మధ్య వయస్సు దశకు చేరుకున్నప్పుడు నా సగం జీవితంలో ఒక్క వ్యక్తిని కూడా మార్చలేకపోయానని పరివర్తన చెంది, భగవంతుని ఇలా ప్రార్థించాను. భగవంతుడా నా దగ్గరకు వచ్చే వారిని, కనీసం నా కుటుంబము మరియు స్నేహితులనైనా మార్చే శక్తినివ్వమని".

"ఇప్పుడు నేను వృద్ధాప్యములో నా చివరి రోజులు లెక్క కడుతూ నా చివరి ప్రార్థన భగవంతుడా నన్ను నేను మార్చుకునే శక్తినివ్వమని".

ఈ ప్రార్థనే ముందు చేసి వుంటే నా జీవితాన్ని వృథా చేసేవాడినే కాదు.

Source: "She song of the bird" Anthoney De Mellow S.J. Anand Gujarat Sahitya Prakash 1987

మార్పు ప్రకృతి ధర్మము అనగా మార్పు సహజము. మార్పును అర్థం చేసుకోకపోతేనే అది సమస్యగా మారుతుంది. ఈ సమస్యలు మానసిక, శారీరకపరమైన రుగ్మతలకు దారి తీస్తాయి.

ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు రాబోయే కాలంలో శారీరక రోగాలుండవు. కేవలం మానసిక రోగాలే వుంటాయి. అనగా మానసిక రుగ్మతలు శారీరక రోగాలకు దారి తీస్తాయని, తెలిపి ఉన్నారు. దాని ఫలితంగా ఈ రోజు పిల్లల దగ్గర నుండి పెద్దవారి వరకు ఎన్నో మానసిక సమస్యలకు గురౌతున్నారు.

పిల్లలు, పెద్దలు, అందరూ సంఘర్షణలు, కుంఠనాలు, ఒత్తిడి, ఆందోళన, విషమ యోజనం లాంటి మానసిక సమస్యలకు గురై ఎన్నో రకాల మానసిక రుగ్మతలకు లోనవుతున్నారు. మార్పును అర్థం చేసుకొని తమ సామర్థ్యాలను సరియైన విధంగా వినియోగించుకొని, సరియైన నిర్ణయాలు సకాలంలో తీసుకొని, సమాజంలో జీవించే నైపుణ్యాలను, నిజ జీవితంలోని సమస్యలను, ఒడిదుడుకులను ఎదుర్కొని స్వతంత్రంగా వాటిని పరిష్కరించుకోగల సామర్థ్యాన్ని పిల్లలకు

అందివ్వాలి. వ్యక్తిగత, సామాజిక అభివృద్ధిలో సమగ్రమూర్తిమత్వాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని కల్గి తన జీవితాన్ని తనతో పాటు తనచుట్టూ వున్న వ్యక్తుల ఆరోగ్యాలను పరిరక్షించటానికి అవసరమైన నైపుణ్యాలను అందివ్వాలి.

1. మానసిక ఆరోగ్యం 2. సర్దుబాటు 3. సంఘర్షణలు 4. కుంఠనాలు

5. ఒత్తిడి 6. ఆందోళన 7. విషమయోజనం

అభ్యసనం అనగా ప్రవర్తనా మార్పు. ఇది అనుభవం వల్ల లేదా శిక్షణ ద్వారా అయినా రావచ్చు. ప్రస్తుత సమకాలీన ప్రపంచంలో విద్యార్థులలో చాలా మంది సంఘర్షణలు, కుంఠనాలు, ఒత్తిడి, ఆందోళన, విషమయోజనం మొ॥ వాటికి లోనై అభ్యసనానికి దూరమవుతున్నారు.

అభ్యసనంలో 1. అభ్యాసకుడు, 2. అభ్యసనాంశం, 3. అభ్యసన స్థితి / సన్నివేశం ఇమిడి వుంటాయి. అభ్యాసకుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడైనప్పుడే అభ్యసనాన్ని కొనసాగిస్తాడు. అభ్యాసకుని ప్రభావితం చేసే వివిధ కారకాలను సక్రమంగా వినియోగించాలంటే అతడు మంచి సంపూర్ణ ఆరోగ్యాన్ని, సమగ్ర మూర్తిమత్వాన్ని కల్గి వుండాలి. తల్లిదండ్రులు, పాఠశాల సరియైన పాఠశాల వాతావరణాన్ని కల్పించి అభ్యసనాంశం భవిష్యత్తుకు ఉపయోగపడేటట్లు చేయాలి.

విద్యార్థి శారీరక, మానసిక ప్రవర్తనను అర్థం చేసుకోవటం, వారి స్థాయికి తగిన బోధన, బోధనాంశాలు అందివ్వవలసిన బాధ్యత అందరిది. ఇందులో ఏ పొరపాటు జరిగినా విద్యార్థిలో సర్దుబాటు సామర్థ్యం కోల్పోవటం. సంఘర్షణలకి లోనుకావటం, కుంఠనాలకు, ఒత్తిడికి, ఆందోళనకు, విషమయోజనాలకు దారితీసి విద్యార్థి పాఠశాలకు దూరం కావటమే కాక, సాధారణ జీవితాన్ని కూడా సక్రమంగా జీవింపక, ఎన్నోరకాలైన మానసిక రుగ్మతలకు లోనవుతారు. కావున ఉపాధ్యాయులు పై అంశాలను అవగాహన చేసుకోవటం, అటువంటి విద్యార్థులను గుర్తించి వారి లోపాలను సరిదిద్ది సక్రమమైన ప్రవర్తన కల్గివుండేటట్లు చేయటం. విద్యార్థుల సామర్థ్యాలను సక్రమంగా వినియోగించుకొని తనతోను, తనచుట్టూ వున్న ప్రపంచంతోను అణుగుణ్యతను పొంది మంచి జీవితాన్ని గడపటానికి అవసరమైన సహాయ సహకారములు అందివ్వాలి.

నిజ జీవితంలోని సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, వాటిని పరిష్కరించటానికి అవసరమైన నైపుణ్యాలను, వాటిని ప్రభావితం చేసే లేదా ఆటంకపరిచే కారకాలను ఎలా పరిష్కరించుకోవాలో అవసరమైన సామర్థ్యాలను పెంపొందించాలి.

బెర్నార్డ్ మానసిక ఆరోగ్యాన్ని ఇలా నిర్వచించినాడు. "వ్యక్తి తనకు తానుగా మొత్తం ప్రపంచంతో అనుగుణ్యత చెంది సమర్థవంతంగా సంతృప్తికరంగా సంతోషదాయకంగా సాంఘిక అనుకూలమైన ప్రవర్తనను నెలకొల్పుకొని నిత్య జీవితంలోని పరిస్థితులను ఎదుర్కొని అంగీంకరించడం."

- మానసిక ఆరోగ్యం కలిగిన వ్యక్తి సుఖశాంతులు కలిగి ఉండి, సంఘర్షణలు లేకుండా నూరేళ్ళ జీవితాన్ని గడుపుతారు.
- మానసిక అనారోగ్యానికి కారణం దెయ్యాలు, భూతాలు కారణం కాదని ఖండించి చికిత్సలో మానవతా దృక్పథాన్ని ప్రవేశ పెట్టిన వ్యక్తి – పీనల్.
- మానసిక ఆరోగ్య ఉద్యమానికి మూల పురుషుడు – క్లిఫర్డ్ బీర్స్.
  క్లిఫర్డ్ బీర్స్ రాసిన గ్రంథం – A mind that found itself (1908)
- 1909లో National Committee for Mental Healthను ఏర్పాటు చేశాడు.

1930లో అంతర్జాతీయ మానసిక కాంగ్రెస్

1948లో ప్రపంచ, ఆరోగ్య సంస్థ.

- ఐక్యరాజ్య సమితిలోని యునిసెఫ్ (UNICEF) మానసిక అనారోగ్యాన్ని గురించి పరిశీలించాము.
- మానసిక అనారోగ్యంలో ప్రధానాంశాలు 3. అవి.

**1) ధనాత్మక అంశం:** సక్రమమైన మానసిక ఆరోగ్యానికి కావలసిన పరిస్థితులను నెలకొల్పుకోవడం.

**2) నిరోధించే అంశాలు:** మానసిక అనారోగ్యాన్ని అరికట్టే పద్ధతులు.

- మానసిక అనారోగ్యానికి కారణాలు 2 రకాలు. అవి

**ఎ) ప్రోత్సహించే కారకాలు:** వ్యక్తిగత సంబంధాలు లోపించడం, అభద్రతా భావం, న్యూనతా భావాలు మొదలైనవి. ఇవి దీర్ఘకాలికమైనవి.

**బి) ప్రోగు చేసే కారకాలు:** ఆర్థికంగా నష్టపోవడం, ప్రేమించే వ్యక్తిని కోల్పోవడం, హఠాత్తుగా కలిగేవి.

**3) రోగ నివారణ:** చికిత్స చేయడం.

## మానసిక ఆరోగ్యం కలిగిన వ్యక్తి లక్షణాలు:

1. సక్రమమైన శారీరక ఆరోగ్యం.
2. భావోద్రేక సమతుల్యత.
3. ఆరోగ్యవంతమైన ఆత్మ భావన.
4. ఆరోగ్యవంతమైన వ్యక్తిగత సంబంధాలు.
5. ఆరోగ్యవంతమైన విషయ నిష్టత.
6. అనుగుణ్యత – నూతన పరిస్థితులకు సర్దుబాటు కావడం.
7. సామాజిక పరిపక్వత.
8. సంఘర్షణలను కుంఠనాలను, తన్యతలను అదుపు చేసుకోవడం.
9. ఆశాజీవనాన్ని కలిగి ఉండడం.
10. మూర్తిమత్వ సంధానం.

- సక్రమమైన మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో పాఠశాల ప్రధాన పాత్ర వహిస్తుంది.
- పాఠశాలలో 1) వ్యాయామ విద్య, 2) వైద్య తనిఖీలు, 3) అభిరుచులు, సహజ సామర్థ్యాలను బట్టి పాఠ్యాంశాల ఎంపిక.
- పాఠ్యప్రణాళిక నిత్య జీవితంలో వ్యక్తిగతంగా సమజానికి ఉపయోగపడే విధంగా ఉండాలి.
- మానసిక పరిపక్వతకు అనుగుణంగా ఉండాలి.
- నియోజనాలు సాధించేవిగా ఉండాలి.
- వ్యక్తిగత, విద్య ఔద్యోగిక మార్గదర్శకాలను ఇవ్వాలి.

## సర్దుబాటు (Adjustment)

ఒకసారి మనం మన జీవిత అనుభవాలను గుర్తుకు తెచ్చుకొన్నట్లయితే, మనలో ప్రతి ఒక్కరూ అనుకున్నవి అనుకున్నట్లు జరగకపోవడం వల్ల మనమే పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకున్నామనే విషయాన్ని గుర్తిస్తాం. ఉదాహరణకు ఇంటర్మీడియట్ M.P.C చదువుతున్న విద్యార్థి ఇంజనీరింగ్ IIT లో చేయాలనుకొన్నాడు. ఇంటర్మీడియట్ అయిపోయిన తరవాత ప్రవేశ పరీక్ష రాస్తే IIT లో సీటు రాలేదు. ఆ విద్యార్థికి బి.ఎస్.సి.లో మాత్రమే సీటు దొరికింది. మరొకరు తనకు నచ్చిన మిఠాయిని తిందామని మిఠాయి దుకాణానికి వెళితే తనకు నచ్చింది అందుబాటులో లేకపోతే వేరే మిఠాయిని కొనుక్కొని తిన్నాడు. ఇలా అందరూ, ఏదో ఒక సందర్భంలో సర్దుబాటు చేసుకొంటారు. అంటే ప్రతి ఒక్కరి జీవితంలో సర్దుబాటు అనేది అనివార్యమైంది. గర్భస్థ శిశువు దశ నుంచీ మొదలుకొని చనిపోయే వరకూ సర్దుబాటు అనేది ఒక నిరంతర ప్రక్రియ. జీవితంలో అందరూ సర్దుబాటు చేసుకోవలసి ఉన్నప్పటికీ కొందరు తొందరగా సర్దుబాటు చేసుకోలేరు. మరికొందరు సర్దుబాటు అసలే కాలేక ఇబ్బంది పడతారు. అంటే సర్దుబాటు అనేది అందరిలో ఒకేవిధంగా ఉండదు. అలాగే ఒక వ్యక్తిలో కూడా సర్దుబాటు అనేది ఎప్పుడూ ఒకేవిధంగా ఉండదు. అలాగే ఒక వ్యక్తి సర్దుబాటు అన్ని రంగాలలో ఒకే విధంగా ఉండదు. ఉదాహరణకు ఒక విద్యార్థి గృహంలో చాలా బాగా సర్దుబాటు అవుతాడు కానీ పాఠశాలలోనూ, సాంఘికంగానూ సరిగ్గా సర్దుబాటు చేసుకోలేడు.

విద్యార్థులు మంచి సర్దుబాటును పొంది ఉండేటట్లు ఉపాధ్యాయులు చూడాలి. కాబట్టి సర్దుబాటు గురించి అలాగే సర్దుబాటుతో దగ్గర సంబంధం ఉన్న సంఘర్షణలు, కుంఠనం, విషమయోజనం గురించి ఇక్కడ చర్చించడం జరిగింది.

సర్దుబాటును వివిధ మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించారు. వాటిని ఒకసారి పరిశీలిద్దాం.

**గేట్స్, జెర్సిల్డ్‌లు (1948):** "తనకూ, తన పరిసరాలకూ మధ్య మరింత సామరస్యమైన సంబంధాలను నెలకొల్పడం కోసం నిరంతరం తన ప్రవర్తన మార్చుకోవడమే సర్దుబాటు".

**లారెన్స్ షాఫర్ (1961):** "జీవి అవసరాలకూ, ఆ అవసరాలను సంతృప్తిపరచడాన్ని ప్రభావితం చేసే పరిస్థితులకు మధ్య సమతుల్యమే సర్దుబాటు."

**డిక్షనరీ ఆఫ్ సైకాలజీ సర్దుబాటును రెండు రకాలుగా నిర్వచిస్తుంది.**

1. ఆటంకాలను అధిగమించి అవసరాలను తీర్చుకోవడానికి జీవి కనబరిచే కృత్యాలలో వైవిధ్యమే సర్దుబాటు.
2. భౌతిక, సాంఘిక పరిసరాలతో సుహృద్భావం ఏర్పరుచుకోవడానికి జీవి కనబరిచే కృత్యాలలో వైవిధ్యమే సర్దుబాటు.

**ఆటంకాలు:** వ్యక్తి తన అవసరాలను తీర్చుకోవడానికి అనేక గతిశీలక కృత్యాలు చేస్తాడు. అతను గమ్యం చేరడంలో అనేక ఆటంకాలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇవి ప్రతి బంధకాలుగా తయారవుతాయి. వ్యక్తి ఆటంకాలనధిగమించి గమ్యం చేరడానికి ప్రయత్నం చేస్తాడు. పటం 9లో ఆటంకం వల్ల నిరోధించబడిన వ్యక్తి ప్రవర్తనారీతులు గమనించవచ్చు.

1) వ్యక్తి ఒక గమ్యం వైపు బయల్దేరాడు.
2) అతనికి ఆటంకం ఎదురైంది.
3) అతనొక అన్వేషణగా స్థితిలో పడ్డాడు. గమ్యం చేరడానికి అనుకూల మార్గాలు కనిపించాయి.
4) గమ్యం చేరడానికి వేరే మార్గం కనుక్కున్నాడు.

5) గమ్యం చేరాడు, సర్దుబాటు చేసుకున్నాడు.

6) గమ్యం చేరలేనప్పుడు గమ్యానికి ప్రత్యామ్నాయ గమ్యం కనిపెట్టారు. ఇక్కడ కూడా సర్దుబాటు చేసుకున్నాడు.

**ఆటంకాలు రెండు రకాలు:**

ఎ) వ్యక్తిగత ఆటంకాలు

బి) పరిసర ఆటంకాలు

వ్యక్తిగత ఆటంకాలు శారీరకంగా ఉండవచ్చు. మానసికంగా ఉండవచ్చు. శారీరక ఆటంకాల కింద గుడ్డి, చెవుడు మొదలైన అంగలోపాలు వస్తాయి. మానసికాటంకాల కింద ప్రజ్ఞ తక్కువగా ఉండడం పేర్కొనవచ్చు. పరిసరాలలోని ఆటంకాలు రెండు విధాలుగా ఉంటాయి.

1) భౌతిక పరిసరానికి సంబంధించినవి

2) సాంఘిక పరిసరానికి సంబంధించినవి.

భౌతిక పరిసరానికి సంబంధించినవి కొండలు, నదులు, ఎడారులు మొదలైనవి. సాంఘిక పరిసరానికి సంబంధించినవి ఆచార వ్యవహారాలు, సాంఘిక అంతరాలు, కులాలు శ్రేణులు మొదలైనవి.

## సంఘర్షణ (Conflicts)

ఒక శిశువును తల్లిదండ్రులు తమ ఎదుట నిలబెట్టి వారిలో నీకిష్టమయిన వారు చెప్పమన్నప్పుడు ఆ శిశువు ప్రవర్తనను గమనించారా!

ఒక విద్యార్థిని పాఠశాలలో అన్ని Subjects టీచర్ల ముందు నిలబెట్టి నీకిష్టయిన టీచర్ ఎవరిని చెప్పమన్నప్పుడు ఆ విద్యార్థి ప్రవర్తనను గమనించారా?

ఒక విద్యార్థి దగ్గర 5 రూపాయలు మాత్రమే వున్నాయి. ఆ విద్యార్థి అంగడికి పోయినప్పుడు ఎదురుగా తనకిష్టమయిన ఐస్‌క్రీమ్, చాక్లెట్ వున్నాయి. అందులో ఏదైనా ఒకటి తీసుకోమన్నప్పుడు ఆ విద్యార్థి ప్రవర్తనను గమనించారా?

తల్లిదండ్రులు సినిమాకు పోతున్నారు విద్యార్థిని నీవు ఇంట్లో వుండి హోమ్‌వర్క్ అయినా చేస్కో లేదా బయటికయినా వెళ్ళమన్నప్పుడు, ఆ విద్యార్థి ప్రవర్తనను గమనించండి.

పాఠశాలలో కొంతమంది విద్యార్థులు పార్టీ చేసుకుంటున్నారు. వారిలో రమేష్ వాళ్ళనాన్న డబ్బు ఇవ్వలేదు. డబ్బులు లేకపోతే పార్టీకి రానివ్వరు. నాన్న జేబులోని డబ్బులు తీసుకోవాలని వుంది. అయితే నాన్నకు తెలిస్తే కొడతారన్న భయం. అప్పుడు రమేష్ ప్రవర్తనను గమనించండి.

పై ప్రవర్తనలు ఈ విశ్వంలోని ప్రతి మానవుని ప్రవర్తనలో కనిపిస్తాయి. వీటినే సంఘర్షణలు అంటాము.

**నిర్వచనాలు:**

సంఘర్షణ అనేది రెండు విరుద్ధ కోరికల మధ్య ఏర్పడే తన్యత వల్ల కలిగే బాధా పూరితమైన ఉద్వేగస్థితి – డగ్లస్ మరియు హాలె

సంఘర్షణలు నాలుగు రకాలు – కర్ట్‌లెవిన్ ప్రకారం.

**1) ఉపగమ–ఉపగమ: (Aproach & Aproach)**

రెండు ఆకర్షణీయమైన లక్ష్యాలలో ఏదో ఒక దానిని ఎన్నుకోవలసిన వచ్చినపుడు కలిగే సంఘర్షణ.

**ఉదా:** 1) వైమానిక దళం – వ్యక్తి – నౌకాదళం.

2) తెలిసిన జవాబు – విద్యార్థి – తెలిసిన జవాబు

3) ఒక వైపు Ice – పిల్లవాడు – మరొక వైపు చాక్లెట్.

4) తల్లి – నూతన వరుడు – భార్య

**2) పరిహార – పరిహార: (Avoidence & Avoidence)**

రెండు ఆకర్షణీయం కాని లక్ష్యాలలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సి వచ్చినపుడు ఏర్పడే సంఘర్షణ.

**ఉదా:** 1) తెలియని జవాబు – విద్యార్థి – తెలియని జవాబు.

2) Rejain – ఉద్యోగి – Transfer

3) Match Practice చేయడం ఇష్టం లేదు – ఆటగాడు – ఓడిపోవడం ఇష్టం లేదు.

**3) ఉపగమ – పరిహార: (Aproach & Avoidence)**

ఆకర్షణీయమైన లక్ష్యం వైపు ఆకర్షితుడు అవుతాడు కాని సిగ్గు, భయం, మరే ఇతర కారణాల వల్ల వికర్షితుడవుతాడు. ఇలాంటి సంఘర్షణను ఉపగమ – పరిహార సంఘర్షణ అంటారు.

**ఉదా:** 1) జామపండు – పిల్లవాడు – కింద పడతానని భయం

2) సిగరెట్టు – విద్యార్థి – తాగితే క్యాన్సర్ వస్తుంది.

**4) ద్విఉపగమ పరిహార: (Dual aproach & Avoidence)**

రెండు అంతకంటే ఎక్కువ ఆకర్షణీయమైన, ఆకర్షణీయం కాని లక్ష్యాలలో ఎంపిక జరగవలసి వచ్చినపుడు ఏర్పడే సంఘర్షణ.

| | |
|---|---|
| **ఉదా:–** జీతం ఎక్కువ | జీతం తక్కువ |
| వ్యక్తి | |
| దూరం ఎక్కువ | దూరం తక్కువ |

సంఘర్షణలు ఏర్పడినప్పుడు వ్యక్తి సరైన నిర్ణయం తీసుకోవడం చాలా ముఖ్యమైంది. ఎందుకంటే తీసుకొనే నిర్ణయాలపైనే వారి జీవితాలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి నిర్ణయం తీసుకోవడంలో తొందరపాటు గానీ, విపరీతమైన జాప్యంగానీ, వాయిదా వేయడంగానీ, సరికాదు. సంఘర్షణలు ఏర్పడినప్పుడు వాటిలో ఉన్న లోటుపాటులనూ అలాగే మనలో ఉన్న సామర్థ్యాలను, పరిమితులనూ, ఆసక్తులనూ బేరీజువేసుకొని సరైన నిర్ణయం తీసుకోవాలి. ఉపాధ్యాయుల నిత్యజీవిత అనుభవాల ఆధారంగానూ, వివిధ ప్రాజెక్టులు, కృత్యాల ఆధారంగా సంఘర్షణలు ఏర్పడినప్పుడు సరైన నిర్ణయం తీసుకొనే నైపుణ్యాన్ని పెంపొందించాలి.

## కుంఠనం (Frustration)

తరగతి గదిలోని విద్యార్థులకు ఒక ఇంటి పనిని ఇచ్చారు. కాని రాధకుఎంత ప్రయత్నం చేసినా అందులో కొన్ని అంశాలు పరిష్కరింపబడలేదు. తన శక్తికి మించి ప్రయత్నంచేసినా అవి పరిష్కరింపబడలేదు. అప్పుడు రాధ తమ్ముడొచ్చి పుస్తకాలు ముట్టుకొన్నాడు. వెంటనే రాధ, తన తమ్ముని కొట్టింది. తల్లి అడిగినా చాలా అసహనంగా, కోపంగా సమాధానం చెప్పి, తన పుస్తకాలను విసిరి వేసింది" ఈ సన్నివేశాన్ని గమనించారా?

పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇంగ్లీషు గ్రామర్ చెప్పినప్పుడు, ఎంత ప్రయత్నం చేసినా మధుకు అర్థం కాలేదు. చాలా అవధానంతో మళ్ళీ, మళ్ళీ ప్రయత్నించినా అర్థం కాలేదు. అప్పుడు మధు స్నేహితుడు వచ్చి మధుని ఆటపట్టించే ప్రయత్నం చేశాడు. అప్పుడు మధు ప్రవర్తనను ఊహించండి.

- **దీనినే కుంఠనం అంటాము.**

సాధారణంగా మానవులకు కోరికలు అపరిమితం. ఏ వ్యక్తికి కూడా అన్ని కోరికలు తీరవు. తీరిన కోరికలతో సంతృప్తి చెందేవారు కొందరు ఉంటారు. తీరిన కోరికలతో సంతృప్తి చెందుతూనే, తీరని కోరికల గురించి ప్రయత్నం చేసేవారు కొందరు ఉండవచ్చు. మరికొందరు తీరని కోరికల గురించే ఆలోచిస్తూ నిరాశ నిస్పృహలకు లోనవుతారు. ఇలా అనేక సార్లు కోరికలు తీరక, తీర్చుకోవడానికి ఏమీ ప్రయత్నం చేయకుండా నిరాశ, నిస్పృహలకు గురి అయితే కుంఠనం ఏర్పడుతుంది. సంఘర్షణలు ఏర్పడినప్పుడు నిర్ణయం తీసుకోకపోయినా, తీసుకున్న నిర్ణయం సరైంది కాకపోయినా, తీసుకున్న నిర్ణయంపై దృష్టి నిలపక తీసుకున్న నిర్ణయమే తప్పు అనే ఆలోచనతో సతమతమైతే కూడా కుంఠనం ఏర్పడుతుంది.

## నిర్వచనాలు

"మానవుని ఆశయం గానీ, అవసరం గానీ తృప్తిపరచడంలో అవరోధం ఏర్పడినప్పుడు ఉద్భవించే భావనే కుంఠనం" – **గుడ్**

"కుంఠనం అంటే వ్యక్తిలోని ప్రేరకం తృప్తి చెందకపోవడం" – కరోల్.

## కుంఠనానికి కారణాలు

- వ్యక్తికి ఉన్న ప్రజ్ఞ, సహజసామర్థ్యాల స్థాయి కంటే ఎక్కువ లక్ష్యాన్ని పొంది ఉండటం.
- ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా నడుచుకో(లే)కపోవడం.
- ఇతరులతో సంబంధాలను నెలకొల్పుకోలేకపోవడం.
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారలేకపోవడం.

## కుంఠనం – పర్యవసానాలు

కుంఠన స్థాయిని బట్టి, కుంఠనం పొందే వ్యక్తి లక్షణాలను బట్టి కుంఠనం పర్యవసానాలు అనేక రకాలుగా ఉంటాయి.

- లక్ష్యాన్ని చేరడంలో ఏర్పడిన ఆటంకాల వల్ల కొన్నిసార్లు తాత్కాలిక కుంఠనం ఏర్పడవచ్చు. తాత్కాలికంగా ఏర్పడిన కుంఠనం వల్ల వ్యక్తిలో పట్టుదల పెరిగి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి లక్ష్యాన్ని చేరవచ్చు.
- కుంఠనం వల్ల వ్యక్తి ఏర్పరచుకొన్న లక్ష్యాన్ని విరమించుకోవచ్చు.

- కుంఠనం వల్ల శారీరక, మానసిక అనారోగ్యానికి గురికావచ్చు.
- కుంఠనం స్థాయి ఎక్కువగానూ, నిరంతరంగానూ ఉంటే ఆత్మహత్య ప్రయత్నం లేదా ఒకొక్కసారి ఆత్మహత్యను కూడా చేసుకోవచ్చు.
- కుంఠనం వల్ల దౌర్జన్యానికి పాల్పడవచ్చు.
- స్వైరకల్పనకు పాల్పడవచ్చు అంటే పగటికలలు కనడం.
- చెప్పిందే చెప్పడం లేదా చేసిందే మళ్ళీ చేయడం.

## కుంఠనాన్ని ఎదుర్కోవడం:

- శక్తికి మించి శ్రమించడం.
- పనికి, విశ్రాంతికి మధ్య సమతుల్యం ఉండేలా చూసుకోవడం.
- చేతకాని పనికి అంగీకారం తెలపక పోవడం.
- నిజాయితీగా ఉండడం.
- ఇతరుల సహాయం తీసుకోవడం.

## ఒత్తిడి, ఒత్తిడి నిర్వహణ (Stress - Stress Management)

పాఠశాలలో కొంతమంది విద్యార్థులను పరిశీలించండి. కొంతమంది తమకు I[st] Rank రాకపోతే నాకు పుట్టిన రోజు బహుమతి అమ్మా, నాన్న ఇవ్వరని మరికొంతమంది "వాళ్ళ తల్లిదండ్రులకు తమ పాఠశాల అనుభవాలు చెబితే అసలు తినటం లేదని, మరికొందరు మాకు ఆడుకోవటానికి సమయం వుండదని, మరికొందరు నాకు Maths అంటే ఇష్టం లేకపోయినా మా నాన్న నాకు బలవంతంగా నేర్పించే ప్రయత్నం చేస్తాడని వింటూ వుంటాము. దీనివల్ల పిల్లల ప్రవర్తనను పరిశీలించిన, కొంత ఆమోదయోగ్యం గాని ప్రవర్తన కన్పిస్తుంది. దీనికి కారణమే ఒత్తిడి.

శిశువు అభ్యసనంపై సర్దుబాటు, సంఘర్షణలు, కుంఠనాలు, ఒత్తిడి, ఆందోళన, విషమయోజనం, మానసిక అనారోగ్యం ప్రభావితం చేస్తాయి.

ఆధునిక ప్రపంచంలో పిల్లలు మొదలుకొని పెద్దల వరకు అనేక రకాలైన ఒత్తిడులకు గురి అవుతున్నారు. చదువుకొనే పిల్లలు సహితం విపరీతమైన ఒత్తిడితో శారీరక, మానసిక సమస్యలకు లోనవుతున్నారు.

ఎంతోమందిని ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టే ఒత్తిడి గురించి అలాగే దాని నిర్వహణ గురించి తెలుసుకొందాం.

## నిర్వచనం

ఒత్తిడి అంటే ఒక సంఘటనకు, ఒక మార్పుకు, ఒక సవాలుకు వ్యక్తి శారీరకంగా, మానసికంగా స్పందించడాన్నే ఒత్తిడి అంటారు.

ఏదైనా సవాలును లేదా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడానికి వ్యక్తి సామర్థ్యం సరిపోనప్పుడు ఒత్తిడి కలుగుతుంది. ఈ ఒత్తిడి శారీరక, మానసిక విధానాల పనిని ప్రభావితం చేస్తుంది. అంటే మొత్తం వ్యక్తిపైన ప్రభావం ఉంటుంది.

ఒత్తిడి స్వభావం : ఒత్తిడి స్వభావం సులభంగా అర్థం చేసుకోవడానికి ఒక సర్వసాధారణమైన ఉదాహరణను తీసుకుందాం. ఇస్త్రీ పెట్టెను తగినంతగా వేడి చేసి దుస్తులను ఇస్త్రీ చేస్తే వాటి ముడతలు పోతాయి. దాన్నే ఎక్కువ వేడిచేస్తే ఇస్త్రీ చేస్తే బట్టలు కాలిపోతాయి. అలాగే ఇస్త్రీ పెట్టెను చేయవలసినంత వేడిచేయకుండా ఇస్త్రీ చేసినా లేదా అసలు ఇస్త్రీ చేయకపోతే, బట్టలలోని ముడతలు పోవు. ఒత్తిడి అధికమైనప్పుడు వ్యక్తికి ఆలోచనలలో స్తబ్దత ఏర్పడటం, జ్ఞాపకశక్తి సన్నగిల్లడం, చిన్న చిన్న విషయాలకే చిరాకుపడటం మొదలైన ప్రతికూల ఫలితాలు ఉంటాయి. అలాగే ఒత్తిడి ఏ మాత్రం లేకపోతే వ్యక్తి సోమరిగా ఉండే అవకాశం, ఏ పని పట్ల కూడా ఆసక్తి చూపించకకపోవడం, ప్రేరణను పొందకపోవడం జరుగుతుంది. ఒత్తిడి మోతాదులో ఉంటేనే వ్యక్తి పని పట్ల ప్రేరణ పొందుతాడు. బాగా రాణిస్తాడు. దుస్తులలోని రకాల ఆధారంగా ఏ విధంగా అయితే ఇస్త్రీ పెట్టెను తగిన విధంగా వేడిచేస్తామో అదేవిధంగా విద్యార్థుల మనస్తత్వాన్నీ ఆసక్తులనూ, సామర్థ్యాలనూ దృష్టిలో ఉంచుకొని తగిన మోతాదులో ఒత్తిడి కలిగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. అలాకాని పక్షంలో ప్రతికూల ఫలితాలు వస్తాయి. కాబట్టి విద్యార్థిపై ఒత్తిడి తగిన మోతాదులో ఉండాలి.

విద్యార్థులకు కలిగే ఒత్తిడి ఇతరుల పట్ల కావచ్చు లేదా విద్యార్థులు తమంతటతాము ఏర్పరచుకొన్న లక్ష్యాలను సాధించలేకపోయి లేదా చాలా ఆదర్శంగా ఉండాలని అనుకొని అలా ఉండకపోవడంవల్లనో కావచ్చును.

## అధిక ఒత్తిడికి గురైన విద్యార్థుల లక్షణాలు

- తరచుగా తలనొప్పి రావడం.
- చెమటలు పట్టడం
- గుండె వేగంగా కొట్టుకోవడం
- జుట్టు పీక్కోవడం
- గోర్లు కొరకడం
- అతిగా తినడం
- నిద్రపట్టక పోవడం
- సరిగ్గా వినలేకపోవడం
- గ్రహణశక్తి లోపం
- చెప్పవలసిన విషయాన్ని సక్రమంగా చెప్పలేకపోవడం
- సమయపాలనను సరిగ్గా నిర్వర్తించలేకపోవడం
- తగిన నిర్ణయాలను తీసుకోకపోవడం
- స్థిరంగా లేకపోవడం
- ఏకాగ్రత లేకపోవడం
- అన్యమనస్కంగా ఉండటం
- జ్ఞాపకశక్తి క్షీణించడం
- దేనిపైనా ఆసక్తి లేకపోవడం

- బాధ్యతల నుంచి తప్పుకోవడం
- పోటీపడలేని తత్వం
- ఓటమికి లొంగిపోవడం
- ఇతరులను నిందించడం
- ఇతరులను సరిగ్గా అంచనా వేయలేకపోవడం
- ఆత్మహత్యా ప్రయత్నాలు మొదలైనవి.

## విద్యార్థులలో ఒత్తిడి కలిగించే అవకాశం ఉన్న వివిధ అంశాలు

1 విద్యార్థులకు ఆసక్తి, సహజసామర్థ్యం ఉన్న రంగంలో కాకుండా మరోదాన్ని ఎన్నుకోవలసిన పరిస్థితి కలిగినప్పుడు ఉదాహరణకు మెడిసిన్ చదవాలంటే ఆసక్తి సామర్థ్యం ఉన్న విద్యార్థిని అక్కడ తక్కువ సీట్లు ఉన్నాయనీ అందులో సీటు దొరకడం కష్టమనీ, ఇంజనీరింగ్ కోర్సు చేయమని అనడం.

2. తల్లిదండ్రులుగానీ, ఉపాధ్యాయులుగానీ లేదా ఇతరులెవరైనా ఖచ్చితంగా ఇంత శాతం మార్కులు తెచ్చుకోమనడం లేదా ఒకటి లేదా రెండవ ర్యాంక్ రావాలని నిబంధన విధించడం.

3. అనుభూతులనూ, అనుభవాలనూ పంచుకొనే అవకాశం లేకపోవడం. విద్యార్థులు వారి పాఠశాలల్లో లేదా ఇతరత్రా పొందిన అనుభూతులనూ, అనుభవాలనూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని అనుకొంటారు. అలాంటి అవకాశం దొరకకపోతే ఒత్తిడికి గురి అవుతారు.

4. అతిగారాబంతో అవసరమైన దానికంటే ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పిల్లలకు ఎప్పుడైనా జటిలమైన సమస్యలు ఎదురైనప్పుడు ఒత్తిడికి లోనవుతారు.

5. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తును గురించి అతిగా ఆలోచిస్తూ పిల్లల్లో భయాందోళనలను కల్పించడం.

6. వినోదం ఉల్లాసకృత్యాల లోటువల్ల యాంత్రికతను అనుభవించడం.

## ఒత్తిడికి గురికాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు:

1 విద్యార్థులు వారి శక్తిసామర్థ్యాలను, పరిమితులను తెలుసుకొనేటట్లు చేయాలి.

2. విద్యార్థులకు ఉన్న శక్తిసామర్థ్యాలను వినియోగించడానికి కావలసిన వనరులను అవకాశాలను కల్పించాలి.

3. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా, వివిధ అంశాలకు (శారీరక, మానసిక, సాంఘిక) తగినంత సమయాన్ని ప్రాధాన్యాన్ని ఇచ్చి నడుచుకునేటట్లు చూడాలి.

4. విద్యార్థులు వారి శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా సాధించగలిగే లక్ష్యాలను ఏర్పరచుకొనేటట్లు, వాటిని సాధించడానికి క్రమపద్ధతిలో శ్రమించేటట్లు ప్రోత్సహించాలి.

5. పోటీ ఎక్కువగా ఉందని, విరామం లేకుండా చదవమని ఒత్తిడి చేయకూడదు.

6. విద్యార్థులు 'రిలాక్స్' అవడానికి వారి అభిరుచికి తగిన సంగీతం వినడానికీ, ఆట ఆడటానికీ, సినిమా చూడటానికీ అవకాశాన్ని కల్పించాలి. అలా కాకుండా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఫలానా పద్ధతి ద్వారా మాత్రమే 'రిలాక్స్' అవమని నిబంధన పెట్టకూడదు.

7. వైయక్తిక భేదాలను దృష్టిలో పెట్టుకొని ఇంటిపని ఇవ్వాలి.
8. అన్ని సబ్జెక్ట్స్ ఇంటిపనీ ఒకే రోజుకాకుండా రోజూ కొన్నింటిని మాత్రమే ఇచ్చేలా ప్రణాళికను రూపొందించుకోవాలి.
9. నిరాడంబర జీవనశైలిని అలవరచుకోవడానికి వారిని ప్రోత్సహించాలి.

**ఒత్తిడి నిర్వహణ:**

నేటి పరిస్థితుల్లో, ఒత్తిడి నిర్వహణకు ఎంతో ప్రాముఖ్యం ఉంది.

- అధిక ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులను, సంఘటనలను విశ్లేషించి ఒత్తిడికి గల కారణాలను తెలుసుకొనేటట్లు చేయాలి.
- ఒత్తిడి ఏర్పడినప్పుడు శ్వాసక్రియ వేగం పుంజుకొంటుంది. అదేవిధంగా కండరాలలో తన్యత (టెన్షన్) అధికం అవుతుంది. శ్వాసక్రియ కండరాల తన్యత (టెన్షన్)లను మన నియంత్రణలో ఉంచుకోవచ్చు. దానికి సంబంధించిన యోగ, ధ్యానం లాంటి వాటిని చేయాలి.
- ఆహార నియమాలను పాటించడం, మన శరీరానికి పడని పదార్థాలను తినకుండా ఉండాలి.
- ప్రశాంతంగా నిద్రపోవాలి.
- జీవితంలో మార్పు సహజం, కాబట్టి మార్పుకు సంసిద్ధం అవ్వాలి.
- మానసిక శక్తులను వినియోగించుకోవడం.
- వాస్తవిక దృక్పథం ఉండాలి.
- సమయపాలనను పాటించడం.
- అధిక ఒత్తిడికి గురిచేసే పరిస్థితులకూ, సంఘటనలకూ, వ్యక్తులకూ సాధ్యమైనంతవరకూ దూరంగా ఉండాలి. అలా వీలుకాని పక్షంలో ఆయా సంఘటనలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కావలసిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.
- ఆసక్తులకు, సామర్థ్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను ఎన్నుకొని, అందులో పాల్గొనడం ద్వారా ఉల్లాసాన్ని, తృప్తిని పొందుతూ శారీరక మానసిక ఆరోగ్యం పొందాలి. నిపుణుల సహాయంతో అధిక ఒత్తిడిని తగ్గించే వ్యాయామాలను చేయాలి.

**వ్యాకులత (Anxiety)**

పాఠశాలలో జరిగే ఏ పరీక్షకయిన రవి తరచుగా గైర్హాజరవుతుంటాడు. రవి తల్లిదండ్రులను పిలిచి విచారించగా వారు "ఎందుకో సార్ మా పిల్లవానికి పరీక్షలంటే జ్వరం వస్తుంది" అన్నారు. ఇంకొక విద్యార్థి ఏమైనా ప్రశ్న అడిగితే విపరీతమైన భయంతో వణికిపోతాడు. ఇంకొక విద్యార్థికి ఏదైనా వ్రాయమంటే చెమటలు పడుతాయి. ఈ సంఘటనలన్నీ పాఠశాలలోను, నిత్య జీవితంలోని ఎన్నో సందర్భాలలో చూస్తుంటాము.

దీనినే ఆందోళన / వ్యాకులత / (Anxiety) అంటాము. ఒత్తిడి పర్యవసానంగా కలిగే ఒక ప్రవర్తనా స్థితి. సాధారణంగా ఆందోళన అనగా "కారణ రహితమైన భయం వల్ల ఏదో కీడు జరగబోతున్నదన్న ఊహలు పదేపదే రావడం వల్ల కలిగే మానసిక స్థితి.

ఉదాహరణకు ఒక విద్యార్థి "నేను పరీక్ష రాస్తే, నాకు I$^{st}$ Rank రాకపోతే, నాన్న నాకు సైకిల్ కొనివ్వక

అవమాన పరుచుతాడేమోనన్న భయం వల్ల పరీక్ష వ్రాయకపోవటం.. కొంత మంది విద్యార్థులు నికషా వ్యాకులత / ఆందోళనకు లోనవుతారు.

**లక్షణాలు:** అంతఃస్రావిక గ్రంథి నుంచి వచ్చే స్రావకం కొన్ని శారీరక మార్పులను తెస్తుంది.

1. ఎక్కువగా గుండె కొట్టుకోవటం
2. ఎక్కువ రక్తం కండరాలకు వెళ్ళటం
3. చెమట పట్టడం
4. వణుకు, జ్వరం, భయం
5. నిద్రలేమి
6. జీర్ణశక్తి తగ్గిపోవటం
7. శ్వాసక్రియ అనర్థాలు

**తొలగించటం :**

1. విద్యార్థులకు టార్గెట్ విధించకుండా, క్రమంగా వారిలో ఆత్మస్థైర్యం నింపాలి.
2. వీలైనన్ని పరీక్షలు పెట్టాలి. పరీక్షల పట్ల భయాన్ని తొలగించాలి.
3. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా ప్రవర్తించాలి.
4. వీలైనంత ఎక్కువ మందితో మాట్లాడించటం, పాఠశాల కృత్యాలలో పాల్గొనేటట్లు చేయటం.
5. దేనిపట్ల వ్యాకులత పొందుతున్నారో, మొదట దానిని తొలగించాలి. వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాలి.
6. వ్యాకులత మితిమీరకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలి.

## విషమయోజనం (Mall Adjustment)

ప్రతిఒక్కరికి జీవితంలో పుట్టింది మొదలు చనిపోయేవరకూ సర్దుబాటు చేసుకోవడమనేది ఒక నిరంతర ప్రక్రియ అని తెలుసుకొన్నాం. అయితే కొంతమంది మాత్రమే అందరిలాగా పరిస్థితులకు అనుగుణంగా ఏ మాత్రం సర్దుబాటు చేసుకోలేరు. ఇలా సర్దుబాటు చేసుకోలేక పోవడాన్నే విషమయోజనం అంటారు.

## నిర్వచనం

అట్కిన్‌సన్ ప్రకారం విషమయోజనమంటే "ఒక వ్యక్తి పరిసరాలతో అసమతుల్యమైన కల ప్రవర్తనను ఏర్పరుచుకోవడం".

మానవులు అవసరాలను సంతృప్తి పరుచుకొనే క్రమంలో చాలా రకాల సర్దుబాట్లు చేసుకొంటారు. సర్దుబాటు చేసుకోలేనప్పుడు తమ అవసరాలను అణచివేసుకొంటారు లేదా రక్షణ తంత్రాలను ఉపయోగించుకొంటారు. రక్షణ తంత్రాలపై ఎప్పుడో ఒకసారి కాకుండా పదేపదే ఆధారపడితే సర్దుబాటు చేసుకొనే శక్తిని కోల్పోతారు. తద్వారా విషమయోజనస్థితికి వస్తారు. ఈ స్థితి ఎక్కువ అయితే సాంఘిక సంబంధాలు లేకుండా ఉంటారు, మానసిక రుగ్మతలకు గురి అవుతారు.

### విషమయోజనానికి గల కారణాలు

విషమయోజనానికి గల కారణాలను రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. అవి 1. వ్యక్తిగతమైనవి, 2 పరిసరాలకు చెందినవి.

**1. వ్యక్తిగత కారకాలు**

- శారీరక ఆకృతి లేదా అందంగా లేకపోవడం – కొంతమంది శరీర ఆకృతి సరిగ్గా లేకపోతే దాని గురించి మధనపడటం వల్ల విషమయోజనానికి గురవుతారు.
- శారీరక బలహీనత – వ్యక్తి పట్టుదలతో ఏదో ఒకటి సాధించాలనే కోరికతో పని చేయబోతే శరీరం సహకరించకపోవడం.
- లైంగిక తృప్తి లేకపోవడం
- ప్రజ్ఞ, సహజ సామర్థ్యాలు, కాంక్షాస్థాయి – వ్యక్తులు వారి ప్రజ్ఞ, సహజ సామర్థ్యాల స్థాయికి మించిన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవడం వల్ల విషమయోజనానికి గురవుతారు.
- ఆత్మ విశ్వాసం లోపించడం మొదలైనవి.

**2. పరిసరాలకు సంబంధించిన కారకాలు:** పరిసరాలకు సంబంధించిన కారకాలలో కుటుంబం, పాఠశాల, సామాజిక, సాంస్కృతికాంశాలు ముఖ్యమైనవి.

**కుటుంబం :** తల్లిదండ్రులు పిల్లలను పెంచే విధానం సరిగ్గా లేనట్లయితే పిల్లలు విషమయోజనానికి గురి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు ఎలాంటి స్వేచ్ఛను ఇవ్వకుండా కఠినమైన నియమ నిబంధనలు ఏర్పరచి, పాటించకపోతే, కఠినంగా దండిస్తే పిల్లలలో విషమయోజనం ఏర్పడవచ్చు. కుటుంబ కలహాలు, భార్యభర్తలు విడిపోవడం, దురలవాట్లు, కుటుంబ ఆర్థిక స్థాయి కూడా పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపిస్తాయి. తల్లిదండ్రులు పిల్లల శక్తి సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకోకుండా పిల్లలు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే నిబంధనలను విధించడం లేదా ఫలానా కోర్సునే చదవాలని ఒత్తిడి చేస్తే విషమయోజనం ఏర్పడవచ్చు.

**పాఠశాల :** పాఠశాల నియమ నిబంధనలు సమవయస్కుల ప్రభావం, ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాలు, పాఠ్యప్రణాళిక భారం, బోధనా పద్ధతులు, సహపాఠ్య కార్యక్రమాలు మొదలైనవి పిల్లల శారీరక, మానసిక, ఉద్వేగ అవసరాలను తీర్చలేకపోయినప్పుడు పిల్లల్లో విషమయోజనం ఏర్పడే అవకాశాలు ఉంటాయి.

**సామాజిక, సాంస్కృతికాంశాలు :** వ్యక్తి నివసించే సమాజంలోని కట్టుబాట్లు, సామాజిక విలువలు, అలవాట్లు ఆచార వ్యవహారాలకూ వ్యక్తి కుటుంబం కట్టుబాట్లకూ, విలువలకూ ఆచార వ్యవహారాలకూ మధ్య తేడాలు ఉన్నప్పుడు వ్యక్తి తాను వేటిని పాటించాలో నిర్ణయం తీసుకోలేక మానసిక సంఘర్షణకు లోనై తద్వారా విషమయోజనకు గురయ్యే ప్రమాదం ఉంది. కేవలం వ్యక్తి జీవించే స్థానికంగా ఉన్న సామాజిక, సాంస్కృతిక అంశాలేకాక, నేడు ప్రసారమాధ్యమాలు విస్తృతమైన కారణంగా ప్రపంచంలోని విభిన్న సంస్కృతులు, సామాజిక అంశాల ప్రభావం వల్ల కూడా విషమయోజనం కలగవచ్చు.

## సర్దుబాటు, విషమయోజనానికి గల వ్యత్యాసం

| వ.సం | సర్దుబాటు | విషమయోజనం |
|---|---|---|
| 1. | వ్యక్తి తన పరిసరాలతో సత్సంబంధాలను పొంది ఉంటారు. | వ్యక్తి పరిసరాలతో సత్సంబంధాలను పొంది ఉండరు. |
| 2. | ఉద్వేగ పరిపక్వత ఉంటుంది. | ఉద్వేగ పరిపక్వత లోపిస్తుంది. |
| 3. | వాస్తవ దృక్పథం ఉంటుంది. | వాస్తవ దృక్పథం ఉండదు. |
| 4. | మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. | మానసికంగా ఆరోగ్యంగా ఉండరు. |
| 5. | సరైన ఆత్మభావనను పొంది ఉంటారు. | ఆత్మభావన సరిగ్గా ఉండదు. |
| 6. | సమస్యలను పరిష్కరించుకోగలరు. | సమస్యలను పరిష్కరించుకోలేరు. |
| 7. | సమైక్య మూర్తిమత్వాన్ని పొంది ఉంటారు. | సమైక్య మూర్తిమత్వం ఉండదు. |

**విషమ యోజనం కలిగిన వ్యక్తి:**

- ఆటంకాలను అధిగమించలేడు.
- ఆలోచనలకు, భావోద్వేగాలకు, చేతలకు పొంతన లోపిస్తుంది. దీనిలో ఆనందాన్ని చూడలేడు.
- సంఘం ఆమోదించే లక్ష్యాలు ఉండవు.
- వాస్తవాలను ఎదుర్కోలేక రక్షక తంత్రాలను ఉపయోగిస్తూ తీవ్ర మనో వ్యాకులతకు గురి అవుతారు.

**విషమ యోజనం వల్ల కలుగునవి:**

- అవధానం లోపిస్తుంది.
- న్యూనతాభావాలు ఉంటాయి.
- విశ్రాంతి ఉండదు.
- నిద్ర ఉండదు.

**విషమ యోజనాన్ని ఎలా తొలగిస్తారు?**

- సరియైన వ్యాయామం, విశ్రాంతి కలిగించడం వలన
- రక్షిత భావాన్ని నెలకొల్పాలి.
- విద్యా, ఔద్యోగిక మార్గదర్శకత్వాన్ని నెలకొల్పాలి.
- సక్రమమైన బోధన జరపాలి.
- సరియైన పాఠశాల వాతావరణం ఉండాలి.

పై కారకాలన్నీ అభ్యాసకున్ని ప్రభావితం చేస్తాయి. అవి శారీరక, మానసిక అంశాలపై ప్రభావాన్ని చూపి అభ్యాసకుని మానసిక ఆరోగ్యముపై ప్రభావాన్ని చూపి, తన సామర్థ్యములను సక్రమంగా వినియోగించుకోలేని అశక్తతను, నిర్ణయములు తీసుకోలేని దుస్థితిని, అభ్యసనముపై అవధానాన్ని విచ్ఛిన్నము చేయటం లాంటి దుష్ఫలితాలకు కారణమవుతాయి. ఉపాధ్యాయుడు పై కారకములను అవగాహన చేసుకొని, అభ్యాసకుడు వాటి ప్రభావానికి లోను కాకుండా, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, వివిధ రకాలైన పరిసరాలకనుగుణంగా సర్దుబాటు సామర్థ్యాన్ని పెంపొందించాలి. అభ్యాసకుడి, శారీరక, మానసిక ఆరోగ్యాలను కాపాడుకొనే సామర్థ్యాలను పెంపొందించి, శిశువు తన సామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించుకునేటట్లు చేసి, సమగ్ర మూర్తిమత్వాన్ని కలిగివుండే విధంగా పరిసరాలను కల్పించాలి.

## Reference Books:

1. Telugu Academy D.Ed - 1999, 2000, 2010.

2. Telugu Academy B.Ed - 2005, 2014.

3. Advanced Educational Psychology - SK Mangal.

4. Psycholocy NCERT, 11th and 12th Standard New Delhi.